



జ్ఞాన యోగం


విచారణ

బ్రహ్మవిద్య









సదాశివ సమారంభాం
గురు దక్షిణామూర్తి
గురు వేదవ్యాస మహర్షి
గురు శుక మహర్షి
గురు నారద మహర్షి
గురు వాల్మీకి మహర్షి
గురు శ్రీకృష్ణ
శంకరాచార్య మధ్యమాం
గురు దత్తాత్రేయ
గురు బాబాజీ
గురు గౌతమ బుద్ధ
గురు ఆదిశంకరాచార్య
గురు రామానుజాచార్యులు
గురు జ్ఞానేశ్వర్
గురు రవిదాస్
గురు కబీర్ దాస్
గురు చైతన్య మహా ప్రభువు
గురు నానక్
గురు రాఘవేంద్ర స్వామి
గురు వీరబ్రహ్మేంద్ర స్వామి
యోగి వేమన
అస్మదాచార్య పర్యంతాం
గురు త్రైలింగ స్వామి
గురు లాహిరి మహాశయ
గురు రామకృష్ణ పరమహంస, అమ్మ శారదాదేవి
గురు వివేకానంద
గురు సాయి బాబా
గురు అరబిందో
గురు రమణ మహర్షి
గురు యోగానంద
గురు భక్తివేదాంత ప్రభుపాద
గురు మళయాళస్వామి
గురు విద్యాప్రకాశానందగిరి
గురు చంద్రశేఖర పరమాచార్య
వందే గురుపరంపరాం..

నన్ను "నేను" తెలుసుకోవటానికి

నన్ను "నేను" మార్చుకోవటానికి

నన్ను "నేను" చేరుకోవటానికి

మరియు అత్యుత్తమ జీవన విధానానికి

కావలసిన భక్తి,జ్ఞాన,కర్మ,ధర్మ సమాచారం ఒకేచోట తెలుగులో ఉచితంగా!

సాధారణంగా వేదాంతం తెలుసుకోవాలనే కోరిక వుంటుంది, కాని గ్రంధాలు అందుబాటులో లేవు. ఇంకొకరి దగ్గర గ్రంధాలు వుంటాయి, కాని జిజ్ఞాసువులకి ఎక్కడ ఉన్నవో తెలియదు. అలాగే కొన్ని లైబ్రరీ లో కొన్ని రకాల పుస్తకాలు మాత్రమే లభ్యం అవుతున్నాయి. కనుక తమవంతుగా భక్తి,జ్ఞాన ప్రచారార్ధం మహానుభావులైన **శ్రీ విద్యా సారధి** వెబ్ సైట్ వారు ఉచితంగా విలువైన గ్రంధాలను ఆన్ లైన్ ద్వారా eBOOK(PDF) రూపంలో అందిస్తున్నారు. వారు చేస్తున్న జ్ఞాన యజ్ఞానికి సాయి రామ్ కూడా తమవంతుగా సహాయం చేసే కార్యక్రమంలో భాగంగా వారి గ్రంధాలను సాయి రామ్ ద్వారా కూడా అందచేస్తున్నాము, ఇందుకు మేము వారికి కృతజ్ఞత తెలియచేసుకుంటున్నాము. కనుక ప్రతి ఒక్కరు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరు. ఇందుకు సహాయం చేసిన ఆర్కైవ్ వెబ్ సైట్(https://archive.org), గూగుల్ వెబ్ సైట్(https://www.google.co.in),మైక్రోసాఫ్ట్ సైట్(http://www.microsoft.com) వారికి కూడా మేము ఋణపడివున్నాము. సాయి రామ్ సేవక బృందం కోరుకొనేది ఒక్కటే, ప్రతి ఇల్లు ఆధ్యాత్మిక జ్ఞాన గ్రంధాలతో నిండిపోవాలన్నదే మా కోరిక.

ఈ గ్రంధాలను ఉచితంగా ఆన్ లైన్ లో చదువుటకు, దిగుమతి(డౌన్లోడ్) చేసుకొనుటకు గల మార్గాలు:

1) **శ్రీ విద్యా సారధి** వారి వెబ్ సైట్: http://srividyasaradhi.org/
2) సాయి రామ్ వెబ్ సైట్: http://www.sairealattitudemanagement.org
3) సాయి రామ్ గూగుల్ సైట్: https://sites.google.com/site/sairealattitudemanagement
4) ఆర్కైవ్ వెబ్ సైట్: https://archive.org/details/SaiRealAttitudeManagement

ఈ జ్ఞాన యజ్ఞం పై గల సలహాలు,సూచనలకు సాయి రామ్ సేవక బృందాన్ని
సంప్రదించుటకు: sairealattitudemgt@gmail.com
సాయి రామ్ భక్తి,జ్ఞాన సమాచారం: https://www.facebook.com/SaiRealAttitudeManagement
సాయి రామ్ భక్తి,జ్ఞాన సంబంధ వీడియోలు: https://www.youtube.com/user/sairealattitudemgt

ఈ జ్ఞాన యజ్ఞంలో ప్రతి ఒక్కరు పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని,మీరు సంతృప్తులైతే మరొక సాధకునికి, జిజ్ఞాసువులకు మార్గం చూపించగలరని ఆశిస్తున్నాము.

SaiRealAttitudeManagement(SAI RAM) - సాయి నిజ వ్యక్తిత్వ నిర్వహణ(సాయి రామ్)

* సర్వం శ్రీ సాయి నాథ పాద సమర్పణమస్తు *

శ్రీ విద్యా సారధి వారి వెబ్ సైట్:

http://srividyasaradhi.org/



అతి విశిష్టం ఈ దానం!

"దానాలలోకెల్లా ఆధ్యాత్మిక విద్యాదానం చాలా శ్రేష్ఠమైంది! దాని తరువాతిది లౌకిక జ్ఞానదానం, ప్రాణదానం, అన్నదానం" అని వ్యాసమహర్షి చెప్పారు.

మన ఆధ్యాత్మిక జ్ఞానం భారతదేశ హద్దులలో నిలిచి పోకూడదు. లోకమంతటినీ ఆవరించాలి! ఇలా లోకవ్యాప్తమైన ధర్మప్రచారాన్ని మన పూర్వులు చేశారు. హైందవ వేదాంతం ఎన్నడూ ఈ దేశం దాటి పోలేదని చెప్పేవారూ, మతప్రచారార్థం తొలిసారిగా, పరదేశాలకు వెళ్ళిన సన్న్యాసిని నేనే అని చెప్పేవారూ, తమ జాతిచరిత్ర నెరుగని వారే! ఇలాంటి సంఘటనలు ఎన్నోసార్లు జరిగాయి. అవసరమైనప్పుడల్లా, భారతీయ ఆధ్యాత్మిక జ్ఞానప్రవాహం వెల్లువలా లోకాన్ని ముంచెత్తుతూ వచ్చింది.

రాజకీయ ప్రచారాన్ని రణగొణధ్వనులతో, యోధులతో సాగించవచ్చు. అగ్నిని కురిపించి, కత్తిని ఝళిపించి, లౌకిక జ్ఞానాన్నీ, సంఘనిర్మాణ విజ్ఞానాన్నీ విరివిగా ప్రచారం చేయవచ్చు. కానీ ఆధ్యాత్మిక జ్ఞానదానం కళ్ళకు కనిపించకుండా, చెవులకు వినిపించకుండా కురుస్తూ, రోజా పువ్వుల రాసుల్ని వికసింపజేసే మంచులాగా నిశ్శబ్దంగా జరగవలసి ఉంది. భారతదేశం నిరాడంబరంగా, లోకానికి మళ్ళీ మళ్ళీ చేస్తూ వచ్చిన దానమిదే!

మిత్రులారా! నేను అవలంబించే విధానాన్ని తెలియజేస్తాను వినండి. భారతదేశంలోనూ, ఇతర దేశాల్లోనూ మన పారమార్థిక ధర్మాలను బోధించడానికి తగినవారుగా మన యువకుల్ని తయారు చేయడానికై భారతదేశంలో కొన్ని సంస్థలను నెలకొల్పాలి! ఇప్పుడు మనకు కావలసింది బలిష్ఠులు, జవసంపన్నులు, ఋజువర్తనులు, ఆత్మ విశ్వాసపరులు అయిన యువకులు. అలాంటి వారు నూరుమంది దొరికినా, ప్రపంచం పూర్తిగా పరివర్తన చెందగలుగుతుంది!!

ఇచ్ఛాశక్తి తక్కిన శక్తులన్నిటి కన్నా బలవత్తరమైంది. అది సాక్షాత్తూ భగవంతుని దగ్గరి నుండి వచ్చేదే కాబట్టి దాని ముందు తక్కినదంతా లొంగిపోవలసిందే. నిర్మలం, బలిష్ఠం అయిన 'ఇచ్ఛ' (సంకల్పం) సర్వశక్తిమంతమైంది. దానిలో మీకు విశ్వాసం లేదా? ఉంటే మీ మతంలోని మహోన్నత ధర్మాలను ప్రపంచానికి బోధించడానికై కంకణం కట్టుకోండి. ప్రపంచం ఆ ధర్మాల కోసమై ఎదురుచూస్తోంది. అనేక శతాబ్దాలుగా ప్రజలకు క్షుద్రసిద్ధాంతాలు నేర్పడం జరిగింది. వారు వ్యర్థులని ప్రపంచమంతటా బోధలు జరిగాయి. ఎన్నో శతాబ్దాల నుండి వారు ఈ బోధనల వల్ల భయభ్రాంతులై, పశుప్రాయులైపోతున్నారు. తాము ఆత్మస్వరూపులమనే మాటను వినడానికైనా వారెన్నడూ నోచుకోలేదు. "నీచాతినీచుడిలో కూడా ఆత్మ ఉంది. అది అమృతం, పరమ పవిత్రం, సర్వశక్తిమంతం, సర్వవ్యాపకమైనది" అని వారికి ఆత్మను గురించి చెప్పండి. వారికి ఆత్మవిశ్వాసాన్ని ప్రసాదించండి. ❖



మూలం: శ్రీ రామకృష్ణ ప్రభ - ఫిబ్రవరి 2014

29. బ్రహ్మవిద్య

విద్యలు రెండు రకాలు. 1. అపరావిద్య. 2. పరావిద్య. వీటినే లౌకికవిద్య, బ్రహ్మవిద్య అని కూడా అంటారు.

అపరావిద్య దీనివల్ల సంఘంలో ఉన్నతస్థితి పొందటము, ధనధాన్యాలు, భోగభాగ్యాలు, అధికారము, పుత్రపౌత్రాదిసంతతి, సిరిసంపదలు కలుగుతాయి. దీనిని అనుసరించేవారు పూజలు, వ్రతాలు, హోమాలు, అర్చనలు, తర్పణలు, యజ్ఞయాగాదులు చేస్తారు. భక్తుడు భగవంతుడు వేరువేరు అని వీరి భావన. భగవంతుణ్ణి గనక పూజించినట్లైతే భక్తులకు కావలసిన వరాలిస్తాడు అనేది వీరి నమ్మకం. ఆ కోరికల సాధనకోసమే వీరు భగవంతుణ్ణి అర్చిస్తారు. ఇది సగుణారాధన.

కర్మలు ఆచరించటంవల్ల పుణ్యలోకాలు వస్తాయి. ఉత్తమజన్మలు కలుగుతాయి. మరణానంతరము స్వర్గసౌఖ్యాలనుభవించి ఉత్తమజన్మ ఎత్తుతాడు. మళ్ళీ కర్మ చేస్తాడు. ఈ రకంగా కర్మలు చెయ్యటం, జన్మలు ఎత్తటం, మరణించటం చేస్తుంటాడు.

పున రపి జననం పున రపి మరణం

అంతేకాని అతడికి కర్మలవల్ల మోక్షం మాత్రంరాదు. మరి మోక్షం రావాలి అంటే పరావిద్యను ఆశ్రయించాలి. అదే బ్రహ్మవిద్య. ఇది నిర్గుణారాధన.

నిర్వికారుడు అయిన పరమేశ్వరుడు చరాచరజగత్తంతా ఆవరించి ఉన్నాడు. ఈ జగత్తంతా పరబ్రహ్మ స్వరూపమే. ఛాందోగ్యోపనిషత్తులో సత్యకామజాబాలికి ఒక ముసలి ఆంబోతు చెబుతుంది. సత్యకామా పరబ్రహ్మ నాలుగుపాదాలుగా ఉంటుంది. అందులో మొదటిపాదం. ఈ విశాలవిశ్వంలో నాలుగుదిక్కులూ పరబ్రహ్మలో ఒక పాదం.

భూమి, ఆకాశం, సముద్రాలు, నదులు, పర్వతాలు పరబ్రహ్మలో రెండోభాగం అని అగ్ని చెబుతుంది.

అగ్ని, సూర్యుడు, చంద్రుడు, విద్యుల్లతలు పరబ్రహ్మలో మూడోభాగం అని ఒక హంస చెబుతుంది.

ప్రాణం బ్రహ్మ, దృష్టి బ్రహ్మ, శ్రవణం బ్రహ్మ, మనస్సు బ్రహ్మ. ఇది నాల్గవపాదం. అని నీటిపక్షి చెబుతుంది. అలాగే ఉపకోశలుడికి ఆశ్రమంలోని అగ్నులు బ్రహ్మవిద్యను ఉపదేశం చేస్తూ

"ఉపకోశలా ! ప్రాణమే బ్రహ్మ, ఆకాశమే బ్రహ్మ, ఆనందమే బ్రహ్మ, భూమి సూర్యుడు, చంద్రుడు, ఆ పరబ్రహ్మరూపాలే. సూర్యునిలో ఉన్న బ్రహ్మతత్త్వం, నీ లోఉన్న బ్రహ్మతత్త్వం నాలో ఉన్నతత్త్వం. అన్నీ ఒకటే. తూర్పు పడమర ఉత్తర దక్షిణాలు, నేల, నీరు, నింగి, నక్షత్రాలు, అన్నీ ఒకటే. ఆకాశంలోని మెరుపులో ఏతత్త్వమైతే ఉన్నదో అదే నీలోనూ నాలోనూ కూడా ఉన్నది" అంటాయి.

తైత్తిరీయోపనిషత్తులో వరుణ మహర్షి కుమారుడు భృగుమహర్షి. అపరావిద్యలో నిష్ణాతుడు. తండ్రి దగ్గరకు వచ్చి బ్రహ్మవిద్యను బోధించమని అడుగుతాడు. తండ్రి ఆజ్ఞమీద కొంతకాలం తపస్సుచేసి ఆ తరువాత తెలుసుకుంటాడు భృగువు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయకోశాలనడుమ ఆనందమయకోశమున్నది అదే పరబ్రహ్మ నివాసస్థానము. ఆనందమే పరబ్రహ్మ స్వరూపము. లోకంలో సిరిసంపదలు, భోగభాగ్యాలు సుఖాలు అన్నీ ఆరోగ్యవంతుడు, ధనవంతుడు, వేదవేదాంగవిదుడు, కర్మిష్టి అయిన పురుషుడు అనుభవించటానికే ఉన్నాయి. అతడు అనుభవించే ఆనందం మానుషానందం.

మానుషానందానికి నూరురెట్లు	–	మానవగంధర్వానందం.
మానవగంధర్వానందానికి నూరురెట్లు	–	దేవగంధర్వానందం
దేవగంధర్వానందానికి నూరురెట్లు	–	పితృదేవానందం
పితృదేవానందానికి నూరురెట్లు	–	అజానజదేవానందం
అజానజదేవానందానికి నూరురెట్లు	–	కర్మదేవానందం
కర్మదేవానందానికి నూరురెట్లు	–	దేవానందం
దేవానందానందానికి నూరురెట్లు	–	ఇంద్రానందం
ఇంద్రానందానికి నూరురెట్లు	–	బృహస్పతి ఆనందం
బృహస్పతి ఆనందానికి నూరురెట్లు	–	ప్రజాపతి ఆనందం
ప్రజాపతి ఆనందానికి నూరురెట్లు	–	బ్రహ్మానందం

ఇది శాశ్వతమైన ఆనందం.

ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుకు బ్రహ్మవిద్యను బోధిస్తూ "జీవులు ఏరూపంలో ఉన్నప్పటికీ అనంతచైతన్య సముద్రంలో కలిసిపోయిన తరువాత వాటి

నామరూపాలు పోగొట్టుకుంటాయి. అవి అన్నీ ఏ ఏతత్వంలో కలిసిపోతాయో. అదే బ్రహ్మ. అది అద్వితీయమైనది. సూక్ష్మమైనది సర్వవ్యాపకమైనది. తత్త్వమసి.అదే నీవు. శ్వేతకేతూ అదే నీవు" అంటాడు.

మాండకోపనిషత్తులో "ఒకే రూపము, పేరుగల పక్షులు రెండు ప్రపంచమనే వృక్షాన్ని ఆశ్రయించి ఉన్నాయి. అందులో ఒకటి జీవాత్మ. రెండవది పరమాత్మ. జీవాత్మ తన కర్మలవల్ల వచ్చిన ఫలితాలను అనుభవిస్తోంది. పరమాత్మ కర్మఫలం ఏమీ లేకుండా కూర్చుంది. శరీరమే ఆ వృక్షం. ఆ పక్షులే క్షేత్రజ్ఞ పరమాత్మలు. వారిద్దరూ వేరుకాదు. మాయలోపడిన జీవుడు తానూ పరబ్రహ్మ వేరనుకుంటాడు. కాని ఎప్పుడైతే ఆ మాయ తొలగిపోయిందో అప్పుడు ఆ జీవుడు పరమాత్మలో లీనమయిపోతాడు. అని చెప్పబడింది.

ఈ రకంగా ఉపనిషత్తులలో అనేకచోట్ల, అనేకసార్లు చెప్పబడింది బ్రహ్మవిద్య. దీని సారాంశం. జగత్తులోని జీవులన్నీ ఒక్కటే. ప్రాణమున్నవి ప్రాణంలేనివి, చలనమున్నవి, చలనములేనివి, కొండలు, బండలు, నదులు, సముద్రాలు, చెట్లు, చేమలు, క్రిమికీటకాలు, పశుపక్ష్యాదులు, జంతువులు, మృగాలు, మానవులు. వీరందరిలోని ఆత్మపదార్థం ఒక్కటే. అదే పరబ్రహ్మ.

కర్మలు ఆచరించటంవల్ల వచ్చే ఫలితం అశాశ్వతం. పుణ్యలోకాలు, స్వర్గసుఖాలు అన్నీ అశాశ్వతం. ఈ లోకంలో మనం పొందే ఆనందం అశాశ్వతం. శాశ్వతమైన ఆనందం ఒక్కటే. అదే బ్రహ్మానందం. అదే పరమేశ్వరుడు పొందే ఆనందం.

ఈ విషయాన్నే ఇక్కడ 357 నుంచి 365 వరకు నామాలలో వివరించటం జరిగింది. ఇదే తరుణీవిద్య లేదా బ్రహ్మవిద్య. సర్వకాల సర్వావస్థల యందు షోడశవర్షీయగా ఉండే పరమేశ్వరి జ్ఞానస్వరూపిణి. ఆవిడ శ్రీచక్రమందుంటుంది. ఈమె పరబ్రహ్మస్వరూపిణి కాబట్టి తాపసులచే ఆరాధించబడుతుంది. ఈ తాపసులంతా దృష్టిని అంతర్ముఖం చేసి పరమేశ్వరిని తమదేహంలోనే భావించి, తామే పరబ్రహ్మస్వరూపంగా తలచి తమలో ఉన్న ఆత్మపరబ్రహ్మస్వరూపంగా తలచి తమలో ఉన్న ఆత్మనే అర్చిస్తారు. అది నిర్గుణోపాసన. ఈ ఉపాసనలో మంత్ర తంత్రాలుండవు. కోరికలు అంతకన్నా ఉండవు. జీవాత్మ పరమాత్మల ఏకీభావమే వీరి ఏకైక లక్ష్యం. ఈ దేవిని అర్చించినట్లైతే, వారి యొక్క అజ్ఞానం తొలగించి, జీవాత్మపరమాత్మ రెండూ ఒకటే అనే బ్రహ్మవిద్యను వారికి ఉపదేశం చేసి వారికి సాయుజ్యం ప్రసాదిస్తుంది. ఇక నామాలను చూద్దాం.

357. తాపత్రయాగ్నిసం తప్తసమాహ్లాదనచంద్రికా

తాపత్రయము అనేటటువంటి సంసార లక్షణాలు గల అగ్నిచే దహించబడుతున్న మానవులకు ఆహ్లాదము కలిగించునది. లేక తాపోపశమనము కలిగించునది. తాపత్రయాలు మూడురకాలు 1. ఆధ్యాత్మికము 2. ఆదిభౌతికము 2. ఆదిదైవికము.

1. ఆధ్యాత్మికములు – శరీరంలోకలిగే వ్యాధులు, మానసికమైన కామము, క్రోధము, జ్వరము, అలసత్వము, కపటము అవిశ్వాసము, అశ్రద్ధ మొదలైనవి.

2. ఆదిభౌతికములు – అగ్ని, వరద, భూకంపాలు, కుక్కల ఏడ్పులు, గుడ్లగూబల అరుపులు, కుక్కలు, నక్కలు, పులులు, పాములు మొదలగు వాటివల్ల కలిగే బాధలు.

3. ఆదిదైవికములు – దేవతావిగ్రహాల కన్నీరు, ఎండ, వాన, గాలి, యక్ష, రాక్షస, పిశాచాల వలన కలిగే బాధలు. ఈ మూడు తాపత్రయము అనబడతాయి. తాపము అంటే – అగ్ని యొక్క గుణము. కాబట్టి ఇది అగ్ని లాగానే దహించివేస్తుంది. ఇటువంటి బాధను ఆ పరమేశ్వరి చల్లార్చి ఆహ్లాదంగా మారుస్తుంది. ఆ పరమేశ్వరిని గనక నమ్మి, ఆమెనే ఆరాధించినట్లైతే భక్తుల యొక్క తాపత్రయాన్ని ఆమె చల్లార్చివేస్తుంది.

358. తరుణీ

నిత్య తారుణ్యా త్వా త్తరుణి

ఎల్లప్పుడూ యవ్వనము గలది. ఎప్పుడూ ఒకే రీతిగా ఉండేది. **సదా షోడశ వర్షీయాం** ఎప్పుడూ పదహారు సంవత్సరాల వయసులోనే ఉండేది. నిత్యయవ్వనసంపన్న. ఎప్పుడూ తరుణిగానే ఉంటుంది. కాబట్టి నిత్యానందస్వరూపిణి. అందుచేతనే ఆ పరమేశ్వరి తరుణీ అనబడుచున్నది.

359. తాపసారాధ్యా

తపోవంతులైన మునీశ్వరులచే, ఋషీశ్వరులచే ఆరాధింపబడునది. సంసార బంధనాలలో చిక్కుకున్న వారిచే ఆరాధింపదగినది.

తపము అంటే – మితంగా భోజనం చెయ్యటం. ఉపవాసము, చాంద్రాయణ వ్రతాదులచే శరీరాన్ని శుష్కింపచెయ్యటం – ఆకలి దప్పికలు, శీతోష్ణాలు మొదలగు వాటిని సహించటం – మనోవాక్కాయకర్మలచే ఏకాగ్రత సాధించటం – ఇంద్రియాలను బుద్ధిలో లయం చేసి, ఆ బుద్ధిని పరమేశ్వరుని యందు లయం చేయ్యటం. ఈ పనులు

చేసేవారు సర్వభూతముల యొక్క హితవును కోరాలి. సాధువర్తన కలిగి ఉండాలి. అటువంటి ఉపాసక శ్రేష్ఠులను తాపసులు అంటారు. ఇటువంటి తాపసులచేత ఆ పరమేశ్వరి ఉపాసించబడుతుంది. అందుచేతనే ఆమె తాపసారాధ్యా అనబడుతోంది.

360. తనుమధ్యా

సన్ననినడుము గలది. కృశించిన నడుము గలది. దేవి సూక్ష్మరూపమైన మధ్య ప్రదేశము గలది. సాముద్రిక శాస్త్రంలో నడుము సన్నగా ఉండటం శుభసూచకము. సౌందర్యలక్షణము.

పరమేశ్వరి నివాసస్థానం శ్రీచక్రం. శ్రీచక్రమనేది శివశక్తుల సంగమస్థానం. అందులో తొమ్మిదవ ఆవరణ అయిన బిందువునందు ఆ పరమేశ్వరి ఉంటుంది. కాబట్టి ఆ దేవి తనుమధ్యా అనబడుతుంది.

పురుషుని శరీరంలో సుషుమ్నానాడి యందు ఉండునది. కాంచీపురంలో తను మధ్యా అనే దేవత ఉన్నది. తను మధ్య అనేది ఒక రకమైన ఛందస్సు.

మాం పాతు నీవాయా స్తీరే నివసంతీ బిల్వేశ్వరకాంతా దేవీ తనుమధ్యా

నీవా నదీతీరంలో ఉన్న తనుమధ్య అనే పేరుగల బిల్వేశ్వరుని దేవి నన్ను రక్షించుగాక.

361. తమోపహా

అవిద్య, అజ్ఞానములను పోగొట్టేది. ఉపాసకుల యొక్క అజ్ఞానము పోగొట్టి బ్రహ్మజ్ఞాన్ని ఇచ్చేది అవిద్య. ఇది అజ్ఞానము. కర్మకాండలవల్ల మోక్షం వస్తుంది అనుకోవటం అజ్ఞానం. పూజలు, వ్రతాలు, అర్చనలు, యజ్ఞ యాగాదులు అన్నీ కూడా ద్వైతభావనతో ఉన్నవే. ఈ కర్మలు చెయ్యటంవల్ల లౌకికమైన కోరికలు తీరతాయి. అంతేకాని మోక్షం మాత్రం రాదు. అందుకే ఈశావాశ్యోపనిషత్తులో

అంధంతమః ప్రవిశంతి యేఽ విద్యాఉపాసతే ।
తతో భూయ ఇవ తే తమోయఉ విద్యాయాగ్ం రతాః ॥

అవిద్యను ఆరాధించేవారు గాఢాంధకారంలో ప్రవేశిస్తారు. యజ్ఞతత్త్వ విజ్ఞానాన్ని ఆనందించేవారు అంతకన్న అంధకారంలో ప్రవేశిస్తారు.

యజ్ఞాలవల్ల, కర్మకాండలవల్ల, పుణ్యఫలితాలు వస్తాయి. వాటివల్ల ఉత్తమజన్మలు కలుగుతాయి. అంతేకాని మోక్షంరాదు. అందుకే వాటిని అవిద్య అన్నారు. అందుచేతనే

అవిద్య నాశ్రయించినవారు అంధకారంలో పడిపోతారు. అటువంటి అవిద్యను నాశనంచేసి భక్తులకు మోక్షాన్ని ప్రసాదిస్తుంది ఆ పరమేశ్వరి.

362. చితిః

అవిద్యకు శత్రువు చితి. చితి అంటే – జ్ఞానము స్వతంత్రమైనది. విశ్వసిద్ధికి కారణమైనది. అజ్ఞానవిరుద్ధమైనస్థితి. చరాచరజగత్తులో బ్రహ్మపదార్థము అని దేన్నైతే చెబుతున్నామో అది చితి. కేవలము జడమైనటువంటి ప్రకృతిని చైతన్యవంతంచేసేది చితి. జ్ఞాత జ్ఞాన జ్ఞేయముల యొక్క స్వరూపమే చితి. ఇది సంకల్పములు లేనిది. సంజ్ఞలు లేనిది. ఈ జగత్తులో మొత్తం 84 లక్షల జీవరాసులున్నాయి. వాటిలో

స్థిరంగా, కదలిక లేకుండా ఉండేవి	–	20 లక్షలు
జలచరాలు	–	9 లక్షలు
క్రిమికీటకాలు	–	11 లక్షలు
మానవులు	–	4 లక్షలు
మృగాలు	–	30 లక్షలు
పక్షులు	–	10 లక్షలు
మొత్తం జీవరాసులు	–	84 లక్షలు

వీటన్నింటియందు చిత్కళారూపంలో ఉండేది చితి. ఇదే జీవము. సర్వస్వానికి సాక్షీభూతము అయిన ఆ పరమేశ్వరి ఈ రూపంలోనే ఉంటుంది. అందుకే ఆమె చితి అనబడింది.

363. తత్పదలక్ష్యార్థా

తత్త్వమసి అనే మహావాక్యాలయందు గల తత్ అనే పదము. ఇది శబళ బ్రహ్మను తెలుపుతుంది. పరమేశ్వరి జీవాత్మ పరమాత్మల ఏకీభావం తెలుపుతుంది. హకారసంజ్ఞ గల పరమేశ్వరుడు సకారసంజ్ఞ గలిగిన ప్రకృతితో కలసి శబళబ్రహ్మమై, తొమ్మిది ద్వారాలుగల మానవశరీరము అనే పట్టణంలో ప్రవేశించి, ఇంద్రియములు, ప్రాణములు, మనస్సుతో కూడినవాడై పంజరంలో బంధించబడిన పక్షిలాగా బయటకువచ్చే ఉపాయం తెలియక ప్రాపంచిక బంధనాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. అతడే జీవాత్మ. జీవాత్మ పరమాత్మ వేరుకాదు. రెండూ ఒక్కటే. ఈ జీవాత్మను వచ్చిన దారి గుండానే గనక బయటకు పంపగలిగినట్లైతే అతడు పరబ్రహ్మలో లీనమవుతాడు. కాబట్టి ఆ పరమాత్మా ఈ జీవాత్మ రెండూ ఒకటే. ఈ విషయాన్ని తన భక్తులకు తెలియచెయ్యటమే ఆమె యొక్క విలక్ష్యము అందుచేతనే పరమేశ్వరి తత్పదలక్ష్యార్థా అనబడుతోంది.

364. చిదేకరసరూపిణీ

చిత్ ఏకరసముగా గలవి. చిదేకరసములు. వాటియొక్క స్వరూపమే ఆ దేవి. అందుకే చిదేక రసరూపిణి అనబడుతోంది. చైతన్యాది ధర్మాలు ఈమె యందు ఉన్నాయి. అంటే ఆనందము, చైతన్యము ఆమెకన్న వేరైనవికావు. "ఆనందము, విషయానుభవము, నిత్యత్త్వము అనే ధర్మాలు చైతన్యం కన్న వేరైనవికావు. కాని వేరైనట్లుగా కనిపిస్తాయి" అని పంచపాదికలో చెప్పబడింది.

సృష్టి స్థితి లయాలు చేసే ఈశ్వరుడికి, పరబ్రహ్మకు భేదంలేదు. ఈశ్వర కలకు బ్రహ్మ కలకు భేదమున్నట్లు కనిపిస్తుంది. అంతేకాని వారికి భేదం లేదు. కాబట్టి ఆ పరమేశ్వరి చిద్రూపిణి. జ్ఞాన రూపిణి. చిదేక రసరూపిణి.

పరమేశ్వరి చిదానంద స్వరూపురాలు. ఆనందఘనస్వరూపిణి. చిదానందమను ఏకరసమే స్వరూపముగా గలది. అందుచేతనే ఆమె చిదేకరసరూపిణి.

365. స్వాత్మానందలవీభూతబ్రహ్మాద్యానందసంతతిః

పరమేశ్వరి యొక్క ఆనందము అనిర్వచనీయమైనది. అది అనుభవైకవేద్యము. ఆనందము అనేకరకాలుగా ఉంటుంది. అవి

1. మానుషానందం
2. మానవగంధర్వానందం
3. దేవగంధర్వానందం
4. చిరలోకపితరానందం
5. అజానజదేవానందం
6. దేవానందం
7. బృహస్పతిఆనందం
8. ఇంద్రానందం
9. ప్రజాపతి ఆనందం
10. బ్రహ్మానందం

ఇవన్నీ ఒకదానికన్న ఒకటి నూరురెట్లు ఉంటాయి. ఇతరమైన ఆనందాలు పరమేశ్వరి పొందే బ్రహ్మానందంతో పోలిస్తే చాలా తక్కువైనవి. అందుచేతనే పరమేశ్వరి స్వాత్మానందల వీభూత బ్రహ్మాద్యానంద సంతతిః అని చెప్పబడింది.

ఈ రకంగా ఈ నామాలలో జీవాత్మ పరమాత్మ ఒకటే వేరుకాదు అనే అద్వైతసిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తూ మానవులు పొందే ఆనందం, ఆ పరమేశ్వరి పొందే బ్రహ్మానందంలో ఎన్నోవంతో చెబుతూ, శాశ్వతమైన ఆనందం పొందటానికి, ఆ పరమేశ్వరి తన భక్తులకు సాయపడుతుంది. అని చెప్పబడింది.

30. వాగీశ్వరీ స్వరూపము

వాక్కు యొక్క స్వరూపాన్ని ఇక్కడ వివరించటం జరుగుతోంది. వాక్కు అనేది పరమేశ్వరి స్వరూపం. కౌళసమయాచారులు అంతా ఈ మాటను ఒప్పుకుంటారు. వాక్కుకు నాలుగురూపాలున్నాయి. అవి. 1. పరా 2. పశ్యంతీ 3. మధ్యమా 4. వైఖరి.

పరాస్థానం వాక్కుకు ప్రథమస్థానం. అక్కడ ఆలోచన పుడుతుంది. ఆతరువాత పశ్యంతీస్థానం రెండవది. వాక్కు యొక్క రూపాలలో కౌళ సమయులకు భేదంలేదు. ఎటొచ్చీ వాక్కు యొక్కస్థానాలలోనే వారికి భేదం. సమయాచారుల ప్రకారం పరావాక్కుకు స్థానం సహస్రారం. పశ్యంతిస్థానం ఆధారచక్రం. కాగా కౌళాచారులకు పరావాక్కు యొక్క స్థానం మూలాధారం. పశ్యంతీ వాక్కుస్థానం మణిపూరం. అక్కడి నుంచి ముందుకు వెడితే మధ్యమ, వైఖరిస్థానాలలో గాని, ఆరూపాలలోగాని వారికి తేడాలేదు. ఉన్న తేడా ఏమిటంటే అల్లా పరా, పశ్యంతీ వాక్కులస్థానాలలోనే.

ఏదైనా విషయం చెప్పాలి అంటే ముందుగా ఆలోచన రావాలి. అదే పరావాక్కు. ఆ తరువాత వాక్కు ఆధారచక్రం నుండి బయలుదేరి నెమ్మదిగా స్వాధిష్ఠానమణిపూరాలు దాటి అనాహంతచేరి అక్కడ నుండి కంఠస్థానమైన విశుద్ధిచేరి, ముఖం ద్వారా స్పష్టమైన వైఖరీ వాక్కుగా, నామరూపాత్మకమైనదిగా బయటకు వచ్చి శబ్దతరంగాలుగా చెవి రంధ్రాన్ని చేరుతుంది.

పరావాక్కు – ప్రత్యక్చితీ రూపం గలది. అంటే అవ్యక్తమైనది

పశ్యంతీవాక్కు – పరదేవతా అనబడుతుంది. ఇది పూర్తి అస్పష్టమైనది. అప్పుడే పుట్టిన పిల్లవాడి ఏడుపులా ఉంటుంది.

మధ్యమావాక్కు – పూర్తిగా అస్పష్టం కాదు. అలా అని స్పష్టమూ కాదు. మాటలు వచ్చీరాని పిల్లలు మాట్లాడినట్లుంటుంది. ఇది పూర్తిగా హల్లులతో కూడినది.

వైఖరీవాక్కు – ఇది స్పష్టమైనవాక్కు

ఇది వాక్కు యొక్క స్వరూపం. వాగీశ్వరీదేవి. ఈ దేవి సదా తనను ధ్యానించే భక్తుల హృదయాలలో ఉంటుంది. మాయాశబలితమైన పరమేశ్వరుని రూపానికి ముఖ్యప్రాణనాడి అయిన సుషుమ్న ఈమె. ఈదేవికి భూతభవిష్యద్వర్తమానాలు తెలుసు. చరాచరజగత్తులో ఏ జీవి ఎప్పుడు ఏ పనిచేస్తోందో గమనిస్తుంటుంది. అన్నిటికీ సాక్షి ఆదేవత. ఆమె సాక్షాత్తూ పరమేశ్వరుడైన మహాకామేశ్వరునితో పూజించబడింది.

ఈ విషయాలను 366 నుంచి 374నామం వరకు వివరించటం జరిగింది. మాతృకలు నాలుగువిధాలుగా ఉంటాయి. అవి 1. స్థూలము. 2. సూక్ష్మము 3. సూక్ష్మతరము 4. సూక్ష్మతమము. ఇప్పుడు వాగ్రూపాలలో

1. స్థూలము	– వైఖరీవాక్కు	3. సూక్ష్మతరము	– పశ్యంతివాక్కు
2. సూక్ష్మము	– మధ్యమావాక్కు	4. సూక్ష్మతమము	– పరావాక్కు

ఇక నామాలను చూద్దాం. వాగ్రూపాలను ఈ రకమైన శక్తులుగా గ్రహించాలి.

పరా	–	అంబిక	–	శాంతా
పశ్యంతీ	–	ఇచ్ఛా	–	వామ
మధ్యమా	–	జ్ఞాన	–	జ్యేష్ఠా
వైఖరి	–	క్రియా	–	రౌద్రీ

366. పరా

బిందువే పరారూపము. ప్రళయం సంభవించినప్పుడు నామరూపాత్మకమైన జగత్తు అంతా కనిపించకుండా పోతుంది. అంటే లయమయిపోతుంది. అంటే మాయతో కలిసి పరబ్రహ్మలో లీనమయిపోతుంది. గతంలో చెప్పినట్లుగా భూమి జలంతోను, జలం – నిప్పులోను, నిప్పు – వాయువునందు, వాయువు – ఆకాశమునందు, ఆకాశం మాయలోను లీనమవుతున్నాయి. ఈ రకంగా రూపాత్మకజగత్తు లయం చెందుతోంది. అలాగే శాస్త్రాలు పురాణాలు ఇతిహాసాలు అన్నీ వేదాలలో కలిసిపోతాయి. వేదాలు అకార ఉకార మకారాలలో లీనమవుతాయి. అకార, ఉకార, మకారాలు మాయలో కలిసిపోతాయి. ఈ రకంగా నామరూపాత్మక జగత్తంతా మాయలో లీనమయిపోతుంది. ఈ మాయ పరమేశ్వరుడిలో లీనమవుతుంది.

సృష్టి ఆరంభమైనప్పుడు పరమేశ్వరుడి నుండి మాయ బయటకు వచ్చేస్తుంది. అదే శక్తి. త్రికోణము. ఈ రకంగా బిందువు త్రికోణములవల్లనే మళ్ళీ నామ రూపాత్మక జగత్తు ఏర్పడింది. వీటివల్లనే 24 తత్త్వాలు ఏర్పడ్డాయి. నాలుగు వాగ్రూపాలు ఏర్పడ్డాయి. ఈ వాగ్రూపాలే నామాత్మకశాఖ. ఈరకంగా వచ్చిన వాక్కు ముందు అవ్యక్తంగా ఉండి రానురాను వ్యక్తమవుతుంది. అవ్యక్తమైన వాక్కునే పరావాక్కు అంటారు.

ఏదైనా పనిచెయ్యాలంటే ముందుగా ఆ పనిని చెయ్యాలి అనే కోరిక ఉండాలి. ఆ కోరికనే 'విచికీర్షా' అంటారు. అంటే పని చెయ్యటానికి ముందటిస్థితి. ఏదో చెప్పాలి అనుకున్నాడు మానవుడు. అప్పుడు ముందుగా చెప్పాలి అనే కోరిక కలగాలి. ఆ కోరికనే పరావాక్కు అంటారు. ఈ కోరిక అనేది. సహస్రారంలో పుడుతుంది. అదే పరాస్థానము. అందుకే దీన్ని పరావాక్కు అంటారు. పరమేశ్వరునికి మల్లేనే వాక్కు కూడా ఇక్కడ అవ్యక్త రూపంలో ఉంటుంది. అందుచేతనే అది పరావాక్కు. ఇది సమయ మతస్థుల సంప్రదాయం.

కాని కౌళాచారుల ప్రకారం వాక్కుకు జన్మస్థానము మూలాధారము. ఇక్కడ ఇది గాలిబుడగలాగా ఉంటుంది. అదే పరావాక్కు. కుండలినీ శక్తియే ఆధారచక్రంలో పరదేవత. అందుచేతనే అక్కడి వాక్కు పురావాక్కు అనబడుతోంది. వామకేశ్వరతంత్రంలో కుండలిని గురించి చెబుతూ

భుజంగాకార రూపేణ మూలాధారం సమాశ్రితా
.... సా చా వస్థా పరా జ్ఞేయ శైవర్వృతికారణమ్

కుండలినీ శక్తి నిద్రావస్తలో ఉన్న సర్పాకారంలో ఆధారచక్రంలో స్వయంభూలింగానికి మూడున్నర చుట్లు చుట్టుకుని నిద్రావస్థలో ఉన్నది అని చెప్పుతూ కుండలినీశక్తిని నిద్రలేపినట్లైతే అది బ్రహ్మ విష్ణు రుద్రగ్రంథులు ఛేదించుకుని పరాస్థానం చేరుతుంది. అని చెప్పబడింది. ఈ విషయాన్ని గతంలో వివరించాం. కుండలిని పరాస్థానం చేరుతుంది. కాబట్టే ఈ వాక్కును పరావాక్కు అంటారు.

367. ప్రత్యక్చితీరూపా

అంతర్ముఖముగ స్వాత్మను పొందటం ప్రతీచి అనబడుతుంది. ఈ రకంగా ఆత్మజ్ఞానం పొందటం 'ప్రత్యక్చితి' అనబడుతుంది. అంటే అవ్యక్తమైన బ్రహ్మ స్వరూపం గలది. అంతర్గతమైనటువంటి జ్ఞానస్వరూపురాలు.

పరా అనే నామంలో ఉన్న పరదేవతయే సాక్షి స్వరూపము. ఈ శక్తి విజృంభించింది అనే విషయము జ్ఞానము వల్లనే తెలుస్తుంది. పరావాక్కు అంటే – స్వస్వరూపజ్ఞానమే. పరమేశ్వరి శబల బ్రహ్మాకారమైన జ్ఞానస్వరూపురాలు. అందుచేతనే ఆమె ప్రత్యక్చితీ రూపా అనబడుతోంది.

368. పశ్యంతీ

పశ్యత్ – చూచుచున్న. పశ్యంతీ – చూచునది అని అర్థం. దీనికే ఉత్తీర్ణ అనే పేరు కూడా ఉన్నది. సౌభాగ్యసుభోదయంలో

పశ్యతి సర్వం స్వాత్మని కరణానాం సరణి మపి ।
య దుత్తీర్ణా తే నేయం పశ్యంతీ త్యుత్తీర్ణేత్యప్యుదీర్యతే ॥

అన్నింటిని తన ఆత్మనందు చూచునది. అన్ని పనులకు మార్గమును దాటినది కాబట్టి పశ్యంతీ అని, ఉత్తీర్ణ అని అనబడుచున్నది.

పరావాక్కు యొక్క విస్తరణమే పశ్యంతి. పరా అంటే శ్రీచక్రంలోని బిందువు. పశ్యంతీ అంటే బిందువు నుంచి వచ్చిన త్రికోణము. మూలాధారం దగ్గరనుంచి ఆజ్ఞాచక్రం వరకు షట్చక్రాలలోని దళాలలో ఉన్న అక్షరాలు మాతృకావర్ణాలు అనబడతాయి. ఈ మాతృకావర్ణాలన్నీ పశ్యంతీ రూపాలు. వాక్కు యొక్క ధ్వని వాయురూపంలో ఉంటుంది. ఏదైనా ఒక శబ్దం అయింది అంటే ఆ శబ్దాన్ని ధ్వని తరంగాలు దూరతీరాలకు మోసుకుపోతాయి. అందుచేతనే ఆ శబ్దం చాలా దూరం వరకు వినబడుతుంది. ఇక్కడ పరావాక్కుకు, మధ్యమావాక్కుకు మధ్యలో ఉండేది పశ్యంతీవాక్కు. పరాస్థానంలో నుంచి బయలుదేరిన వాక్కుకు రెండవరూపము పశ్యంతి. ఇది వాక్కు యొక్క మొదటి విశ్రాంతి స్థానము అని కూడా అనవచ్చు. ఈ వాక్కును ఇంద్రియాల ద్వారా వినలేము.

గతంలో చెప్పినట్లుగా పరావాక్కు సహస్రారంలో ప్రారంభమవుతుంది. ఇది వాక్కుకు మొదటిదశ. అక్కడ నుంచి మూలాధారం చేరి గాలిబుడగ రూపం ధరిస్తుంది. అది పశ్యంతి.

అయితే పరాస్థానంలో ఆలోచనారూపంలో ఉన్న వాక్కు వాయురూపంలో సుషుమ్న గుండా ఆధారచక్రంలోకి చేరుతుంది.

మూలాధారమనేది పరమేశ్వరికి ప్రతిబింబము. మాయాస్వరూపము. సహస్రారంలో బిందువున్నది. అదే పరాశక్తి. పరావాక్కు. కాగా ఆధారచక్రం త్రికోణం. అవ్యక్తము. ఇక్కడ పశ్యంతీ వాక్కుంటుంది. ఇదే మూలప్రకృతి. చరాచరజగత్తుకు సృష్టి స్థానము. త్రికోణము నుంచే ఈ జగత్తంతా ఆవిర్భవించింది అని గతంలోనే చెప్పాము.

పశ్యంతీవాక్కు మొలకవచ్చిన ధాన్యపుగింజలా ఉంటుంది. కాబట్టి అది ఏ వృక్షమో స్పష్టంగా తెలియదు. అదే ఏదో మొక్క అని మాత్రమే తెలుస్తుంది. ఈ రకంగా పశ్యంతీవాక్కు అస్పష్టంగా ఉంటుంది.

యత్మంద్రయతే తస్మా త్కుమారీ

పుట్టిన శిశువు ఏడుపులాగా ఆధారచక్రంలోని వాగ్దేవత మంద్రస్వరంతో ఉంటుంది. అందుకనే అది అస్పష్టమైనవాక్కు.

ఇక్కడ 'కుమారీ' అనే పదంవాడారు. కుమారీ అంటే – తొమ్మిదిసంవత్సరాల బాలిక. బాలాత్రిపురసుందరి అని అర్థం.

ఇంతవరకు చెప్పినది. సమయాచారుల పద్ధతి ప్రకారం వివరణ. ఇక కౌళాచారుల పద్ధతి గనక చూస్తే పరావాక్కు స్థానము ఆధారచక్రం అని ముందే చెప్పాం. ఎందుకంటే కౌళులకు సహస్రారంతో పనిలేదు. వారికి ఆధారస్వాధిష్ఠానాలే ప్రధానం. ఆధార చక్రంలోని పరావాక్కు మణిపూరం చేరుతుంది. ఇది రెండోస్థానం. ఇక్కడ వాక్కు పశ్యంతీ అనబడుతుంది.

369. పరదేవతా

పరా ఉత్కృష్టా చాసౌ దేవతా చ – పరదేవతా

ఉత్కృష్టమైన దేవత. ఉపాసించదగిన పరమేశ్వరి దేవదేవి. ఆమే పరదేవత.

పరా అన్నప్పుడు వివరించబడిన దేవత బిందురూపంలో ఉంది. ఆ బిందువు నుంచి బయటకు వచ్చిన పశ్యంతి పరదేవతా అనబడుతోంది. ఈ పశ్యంతీస్థానంలో ఉండే దేవతను ఇంద్రియాల ద్వారా తెలుసుకోలేము. దీన్ని మనసుతో తెలుసుకోవచ్చును. అందుచేతనే ఈమె ధ్యేయమాత్రస్వరూపిణి.

వేదశాస్త్రమయీ వాణీ యస్యాః సా పరదేవతా

ఎవరి వాక్కులు శ్రుతి స్మృతులో ఆమె పరదేవత.

370. మధ్యమా

మధ్యే స్థితా మధ్యమా మధ్యయందుండునది. మధ్యమా అను వాక్స్వరూపిణి.

పశ్యంతీపన కేవలముత్తీర్ణా నాపి వైఖరీవబహిః ।
స్ఫుటతర నిఖిలావయవ వాగ్రూపా మధ్యమా తయోః ఆస్మా ॥

ఆమె పశ్యంతి వంటిది కాదు. వైఖరివలె సమస్తావయవములతో స్పష్టముగా బయటకు వచ్చేదికాదు. ఆ రెండింటి మధ్యలో మధ్యమావాగ్రూపముతో ఉండునది.

పశ్యంతీ వాక్కు దాటిన తరువాత, వైఖరికి ముందు అంటే ఈ రెండింటిమధ్యలో ఉంటుంది. ఈ వాక్కు కూడా పరమేశ్వరి స్వరూపమే. ఇక్కడ నాదం పుడుతుంది. అంటే వాక్కు పూర్తిగా అస్పష్టం కాదు. అలా అని స్పష్టము కాదు. దీన్ని మనస్సుతో గ్రహించవచ్చును. ఇక్కడ వాక్కు మారాకు వచ్చిన ధాన్యపుగింజలా ఉంటుంది. కాబట్టి ఇది ఇదీ అని తెలుస్తుంది. కాని పూర్తిగాకాదు.

అంతస్సంకల్పరూపా యా క్రమరూపాఽనుపాతినీ ।
ప్రాణవృత్తి మతిక్రమ్య మధ్యమా వా క్ర్పవర్తతే ॥

మధ్యమావాక్కు అనాహత పద్మంలో హృదయస్థానంలో ఉంటుంది. పశ్యంతీ వాక్కు కన్న ఇందులో నాదము ఎక్కువగా ఉంటుంది. వాక్కుకు రెండవ విశ్రాంతి స్థానము అని దీన్ని చెప్పవచ్చు.

మధ్యమావాక్కును రెండురకాలుగా చెప్పవచ్చు. 1. స్థూలమధ్యమ 2. సూక్ష్మమధ్యమ.

పశ్యంతి స్థానం నుంచి మధ్యమ వరకు అంటే ఆధారచక్రం నుండి అనాహతం వరకు గల వాక్కును స్థూలమధ్యమ అంటారు. మధ్యమవాక్కు అంటే అనాహతం వరకు అక్షరసమామ్నాయంలో హల్లులు ఉంటాయి. కాబట్టి ఆధారచక్రంలో బయలుదేరిన గాలిబుడగ అనాహతం వరకు హల్లులతో కలిసి ఉంటుంది. కాబట్టి ఈ వాక్కు మాటలు సరిగారాని పిల్లవాడు చెప్పినట్లుగా అచ్చులు లేకుండా, కేవలము హల్లులతో కలిసి ఉంటుంది. అందుకని వాక్కులో భావం తెలుస్తుంది. కాని మాటలో స్పష్టత ఉండదు.

సమయ, కౌళ మతాల వారిద్దరి ప్రకారము మధ్యమావాక్స్థానము అనాహతమే. ఇందులో ఏరకమైన అనుమానం లేదు.

371. వైఖరీరూపా

వి అంటే – విశేషము. ఖర అనగా – కఠినము. వైఖరి – మిక్కిలి కఠినమైన రూపము గలది. ఘనభావము పొందినది. వి – నిశ్చయము, ఖం – చెవిరంధ్రమును, రి – పొందునది. వైఖరి – నిశ్చయముగ చెవిరంధ్రమును సోకునది. విఖరమను ప్రాణముచే ప్రేరేపించబడినది. వైఖరి. అని సౌభాగ్యసుధోదయంలో చెప్పబడింది. యోగశాస్త్రంలో చెప్పబడినటువంటి విఖరము అనే వాయువుచేత ప్రేరేపించబడినది. వైఖరి అనే వాగ్రూపము గల పరమేశ్వరి.

వాగధీశ్వరియే వైఖరి అనబడుతుంది. పరాస్థానంలో బయలుదేరిన వాక్కు నాలుక, దంతాలు మొదలైన స్థానాలకు తాకి స్పష్టమైన రూపం పొందుతుంది. ఆ రకంగా ముఖము ద్వారా బయటకు వచ్చి శబ్దతరంగాలరూపంలో చెవులకు చేరుతుంది. అనాహతం వరకు కేవలము హల్లులరూపంతో అస్పష్టంగా ఉన్న వాక్కు అక్కడ నుంచి విశుద్ధిచక్రం చేరుతుంది. విశుద్ధి చక్రానికి పదహారుదళాలున్నాయి. ఈ పదహారు దళాలలోను అ నుండి అః వరకు అచ్చులు ఉంటాయి. మాతృకాహృదయంలో చెప్పినట్లుగా

కకారాది క్షకారాంతా వర్ణా స్తే శివరూపిణః ।
సమస్త వ్యస్తరూపేణ షట్త్రింశత్ తత్త్వవిగ్రహా ॥

అకారాది విసర్గాంతాః స్వరాషోడశయుక్తయః ।
నిత్యా షోడశకాత్మానః పరస్పర మమీయత ॥

శివశక్తిమయావర్ణా శబ్దార్థప్రతిపాదకా ।
శివః స్వరపరాధీనో న స్వతంత్రః పదాప్యసౌ ॥

స్వరాః స్వతంత్రా జాయంతే న శివ స్తు కథాచన.

క నుంచి క్ష వరకు గల హల్లులు శివరూపాలు. అ నుంచి అః వరకు అచ్చులు శక్తి రూపాలు. అచ్చులు స్వతంత్రాలు హల్లులు స్వతంత్రాలుకావు. అందుచేత అనాహతం వరకు వాక్కు యొక్క స్పష్టత తెలియదు. ఈ వాక్కు విశుద్ధి చేరగానే అక్కడ ఉన్న అచ్చులతో కలిసి స్పష్టమైన రూపం పొంది ముఖం ద్వారా శబ్దరూపంలో బయటకు వచ్చి చెవులను చేరుతుంది.

అనాహతంలో వాక్కు క్ గ్ ల్ అనబడే కేవలము హల్లులరూపంలోనే ఉంటుంది. విశుద్ధి చేరిన తరువాత క్ + అ = క, గ్ + ఇ = గి అని స్పష్టమైన రూపు సంతరించుకుంటుంది.

ఈ రకంగా వాక్కు స్పష్టం కావటం నామశాఖ. స్థూలదృష్టికి గోచరమవటం అంటే చెవులకు వినిపించటం రూపశాఖ. ఈ కారణంచేతనే వాక్కు నామరూపాత్మకము అని చెప్పబడుతుంది. ఇలా వైఖరీరూపంలో స్పష్టంగా వచ్చినటువంటి వాక్కు పతివ్రత, ప్రౌఢాంగన, మహాత్రిపురసుందరి, రాజరాజేశ్వరి సదాశివుని వామాంకమందు ఆశీనురాలైన పరమేశ్వరి అని చెప్పబడుతోంది. ఈమెయే వాగీశ్వరీదేవి. మంత్రశాస్త్రంలో వాగీశ్వరీ మహామంత్రమున్నది.

అస్యశ్రీవాగీశ్వరీ మహామంత్రస్య । దక్షిణామూర్తి ఋషిః । త్రిష్టుప్ఛందః । శ్రీవాగీశ్వరీ దేవతా । ఐం బీజం । హ్రీం శక్తిః । నమః కీలకం । జపే వినియోగః ॥

న్యాసము : ఓం ఐం హ్రాం । ఓం ఐం హ్రైం ।
ఓం ఐం హ్రీం । ఓం ఐం హ్రౌం ।
ఓం ఐం హ్రూం । ఓం ఐం హ్రః ॥

ధ్యానము : వాణీం పూర్ణనిశాకరోజ్జ్వలముఖీం కర్పూరకుందప్రభాం
చంద్రార్ధాంకిత మస్తకాం నిజకరై స్సంబిభ్రతీ మాదరాత్
వీణా మక్షగుణం సుధాఢ్యకలశం విద్యాం చ తుంగస్తనీం
దివ్యై రాభరణై ర్విభూషిత తనుం హంసాధిరూఢాం భజే ॥

మంత్రము : ఓం హ్రీం ఐం హ్రీం ఓం సరస్వత్యై నమః ॥

372. భక్తమానసహంసికా

భక్తజనుల హృదయాలలో హంసవలె నుండునది. హంసలు మానససరోవరంలో నివసిస్తాయి. ఇక్కడ భక్తుల మనస్సు అనబడే మానససరోవర మందు నివసించు ఆడుహంస (హంసి).

నాదస్వరూపిణి అయినటువంటి వాగీశ్వరీ దేవి భక్తుల హృదయములందు మంత్రరూపంలో విహరిస్తుంటుంది. ఇక్కడ భక్తులు అంటే ఎల్లవేళలయందు హృదయమున ఎడతెగని తైలధారవలె పరమేశ్వరిని స్మరించేవారు. ధ్యానించేవారు. అటువంటి వారి హృదయములందు విహరిస్తుంది ఆ పరమేశ్వరి. అందుకే భక్తమానస హంసికా అనబడుతోంది.

అస్యశ్రీ అజపామహామంత్రస్య హంసఋషిః । అవ్యక్తగా యత్రీఛందః । పరమహంసో దేవతా । హంబీజం । సఃశక్తిః । సోऽహం కీలకం । అవిద్యా నివృత్తిద్వారా స్వస్వరూప సాక్షాత్కార సిద్ధ్యర్థే జపే వినియోగం ॥

న్యాసము : **హంసాం సూర్యాత్మనే స్వాహా ।**
హంసీం సోమాత్మనే స్వాహా ।
హంసూం నిరజంనాత్మనే స్వాహా ।

హంసైం నిరాభాసాత్మనే స్వాహా ।
హంసౌం అతను సూక్ష్మ ప్రబోధాత్మనే స్వాహా ।
హంసః అవ్యక్త ప్రబోధాత్మనే స్వాహా ॥

ధ్యానము : అగ్నీషోమగరుత్మకం ప్రణవకం బిందుత్రినేత్రోజ్జ్వలం
భాస్వ ద్రుద్రముఖం శివాంఘ్రియుగళం పార్శ్వస్థకాలానలమ్ ।
ఉద్య ద్భాస్కరకోటికోటిసదృశం హంసం జగద్వ్యాపినం
నాదబ్రహ్మమయం హృదంబుజపుటే నిత్యం సదా భావయే ॥

అత్మాన మగ్నిషోమాఖ్య పక్ష్మయుగ్మం శివాత్మకం ।
సకారేణ బహిర్యాంతం విశంతం చ హకారతః ॥
హంసస్సోऽహమితి ధ్యాత్వా సోహం వ్యజనహీనతః ।
హృదిసంహృత్యచాత్మానం బ్రహ్మరూపం విభావయేత్ ॥

మంత్రము : ఓం హంసహంసాయ విద్మహే పరమహంసాయ ధీమహి । తన్నో హంసః ప్రచోదయాత్ ॥

373. కామేశ్వరప్రాణనాడీ

కామేశ్వరుడి యొక్క మాయా శబలితరూపానికి ఆ పరమేశ్వరి ముఖ్యప్రాణనాడి అయిన సుషుమ్నరూపంలో ఉన్నది. ఈ విషయాన్ని శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 28వ శ్లోకంలో

సుధా మ ప్యాస్వాద్య ప్రతిభయ జరామృత్యు హరిణీం
విపద్యన్తే విశ్వే విధిశతమఖముఖాద్యా దివిషదః
కరాళం యత్క్ష్వేళం కబళిత వతః కాలకలనా
నశంభోస్తన్మూలం తవ జనని ! తాటంకమహిమా ॥

తల్లీ ! బ్రహ్మేంద్రాది సకలదేవతలు అమృతం త్రాగికూడా ప్రళయకాలంలో లయం చెందారు. లోకాలన్నింటినీ దహించే కాలకూటాన్ని త్రాగినప్పటికీ నీ పతిశంకరునకు హాని కలగలేదు. అందుకు కారణము నీ తాటంకముల ప్రభావమేకదా ! తాటంకములు స్త్రీకి సౌభాగ్యచిహ్నాలు. కాబట్టి నీ యొక్క సౌభాగ్యమెంతటిదోకదా అంటున్నారు.

374. కృతజ్ఞా

ప్రాణులయొక్క పుణ్యపాపాలను ఎరుగునది.

సూర్య స్సోమో యమః కాలో మహాభూతాని పంచ చ ।

ఏతే శుభా శ్శుభ స్యేహ కర్మణో నవ సాక్షిణః ॥

సూర్యుడు, చంద్రుడు, యముడు, కాలము, పంచభూతాలు ఈ తొమ్మిది పుణ్యపాపాలకు, శుభాశుభకర్మలకు సాక్షులు. ఆ పరమేశ్వరి వీరికన్న వేరైనదికాదు. ఉపకారులకు ప్రత్యుపకారము చేసేది. కృతయుగములో ధర్మమువలె జ్ఞానము గలది. అనగా కృతయుగంలో పరిపూర్ణజ్ఞానం ఏరకంగా ఉండేదో, ఆ రకమైన జ్ఞానము గలది.

ఆ పరమేశ్వరి సూర్య చంద్ర కాలమయము, పంచభూతాలరూపంలో ఉండి ప్రపంచంలోని జీవులు ఏ క్షణంలో ఏ పనిచేస్తున్నారో గమనిస్తుంటుంది. శారీరకంగాగాని మానసికంగా గాని ఎవరు మంచి చెడు పనులు చేస్తున్నారో, వాటన్నింటిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉంటుంది. అందుచేతనే ఆమె కృతజ్ఞా అనబడుతుంది. ఆమె సర్వజ్ఞ.

పత్రపుష్పాద్యల్పమపి ప్రయచ్ఛతాంమోక్షం దదాతీతి

పత్రము పుష్పము మొదలగు అల్పవస్తువులతో అర్చించే వారికి కూడా, వారు అర్పించే వస్తువులను కాకుండా వారి భక్తికి తగినట్లుగా మోక్షము కూడా ప్రసాదిస్తుంది.

సర్వజగత్తును తెలుసుకున్నది. ఆత్మరూపమైనట్టిది. కాబట్టి ఆ పరమేశ్వరి కృతజ్ఞా అనబడుతోంది.

ఈరకంగా వాగీశ్వరీ రూపం వివరించబడింది.



శ్రీ 'ఔ'కార దేవి

31. బిందుమండలవాసినీ

నిరాకారుడు నిర్గుణస్వరూపుడు పరబ్రహ్మ. అతడు బిందురూపంలో ఉన్నాడు. ఆ బిందువే కాలవశమున భిన్నమై వివిధరూపాలు పొందింది. రహస్యాగమములో ఈ విషయాన్ని వివరిస్తూ "కాలవశమున భిన్నమైనటువంటి ఆ బిందువు మూడుభాగాలయింది. అవే 1. స్థూల 2. సూక్ష్మ 3. పరములు. అవి కారణబిందువుతో కలిసి నాలుగు భాగాలవుతున్నాయి. అవి.

1. ఆదిదైవము	2. అవ్యక్తేశ్వరము	3. హిరణ్యగర్భుడు	4. విరాట్స్వరూపము
1. శాంతా	2. వామా	3. జ్యేష్టా	4. రౌద్రీరూపములు
1. అంబిక	2. ఇచ్ఛా	3. జ్ఞాన	4. క్రియాశక్తులు
1. ఆదిదైవము	2. అవ్యక్తేశ్వరము	3. హిరణ్యగర్భుడు	4. విరాట్స్వరూపము
1. కామగిరిపీఠము	2. పూర్ణగిరిపీఠము	3. జాలంధరపీఠము	4. ఓడ్యాణపీఠము

అని చెప్పబడింది. ఆధారచక్రంలో ఉండేది కుండలినీశక్తి. అదే చరాచర జగత్తుకూ కారణము అని తెలిసినవాడికి మరుజన్మ ఉండదు అని నిత్యాహృదయంలో చెప్పబడింది.

ఇప్పుడు ఆ పరమేశ్వరి కామగిరి, పూర్ణగిరి, జాలంధర, ఓడ్యాణపీఠాల యందు ఉంటుంది. మానవదేహంలోని షట్చక్రాలలోను, శ్రీచక్రంలోని ఆవరణలలోనూ ఈ పీఠాలు నిరూపించబడ్డాయి.

గౌడపాదులవారు తమ సుభగోదయస్తుతిలోని 10వ శ్లోకంలో

త్రికోణం చాధారం త్రిపురవినుతే ! ష్టారమనఘే !

భవే త్స్వాధిష్ఠానం పున రపి దశారం మణిపురం

దశారం తే సంవిత్కమల మథమన్వస్రక మమే

విశుద్ధం స్యాదాజ్ఞ శివితి తతో బైందవగృహమ్

షట్చక్రాలకి శ్రీచక్రంతో ఐక్యత చెప్పబడింది.

1. ఆధారచక్రానికి	–	త్రికోణంలో ఐక్యత
2. స్వాధిష్ఠానానికి	–	అష్టకోణంలో ఐక్యత
3. మణిపూరానికి	–	అంతర్దశారంతో ఐక్యత

4. అనాహతానికి - బహిర్దశారంతో ఐక్యత
5. విశుద్ధిచక్రానికి - చతుర్దశారంతో ఐక్యత
6. ఆజ్ఞాచక్రానికి - అష్టదళము, షోడశ దళములతో ఐక్యత
7. సహస్రారానికి - భూపురంలో ఐక్యత

ఇందులో బ్రహ్మరంధ్రమే బిందువు. కాబట్టి

కామగిరిపీఠం	-	ఆధారచక్రం	-	త్రికోణం
పూర్ణగిరిపీఠం	-	అనాహతము	-	బహిర్దశారం
జాలందరపీఠం	-	ఆజ్ఞాచక్రము	-	అష్టదళ, షోడశదళాలు
ఓడ్యాణపీఠం	-	బ్రహ్మరంధ్రం	-	బిందువు

ఈ విషయాన్ని యోగినీహృదయంలోని చక్రసంకేతంలో 41వ శ్లోకంలో వివరిస్తూ

భాసనాద్విస్య రూపశ్య స్వరూపే బాహ్యతోఽపిచ
ఏతాశ్చ తస్త్రః శక్తస్తు కా - పూ - జా - ఓ - ఇతిక్రమాత్
పీఠాః కందే పదే రూపే రూపాతీతే క్రమాస్థితాః

విశాల విశ్వానికి మానవదేహానికి సమానరూపత్వమున్నది. బ్రహ్మాండమే - విశాలవిశ్వము, పిండాండమే - మానవశరీరము. ఈ రెండు సమిష్టి, వ్యష్టి శరీరాలు. బ్రహ్మాండంలో ఉన్న అవయవాలే పిండాండంలో కూడా ఉన్నాయి. అందుచేత అంబికా, ఇచ్ఛా, జ్ఞాన, క్రియాశక్తులు కా - పూ - జా - ఓ అనే పేర్లు గల పీఠాలయినాయి.

1. కా - కామగిరిపీఠము
2. పూ - పూర్ణగిరిపీఠము
3. జా - జాలంధరపీఠము
4. ఓ - ఓడ్యాణపీఠము

ఈ పీఠాలన్నీ నదీతీరాలయందున్నాయి. ఇప్పుడు పిండాండమందు అంటే మానవశరీరంలో

1.	కందం	-	సుషుమ్నానాళము	-	మూలాధారము
2.	పదం	-	హృదయము	-	అనాహతము
3.	రూపం	-	బిందువు	-	ఆజ్ఞాచక్రము
4.	రూపాతీతం	-	కళలకు అతీత	-	బ్రహ్మరంధ్రము

ఈ పీఠాలలోనే అంబికా మొదలైనశక్తులున్నాయి.

1. కామగిరిపీఠము - వాగ్భవబీజము, త్రికోణంలోని అగ్రకోణం వామాశక్తి, ఆధారచక్రము
2. పూర్ణగిరిపీఠము - త్రికోణంలోని దక్షిణ కోణము. కామరాజ బీజము, జ్యేష్ఠాశక్తి అనాహతము
3. జాలంధరపీఠము - త్రికోణంలోని ఉత్తరకోణము. శక్తిబీజము, రౌద్రిశక్తి, ఆజ్ఞాచక్రము
4. ఓడ్యాణపీఠము - త్రికోణంలోని బిందువు. అన్నిబీజములు, అంబికాశక్తి, బ్రహ్మరంధ్రము

చతురస్రం తథా బిందు షట్క యుక్తం చ వృత్తకమ్ ।
అర్ధ చంద్రం త్రికోణం చ రూపాణ్యేషాం క్రమేణ తు ।
పీతో ధూమ్ర స్తథాశ్వేతో రక్తో రూపం చ కీర్తితమ్ ॥

ఈ పీఠాలు క్రమంగా పృథివీ, వాయు, జల, అగ్ని రూపాలని వివరించబడుతోంది.

1. కామగిరి పీఠము - భూపురము, భూతత్త్వము, పీతవర్ణము
2. పూర్ణగిరి పీఠము - షడ్బిందువులచే ఏర్పడిన వృత్తము, వాయుతత్త్వము, ధ్రూమ వర్ణము
3. జాలంధర పీఠము - అర్ధచంద్రాకారము, జలతత్త్వము, శ్వేత వర్ణము.
4. ఓఢ్యాణ పీఠము - త్రికోణము, అగ్ని తత్త్వము, రక్త వర్ణము.

లలితాసహస్రంలో వీటిని

375. కామరూపా - కామగిరి పీఠము
376. శృంగారరససంపూర్ణా - పూర్ణగిరిపీఠము
378. జాలంధరస్థితా - జాలంధరపీఠము
379. ఓడ్యాణపీఠనిలయా - ఓడ్యాణపీఠము

గా వివరించబడ్డాయి. ఇక నామాలను చూద్దాం.

375. కామపూజితా

మన్మథునిచే పూజించదగినది. లక్ష్మీదేవి కుమారుడు అనంగుడు. అతడికి అంగాలు లేకపోయినప్పటికీ పంచదశి మహామంత్రాన్ని పొందగలిగాడు.

కాముడు అంటే ఈశ్వరుడు. జగత్తును సృష్టించటంలో కామనగలవాడు. అతడే కామేశ్వరుడు. పంచకృత్యపరాయణుడు. సృష్టి చెయ్యాలి అని సంకల్పించినప్పుడు మొదటగా పరమేశ్వరిని పూజించి సృష్టి కార్యక్రమం ప్రారంభించాడు. అందుచేత దేవి కామపూజితా అనబడుతోంది.

ఇది కామగిరిపీఠము. మానవశరీరంలోని ఆధారచక్రంలోనూ, శ్రీచక్రంలోని త్రికోణంలోనూ ఉంటుంది.

అస్యశ్రీ కామగిరిపీఠ మహామంత్రస్య । బ్రహ్మఋషిః । గాయత్రీచ్ఛందః । బ్రహ్మాణీ దేవతా । ఐం బీజం । ఆం శక్తిః । క్లీం కీలకం । జపే వినియోగః ।

న్యాసము : హ్రాం । హ్రీం । హ్రూం । హ్రైం । హ్రౌం । హ్రః ॥

ధ్యానము : **బ్రహ్మాత్మశక్తిసహిత మరుణం కామసంజ్ఞకం ।**
గిరిపీఠ మహం వందే సర్వసిద్ధి ప్రదాయకమ్ ॥

మంత్రము : **ఐం హ్రీం శ్రీం ఐం క్లీం సౌః అం ఆం సౌః కామగిరిపీఠ బ్రహ్మాత్మశక్తి సరస్వత్యై నమః ॥**

376. శృంగారరససంపూర్ణా

శృంగారము అను రసముచే పూర్తిగా నిండినది. ఈ నామము పూర్ణగిరి పీఠాన్ని తెలియచేస్తోంది. శృంగ అంటే – రెండు, అర అనగా – ఆరు. అని గ్రహించాలి అంటున్నారు భాస్కరాచార్యులు. ఈ రకంగా చెబితే ఆరు రెళ్ళు పన్నెండుదళాలు గల పద్మము. అనాహతము కాబట్టి శృంగారరసము అంటే అనాహత పద్మము. అక్కడ సం – తరచుగా, పూర్ణ – ఉండునది. అనాహత పద్మమునందు ఉండేది పరమేశ్వరి. మొత్తం పీఠాలు నాలుగు. 1. కామగిరి. 2. పూర్ణగిరి 3. జాలంధర 4. ఓడ్యాణపీఠాలు. ఇందులో రెండవదయిన పూర్ణగిరి పీఠము అనాహతమునందున్నది అని తంత్రశాస్త్రం చెబుతోంది. కాబట్టి శరీరంలోని అనాహతచక్రమే పూర్ణగిరి పీఠము.

పరమేశ్వరి బ్రహ్మానందస్వరూపిణి. ఆనందఘనస్వరూపిణి. శ్రీచక్రమే పరమేశ్వరి స్వరూపం. శృంగ – కోణములచేత, అర – దళములచేత, రస – తొమ్మిది రసములు లేక భావములచేత, సంపూర్ణా – నిండి ఉన్నది. శ్రీచక్రంలోని తొమ్మిది ఆవరణలలోనూ చతుర్దశారము, దశారయుగ్మము, అష్టకోణము, త్రికోణము. అనేవి కోణచక్రాలు వీటిలో మొత్తం కలిపి 45 కోణాలుంటాయి. అలాగే షోడశదళము, అష్టదళము. ఈ రెండింటియందు కలిపి 24 దళాలుంటాయి. అలాగే శ్రీచక్రంలోని తొమ్మిదిఆవరణల యందు తొమ్మిది రకాల రసాలుంటాయి. వీటినే నవరసాలు అంటారు.

1.	భూపురం	–	త్రైలోకమోహనచక్రం	–	శృంగారరసం
2.	షోడశదళం	–	సర్వాశాపరిపూరక చక్రం	–	వీరరసం
3.	అష్టదళం	–	సర్వసంక్షోభణచక్రం	–	కరుణరసం
4.	చతుర్దశారం	–	సర్వసౌభాగ్యదాయకచక్రం	–	భయానకరసం
5.	బహిర్దశారం	–	సర్వరక్షాకరచక్రం	–	రౌద్రరసం
6.	అంతర్దశారం	–	సర్వార్ధసాధకచక్రం	–	భీభత్సరసం
7.	అష్టకోణం	–	సర్వరోగహరచక్రం	–	హాస్యరసం
8.	త్రికోణం	–	సర్వసిద్ధిప్రదచక్రం	–	అద్భుతరసం
9.	బిందువు	–	సర్వానందమయచక్రం	–	శాంతరసం

ఈరకంగా శృంగారరసంతోపాటుగా మిగిలినరసాలు అన్నీ అంటే నవరసాలు కలిగినటువంటిది. ఇదే పూర్ణ గిరిపీఠము. షట్చక్రాలలో బహిర్దశారం.

అస్యశ్రీ పూర్ణగిరిపీఠ మహామంత్రస్య । విష్ణు ఋషిః । అనుష్టుప్ఛ్ఛందః । నారాయణీదేవతా । క్లీం బీజం । హ్రీం శక్తిః । నమః కీలకం । జపే వినియోగః

న్యాసము : శ్రాం । శ్రీం । శ్రూం । శ్రైం । శ్రౌం । శ్రః ॥

ధ్యానము : **లక్ష్మీం క్షీరసముద్రరాజతనయాం........ వందే ముకుందప్రియాం**

మంత్రము : **ఐం హ్రీం శ్రీం ఐం క్లీం సౌః పూర్ణగిరి పీఠ విష్ణ్వాత్మ శక్త్యైః లక్ష్మై నమః ॥**

377. జయా

జయ స్వరూపిణి. వరాహపర్వతం మీద పూజించబడే దేవత. **తతోజయ ముదీరయేత్**

పరమేశ్వరి ఓంకారస్వరూపిణి. తనను ఆరాధించే భక్తులకు, ఉపాసకులకు వైరాగ్యం కలిగించి, ఆత్మజ్ఞానాన్నిచ్చి వారికి మోక్షం ప్రసాదిస్తుంది. అందుచేతనే జయా అనబడుతోంది. సర్వత్రజయమే కలది. అపజయము ఎరుగనిది. మృత్యువును కూడా జయించినది. మృత్యుదేవత కూడా ఆమెకులోబడే ఉంటుంది. అందుచేతనే ఆ దేవి జయా అనబడుతోంది.

378. జాలంధరస్థితా

జాలంధరపీఠమందుండునది. 'జాలంధరము అనేచోట విష్ణుముఖి అనే పేరుతో పూజించబడుతోంది' అని పద్మపురాణంలో చెప్పబడింది.

పరమేశ్వరి జయ అనే పేరుతో జాలంధరపీఠము అని చెప్పబడే ఆజ్ఞా చక్రమందున్నది. పరమేశ్వరి జాలంధరపీఠమందుంటుంది కాబట్టి జాలంధరస్థితా అనబడుతుంది.

అస్యశ్రీ జాలంధరపీఠ మహామంత్రస్య । రుద్రఋషిః । అతి జగతీచ్ఛందః । శ్రీ గౌరీ దేవతా । సౌః బీజం । ఐం శక్తిః । హ్రీం కీలకం । జపే వినియోగః ॥

న్యాసము : ఐం । క్లీం । సౌః । సౌః । క్లీం । ఐం ॥

ధ్యానము : **ఆధారే తరుణార్కబింబరుచిరే వాగ్బీజ మగ్నిప్రభం**
బీజం మన్మథ మింద్రగోపకనిభం హృత్పంకజే సంస్థితం ।
రంధ్రే బ్రహ్మపదే చ శాక్తమపరం హేమప్రభా భాసురం
యే ధ్యాయంతి పదత్రయం తవ శివే ! తే యాంతి సౌఖ్యం పదమ్॥

మంత్రము : **ఐం క్లీం సౌః శ్రీం హ్రీం ఐం జాలంధరపీఠ రుద్రాత్మ శక్తి గౌర్యై నమః ॥**

379. ఓడ్యాణపీఠనిలయా

ఓడ్యాణము అనే పీఠమే నివాసస్థానముగా గలది. పరమేశ్వరి ఓడ్యాణపీఠమందు నివసిస్తుంది. కాబట్టి ఓడ్యాణపీఠనిలయా అనబడుతుంది. ఇది బ్రహ్మరంధ్రం


380. బిందుమండలవాసినీ

బిందుమండలము అంటే శ్రీచక్రంలో సర్వానందమయమైన బిందువే. ఆ బిందువు నందుండునది. బిందువు యొక్క మండలం బ్రహ్మరంధ్రం. కాబట్టి బ్రహ్మరంధ్రంలో ఉండేది. బ్రహ్మరంధ్రంపైభాగాన అంటే చంద్రమండలంలో ఉంటుంది. ఓం హ్రీం అని చెప్పబడే శబళ బ్రహ్మరూపమే బిందువు. శబళ బ్రహ్మ అంటే వేరుగా విభజించబడిన బ్రహ్మస్వరూపము. హకార సంజ్ఞగల పరమేశ్వరుడు సకారసంజ్ఞగల ప్రకృతితో కలసి శబళ బ్రహ్మమయి మానవ దేహంలో ప్రవేశించాడు. అంటే ఆ పరమాత్మ తనను తాను విభజించుకున్నవాడై జీవాత్మరూపంలో మానవదేహంలో ప్రవేశించాడు. శంకరభగవత్పాదులవారు **నమస్తే నమస్తే శి బిందుస్వరూపే** అంటూ ఆ పరమేశ్వరిని బిందునామంతోనే సంబోధించారు.

కల్యాణాయుత పూర్ణచంద్రవదనాం ప్రాణేశ్వరానందినీం
పూర్ణాం పూర్ణతరాం పరేశమహిషీం పూర్ణామృతా స్వాదినీం
సంపూర్ణాం పరమోత్తమాఽమృతకళాం విద్యావతీంభారతీం
శ్రీచక్రప్రియబిందుతర్పణపరాం శ్రీరాజరాజేశ్వరీం

బిందువు పరమేశ్వరి స్వరూపం. శ్రీచక్రంలోని అన్నికోణాలకు, అన్నిదళాలకు, అన్నిచక్రాలకు, వాగ్స్వరూపాలకు, మాతృకలకు కారణము ఆబిందువే. ఆ బిందువునందు నివసిస్తుంది కాబట్టే పరమేశ్వరి బిందుమండలవాసిని అనబడుతోంది.

ఈరకంగా నాలుగుపీఠాలను వివరించటం జరిగింది. బిందువునందుండే పరమేశ్వరియే బిందుమండలవాసిని.



శ్రీ 'అం'కార దేవి

32. రహోయాగము

రహోయాగము అంటే అంతర్యాగము పరమేశ్వరి పూజ రెండు విధాలుగా జరుగుతుంది. అవి 1. బాహ్యపూజ 2. అంతఃపూజ.

బాహ్యపూజ అంటే శ్రీచక్రము, లేదా పరమేశ్వరి ప్రతిమను ఎదురుగా ఉంచి దాన్ని నియమనిష్ఠలతో పూజించటం ఈ రకమైన పూజలో భగవంతుడు వేరు భక్తుడు వేరు. భక్తుడు భగవంతుణ్ణి పూజించి వరాలడుగుతాడు. భక్తుడి కోరికలు భగవంతుడు తీరుస్తాడు.

ఇక రెండవది అంతఃపూజ. ఈ పద్ధతిలో శ్రీచక్రంగాని, దేవి ప్రతిమగాని ప్రత్యేకంగా ఉండవు. సాధకుడు తానే పరమేశ్వరస్వరూపము అని భావించి తనలో ఉన్న ఆత్మని దర్శిస్తాడు. సనత్కుమార సంహితలో చెప్పినట్లుగా

బాహ్యపూజా న కర్తవ్యా కర్తవ్యా బాహ్యజాతిభిః

బాహ్యపూజను బాహ్యజాతులవారు మాత్రమే చేస్తారు. బాహ్యజాతులవారంటే

బాహ్యజాపూజరతాః కౌలాః క్షపణ శ్చ కపాలికాః
దిగంబరా శ్చేతిహాసాః వామకా స్తంత్రవాదినః

కౌళాచారులు, క్షపణకులు, కాపాలికులు, దిగంబరులు, ఇతిహాసులు, వామాచారులు, తంత్రవాదులు మాత్రమే బాహ్యపూజలు చేస్తారు. మరి అంతారారాధన?

అంతరారాధనపరా వైదికా బ్రహ్మవాదినః

వైదికులు, బ్రహ్మవాదులు, మోక్షగాములు అంతరారాధన చేస్తారు. అంతరారాధనలో భగవంతుడు భక్తుడు వేరువేరు కాదు. ఇద్దరూ ఒకటే. ఇది అద్వైతస్థితి. ఇక్కడ 381 నుంచి 387 వరకు నామాలలో అంతరారాధనను వివరిస్తున్నాడు.

కుండలినీశక్తి ఆధారచక్రంలో స్వయంభూలింగానికి మూడున్నరచుట్లు చుట్టుకుని నిద్రావస్థలో ఉంటుంది. దానిని గనక నిద్రలేపగలిగినట్లైతే, అది గ్రంథిత్రయాన్ని ఛేదించుకుని సహస్రకమలం చేరి దాన్ని నోటితో కరచి పట్టుకుంటుంది. సహస్రకమలమే చంద్రమండలం. అప్పుడు ఆ చంద్రమండలంలోనుంచి జాలువారే అమృతపుధారలు సాధకుని శరీరంలోని 72 వేల నాడీమండలాన్ని తడుపుతాయి. ఈ విషయాన్ని గతంలో

'కుండలినీశక్తి'లో వివరించాం. ఈ రకంగా గ్రంథిభేదనము చెయ్యటమే రహోయాగము. అయితే కేవలము కుండలినీశక్తిని జాగృతం చేస్తే సరిపోదు. దానివల్ల సాధకుడికి ముక్తిరాదు. కర్మలవల్ల, వేదశాస్త్రపఠనంవల్ల, ముక్తిరాదు. కేవలం జ్ఞానంవల్లనే ముక్తి లభిస్తుంది.

కాబట్టి సాధకుడు జ్ఞాని కావాలి. కర్మలను, వాటియొక్క ఫలితాలను వదలివెయ్యాలి. అతని యొక్క పాపపుణ్యాలు, ధర్మాధర్మాలు అన్నీ కూడా జ్ఞానాగ్నిలో దగ్ధం చెయ్యాలి. అంటే అన్ని రకాల బంధనాలనుండి విముక్తుడు కావాలి. మనసా వాచా కర్మణా ఫలాపేక్షలేకుండా పరమేశ్వరిని సహస్రారంలో అర్చించాలి. అటువంటి సాధకులమీద దేవికి ప్రీతి ఎక్కువ. ఆ సాధనకు ఫలితంగా వారికి ముక్తిని ప్రసాదిస్తుంది. ఆ పరమేశ్వరి. జీవాత్మను పరమాత్మతో ఐక్యం చెయ్యటము అంటే ఇదే.

దేవిని అర్చించేవారికి ఏమి కావాలన్నా వస్తుంది. బాహ్యపూజ చేసేవారికి ఐహికమైన కోరికలు తీరతాయి. అదే అంతఃపూజ చేసే జ్ఞానులకు మోక్షం లభిస్తుంది.

ఇక నామాలను చూద్దాం.

381. రహోయాగక్రమారాధ్యా

సహస్రారమున తన భర్తతో రహస్యముగ విహరించునది. రహోయాగము అంటే అంతర్యాగము. పరమేశ్వరి పూజ రెండువిధాలు అని గతంలో వివరించాం. కాని సందర్భానుసారం మళ్ళీ ఒక్కసారి గుర్తుచేసుకుందాం. బాహ్యపూజ, అంతఃపూజ అని పూజ రెండురకాలు. బాహ్యపూజ అంటే ఎదురుగా దేవి విగ్రహాన్ని కాని, శ్రీచక్రాన్ని కాని ఉంచి చేసేటటువంటిది. ఇది ద్వైతభావనతో కూడిన పూజ. ఇక అంతఃపూజ అంటే అద్వైతభావనతో పూజ ఇందులో భగవంతుడు భక్తుడు ఇద్దరూ ఒకటే. తేడాలేదు. సాధకుడే సాక్షాత్తూ పరబ్రహ్మ. 'అయమాత్మాబ్రహ్మ' అనే మహావాక్యము ఇక్కడ అన్వయించబడుతుంది. పరమేశ్వరుణ్ణి తన శరీరంలోనే ఊహించి, తానే పరమేశ్వరస్వరూపము అని నమ్మి భావనోపనిషత్తులో చెప్పిన ప్రకారం అర్చన చెయ్యటం. ఇది ముఖ్యప్రాణోపాసన.

శంకరభగవత్పాదులవారు తమ సౌందర్యలహరిలోని తొమ్మిదవశ్లోకంలో ఈ విషయం చెబుతూ

మహీం మూలాధారే కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృదిమరుత మాకాశ ముపరి
మనోఽపి భ్రూమధ్యే సకల మపి భిత్త్వాకులపథం
సహస్రారే పద్మే నవ రహసి పత్యా విహరసే ॥

ఓ తల్లీ ! పృథివీతత్త్వమైన ఆధారచక్రము, అగ్నితత్త్వమైన స్వాధిష్ఠానము, జలతత్త్వమైన మణిపూరము, వాయుతత్త్వమైన అనాహతము, ఆకాశతత్త్వమైన విశుద్ధిచక్రము, మనస్తత్త్వమైన ఆజ్ఞాచక్రము దాటి సుషుమ్న ద్వారా సహస్రారంచేరి నీ భర్త అయిన సదాశివునితో కలిసి రహస్యముగ క్రీడించుచున్నావు. గౌడపాదులవారు తమ సుభగోదయస్తుతిలో కుండలినీ ప్రభోదాన్ని వివరిస్తూ నాల్గవశ్లోకంలో

యదా తౌ చంద్రార్కౌ నిజసదన సంరోధ నవశా
దశక్తౌ పీయూష స్రవణహరణే సా చ భుజగీ
ప్రబుద్ధా క్షుత్కృద్ధా దశతి శశినం బైందవగతం
సుధాధారాసారైః స్నపయతి తనుం బైందవకళే ॥

ఆధారచక్రంలో నిద్రావస్థలో ఉన్న కుండలినీశక్తిని అంతర్యాగంచేసి నిద్రలేపినట్లైతే అది షట్చక్రాలను దాటి సహస్రారం చేరి సుధాధారలు కురిపిస్తుంది.

ఇదే విషయాన్ని వామకేశ్వరతంత్రం, తంత్రసారంలో కూడా వివరించారు.

రహస్యముగా కుండలినీశక్తిని జాగృతంచేసి దానితో పుణ్యపాపాలను చిదగ్నిలో హోమం చెయ్యటమే రహోయాగము. జ్ఞానంవల్ల కర్మలన్నీ నశిస్తాయి. కాబట్టి కుండలినీ యాగమే రహోయాగము. ఆపస్తంభ సూత్రాలలో "శాస్త్రాలమీద ఆసక్తి గలవాడికి మోక్షంరాదు. మంచి ఇళ్ళలో నివసించటంవల్ల, భోజనాదులవల్ల, లోకులు మనలను గుర్తించటంవల్ల మోక్షంరాదు. ధృడమైన సంకల్పంగలవాడికి, ఏకాంతజీవనం చేసేవాడికి, ఐహికబంధనాలు వదిలించుకున్నవాడికి, ఆత్మయోగికి, అహింసాపరుడికి మాత్రమే ముక్తి లభిస్తుంది" అని చెప్పబడింది. కాబట్టి పుణ్యపాపాలన్నీ జ్ఞానాగ్నిలో దగ్ధంచేసి, సహస్రారంలో పరమేశ్వరిని అర్చించిన వారికి ముక్తి లభిస్తుంది.

శ్రీచక్రాన్ని అర్చన చేసే వారంతా కూడా అంతర్యాగంలో అదే అర్చనచేస్తారు. శ్రీచక్రంలో ఉన్న ఆవరణలన్నీ మన శరీరంలోనే ఉన్నాయి. శరీరమే శ్రీచక్రం. అదే

చరాచరజగత్తు. నవావరణలు శరీరంలోని భాగాలే అని గతంలో చెప్పాం. కాని అది ముఖ్యమైన విషయం కాబట్టి మళ్ళీ చెబుతున్నాం.

బైందవం బ్రహ్మరంధ్రం చ మస్తకం చ త్రికోణకమ్
లలాటేష్టారకం పత్రం భృవో ర్మధ్యే దశారకం
బహిర్దశారం కంఠేతు మన్వశ్రం హృదయం భవేత్
నాభౌ చ వసుపత్రం చ కట్యాం షోడశపత్రకం
వృత్తత్రయం చ ఊరుభ్యాం పద్భ్యాం భూపురత్రయమ్ ॥

ఈ రకంగా శ్రీచక్రాన్ని శరీరంలోనే భావించి, సహస్రారంలో ఆ పరమేశ్వరిని అర్చించిన జ్ఞానికి మోక్షం లభిస్తుంది.

382. రహస్తర్పణతర్పితా

శ్రీ విద్యోపాసనలో ప్రవేశించాలి అనుకునేవాడు. ఏకాంతమును కోరే ప్రవేశించాలి. శ్రీవిద్యలో ముఖ్యమైన విషయం ఏమంటే పుణ్యపాపాలను, ధర్మాలను ప్రకాశ విమర్శలనే చేతులతో, ఉన్మని అనే సృక్కుతో జ్ఞానమనే అగ్నిలో హోమం చెయ్యాలి. ఇక్కడ హోమగుండంలోని అగ్నికి కట్టెలు అవసరం లేదు. అది జ్ఞానాజ్ఞి. సర్వదా మండుతూనే ఉంటుంది. అటువంటి అగ్నిలో శివాది క్షితి పర్యంతము సర్వస్వాన్ని హోమం చెయ్యాలి. ఇలా చెయ్యటాన్నే రహస్తర్పణము అంటారు. దీనివల్ల దేవి తృప్తి చెందుతుంది. ఈ రకంగా సకలభూతాలను, పుణ్యపాపాలను, ధర్మాధర్మాలను, సకలకర్మలను జ్ఞానాజ్ఞిలో హోమంచేసి ఆ పరమేశ్వరుని తృప్తి పరచినవాడు మోక్షం పొందుతాడు.

అంటే శ్రీవిద్య బ్రహ్మవిద్య. శ్రీవిద్యోపాసకుడికి ధనధాన్యాలు, సిరిసంపదలు, భోగభాగ్యాలు, పదవులు, సన్మానాలు, గౌరవము మొదలైన ఐహికమైన వాంఛలు తీరటమేకాదు. సాయుజ్యం కూడా లభిస్తుంది.

ఐహికమైన కోరికలు తీరాలి అంటే పూజలు, అర్చనలు, వ్రతాలు చెయ్యాలి. కాని సాయుజ్యం కావాలంటే అంతర్యాగం చెయ్యాలి. దానివల్ల పరమేశ్వరి తృప్తి చెందుతుంది. అంతర్యాగము అంటే పరమేశ్వరుడనేవాడు ఎక్కడోలేడు. చరాచరజగత్తంతా ఆవరించి ఉన్నాడు. విశాలమైన విశ్వంలోని ప్రతి అణువు పరబ్రహ్మస్వరూపమే. సాధకుడు కూడా పరబ్రహ్మయే. అయమాత్మాబ్రహ్మ. నాలోనే ఈ పరమేశ్వరుడున్నాడు. నేనే పరబ్రహ్మను.

అని భావించి, ఐహికమైన, సంసారబంధనాలు అన్నీ వదిలించుకోవాలి. అంటే కర్మలనుంచి విముక్తుడు కావాలి. ఈ జన్మలో కర్మలు చేయడు సరే. మరి గతంలో చేసిన కర్మలతాలూకు ఫలితం ఏమవుతుంది ? సాధారణంగా అయితే కర్మల యొక్క ఫలితాన్ని అనుభవించటం చేతనే క్షయం చెయ్యాలి. ఈ రకంగా కల్పాంతము అనుభవించినప్పటికీ కర్మఫలం క్షయంకాదు. ఇక రెండోమార్గం పరమేశ్వరోపాసన. మనోవాక్కాయ కర్మలచే ఆ భగవంతుణ్ణి ప్రార్థించటం. ఆ ప్రార్థనలో తాదాత్మ్యముండాలి. అప్పుడు అతని కర్మక్షయం అవుతుంది. అంటే జ్ఞానాగ్నిలో అతడు చేసిన పాపపుణ్యాలన్నీ హోమం చెయ్యబడతాయి. కర్మలన్నీ క్షయం అయిపోతాయి. ఇదే రహస్తర్పణము. గజేంద్రమోక్షంలో మొసలి కర్మను అనుభవించలేక గజేంద్రుడు ఆ పరమేశ్వరుణ్ణి ప్రార్థించాడు. రహస్తర్పణవల్ల పరమేశ్వరి ఆనందిస్తుంది. అప్పుడు సాధకుడికి ముక్తి లభిస్తుంది.

అయితే అంతర్యాగప్రక్రియలో షట్చక్రభేదనము, చతుర్విధైక్యసంధానము వంటివి గురువు దగ్గర మాత్రమే నేర్చుకోవాలి. ఇది యోగప్రక్రియ. చతుర్విధైక్యసంధానము అంటే

పిండ బ్రహ్మాండయో రైక్యం లింగసూత్రాత్మనో రపి

స్వాపా వ్యాకృతయో రైక్యం క్షేత్రజ్ఞ పరమాత్మనోః ॥

1. పిండ బ్రహ్మాండాలకు ఐక్యము
2. సూక్ష్మ శరీరానికి సూత్రాత్మకు ఐక్యము
3. స్వాపావ్యాకృతులకు ఐక్యము
4. క్షేత్రజ్ఞ పరమాత్మలకు ఐక్యము

ఇవన్నీ గురుముఖైకవేద్యము

383. సద్యఃప్రసాదినీ

రహోయాగము, రహస్తర్పణములవల్ల ఆ పరమేశ్వరి అప్పుడే అనుగ్రహిస్తుంది.

పైన చెప్పిన విధంగా అంతర్యాగం గనక చేసినట్లైతే జీవాత్మ పరమాత్మతో ఐక్యమవుతుంది. అదే దీని ఫలితము. అది అనిర్వచనీయమైన ఆనందము. ఆధారచక్రంలో నిద్రావస్థలో ఉన్న కుండలినీశక్తిని జాగృతంచేసి గ్రంథిత్రయాన్ని ఛేదించినట్లైతే కుండలినీశక్తి

సహస్రదళ కమలంలోని దుద్దును తననోటితో కరిచిపట్టుకుంటుంది. అప్పుడు అప్పటివరకు ఘనీభవించి ఉన్న అమృతము ద్రవీభవించి, కుండలిని యొక్క పంటిగాట్ల గుండా క్రిందికి జాలువారి సాధకుని శరీరంలోని 72 వేల నాడీమండలాన్నీ తడుపుతుంది. అప్పుడు సాధకుడు పొందే ఆనందము అనిర్వచనీయము. అనుభవైకవేద్యము. కుండలినీశక్తి సహస్రదళం చేరటమే జీవాత్మ పరమాత్మలకలయిక. సాధకుడు ఎంత ప్రయత్నంచేసినప్పటికీ పరమేశ్వరి దయలేనిదే ఈ ప్రయత్నం సఫలంకాదు.

384. విశ్వసాక్షిణీ

అనుకోకుండా, ఉన్నట్టుండి, క్షణాలమీద సాధకుడికి ఆత్మజ్ఞానం కలిగిస్తుంది.

చెట్టుకు కాయకాచింది. ఎదిగింది. పండు తిరిగింది. అది ఎప్పుడు రాలిపోతుందో మనం చెప్పలేం. పక్వానికి వచ్చిన పండు ఏ క్షణానయినా రాలిపోవచ్చు. అలాగే నిరంతరము అంతర్యాగం చేసే సాధకుడికి ఆత్మజ్ఞానము ఏక్షణానైనా కలగవచ్చు.

ఆ విధంగా స్వస్వరూపజ్ఞానాన్ని కలిగించేది ఆ దేవి.

ఈ జగత్తునంతటినీ తానే సృష్టించింది. ఇక్కడ జరిగే ప్రతిపనికీ ఆమె సాక్షి. అయినప్పటికీ వేటికీ ఆమె కారణంకాదు.

ప్రపంచంలో జరిగే ప్రతి విషయాన్ని ఆ దేవి సూర్యుడు, చంద్రుడు, కాలము, యముడు, పంచభూతాలసాయంతో చూస్తూనే ఉంటుంది. ఈ విషయాన్ని గతంలో వివరించాం ఈ విధంగా పరమేశ్వరి విశ్వసాక్షి.

385. సాక్షివర్జితా

అన్నింటికీ సాక్షి ఆ పరమేశ్వరియే. ఆమెకు వేరే సాక్ష్యమనేది లేదు. ఈ రకంగా సాక్ష్యాన్ని వర్జించింది కాబట్టి సాక్షివర్జితా అనబడుతుంది.

రెండవవస్తువు అనేది ఏదీ లేదు. పరమేశ్వరికి తనతో సమానమైనవారుకాని, తన కన్న అధికులుగాని ఎవరూలేరు. ఆమె ఏకాకి. కాబట్టి ఆమెకు సాక్ష్యముండటం అసంభవం. సాధకుడు అంతర్యాగం చేశాడు. కుండలినీశక్తిని పైకి పంపి జీవాత్మ పరమాత్మల అనుసంధానం చేశాడు. ఇదే అంతర్యాగానికి ఫలము అని కూడా అన్నాం. మరి దీనికి సాక్ష్యమనేది ఉండదు. అంటే తురీయస్థితికి సాక్ష్యములేదు. అందుచేతనే పరమేశ్వరి సాక్షివర్జితా అనబడుతోంది.

386. షడంగదేవతాయుక్తా

షడంగములు అంటే ఆరు అంగాలు అవి.

1. హృదయము	3. శిఖ	5. కవచము
2. శిరస్సు	4. నేత్రము	6. అస్త్రములు

వీటిని దేవతలతో లేదా తన శక్తులతో ఆవరించినది. పరమేశ్వరుడికి ఆరు అంగాలున్నాయి. వాటినే ఈశ్వరుని లక్షణాలు అని గతంలో చెప్పాం. అవి

1. సర్వజ్ఞత	3. అనాదిబోధ	5. నిత్యత (అలుప్తత)
2. తృప్తి	4. స్వతంత్రత	6. అనంతము

1. సర్వజ్ఞ	–	హృదయదేవి
2. నిత్యతృప్త	–	శిరోదేవి
3. అనాదిబోధ	–	శిఖాదేవి
4. స్వతంత్రత	–	కవచదేవి
5. అలుప్తత	–	నేత్రదేవి
6. అనంతత	–	అస్త్రదేవి

పరమేశ్వరి ఎల్లప్పుడూ ఈ ఆరుగురు అంగరక్షకులతో కలిసి ఉంటుంది. కాబట్టి షడగందేవతా యుక్తా అనబడుతుంది.

పరమేశ్వరి శృతి స్వరూపిణి. అంటే వేదమయి. కాబట్టి శిక్షాకల్పాది అంగములు గలది. అవి.

1. శిక్ష	3. ఛందస్సు	5. జ్యోతిషము
2. వ్యాకరణము	4. నిరుక్తము	6. కల్పసూత్రాలు

వేదానికి ఇవి షడంగాలు. కాబట్టి పరమేశ్వరి షడంగదేవతాయుక్తా అనబడుతుంది.

పరమేశ్వరి ఆరురకాలయిన దేవతలచే పరివేష్టించబడి ఉంటుంది. వారు.

1. అంగదేవతలు	3. ఆవరణదేవతలు	5. ఆమ్నాయదేవతలు
2. ఆయుధదేవతలు	4. నిత్యాదేవతలు	6. పరివారదేవతలు

కాబట్టి షడంగదేవతాయుక్తా అనబడుతుంది.

387. షాడ్గుణ్యపరిపూరితా

పై నామంలో చెప్పిన షడంగదేవతల శక్తులను, గుణములను కలిగిఉన్నది.

ఐశ్వర్యస్య చ సర్వస్య వీర్యస్య యశసః శ్రియః
జ్ఞాన వైరాగ్యయో శ్చైవ షణ్ణాం భగఇతీరణా

1. ఐశ్వర్యము	3. యశము	5. జ్ఞానము
2. వీర్యము	4. శ్రీ	6. వైరాగ్యము

అనేటటువంటి పురాణాలలో చెప్పబడిన గుణములతో పరిపూర్ణమైనటువంటిది. కాబట్టి షాడ్గుణ్యపరిపూరితా అనబడుతోంది.

ఈరకంగా ఇక్కడ రహోయాగము, దానివల్ల వచ్చే ఫలితము చెప్పబడ్డాయి.



శ్రీ 'అః'కార దేవి

33. ప్రభావిద్య

గతంలో తరుణీవిద్యను ఉపదేశించారు. ఇప్పుడు తరుణీవిద్యకు అంగభూతమైన ప్రభావిద్యను ఉపదేశిస్తున్నారు.

ఆ పరమేశ్వరి కోటిసూర్యప్రభలతో వెలుగొందుతూ ఉంటుంది. ఇక్కడ కోటి అనే నామం సంఖ్యావాచకం కాదు. అనేకానేకమైనటువంటి, లెక్కలేనటువంటి కాంతి కిరణములతో ఆ పరమేశ్వరి విరాజిల్లుతుంటుంది. భైరవయామళంలో పరమేశ్వరుడుపార్వతీ దేవికి శ్రీవిద్యను వివరిస్తూ పంచభూతాలు, తన్మాత్రలు, ఇంద్రియాలు, మనస్సు, మాయ, శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు ఈ ఇరవైఐదు తత్త్వాలకు అతీతంగా ఆ పరమేశ్వరి బిందువునందు ఉంటుంది. ఆమె శరీరం నుంచి ప్రకాశవంతమైన కాంతికిరణాలు వస్తున్నాయి. ఆ కిరణాలు వేయి, రెండువేలు, లక్ష, కోటి, అర్బుదము ఇంకా లెక్కపెట్టటానికి వీలుకాదు అంటున్నాడు. అంటే లెక్కపెట్టలేనన్ని, లెక్కపెట్టటానికి వీలుకానన్ని కిరణాలు ఆ పరమేశ్వరి శరీరం నుంచి వస్తున్నాయి. ఆ కిరణాలవల్లనే ఈ చరాచరజగత్తంతా ప్రవర్తిల్లుతున్నది.

బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుణ్ణి జనకమహారాజు అడుగుతాడు.

జనకుడు : స్వామీ ! ఈ జగత్తులోని కార్యక్రమాలన్నీ దేనివల్ల జరుగుతున్నాయి?

యాజ్ఞవల్క్యుడు : సూర్యుని యొక్క వెలుగువల్ల. సూర్యుని వెలుగులోనే జీవులన్నీ కూడా తమకు కావలసినచోటికి పోయి, మళ్ళీ ఆ వెలుగులోనే తిరిగివస్తాయి. తమ కిష్టమైన కార్యాలు చేస్తాయి.

జ: మరి సూర్యకాంతులు ఎప్పుడూ ఉండవుకదా ? సూర్యుడు లేనప్పుడు ఏరకంగా కార్యక్రమాలు జరుగుతాయి ? అంటే రాత్రులందు ఏరకంగా జరుగుతుంది.

యా: చంద్రునికాంతులతో చంద్రుని కాంతిలో జనులు తమ పనులు నిర్వర్తించుకుంటారు.

జ: సూర్యుడు చంద్రుడు ఇద్దరూ లేనప్పుడు అంటే సంధ్యవేళలయందు కార్యక్రమాలు ఏరకంగా జరుగుతాయి ?

యా : అగ్నికాంతులతో అంటే దీపపువెలుగులతో జరుగుతాయి.

జ: అయితే సూర్యుడు, చంద్రుడు, అగ్ని ఎవరూ లేనప్పుడు కార్యక్రమాలు ఎలా జరుగుతాయి?

యా : వాక్కువల్ల, వాక్కు అనేది ఒక వ్యక్తి నుంచి ఇంకొక వ్యక్తికి చేరుతుంది. దానివల్ల పనులు జరుగుతాయి.

జ: మరి వాక్కు కూడా లేప్పుడు ఎలా జరుగుతుంది ? అంటే సూర్యుడు చంద్రుడు అగ్ని వాక్కు లేవు. అంతా చీకట్లు, అప్పుడు ఏం జరుగుతుంది ?

యా : ఆత్మవల్ల జరుగుతుంది. పెనుచీకట్లు దాటిన తరువాత ఆత్మ యొక్క కాంతులవల్ల జగత్తంతా ప్రవర్తిల్లుతుంది. అసలు ఆత్మ యొక్క కాంతులతోనే చరాచరజగత్తు అంతా నడుస్తున్నది. అని చెబుతాడు. కాబట్టి పరమేశ్వరి నుంచి వచ్చే కిరణాలవల్లనే ఈ జగత్తు అంతా నడుస్తున్నది. ఆ కిరణాలలో అగ్ని 108, సూర్యుడు 116, చంద్రుడు 136 కిరణాలను గ్రహించగలిగారు. ఇప్పుడు సూర్యుని కాంతివల్ల పగలు, చంద్రకాంతుల వల్ల రాత్రి, సంధ్యవేళలయందు అగ్నికాంతులవల్ల జీవకోటి సంచరిస్తున్నది.

ఈ రకంగా అనేకకోట్ల కిరణసముదాయము ఆమె శరీరం నుంచి వస్తుంది. అసలు పరమేశ్వరి అంటే దివ్యమైన తేజోమయమైన కాంతి పుంజము. అందుకే ఆమె ప్రభావతి, ప్రభారూపా అనబడింది. ఆమె మూలప్రకృతి. వ్యక్తావ్యక్తస్వరూపిణి. వివిధాకారాలతో జగత్తంతా వ్యాపించి ఉన్నది. భక్తుల అజ్ఞానపు చీకట్లను పారద్రోలి జ్ఞానజ్యోతులు ప్రసాదిస్తుంది. ఆ దేవి విషయం 388 నుంచి 404 వరకు నామాలలో చెప్పబడింది.

388. నిత్యక్లిన్నా

నిత్యము దయతో ఆర్ద్రమైనది. కరుణానిధి. 'భక్తిముక్తులనిచ్చునది నిత్యక్లిన్న అను త్రిపురాదేవి' అని గరుడపురాణంలో చెప్పబడింది.

పరమేశ్వరి అత్యంత దయార్ద్రమైన హృదయము గలది. ఈ సృష్టి అంతా పరమేశ్వరి యొక్క సంతానమే. అటువంటి విశ్వము అంతటి పైనా దయగలది.

షోడశనిత్యలలో మూడవది.

389. నిరుపమా

సాటిలేనిది. వేదాలలో 'ఈమెకు సాటిలేదు' అని చెప్పబడింది.

పరమేశ్వరి యొక్క దయను గురించి చెప్పటానికి ఈ జగత్తులో నామరూపాలతో ఉన్న పదార్థం ఇంకొకటి లేదు. నిర్ ఉపమా. ఇంకొక ఉపమానము ఏదీలేదు. అందుచేతనే పరమేశ్వరి నిరుపమా అనబడింది. శ్రుతులలో ఏకమేవాద్వితీయం బ్రహ్మ ఒకటే ఉన్నది. రెండవది లేనిది. అదే పరబ్రహ్మ వాక్కుతో చెప్పటానికిగాని, కంటితో చూడటానికిగాని, మనస్సుతో భావించటానికిగాని రెండవది అనేది లేదు. ఇంకొక రూపము నామము లేని శుద్ధజ్ఞానస్వరూపము.

390. నిర్వాణసుఖదాయినీ

భాషలో వ అనే అక్షరానికి బ అనే అక్షరానికి తేడాలేదు. అందుచేత నిర్వాణము అనే మాటను నిర్బాణము అని తీసుకోవాలి. బాణము – శరీరము. నిర్బాణము. శరీరము లేనిది. ఇది వేదార్థం. వేదములో బాణము అనే శబ్దం శరీరానికి వాడబడింది.

నిర్వాణము అంటే అశరీరము. నిర్వాణసుఖమునిచ్చునది. మరణానంతరమువరకు సుఖము నిచ్చేది. ఇక్కడ సుఖము అంటే శాశ్వతసుఖము. అదే మోక్షము. కాబట్టి మరణానంతరము మోక్షము నిచ్చేది. నిత్యక్లిన్న, నిరుపమ అయిన దేవిని గనక అర్చించినట్లైతే వచ్చే ఫలము నిర్వాణసుఖము.

పరమేశ్వరిని అర్చిస్తే ఇహపరాలు రెండూ లభిస్తాయి. పరము అంటే అపరిమితమైన మోక్షము. అదే పరబ్రహ్మ స్థితి. పరబ్రహ్మకు ఏరకమైన క్రియలు ఉండవు. అటువంటి బ్రహ్మజ్ఞానస్థితి కలుగచేస్తుంది. కాబట్టే నిర్వాణసుఖదాయినీ అనబడింది. తన భక్తులకు వైరాగ్యాన్ని కలుగచేసి, వారికర్మలకు తగినఫలితమునిచ్చి, కర్మపరిపక్వత చెందిన తరువాత మోక్షం ప్రసాదిస్తుంది.

391. నిత్యాషోడశికారూపా

నిత్యలు పదహారు. వీటినే షోడశనిత్యలు అంటారు. వామకేశ్వరతంత్రంలో

1. కామేశ్వరి	7. శివదూతి	13. సర్వమంగళ
2. భగమాలిని	8. త్వరిత	14. జ్వాలామాలిని
3. నిత్యక్లిన్న	9. కులసుందరి	15. చిత్ర
4. భేరుండ	10. నిత్య	16. మహానిత్య
5. వహ్నివాసిని	11. నీలపతాక	
6. మహావజ్రేశ్వరి	12. విజయ	

వశిష్ఠ సంహితలో మొదటి నిత్య మహాత్రిపురసుందరి. అని చెప్పబడింది. మిగిలినవి కామేశ్వరి నుంచి చిత్ర వరకు పదిహేనునిత్యలు. ఈ రకంగా ఉన్న పదహారునిత్యలలోనూ మహాత్రిపురసుందరి లేదా మహానిత్య ఆ పరమేశ్వరి. ఈ నిత్య మిగిలిన వాటితో కలుస్తుంది. ఏవిధంగా అంటే....... పరమేశ్వరి అర్చనా విధానంలో నిత్యాదేవతలను అర్చించటం ఒక పద్ధతి. అందులో ప్రతిరోజూ, ఆ రోజున ఉన్న తిథి నిత్యను పూజిస్తారు. ఆ విధంగా

పాడ్యమిరోజున కామేశ్వరి, విదియ భగమాలిని, పౌర్ణమి చిత్ర. వీటిని తిథి నిత్యలు అంటారు. ఆ తిథి నిత్యతోపాటుగా మహానిత్య లేదా మహాత్రిపురసుందరిని కూడా ప్రతిదినం విధిగా అర్చించాలి. ఈ రకంగా పరమేశ్వరి స్వరూపమైన మహాత్రిపురసుందరి మిగిలిన అన్ని నిత్యలతో కలుస్తుంది. కాబట్టి ఆ దేవి నిత్యాషోడశికారూపా అనబడుతోంది.

ఆ పరమేశ్వరి నిత్యాయాగముతో సంతోషిస్తుంది. నిత్యమూషోడశి మంత్రరూపంలో ఉండేది. శక్తిరహస్యంలో "కోటివాజపేయాలకన్న, షోడశియాగాల కన్న మహాషోడశి మంత్రాన్ని ఒకసారి పలికే వారి కోరికలను పరమేశ్వరి తీరుస్తుంది" అని చెప్పబడింది. అంటే షోడశిమహామంత్రజపానికి అంత ప్రాముఖ్యత ఉన్నది అని అర్థం.

పరమేశ్వరి షోడశకళాస్వరూపిణి. మిగలిన పదిహేను నిత్యలు ఆమెకు అంగనిత్యలే. అంగి అయిన పరమేశ్వరి వ్యష్టిగ, సమిష్టిగా షోడశనిత్యాకలారూపిణి. అందుచేతనే నిత్యాషోడశికారూపా అనబడుతోంది.

ఈ పదహారుకళలలోను మహాత్రిపురసుందరి సాదాఖ్యకళ. అదే ధృవకళ, బ్రహ్మకళ, చిత్కళ, ఇదే పరమాత్మ స్వరూపం. మిగిలిన కళలు దీని నుంచే పుట్టి లయమవుతున్నాయి.

నిత్య కాలాన్ని సూచిస్తుంది. పదిహేను నిత్యలు పదిహేను తిథులరూపాలు. తిథి అంటే ఒక పగలు ఒక రాత్రి. అదే శివశక్తి స్వరూపము.

పదిహేను తిథులు	–	ఒక పక్షము
రెండుపక్షములు	–	ఒక మాసము
ఆరుమాసములు	–	ఒక ఆయనము
రెండు ఆయనములు	–	ఒక సంవత్సరము

హయనాత్మా మహాదేవః ప్రజాపతిరితిస్మృతి

కాలపురుషుడే ప్రజాపతి. కాబట్టి నిత్యాస్వరూపమైన పరమేశ్వరియే కాలము.

392. శ్రీకంఠార్ధశరీరిణీ

శ్రీ అనగా విషము. విషమును కంఠమునందు గలవాడు పరమేశ్వరుడు. ఆ పరమేశ్వరుని యొక్క శరీరమందు అర్ధభాగము గలది. అనగా పరమేశ్వరుని యొక్క భార్య పరమేశ్వరి.

నిరాకారుడు నిర్గుణస్వరూపుడు అయిన పరబ్రహ్మ సృష్టి చెయ్యాలని సంకల్పించి తానే రెండుగా మారాడు. తనలో నుంచి కొంతభాగాన్ని బయటకు పంపాడు. ఆ రకంగా బయటకు వచ్చిన శక్తియే పరమేశ్వరి. పరమేశ్వరుడు ప్రకాశాంశకాగా శక్తి విమర్శాంశ. కాబట్టి ఆమె పరమేశ్వరుని అర్ధశరీరిణి అనబడుతోంది.

దేవీభాగవతంలో చింతామణి గృహంలో శ్రీచక్రాసనం మీద పరమేశ్వరిని వర్ణిస్తూ ఆ ఆసనం మీద భువనేశ్వరుడున్నాడు అని చెప్పి అతని యొక్క

వామాంకే షణ్ణిషణ్ణా స్వదేవీ శ్రీభువనేశ్వరీ

యా దేవీ నిజలీలార్థం ద్విధాభూతాబభూవహ

వామాంకము మీద భువనేశ్వరీదేవి ఆసీనురాలయి ఉన్నది. అయితే వారిద్దరూ వీరుకాదు. తన యొక్క లీలా వినోదం కోసం పరమేశ్వరి రెండుభాగాలయింది అని చెప్పబడింది. అందుచేతనే ఆమె పరమేశ్వరునికి అర్ధశరీరిణి.

ఇక్కడ అర్ధాంగి అంటే ఒకే దేహంలో ఒక భాగం ఒకరు, ఇంకొకభాగం ఒకరు కాదు. ఇద్దరూ ఒకటే అంటే ప్రతి అణువులోనూ శివభాగము, శక్తిభాగము రెండూ ఉంటాయి. అలాంటి అణువులచేతనే దేహం నిర్మించబడింది. ఈ రకంగా వారు అర్ధశరీరులు. ఇదే విషయం ఉపనిషత్తులలో కూడా చెప్పబడింది.

మాతృకాకోశములో అ కారము అంటే – శ్రీకంఠుడు, ఇంద్రుడు, నొసలు, కేశవుడు అని చెప్పబడింది. అటువంటి శ్రీకంఠుని అర్ధాంగి. అనగా వాగ్రూపమైన దేవి. అక్షరాల న్నింటిలోనూ అకారము శ్రేష్ఠమైనదేవి. గీతలో భగవానుడు **అక్షరాణా అకారోస్మి** అంటాడు. అ కారము పరబ్రహ్మస్వరూపం. అటువంటి అకారంలో అర్ధశరీరిణి. పరా పశ్యంతి మధ్యమ వాక్కు అస్పష్టమైనవి. వాటికి అచ్చులు కలిస్తేనే అవి పూర్తివైఖరీవాక్కు అవుతాయి.

అటువంటి అకారంలో అర్ధభాగం. అందుకే పరమేశ్వరి శ్రీకంఠార్ధశరీరిణి అనబడుతోంది.

393. ప్రభావతీ

ప్రభా అనగా కాంతి అని అర్ధం. పరమేశ్వరి కొన్నికోట్ల సూర్యచంద్రుల కాంతులు గలది.

ప్రభా అంటే అణిమాది ఆవరణ దేవతలు. పరమేశ్వరి అణిమాది ఆవరణ దేవతలతో ఆవరించబడినది.

ఆ దేవి కాంతినిప్రసరింపచేసే సూర్యచంద్రులకే కాంతులనిస్తుంది. భైరవ యామళంలో చెప్పినట్లుగా

జ్యోతిరూపాపరాకారా యస్యాదేహోద్భవాశ్శివే !

కిరణా శ్చసహస్రం చ ద్విసహస్రంచ చ లక్షకమ్

కోటిరర్బుదమేతేషాం పరాసంఖ్యా న విద్యతే.

జ్యోతిరూపమైనటువంటి ఆమె దేహము నుంచి కోట్లకొలది కిరణాలు ప్రకాశిస్తున్నాయి. ఆ కిరణాలకు లెక్కలేదు. అవి అనంతమైనవి. వాటినుంచి

అష్టోత్తరశతంవహ్నేః షోడశోత్తరశతంరవేః ।

షట్త్రింశత దుత్తరశతం చంద్రస్యకిరణా శ్శివే ! ॥

108 కిరణములను అగ్ని, 116 కిరణములు సూర్యుడు, 136 కిరణములు చంద్రుడు గ్రహించారు. ఇవి మొత్తం 360 కిరణా. వీటివల్లనే పగలు రాత్రి కలుగుతున్నాయి. కాలచక్రం తిరుగుతోంది. అని చెప్పబడింది.

కాబట్టి పరమేశ్వరి అంటే తేజోమయమైన కాంతిపుంజము.

ఆ పరమేశ్వరి అణిమాది అష్టసిద్ధులచేతను, విద్యాస్వరూపమగు వశిన్యాదివాగ్దేవతల చేతను ఆవరించబడిఉన్నది.

బహు ప్రభావముగల కుండలినీశక్తియే ప్రభావతి. ఆధారచక్రం నుంచి షట్చక్రాలను గ్రంథిత్రయాన్ని ఛేదించుకుని సహస్రారం చేరుతుంది. ఈ త్రోవలో ఆజ్ఞాచక్రం చేరినప్పుడు ఆ కుండలినీశక్తిని జ్యోతిష్మతీ, ప్రభావతి అని కీర్తిస్తారు.

394. ప్రభారూపా

ప్రభారూపములైన అణిమాది దేవతలే శరీరముగా గలది. పరమేశ్వరి మనోమయి కాంతిమయి.

కోటిసూర్యుల కాంతియే రూపముగా గలది. పరమేశ్వరి రూపము తేజోమయమైన కాంతిపుంజము. దేవీభాగవతంలో ఆ దేవి.

చతుర్దిక్షు చతుర్వేదమూర్తిమద్భి రభిష్టుతమ్

కోటిసూర్యప్రతీకాశం చంద్రకోటి సుశీతలమ్

విద్యుత్కోటి సమానాభ మరుణం తత్పరం మహః ॥

రూపుదాల్చిన నాలుగువేదాలచేత స్తుతించబడుతున్నది. కోట్లకొలది సూర్యుల కాంతులతో, విరాజిల్లుతూ కోట్లకొలది చంద్రుల చల్లదనము గలిగిఉన్నది. ఆ రూపము కొన్నికోట్ల మెరుపులు ఒక్కసారి మెరిసినట్లుగా తళుక్కున మెరిసింది. అరుణారుణకాంతులు వెదజల్లుతున్నది.

అందుచేతనే ఈశావాస్యోపనిషత్తులో సాధకుడు బ్రహ్మలోకానికి బయలుదేరాడు. బ్రహ్మలోకానికి తలవాకిలి సూర్యమండలము. ఆ మార్గమంతా తేజోమయమైన సూర్య మండలము. తేజోమయమై కాంతిపుంజముతో కప్పబడి ఉంటుంది. ఆ కాంతిలో బ్రహ్మ లోకానికిపోయే త్రోవకూడా కనపడదు. అందుచేత సాధకుడు పరమాత్మను తన కాంతిని కొంత ఉపసంహరించుకోమని కోరతాడు అని చెప్పబడింది. ఈ రకంగా పరమేశ్వరి తేజోమయమైన కాంతిపుంజము. అందుచేతనే ఆమె ప్రభారూపా అని చెప్పబడుతుంది.

395. ప్రసిద్ధా

అందరిచేతను నేను 'అహం' అని తెలియబడుటచే ప్రసిద్ధమైనది. దేవీభాగవతంలో

సర్వచైతన్యరూపాం తా మాద్యాం విద్యాం చ ధీమహీ
బుద్ధిం యా నః ప్రచోదయాత్

సర్వచైతన్యరూపము గల ఆదివిద్యను ధ్యానిస్తున్నాను అని చెప్పబడింది. అంటే అది ప్రసిద్ధమైన రూపము.

ప్రపంచంలో ఉన్నవారంతా, తమకు తెలిసినా తెలియకపోయినా నేను, నాది అని చెప్పుకునే అహం వాచకముగా ప్రసిద్ధమైనది. **వేదైశ్చ సర్వైరమమేవ వేద్యః** అన్నివేదాల యందు అహం అని తెలుసుకోతగినది. జీవి యందు అహం రూపంలో ప్రసిద్ధమైనది.

ప్రపంచంలోని ప్రతి గ్రామంలోనూ కూడా ఏదో ఒక రూపంలో పూజింపబడుతూనే ఉన్నటువంటిది. ఈ రకంగా ప్రసిద్ధి పొందినది కాబట్టే ఆమె ప్రసిద్ధా అనబడుతోంది.

396. పరమేశ్వరీ

పరాత్పరురాలైన ఈశ్వరి. ప్రసిద్ధమైన దేవత. ఈ జగత్తులో జీవులకు వారి వారి కర్మల ననుసరించియే దేహము, ఇంద్రియాలు వస్తాయి. కర్మ ఎప్పుడైతే నశిస్తుందో దేహము కూడా అప్పుడే నశిస్తుంది. మళ్ళీ సంచితకర్మ అనుభవించటానికి జీవి ఈ లోకంలో పుడుతుంది.

ఈ రకంగా జీవి ఈ లోకంలో జన్మిస్తూ, కర్మచేస్తూ, కర్మఫలాన్ని అనుభవించి మరణిస్తూ, మళ్ళీపుడుతూ ఉంటుంది. కర్మక్షయమయ్యే దాకా ఈ విధంగానే జరుగుతుంది. ఈ రకమైన కర్మసంబంధములేనిది పరమేశ్వరి.

397. మూలప్రకృతిః

చరాచరజగత్తుకూ మూలమైనటువంటిది. ప్రకృతి అంటే ఈ జగత్తుకు కారణ భూతమైనది ఆ పరమేశ్వరి.

జగత్తులోని ప్రతివస్తువుకు ఏదో ఒకటి మూలమున్నది. జీవులు పుట్టాలి అంటే తల్లితండ్రులు కావాలి. అలాగే అన్ని జీవాలకు పృథివియే యోని.

ఆ భూమి	–	జలం నుంచి పుట్టింది
జలం	–	అగ్ని నుంచి పుట్టింది
అగ్ని	–	వాయువు నుంచి పుట్టింది
వాయువు	–	ఆకాశం నుంచి పుట్టింది
మరి ఆకాశము	–	పరబ్రహ్మ నుంచి పుట్టింది.

ఆ పరబ్రహ్మ – బ్రహ్మపదార్థమే. దానికి మాతృకలేదు. పరబ్రహ్మకు చావుపుట్టుకలు లేవు. అన్నింటికీ ఆ బ్రహ్మయే కారణము. దానికి కారణము ఏదీ లేదు. కాబట్టి బ్రహ్మయే మూలప్రకృతి. అందుకనే పంచరాత్రమందు "వేదమాత, జగన్మాత అయిన సరస్వతి పుట్టింది. ఆమెకు కారణంలేదు. ఆమె మూలప్రకృతి" అని చెప్పబడింది.

నియమితకాలంలో పరిపక్వమైన కర్మలను మాత్రమే జీవులు అనుభవిస్తాయి. మరి అపరిపక్వంగా ఉన్న కర్మను అనుభవించటానికి లేదు. కర్మ చెయ్యగానే దానియొక్క ఫలితం రాదు. కొంతకాలం పడుతుంది. బాగా తిన్న తరువాత కడుపునొప్పి రావటానికి సమయం పట్టినట్లుగా, అందుచేత పరిపక్వమైన కర్మను అనుభవించగానే ప్రళయం సంభవిస్తుంది. అప్పుడు ఈ జీవరాశి అంతా మాయలో కలిసిపోతుంది. ఆ మాయ పరమేశ్వరునిలో లీనమైపోతుంది. అపరిపక్వంగా ఉన్న కర్మ పరిపక్వం అయ్యేదాకా మళ్ళీ సృష్టి జరగదు. ఈ రకంగా జీవులను ఆవిర్భవింపచేసి, వాటితో కర్మను అనుభవింపచేసేదే మూలప్రకృతి.

కొంతకాలం తరువాత అవ్యక్తము అంటే మాయ. ఆ మాయ లేదా అవ్యక్తము నుంచి మహతత్త్వము, దాని నుంచి తమోగుణ ప్రధానమైన అహంకారము పుట్టినాయి. ఈ రకంగా త్రిగుణాలే ప్రధానంగా సృష్టి జరిగింది. దీనిని గతంలో వివరించాము.

అటువంటి సృష్టి అంతటికీ మూలమైనది మూలప్రకృతి. సృష్టి స్థితి లయ తిరోదానము అనుగ్రహము అనే పంచకృత్యాలను నడిపేదే మూలప్రకృతి.

దేవీభాగవతంలో "చరాచరజగత్తును సృష్టించటం కోసం పరమేశ్వరి.

1. దుర్గ 2. లక్ష్మి 3. పార్వతి 4. సావిత్రి 5. రాధ

అను ఐదురూపాలు పొందింది. అవే పంచశక్తులు అని చెప్పబడింది. ఈ పంచశక్తులకు కారణమైనది మూలప్రకృతి.

398. అవ్యక్తా

ఇక్కడ నుండి క్రమంగా ఆ పరమేశ్వరిని సకలరూపాలతోను కీర్తిస్తున్నారు.

అవ్యక్తము – కంటికి కనిపించనిది. మాయ యొక్క ప్రకాశరూపము సాంఖ్యసప్తతిలో

సూక్ష్మలింగ మచేతనమ్ అనాదినిధనం తథా ప్రసవధర్మి ।
ని వయవమేకమేవహి సాధారణమేతద్వ్యక్తమ్ ॥

అవ్యక్తము అంటే సూక్ష్మము. లింగభేదము లేనిది. చేతనము కానిది. ఆద్యంతరహితమైనది. సృష్టియందు సమర్ధమైనది, అవయవములులేనిది, ఏకమైనది, విశ్వవ్యాప్తమైనది అని చెప్పబడినది. పంచశిఖాచార్యుడు కూడా "ఆదిమధ్యలులేనిది, మహత్తునకు అవతలది, అవ్యక్తమనబడుతుంది" అన్నాడు. సత్వరజస్తమస్సులు బ్రహ్మ యొక్క గుణాలు కావు. అవి అవ్యక్తము యొక్క ధర్మాలు పరబ్రహ్మ అవ్యక్తపదముచేత చెప్పబడుతున్నది. అది కనులచే గ్రహించబడదు. వాక్కుచే వర్ణించబడదు. శ్రోత్రములచే వినబడదు. ఇతరులైన దేవతలచేతగాని, కర్మచేతగాని, తపస్సుచేతగాని పొందజాలనిది.

అనేక రూపములలో ఉంటుంది. కాని బ్రహ్మ ఇలా ఉంటుంది అని చెప్పటానికి లేదు.

సృష్టిలో ప్రథమసృష్టి మూలప్రకృతి యొక్క అవాఙ్మానస గోచరము. ఇదే మహామాయ అనబడుతుంది. ఇంద్రియాలకు గోచరము కాదు కాబట్టి అవ్యక్తము అనబడుతుంది. ప్రళయకాలంలో నామరూపాత్మకమైన ఈ జగత్తును తనలో లీనం చేసుకుంటుంది. అంటే అస్పష్టమైన పదార్థాలన్నింటినీ కలిగి ఉంటుంది. కాబట్టి అవ్యక్తా అనబడుతుంది.

సుషుప్తావస్థలో ఇంద్రియాలన్నీ పనిచెయ్యటం మానివేస్తాయి. అప్పుడు మిగిలేది ఆత్మ ఒక్కటే. ఆత్మ కూడా నిజరూపంలో మిగులుతుంది. సుషుప్తిలో జాగ్రదావస్థలో చేసిన పనులన్నీ మరిచిపోతాడు. అందుకే తనకేమీ తెలియదని, తాను సుఖంగా ఉన్నానని అంటాడు. ఆ సమయంలో అతననుభవించిన భోగమంతా ముఖ్యప్రాణంలో లయమవుతుంది. ఇదే అవ్యక్తము.

399. వ్యక్తావ్యక్తస్వరూపిణీ

వ్యక్తము అంటే మహతత్త్వము. ఇది అవ్యక్తము నుంచి వచ్చినది. అంతటా వ్యాపించినది. సృష్టిలో మొదటగా అవ్యక్తము నుంచి మహతత్త్వము, మహతత్త్వమునుంచి అహంకారము పుట్టినాయి. ఈ రకంగా అవ్యక్తమైనది ఆ పరమేశ్వరియే. వ్యక్తమైనది కూడా ఆ పరమేశ్వరియే. అందుకే ఆమె వ్యక్తావ్యక్తస్వరూపిణి అనబడుతుంది. జగత్తులో ఉన్నటు వంటి తత్త్వముల రూపంలో ఉంటుంది. కాబట్టి పరమేశ్వరి వ్యక్తరూపిణి. బ్రహ్మవైవర్త పురాణంలో 1.వ్యక్తము 2. అవ్యక్తము 3. వ్యక్తావ్యక్తము అని మూడు లింగాలు ఉన్నాయి. అవే క్రమంగా 1. స్వాయంభువము 2. బాణలింగము 3. శైలలింగము స్వాయంభువ లింగము–తనంత తాను పుట్టినది. బాణలింగము నదిలో పుట్టినది. శైలలింగము రాతితో చేయబడినది. వీటిలో అవ్యక్తలింగము మోక్షమిస్తుంది. వ్యక్తలింగము ఇహపరసుఖాలనిస్తుంది.

జగత్తులోని అన్ని ఆకారాలు ఈ వ్యక్తరూపము నుంచే ఉద్భవించినాయి. ఇదే మహతత్త్వస్వరూపము. వ్యక్తము కార్యరూపంలోను, అవ్యక్తము కారణరూపంలోను ఉంటాయి. ఈ రకంగా వ్యక్తము అవ్యక్తము కూడా పరమేశ్వరియే కాబట్టి ఆ దేవి వ్యక్తావ్యక్తస్వరూపిణి అనబడుతుంది.

400. వ్యాపినీ

సమస్త జగములందు వ్యాపించినది. సాత్విక, రాజస, తామస సృష్టులందు వ్యాపించినది. అంటే సృష్టి అంతాగుణమయమే కాబట్టి త్రిగుణాత్మకమైనది. అహంకారము నుంచి భూమి వరకు జగత్తు అంతా వ్యాపించినది. నామరూపాత్మకశాఖ ద్వారా సర్వజగత్తునూ ఆవరించినది. ఆత్మరూపంలో అన్నిజీవుల యందు ఆవరించినది. జగత్తంతా ప్రకాశరూపంలో అనగా ఆత్మరూపంలో ఆవరించినది. విమర్శరూపంలో అన్ని రూపాలను పొందినది. ఈ రకంగా లోపలా బయటా కూడా చరాచరజగత్తంతా ఆవరించినది. కాబట్టి ఆ దేవి వ్యాపినీ అనబడుతున్నది.

401. వివిధాకారా

ఇందాక చెప్పిన నామాన్నే ఇంకా వివరిస్తున్నారు. ఆ పరమేశ్వరి నామ రూపాత్మకంగా జగత్తంతా వివిధాకారాలతో వ్యాపించి ఉన్నది. నామాత్మకంగా అంటే జగత్తులోని అన్ని నామాలూ ఆ పరమేశ్వరివే. రూపాత్మకము అంటే అన్నిరూపాలు ఆ దేవివే. కాబట్టి బ్రహ్మ మొదలు స్తంభము పర్యంతము నామరూప భేదాలతో విరాజిల్లుతున్నది ఆ పరమేశ్వరి. 25 తత్త్వములు ఆ పరమేశ్వరి రూపమే. అందుచేతనే ఆ దేవి వివిధాకారా అనబడుతోంది.

లోకంలో భగవంతుణ్ణి రాముడని, కృష్ణుడని, అల్లాఅని, ఏసుఅని ఇలా అనేకపేర్లతో అనేక మతాలవారు ఆరాధిస్తుంటారు. ప్రపంచంలోని మానవులు ఎన్ని రకాల ఆభరణాలు ధరించినా, వాటిలోని బంగారం ఒకటే. అలాగే దేవతామూర్తి ఏదైనా అందులోని పరమేశ్వరుడు ఒక్కడే. అంటే వివిధమైన జీవులుగా జన్మించి వారిచేత వివిధ ఆకారాలలో పూజించబడుతున్నాడు. ఈ రకంగా వివిధమైన ఆకారాలు ధరించి ఉన్నాడు.

సృష్టి పదిరకాలుగా జరుగుతోంది. అవి

1. మహత్సృష్టి
2. అహంకారసృష్టి
3. భూతసృష్టి
4. ఇంద్రియసృష్టి
5. అష్టవిధ దేవసృష్టి
6. షడ్విధ ప్రాకృత తమస్సృష్టి
7. వనస్పతి సృష్టి ఇది ఆరురకాలు
8. తిర్యక్సృష్టి ఇది 28 రకాలు
9. మానవసృష్టి
10. కుమారసృష్టి

పరమేశ్వరి వివిధకారలైన అన్ని సృష్టులయందు ఉంటుంది. కాబట్టే వివిధాకారా అనబడుతుంది.

402. విద్యాఽ విద్యాస్వరూపిణీ

విద్య అవిద్య ఈ రెండింటి స్వరూపము ఆ దేవి. ఈశావాస్యోపనిషత్తులో విద్య అవిద్యల గురించి చెప్పబడింది. అవిద్యను ఆరాధించేవారు అంటే ఆత్మజ్ఞానం లేకుండా కర్మలను ఉపాసించేవారు గాడాంధకారంలో పడిపోతారు. కర్మలను వదిలిపెట్టి కేవలం ఉపాసనలో పడ్డవారు ఇంకా అంధకారంలో పడిపోతారు. అందుచేత జ్ఞానరహితమైన ఉపాసనవల్లగాని, ఉపాసనరహితమైన జ్ఞానంవల్లగాని సద్గతి కలుగదు. వీటిని విడివిడిగా అనుష్ఠించేవారు ఆత్మజ్ఞానానికిదూరమై తామసలోకాలకుపోతారు. ఆత్మజ్ఞానానికి ఉపాసన, కర్మాచరణ రెండూ ముఖ్యమే. అప్పుడే సత్ఫలితం ఉంటుంది. విద్యను ఉపాసించటంవల్ల దేవలోకము, అవిద్యను ఉపాసించటంవల్ల పిత్రులోకము వస్తాయి. వీటినే ఉత్తరదక్షిణాలు అంటారు. ఈరెండూ తెలిసినవారు అవిద్య అంటే కర్మలచే మృత్యువును జయించి, విద్యతో దైవత్వం పొందుతాడు. విద్య అవిద్య రెండూ పరమేశ్వర స్వరూపాలే.

ఈ రెండింటినీ సమానంగానే ఉపాసించాలి. “అవిద్యవల్ల శరీరాన్ని వదలి, విద్యతో జన్మరాహిత్యం పొందాలి. జగత్తును దాటటానికి కర్మాచరణ, జన్మరాహిత్యానికి ఉపాసన

రెండూ అవసరమే. ఇది తెలిసి ఆచరించినవాడు కర్మలవల్ల సంచితకర్మలను నాశనంచేసి, ఉపాసనవల్ల దైవత్వం పొందుతాడు” అని చెప్పబడింది.

విద్య, అవిద్య రెండూ కూడా ఆ పరమేశ్వరి స్వరూపాలే. అయితే సాధకుడు ఈ విషయాలను తెలుసుకుని ఉపాసనచేసినట్లైతే అతడికి మోక్షం ప్రసాదిస్తుంది. ఆ పరమేశ్వరి. అందుచేతనే ఆమె విద్యావిద్యస్వరూపిణి అనబడింది.

403. మహాకామేశనయనకుముదాహ్లాదకౌముదీ

మహా అంటే గొప్పవాడైన కామేశుడు. మహాకామేశుని యొక్క కనులు అనే కలువలకు వెన్నెలవంటిది. కౌముదము అంటే – కైరవము, రక్తపంకజము, కుముదము, కార్తీకపున్నమినాటి వెన్నెల అని అర్థం. కాబట్టి మహాకామేశుని కనులు అనే కలువలకు కార్తీకపున్నమినాటి వెన్నెల వంటిది.

కుముదులు అంటే నీచులైనవారు లౌకికసుఖాలు కోరతారు. కాని ఆసుఖాలన్నీ దుఃఖకారకాలు. అందుచేత వారి కోరికలను మళ్ళించి వారికి ఆహ్లాదము కలిగించునది.

మహాకామేశుని కనులనబడే కలువలను వెలిగించేది ఆ పరమేశ్వరి. అలా ప్రకాశిస్తున్న కామేశ్వరుని కనులు చంద్రసూర్యాగ్నులను పోలుతూ తెలుపు ఎరుపు నీలపురంగులలో ప్రకాశిస్తున్నాయి.

ఉపాసకులకు పరమేశ్వరి జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. కాబట్టి వారందరూ అనిర్వచనీయమైన ఆనందం పొందుతాడు. జ్ఞానజ్యోతులతో ప్రకాశించే పరమేశ్వరి ముఖం చూడాలంటే కామేశ్వరసమానులే కావాలి. అంతేకాని అన్యులకు సాధ్యం కాదు.

పరమేశ్వరి స్వరూపాన్ని చూడటంచేత కామేశునికి ఆహ్లాదం కలుగుతుంది.

404. భక్తహార్దతమోభేదభానుమద్భానుసంతతిః

భక్తుల మనసులో ఉండే అజ్ఞానాన్ని నాశనం చేసేది. అజ్ఞానము, భ్రమ, బంధము ఇవన్నీ మనసుకు పట్టిన మలినాలు. భక్తుల హృదయాలలో తమోగుణాన్ని పోగొట్టి సూర్యప్రభలవలె జ్ఞానజ్యోతులు వెలిగించేది.

తన భక్తులయొక్క అజ్ఞానపు చీకట్లను తొలగించి జ్ఞానజ్యోతులనందించేది పరమేశ్వరి. అందుచేతనే భక్తహార్ధ తమోభేదాభానుమత్భాను సంతతిః అని చెప్పబడింది.

34. శివదూతి విద్య

పూర్వకాలంలో శుంభనిశుంభులు అని దైత్యులు ఉండేవారు. వారు వసుతః బలాఢ్యులు వేదవేదాంగవిదులు. పై పెచ్చు శివుణ్ణి గురించి బ్రహ్మాండమైన తపస్సు చేశారు. వారి తపస్సుకు మెచ్చి శివుడు కరుణించి ప్రత్యక్షమై ఏ వరం కావాలో కోరుకోమన్నాడు. రాక్షసులందరిలాగానే చావులేకుండా వరం కావాలి అన్నారు శుంభనిశుంభులు. అది మాత్రం అసంభవం. సృష్టిలో ఏ ప్రాణి అయినా మరణించాల్సిందే అది సృష్టి ధర్మం. కాబట్టి ఇంకేదయినా వరమడగండి అన్నాడు శివుడు. వారు బాగా ఆలోచించి పురుషుని వలన మృత్యువు రాకుండా వరమడిగారు. సరేనన్నాడు శివుడు.

అసలే రాక్షసులు. అందులోనూ బలాఢ్యులు వరగర్వితులు. వారి ఆగడాలకు లెక్కలేకుండాపోయింది. యజ్ఞయాగాదులు నాశనం చేశారు. మునిపల్లెలు తగులబెట్టారు. దేవతలను చెరబట్టారు. వీరి బాధలు భరించలేక శివుడికి మొరపెట్టుకున్నారు దేవతలు. ఆ తరువాత అసలు విషయం తెలిసి హిమాలయాలకుపోయి పార్వతిరూపంలో ఉన్న అంబికను ప్రార్థించారు. అప్పుడు అంబిక పార్వతి శరీరం నుంచి బయటకు వచ్చేసింది. పార్వతి దేహం నల్లగా మారిపోయి కాళి అనే పేరుతో హిమాలయాలమీద నివాసం ఏర్పరచుకున్నది. పార్వతి శరీరం నుండి బయటకు వచ్చేసింది కాబట్టి ఆ దేవికి కౌశికి అని పేరు వచ్చింది.

కౌశిక హిమాలయ పర్వతశ్రేణుల మీద తిరుగాడుతోంది. ఆ దేవిని చూశారు చండ ముండులనే రాక్షసులు. తమ ఏలిక దగ్గరకుపోయి ఒక స్త్రీ రత్నాన్ని మేము చూశాము. రత్నాలన్నీ రాజు దగ్గర ఉండటం ధర్మం కాబట్టి ఆ స్త్రీ రత్నాన్ని నువ్వు పరిగ్రహించు అన్నారు. శుంభుడు వీరి మాటవిని సుగ్రీవుడనే రాక్షసుణ్ణి పరమేశ్వరి దగ్గరకు దూతగా పంపాడు.

సుగ్రీవుడు శుంభుని బలపరాక్రమాలను వివరించి చివరకు ఓ దేవీ ! నువ్వు మా రాజును వివాహమాడవలసింది అన్నారు. ఆ మాటలు విన్న దేవి యుద్ధంలో నన్ను జయించిన వారిని మాత్రమే వివాహమాడతానని శపథం చేశాను. కాబట్టి మీ రాజుకు ఈ విషయం చెప్పి నాతో యుద్ధం చెయ్యమను అన్నది.

దూత తెచ్చిన సందేశం విన్న శుంభుడు ధూమ్రలోచనుడనే వాణ్ణి పిలిచి 'నువ్వు ఎలాగయినా సరే ! ఆమెను నా సభకు ఈడ్చుకుని రావలసినది' అన్నాడు. పరమేశ్వరి

ఒక్క హుంకారంతో ఆ రాక్షసుణ్ణి సంహరించింది. ఆ మాటలు విన్న శుంభుడు కోపితుడై చండముండులను పరమేశ్వరితో యుద్ధానికి పంపాడు. వారు వివిధ రకాలయిన సేనలతో దేవిని చుట్టుముట్టారు. అంత దేవి చండముండులను సంహరించి ఈశ్వరుణ్ణి చూసి ఓ దేవా ! శుంభనిశుంభుల వద్దకు నువ్వు దూతగా వెళ్ళవలసింది అన్నది. పరమేశ్వరి ఆజ్ఞ మీద శివుడు ఆమె దూతగా వెళ్ళాడు కాబట్టి ఆమె శివదూతి అని పిలువబడింది.

లలితా సహస్రంలో 405 నుంచి 412 నామాల వరకు శివదూతి విద్యను వివరించటం జరిగింది.

పరమేశ్వరియే శివదూతి. దూతగా వెళ్ళేవాడు సర్వశాస్త్రపండితుడు, వేదాధ్యాయి, లౌకికుడు అయి ఉండాలి. భారతయుద్ధానికి ముందు శ్రీకృష్ణభగవానుడు రాయబారం వెళ్ళాడు. దూత చాలా గొప్పవాడుగా ఉండాలి. అందుకే శివుణ్ణి దూతగా పంపింది పరమేశ్వరి. ఆమె శివునితో ఆరాధించబడుతుంది. ఆ దేవి శివుని రూపంలోనే ఉంటుంది. భక్తుడికి ఆత్మజ్ఞానం కలుగచేసి మోక్షం ప్రసాదిస్తుంది. ఇక నామాలను చూద్దాం.

405. శివదూతీ

శివునిదూతగా పొందినది. మార్కండేయపురాణంలో శివుణ్ణి దూతగా పంపినది. కాబట్టి ఆ పరమేశ్వరి శివదూతీ అని ప్రసిద్ధి చెందినది. అని చెప్పబడింది.

భక్తులు పరమేశ్వరుణ్ణి చేరాలంటే శివునిలాగా విరాగులుకావాలి. సర్వస్వాన్ని త్యజించాలి. అందుచేతనే జీవాత్మ పరమాత్మను చేరటానికి వైరాగ్యం కావాలి అని చెప్పటానికే ఇక్కడ శివుడు దూతగా వెళ్ళాడు అని చెప్పబడింది.

షోడశనిత్యలలో ఏడవనిత్య శివదూతి. పుష్కరక్షేత్రంలో శివదూతి అనే దేవత ఉన్నది.

406. శివారాధ్యా

శివునిచే ఆరాధించబడినది. బ్రహ్మాండపురాణంలో

శివో పి యాం సమారాధ్య ధ్యానయోగబలేనచ
ఈశ్వర స్సర్వసిద్ధీనాం అర్ధనారీశ్వరోఽ భవత్ ॥

శివుడు ధ్యానంతో ఆ పరమేశ్వరిని బాగా ఆరాధించి సర్వసిద్ధులకు ప్రభువైనాడు. అర్ధనారీశ్వరుడైనాడు అని చెప్పబడింది.

పంచదశీ మహామంత్రాన్ని అనేకమంది ఉపాసించారు అని గతంలో చెప్పాం. వారిలో శంకరుడు ఒకడు.

అస్యశ్రీ శంకరవిద్యాంబా మహామంత్రస్య । దక్షిణామూర్తి ఋషిః । పంక్తిచ్ఛందః శంకర విద్యాంబా దేవతా । హ స క ల హ్రీం । బీజం । హ స క హ ల హ్రీం శక్తిః స క ల హ్రీం కీలకం । జపేవినియోగః ॥

న్యాసము : మంత్రము యొక్క ఆరు భాగాలతోను న్యాసము చెప్పాలి.

ధ్యానము : సంకుకుమవిలేపనాం................

మంత్రము : హ స క ల హ్రీం । హ స క హల హ్రీం । స క ల హ్రీం ।
హ స క ల । హ స క హల । స క ల హ్రీం ।

ఈ రకంగా శివునిచే ఆరాధించబడినది కాబట్టి శివారాధ్యా అనబడుతోంది.

కటాక్షమోక్షా చరణోగ్రవిత్తా
నివేశితార్ణాః కరుణార్ద్ర చిత్తా
సుభక్తయే రాతి సమీప్సితం యా
భజామహే శ్రీభువనేశ్వరీం త్వాం ॥

అంటూ శివుడు భువనేశ్వరీ హృదయాన్ని ఇంకా ధూమావతీకవచం, శ్యామలా స్తోత్రం, అన్నపూర్ణాసహస్రం, రేణుకాకవచం. ఇలా అనేకానేకస్తోత్రాలలో పరమేశ్వరిని ప్రార్థించాడు.

407. శివమూర్తిః

శివుడే స్వరూపముగా గలది. శివశక్తులకు భేదము లేదు. శివుడు లేక శక్తిలేదు. శక్తి లేక శివుడు లేడు. అందుకే శ్రీచక్రంలో **త్రికోణరూపిణీ శక్తిః బిందురూప పరశ్శివః** శక్తిత్రికోణం రూపంలో ఉంటుంది. శివుడు బిందువురూపంలో ఉంటాడు. ఈ ఇద్దరూ ఒకటే. శివుడు మంగళప్రదుడు. కాబట్టి శివమూర్తి అంటే మంగళములే రూపముగా ధరించినట్టిది.

శక్తికి రూపముండదు. శక్తిమంతుడైన శివుని రూపమే శక్తిరూపము. అందుచేతనే శివశక్తులకు భేదములేదు. వారిద్దరూ ఒకటే. ఆ కారణంచేతనే పరమేశ్వరి శివమూర్తి అనబడుతోంది.

408. శివంకరీ

భక్తుని శివునిగ చేయును. ఎప్పుడైతే అవిద్య అనే బంధనాలు తెగిపోయినాయో, అప్పుడు సాధకుడే పరబ్రహ్మ అవుతాడు. భావనోపనిషత్తులో

ఏ వశివయోగీతి కథ్యత ఇ త్యుపనిషత్

సాధకుడు తాను పరమేశ్వరి పాదపద్మములనుండి వచ్చే తేజస్సులో లీనమైనట్లుగా తలచి, తాను కూడా ఆ తేజస్సులో ఒక భాగమేనని గ్రహించి సర్వమూ పరబ్రహ్మమయము అని భావించుటయే పరిపూర్ణమైన ధ్యానము.

ఈ విధంగా తననుతాను పరబ్రహ్మస్వరూపంగా భావించి మూడు ముహూర్తముల కాలము ఆ దేవి యందు మనసును లగ్నం చేసినవాడు ఆ పరమేశ్వరితో ఐక్యత పొందుతాడు. దీనినే బ్రహ్మత్వం సిద్ధించటము అంటారు. ఈ విధంగా అంతఃపూజ చేసి సిద్ధుడైన సాధకుడికి కోరిన కోరికలు అప్రయత్నంగా నెరవేరతాయి. అతడు శివయోగి అనబడుతాడు. అతడే పరబ్రహ్మస్వరూపుడు అని చెప్పబడింది.

సాధకుల అజ్ఞానము తొలగించి వారికి ముక్తిని ప్రసాదిస్తుంది. వారికి శుభములు చేకూరుస్తుంది కాబట్టి శివంకరి అనబడుతోంది. ఈ నామము శివదూతి విద్యోపాసనకు ఫలితము. ఆ దేవి తన భక్తుల అభీష్టాలను నెరవేరుస్తుంది. ఆనందము కలుగచేస్తుంది. వారికి శుభములను చేకూరుస్తుంది. మోక్షమునిస్తుంది. శివసాయుజ్యము కలుగచేస్తుంది.

409. శివప్రియా

శివునకు ప్రియురాలు. శివుడు ప్రియుడుగాగలది. తన మూర్తి యందు తనకు ప్రేమ ఉండటము సహజము. ఆ పరమేశ్వరి శివమూర్తియే కాబట్టి శివప్రియా అనబడు తోంది. శివ అనగా శుభము అని అర్థం. కాబట్టి శుభమైన మంగళకరమైన కార్యము లందు ప్రీతి గలది. శివునితో ఐక్యత పొందుతుంది కాబట్టి శివప్రియా అనబడుతుంది.

410. శివపరా

శివునికన్న పరమైనది. శివుడు కూడా శక్తికి అధీనమైనవాడే. అందుచేత శివుని కన్న వేరైనది ఆ దేవి. భక్తులకు శివుని గురించి బోధిస్తుంది. కాబట్టి శివపరా అనబడుతున్నది. శక్తి యొక్క సహాయము లేనిదే శివుడు కూడా సృష్టి కార్యక్రమము చెయ్యలేడు. అని సౌందర్యలహరిలోని మొదటిశ్లోకంలో శంకరభగవత్పాదుల వారు చెప్పారు. అంటే శివునికన్న పరమైనది శక్తి. అందుకే శివపరా అనబడుతున్నది.

411. శిష్టేష్టా

శిష్టులయందు ఇష్టము కలిగినది. విహికకర్మలయందు ఇష్టము గలది. శిష్టేష్టా అన్నప్పుడు రెండు రకాల కర్మలు కనిపిస్తున్నాయి. 1. శిష్టములు – విహితకర్మలు. 2. ఇష్టములు – ప్రియమైనవి. ఈ రెండుకర్మలయందు ప్రీతిగలది.

విహితకర్మలచే పూజించబడినది. పరమేశ్వరి పూజావిధానం చెబుతూ వర్ణాశ్రమ ధర్మాలలో చెప్పబడిన ప్రకారము పరమేశ్వరికి అర్పించేదే పూజ. అంతేకాని గంధము, పూలు అర్పించటంకాదు. 'ఆచారమునుంచే ధర్మము పుడుతున్నది. ధర్మానికి ప్రభువు అచ్యుతుడు' అని బృహన్నారదీయములో చెప్పబడింది. వశిష్టసూత్రాలలో "అవయవ చాపల్యము లేనివారు, వంశపారంపర్యంగా వేదాధ్యయనం చేసేవారు, వేదాలనే ప్రమాణంగా తీసుకునే వారు శిష్టులు అనబడతారు' అని చెప్పబడింది. అటువంటి శిష్టులచే పూజింపబడేది. శిష్టులంటే ఇష్టపడేది.

తేలికగా చెప్పాలంటే శిష్టులు అనగా సదాచారసంపన్నులు వారియందు, వారి ఆచారములందు ప్రీతిగలది.

సదాచార సంపన్నులలో కూడా బ్రహ్మజ్ఞానులు శిష్టేష్టులు అనబడతారు. అటువంటి వారియందుండునది. వారి యందు ప్రీతి గలది. కాబట్టి ఆ పరమేశ్వరి శిష్టేష్టా అనబడుతుంది.

412. శిష్టపూజితా

శిష్టుల చేత పూజించబడేది. సదాచార సంపన్నులచే పూజించబడేది. శ్రుతులు స్మృతులు చెప్పిన ప్రకారము నియమనిష్టలచే పూజించబడునది. అందుచేతనే శిష్టపూజితా అనబడుతోంది.

413. అప్రమేయా

కొలవటానికి వీలుకానిది. బ్రహ్మనిష్ఠాదులచేతనే కొలువబడినది. అంతేకాని ఇతరులచేత కొలచుటకు వీలుకానిది.

ప్రమేయము అంటే – పరిమాణము అని అర్థం. అప్రమేయము. పరిమాణము లేనిది. అపరిమాణము. ఆ పరమేశ్వరిని కొలవాలి లేక ఆమె గురించి తెలుసుకోవాలి అంటే ఇంద్రియజ్ఞానము చాలదు. ఇంద్రియాతీతమైన జ్ఞానము కావాలి. 'సత్యంజ్ఞాన

మనంతం బ్రహ్మ' ఆ దేవి స్వరూపము అనంతమైనది కాబట్టి ఆమె అప్రమేయా అనబడుతున్నది. పరమేశ్వరిని గురించి తెలుసుకోవాలి అంటే ప్రత్యక్ష అనుమానాది ప్రమాణాలు చాలవు. వీటన్నింటికీ అతీతమైనది. అన్ని ప్రమాణాలకు ఆమె సాక్షి. అందుచేతనే ఆమె అప్రమేయా అనబడుతోంది.

414. స్వప్రకాశా

ఆత్మకన్నవేరుగాని ప్రకాశము గలది. స్వయముగా ప్రకాశించేది. పరమేశ్వరి 'స్వంజ్యోతిః' స్వయంప్రకాశరూపిణి. సూర్యచంద్రాది ఇతరులకు ప్రకాశాన్ని ఇచ్చేదే కాని ఆ దేవికి ఎవరివల్లా ప్రకాశము కలగదు. అందుచేతనే ఆమె స్వప్రకాశా అనబడుతుంది. కట్టెలు స్వయంగా కాలలేవు. వాటికి అగ్ని సాయముకావాలి. అటువంటి అగ్ని సూర్య చంద్రులకు కూడా ప్రకాశాన్ని ఇచ్చేది దేవి. ఆమె అఖండజ్ఞానస్వరూపిణి. ఆత్మస్వరూపిణి కఠోపనిషత్తులో చెప్పినట్లుగా

న తత్ర సూర్యో భాతి న తత్ర చంద్రతారకం. ఆత్మ ఉండేచోట సూర్యుడు ప్రకాశించడు. అక్కడ చంద్రుడుగాని, నక్షత్రాలుగాని ప్రకాశించవు.

దేనివల్ల సూర్యచంద్రులు ప్రకాశిస్తున్నారో అదే ఆత్మ. జగత్తులో చైతన్యము, జడము అని రెండు పదార్థాలున్నాయి. కంటికి కనిపించేవన్నీ జడపదార్థాలే. వీటికి చలనము లేదు. ఆత్మచైతన్యము. అది కంటికి కనిపించదు. స్వయంప్రకాశము గలది.

415. మనోవాచామగోచరా

మనస్సుకు వాక్కుకు గోచరము కానిది. వేదంలో "వాక్కు ఎవరినైతే వర్ణించలేదో, మనస్సు ఎవరినైతే పొందలేదో అతడే బ్రహ్మ" అని చెప్పబడింది. విష్ణుపురాణంలో ప్రహ్లాదుడు, మనోవాక్కులకతీతమైనది, జ్ఞానులకు మాత్రమే గోచరమైనది అయిన పరమేశ్వరికి నమస్కరిస్తున్నాను" అంటాడు.

ఇందాక చెప్పిన 413, 414 నామాలనే ఇక్కడ ఇంకా వివరిస్తున్నాడు. ఆ పరమేశ్వరి అవాఙ్మానసగోచరమైనది. సృష్టిలో ముందు పుట్టిన వాటికి తరువాత పుట్టిన వాటి గురించి తెలుస్తుంది. కాని తరువాత పుట్టినవాటికి ముందు పుట్టిన వాటి గురించి తెలియదు. అన్నింటికన్నా ముందు నుంచీ ఉన్నది పరమేశ్వరి. కాబట్టి ఆమెకు అన్ని విషయాలు తెలుస్తాయి. పిల్లలకు తమ తల్లి బాల్యం, వివాహం ఇత్యాది విషయాలు తెలియవు

కదా? అలాగే తరువాత పుట్టిన వాక్కు మనస్సు అనే ఇంద్రియాలకు ఆత్మ గురించి తెలియదు. అందుచేతనే పరమేశ్వరి మనోవాచామగోచరా అనబడుతోంది. పరమేశ్వరి పరాస్వరూపిణి. ఇది వాక్కులో ప్రథమరూపం. బయటకు వచ్చేవాక్కు వైఖరి స్వరూపం. ఇది నాల్గవరూపం. నాల్గవరూపానికి మొదటిరూపం గురించి ఎలా తెలుస్తుంది ? అలాగే అవ్యక్తము, మహతత్త్వము, అహంకారము. ఆ తరువాత తన్మాత్రలు పంచభూతాలు. ఇంద్రియాలు. ఇప్పుడు వాగాది ఇంద్రియాలకు తమకు ముందు నాల్గవతరానిదైన అవ్యక్తం గురించి ఎలా తెలుస్తుంది? తెలియదు. అందుకే దేవి మనోవాచామగోచరా అనబడుతుంది. అందుచేతనే పరమేశ్వరి సాక్షాత్కారం కావాలి అంటే యోగసాధనలో ఉన్మనాస్థితికి చేరాలి. ఉన్మన అంటే మనస్సు కూడా పనిచేయనిస్థితి. అప్పుడే ఆత్మసాక్షాత్కారం కలుగుతుంది.

416. చిచ్ఛక్తిః

చిత్ + శక్తి' అంటే చిచ్ఛక్తి అంటే – ఔపమ్యశక్తి. వేదాలకు నిఘంటువైన నిరుక్తంలో యాస్కుడు చిత్ అనగా ఉపమ అన్నాడు.

చిత్ అనేవి రెండు అక్షరాలు. అనంతమైనవి. అవిద్య నశించగానే నిలిచేది విద్య. అదే జ్ఞానము చిత్ అనబడుతుంది. సకలప్రాణికోటి యందు జీవాత్మ రూపంలో ఉన్న పరమాత్మ. ఇదే శివము. శరీరంలోంచి ఈ శివం గనక వెళ్ళిపోతే మిగిలేది శవమే. చిత్ అనే పదార్థాన్నే చైతన్యము అంటారు. జగత్తులోని ప్రతి వస్తువునందు చలనము తెచ్చే శక్తే పరమాత్మ శక్తి. అదే చైతన్యము. చిఛక్తి అనబడుతుంది.

దేవీభాగవతంలో "ఓ రాజా ! అన్ని భూతములందు సర్వశక్తులతో కూడిన చైతన్యశక్తి ఉన్నది. ఈ శక్తిలేనివాడు శవముతో సమానము. అన్ని భూతాలలోనూ ఉన్న చిఛక్తి ఆ పరమేశ్వరియే" అని చెప్పబడింది. కాబట్టి ఆ దేవియే చిఛక్తి.

417. చేతనారూపా

పైన చెప్పినఅర్థాన్నే ఇంకా వివరిస్తున్నారు. "పరమేశ్వరుని యొక్క నిర్మలమైన చైతన్యమే చిఛక్తి అనబడుతుంది. దేవీ భాగవతంలోని మొదటిశ్లోకంలో సర్వచైతన్యరూప మయిన విద్యకు నమస్కరింతును" అన్నారు దీన్ని గతంలో వివరించాం.

సకలజీవుల దేహములయందు చైతన్యరూపంలో ఉండేది. చిఛక్తి యొక్క ధర్మమే చైతన్యము. ఇదే ధృవకల, సాదాఖ్యకల, చిత్కల, ఆత్మకల, పరమాకల అనబడుతుంది.

ఇది సహస్రారాన్ని స్థానంగా చేసుకుని, శరీరమంతా వ్యాపించి ఉంటుంది. జాగ్రస్వప్న సుషుప్తులయందు తాను ఉంటూ, వాటిని గురించి తాను తెలుసుకుని, వాటితో సంబంధము ఏమాత్రమూ లేకుండా ఉంటుంది. అదే చైతన్యరూపము

418. జడశక్తిః

జడమును సృష్టించేశక్తి. జడాత్మకమైన ప్రకృతిని సృష్టించటానికి ఏర్పడిన మాయా పరిణామశక్తియే జడశక్తి. అంటే ఇదే సృష్టి చేసేశక్తి. విష్ణుపురాణంలో "సర్వభూతశక్తులు జ్ఞానముతోనే తెలుసుకోదగినవి. సృష్ట్యాదిశక్తులన్నీ కూడా బ్రహ్మశక్తులే. అగ్నిని వేడి ఏవిధంగా ఆవరించి ఉంటుందో అలాగే సృష్ట్యాదిశక్తులు బ్రహ్మను ఆవరించి ఉంటాయి. బ్రహ్మ ఈ జగసృష్టికి కారణము. సృష్ట్యాదిశక్తులు వస్తుకారణములు" అని చెప్పబడింది. కాబట్టి జడశక్తి అంటే వస్తుకారణమైనది.

అన్ని శక్తుల సేమ్మళనమే బ్రహ్మపదార్థము. మాయాశక్తి యొక్క పరిణామస్థితియే జడశక్తి. ప్రకాశవిమర్శాంశల సమిష్టి రూపమే ఈ సృష్టి. అయితే ప్రకాశాంశ లేకుండా శుద్ధ విమర్శాంశ జడశక్తి. అందులో చేతనముండదు.

నిజంగా చెప్పాలంటే అన్ని శక్తులూ ఆ పరమేశ్వరివే. చేతనము ఆమె. జడమూ ఆమె. అందుకే ఇందాక చెప్పిన నామాలలో చేతనాశక్తి ఆ దేవి అని చెప్పి ఇప్పుడు జడశక్తి కూడా ఆమె. అని వివరిస్తున్నారు.

419. జడాత్మికా

జడము అంటే దృశ్యము. జడమే స్వరూపముగా గలది. కంటికి కనిపించే పదార్థాలే ఆత్మగా గలది. ఇంకా చెప్పాలి అంటే ఈ ప్రకృతి అంతా జడపదార్థము. ప్రపంచమనేది చేతనము, జడము అని రెండు భాగాలు. చేతనమే చిఛక్తి కాగా జడమే జడశక్తి. ఈ రెండింటి కలయికవల్లనే సృష్టి ఏర్పడుతున్నది. సత్తు చిత్తు ఆనందము బ్రహ్మపదార్థాలు. చైతన్యరూపాలు. నామరూపాత్మక జగత్తు జడపదార్థము అది విమర్శాంశ. ఆ జడమే ఆత్మగా గలిగినది జడాత్మికా.

35. గాయత్రీ మంత్రము

గాయత్రీ మంత్రము అని సాధారణంగా వాడేస్తుంటాము. కాని గాయత్రి అనేది ఒక ఛందస్సు. అందులో 24 అక్షరాలుంటాయి. ఈ మంత్రంలో ఒక్కొక్క పాదానికి ఎనిమిది అక్షరాలు చొప్పున మూడుపాదాలలోనూ 24 అక్షరాలుంటాయి.

ఓం భూ ర్భువ స్సువః
త త్స వితుర్వరేణ్యం । భర్గో దేవస్య ధీమహి ।
ధియో యోనః ప్రచోదయాత్ ॥

ఇదే గాయత్రీ మంత్రం. ఉపనయనకాలంలో బ్రాహ్మణులకు ఉపదేశం చేసేది. ఈ మంత్రోపదేశం చేసిన తరువాత వటువు సంస్కారవంతుడవుతాడు. మంత్రం సిద్ధించిన తరువాత బ్రహ్మవిద్య పొందటానికి అర్హుడవుతాడు.

ఓంకారమనేది పరబ్రహ్మ స్వరూపం. వాహృతులు దాని అంగాలు. ఈ మంత్రంలో మొత్తం ఏడు వ్యాహృతులున్నాయి. వీటిని సప్తవ్యాహృతులు అంటారు. అవి.

1. ఓం భూః 3. ఓం సువః 5. ఓం జనః 7. ఓగ్ంసత్యం
2. ఓం భువః 4. ఓం మహః 6. ఓం తపః

ప్రస్తుతము ఉపాసనలో ఉన్న గాయత్రీమంత్రానికి విశ్వామిత్రుడు ఋషి. అయితే ఇది 28వ మహాయుగం. వాటిలో గతంలో కూడా ఈ మంత్రం ఉపాసన చేయబడింది. ఆ గాయత్రీమంత్రానికి ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క ఋషి, ఛందస్సు విడివిడిగా ఉన్నాయి.

ఇప్పుడు 420 నుంచి 468వ నామం వరకూ గాయత్రీ మంత్రం వివరించబడింది. ఈ మంత్రాన్ని త్రిసంధ్యలయందు ఉపాసించాలి.

ఇక మంత్రానికి అధిదేవత పరమేశ్వరి. ఆమె తత్త్వాసనా. పంచకోశాల యందు ఉంటుంది. నిత్యయవ్వన. 431వ నామం దగ్గరనుండి గాయత్రిస్థూలరూపం వర్ణించ బడింది. అలాగే 437వ నామం దగ్గర నుండి గాయత్రి సూక్ష్మరూపం వర్ణించబడింది.

గాయత్రియే కరుకుళ్ళాదేవి. కులమార్గంలో సంచరించే కౌళిని. ఆమెను గనక ఆరాధించినట్లైతే తుష్టి, పుష్టి, మతి, ధృతి, శాంతి, కాంతి లభిస్తాయి. ఆమె తేజోరాశి, త్రినయనా, కామరూపి. మాతృకావర్ణరూపిణి. ప్రాణాయామంచేసి పరమేశ్వరిని ఆరాధించే యోగీశ్వరుల హృదయాలలో ఉంటుంది. ఈ రకంగా గాయత్రీదేవిని ఉపాసనచేసే వారికి సకల కార్య సిద్ధి జరుగుతుంది. ఇక నామాలను చూద్దాం.

420. గాయత్రీ

గయాన్ ప్రాణాన్ త్రాయత ఇతి గాయత్రీ

ప్రాణములను రక్షించునది గాయత్రి అని ఐతరేయ బ్రాహ్మణంలో చెప్పబడింది. గయలు అంటే ప్రాణాలు అని అర్థం.

త ద్యత్ప్రాణా న్త్రాయతే తద్గాయత్రీ ప్రాణరక్షణ చేయునది గాయత్రి అని బృహదారణ్యకోపనిషత్తు వివరించింది. **తస్మాద్గాయంతం త్రాయతే యతః** గానము చేయువానిని రక్షించునది. **గీయతే తత్త్వమనయా గాయత్రీతి** అని శంకర భాష్యం. ఈ మంత్రంలో దైవత్వం గానం చెయ్యబడింది. అందుచేత గాయత్రి అనబడుతుంది.

గాయత్రి మంత్రం రెండు రకాలుగా ఉన్నది.

1. బ్రాహ్మణులకు ఉపనయనకాలంలో ఉపదేశించేది.
2. వేదాలలో నిగూఢమైనది. ఇదే పంచదశి మహామంత్రము.

అందుచేతనే గాయత్రిమంత్రం బ్రాహ్మణులకోసం ఏర్పడగా పంచదశి మహామంత్రం అన్ని వర్ణాలవారికోసం ఏర్పడింది అన్నాడు అగస్త్యమహర్షి ఇంకా చెప్పాలి అంటే గాయత్రీమంత్రము, పంచదశి మహామంత్రము రెండూ ఒక్కటే.

ఈ రెండింటి అర్థం కూడా ఒక్కటే.

శరీరాదులను రక్షించటంచేత గాయత్రి అని, తేజస్వరూపమవటంచేత సావిత్రి అని, వాగ్రూపం కావటంచేత సరస్వతి అని చెప్పబడుతోంది.

సవితృ ద్యోతనా త్సైవ సావిత్రీ పరికీర్తితా

ప్రపంచాన్ని సృజించి ప్రకాశింపచేస్తుంది. కాబట్టి సావిత్రి అనబడుతోంది.

జాతః ప్రసవితృత్వాన్ వాగ్రూపత్వా త్సరస్వతీ

వాగ్రూపము గలది కాబట్టి సరస్వతి. ఇరవైనాలుగు అక్షరాలతో ఏర్పడ్డ ఛందస్సే గాయత్రి. ఛందస్సులు అనేకరకాలున్నాయి. కాని బ్రహ్మజ్ఞానానికి ద్వారం గాయత్రి ఛందస్సు, ఆ గాయత్రియే సోమరసాన్ని తెచ్చి దేవతల కిచ్చింది. ఛాందోగ్యోపనిషత్తులో

ఒకసారి దేవతలంతా గాయత్రి, త్రిష్టుప్, జగతి ఛందస్సులను సోమాన్ని తీసుకురమ్మని పంపారు. వీటిలో త్రిష్టుప్, జగతి ఛందస్సులు సోమాన్ని తేలేక తిరిగి వచ్చేశాయి.

అంతేకాకుండా తిరిగివస్తూ త్రోవలో అలసట కారణంగా తమలోని కొన్ని అక్షరాలను వదలివేశాయి. గాయత్రి మంత్రం సోమం దగ్గరకు వెళ్ళి, దాన్ని రక్షించే వారందరినీ ఓడించి సోమాన్ని తెచ్చి దేవతలకిచ్చింది. తిరిగివచ్చేటప్పుడు త్రోవలో త్రిష్టప్ జగతి ఛందస్సులు వదలివేసిన అక్షరాలను కూడా తీసుకువచ్చింది. ఆ కారణంగా గాయత్రి ఛందస్సు అన్నింటికన్నా గొప్పది అయింది. అంతేకాకుండా ఉదయము మధ్యాహ్నము సాయంకాలము మూడింటిలోనూ వ్యాప్తమై ఉన్నది. బ్రాహ్మణునికి అత్యంతావశ్యకమవటం చేత దాని గౌరవము ఇనుమడించింది. అందుచేతనే గాయత్రిని ఉపేక్షించిన వాడు దేన్నీ పొందలేడు.

గాయత్రి ఛందస్సులో 24 అక్షరాలు ఒక్కొక్క పాదానికి ఆరు చొప్పున నాలుగు పాదాలుగా ఉన్నాయి. ఇతర ఛందస్సులలో ఇంకా ఎక్కువ అక్షరాలున్నాయి. కాని వాటన్నింటిలోకి గాయత్రియే శ్రేష్టమైనది. స్థావరజంగమాత్మకమైన ప్రాణిసమూహమంతా గాయత్రియే. వాక్కు – గాయత్రి, సమస్తప్రాణాలు – గాయత్రి, వాగ్రూపమైన గాయత్రి అందరి పేర్లనూ ఉచ్చరిస్తోంది. కాబట్టి గాయత్రి అందరిపేర్లలోనూ ఉన్నది. ఈరకంగా ప్రాణి జాతి అంతా గాయత్రియే. గాయత్రి అంటే ప్రాణులను రక్షించేది అని అర్థం. ఈ లక్షణాలుగల గాయత్రి ఈ పృథివే తప్ప వేరేకాదు. చరాచరాలన్నీ ఈ భూమిలోనే ఉన్నాయి. అందుచేతనే చరాచరజగత్తునంతటనూ గానంచేస్తూ, పాడుతూ, త్రాణంచేస్తూ – కాపాడుతూ ఉండే గాయత్రియే ఈ భూమి.

పృథివీ రూపమైన గాయత్రి శరీరంలో ఉండే పంచభూతాలు, ఇంద్రియాల సమూహము ఒక్కటే. పురుషుని శరీరరూపమైన గాయత్రి, పురుషుని హృదయకమలంలో ఉండే పురుషుడు ఇద్దరూ ఒకటే.

ఆ పురుషునిలోనే అంటే గాయత్రిలోనే ప్రాణాలు ప్రతిష్ఠితమై ఉన్నాయి అని చెప్పబడింది.

బృహదారణ్యకోపనిషత్తులో గాయత్ర్యోపాసన వివరిస్తూ “ఉపనిషత్తులో చెప్పిన ‘భూమి, అంతరిక్ష్యం, ద్యౌః’ ఈ మూడు పదాల్లోనూ మొత్తం ఎనిమిది అక్షరాలున్నాయి. ద్యౌః అనే పదంలో దకార యకారాలను రెండు అక్షరాలుగా లెక్కపెట్టాలి. ఇవి మూడులోకాల పేర్లు. గాయత్రి మంత్రానికి పాదానికి ఎనిమిది అక్షరాలున్నాయి. మూడుపాదాలున్నాయి. కాబట్టి మూడు లోకాలు మొదటిపాదం. ఈ రకంగా మూడులోకాలను గురించి తెలుసుకున్నవాడు ముల్లోకాలను జయిస్తాడు.

ఉపనిషత్తులో చెప్పిన ‘ఋచ యజూంసి సామాని’ అనే మూడుపదాల్లోనూ ఎనిమిది అక్షరాలున్నాయి. ఇవి గాయత్రికి రెండోపాదం. అంటే వేదాలు రెండవపాదమన్నమాట. ఈ విషయం తెలుసుకున్నవాడు త్రయీవిద్య అనగా వేదవిద్యవల్ల వచ్చే ఫలితాన్ని పొందుతాడు.

మంత్రంలో చెప్పిన ‘ప్రాణ అపాన వ్యానం’ అనే దాంట్లోని ఎనిమిది అక్షరాలు గాయత్రికి మూడవపాదం. ఇక్కడ వ్యా అనే అక్షరంలో వకార యకారాలను రెండు అక్షరాలుగా లెక్కపెట్టాలి. ఈ విషయం తెలుసుకున్నవాడు సమస్తాన్ని పొందుతాడు.

ఉపనిషత్ మంత్రంలో ‘తురీయదర్శి తంపదం’ అనేది నాల్గవపాదము. ‘దర్శితపదం’ అనే పదానికి ఆదిత్యమండలాంతర్గతుడైన పురుషుడు కనిపిస్తున్నాడని అర్థం. అంటే అన్ని లోకాలకు పైన ఆధిపత్యం స్థాపించి ప్రకాశిస్తున్నాడు. ఈ రకంగా గాయత్రిలో నాల్గవపాదం తెలుసుకున్నవాడు కీర్తితో ప్రకాశిస్తాడు.

తురీయపదం సత్యంలో ప్రతిష్టితమై ఉన్నది. నేత్రమే సత్యం. ఏదైనా ఒక విషయాన్ని నేను చూశాను. నేను విన్నాను అని చెప్పినప్పుడు చూసినదాన్నే నమ్మటం జరుగుతుంది. అందుచేతనే నేత్రం సత్యం. తురీయపాదానికి ఆశ్రయమైన సత్యం బలంలో ప్రతిష్ఠితమై ఉన్నది. అందుకనే సత్యంకన్న బలం ప్రకాశమైనది. ప్రాణమే ఆ బలం. త్రిపదా గాయత్రి ప్రాణాలను రక్షిస్తుంది. గాయత్రిప్రాణంలో ప్రతిష్ఠితమైఉన్నది. వాగాది ప్రాణాలను రక్షించేది గాయత్రి. గానము చేసే వాడిని రక్షించేది గాయత్రి. ఉపాసనచేసే వాణ్ణి రక్షించేది గాయత్రి.

ఉపనయన సమయంలో వటువుకు త్రిపదగాయత్రి ఉపదేశిస్తారు.

అస్యశ్రీగాయత్రీ మహామంత్రస్య విశ్వామిత్రఋషిః । గాయత్రీఛందః । శ్రీ సవితాదేవతా । యంబీజం । ఈం శక్తిః । ణంకీలకం । జపే వినియోగః ॥

న్యాసము : ఓంతత్సవితుర్బ్రహ్మాత్మనే । ధీమహి నత్యాత్మనే ।
వరేణ్యం విష్ణ్వాత్మనే । ధియో యోనః జ్ఞానాత్మనే ।
భర్గోదేవస్యరుద్రాత్మనే । ప్రచోదయాత్ సర్వాత్మనే ॥

ధ్యానము : ముక్తావిద్రుమహేమనీల ధవళచ్ఛాయైె ర్ముఖై స్త్రీక్షణైః
యుక్తా మిందునిబద్ధరత్న మకుటాం తత్వార్థ వర్ణాత్మికాం ।
గాయత్రీం వరదాభయాం కుశకశా శ్శుభ్రం కపాలం గదాం
శంఖం చక్ర మథారవిందయుగళం హస్తై ర్వహంతీం భజే ॥

మంత్రము : ఓం భూర్భువస్సువః తత్సవితుర్వరేణ్యం ॥ భర్గోదేవస్య ధీమహి ।
ధియోయోనః ప్రచోదయాత్ ।

ఇది త్రిపదగాయత్రి. అయితే కొన్ని శాఖలవారు అనుష్టుప్ ఛందస్సులో ఉండే గాయత్రిని ఉపాసిస్తారు.

తత్సవితు ర్వృణీ మహే । వయం దేవస్య భోజనం । శ్రేష్ఠం వై సర్వధాతమమ్। తురంగ భగస్య ధీమహి

వాక్కే అనుష్టుప్. వాక్కే శరీరంలో ఉండే సరస్వతి. కాబట్టి వాక్స్వరూపమైన సరస్వతిని వీరికి ఉపదేశిస్తున్నామని వీరికి నమ్మకం.

గాయత్రి ఉపాసకుడు ఆవులు, గుర్రాలు, భూమి దానంగా తీసుకున్నా దానివల్ల కలిగే దోషం మొదటి పాదాన్ని జపిస్తే పోతుంది.

వేదవిద్యతో సమానంగా దానం తీసుకున్నా ఆ దానం వల్లవచ్చే పాపం మంత్రంలోని రెండవపాదాన్ని జపం చేస్తే పోతుంది.

"లోకంలో ఉన్న ప్రాణాలన్నీ దానం తీసుకున్నా, ఆ పాపం మూడవపాదం జపం చేస్తే పోతుంది. అంటే గాయత్రిమహిమ చాలా గొప్పది" అని చెప్పబడింది.

శుద్ధ గాయత్రీ ప్రత్యక్షరం బ్రహ్మైక్య బోధితా

శుద్ధగాయత్రిలోని ప్రతి అక్షరము పరబ్రహ్మను గురించే బోధిస్తున్నది. అంటే జీవాత్మ పరమాత్మల ఐక్యాన్ని వివరిస్తుంది.

మహా మంత్రస్య చాపస్య స్థానే స్థానే పదే పదే
గూఢో రహస్య గర్భేన । న్తో ప దేశ సముచ్ఛయః ।

గాయత్రీ మహామంత్రంలోని ప్రతి అక్షరంలోనూ, ప్రతిస్థానమందు మహా రహస్యమున్నది.

గాయత్రీ మంత్రాన్ని ఉపాసన చేసేవారికి ఇహపరసుఖాలు పూర్తిగా లభిస్తాయి. హృదయపద్మమందు అధిష్టించి ఉన్న గాయత్రిని ఉపాసన చేసేవారు ధర్మాధర్మవిముక్తులై ముక్తిని పొందుతారు.

గాయత్రీమంత్రానికి 24 అక్షరాలున్నాయి. ప్రజాపతి సంవత్సర స్వరూపుడు. అతడే కాలస్వరూపుడు. సంవత్సరానికి 12 మాసాలు. మాసానికి రెండు పక్షాలు. ఈ రకంగా

24 పక్షాలుంటాయి. ఆ 24 పక్షాలే గాయత్రీమంత్రంలోని 24 అక్షరాలు. సంవత్సరానికి మూడుకాలాలు.

1. వేసవి కాలము 2. వర్షాకాలము 3. శీతాకాలము. వీటి స్వరూపంగానే గాయత్రీ మంత్రము మూడుపాదాలుగా ఉన్నది. మంత్రంలోని మూడుపాదాలు 1. భూలోకం 2. భువర్లోక 3. సువర్లోకాలకు ప్రతీక. అందుచేతనే ఆ పాదాలను లోకాలకు అన్వయించి ధ్యానించాలి.

1. మొదటిపాదము : భూలోక సమన్వయము. భౌతికమైన సృష్టిరూపంలో ధ్యానం చెయ్యాలి.

2. రెండవపాదము : భువర్లోక సమన్వయము. అంటే శక్తి మయాత్మకరూపంలో ధ్యానం చెయ్యాలి.

3. మూడవపాదము : సువర్లోక సమన్వయము. అంటే ప్రజ్ఞామయాత్మక దృష్టితో ధ్యానం చెయ్యాలి.

ఈ విధంగా ధ్యానం చేసేటప్పుడు ముందు ద్రవ్యాత్మక లోకానికి అధిష్టాన దేవతలయిన అష్టవసువులు అనుగ్రహం కలుగుతుంది. ఆ తరువాత శక్తి మయాత్మక లోకానికి అధిష్టానదేవతలయిన ఏకాదశరుద్రుల అనుగ్రహం కలుగుతుంది. అటుపైన ప్రజ్ఞామయాత్మకలోకానికి అధిష్టానదేవతలయిన ద్వాదశాదిత్యుల అనుగ్రహం కలుగుతుంది.

గాయత్రీ మంత్రంలోని ప్రతి అక్షరానికీ ప్రత్యేకమైన అర్థం ఉన్నది. ఇప్పుడా అర్థాన్ని వివరిస్తున్నాం.

ఓమ్	–	బ్రహ్మ
భూః	–	ప్రణవస్వరూపము
భువః	–	దుఃఖనాశనము
స్వః	–	సుఖస్వరూపము
తత్	–	ఆ
సవితుః	–	తేజస్సుచే ప్రకాశించు
దేవస్య	–	దేవునియొక్క

వరేణ్యం	–	శ్రేష్ఠమైన
భర్గః	–	పాపనాశనమైన తేజమును
ధీమహి	–	ధ్యానింతును
యః	–	ఏదైతే
నః	–	మా యొక్క
ధియః	–	బుద్ధులను
ప్రచోదయాత్	–	ప్రేరేపించునో, ఆ తేజస్సును ధ్యానింతును.

పంచదశీ మహామంత్రము గాయత్రీమంత్రము రెండూ ఒక్కటే అని చెబుతూ భాస్కరరాయలవారు తమ వరివశ్యా రహస్యంలోని 60, 61, 63 శ్లోకాలలో పంచదశీ మహామంత్రానికి గాయత్రి మంత్రార్థం నిరూపించారు.

పంచదశీ మహామంత్రంలోని కకారానికి సర్వజగత్తునూ సృష్టించాలనే కోరిక గల బ్రహ్మ అని అర్థం. గాయత్రీ మంత్రంలోని మొదటి మూడుపదాలకు బ్రహ్మ అని అర్థం. పంచదశిలో రెండవఅక్షరమైన ఏ కారానికి గాయత్రీ మంత్రంలోని సవితుః – శ్రేష్టమైన అని అర్థం. మూడువ అక్షరమైన ఈ కారము గాయత్రి మంత్రంలోని భర్గోదేవస్యధీ అయిన పరమేశ్వరుణ్ణి సూచిస్తుంది.

ఈ రకంగా శ్రీవిద్యలోని ప్రథమకూటమిలోని అక్షరాలు గాయత్రీమంత్రంలోని ప్రథమపాదంచే తెలియబడు జగత్కారణభూతులైన కామేశ్వరీ కామేశ్వరులను చెబుతోంది. వారిద్దరి సామరస్యమే పరమశివుడు. అతని పరిణామమే ఈ జగత్తు. అతడే సమస్త బుద్ధులకు ప్రేరకుడు. త్రిగుణాతీతుడు. ప్రణవస్వరూపుడు.

గాయత్రీ మంత్రంలోని మహి అనే శబ్దము శ్రీవిద్యలోని ల కారాన్ని సూచిస్తున్నది. ల కారమనేది పృథివీ బీజం. కాబట్టి దాని నుంచి పంచభూతాత్మకమైన జగత్తు తెలుస్తుంది. ఈ జగత్తంతా పరమేశ్వరునివల్ల సృష్టించబడింది. ఆ పరమేశ్వరుని ప్రతిబింబమే మహాత్రిపురసుందరి.

గాయత్రీమంత్రంలోని చివరి రెండుపాదాల అర్థం శ్రీవిద్యలోని హ్రీం కారము ఒక్కటే. ఈ రకంగా గాయత్రి, పంచదశి మహామంత్రాల అర్థం ఒక్కటే.

దేవీభాగవతంలోని 12వ స్కంధంలో గాయత్రీమంత్రాన్ని వివరించారు. ఈ మంత్రానికి 24 మంది ఋషులు, 24 ఛందస్సులు, 24 మంది దేవతలు, 24 శక్తులు,

24 రంగులు, 24 వర్ణతత్త్వాలు 24 వర్ణముద్రలు చెప్పబడ్డాయి. వాటిని కూడా ఇక్కడ ఉటంకిస్తున్నాం.

గాయత్రీ మంత్రానికి 24 మంది ఋషులున్నారు. వారు

1. వామదేవుడు	9. శౌనకుడు	17. అగస్త్యుడు
2. అత్రి	10. యాజ్ఞవల్క్యుడు	18. కౌశికుడు
3. వశిష్ఠుడు	11. భరద్వాజుడు	19. వత్సుడు
4. శుక్రుడు	12. జమదగ్ని	20. పులత్స్యుడు
5. కణ్వుడు	13. గౌతముడు	21. మాండూకుడు
6. పరాశరుడు	14. ముద్గలుడు	22. దుర్వాసుడు
7. విశ్వామిత్రుడు	15. వ్యాసుడు	23. నారదుడు
8. కపిలుడు	16. లోమశుడు	24. కశ్యపుడు

గాయత్రీ మంత్రానికి 24 ఛందస్సులున్నాయి. అవి

1. గాయత్రి	9. శక్వరి	17. ఆకృతి
2. ఉష్ణిక్	10. అతిశక్వరి	18. వికృతి
3. అనుష్టుప్	11. ధృతి	19. సంకృతి
4. బృహతీ	12. అతిధృతి	20. అక్షరపంక్తి
5. త్రిష్టుభము	13. విరాట్	21. భూః
6. పంక్తి	14. ప్రసారపంక్తి	22. ర్భువః
7. జగతి	15. కృతి	23. స్వః
8. అతిజగతి	16. ప్రకృతి	24. జ్యోతిష్మతి

గాయత్రీ మంత్రానికి దేవతలు 24 మంది ఉన్నారు. వారు

1. అగ్ని	9. భగుడు	17. మైత్రావరుణుడు
2. ప్రజాపతి	10. యముడు	18. వైశ్వదేవుడు
3. చంద్రుడు	11. గణేశుడు	19. మాతృకలు
4. ఈశానుడు	12. త్వష్ట	20. విష్ణువు
5. సవిత	13. పూష	21. వసువు
6. ఆదిత్యుడు	14. ఇంద్రాగ్ని	22. రుద్రుడు
7. బృహస్పతి	15. వాయువు	23. కుబేరుడు
8. మైత్రావరుణుడు	16. వామదేవుడు	24. అశ్వనీకుమారులు

ఈ దేవతలలో మైత్రావరుణుడు పేరున్నవారు ఇద్దరున్నారు. అంతేకాని పొరపాటుకాదు.

గాయత్రీమంత్రానికి 24 శక్తులున్నాయి. అవి

1. వామదేవి	9. కాంతా	17. సూక్ష్మా
2. ప్రియా	10. దుర్గా	18. విశ్వయోని
3. సత్యా	11. సరస్వతీ	19. విజయా
4. విశ్వభద్ర	12. విద్రుమా	20. వశా
5. విలాసినీ	13. విశాలేశా	21. పద్మాలయా
6. ప్రభావతి	14. వ్యాపినీ	22. పరాశోభా
7. జయా	15. విమలా	23. భద్రా
8. శాంతా	16. తమోపహారిణీ	24. త్రిపదా

గాయత్రీ మంత్రానికి వర్ణాలు (రంగులు) 24 అవి.

1. సంపంగి	9. పద్మరాగము	17. పసుపు
2. అవిసె	10. ఇంద్రనీలమణి	18. పాలమిశ్రణము
3. పగడము	11. ముత్యము	19. సూర్యకాంతి
4. స్పటికము	12. కుంకుమ	20. చిలుకతోకరంగు
5. పద్మపుష్పము	13. కాటుక	21. శతపత్రకాంతి
6. బాలాదిత్యుడు	14. రక్తము	22. కౌతకీపుష్పము
7. శంఖకుందేలు	15. వైడూర్యము	23. మల్లికాకుసుమము
8. పగడము	16. తేనె	24. కరవీరపుష్పకాంతి

గాయత్రీ మంత్రానికి 24 వర్ణతత్త్వములున్నాయి. అవి

1. నేల	9. స్పర్శ	17. చక్షువు
2. నీరు	10. శబ్దము	18. చర్మము
3. కాంతి	11. వాక్కు	19. శోత్రము
4. గాలి	12. పాణి, పాదము	20. ప్రాణము
5. ఆకాశము	13. పాయు	21. అపానము
6. గంధము	14. ఉపస్థ	22. వ్యానము
7. రసము	15. ఘ్రాణము	23. ఉదానము
8. రూపము	16. జిహ్వా	24. సమానము

గాయత్రీ మంత్రానికి 24 రకాల ముద్రలున్నాయి. అవి.

1. సుముఖము	9. షణ్ముఖము	17. ముష్టికము
2. సంపుటము	10. అథోముఖము	18. మత్స్యము
3. వితతము	11. వ్యాపకాంజలికము	19. కూర్మము
4. విస్తృతము	12. శకటము	20. వరాహము
5. ద్విముఖము	13. యమపాశము	21. సింహాక్రాంతము
6. త్రిముఖము	14. గ్రథితము	22. మహాక్రాంతము
7. చతుర్ముఖము	15. షణ్ముఖోన్ముఖము	23. ముద్గరము
8. పంచముఖము	16. ప్రలంబము	24. పల్లవము

అయితే ముప్పైరెండు అక్షరాలు గల గాయత్రీమంత్రానికి ముద్రలు ఈ విధంగా ఉంటాయి.

1. త్రిశూలము	3. సురభి	5. లింగము
2. యోని	4. అక్షమాలా	6. అంబుజము

ఈ రకంగా ఉన్న గాయత్రి మంత్రం బ్రహ్మ క్షత్రియ, వైశ్యులందరిచేత జపించబడుతోంది. అయితే

ఓంకారవ్యాహృతిపూర్వాం గాయత్రీం బ్రాహ్మణో జపేత్
త్రిష్టుభం చైవ రాజన్యో జగతీం వైశ్య ఏవ చ.

ఓం కారవ్యాహృతి పూర్వకమైన గాయత్రిని – బ్రాహ్మణులు

త్రిష్టుప్ ఛందస్సులో – క్షత్రియులు

జగతీ ఛందస్సులో – వైశ్యులు ఈ మంత్రాన్ని జపిస్తారు.

అంతేకాకుండా మంత్రశాస్త్రంలో ప్రతి మంత్రానికి గాయత్రి ఉంటుంది.

కాత్యాయనాయవిద్మహే కన్యకుమారి ధీమహి తన్నో దుర్గిః ప్రచోదయాత్ ।
మహాదేవ్యై చ విద్మహే । విష్ణుపత్న్యైచ ధీమహి తన్నో లక్ష్మీః ప్రచోదయాత్ ॥

గాయత్రీమంత్రం అత్యంత మహిమోపేతమైనది

పూర్వకాలంలో ఒకసారి అనావృష్టి వచ్చింది. దాదాపుగా పదిహేను సంవత్సరాలు వర్షపు చుక్కైనా కురవలేదు. పాడిపంటలు లేవు. చెట్లు చేమలు కూడా అంతరించి పోయాయి. భరించలేని కరువు. పశువులు గడ్డిలేక చచ్చిపోతున్నాయి. పసిపిల్లలకు పాలులేవు. ఆకలికి తాళలేక కొందరైతే మృతకళేబరాలను పీక్కుతినే స్థితికి వచ్చారు. ఇంతదాకా ఎందుకు పిల్లలకు పాలు ఇవ్వలేక, వారిని పెంచలేక గొంతు పిసికి చంపేసిన వారు కూడా ఉన్నారు. మొత్తం మీద ఘోరకలి విలయతాండవం చేస్తోంది.

ఆ రోజుల్లో కొంతమంది పండితులు ఒకచోటచేరి ఈదుర్భర స్థితి నుంచి తప్పించుకోవటానికి మార్గం లేదా ? అని ఆలోచించసాగారు. చివరకు వారికి గౌతముడు గుర్తు వచ్చాడు.

గౌతముడు ఒక మహర్షి, మహాతపస్సంపన్నుడు. పరదేవతను ఆరాధిస్తూ ఉండేవాడు. ఆవిడయొక్క కరుణవల్ల విత్తనాలు చల్లగానే అవి మొలకెత్తి ఫలితాన్ని ఇచ్చేటట్లుగా వరం పొందాడు. కాబట్టి ఇప్పుడు మనమంతా గౌతముడిని శరణువేడితే ఆ మహర్షి మనలను కరుణిస్తాడు అని ఆలోచించి గౌతముడి ఆశ్రమానికి ప్రయాణమయ్యారు.

కుటుంబ సమేతంగా వచ్చిన ఇంతమంది పండితులను చూసి, వారికేదో ఆపద వచ్చిందని గ్రహించి, వారిని ఆహ్వానించి ఆతిధ్యమిచ్చాడు గౌతముడు. ఆ తరువాత జరిగిన విషయం తెలుసుకుని, ప్రజలు ఆకలిదప్పులకు అల్లాడుతున్నారన్నమాట విని విచారించి ఆపరదేవతను ప్రార్థించాడు.

నమో దేవి ! మహావిద్యే ! వేదమాతః ! పరాత్పరే !
వ్యాహృత్యాది మహామంత్రరూపే ! ప్రణవరూపిణి !
సామ్యావస్థాత్మికే ! మాతః ! నమో హ్రీంకార రూపిణి
స్వాహా స్వధా స్వరూపే ! త్వాం నమామి సకలార్థదామ్
భక్తకల్పలతాం దేవీం అవస్థాత్రయ సాక్షిణీం
కుర్యాతీత స్వరూపాం చ సచ్చిదానంద రూపిణీం
సర్వవేదాంత సంవేద్యాం సూర్యమండల వాసినీం
ప్రాతర్బాలాం రక్తవర్ణాం మధ్యాహ్నే యువతీం పరాం
సాయాహ్నే కృష్ణవర్ణాం తాం వృద్ధాం నిత్యం నమా మ్యహమ్॥

ఆదేవత మహిమవల్ల వచ్చిన వారందరికీ నివాసం ఏర్పాటుచేసి, గతంలో దేవత తనకిచ్చిన వరమహిమ వల్ల వారందరికీ భోజన సదుపాయాలు ఏర్పాటు చేశాడు. ఇంతకాలం అన్న పానాదులు లేక, అవి ఎలా ఉంటాయో కూడా మరచిపోయిన వాళ్ళకి ఆపరదేవత దయవల్ల పంచభక్ష్యాలతో సమృద్ధిగా ఆహారం దొరికింది. ఆ ఆనందానికి తట్టుకోలేక అన్నదానం చేసి తమ ప్రాణాలని నిలబెట్టిన గౌతముణ్ణి వేనోళ్ళ కొనియాడారు. ఆ పరమేశ్వరిని పరిపరివిధాల స్తుతించారు. పండితులంతా యజ్ఞయాగాలు చెయ్యనారంభించారు. ఆశ్రమానికి ఎటు చూసినా నూరు యోజనాల వరకు ఆశ్రితులున్నారు. అందర్నీ సంరక్షిస్తున్నాడు గౌతముడు.

కొంతకాలానికి నారదుడు వచ్చి గౌతముడు చేస్తున్న పనికి మెచ్చుకుని “మహర్షీ ! ఆపదకాలంలో వీళ్ళని ఆదుకున్నావు. వారికోసం ఆ పరాశక్తి ఇచ్చిన వరప్రభావం ఉపయోగించటం వల్ల నీశక్తి మరింతగా పెరిగింది. తనకున్న శక్తితో పదిమందికీ ఎవరైతే ఉపకారం చేస్తారో వారి శక్తి ద్విగుణీకృత మౌతుందని చెప్పబడింది. ఇప్పుడు నీకూ అంతే జరిగింది. ఇంద్రాది దేవతలంతా నువు చేస్తున్న పనిని వేనోళ్ళ కొనియాడుతున్నారు” అన్నాడు. ఈ మాటలు విన్న పండితులకు ఈర్ష్య కలిగింది. గౌతముడికి ఇంత పేరు రావటం వాళ్ళు సహించలేక పోయారు. ఎలాగైనా సరే గౌతముడి ప్రతిష్ఠకు మచ్చ కలిగించాలి అనుకున్నారు.

వానలు పడటం మొదలు పెట్టాయి. క్రమంగా నేల చల్లబడింది. ఏరులు పారాయి. నదులు పొంగాయి. విత్తనాలు మొలకెత్తుతున్నాయి. పండితులు కూడా వెళ్ళిపోవటానికి సన్నద్ధమౌతూ మాయాగోవును ఒకదాన్ని సృష్టించారు. అది వచ్చి ఆశ్రమ ప్రాంగణంలోని పంటను, ఆహారాన్ని నాశనం చెయ్యటం మొదలుపెట్టింది. అది చూసిన గౌతముడికి కోపం వచ్చింది. ఆవును కొట్టటం ఇష్టంలేక అదిలించాడు. అంతే ఆ అదిలింపుకు మాయాగోవు కింద పడి చచ్చిపోయింది. ఇదంతా చాటునుంచి చూస్తున్న పండితులు “గౌతముడు గోవును చంపాడు. గోహత్య మహాపాతకం. ఇంక ఇతడి ఇంటభోజనం చెయ్యటం కూడా పాపం. మేం వెళ్ళిపోతున్నాం” అని బయలుదేరారు. మాయ తెలియని గౌతముడు వారిని బ్రతిమాలాడు. ఈ పాపం పోయే ఉపాయం చెప్పమన్నాడు. అప్పుడు వారు గౌతముడికి అసాధ్యమయ్యేపని ఏదా ? అని ఆలోచించి చివరకు గంగను తెచ్చి గోవుమీద ప్రవహింపచేస్తే ఈ పాపం పోతుందన్నారు.

గౌతముడు చాలా సంవత్సరాలు శివుణ్ణి గురించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షమై గౌతముడి కోర్కె ప్రకారం తన జటాజూటం నుంచి రెండు బొట్లు విదిల్చాడు. అంతే చచ్చిన గోవు లేచినుంచుంది. ఈరకంగా గౌతముని చేత తేబడింది కాబట్టి గౌతమి అనీ, గోవును బ్రతికించటానికి వచ్చింది కాబట్టి గోదావరి అనీ ఆనదికి పేరు వచ్చింది.

ఆవు లేచి నుంచోగానే 'గౌతముడు మాయాగోవును బ్రతికించాడు' అని గెలిచేశారు పండితులు. దివ్య దృష్టితో అసలు విషయం తెలుసుకున్న మహర్షి వారిమీద కోపించి "ఇక నుంచీ గాయత్రీ జపం మీకు నిష్ఫలమవుతుంది. వేదాధ్యయనం, యజ్ఞకర్తవ్యం మీకు ఉండవు. మీరంతా ధర్మహీనులు, నీతిదూరులు అయి భ్రష్టుపట్టిపోతారు. వావీ వరుసాలేకుండా పశువుల్లా ప్రవర్తిస్తారు. తరతరాలకు మీగతి ఇంతే" అని శపించాడు.

చేసిన తప్పు క్షమించమని పండితులంతా ప్రాధేయపడగా ద్వాపరయుగంలో పరమేశ్వరి అంశతో యదువంశంలో నందగోపుని ఇంట శ్రీకృష్ణుడు పుడతాడు. అతని జన్మతో మీకు శాపవిమోచన మవుతుంది అన్నాడు.

ఈ రకంగా పండితులు చేసిన తప్పుకు శిక్ష అనుభవించి, పరమేశ్వరి దయవల్ల మళ్ళీ గాయత్రీ అనుష్ఠానం చేసి బ్రహ్మతేజస్సును పొందారు. గాయత్రి జపం చేసినవాడు బ్రహ్మతేజస్సుతో వెలుగొందుతాడు.

421. వ్యాహృతిః

వ్యాహృతి అంటే ఉచ్చారణము. వాయుపురాణంలో "నా చే ఉచ్చరింపబడిన దానవై నీవు కలిగితివి. కాబట్టి నీకు వ్యాహృతి అను పేరు కలుగును" అని చెప్పబడింది.

వ్యాహృతి అంటే – శ్రోతేంద్రియానికి తెలిసే స్థూలమగు రూపము ఉచ్చరించబడి వ్యాప్తి చెందేది.

భూః, భువః, సువః, మహః, జనః, తపః, సత్యం అనేవి సప్తవ్యాహృతులు. వీటిలో

భూః	–	సన్మాత్ర
భువః	–	స్వరము
సువః	–	సుఖస్వరూపము
మహః	–	సర్వాతిశయము గలది
జనః	–	సర్వానికి కారణమైనది

తపః	–	పాలనస్వరూపము గలది
సత్యము	–	బ్రహ్మము

తైత్తిరీయోపనిషత్తులో, శిక్షావల్లిలోని ఐదవ అనువాక్యంలో పరబ్రహ్మకు అంగభూతాలయిన వ్యాహృతుల ఉపాసన చెప్పబడింది. వ్యాహృతులు అంటే కర్మలలో ఉపయోగించేవి అని అర్థం. భూః, భువః, సువః అనేవి మూడు వ్యాహృతులు. మహాచమస్యుడనే మహర్షి తపస్సు చేసి మహః అనే నాల్గవ వ్యాహృతిని కనిపెట్టాడు. మహః అనేదే బ్రహ్మము. మహః అనేది శరీరమైతే భూః, భువః, సువః అనేవి అంగాలు. అంగాలకు ఉనికి లభించినట్లుగా, మహః వల్ల మిగిలిన వాటికి ఉనికి లభిస్తోంది. వ్యాహృతులు బ్రహ్మకు అంగాలు కాబట్టి వీటి ఉపాసన చెప్పబడింది. వ్యాహృతుల ఉపాసన నాలుగురకాలు.

1. లోకదృష్టితో ఉపాసన :

భూః	–	భూలోకాన్ని దృష్టిలో ఉంచుకుని
భువః	–	అంతరిక్ష్యాని దృష్టిలో ఉంచుకుని
సువః	–	స్వర్గలోకాన్ని దృష్టిలో ఉంచుకుని
మహః	–	ఆదిత్యలోకాన్ని దృష్టిలో ఉంచుకుని

ఉపాసన చెయ్యాలి. దీనితో లోకాలన్నీ సూర్యుని వెలుగుతో ప్రకాశమవుతాయి.

2. దేవదృష్టితో ఉపాసన :

భూః	–	అగ్ని దృష్టితో
భువః	–	వాయు దృష్టితో
సువః	–	ఆదిత్య దృష్టితో
మహః	–	చంద్రుని దృష్టితో

ఉపాసన చెయ్యాలి. అన్ని తేజస్సులు చంద్రునిచే పూజ్యములు

3. వేద దృష్టితో ఉపాసన :

భూః	–	ఋగ్వేదము
భువః	–	సామవేదము
సువః	–	యజుర్వేదము
మహః	–	ఓంకారము

ఓంకారాన్ని మొదట, చివర చేర్చటం వల్లనే వేదాలు పూజనీయమవుతున్నాయి.

4. ప్రాణదృష్టితో ఉపాసన :

భూః	–	ప్రాణవాయువు
భువః	–	అపానవాయువు
సువః	–	వ్యానవాయువు
మహః	–	అన్నము

గా భావించి ఉపాసన చెయ్యాలి. లోకంలో ప్రాణులన్నీ అన్నం చేతనే వృద్ధి పొందుతున్నాయి. ఈ రకంగా ఈ 16 వ్యాహృతులు హిరణ్యగర్భునికి అంగాలు. వీటిని తెలుసుకోగలిగినవాడే బ్రహ్మను గురించి తెలుసుకోగలుగుతాడు.

422. సంధ్యా

“సంధ్య అంటే సూర్యుని చేరిన బ్రహ్మ. ఆత్మ యొక్క అంశలైనటువంటి బ్రహ్మాది సకలభూతములచేత బ్రహ్మకు భిన్నముకానటువంటి సంధ్య ఉపాసించబడుచున్నది. దానికి నేను దాసుడను” అని మహాభారతంలో చెప్పబడింది. అటువంటి సంధ్య కు వేరైనది కాదు కాబట్టి ఆ పరమేశ్వరి సంధ్యానామంతో పిలువబడుతోంది.

‘బ్రహ్మాది ఆకారభేదం చేత వేరుగా ఉన్నది. ఐనప్పటికీ కర్మకు సాక్షియై ప్రకాశించే ఈశ్వరశక్తియే సంధ్య’ అని భారధ్వాజ స్మృతిలో చెప్పబడింది.

గాయత్రీ మంత్రము నాల్గవపాదముతో కూడినదై సంధ్యారూపిణి అవుతున్నది అని ఆగమాలు చెబుతున్నాయి. అందుచేత సంధ్యాకాలంలో ఉపాసించతగిన దేవత సంధ్య. కాలికాపురాణంలో సంధ్యాదేవి బ్రహ్మ యొక్క కుమార్తె అని చెప్పబడింది. భగవతీపురాణంలో బ్రహ్మ మానసపుత్రిక అయిన సంధ్య తపస్సు చేసి శరీరాన్ని వదిలి వశిష్ఠుని భార్య అరుంధతిగా జన్మించింది అని చెప్పారు.

చిఛక్తి స్వరూపిణి అయిన పరమేశ్వరియే సంధ్య. సంధ్యాదేవతయే గాయత్రి, సావిత్రి, పరమేశ్వరి. ఈ సంధ్యా దేవతసంధికాలమున ఉపాసించబడుతుంది. సూర్యుడు ఉదయించకముందు, నక్షత్రాలు అస్తమించకముందు కాలము ఉదయసంధ్య. అలాగే సూర్యుడు అస్తమించాడు. కాని నక్షత్రాలు పూర్తిగాలేవు. అది సాయంసంధ్య. ఇవి సంధ్యావందన కాలములు. ఈ సమయంలో ధ్యానించబడేదే సంధ్య. సూర్యుడి యందలి చైతన్యశక్తియే సంధ్య. ఈ దేవిని ఆజ్ఞాచక్రస్థానంలో ధ్యానం చెయ్యాలి.

పంచకోశాలలోను మనోమయకోశము సంధికోశము అదే సంధ్యాస్థానము అని చెప్పబడుతోంది.

సంధ్యాస్నానం జపో హోమో దేవతానాం చ పూజనం ।
ఆతిధ్యం వైశ్వదేవం చ షట్కర్మాణి దినే దినే ।

సంధ్యావందనము, జపము హోమము, దేవతాపూజ, అతిధిపూజ వైశ్యదేవము ఈ ఆరు ప్రతినిత్యము చేయవలసినవి.

సంధ్య అనగా ఒక సంవత్సరము వయసు గల బాలిక. **ఏకవర్షాభవేత్సంధ్యే** అని చెప్పబడింది.

423. ద్విజబృందనిషేవితా

ద్విజులు అంటే రెండు జన్మలు గలవారు. బ్రహ్మక్షత్రియవైశ్యులు. వీరిచే పూజించబడునది. రేణుకాపురాణంలో “సంధ్యాదేవి దేవతలచేత, ద్విజులచేత మహాత్ములచేత కూర్చున్నప్పుడు, పడుకున్నప్పుడు, భోజనం చేస్తున్నప్పుడు, సర్వకాల సర్వావస్థలయందు పూజించబడుతుంది” అని చెప్పబడింది.

ద్విజులు అంటే బ్రాహ్మణక్షత్రియులేకాదు. పక్షులు,పాములు, బల్లులు, చేపలు మొదలైన అండజాలు కూడా ద్విజులే కాబట్టి వీటన్నింటి చేతా పూజించబడేది.

సంధ్యాదేవి యొక్క ప్రాముఖ్యతనే ఇంకా వివరిస్తున్నారు. బ్రహ్మక్షత్రియవైశ్యులు త్రికాలములందు సంధ్యాదేవిని ఉపాసనచేస్తారు. కాబట్టి ద్విజబృందనిషేవితా అనబడుతుంది. వీరికి ఉపనయన సంస్కారము జరుగుతుంది. ఆ తరువాతనే బ్రహ్మవిద్యకు అర్హత వస్తుంది. కాబట్టి బ్రహ్మవిద్యకు అర్హత పొందటానికి సంధ్యాదేవిని ఉపాసించాలి.

424. తత్త్వాసనా

శివాది క్షితి పర్యంతము 25 తత్త్వాలను ఆసనముగా గలది. శ్రీచక్రంలో తత్త్వాలు 25 ఉన్నాయి అని గతంలో చెప్పాం. ఆ తత్త్వాలకుపైన బిందువునందు పరమేశ్వరి ఉంటుంది కాబట్టి, తత్త్వములే ఆసనముగా గలది.

పంచభూతాలు, తన్మాత్రలు, ఇంద్రియాలు, మనస్సు, మాయాదులనబడే తత్త్వాలకు వేరుగా ఉన్నది.

తత్త్వాతీతంచ బైందవమ్ అన్ని తత్త్వములకు అతీతంగా ఉన్నది ఆ పరమేశ్వరి.

గాయత్రిస్థూలరూపము వ్యాహృతి. సూక్ష్మరూపము సంధ్య. కారణరూపము బ్రహ్మభావము. అదే తత్త్వాసనము. తత్త్వాసనా అంటే – బ్రహ్మమే ఆసనముగా గలది. తత్త్వాలు 96 అని, 51అని, 36 అని రకరకాలుగా ఉన్నాయి. వీటన్నింటినీకాదని, వీటిలో కొన్ని ఒక దానిలో ఒకటి లయమవుతాయని చెప్పి శంకరులవారు తత్త్వాలు 25 అన్నారు. ఆ తత్త్వాల స్వరూపమే దేవి. తత్త్వాతీతమైనది పరమేశ్వరి.

425. తత్

తత్ అంటే – బుద్ధి తిరగటము అని అర్థం. ఆ పరమేశ్వరి అందరి మనస్సులయందు, బుద్ధియందు తిరుగుతుంటుంది. కాబట్టి ఈ రకంగా చెప్పబడుతోంది.

సృష్టికి ముందు కాలంలో నిర్వికారంగా ఉన్న ఆత్మరూపము. సకలవేదాలచేత తెలియబడు పరబ్రహ్మస్వరూపము.

426. త్వమ్

త్వమ్ అంటే తుభ్యం నమః నీకు నమస్కారము. ఇక్కడ త్వం అంటే నిర్వికారమైన పరబ్రహ్మ.

సగుణోపాసనలో తనకు వేరైన దేవత. అదే నిర్గుణోపాసనలో తానే అయిన దేవత. పరబ్రహ్మ స్వరూపము.

427. అయీ

పై రెండు నామాలలోనూ వివరించబడి తన కన్న వేరైనది, తన కన్న వేరుకానది. అంటే సగుణ బ్రహ్మ, నిర్గుణబ్రహ్మ ఈ రెండింటి రూపము అయిన ఆ పరమేశ్వరి జగజ్జనని. జ్ఞాన జ్ఞాతృ జ్ఞేయ స్వరూపిణి.

428. పంచకోశాంతరస్థితా

పంచకోశముల మధ్యన ఉండునది. పంచకోశములు పంచికా పూజలోని ప్రసిద్ధిచెందిన దేవతలు. వారు శ్రీవిద్య, పరంజ్యోతి, పరా, నిష్కళా, శాంభవి. ఆ మంత్రములందుండునది. శ్రీచక్రంలో శ్రీవిద్య మధ్యలో ఉండగా మిగిలిన నాలుగు దేవతలు నాలుగువైపులా ఉంటారు. కాబట్టి పరమేశ్వరి పంచకోశాంతరస్థితా అనబడుతుంది.

శరీరంలో ఉండే అన్నమయప్రాణమయ మనోమయ విజ్ఞానమయ కోశముల నడుమ ఆనందమయకోశమందు ఆ దేవి ఉంటుంది.

వ్యాససూత్రాలలో ఆనందమయుడే బ్రహ్మ అని చెప్పారు.

తైత్తిరీయోపనిషత్తులోని భృగువల్లిలో

వరుణ మహర్షికుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తిచేసి బ్రహ్మజ్ఞానం సంపాదించాలనే కోరికతో తన తండ్రి దగ్గరకు వెళ్ళి బ్రహ్మతత్త్వాన్ని ఉపదేశం చెయ్యమని అడిగాడు. దానికి తండ్రి "కుమారా ! అన్నము, ప్రాణము, నేత్రము, శోత్రము, మనస్సు, వాక్కు ఇవన్నీ పరబ్రహ్మ సాధనకు మార్గలే. వీటన్నింటిలోనూ బ్రహ్మతత్త్వం ఇమిడి ఉన్నది. అది దేనిలోనుంచి ఉత్పన్నమైనదో, దేనితో పోషింపబడుతున్నదో, దేనియందులయమవుతున్నదో అన్నిటికీ మూలవస్తువేదో తెలుసుకోవాలి. దాన్ని తపస్సు ద్వారానే సాధించాలి. కాబట్టి వెళ్ళి తపస్సు చెయ్యి" అన్నాడు.

తండ్రి ఆదేశాన్ననుసరించి దీక్ష తీసుకుని నియమనిష్టలతో తపస్సు చెయ్యటం ప్రారంభించాడు భృగువు. కొంతకాలం గడిచింది. ఆ తరువాత అన్నమే పరబ్రహ్మ స్వరూపము అని తెలిసింది. అన్నం మూలంగానే అన్ని ప్రాణులు ఉత్పత్తి అవుతున్నాయి. ప్రాణులన్నీ అన్నంవల్లనే పోషింపబడుతున్నాయి. కాబట్టి అన్నమే పరబ్రహ్మ స్వరూపము. ఈ విషయం తన తండ్రికి చెప్పాడు. దానికి వరుణమహర్షి "నాయనా ! తత్త్వసాధనలో నువ్వు మొదటిమెట్టు మీదనే ఉన్నావు. ఇంకా సాధనచెయ్యి. అన్నం పరబ్రహ్మ స్వరూపమే. కాని అన్నమే పరబ్రహ్మ స్వరూపంకాదు. వెళ్ళి తపస్సు చెయ్యి" అన్నాడు. మళ్ళీ తపస్సు చెయ్యటం మొదలుపెట్టాడు భృగువు. కొంతకాలం గడిచింది. ప్రాణమే బ్రహ్మ అనే విషయాన్ని తెలుసుకున్నాడు. లోకంలోని సమస్త జీవరాశులు ప్రాణంవల్లనే జీవిస్తున్నాయి. ప్రాణం పోయినప్పుడు మృత్యువుతో లయమవుతున్నాయి. అందుచేత ప్రాణమే సర్వ సృష్టికి మూలాధారంఅని భావించాడు. అదే విషయం తండ్రికి చెప్పాడు.

నాయనా ! ఇదివరకటి కన్న కొంచెం ముందుకు వెళ్ళావు. అంతేకాని ప్రాణమే పరబ్రహ్మకాదు. మళ్ళీ మళ్ళీ తపస్సుచెయ్యి అన్నాడు వరుణమహర్షి.

మళ్ళీ తపస్సుచెయ్యటం ఆరంభించాడు భృగువు. కొంతకాలం జరిగింది. మనస్సు వల్లనే ప్రాణులు ఉత్పత్తి అవుతున్నాయి. స్త్రీ పురుషులు మనసుచేతనే ఆకర్షితులౌతున్నారు. అందువల్లనే ప్రాణులు ఉద్భవిస్తున్నాయి. జన్మించిన తరువాత కూడా ఇంద్రియాల సాయం

తోనే జీవనం సాగుతున్నది. అదేవిధంగా చనిపోయిన తరువాత కూడా ఇంద్రియాలకు జ్ఞానం ప్రసాదించే శక్తిపోతుంది. ఇంద్రియాలన్నీ మనస్సులో లీనమవుతాయి. కాబట్టి మనస్సే బ్రహ్మ అనుకున్నాడు భృగువు. ఇదే విషయాన్ని తండ్రికి తెలియచేశాడు. కాదన్నాడు తండ్రి ఇంకా తపస్సు చెయ్యమన్నాడు.

మళ్ళీ కొంతకాలం తపస్సు చేశాడు భృగువు. అప్పుడు అతడికి అర్థమయింది విజ్ఞానమే బ్రహ్మ. అదే విషయాన్ని తండ్రికి చెప్పాడు. కాదన్నాడు తండ్రి. మళ్ళీ తపస్సు చెయ్యమన్నాడు. తండ్రి మాటప్రకారం మళ్ళీ తపస్సు చేశాడు భృగువు. అప్పుడు తెలిసింది ఆనందమే బ్రహ్మ అని సర్వమూ ఆనందం నుంచే జనిస్తుంది. ఆనందంలోనే లయమవుతుంది. ఈ విషయం తండ్రికి తెలియచేశాడు. మహదానందం చెందాడు వరుణ మహర్షి అప్పుడు చెప్పాడు.

"కుమారా ! అన్నింటికన్నా ఉత్తమంగా పరమాత్మను వ్యక్తం చేసే తత్త్వం ఆనందం. అన్నము ప్రాణము, మనస్సు, విజ్ఞానము కూడా పరబ్రహ్మ రూపాలే. ఇవన్నీ ఒక దానికన్న మరొకటి సూక్ష్మమైనది. అన్నింటికీ మించినది ఆనందం. ఈ ఆనందం క్షణికమైనదికాదు. శాశ్వతమైనది. పరబ్రహ్మోపాసన క్రమంగా జరగాలి. ఆహారాన్ని వదలకుండా తింటూ ప్రాణాన్ని నిలుపుకుని, మనసును వికసింపచేసుకుని, దానివల్ల విజ్ఞానం పొంది తద్వారా బ్రహ్మ సాక్షాత్కారం పొందాలి" అన్నాడు.

కాబట్టి పరబ్రహ్మ స్వరూపము పంచకోశములందు ఉంటుంది. కోశము అంటే – వర అని అర్థం.

మానవశరీరంలో ఐదుకోశాలున్నాయి. అవే

1. అన్నమయకోశము
2. ప్రాణమయకోశము
3. మనోమయకోశము
4. విజ్ఞానమయకోశము
5. ఆనందమయకోశము

మొదటి నాలుగుకోశాలనడుమ ఆనందమయకోశముంటుంది. అందులోనే పరబ్రహ్మ ఉంటాడు.

మానవశరీరం మూడురకాలయిన దేహాలుగా విభజించబడుతుంది.

1. స్థూలదేహము 2. సూక్ష్మదేహము 3. కారణదేహము

1. స్థూలదేహము – అన్నమయ కోశము
2. సూక్ష్మదేహము – ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయకోశాలు
3. కారణదేహము – ఆనందమయకోశము

ఈ కోశాలు ఐదు ఒక దానిలో ఒకటి ఉంటాయి. అమ్మవారి బొమ్మవేసినప్పుడు ఆమె చేతిలో ఐదుపూలు వేస్తారు. అవి పంచతన్మాత్రలు. కొన్నిచోట్ల ఆ పూలు విడివిడిగా కాకుండా ఒక దానిలో ఒకటిగా ఉంటాయి. అవి పంచకోశాలు.

1. అన్నమయకోశంలో – ప్రాణమయకోశం ఉంటుంది.
2. ప్రాణమయకోశంలో – మనోమయకోశముంటుంది.
3. మనోమయకోశంలో – విజ్ఞానమయకోశముంటుంది.
4. విజ్ఞానమయకోశంలో – ఆనందమయకోశముంటుంది.

ఆనందమయకోశంలో ఉండేవాడే పరబ్రహ్మ.

పరమేశ్వరియే బ్రహ్మ కాబట్టి ఆమె ఆనందమయకోశమందుంటుంది. అందుచేతనే పంచకోశాంతరస్థితా అనబడుతుంది.

429. నిస్సీమమహిమా

మనసు యొక్క యెల్లలను దాటినది. నిరవధికమైన హద్దులు లేని మహిమ గలది.

అపారమైన ప్రభావము, అనంతమైన ప్రతిష్ఠగలది. ఆది మధ్యాంతరహితురాలు, సర్వవ్యాపి, పంచకృత్యపరాయణ అయిన ఆ పరమేశ్వరి మహిమలకు సీమలు లేవు.

430. నిత్యయౌవనా

ఏ కాలమునందు ముసలితనము లేనిది. నిత్యము యవ్వనము గలది. సదాషోడస వర్షీయ

భూత భవిష్యద్వర్తమానాలలో ఎక్కడా కూడా బాల్య యవ్వన కౌమార వార్ధక్యాది దశలు లేనిది. ఏకైకమైన యవ్వనస్థితిలో ఉండేది. **నవయవ్వనసంపన్నాం** పదహారు సంవత్సరాల ప్రాయము గలది. ఆ పరమేశ్వరియే కాలాన్ని సృష్టించింది. ఆమె కాలస్వరూపిణి. కాలము ఆమె అధీనంలో ఉంటుంది. కాబట్టి కాలమును బట్టి వచ్చే మార్పులు ఆమెలో రావు. అందుచేతనే నిత్యము యవ్వనములో ఉండి నిత్యయవ్వన సంపన్నా అనబడుతుంది.

431. మదశాలినీ

ఆనందమయ విషయమే మదము. పరమేశ్వరి సదామహదానందం పొందుతూ ఉంటుంది కాబట్టి మదశాలినీ అనబడుతుంది. ఏ ఇతర భావావేశము చేతనూ కలవనటువంటి బ్రహ్మానందాన్ని పొందేటటువంటిది. బ్రహ్మానందమనే మదముచే విరాజిల్లునది. పరమానందఘనస్వరూపిణి.

432. మదఘూర్ణితరక్తాక్షీ

మదముచే తిరుగుచున్న ఎర్రని కనులు గలది. లోకసంబంధమైన విషయాలకు దూరంగా ఉండటమే ఘూర్ణము. పరమానందం పొందినప్పుడు, లౌకికవిషయాలన్నీ దూరమైపోయి ఎర్రబారిన కనులు గలది.

నిత్యయవ్వనోద్రేకంలో ఎర్రని రంగుతో తిరుగుతున్న కనులు గలది. బ్రహ్మానందంతో ఎర్రబడ్డ కనులు గలది. రక్తిమ కలిగి చలించే నేత్రాలు సాముద్రిక శాస్త్రం ప్రకారము సౌందర్య లక్షణము.

జపాకుసుమ సంకాశౌమదఘూర్ణితలోచనౌ

433. మదపాటలగండభూః

మదముచేత ఎరుపు తెలుపు కలిసిన రంగు గల చెక్కిళ్ళు గలది. మదముచే అంటే మధువును త్రాగుటచే అని అర్థం. పాటలవర్ణంలో గల చెక్కిళ్ళు నిత్యయవ్వనానికి గుర్తు. యవ్వనంలో చెక్కిళ్ళు శరీరకాంతికన్న ఎక్కువకాంతితో మెరుస్తుంటాయి. నిత్యయవ్వనశాలిని అయిన పరమేశ్వరి మధువును త్రాగటంచేత ఆమె చెక్కిళ్ళు గులాబీల్లాగా ప్రకాశిస్తున్నాయి.

434. చందనద్రవదిగ్ధాంగీ

మంచి గంధముచే పూయబడిన అంగములు గలది. అంటే పరమేశ్వరి శరీరమంతా చందనలేపనం కావించటం జరిగింది. కుంకుమ పూల రసముతో కలిపిన మంచి గంధము శరీరావయవములకు రాయబడినది. ఆనందము ఎక్కువైపోయి చందనలేపనము గావించబడినది.

435. చాంపేయకుసుమప్రియా

చాంపేయ పుష్పము అనగా – నాగకేసరపుష్పము. చంపకపుష్పము. సంపెంగపూవు, సంపెగపూలమీద పరమేశ్వరికి ప్రీతి ఎక్కువ. చాంపేయము అంటే బంగారురంగు గల పుష్పములందు దేవికి మక్కువ ఎక్కువ.

436. కుశలా

సృష్ట్యాది నిర్మాణములందు నేర్పు గలది. కాబట్టి కుశలా అనబడుతుంది.

భూతభవిష్యద్వర్తమాన కాలాలలో ఎప్పుడూ వృద్ధి క్షయాలు అనేవి లేనిది. ఎల్లప్పుడూ ఆరోగ్యంగా ఉండేది. క్షేమంగా ఉండేది. ఏ రకమైన వాంఛలు లేక తృప్తిగా ఉంటుంది. కాబట్టి కుశలా అనబడుతుంది. అన్ని విషయములందు ఆరితేరినది. అంటే పంచకృత్యాలయందు, సర్వవిధవిజ్ఞానమందు, చతుష్షష్టికళలందు, అద్వితీయమైన నేర్పరి కాబట్టి కుశలా అనబడుతుంది.

గాయత్రిరహస్యరూపవర్ణన

437. కోమలాకారా

కోమలః సుకుమారః ఆకారో అవయవ విన్యాసోయస్యాః – సా

సుకుమారమైన ఆకారము గలది. అవయవనిర్మాణము గలది.

కుశలా అని పైన చెప్పిన నామాన్నే వివరిస్తున్నారు. కోమలము అంటే–మృదుత్వము. కాబట్టి కుసుమకోమలమైన ఆకారము గలది. ఒక్క దేవతలను, మానవులనే కాదు. క్రూరస్వభావులైన రాక్షసులను కూడా సమ్మోహింపచేయునది. సకల జన వశీకరణము చేయురూపము గలది.

438. కురుకుళ్ళా

కురుకుళ్ళా అనేది ఒక దేవత. శ్రీపురంలోని అహంకార చిత్తమయ ప్రాకారాల మధ్యలో విమర్శమయమైన బావి యందు ఉంటుంది. లలితాస్తవ రత్నంలో

కురువిందతరుణినిలయాం కులాచలస్పర్ధి కుచనమన్మధ్యాం
కుంకుమ విలిప్తగాత్రీం కురుకుళ్ళాం మనసి కుర్మహే సతతం ॥

కురువిందరత్నములపై నివసించునది, కులపర్వతాలను మించిన కుచయుగములచే వంగిన నడుము గలది, కుంకుమలేపనము గావించబడిన దేహము గలది అయిన కురుకుళ్ళాదేవిని మనసున ధ్యానింతును.

ఈ ప్రాకార ఆవరణలో ఆ దేవి పేరు శ్యామ. ఈమెనే కురుకుళ్ళాదేవి అంటారు. ఈ దేవతాస్వరూపంలోనే ఉంటుంది. కాబట్టి పరమేశ్వరి కురుకుళ్ళా అనబడుతోంది.

సుషుమ్న మార్గంలో ముఖ్య నాడి కురుకుళ్ళా అనబడుతుంది. ఆధారచక్రం దగ్గర నుండి సహస్రారం దాకా, గ్రంథిత్రయముతో సహా ఈ ప్రాణి ఉంటుంది. అందుకే అది కురుకుళ్ళా అనబడుతుంది. భావనోపనిషత్తులో

వారాహీ పితృరూపా, కురుకుళ్ళావళిదేవతా మాతా

శ్రీచక్రానికి ప్రధానదేవత శ్రీదేవి. ఆమె శరీరం నుంచి వచ్చిన కాంతి పుంజాలు అష్టసిద్ధులైన అణిమాది దేవతలు. అలాగే సాదకుడి తండ్రి వారాహి. తల్లికురుకుళ్ళావతి. ఇక్కడ మాతా అంటే సాధకుని కోరికలు తీర్చేది. ఐహికవాంఛలు తీర్చి మోక్షాన్ని ప్రసాదించేది. మానవశరీరంలో సుషుమ్నా నాడీమండలంలో ప్రాణనాడి అని చెప్పబడే సుషుమ్నా నాడినే 'కురుకుళ్ళా' అంటారు.

సుధాసింధువు మధ్యన మణిద్వీపమందున్న శ్రీదేవి పట్టణానికి చిత్తము – అహంకారము అనబడే రెండు ప్రాకారాలమధ్య విమర్శరూపమైన బావియందుండేది కురుకుళ్ళా దేవి అనే దేవత. కాబట్టి ఆమెను మాతగా భావించాలి.

439. కులేశ్వరీ

సజాతీయులైనటువంటి మాతృ మాన మేయముల సమూహము కులము అనబడుతుంది. అటువంటి వాటికి ఈశ్వరి. త్రిపుటికి ఈశ్వరి. కాబట్టి కులేశ్వరి.

కురుకుళ్ళా అనే దేవత యే కులేశ్వరి అనబడుతుంది.

మూలాధారాదికం షట్చక్రం కుల మితి స్మృతం

మూలాధారము స్వాధిష్ఠానము మణిపూరము అనాహతము విశుద్ధిచక్రము ఆజ్ఞాచక్రము ఈ మార్గానికి కులమని పేరు. ఇదే సుషుమ్నా మార్గం. ఈ మార్గంలో సంచరించే ముఖ్యప్రాణస్వరూపిణియే కురుకుళ్ళా దేవి. ఆమెయే కులేశ్వరి అనబడుతున్నది. కులము అంటే నాడీమండలము. దీనికి ఈశ్వరి కాబట్టి కులేశ్వరి అనబడుతుంది. 84 లక్షల జీవరాశికి ఈశ్వరి కాబట్టి కులేశ్వరి అనబడుతుంది.

440. కులకుండాలయా

మూలాధారంలో కర్ణికమధ్యన ఉండే బిందువే కులకుండము. అతి సూక్ష్మంగా ఉంటుంది. అదే ఆ దేవి యొక్క స్థానము. ఆ బిందువునందు లయము గలది. అదే కుండలిని అనబడుతుంది. ఈ విషయాన్ని వివరిస్తూ శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని పదవశ్లోకంలో

సుధాధారాసారై శ్చరణ యుగళాంతర్విగళితైః
ప్రపంచం సించంతీ పున రపి రసామ్నాయమహసః
అవాప్య స్వాం భూమిం భుజగనిభ మధ్యుష్టవలయమ్
స్వమాత్మానం కృత్వా స్వపిషి కులకుండే కుహరిణీ ॥

తల్లీ ! నీ పాదయుగము నుండి స్రవించు సుధాధారలచే ప్రపంచాన్ని తడిపే అమృతానికి నిధానమై, కాంతులు వెదజల్లే చంద్రుని వదిలి, నీ స్వస్థానమైన ఆధరాచక్రాన్ని చేరి అక్కడ భుజంగాకారము దాల్చి తామరదుద్దు మధ్యలో ఉన్న సన్నని రంధ్రమువలె మిక్కిలి సూక్ష్మమైన పృథివీతత్త్వమందు కుండలినీశక్తివై నిద్రింతువు.

గతంలో చెప్పినట్లుగా ఆధారచక్రంలో నిద్రావస్థలో ఉన్న కుండలినీశక్తిని జాగృతం చేసినట్లై, అది గ్రంథిత్రయాన్ని ఛేదించి సహస్రారం చేరి సుధా ధారలు కురిపించి, ఆ తరువాత మళ్ళీ ఆధారచక్రంచేరి నిద్రావస్థలోకి జారుకుంటుంది.

సుషుమ్నకు ఆధారమైన మూలాధారము నందుండు కుండలిని ఆలయంగా గలది కాబట్టి కులకుండాలయా అనబడుతుంది.

చిదగ్నికుండమే కులకుండము. అదే బ్రహ్మము. ముఖ్యప్రాణస్వరూపిణి అయిన పరమేశ్వరి నిర్వికార చిన్మాత్ర. బ్రహ్మమే నివాసస్థానముగా గలది.

441. కౌళమార్గతత్పరసేవితా

వంశపారంపర్యంగా వచ్చిన మార్గము కులసంబంధమైనది కాబట్టి కౌళము అనబడుతోంది. వ్రతఖండము అనే గ్రంథంలో "ఎవరికి దేవి కులమార్గాన ఉన్నదో, వానిచేత ఆమె ధూపదీపనైవేద్యములచే పూజింపబడును" అని చెప్పబడింది. అయితే కుమార్గాన్ని అనుసరించి సంప్రదాయం ప్రకారము ఆమెకు వివిధరకాలయిన నైవేద్యములు సమర్పించటం జరుగుతుంది.

శ్రీ విద్యను ఉపాసించేవారు మూడు రకాలు అని గతంలో వివరించాం. వారు

1. సమయాచారులు – వైదిక సంప్రదాయాలు
2. మిశ్రమాచారులు – కౌళ, సమయాచారాలను మిళితంచేసి అర్చన చేస్తారు
3. కౌళాచారులు – తంత్రశాస్త్రాల ఆధారంగా పరమేశ్వరి అర్చన చేస్తారు.

ఈ కౌళాచారులచే కులమార్గంలో పూజించబడుతుంది. కౌలము కులమార్గము. పారంపర్యంగా అర్చించబడేది.

1. వంశము అనేకరకాలు వాటిలో

1. జనకవంశము – తండ్రి, తాత, ముత్తాత, ఆపైవారు.
2. విద్యావంశము – గురువు, పరమగురువు, పరమేష్టిగురువు
3. వర్ణము – కులాచారం
4. సుషుమ్నామార్గం.

వీటివల్ల సంక్రమించే విద్య పారంపర్యవిద్య. ఈ సంప్రదాయంలో పరమేశ్వరిని కౌళమార్గంలో అర్చించటం జరుగుతుంది. అందుకే ఆమె కౌళమార్గ తత్పరసేవితా అనబడుతుంది.

442. కుమారగణనాథాంబా

కుమారుడు – కుమారస్వామి. గణనాథుడు – గణపతి వీరిద్దరికీ తల్లి. మన్మథ వికారాలను తొలగించేది. వరాహ పురాణంలో

“పరమేశ్వరుడు అవ్యక్తుడు. శక్తి పరమేశ్వరి. వీరి సంయోగముచేత అహంకారం కలుగుతుంది. అహంకారము గలవారిని దేవి బంధిస్తుంది” అని చెప్పబడింది. అంటే భక్తులయొక్క అహంకారము తొలగించి వారికి మోక్షమిస్తుంది ఆ పరమేశ్వరి.

443. తుష్టిః

తుష్టి అంటే – సంతోషము. పరమేశ్వరి సర్వభూతాలకు తుష్టిని కలుగచేస్తుంది. మార్కండేయపురాణంలో

యా దేవీసర్వభూతేషు తుష్టిరూపేణ సంస్థితా ।
నమ స్తస్మై నమ స్తస్యై నమ స్తస్యై నమో నమః

సర్వభూతాల యందు తుష్టిరూపంలో ఉన్న దేవికి నమస్కరిస్తున్నాను.

దేవీభాగవతంలో పరమేశ్వరి అన్ని ప్రాణులయందు బుద్ధి, కీర్తి, ధృతి, లక్ష్మి, శక్తి, శ్రద్ధ, మతి, స్మృతి గా ఉన్నది అని చెప్పబడింది సప్తశతిలో

యా దేవీ సర్వభూతేషు తుష్టిరూపేణ సంస్థితా

అన్ని జీవులయందు నివాసముండి తుష్టిరూపంలో ఉండే పరమేశ్వరి అని చెప్పబడింది.

వీటన్నింటివల్ల పరమేశ్వరి సర్వజీవులయందు ఆవరించి ఉన్నది అనే విషయం తెలుస్తోంది.

444. పుష్టిః

దేవదారువనే పుష్టిః

దేవదారు వనమందు ఉండే దేవి పుష్టి అనబడుతుంది.

యా దేవీ సర్వభూతేషు పుష్టిరూపేణ సంస్థితా

తుష్టియే పుష్టి కూడా కారణము. జగత్తులో సకలజీవభావము, వారి వారి ఆహారవిహారాలు, వాటివల్ల కలిగే పుష్టి అన్ని పరమేశ్వరియే. స్థూల శరీరానికే కాకుండా సూక్ష్మశరీరానికి, కారణశరీరానికి కూడా బలము, స్థైర్యము కలిగించేది కాబట్టి ఆ పరమేశ్వరి పుష్టి అనబడుతుంది.

445. మతిః

మతి అంటే బుద్ధి. సూత సంహితలో “విష్ణువు మొదలగువారిచే స్తుతించబడు దేవి శుభములు కలుగచేస్తుంది. ఆమెను వేదప్రమాణము ద్వారా తెలుసుకోవచ్చును. అటువంటి మతిని, గౌరిని నేను ద్యానిస్తున్నాను అని చెప్పబడింది. కాబట్టి మతి అంటే – పరమేశ్వరి అని అర్థం.

యా దేవీ సర్వభూతేషు బుద్ధి రూపేణ సంస్థితా

జీవులయందు బుద్ధిరూపంలో ఉండి సంకల్ప వికల్పాలను చేసే పరమేశ్వరి మతి అనబడుతుంది. ఈ దేవత సాధకులను అంతర్ముఖులుగా చేసి వారికి స్వస్వరూపజ్ఞానం కలుగచేస్తుంది.

దేవిని ధ్యానించేటప్పుడు ఆమె ఏ ఇంద్రియంలో నిలిస్తే ఆ శక్తి అనబడుతుంది. కంటిలో నిలిస్తే దృశ్యశక్తి. చెవిలో నిలిస్తే శ్రవణశక్తి. మనస్సులో నిలిస్తే మతి అనబడుతుంది.

విష్ణువు మొదలగు దేవతలచే పూజించబడే వేదవిజ్ఞానగని ఆ దేవి. అందుచేతనే ఆమె మతి అనబడుతున్నది.

446. ధృతిః

పిండారక క్షేత్రంలో ఉండే దేవి ధృతి

యా దేవీ సర్వభూతేషు ధృతిరూపేణ సంస్థితా

సర్వభూతము లందు ధృతిరూపంలో ఉండేది. మనస్సు యొక్క స్థిరమైన భావమే ధృతి అనబడుతుంది. మనసుకు కావలసిన ధైర్యస్థైర్యాలు కలిగిస్తుంది. దీనివల్లనే ఆత్మవికాశము, స్వస్వరూప జ్ఞానము కలుగుతాయి.

447. శాంతిః

శాంతి అనేది సత్వగుణ ప్రధానమైనది. పరమేశ్వరిని గనక అర్చించినట్లైతే కామక్రోధలోభమోహ మదమాత్సర్యములనబడే అరిషడ్వర్గాలను నశింపచేసి, సాధకులకు శాంతిని కలిగిస్తుంది. శైవాగమంలో 'మలమాయా వికారాలతో తపించే పురుషుడికి సాధికారస్థానాన్నిచ్చేదే శాంతి. ఇది వాయుసంబంధమైన కళ. అని చెప్పబడింది.

నాసికాద్వారము అంటే ముక్కు. దీనికి 15 అంగుళాల క్రింద హృదయంలో ఉంటుంది. దీన్ని షోడశీకళ అంటారు. ఇదే శాంతి కల. బృహత్పరాశరస్మృతిలో కూడా ముక్కుకు పదిహేను అంగుళాలు క్రిందభాగంలో శాంతికళ ఉంటుంది అని చెప్పబడింది. ఆమెయే శాంతి.

448. స్వస్తిమతీ

సు అంటే	–	బాగుగా, మంచిగా
అస్తి అంటే	–	ఉండటము
మత్	–	కలిగి ఉండటము

అంటే దేవి స్థితి పరమసత్యము. మామూలుగా అనుకునే సత్యం కాదు.నిజమైన సత్యం. అది సత్యానికి సత్యం. ప్రాణాలు – సత్యము, ప్రాణాలకు – బ్రహ్మసత్యం ఆ పరబ్రహ్మయే సత్యానికి సత్యము.

రత్నకోశము ప్రకారము స్వస్తి అంటే – ఆశీస్సు, క్షేమము, నిష్పాపము, పుణ్యము, మంగళము అని అర్థం. స్వస్తి అంటే అవినాశి అని యాస్కుడు చెప్పాడు. కాబట్టి ఆ పరమేశ్వరి అవినాశి లేక మంగళకారిణి.

అందుచేతనే ఆమె స్వస్థిమతీ అనబడుతోంది. సకల ప్రపంచానికీ క్షేమం చేకూర్చేది. కంటికి కనిపించకపోయినా దేన్నయితే గ్రహించగలుగుతున్నామో, అది స్వస్తిమతి అనబడుతోంది.

449. కాంతిః

ఇచ్ఛాశబ్దరూపిణి తేజోమయి

యా దేవీ సర్వభూతేషు కాంతిరూపేణ సంస్థితా

సకల ప్రపంచమందు కాంతిరూపంలో ఉన్నది. ప్రతిజీవిలోనూ జీవం రూపంలో ఉన్నది. ప్రతి జీవిలోనూ జీవకళనే తేజస్సు అంటారు. అదే కాంతి. జీవులయందు ఆ రకంగా తేజోమయరూపంలో ఉండేది కాబట్టి పరమేశ్వరి కాంతి అనబడుతోంది.

450. నందినీ

నందింపచేసేది. ఆనందింపచేయునది. వశిష్ఠుని ఆశ్రమంలోని గోమాత.

నందతీతి నందినీ ఆనందస్వరూపముగా గల పరమేశ్వరీ.

యశోదా, నందుల ఇంట పెరిగిన యోగమాయ. దుర్గాదేవి స్వరూపురాలు గంగానదికిగల నామాలలో ఒకటి.

451. విఘ్ననాశినీ

విఘ్నాలను నశింపచేసేది. అవిద్యను నశింపచేసేది.

విఘ్నాలు అనేకానేకముంటాయి. పనినిబట్టి విఘ్నాలుంటాయి. తన భక్తులకు ఆ రకమైన విఘ్నాలు లేకుండా చేసేది. తన ఉపాసకులు ఏవిధమైన అంతరాయము రాకుండా చూసేది.

452. తేజోవతీ

సూర్యుడు మొదలగు తేజోమూర్తులకు ఆధారభూతురాలు ఆ పరమేశ్వరి నుండి అనేక వేలకోట్ల కిరణాలు ప్రసరిస్తున్నాయి. అందులో అగ్ని 108 కిరణములు సూర్యుడు 116 కిరణములు చంద్రుడు 136 కిరణములు వెరసి 360 కిరణములను గ్రహించగలిగారు. సూర్యుని ప్రకాశమువల్ల పగలు, చంద్రకాంతులవల్ల రాత్రి, అగ్ని

కాంతులవల్ల సంధ్యవేళలయందు ఈ జగత్తులోని వ్యాపారాలన్నీ జరుగుతున్నాయి. అని గతంలో వివరించాం. అయితే ఈ కిరణాలన్నీ శ్రీచక్రంలోని నవావరణల నుంచే ప్రసరిస్తున్నాయి అని కూడా అంటున్నారు.

త్రికోణంలో	3 × 5	=	15	కిరణములు
అష్టకోణంలో	8 × 1	=	8	కిరణములు
అంతర్దశారంలో	10 × 2	=	20	కిరణములు
బహిర్దశారంలో	10 × 6	=	60	కిరణములు
చతుర్దశారంలో	14 × 4	=	56	కిరణములు
అష్టదళపద్మములో	8 × 8	=	64	కిరణములు
షోడశదళపద్మములో	16 × 7	=	112	కిరణములు
భూపురంలో	10 × 3	=	30	కిరణములు
మొత్తం			365	కిరణములు

ఇవే సంవత్సరానికి రోజులు. లలితాసహస్రంలోని శ్లోకాలసంఖ్య 182 1/2 అంటే 365 పాదాలు. ఇవే కాంతి కిరణాలుగా భావించాలి అని చెప్పారు.

అయితే వృత్తము లేక బిందువులో 360 కిరణాలు లేదా డిగ్రీలు ఉంటాయి. అంతేకాని 365 కాదు. అందుచేత ఈ లెక్క సరిగా అగుపించటంలేదు. అయినప్పటికీ వారి మతాన్ని కూడా ప్రతిపాదించాం. ఈ రకంగా కాంతిని ఇచ్చే వాటికి మూలాధారమైనది కాబట్టి తేజోవతీ అనబడుతుంది.

453. త్రినయనా

సోమసూర్యాగ్నులనబడే మూడు నేత్రాలు గలది. తేజోవంతమైన మూడు నేత్రాలు గలది. కుడికన్ను – సూర్యుడు. ఎడమకన్ను – చంద్రుడు. ఫాలనేత్రము – అగ్ని అలాగే కుడికన్ను పగలు, ఎడమకన్ను – రాత్రి. ఫాలనేత్రము సంధికాలము. **జ్ఞానాత్మనే నేత్రత్రయాయ వౌషట్**

జ్ఞానమే మూడునేత్రాలుగా గలది. ఈ నేత్రాలవల్ల కలిగేది కాలజ్ఞానము. అంటే తిథి, పక్షము, మాసము, ఋతువు, ఆయనము, సంవత్సరము. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 48వ శ్లోకంలో

అహస్సూతే సవ్యం తవ నయన మర్కాత్మకతయా
త్రియామాం వామం తే సృజతి రజనీనాయకతయా
తృతీయా తే దృష్టి ర్దరదళిత హేమాంబుజరుచి
స్సమాధత్తే సంధ్యాం దివస నిశయో రంతరచరీమ్ ॥

ఓ దేవీ ! నీ కుడికన్ను సూర్యాత్మకము పగలు, ఎడమకన్ను చంద్రాత్మకము రాత్రి. నీ మూడవనేత్రము సంధ్యాకాలము సూచించుచున్నది.

454. లోలాక్షీ

చలిస్తున్న కనులు గలది. చంచలాక్షి, మృగాక్షి, హరిణాక్షి, కురంగాక్షి, మీనాక్షి ఇవన్నీ కూడా చలిస్తున్న కనులకు ఉదాహరణలు. చలించుచున్న కనులు అనేవి స్త్రీలసౌందర్యానికి గుర్తు అని సాముద్రికశాస్త్రం చెబుతున్నది.

455. కామరూపిణీ

ఇది ఇచ్ఛాదేవి యొక్క స్వరూపం. అన్ని కోరికలు తీర్చువాడు. సర్వకామనలను ఇచ్చువాడు కామేశ్వరుడు. ఆ దేవదేవుని భార్య కామేశ్వరి. కామరూపిణి అనబడుతుంది. ఈమెను కామేశ్వరుని శక్తి అని గుర్తించాలి.

పరమేశ్వరి కామాభిమాని అయిన యోగీశ్వరీ రూపము కాబట్టి కామరూపిణి అని చెప్పబడింది.

తన ఇష్టము వచ్చిన రూపాన్ని పొందగలిగినది కాబట్టి కామరూపిణి అనబడుతుంది.

456. మాలినీ

మాల గలది కాబట్టి మాలిని. మాతృకావర్ణములు అనే అక్షరమాలను ధరించినది కాబట్టి మాలిని. అకారాది క్షకారాంతము మాతృకారూపమైనది. వీటిలో అ నుంచి హ వరకు మాలలోని పూసలు కాగా క్షకారము మేరువు లేదా కొలికి పూస.

పరమేశ్వరుడు జటాజూటంలో ధరించిన గంగ మాలిని అనబడుతుంది. వామనపురాణంలో పార్వతీదేవికి మాలినీ అని పేరున్నది అని చెప్పబడింది. ఛందస్సులో మాలిని అనేది ఒక వృత్త విశేషము. ఏడు సంవత్సరములుకల బాలిక మాలినీ.

457. హంసినీ

హంసలు అనబడే యతులు ఈమె నుంచి అభేదముగా ఉన్నారు. కాబట్టి హంసినీ అనబడుతున్నది.

గమాగమస్థం గమనాది శూన్యం చిద్రూపదీపం తిమిరాపహారం
పశ్యామి తే సర్వజనాంతరస్థం నమామి హంసం పరమాత్మరూపం.

అన్ని జీవులయందు ఉండే హంస అనే పరమేశ్వరునికి నమస్కారము.

పరమాత్మ అన్నిజీవుల యందు ఉన్నాడు. తానే పరమాత్మ స్వరూపము అహం బ్రహ్మాస్మి అని భావించే జ్ఞానుల యొక్క సంసారభయము లేకుండా చేసేది.

మూలాధారం నుంచి బ్రహ్మరంధ్రందాకా, బ్రహ్మరంధ్రం నుంచి మూలాధారం దాకా తిరిగే శ్వాస హంస అనబడుతుంది. హ కారము ఉచ్ఛ్వాస. స కారము నిశ్వాస. ఈ శ్వాస మీద అదుపు సంపాదించ గలిగినవాడు పరమహంస అనబడతాడు. అంటే ప్రాణాయామంలో ఉచ్ఛ్వాసనిశ్వాసలను బంధించి ఉంచగలిగినవాడు.

పరమచైతన్య స్వరూపిణి అయిన ముఖ్యప్రాణశక్తే హంసిని అనబడుతున్నది.

హంస హంస స్సోహం హంసస్యో హం హంసః
హంసహంసాయ విద్మహే పరమహంసాయ ధీమహి
తన్నోహంసః ప్రచోదయాత్. హంసహంసేతి యో బ్రూయాత్
హంసోనామ సదాశివః

458. మాతా

సర్వ జనులకు మాత. సర్వజీవులకు తల్లి. మంత్రాలకన్నిటికీ తల్లి. అక్షరాలన్నింటికీ తల్లి. కల్పాంతంలో మహాప్రళయం సంభవించినప్పుడు జగత్తులోని జీవరాశి అంతా ఆ పరమేశ్వరిలో లీనమయిపోతుంది. మళ్ళీ సృష్టి ఆరంభమైనప్పుడు ఆమె గర్భం నుండి బయటకు వస్తుంది. ఈ కారణంగా జగత్తులోని సర్వజీవులకు ఆమె మాత అవుతున్నది. అవ్యక్తమైన పరమేశ్వరి నుంచే నామరూపాత్మక జగత్తు వ్యక్తమవుతున్నది. అందుకే ఆ పరమేశ్వరి మాతా అనబడింది.

తన తల్లి, భార్య లేక భర్త తల్లి, గురువు భార్య, రాజు భార్య, అన్న భార్య. ఈ ఐదుగురు మాతలనబడతారు. బ్రాహ్మి మొదలైనవారు అష్టమాతృకలు.

లక్ష్మీ బీజానికి మాత అని పేరు. కాయావరోహ క్షేత్రంలో ఉన్న దేవత మాత.

459. మలయాచలవాసినీ

మలయ పర్వతం మీద నివసించునది. మలబారు దేశంలో చందనవనంలో భగవతీనామంతో పూజించబడే దేవి. ఈమెనే మలయాల భగవతి అంటారు. చెంగనూరులో పూజించబడే భగవతి అమ్మవారు ప్రతినెలా రజస్వల అవుతుంది. కేరళ ప్రభుత్వం ఆ వస్త్రాలను వేలం కూడా వేస్తుంది.

460. సుముఖీ

శోభనమైన ముఖము గలది. మంగళకరమైన ముఖము కలది. జ్ఞానముచేత ముఖకాంతి అధికముగ ప్రకాశించునది. ఆమె ముఖము బ్రహ్మ తేజస్సుతో ప్రకాశిస్తున్నది అని వేదం చెబుతోంది. పరమేశ్వరి బ్రహ్మానందస్వరూపిణి కాబట్టి ఆమె ముఖపద్మము సర్వకాల సర్వావస్థలయందు ప్రకాశిస్తూ ఉంటుంది. షోడశీమంత్రవిభాగములో పూజించబడే దేవత సుముఖీ

461. నళినీ

కాళ్ళు, చేతులు, ముఖము, కనులు ఒకటేమిటి శరీరంలోని అంగాలన్నీ కూడా పద్మంరూపంలో ఉండేది కాబట్టి నళినీ అనబడుతుంది.

తామరపద్మమువంటి ముఖము, తామరరేకులవంటి కనులు, తామరతూడులవంటి చేతులు, తామర పద్మములవంటి పాదాలు కలది కాబట్టి ఆ పరమేశ్వరి నళినీ అనబడుతోంది.

గంగానదికి నందిని, నళిని, సీతా అని అనేక పేర్లున్నాయి.

నలుడనే రాజు దేవిని సేవించి తరించాడు. కాబట్టి ఆమె నలినీ అనబడింది.

462. సుభ్రూః

శోభనే భ్రువౌయస్యా–సాః

మంగళకరమైన కనుబొమలు గలది. సుభప్రదమైన మన్మథుని ధనుస్సువలె ఉన్న కనుబొమలు కలది. గతంలో 'వదనస్మరమాంగల్య గృహతోరణ చిల్లికా' అనే నామంలో దీన్ని వివరించాం. సప్తశతిలో

భ్రువౌచ సంధ్యయోస్తేజ శ్రవణా వనిలస్య చ

కనుబొమలు సంధ్యాకాలము చెవులు వాయుతేజము అని చెప్పబడింది. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 47వ శ్లోకంలో

భ్రువౌ భుగ్నే కించి ద్భువనభయ భంగవ్యసనిని
త్వదీయే నేత్రాభ్యాం మధుకరరుచిభ్యాం ధృతగుణమ్
ధను ర్మన్యే సవ్యేతర గృహీతం రతిపతేః
ప్రకోష్ఠే ముష్టౌచ స్థగయతి నిగూఢాం తర ముమే ! ॥

దేవీ ! కొంచెము వంగిన నీ కనుబొమలను తుమ్మెదల వంటి కాంతిగల కనులచేత కట్టబడిన అల్లెత్రాడుగల మన్మథుని యొక్క కుడిచేతిలో పట్టుకోబడిన ముంజేయి పిడికిలి కప్పుచుండగా రహస్యంగా ఉన్న ధనుస్సుగా తలంతును.

ఇక్కడ పరమేశ్వరి కనుబొమలను మన్మథుని ధనుస్సుగా ఊహించటం జరిగింది.

463. శోభనా

సౌందర్యము గలది. సౌందర్యవతి. పైన చెప్పిన నామాలలో పరమేశ్వరి రూపము వర్ణించి ఇప్పుడు ఆమె మిక్కిలి సౌందర్యవతి అని చెబుతున్నారు. ఆ పరమేశ్వరి మంగళకరమైన రూపము గలది.

యా దేవీ సర్వభూతేషు కాంతిరూపేణ సంస్థితా

పరమేశ్వరి అన్ని భూతములయందు కాంతిరూపంలో ఉంటుంది. ప్రపంచంలో అందమైన దృశ్యాలన్నీ పరమేశ్వరి అంశలే.

మహిషాసురుని సంహరించటం ఎలాగా అని దేవతలందరూ ఆలోచిస్తున్నారు. అప్పుడు వారి తేజస్సులతో ఒక స్త్రీ రూపం ఏర్పడింది.

తతః సమస్త దేవానాం తేజోరాశిసముద్భవామ్

ఆ దేవతల నుంచి వచ్చిన తేజస్సుతో ఒక సుందరమైన స్త్రీ రూపము ఉద్భవించింది.

ఈ కారణాలచేతనే పరమేశ్వరి శోభనా అనబడుతుంది.

464. సురనాయికా

దేవతలకు నాయకురాలు. దేవతలయందు శ్రేష్ఠురాలు. సకలదేవతలకు మూలకారణము దేవతలందరిలోనూ మహత్తరమైన మహిమ గలది. దేవతలలో అత్యంత సౌందర్యవతి. అందరి దేవతల శక్తి ఆమెలోనే ఉన్నది. అందుకే పరమేశ్వరి సకల దేవతాశక్తి సమైక్యురాలు. రాక్షససంహారం చెయ్యటానికి దేవతల పక్షాన నాయకత్వం వహించింది. దేవతలను కష్టకాలంలో ఆదుకుంటుంది. అందుకే సురనాయికా అనబడుతుంది.

465. కాలకంఠీ

కాలకంఠుడైన శివుని భార్య. లింగపురాణంలో దారుకాసురుడనే రాక్షసుని సంహరించటానికి శివుడు కాలకంఠి అనే శక్తిని సృష్టించాడు. కోకిల వంటి కంఠనాదము గలదిగాన కాలకంఠీ అనబడుతోంది. కాలంజరపురంలో పూజించబడే దేవత. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 66వ శ్లోకంలో

విపంచ్యా గాయంతీ వివిధమపదానం పశుపతే
స్త్వయారబ్ధే వక్తుం చలిత శిరసా సాధువచనే
తదీయై ర్మాధుర్యై రపలపితతంత్రీకలరవాం
నిజాం వీణాం వాణీ నిచుళయతి చోళేన నిభృతమ్ ॥

తల్లీ ! సరస్వతి నీ ఎదురుగా నీ పతి పశుపతి వీరగాథలను గానం చేస్తుంటే నీవు ఆనందించి ఆమెను ప్రశంసించావు. నీ వాక్కులు తన వీణానాదం కన్న మధురంగా ఉన్నాయని తెలిసి సరస్వతీదేవి తన వీణ కనపడకుండా కప్పి వేసింది.

పరమేశ్వరి వాక్కు మధురము అని చెబుతున్నాడు.

466. కాంతిమతీ

కాంతి కలది. కాంతియుతములైన, తేజోవంతమైన సకలావయవములు గలది. పరమేశ్వరి సకలదేవతల సమిష్టిరూపం అందుచేత వారందరి తేజస్సూ ఆమెలోనే ఉన్నది. అందుచేతనే కాంతిమతి అనబడుతోంది.

467. క్షోభిణీ

పరమేశ్వరుడికి సృష్టి చెయ్యాలనే సంకల్పం కలిగేటట్లు చేసింది. సృష్టికాలంలో నిర్గుణుడైన పరబ్రహ్మలో ప్రవేశించి, చాంచల్యము కలిగించి సృష్టి చెయ్యాలనే కోరిక అతనికి కలిగించింది. మన్మథుని పంచబాణాలలో ఒకటి.

మనః క్షోభమువల్ల కొందరు దేవతలను సృష్టించింది. కాబట్టి క్షోభిణీ అనబడుతుంది.

468. సూక్ష్మరూపిణీ

తెలుసుకోవటానికి వీలులేని రూపము గలది.

కఠోపనిషత్తులో చెప్పినట్లుగా **అణోరణీయాం**. చిన్న దానిలో కూడా అతి చిన్నదైనది. దేవికి స్థూలసూక్ష్మరూపాలున్నాయని గతంలో వివరించాం. సూక్ష్మరూపము అంటే మంత్రరూపము. జ్ఞానేంద్రియాలు. కర్మేంద్రియాలు, పంచప్రాణాలు, మనస్సు, బుద్ధి. వీటిని సూక్ష్మదేహమంటారు.

ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాలను సూక్ష్మదేహమంటారు.

శబ్దము మొదలైన విషయాలకన్న వాటి ఇంద్రియాలు సూక్ష్మాలు. మనస్సు – సూక్ష్మతరము. బుద్ధి ఇంకా సూక్ష్మతరము బుద్ధి కన్న ఆత్మ ఇంకా సూక్ష్మమైనది. పరమేశ్వరి ఆత్మస్వరూపిణి కాబట్టి సూక్ష్మరూపిణీ అనబడింది.

ఈ రకంగా 420 నుంచి 468 నామాల వరకు గాయత్రీ మంత్రం వివరించబడింది.



శ్రీ 'క'కార దేవి

36. షట్చక్రాలు

ఆత్మ ఒక్కటే సత్యము నిత్యము అయినది. జీవాత్మను పరమాత్మతో ఏకం చెయ్యటమే సాయుజ్యం. మోక్షవాదులకు బాహ్యపూజలేదు.

బాహ్యపూజా న కర్తవ్యా కర్తవ్యా బాహ్యజాతిభిః

బాహ్యపూజలు చేసేవారు లౌకికవాదులు

అంతరారాధనపరా వైదికా బ్రహ్మవాదినః

వైదికులు, బ్రహ్మవాదులు అంతరారాధన చేస్తారు. అంతరారాధన అంటే – తానే పరబ్రహ్మ స్వరూపమని భావించి తన దేహంలోని షట్చక్రాలలోనూ పరమేశ్వరితత్త్వాన్ని ఆరాధిస్తారు.

అసలు షట్చక్రాలు అంటే ఏమిటి ? మానవశరీరంలో ఆరుచక్రాలున్నాయి. వాటినే షట్చక్రాలు అంటారు. వీటిలో ఒక్కొక్క దానికి ఒక్కొక్క తత్త్వము కూడా ఉన్నది.

మహీం మూలాధారే, కమపి మణిపూరే హుతవహం
స్థితం స్వాధిష్ఠానే హృదిమరుత మాకాశ ముపరి
మనోఽపి భ్రూమధ్యే సకల మపి భిత్వా కులపథం
సహస్రారే పద్మే అహరహసి పత్యా విహరసే ॥

1. మూలాధారము – భూ తత్త్వాత్మకమైనది
2. స్వాధిష్ఠానము – అగ్ని తత్త్వాత్మకమైనది
3. మణిపూరము – జల తత్త్వాత్మకమైనది
4. అనాహతము – వాయు తత్త్వాత్మకమైనది
5. విశుద్ధిచక్రము – ఆకాశ తత్త్వాత్మకమైనది.
6. ఆజ్ఞాచక్రము – మనస్తత్త్వాత్మకమైనది

వీటన్నింటి పైనా సహస్రదళపద్మమున్నది. అదే సహస్రారము. అక్కడ పరమేశ్వరి పరమశివునితో కలిసి ఉంటుంది.

ఈ చక్రాలు మానవశరీరంలో ఎక్కడున్నాయి ?

మూలాధారం గుదస్థానం । స్వాధిష్ఠానం తు మేహనం
నాభి స్తు మణిపూరాఖ్యాం । హృదయం చాబ్జ మనాహతం
తాలుమూలం విశుద్ధాఖ్యం । ఆజ్ఞాం చ నిటలాంబుజమ్
తస్మా దూర్ధ్వ మధోముఖం వికసితం పద్మసహస్రచ్ఛదమ్
నిత్యానందమఖీ సదాశివపురీ శక్తే నమ శ్శాశ్వతం ॥

మూలాధారం గుదస్థానం	–	ఆధారచక్రము గుదస్థానంలో ఉన్నది.
స్వాధిష్ఠానంతుమేహనం	–	స్వాధిష్ఠానము లింగస్థానంలో ఉన్నది.
నాభిస్తుమణిపూరాఖ్యం	–	మణిపూరము నాభిస్థానంలో ఉన్నది
హృదయంచాబ్జమనాహతం	–	అనాహతము హృదయస్థానంలో ఉన్నది
తాలుమూలం విశుద్ధాఖ్యం	–	విశుద్ధి చక్రం కంఠస్థానంలో ఉన్నది
ఆజ్ఞాంచ నిటలాంబుజమ్	–	ఆజ్ఞాచక్రము భ్రూమధ్యభాగంలో ఉన్నది

తస్మా దూర్ధ్వమదోముఖం వికసితం పద్మం సహస్రచ్ఛదమ్ – వాటిపైన సహస్రదళ పద్మమునందు ఆ పరమేశ్వరి ఉంటుంది.

ఈ చక్రాలకు విడివిడిగా దళాలుంటాయి.

1.	ఆధారచక్రానికి	–	4 దళాలు
2.	స్వాధిష్ఠానానికి	–	6 దళాలు
3.	మణిపూరానికి	–	10 దళాలు
4.	అనాహతానికి	–	12 దళాలు
5.	విశుద్ధిచక్రానికి	–	16 దళాలు
6.	ఆజ్ఞాచక్రానికి	–	2 దళాలు
7.	సహస్రారానికి	–	వేయి దళాలు

వీటిలో ప్రతి చక్రానికి కొన్ని కిరణాలుంటాయి.

శంకర భగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 14వ శ్లోకంలో

క్షితౌ షట్పంచాశ ద్విశ మధిక పంచాశ దుదకే
హుతాశే ద్వాషష్టి చతురధిక పంచాశదనిలే
దివి షట్త్రింశ న్మనసి చ చతుష్షష్టి రితియే
మయూఖాస్తేషాం అప్యుపరి తవ పాదాంబుజయుగమ్

క్షితౌషట్పంచాశ	–	భూతత్త్వాత్మకమైనమూలాధారానికి	56 కిరణాలు
ద్విశమధికపంచాశదుదకే	–	జలతత్త్వాత్మకమైన మణిపూరానికి	52 కిరణాలు
		ఈ మొత్తం అగ్నిదేవునివి	108 కిరణాలు
హుతాసేద్వాషష్టి	–	అగ్నితత్త్వాత్మకమైన స్వాధిష్ఠానానికి	62 కిరణాలు
చతురధికపంచాశదనిలే	–	వాయుతత్త్వాత్మకమైన అనాహతానికి	54 కిరణాలు
		ఈ మొత్తం సూర్యునివి	116 కిరణాలు
దివిద్విషట్త్రింశన్	–	ఆకాశతత్త్వాత్మకమైన విశుద్ధి చక్రానికి 36 × 2 =	72 కిరణాలు
మనసిచ చతుష్షష్టిరితియే	–	మనస్తత్త్వాత్మకమైన ఆజ్ఞాచక్రానికి	64 కిరణాలు
		ఈ మొత్తం చంద్రునివి	136 కిరణాలు

మానవశరీరము మూడు ఖండాలుగా ఉన్నది. అవి 1. అగ్ని మండలము 2. సూర్యమండలము 3. చంద్రమండలము.

1. అగ్నిమండలము : ఆధార, మణిపూరచక్రాలను అగ్నిమండలము అంటారు. అస్యశ్రీ అగ్ని మండల మహామంత్రస్య । అగ్నిఋషిః । అనుష్టుప్ఛందః । శ్రీ అగ్ని మండలం దేవతా । రంబీజం । ధూమ్రార్చిశ్శక్తిః । ఊం కీలకం । జపేవినియోగః ॥

న్యాసము : రాం । రీం । రూం । రైం । రౌం । రః ।

ధ్యానము : సదాశివప్రియం రౌద్రం సప్తాస్యం సర్వతోముఖం ।
వందే తం శిఖినం నిత్యం హవ్య కవ్యవహం ముదా ॥

మంత్రము : హ్రీం శ్రీం సౌః శ్రీఅగ్నిమండల శ్రీపాదుకాం పూజయామినమః ॥

దీనిలో 108 కిరణాలున్నాయి.

మూలాధారము (పృథివీతత్త్వాత్మకము) 56 కిరణాలు :

1. ఉడ్డీశ్వర	6. పూర్ణేశ్వరి	11. అనంత	16. పాతాద దేవి
2. ఉడ్డీశ్వరి	7. కామేశ్వర	12. స్వరసా	17. నారదాఖ్య
3. జలేశ్వర	8. కామేశ్వరి	13. శంకర	18. నాదా
4. జలేశ్వరి	9. శ్రీకంఠ	14. మతి	19. ఆనంద
5. పూర్ణేశ్వర	10. గగనా	15. పింగళ	20. హాకినీ

21. ఆలస్య	30. హాకినీ	39. అనాదివిమల	48. కూలాలికా
22. డాకినీ	31. ఆధారేశ	40. మాతంగీ	49. మిత్రేశ
23. మహానంది	32. రక్త	41. సవర్ణావిమల	50. కుబ్జా
24. లాకినీ	33. చక్రేసి	42. పుళింద	51. ఉడ్డీశ
25. యోగ్య	34. చండా	43. యోగవిమల	52. లక్ష్మీ
26. లౌకినీ	35. కురంగేశ	44. శాంభరీ	53. షష్ఠీశ
27. అతీత	36. కరాళా	45. సిద్ధవిమల	54. కులేశ్వరి
28. శాకినీ	37. మదద్రీశ	46. వాచాపరా	55. చర్వాధీశ
29. పాదం	38. మహేచ్ఛుష్మా	47. సమయవిమలా	56. అజా

ఇవి ఆధారచక్రంలోని నాలుగు దళాల యందు దళానికి ఏడుచొప్పున రెండు ఆవృత్తులుగా ఉంటాయి.

మణిపూరము, (జలతత్త్వాత్మకము) 52 కిరణాలు :

1. సద్యోజాత	14. విద్యా	27. విద్యావాగీశ్వర	40. రత్నమేఖలా
2. మాయా	15. అచింత్య	28. చిత్రా	41. పింగళ
3. వామదేవ	16. శాంతా	29. చతుర్విధేశ్వర	42. యశోవతీ
4. శ్రీః	17. శశిరేఖ	30. సుకమలా	43. సాధ్యాఖ్య
5. అఘోర	18. ఉమా	31. ఉమాంగేశ్వర	44. హింసానంద
6. పద్మా	19. తీవ్ర	32. మన్మథా	45. పరదివ్యేషు
7. తత్పురుష	20. గంగా	33. కృష్ణేశ్వర	46. వామా
8. అంబికా	21. మణివాహ	34. క్రియా	47. మారదివ్యోషు
9. అనంత	22. సరస్వతీ	35. శ్రీకంఠ	48. జ్యేష్ఠా
10. నివృత్తి	23. అంబువాహ	36. లయా	49. పీఠేషు
11. అనాథ	24. కమలా	37. అనంత	50. రౌద్రి
12. ప్రతిష్ఠా	25. తేజోऽధీశ	38. సతీ	51. సర్వేశ్వర
13. జనశ్రిత	26. పార్వతీ	39. శంకర	52. సర్వమయీ

ఈ రశ్ములు మణిపూరంలోని షడ్దళాలలోను వరుసగా 4,4,6,4,5,3 చొప్పున రెండు ఆవృత్తులుగా ఉంటాయి.

గమనిక : స్వాధిష్ఠాన మణిపూరాలకు పేర్లు కొన్ని గ్రంథాలలో అటూ, ఇటూ మారుతున్నాయి. పాఠకులు గమనించగలరని మనవి :

2. సూర్యమండలము : స్వాధిష్ఠాన అనాహతచక్రాలను సూర్యమండలం అంటారు.

అస్యశ్రీ సూర్యమండల మహామంత్రస్య । సూర్య ఋషిః । త్రిష్టుప్ఛందః । శ్రీ సూర్యమండలం దేవతా। హ్రాం బీజం। తపినీ శక్తిః। ఈం కీలకం। జపేవినియోగః ॥

న్యాసము : హ్రాం । హ్రీం । హ్రూం । హ్రైం । హ్రౌం । హ్రః ।

ధ్యానము : ఆదిత్యం సర్వకర్తారం కళాద్వాదశ సంయుతం ।
పద్మహస్త ద్వయం వందే సర్వలోకైక సాక్షిణమ్ ॥

మంత్రము : హ్రీం శ్రీం క్లీం శ్రీసూర్యమండల శ్రీపాదుకాం । పూజయామి నమః ॥

దీనిలో 116 కిరణాలున్నాయి.

స్వాధిష్ఠానము (అగ్ని తత్త్వాత్మకము) కిరణాలు 62 :

1. పరాపర	16. స్మరా	31. స్వాద	47. పింగళా
2. చండీశ్వర	17. స్వచ్ఛ	32. ప్రచండ డాకిని	48. కరాలా
3. పరమ	18. స్పర్శ	33. యోగేశ్వర	49. సదాఖ్య
4. చతుష్మతీ	19. భూతేశ్వర	34. చండా	50. కుబ్జికా
5. తత్పర	20. శబ్ద	35. పీఠేశ్వర	51. కాళరాత్రీ గురు
6. గృహ్యకాళి	21. ఆనంద	36. కోశలా	52. పరా
7. అపర	22. డాకిని	37. కులకోలేశ్వర	53. సిద్ధగురు
8. సంవర్తా	23. ఆలస్య	38. పావని	54. శాంతాతీతా
9. చిదానంద	24. రత్న డాకిని	39. కుక్షీశ్వర	55. రత్నగురు
10. నీలకుబ్జా	25. ప్రభానంద	40. సమయా	56. శాంతా
11. అఘోర	26. చక్రడాకిని	41. శ్రీకంఠ	57. శివగురు
12. గంధా	27. యోగానంద	42. కామా	58. విద్యా
13. సమరస	28. పద్మడాకినీ	43. అనంత	59. మేలగురు
14. రసా	29. అతీత	44. రేవతి	60. ప్రతిష్ఠా
15. లలిత	30. కుబ్జడాకిని	45. శంకర	61. సమయగురు
		46. జ్వాలా	62. నివృత్తి

ఇక్కడ పది దళాలున్నాయి. రశ్ములు 9 దళాలలో 3 చొప్పున 9 × 3 = 27 పదవ దళమందు 4. ఈ రకంగా రెండు ఆవృత్తులుగా ఉంటాయి.

అనాహతము (వాయుతత్వాత్తకము) కిరణాలు 54 :

1. ఖగేశ్వర	14. లీలా	27. సామర	41. శిరస
2. భద్రా	15. ప్రియ	28. సాకినీ	42. కులదీపికా
3. కూర్మ	16. కుముద	29. హామర	43. శిఖేశ
4. ఆధారా	17. కౌళిక	30. హాకినీ	44. సర్వేశా
5. మేష	18. మేనకా	31. ఆధారేశ	45. వర్మా
6. కోశా	19. డామర	32. రాక	46. బహురూపా
7. మీనా	20. డాకినీ	33. చక్రీశ	47. అస్త్రేశ
8. మల్లికా	21. రామా	34. బిందు	48. మహత్తరీ
9. జ్ఞానా	22. రాకినీ	35. కుకురా	49. పరగురు
10. విమలా	23. లామర	36. కులా	50. మంగళా
11. మహానందా	24. రాకినీ	37. మయశ్రీశ	51. పరాధిగురు
12. శర్వరి	25. కామర	38. కుబ్జికా	52. కోశటి
13. తీవ్ర	26. కాకినీ	39. హృదీశ	53. పూజ్యగురు
		40. కామకల	54. రామా

ఇక్కడ 12 దళాలున్నాయి.

ఈ రశ్ములు 3,6,9 దళములందు మూడు చొప్పున, మిగిలిన 9 దళాలయందు రెండు చొప్పున, రెండు ఆవృత్తులుగా ఉంటాయి.

3. చంద్రమండలము : విశుద్ధి ఆజ్ఞాచక్రాలను చంద్రమండలమంటారు.

అస్యశ్రీ సోమమండల మహామంత్రస్య సోమఋషిః । గాయత్రీఛందః । శ్రీ సోమండలం దేవతా । సంబీజం । అమృతాశక్తిః। ఆం కీలకం । జపే వినియోగః॥

న్యాసము : సాం । సీం । సూం । సైం । సౌం । సః ।

ధ్యానము : క్షీరోదార్ణ వసం భూతం శశినం సర్వకామదం ।
స్రవంత మమృతం నిత్యం స్వకళాభి ర్వృతం భజే ॥

మంత్రము : హ్రీం శ్రీం ఐం శ్రీ సోమమండల శ్రీ పాదుకాం పూజయామి నమః॥

దీనిలో 136 కిరణాలున్నాయి.

5. విశుద్ధి చక్రము, (ఆకాశ తత్త్వాత్మకము) కిరణాలు : 72

1. హృదయ	19. మనోభయ	37. వాము	55. బహుళ
2. కౌలికి	20. హేలా	38. ఐఫఘ్నీ	56. మహత్తరీ
3. ధర	21. కోక	39. కుల	57. తాత
4. కాంతా	22. మహారక్తా	40. సింహ	58. కుండలినీ
5. భోగ	23. జ్ఞానగుహ్యా	41. సంహార	59. కులాతీత
6. విశ్వా	24. కుబ్జికా	42. కులాంబికా	60. కులేశీ
7. మయ	25. స్వర	43. విశ్వంభర	61. అజ
8. యోగిని	26. డాకినీ	44. కామా	62. ఈధికా
9. మహః	27. జ్వలన	45. కోటిలా	63. శసంత
10. బ్రహ్మసారా	28. శాకినీ	46. కూనమాతా	64. దీపికా
11. శన	29. మహాకుల	47. గాలవ	65. ఏష
12. శబరీ	30. లాకినీ	48. కంకాళీ	66. రోచికా
13. ద్రవ	31. మహోజ్వల	49. వ్యోమ	67. శిఖ
14. కాళికా	32. కాకినీ	50. వ్యోమా	68. మెచికా
15. రస	33. తేజః	51. శ్వసన	69. పరమ
16. జుష్టచండాలీ	34. శాకినీ	52. నాదా	70. పరా
17. మోహ	35. మూర్ధా	53. ఖేచర	71. పర
18. అఘోరేశి	36. హాకినీ	54. మహాదేవి	72. చిత్

ఇందులో 16 దళాలున్నాయి. వీటిలో మొదటి రెండు దళాలలోను, చివరి రెండు దళాలలోనూ మూడు మూడు చొప్పున 4×3 = 12, మిగిలిన 12 దళాలలోనూ రెండు రెండు చొప్పున 12 × 2 = 24. రెండు ఆవృత్తులుగా ఉంటాయి.

6. ఆజ్ఞా చక్రము (మనస్తత్త్వాత్మకము) కిరణాలు 64 :

1. పట	5. చిత్	9. సృష్టి	13. స్థితి
2. పరా	6. చిత్పరా	10. సృష్టిపరా	14. స్థితిపరా
3. భర	7. మహామాయా	11. ఇచ్ఛా	15. నిరోధ
4. భరా	8. మహామాయాపరా	12. ఇచ్ఛాపరా	16. నిరోధపరా

17. ముక్తి	29. ఆత్మ	41. కుండలినీ	53. వర్ణజ
18. ముక్తిపరా	30. ఆత్మపరా	42. కుండలినీపరా	54. వర్ణజపరా
19. జ్ఞాన	31. ఇంద్రియాంశ్రయ	43. సౌషుమ్నా	55. శబ్దజ
20. జ్ఞానపరా	32. ఇంద్రియాంశ్రయాపరా	44. సౌషుమ్నాపరా	56. శబ్దజపరా
21. సత్య	33. గోచర	45. ప్రణసూత్ర	57. వర్ణజ్ఞాత
22. సతీపరా	34. గోచర పరా	46. ప్రణసూత్రపరా	58. వర్ణజ్ఞాతపరా
23. అసత్య	35. లోకముఖ్య	47. స్యంధ	59. వర్గజ
24. అసతీపరా	36. లోకముఖ్యపరా	48. స్యందపరా	60. వర్గజపరా
25. సదసత్	37. వేదవత్	49. మాతృక	61. సంయోగ
26. సదసత్పరా	38. వేదవత్పరా	50. మాతృకపరా	62. సంయోగపరా
27. క్రియా	39. సంవిత్	51. స్వరోద్భవ	63. మంత్ర విగ్రహా
28. క్రియాపరా	40. సంవిత్పరా	52. స్వరోద్భవపరా	64. మంత్ర విగ్రహాషా

ఆజ్ఞా చక్రంలో రెండు దళాలున్నాయి. ఇవి ఒక్కొక్క దానిలోనూ నాలుగు నాలుగు చొప్పున ఎనిమిది ఆవృత్తులుగా ఉంటాయి. ఈ కిరణములన్నింటిపైన దేవి యొక్క పాద యుగళమున్నది. అదే ఈ కిరణములకు ఆధారము.

ఇప్పుడు 108 + 116 + 136 = 360 కిరణాలు. అవే డిగ్రీలు. ఇది వృత్తరూపము లేక బిందువు. ఈ రకంగా 360 కిరణాలు పరమేశ్వరి పాదారవిందములనుండి ప్రసరిస్తున్నాయి. ఈ 360 కిరణాలే 360 రోజులు సంవత్సరస్వరూపము.

హయనాత్మా మహాదేవః ప్రజాపతి రితి స్మృతిః

కాలపురుషుడే ప్రజాపతి. లలితాసహస్రంలో 469 నుంచి 542 దాకా నామాలలో ఈ షట్చక్రాలను, వాటిలో ఉండే దేవతలను వివరించటం జరిగింది. ఇక నామాలను చూద్దాం.

469. వజ్రేశ్వరీ

జాలంధరపీఠంలో ఉండే దేవత. షోడశనిత్యలలో ఆరవనిత్య వజ్రేశ్వరి. శ్రీచక్రంలో ముందుగా బిందువు. దాని నుంచి త్రికోణం వచ్చింది. దీని మూడుకోణాలలోనూ కామేశ్వరి, వజ్రేశ్వరి భగమాలిని అని మూడుశక్తులుంటాయి. వాటిలో రెండవదేవత వజ్రేశ్వరి.

విశుద్ధి చక్రం కంఠస్థానంలో ఉంటుంది. ఆ చక్రానికి అధిదేవత వజ్రేశ్వరి. ఈమెయే వాగీశ్వరి దేవత కూడా.

పరమేశ్వరి నివసించే మణిద్వీపానికి ఉన్న ప్రాకారాలలో పదకొండవ ప్రాకారంలో వజ్ర అనబడే నది ఉన్నది. దానికి అధిష్ఠానదేవత వజ్రేశ్వరి. ఆ ప్రాంతంలో ఎప్పుడూ ప్రవహిస్తూ ఉండే వజ్ర అనే పేరుగల నది ఒకటి ఉన్నది. దాని అలలమీద కలకల రావములు చేస్తూ హంసలు తిరుగుతుంటాయి. దాని గట్టున వజ్రేశి అనే దేవత ఉంటుంది. ఆమె వజ్రాలతో చేసిన నగలు ధరించి ఉంటుంది.

470. వామదేవీ

వామదేవుని శక్తి వామదేవి. దేవతలు "ఇతడు మనకు నమస్కరింపతగినవాడు. కాబట్టి వామదేవుడైనాడు" అన్నారు. వామదేవుడు అంటే – నమస్కరింపదగినవాడు. అని ఐతరేయోపనిషత్తులో చెప్పబడింది. అర్ధనారీశ్వరుడు పరమేశ్వరుడు. అతని వామభాగమునున్నటువంటిది వామదేవి. దేవీభాగవతంలో

వామాంకే షణ్ణిషణ్ణా స్వదేవీ శ్రీభువనేశ్వరీ

భువనేశ్వరుని వామాంకం మీద ఉండేది భువనేశ్వరి. శివుని యొక్క ఉత్తరముఖము వామదేవుడు. అతని శక్తి వామదేవి.

వామాచారంలో పూజించేవారి దేవత. వామాచారుల కోరికలు సదా తీరుస్తూ ఉంటుంది. వామము అంటే – విపరీతము. విపరీతమార్గముచే సుఖమునిచ్చేది వామదేవి.

అతి సుందరమైన శరీరలావణ్యం గల దేవత. దుర్గాదేవి యొక్క పేరు. షట్చక్రాలలో అనాహతచక్రానికి అధిష్ఠానదేవత.

471. వయోవస్థావివర్జితా

బాల్య, కౌమార, యవ్వన, వృద్ధాప్యదశలు ఏవీ లేనిది. వయస్సుతోపాటుగా వచ్చే అవస్థలు లేనిది. **సదాషోడశవర్షీయాం.** ఎల్లప్పుడూ పదహారు సంవత్సరాల ప్రాయంలోనే ఉంటుంది నిత్యయవ్వనసంపన్న.

కాలము అనేది పరమేశ్వరుడిచే కల్పించబడింది. అటువంటి కాలానికి అతీతురాలు పరమేశ్వరి. అందుచేత వయస్సుతోను, కాలంతోనూ వచ్చే మార్పులు ఆమెకు ఉండవు. అందుకే ఆమె వయోవస్థా వివర్జితా అనబడుతుంది. షట్చక్రాలలోను మణిపూరచక్రానికి అధిష్ఠానదేవత.

472. సిద్ధేశ్వరీ

దేవతలలో గోవులను కాచేవారు సిద్ధులు. వీరిచే పూజింపబడుతుంది. కాబట్టి సిద్ధేశ్వరి అనబడుతుంది.

కాశీక్షేత్రంలో సర్వసిద్ధులు ప్రసాదించే దేవి ఉన్నది ఆమె సిద్ధేశ్వరీదేవి.

సిద్ధులు అనేకరకాలు ప్రత్యేకంగా అష్టసిద్ధులు అని ఎనిమిది సిద్ధులు ప్రసిద్ధిచెందాయి. శ్రీచక్రంలోని భూపురంలోని మొదటిరేఖలో ఈ సిద్ధి దేవతలుంటారు.

నిధివాహనసమారూఢా వరదా భయకరాంబుజా
పద్మరాగప్రతీకాశా ప్రసీద త్వమణిమాదయః
గరిమాణం లఘిమాణం వశిత్వ మణి మహిమానౌ
ప్రాకామ్యం భక్త్యాహం వందే ప్రాప్తించ సర్వకామదమ్ ॥

1. అణిమా – శరీరాన్ని అతి చిన్నగా చెయ్యటం
2. మహిమ – శరీరం అతి పెద్దదిగా చెయ్యటం
3. గరిమ – శరీరము బరువును విపరీతంగా పెంచటం
4. లఘిమ – శరీరము బరువును విపరీతంగా తగ్గించటం
5. ప్రాప్తి – కావలసిన వస్తువులు పొందటం
6. ప్రాకామ్యం – ఆకాశసంచారము
7. ఈశిత్వము – సమస్థానికీ అధికారం పొందటం
8. వశిత్వం – సమస్త భూతాలను లోబరచుకోవటం

ఈ దేవతలను అర్చిస్తే ఆ ఫలితాలు వస్తాయి. కాని సిద్ధేశ్వరి అనే దేవత ఈ శక్తులేగాక, దూరశ్రవణము దూరదృష్టి, భవిష్యద్వాణి వంటి సిద్ధులు కూడా ప్రసాదిస్తుంది.

షట్చక్రాలలోనూ స్వాధిష్ఠానానికి అధిదేవత. కుర్తాళం పీఠానికి అధిదేవత సిద్ధేశ్వరి ఆ పీఠం పేరే సిద్ధేశ్వరీపీఠం.

473. సిద్ధవిద్యా

పంచదశీ మహామంత్రము సిద్ధవిద్యామంత్రము. దానికి శోధనలేదు. సిద్ధాదిశోధన అవసరం లేకుండానే ఈ మంత్రాన్ని ఉపదేశం పొందవచ్చు.

సామాన్యంగా ఏదైనా మంత్రాన్ని తీసుకోవాలనుకున్నప్పుడు ఆ మంత్రం మనకు సిద్ధిస్తుందా లేదా అనే విషయం ముందుగా తెలుసుకోవాలి. దీనికి అర్వాణచక్రం వేసి మంత్రం తీసుకోబోయేవాడికి, మంత్రం ఏ రకంగా ఉన్నదో చెబుతారు. అర్వాణచక్రంలో మంత్రం నాలుగురకాలుగా వస్తుంది. 1. సుసిద్ధము 2.సిద్ధము 3. సాధ్యము 4. అరిష్టము

1. సుసిద్ధము అంటే – గత జన్మలలోనే ఈ మంత్రం సాధకుడికి సిద్ధించింది. కాబట్టి మంత్రం తీసుకుని ఏ కొద్దిపాటి జపం చేసినా సిద్ధిస్తుంది.

2. సిద్ధము అంటే – మంత్రాన్ని గట్టిగా నియమనిష్ఠలతో ఉపాసనచేసినట్లైతే సిద్ధిస్తుంది.

3. సాధ్యము అంటే – చాలా శ్రమపడి ఉపాసన చేస్తే మంత్రం సిద్ధించవచ్చు. అంత తేలిక మాత్రం కాదు.

4. అరిష్టము అంటే – మంత్రాన్ని తీసుకుంటే ఉపాసకుడికి భయం వేస్తుంది. పిచ్చికలలు వస్తాయి. ఒక రకమైన ఉన్మాదానికి కూడా లోనవుతాడు. ఇటువంటి వారు ఆ మంత్రాన్ని వదిలివేసినట్లైతే ఆ బాధలు తప్పుతాయి.

అయితే పంచదశి మహామంత్రం విషయంలో ఈ రకమైనవి ఏవీ చూడవలసిన అవసరంలేదు. సిద్ధశోధన చెయ్యవలసిన అవసరం లేదు. ఇది మహామంత్రము. మహామంత్రాలను ఉపాసన చెయ్యాలి అంటే గతజన్మలో వాటితో అనుబంధం ఉండాలి. లేకపోతే వంశపారంపర్యంగా రావాలి. కాని శ్రీవిద్య సిద్ధవిద్య. దీనికి అటువంటి నియమాలు నిష్ఠలు అవసరంలేదు. అది సిద్ధిస్తుందా లేదా అని చూడవలసిన అవసరం కూడా లేదు.

దేశంలో చాలామంది ఏరకమైన మంత్రోపాసనా లేకుండానే లలితాసహస్రం పారాయణ చేస్తుంటారు. వారందరికీ కూడా గతజన్మలోనే పరమేశ్వరితో అనుబంధం ఉన్నదన్నమాట. లేకపోతే వారలాచెయ్యరు. ఈ రకంగా అనుబంధమున్నవారు తమ స్నేహితులవల్లనో, ఇతరులవల్లనో పారాయణ జరిగేచోటికి వెళ్ళి క్రమేణా వారు కూడా లలితాసహస్రం పారాయణ చెయ్యటానికి అలవాటుపడతారు. వీరందరికీ గతజన్మలో పరమేశ్వరితో అనుబంధమున్నది అనే విషయం మరిచిపోకూడదు. అలా కొంతకాలం పారాయణ చేసిన తరువాత మంత్రోపదేశం కూడా తీసుకోవచ్చును. మంత్రం సిద్ధిస్తుందా లేదా అనే విషయం ఆలోచించవలసిన అవసరంలేదు. తప్పనిసరిగా సిద్ధిస్తుంది.

మంత్రోపాసన చేసినట్లైతే శ్రీవిద్యలో కొన్ని ఇబ్బందులు వస్తాయట కదా ? అని చాలా మంది అడుగుతుంటారు. మంచి గురువు దగ్గర ఉపదేశం పొంది సత్సంకల్పంతో జపం చేస్తే చెడు ఎప్పుడూ జరగదు. కాకపోతే మంత్రాన్ని ఎప్పుడూ మంచి కోసమే వాడాలి. అంతే కాని చెడు కోసం మంత్రాన్ని ఉపయోగించకూడదు. అలాంటప్పుడు దానివల్ల ఇబ్బందులు వస్తాయి. మంత్ర జపం చేసేటప్పుడు సత్సంకల్పమనేది ముఖ్యం. మనసా వాచా కర్మణా అందరి క్షేమాన్నే కోరాలి. శ్రీవిద్య మీద ఆసక్తి గలవారి కోసం ఈ విషయం ఇక్కడ చెప్పబడింది.

పుట్టుకతోనే జ్ఞానవైరాగ్యాలు కలవారు సిద్ధులు సనకసనందనాదులు, వారిచే ఉపాసించబడే విద్య కాబట్టి ఇది సిద్ధవిద్య.

షట్చక్రాలలో ఆధారచక్రంలో ఉండే దేవత సిద్ధవిద్య. ఉపాసనవల్ల చిత్తశుద్ధిని, జ్ఞానాన్ని ప్రసాదించేవి సిద్ధవిద్యలు. అవి.

కాళీ తారా మహావిద్యా షోడశీ భువనేశ్వరీ
భైరవీ ఛిన్నమస్తా చ విద్యా ధూమావతీ తథా
బగళా సిద్ధవిద్యా చ మాతంగీ కమలాత్మికా
ఏతా దశమహావిద్యాః సిద్ధవిద్యాః ప్రకీర్తితాః ॥

474. సిద్ధమాతా

సిద్ధులకు తల్లి. పుట్టుకతోనే జ్ఞానవైరాగ్యాలు పొందిన సనకసనందనాదులకు తల్లి. ఆమె వారిని సర్వదా రక్షిస్తుంటుంది. స్మరించినంతమాత్రం చేతనే భక్తుల ఆపదలను తొలగించి వారిని రక్షించటానికి సదాసిద్ధంగా ఉంటుంది. ప్రపంచంలోని అన్ని జీవులు పరమేశ్వరి యొక్క సంతానమే. ఆమె వారిని ఎల్లప్పుడూ రక్షిస్తూ ఉంటుంది. సంసార తాపత్రయాలనుండి రక్షించటానికి సదాసిద్ధంగా ఉంటుంది. కాబట్టి సిద్ధమాత అనబడుతుంది. ఆజ్ఞానచక్రాధిష్ఠానదేవత సిద్ధమాత.

475. యశస్వినీ

యశస్సు గలది. కీర్తి గలది కాబట్టి యశస్విని అనబడింది. **తస్యనామ మహద్యశః** దానియొక్క నామమే మహాద్యశము.

సిద్ధేశ్వరి, సిద్ధవిద్యా, సిద్ధమాత అని చెప్పటంచేత పరమేశ్వరి సకలప్రపంచానికి సిద్ధులను ప్రసాదిస్తుంది. అందుచేతనే ఆమె గొప్ప కీర్తి గలది. యశస్విని అనబడింది. మేధాదేవి అయిన దేవతయే యశస్విని. సహస్రదళపద్మంలో ఉండే దేవత యశస్విని.

ఇప్పటివరకు షట్చక్రాలకు అధిష్ఠానదేవతలను చెప్పి ఇప్పుడు చక్రాలను వివరిస్తున్నారు.

యోగినీన్యాసం ప్రకారము ఇక్కడ నుండి 67నామాలతో షట్చక్రాలను వివరిస్తున్నారు. ఈ చక్రాలలో యోగినీదేవతలున్నారు. డ ర ల క స హ య అనే ఏడు అక్షరాలచేత వారి పేర్లు ప్రారంభమవుతాయి.

1. డ – డాకిని
2. ర – రాకిని
3. ల – లాకిని
4. క – కాకిని
5. స – సాకిని
6. హ – హాకిని
7. య – యాకిని

షట్చక్రాలలో ప్రతి చక్రానికీ కొన్ని దళాలున్నాయి. ఆ దళాలలో కొన్ని అక్షరాలున్నాయి. ఆ చక్రానికి ఒక దేవత ఉన్నది. వాటిని ఈ దిగువ ఇవ్వటం జరిగింది.

చక్రము	దళాలు	అధిపతి	దేవత	అక్షరాలు	తత్త్వము
విశుద్ధి	16	మహేశ్వరుడు	డాకిని	అ నుంచి అః వరకు	ఆకాశ
అనాహతము	12	రుద్రుడు	రాకిని	క నుంచి ఠ వరకు	వాయువు
మణిపూరము	10	విష్ణువు	లాకిని	డ నుంచి ఫ వరకు	జలము
స్వాధిష్ఠానము	6	బ్రహ్మ	కాకిని	బ నుంచి ల వరకు	అగ్ని
మూలాధారము	4	గణపతి	సాకిని	వ నుంచి స వరకు	భూమి
ఆజ్ఞా	2	సదాశివుడు	హాకిని	హ, క్ష	మనస్సు
సహస్రారం	1000	పరమేశ్వరుడు	యాకిని	అన్ని అక్షరాలు	ఆత్మ

షట్చక్రాలను గురించి చెప్పేటప్పుడు ముందు ఆధారచక్రం చెప్పకుండా విశుద్ధి చక్రం నుంచి ప్రారంభిస్తారు. ఇలా పై నుంచి కాకుండా, క్రింద నుంచీ కాకుండా మధ్యలో నుంచి ఎందుకు ప్రారంభించాలి అని అనుమానం వస్తుంది. దీనికి కారణము. అ కారాది క్ష కారాంతము వర్ణాలు విశుద్ధి చక్రం నుంచి ప్రారంభమయి ఆజ్ఞాచక్రంతో పూర్తవుతాయి. అందుచేత అదేక్రమంలో షట్చక్రాలను కూడా చెప్పటం జరుగుతోంది. ముందుగా విశుద్ధి చక్రం.

476. విశుద్ధిచక్రనిలయా

కంఠస్థానానికి కొంచెం దిగువగా 16 దళాలతో ఉండే పద్మాన్ని విశుద్ధి చక్రం అంటారు. ఇది తెల్లని రంగులో ఉంటుంది. దీని పదహారు దళాలలోను అ నుంచి అః వరకు అచ్చులుంటాయి. పరాస్థానంలో అవ్యక్తంగా బయలుదేరిన వాక్కు ఇక్కడికి రాగానే అచ్చులతో కలిసిన వైఖరీవాక్కుగా మార్పు చెందుతుంది. ఈ పదహారుదళాలందు పదహారుశక్తులు పరివేష్టించి ఉండగా చక్రాధిష్ఠానదేవత వజ్రేశ్వరి దీని మధ్యన ఉంటుంది. దీని కర్ణికయందు త్రికోణము, దానియందు చంద్రమండలము దానిలో తెల్లని ఏనుగు, దానిమీద హం ఆకాశబీజము ఉంటాయి. ఇక్కడ మహేశ్వరుడుంటాడు.

477. ఆరక్తవర్ణా

ఆ రక్తము అంటే – పాటలవర్ణము. ఎరుపు, తెలుపు రంగులు కలిసినది. పరమేశ్వరి రంగు జపాకుసుమము, అరుణారుణము. అంటే తెలుపుతో కలిసిన ఎరుపురంగు.

478. త్రిలోచనా

మూడు కనులు గలది. సోమసూర్యాగ్నులే మూడునేత్రాలు. ఋగ్ యజుస్సామాలే మూడునేత్రాలుగా గలది. ఈ మూడు నేత్రాలు భూతభవిష్యద్వర్తమానకాలాలను కూడా సూచిస్తున్నాయి. ఈ రకంగా మూడుకనులు గలది.

479. ఖట్వాంగాది ప్రహరణా

ఖట్వాంగము అంటే మంచంకోడు. మానవుడి పుర్రె గ్రుచ్చబడిన ఒక కర్ర. ఇక్కడ ఉన్న వజ్రేశ్వరీదేవి ఖట్వాంగము, ఖడ్గము, త్రిశూలము, చర్మములను తన నాలుగుచేతులయందు ధరించి ఉంటుంది.

480. వదనైకసమన్వితా

వదనము – ముఖము, ముఖరంధ్రము. ఇక్కడ ఒకే శిరస్సు గలది అని చెప్పవచ్చును.

481. పాయసాన్నప్రియా

పాయసము నందు ప్రీతి గలది. పాలతోవండిన అన్నమునందు ప్రీతి గలది. అయితే కేవలము పాలు, బియ్యము కలిపి వండటంకాదు. పాయసమంటే...

తండులేషు క్షిపేత్ క్షీరం ద్విగుణం వా తదర్ధకం
అలాభే విన్యసే త్తోయం తస్యార్ధం గోఘృతం పరం
తండులార్ధాన్ భిన్నముద్గాన్ గుడం విన్యస్య పాచయేత్
నివేదయే త్తతో మంత్రీ పాయసాన్నం శివాయ చ ॥

బియ్యం	–	ఒక శేరు
పాలు	–	రెండు శేర్లు
ఆవు నెయ్యి	–	అర్ధశేరు
పెసరపప్పు	–	అర్ధశేరు
బెల్లం	–	అర్ధశేరు

ఈ రకంగా వండిన అన్నాన్ని పాయసము అంటారు.

482. త్వక్ స్థా

త్వక్ అంటే చర్మము. చర్మమునందుండునది. మానవదేహము తొమ్మిది ధాతువులతో నిర్మించబడింది.

త్వక్ సృగ్ మాంస మేధోస్థి ధాతవ శక్తిమూలకాః
మజ్జా శుక్ల ప్రాణ జీవధాతవ శ్శివమూలకాః
నవధాతు రయం దేహో నవయోనిసముద్భవః

చర్మము, రక్తము, మాంసము, మేద, ఎముకలు, మజ్జ, వీర్యము, ప్రాణము, జీవము అనే తొమ్మిది ధాతువులచేతనే ఈ శరీరం నిర్మించబడింది. అందులో చర్మము అనే ధాతువునందు ఈ చక్రాధిష్ఠానదేవత ఉంటుంది. శరీరం మీద కాలి చర్మం రాకపోయినా, గాయాలవల్ల చర్మం మళ్ళీ రాకపోయినా **ఓం త్వక్స్థాయై నమః** అని జపం చేస్తూ ఈ దేవతను ప్రార్థించినట్లైతే చర్మం లేనిచోట చర్మం వస్తుంది. అ చక్రాధిష్టానదేవత వజ్రేశ్వరి చర్మధాతువుకు పుష్టినిస్తుంది.

483. పశులోకభయంకరీ

పశువులు – అజ్ఞానులు. భగవంతుడు వేరు భక్తులు వేరు అని భావించేవారు. జీవాత్మ పరమాత్మల ఏకీభావం ఒప్పుకోనివారు. వీరందరికీ పతి పశుపతి. **పశూనాంపతిః** పశుపతి. అతడే పరమేశ్వరుడు. పరమేశ్వరుని శక్తి పరమేశ్వరి. ఆమె పశులోకభయంకరి అనబడుతుంది.

ఈ అజ్ఞానులకు ద్వైతభావం ఉంటుంది. అహంబ్రహ్మాస్మి అనే మహావాక్యాలను వీరు కలలో కూడా ఊహించరు. ఒకవేళ ఊహించగలిగినా దాన్ని ఒప్పుకోరు. అటువంటి పశులోకానికి భయంకరి పరమేశ్వరి.

484. అమృతాదిమహాశక్తి సంవృతా

అమృతా మొదలైన మహాశక్తులచే పరివృత అయి ఉండేది. ఈ చక్రానికి అధిష్ఠానదేవత అయిన వజ్రేశ్వరి ఈ చక్రము యొక్క కర్ణికలో ఉండగా, ఇక్కడి పదహారు దళాలలోను అ నుంచి అః వరకు ఉన్న శక్తులు ఆమెను చుట్టి ఉంటాయి. ఆ శక్తులు

1. అమృతా	5. ఉషఃకేసి	9. కార	13. ఓంకారి
2. ఆకర్షిణి	6. ఊర్ధ్వ	10. షా	14. ఔషధి
3. ఇంద్రాణి	7. ఋద్ధిత	11. ఏకపదా	15. అంబికా
4. ఈశాని	8. ఋూకార	12. ఐశ్వర్యా	16. అఃక్షరా

485. డాకినీశ్వరీ

వజ్రేశ్వరీదేవి మంత్రానికి బీజము, శక్తి, కీలకము అన్నీ కూడా దకార సంకేతంగా ఉంటాయి. కాబట్టి ఈమె డాకినీ అనబడుతుంది.

యోగినీన్యాసంలో విశుద్ధి చక్రాన్ని గురించి వివరిస్తూ

గ్రీవాకూపే విశుద్ధౌ నృపదళకమలే శ్వేతరక్తాం త్రినేత్రాం
హస్తైః ఖట్వాంగ ఖడ్గాం త్రిశిఖ మపి మహాచర్మ సంధారయంతీం
వక్త్రేణైకేన యుక్తాం పశుజన భయదాం పాయసాన్నైకసక్తాం
త్వక్స్థాం వందే ఽమృతాద్యైః పరివృతవపుషం డాకినీం వీరవంద్యాం ॥

కంఠస్థానంలో విశుద్ధిచక్రము 16 దళాలు కలిగి ఉన్నది. దీనియందు ఎరుపురంగుతో మూడుకనులు గలిగి ఖట్వాంగము ఖడ్గము త్రిశూలము చర్మము తన నాలుగు చేతులయందు ధరించి ఒకే ముఖముతో పశుప్రాయులకు భయము కలిగించు డాకినీదేవి అమృత మొదలైన 16 శక్తులచే పరివృత అయి ఉంటుంది. ఈమెకు పాయసాన్నమునందు మక్కువ ఎక్కువ.

విశుద్ధి చక్రాధిష్ఠానదేవతా డాకినీయుక్త మహేశ్వర ।
స్వరూపిణ్యంబా శ్రీపాదుకాం పూజయామి తర్పయామి నమః ॥

శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 37వ శ్లోకంలో

విశుద్ధౌ తే శుద్ధ స్పటిక విశదం వ్యోమజనకం
శివం సేవే దేవీ మపి శివసమానవ్యవసితాం
యయో కాంత్యా యాంత్యా శశికిరణసారూప్యసరణే
ర్విధూతాం తర్ధ్వాంతా విలసతి చకోరీవ జగతి ॥

విశుద్ధి చక్రంలో స్పటికమువలె స్వచ్ఛమైనవాడు. ఆకాశతత్త్వాత్మకుడు అయిన శివుడు, అతనితో సమానమైన దేవి ఉంటారు. ఇక్కడ శివాశివులిద్దరూ శుద్ధస్పటికాలవలె ప్రకాశిస్తుంటారు. ప్రాణాయామం చెయ్యటంవల్ల కాంతిని కోల్పోయిన షోడశకళలకు శివాశివుల శరీరకాంతులచే మళ్ళీ ప్రకాశము కలుగుతుంది. అంటే సాధకుడి యొక్క అజ్ఞానం తొలగించబడుతుంది.

షట్చక్రనిరూపణంలో "విశుద్ధి చక్రము యొక్క కర్ణికయందు వృత్తరూపంలో ఉన్న వియన్మండలము చంద్రబింబమువలె ప్రకాశిస్తూ ఉంటుంది. దీని బీజము హం. ఇది ఆకాశబీజము ఈ బీజానికి నాలుగుచేతులున్నాయి. ఆ చేతులయందు పాశము అంకుశము వరద అభయ ముద్రలు ఉంటాయి. ఆ బీజములో ఐదుముఖాలు, మూడుకనులు, పదిచేతులు గలిగి వ్యాఘ్రచర్మధారియైన మహేశ్వరుడుంటాడు. ఈ చక్రానికి అధిదేవత డాకిని. యోగాభిలాషులకు ఇది మోక్షద్వారము" అని చెప్పబడింది.

సంతానోపనిషత్తులో మాతృగర్భంలో పిండం ఏవిధంగా ఏర్పడుతుంది ? ఏ రకంగా అభివృద్ధి చెందుతుంది ? అనే విషయాలు చెప్పబడ్డాయి.

మాతృగర్భంలో శుక్లరక్తబిందువులు మిశ్రమం కావటంచేత రజోబిందువు ఏర్పడుతుంది. ఈ రెండు బిందువులు కలిసిన తరువాత వారాంతానికి బుద్బుదాకారం (బుడగ) ధరిస్తుంది. పక్షాంతాన పిండముగా ఏర్పడి మాసాంతాన అది గట్టిపడుతుంది.

ఏకరాత్రే కలలం భవతి
సప్తరాత్రోషితం బుద్బుదం భవతి
అర్ధమాసాభ్యంతరేణ పిండో భవతి
మాసాంతరేణ కఠినోభవతి

శుక్లరక్తబిందువుల మిశ్రమం కావటంచేత అది పాటలవర్ణంలో ఉంటుంది. దీనికి ఒకే ముఖము ఉంటుంది. ఈ ముఖరంధ్రం ద్వారానే తల్లి భుజించిన ఆహారం పిండానికి అందుతుంది. ఈ గర్భస్థశిశువునే వజ్రేశ్వరి అంటారు.

విశుద్ధి చక్రంలో చెప్పన దేవత ఈ పిండమే. అందుకే అది పాటలవర్ణంలో ఉంటుంది. ఒకే ముఖం ఉంటుంది. పాయసాన్నప్రియ. గర్భిణి అయిన తల్లికి ఈ నెలలో పాయసాన్నము మంచి ఆహారము.

486. అనాహతాబ్జనిలయా

హృదయస్థానమందు అనాహతమనే పద్మమున్నది. ఇది వాయుతత్త్వాత్మకమైనది. దీనికి 12 దళాలుంటాయి. దీనికి అధిదేవత రుద్రుడు. ఈ చక్రం బంగారు రంగులో ప్రకాశిస్తూ ఉంటుంది. దీని పన్నెండు దళాలలోనూ క నుండి ఠ వరకు అక్షరాలు శక్తిరూపాలలో ఉంటాయి. ఈ చక్రానికి అధిదేవత వామదేవి. పరాస్థానంలో పుట్టిన వాక్కు ఇక్కడికి వచ్చి మధ్యమగా మారుతుంది.

487. శ్యామాభా

నల్లని కాంతి కలది. శ్యామల వర్ణము గలది శ్యామ అనే 16 సంవత్సరాలబాలిక. ఈ చక్రంలో ఉండే వామదేవి నల్లనిరంగులో ఉంటుంది.

488. వదనద్వయా

రెండు ముఖములు గలది. వామదేవి రెండు తలల కలిగి ఉంటుంది అని చెప్పబడింది.

489. దంష్ట్రోజ్జ్వలా

వరాహము యొక్క దంతముల వంటి దంతములతో ప్రకాశించునది. వామదేవికి దంతాలు కోరలులాగా ఉంటాయి. ఈ దేవి నల్లగా ఉంటుంది. దంతాలు తెల్లగా ప్రకాశిస్తుంటాయి. అందుచేత దంష్ట్రోజ్వలా అనబడుతుంది.

490. అక్షమాలాది ధరా

తన నాలుగుచేతులయందు అక్షమాల, శూలము, కపాలము, డమరుకము ధరించి ఉంటుంది. అక్షమాల అంటే రుద్రాక్షలమాల కాదు. అ నుంచి హ వరకు యాభై అక్షరాలుమాలగా క్ష కారము కొలికిపూసగా ఉంటాయి.

491. రుధిరసంస్థితా

రక్తమునందు ప్రీతి గలది. రక్తమునందుండునది. శరీరంలోని ధాతువులలో రక్తము ఒకటి. వామదేవి ఆ రుధిరధాతువుకు అధిదేవత. ఈమె వుట్టి కరదేవత. అనాహతపద్మము రక్తానికి కేంద్రస్థానము అందుకే వామదేవి రుధిరసంస్థితా అనబడుతోంది. శరీరంలో గనక రక్తం తక్కువ అయినట్లైతే **'ఓం రుధిర సంస్థితాయై నమః'** అని జపం గనక చేసినట్లైతే రక్తవృద్ధి జరుగుతుంది.

492. కాలరాత్ర్యాదిశక్త్యోఘవృతా

కాళరాత్రి అని ఒక శక్తి ఉన్నది. సప్తశతిలో బ్రహ్మదేవుడు పరమేశ్వరిని ధ్యానిస్తూ

కాళరాత్రి ర్మహారాత్రి ర్మోహరాత్రి శ్చ దారుణా అంటాడు.

అనాహతపద్మంలో పన్నెండు దళాలుంటాయి. ఆ పన్నెండు దళాలలోను క నుంచి ఠ వరకు పన్నెండు అక్షరాలు శక్తులరూపంలో ఉంటాయి. అవి.

1. కాళరాత్రి	4. ఘంటాధారిణి	7. ఛాయా	10. జ్ఞనరూపా
2. ఖాతీత	5. జామిని	8. జయా	11. టంకహస్తా
3. గాయత్రి	6. చంద్ర	9. ఝంకారి	12. ఠంకారిణి

వీరంతా చుట్టూ పరివేష్టించి ఉండగా వామదేవి మధ్యలో ఉంటుంది.

493. స్నిగ్ధౌదనప్రియా

ఘృతముచేత స్నిగ్ధమైన అన్నము నందు ప్రీతి గలది. వామదేవికి నేతితో తడిపిన అన్నము నందు మక్కువ ఎక్కువ. ఇక్కడ నేయి అంటే ఆవునేయి మాత్రమే అని గుర్తించాలి.

494. మహావీరేంద్రవరదా

చాలా గొప్ప పండితులు. ఒకే మాటకు రెండువైపులా కూడా వాదించగలవారు. ఒక మాటను ఔను అని, మళ్ళీ అవసరమైతే దాన్నేకాదని మెప్పించగలవారు. చమత్కారముతో కూడిన భాషణ చేసేవారు.

మహావీర – అంటే – సోమయాగమునందు ఉపయోగించే పాత్ర. మహావీరము అనేది పానపాత్ర విశేషము. మహావీరులు అంటే – ఎడతెరపి లేకుండా బ్రహ్మానందాన్ని

పానం చేసేవారు. ఇంద్రునివలన బ్రహ్మను తెలుసుకున్నవారు. అన్నింటికీ సాక్షి ఆ పరబ్రహ్మే అని తెలిసినవారు. తురీయస్థితి తెలిసినవారు.

శ్రీవిద్యోపాసకులను వీరులు అంటారు. వారిలో కూడా మహావీరులు. మనువు, చంద్రుడు, కుబేరుడు మొదలైనవారు వారిచేత అర్చించబడినది.

అద్వైతసిద్ధాంతము బాగా తెలిసినవారిచేత ఉపాసింపబడేది. దేవదానవ యుద్ధంలో విష్ణువు, రుద్రుడు మహావీరులు. వీరికి వరాలిచ్చేది. కాబట్టి మహావీరేంద్రవరదా అనబడుతున్నది.

495. రాకిణ్యంబాస్వరూపిణీ

ఈ అనాహత చక్రంలో ఉండే వామదేవి యొక్క మంత్రంలో శక్తిబీజము, కీలకము అన్నీ రకార సంకేతాలే. కాబట్టి రాకిని అని పిలువబడుతుంది.

యోగినీన్యాసంలో

హృత్పద్మే భానుపత్రే ద్వివదనలసితాం దంష్ట్రినీం శ్యామవర్ణాం
అక్షం శూలం కపాలం డమరుక మపి భుజై ర్థారయంతీం త్రినేత్రాం
రక్తస్థాం కాళరాత్రిప్రభృతి పరివృతాం స్నిగ్ధభుక్తైకసక్తాం
శ్రీమద్వీరేంద్రవంద్యా మభిమతఫలదాం రాకినీం భావయామః ॥

హృదయస్థానంలో ఉండే అనాహతపద్మము పన్నెండు దళాలు కలిగి హేమవర్ణంతో ప్రకాశిస్తుంది. ఇది వాయుతత్త్వాత్మికమైనది. దీని కర్ణికలో రాకినీ దేవత రెండు ముఖములు, మూడు నేత్రములు, కోరలు కలిగి నాలుగుచేతులయందు అక్షమాల, శూలము, కపాలము, డమరుకము ధరించి నల్లనిరంగులో ఉంటుంది. ఈమెకు స్నిగ్ధాన్నము నందు మక్కువ ఎక్కువ. క కారము నుంచి ఠ కారము వరకు గల పేర్లతో పన్నెండు శక్తులు ఆ దేవిని పర్యవేష్టించి ఉంటారు. ఈ దేవత మహాపండితులతోను, జ్ఞానులతోను, శ్రీవిద్యాదురంధరులతోనూ ఉపాసించబడుతుంది.

అనాహతాధిష్ఠానదేవతారాకినీ యుక్త రుద్రస్వరూపిణ్యంబా
శ్రీపాదుకాం పూజయామితర్పయామి నమః

శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 38వ శ్లోకంలో అనాహత పద్మాన్ని వివరిస్తూ

సమున్మీలత్సంవిత్కమలమకరందైకరసికం
భజే హంసద్వంద్వం కిమపి మహతాం మానసచరం
యదాలాపా దష్టాదశగుణిత విద్యాపరిణతిః
యదాదత్తే దోషాద్గుణ మఖిల మద్భ్యఃపయ ఇవ ॥

అనాహతచక్రంలో శివవక్తులు ఇద్దరూ రాజహంసల రూపంలో ఉంటారు. హంసరూపము అంటే 26వ తత్త్వము. ఈ హంసద్వంద్వమువల్లనే అష్టాదశవిద్యలూ ఉద్భవించినాయి. ఈ తత్త్వాన్ని సేవించేవారు అష్టాదశవిద్యలయందు ప్రావీణ్యులౌతారు. షట్చక్రనిరూపణంలో "అనాహతపద్మము యొక్క కర్ణికలో షట్కోణాకృతిగా ధూమ్రవర్ణంలో వాయుమండలమున్నది. దీని బీజము 'యం' దీని వాహనము లేడి అని చెప్పబడింది.

సంతానోపనిషత్తులో "అనాహతపద్మములో వామదేవికి రెండు వదనాలున్నాయి. గర్భస్థపిండానికి మొదటినెలలో నోరు ఏర్పడగా, రెండవనెలలో ముక్కు ఏర్పడుతుంది. ఈ రెండూ వదనాలు. అందుచేతనే వామదేవికి రెండు ముఖాలున్నాయని చెప్పబడింది. ఈ మాసములో నేతితో తడిపిన అన్నము తల్లీ బిడ్డలకు మంచి ఆహారము.

496. మణిపూరాబ్జనిలయా

నాభిస్థానంలో ఉండే చక్రాన్ని మణిపూరము అంటారు. ఇది పదిదళాలు గల చక్రము జలతత్త్వాత్మకము. దీని దళాలలో డ నుంచి ఫ వరకు అక్షరాలు శక్తులరూపంలో ఉంటాయి. ఇందులో ఉండే దేవత పేరు 'వయోవస్థా వివర్జితా' కాలంతోపాటుగా వచ్చేవయోభేదంగాని, బాల్యకౌమారాది అవస్థలుగాని ఈమెకు ఉండవు. ఎప్పుడూ నిండు యవ్వనవతిగానే ఉంటుంది. ఇది విష్ణుస్థానము.

497. వదనత్రయసంయుతా

మూడు ముఖములు గలిగినది. మూడుశిరస్సులు గలిగినది. మూడు ముఖ భాగములు గలిగినది.

498. వజ్రాదికాయుధోపేతా

మణిపూరానికి అధిష్ఠాత్రి అయిన వయోవస్థావివర్జితా అనే దేవతకు నాలుగుచేతులు ఉంటాయి. ఆ చేతులలో వజ్రము, శక్తి, దండము, అభయముద్రలు ఉంటాయి.

499. డామర్యాదిభిరావృతా

మణిపూరంలో పదిదళాలు ఉంటాయి. వీటిలో డ నుంచి ఫ వరకు శక్తులు ఉంటాయి. అవి

1. డామరి
2. ఢంకారిణి
3. ణామిరి
4. తామసి
5. స్థాణ్వీ
6. దాక్షాయణి
7. ధాత్రి
8. నందా
9. పార్వతి
10. ఫట్కారిణి

ఈ శక్తులు చుట్టూ పరివేష్టించి ఉండగా ఆ పద్మము యొక్క కర్ణికలో వయోవస్థా వివర్జితా అనబడే దేవత ఉంటుంది.

500. రక్తవర్ణా

రక్తమువలె ఎర్రనిరంగు గలది.

501. మాంసనిష్ఠా

ఈ దేవతకు మాంసము అనే ధాతువునందు అభిమానము ఎక్కువ. మణిపూరము మాంసధాతువుకు స్థానము. ఇక్కడ ఉండే దేవత మాసంధాతువునకు అధిష్ఠాత్రి. శరీరానికి మాంసమేపుష్టి. ఇది అన్నిజీవుల శరీరాలయందు ఉంటుంది. ఎవరికైనా శరీరంలో మాంసము సరిగా లేకపోయినప్పుడు **'ఓం మాంసనిష్ఠాయై నమః'** అని జపం చేసినట్లైతే ఈ దేవత అనుగ్రహం కలుగుతుంది. సాధకుని శరీరంలో మాంసవృద్ధి జరుగుతుంది.

502. గుడాన్న ప్రీతమానసా

గుడేన మిశ్ర మన్నం గుడాన్నం

బెల్లముతో కలిపివండిన అన్నమందు ప్రీతికలది. అయితే గుడాన్నమంటే కేవలము అన్నంలో బెల్లం కలపటంకాదు. అది తయారు చెయ్యటానికి ఒక పద్ధతి ఉన్నది.

తండులేషు చతుర్భాగం గుడం నిక్షిప్య సాధకః
ద్విభాగం విన్యసే ద్దుగ్ధం తస్యార్థం ప్రక్షిపేద్ ఘృతం
నారికేళం చ కదళీఫలమేలాం వినిక్షిపేత్
కృత్వా గుడాన్న మేవం తు శంభవే వినివేదయేత్ ॥

బియ్యం	-	ఒక శేరు
బెల్లం	-	పావుశేరు
పాలు	-	రెండు శేర్లు
నెయ్యి	-	అర్థశేరు

వీటికి కొబ్బరి, అరటిపండు కలిపి వండిన పదార్థమే గుడాన్నము.

ఈ రకంగా వండిన బెల్లంతో కలిపినఅన్నాన్ని ఈ దేవతకు నివేదన చెయ్యాలి. ఈ ఆహారము శరీరపుష్టినిస్తుంది.

503. సమస్త భక్త సుఖదా

ఈ రకంగా ఉపాసనచేసినట్లైతే వయోవస్థావివరిజతా అనబడే ఈ దేవత భక్తుల యొక్క కోరికలు తీర్చి వారికి సమస్త సుఖాలను ఇస్తుంది.

504. లాకిన్యంబాస్వరూపిణీ

మణిపూరాధిష్ఠా దేవత యొక్క బీజము, శక్తి కీలకము అన్నీ కూడా ల కార సంకేతంగానే ఉంటాయి. కాబట్టి ఈ దేవతను లాకిన్యంబా అంటారు.

యోగినీన్యాసంలో మణిపూరాన్ని వివరిస్తూ

దిక్పత్రే నాభిపద్మే త్రివదన విలసద్దంష్ట్రిణీం రక్తవర్ణాం
శక్తిం దంభోళిదండాం అభయమపి భుజై ర్ధారయంతీం మహోగ్రాం
డామర్యాద్యై పరీతాం పశుజన భయదాం మాంసధాత్వైకనిష్ఠాం
గౌడాన్నాసక్తచిత్తాం సకల సుఖకరీం లాకినీం భావయామః ॥

నాభిస్థానంలో పదిదళాలుగల పద్మమున్నది. దానిలో మూడు ముఖములు, కోరలు గలిగి, రక్తవర్ణములో ఉన్నది, చేతులయందు వజ్రము, శక్తి, దండము, అభయముద్రలు గలిగినది. మాంసధాతువునందుండునది, గుడాన్నమునందు ప్రీతిగలది, సమస్తసుఖాలను ఇచ్చేది అయిన లాకినీ దేవికి నమస్కరిస్తున్నాను.

మణిపూరాధిష్ఠాన దేవతా లాకినీయుక్త విష్ణుస్వరూ పిణ్యంబా
శ్రీపాదుకాంపూజయామి తర్పయామి నమః

శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 40వ శ్లోకంలో మణిపూరాన్ని వివరిస్తూ

తటిత్వంతం శక్త్యా తిమిర పరిపంథి స్ఫురణయా
స్ఫురన్నానారత్నాభరణపరిణద్ధేంద్రధనుషమ్
తవ శ్యామం మేఘం క మపి మణిపూరైక శరణం
నిషేవే వర్షంతం హరమిహిరతప్తం త్రిభువనమ్ ॥

స్వాధిష్ఠానంలో మహాసంవర్తాగ్ని వల్ల దహనమైన లోకాలను ఇక్కడ, శివాశివులు తమ అమృతపుధారలతో తడుపుతుంటారు. ఇక్కడ శివుడు మేఘరూపంలో ఉండగా శక్తిసౌదామిని (మెరుపు) రూపంలో ఉంటుంది.

షట్చక్రనిరూపణంలో "మణిపూరచక్రం యొక్క కర్ణికలో అగ్నిమండలమైన త్రికోణము ఎఱ్ఱని రంగులో ఉన్నది. అక్కడ అగ్ని బీజము రం. మేషవాహనముపై నున్నది. ఈ బీజము అంక భాగాన సింధూరవర్ణము గల రుద్రమూర్తి ఉంటాడు. అతడు భస్మలేపనం చేసుకుని తెల్లగా మెరుస్తూ ఉంటాడు. అతడికి మూడుకనులుంటాయి. అభయవరద ముద్రలు ధరించి ఉంటాడు. అతడు సృష్టి సంహారకారి" అని చెప్పబడింది.

సంతానోపనిషత్తులో "మణిపూరంలో ఉండే దేవి వయోవస్థావివర్జితా ఆమెకు మూడుశిరస్సులుంటాయి.

గర్భస్థశిశువుకు మూడవనెలలో చక్షువులు ఏర్పడతాయి. ఇప్పుడు ఆ శిశువుకు నోరు, ముక్కు, కనులు ఏర్పడ్డాయి. ఈ మూడు ఇంద్రియాలే మూడు శిరస్సులు. ఈ నెలలో గర్భిణి స్త్రీకి గుడాన్నము మంచి పౌష్టికాహారము. **మాసత్రయేణ పాదప్రదేశో భవతి.** గర్భస్థ శిశువుకు ఈ నెలలో కాళ్ళు చేతులు వస్తాయి.

505. స్వాధిష్ఠానాంబుజగతా

మూలాధార చక్రానికి కొద్దిగా పైభాగాన ఉంటుంది స్వాధిష్ఠానచక్రము. ఇది ఆరుదళాలు గల పద్మము. అగ్నితత్త్వాత్మకము. దీనికి అధిదేవత బ్రహ్మ. దీనిలోని ఆరుదళాలలోను బ నుంచి ల వరకు అక్షరాలుంటాయి. ఈ చక్రాధిష్ఠానదేవత 'సిద్ధేశ్వరి'.

506. చతుర్వక్త్రమనోహరా

ఈ దేవతకు నాలుగుముఖాలుంటాయి. ఈ ముఖాలనే శిరస్సులుగా కూడా తలంచవచ్చును.

507. శూలాద్యాయుధసంపన్నా

సిద్ధేశ్వరి అనే దేవతకు నాలుగుచేతులు ఉంటాయి. ఈ చేతులయందు శూలము, పాశము, కపాలము, అభయముద్రలు ఉంటాయి. అందుకనే ఈమె శూలాద్యాయుధ సంపన్నా అనబడుతుంది.

508. పీతవర్ణా

ఈ దేవి పసుపుపచ్చని శరీరవర్ణము గలిగి ఉంటుంది.

509. అతిగర్వితా

ఈమె మహాసౌందర్యవతి. సౌందర్యము సంపదలతో కూడి అతిశయము కలది. కాబట్టి అతి గర్వితా అనబడుతుంది.

510. మేదోనిష్ఠా

తల లోపల ఉండే మెత్తని తెల్లని మాంసాన్నే మేదస్సు అంటారు. ఇదే మెదడు. ఈ సిద్ధేశ్వరీ దేవత మేదోధాతువు నందు ఉంటుంది. మేదస్సు కావలసినవారు **'ఓం మేదోనిష్ఠాయై నమః'** అని జపంచేసి ఆ దేవతను తృప్తిపరచినట్లైతే మేదస్సువృద్ధి అవుతుంది.

511. మధుప్రీతా

సిద్ధేశ్వరీదేవి మధువు అంటే తేనె యందు ప్రీతి గలది. తేనె మేదస్సును పెంచుతుంది. తేనె, నెయ్యి, పంచదారలను త్రిమధురములు అంటారు.

ఛాందోగ్యోపనిషత్తులోని మూడవఅధ్యాయంలో మధువిజ్ఞానం చెప్పబడింది. ఆదిత్యునియందు మధువును ఆరోపించి, ఆ విధంగా ఆదిత్యుణ్ణి ఉపాసించటమే మధువిద్య. దూరంగా ఆకాశంలో కనిపించేవాడు సూర్యుడు. అతడే దేవతలను తృప్తిపరచేవాడు. అందుచేతనే అతను దేవతలకు మధువువంటివాడు.

ప్రపంచమంతా ఈ సూర్యరశ్మి ప్రసరిస్తున్నది. అది ప్రసరించినంతమేర వృక్షసంపద అభివృద్ధి చెంది సస్యశ్యామలమవుతుంది. జీవజాలము జీవిస్తుంది. ఆ పరమేశ్వరియే సూర్యునిరూపంలో ఈ పని చేస్తున్నది. అందుకే ఆమె మధుప్రీతా అనబడింది.

512. బందిన్యాదిసమన్వితా

సిద్ధేశ్వరీదేవి ఈ పద్మము మధ్యలో ఉండగా బందిని మొదలైన దేవతాశక్తులు చుట్టూ ఉన్న ఆరు దళాలలోనూ ఉంటారు. వారు

1. బందిని
2. భద్రకాళి
3. మహామాయ
4. యశస్విని
5. రమా
6. లంబోష్ఠితా

513. దధ్యన్నాసక్త హృదయా

దధ్యన్నమునందు ఆసక్తి గలది. దధ్యన్నము అంటే పెరుగుతో కలిపిన అన్నము.

దధ్నా చాన్విత శుద్ధాన్నం లవణేన సమన్వితం
ఆర్ద్రమరీచి సంయుక్తం ధానక పత్ర సంయుతం
తథానాగరఖండాఢ్యం దధ్యన్నం చే త్రృకీర్తితమ్ ॥

మంచి బియ్యంతో అన్నం వండి దానిలో పెరుగును కలపాలి. దానిలో మిరియాల పొడి, ఉప్పు, కరివేపాకులను కలిపి చేసే దాన్ని దధ్యన్నము అంటారు.

ఈ రకంగా తయారుచేసిన దధ్యన్నమునందు మక్కువ గలది.

514. కాకినీరూపధారిణీ

స్వాధిష్ఠానచక్రానికి అధిదేవత అయిన సిద్ధేశ్వరీదేవి యొక్క బీజము, శక్తి, కీలకము అన్నీ కకార సంకేతంగానే ఉంటాయి అందుచేత ఆమె కాకిన అనబడుతుంది.

యోగినీన్యాసంలో స్వాధిష్ఠానాన్ని వివరిస్తూ

స్వాధిష్ఠానాఖ్యపద్మే రసదళలసితే వేదవక్త్రాం త్రినేత్రాం
హస్తాభ్యాం ధారయంతీం త్రిశిఖగుణకపాలాభయాం ఉన్మత్త గర్వాం
మేదోధాతు ప్రతిష్ఠాం అళిమదముదితాం బందినీ ముఖ్యయుక్తాం
పీతాం దధ్యోదనేష్టాం అభిమతఫలదాం కాకినీం భావయామః ॥

ఆరు దళాలు గల స్వాధిష్ఠానచక్రంలో నాలుగు శిరస్సులు, మూడుకనులు గలిగి, చేతులయందు త్రిశూలము, పాశము, కపాలము, అభయముద్ర కలిగి, అతిశయించిన గర్వముకలదై మద్యముత్రాగి సంతసించుచున్నది. మేదస్సు అను ధాతువునందుండునది, బందిన్యాదిశక్తులతో పరివేష్ఠితమైన కాకినీ దేవిని ధ్యానించుచున్నాను.

స్వాధిష్ఠాన దేవతా కాకినీయుక్త బ్రహ్మస్వరూపిణ్యంబా
శ్రీ పాదుకాంపూజయామి తర్పయామి నమః

శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 39వ శ్లోకంలో స్వాధిష్ఠానచక్రాన్ని వివరిస్తూ

తవ స్వాధిష్ఠానే హుతవహమధిష్ఠాయ నిరతం
తమీడే సంవర్తం జనని ! మహతీం తాంచ సమయాం
యదాలోకే లోకాన్ దహతి మహతీ క్రోధకలితే
దయార్ద్రా యా దృష్టి శ్శిశిరముపచారంరచయతి ॥

స్వాధిష్ఠానము అగ్నిస్థానము. ఇక్కడ ఉండే అగ్నిని సంవర్తాగ్ని అంటారు. ఇక్కడ శివుడు సంవర్తాగ్నిరూపంలో లోకాలను దహించివేస్తుంటే, దేవి తన కరుణాదృక్కులతో ఆ లోకాలను శమింపచేస్తూ ఉంటుంది.

షట్చక్రనిరూపణంలో "స్వాధిష్ఠానము లింగస్థానంలో సింధూరపు రంగులో ఉంటుంది. దీని ఆరుదళాలలోను బంధిని మొదలైన శక్తులు విద్యుల్లతలలాగా ప్రకాశిస్తుంటాయి. దీనికి అధిదేవత బ్రహ్మ. బీజం - వం. ఈ మండలము అర్ధచంద్రాకారంలో ఉంటుంది.

సంతానోపనిషత్తులో "ఈ చక్రంలో సిద్ధేశ్వరీ దేవికి నాలుగుముఖాలుంటాయి. వీటినే నాలుగుశిరస్సులు అంటారు. గర్భస్థశిశువుకు ఈ నెలలో చెవులు ఏర్పడతాయి. ఇప్పుడు నోరు, ముక్కు, కన్ను, చెవి. ఈ నాలుగే ఆ దేవతముఖాలు.

అథచతుర్థమాసే జఠరకటి ప్రదేశో భవతి

ఈ సమయంలో పిండానికి ఉదరము, కటి ప్రదేశము ఏర్పడతాయి. ఈ మాసంలో గర్భిణీ స్త్రీకి మధువు మంచి ఆహారము. అది తల్లికి బిడ్డకి కూడా క్షేమము.

515. మూలాధారాంబుజారూఢా

దీన్నే ఆధారచక్రము అంటారు. మూల అంటే - గుదస్థానం. శరీరం అంతటికీ ఆధారమైన చక్రము గుదస్థానంలో ఉంటుంది. కాబట్టి దీన్ని మూలాధార చక్రము అంటారు. ఈ పద్మానికి నాలుగు దళాలుంటాయి. వాటిలో వ నుంచి స వరకు అక్షరాలుంటాయి. దీనికి అధిదేవత గణపతి ఈ చక్రంలో ఉండే దేవత సిద్ధ విద్యాదేవి.

దీనిలో పసుపురంగులో వర్తులాకారంలో భూమండలమున్నది. దానిమీద తెల్లని గుర్రం. ఆ గుర్రంమీద లం అనే బీజముంటుంది. ఇదే కుండలినీస్థానం. దీని మధ్యన విద్యుత్కాంతులతో త్రికోణముంటుంది. అందులో క్లీం బీజముంటుంది. ఆ బీజం మీద స్వయంభూలింగానికి మూడున్నర చుట్లుచుట్టుకుని సర్పాకారంలో కుండలినీశక్తి ఉంటుంది. ఇది గణపతిస్థానము.

516. పంచవక్త్రా

ఈ చక్రాధిష్ఠానదేవత అయిన సిద్ధవిద్యాదేవికి ఐదుముఖాలుంటాయి. అవే ఐదుతలలు. ఈ ఐదుతలలే సద్యోజాత, వామదేవ, అఘోర, తత్పురుష, ఈశానులు.

517. అస్థిసంస్థితా

సిద్ధ విద్యాదేవత అస్థి ధాతువు నందు ఉంటుంది. ఎముకలు పుష్టిగాలేనివారు, ఎముకలు విరిగినవారు త్వరగా కోలుకోవాలంటే **'ఓం అస్థి సంస్థితాయై నమః'** అని జపం చెయ్యాలి.

518. అంకుశాది ప్రహరణా

సిద్ధ విద్యాదేవత తన నాలుగుచేతులయందు అంకుశము, కమలము, పుస్తకము, జ్ఞానముద్ర ధరించి ఉంటుంది.

519. వరదాదినిషేవితా

ఈ సిద్ధవిద్యాదేవి ఆధారచక్రంలోని మధ్యప్రదేశంలో ఉండగా, ఆమె చుట్టూ

1. వరద 2. శ్రీ 3. షండా 4. సరస్వతి

అనే శక్తులు పరివేష్టించి ఉంటాయి.

520. ముద్గౌదనాసక్తచిత్తా

ముద్గాన్నము అంటే – పెసరపప్పు కలిపి వండిన అన్నము. దీని తయారీ విధానము

సుశాలితండుల ప్రస్థం తదర్ధముద్గభిన్నకం
చతుఃఫలం గుడం ప్రోక్తం తన్మానం నారికేళకం
ముష్టిమాత్రం మరీచం స్యా త్తదర్ధం సైంధవం రజః
తదర్ధం జీరకం విద్యా త్కుడవం గోఘృతంవిదుః

గోక్షీరేణ స్వమాత్రేణ సంయోజ్యకమలాననే
మందాగ్నిపచనా దేవ సిద్ధాన్న మిదముత్తమమ్ ॥

మంచి బియ్యం	–	ఒక శేరు
పెసరపప్పు	–	అర్ధశేరు
బెల్లం	–	పావుశేరు
కొబ్బరి	–	పావుశేరు
మిరియాలపొడి	–	గుప్పెడు
సైంధవలవణం	–	అరగుప్పెడు
జీలకర్ర	–	ఉప్పులో సగము
పాలు	–	సరిపోయినంత
నెయ్యి	–	కొద్దిగా

వీటిని సన్నని మంటమీద ఉడికిస్తే వచ్చేదే ముద్గాన్నము.

ఈ రకంగా తయారుచేసిన ముద్గాన్నము లేక సిద్ధాన్నము నందు ఈ దేవికి మక్కువ ఎక్కువ.

521. సాకిన్యంబా స్వరూపిణీ

మూలాధార చక్రాధిదేవత అయిన సిద్ధవిద్యాదేవి యొక్క బీజము, శక్తి, కీలకము అన్నీ స కార సంకేతంగా ఉంటాయి. కాబట్టి ఈమెను సాకిని అంటారు. యోగినీన్యాసంలో ఆధారచక్రాన్ని వివరిస్తూ

మూలాధారపద్మే శ్రుతిదళలసితే పంచవక్త్రాం త్రినేత్రాం
ధూమ్రాభాం అస్థిసంస్థాం సృణి మపి కమలం పుస్తకం జ్ఞానముద్రాం
భిభ్రాణాం బాహుదండై స్సులలితవరదాపూర్వశక్త్యావృతాం తాం
ముద్గాన్నాసక్త చిత్తాం మధుమద ముదితాం సాకినీం భావయామః ॥

ఆధారచక్రంలో ఐదుముఖాలు మూడుకనులు కలిగి ధూమ్రవర్ణముతో నున్నది, ఎముకలు యందుండునది. అంకుశము, కమలము, పుస్తకము, జ్ఞానముద్ర చేతులయందు ధరించినది, ముద్గాన్నమునందు ఆసక్తి కలది అయిన సాకినీదేవికి నమస్కరిస్తున్నాను.

మూలాధారాధిష్ఠాన దేవతాసాకినీయుక్త శ్రీగణపతి
స్వరూపిణ్యంబా శ్రీపాదుకాంపూజయామి తర్పయామి నమః

శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 41వ శ్లోకంలో ఆధారచక్రాన్ని వివరిస్తూ

తవాధారే మూలే సహ సమయయా లాస్యపరయా
నవాత్మానం మన్యే నవరస మహాతాండవ నటం
ఉభాభ్యామేతాభ్యా ముదయవిధి ముద్దిశ్య దయయా
సనాదభ్యాం జజ్ఞే జనక జననీమ జ్జగదిదమ్ ॥

ఆధారచక్రంలోని శివాశివులకు భైరవీ భైరవులని లేదా నవాత్మ, నవాత్మకుడు అని పేర్లు. వీరిద్దరూ మంకెన్న పూలవంటి కాంతితో ప్రకాశిస్తుంటారు. శివుడు తాండవం చేస్తుండగా దేవి శృంగారంతో కూడిన నాట్యం చేస్తుంటుంది. అదే లాస్యం. వీరిద్దరూ జగత్తును సృష్టించే కార్యక్రమంలో నిమగ్నమై ఉంటారు.

జపాకుసుమసంకాశౌ మధు ఘూర్ణితలోచనౌ
జగతః పితరౌవందే భైరవీ భైరవాత్మకౌ ॥

మంకెన్నపూలవంటి శరీరచ్ఛాయగలిగి మధుపానముచే మత్తెక్కిన కనులు గలిగి, ఈ జగత్తుకు మాతాపితురులైన భైరవీ భైరవులకు నమస్కారము.

షట్చక్ర నిరూపణంలో "ఆధారచక్రం గుదస్థానానికి దగ్గరగా ఉంటుంది. దీనిలోని నాలుగదళాలు ఎరుపురంగులో ఉంటాయి. ఈ పద్మము మధ్యభాగంలో చతురస్రాకారమైన పృథివీమండలమున్నది. అది పీతవర్ణంలో ఉంటుంది.

మూలాధారే ధరాచక్రం చతుష్కోణం ప్రియంవదే
పీతవర్ణం పరివృతం చాష్టశూలైః కులాచలైః ॥

కులపర్వతాలే దీని ఎనిమిది దిక్కులయందు శూలములుగా ఉన్నాయి. దీనియందు లం పృథివీబీజమున్నది. ఇదే ఇంద్రబీజం. ఇది పచ్చనిరంగుతో పెద్దపెద్దచేతులతో వజ్రాయుధం ధరించి ఐరావతము ఎక్కి ఉంటుంది. దాని అంకభాగాన ఒక శిశువు ఉన్నాడు. అతడే ఇంద్రుడు అని యామళగ్రంధాలు చెబుతున్నాయి. ఇక్కడికి కొద్దిగా పైభాగన స్వయంభూలింగానికి మూడున్నరచుట్లుచుట్టుకుని కుండలినీశక్తి నిద్రిస్తూ, తన ముఖంచేత బ్రహ్మరంధ్రాన్ని కప్పి ఉంచుతుంది.

సంతానోపనిషత్తులో "ఇక్కడ సిద్ధవిద్యాదేవి ఐదుముఖాలతో ఉంటుంది. గర్భస్థశిశువుకు ఈ నెలలో చర్మము ఏర్పడుతుంది. **పంచమేమాసే పృష్ఠవంశోభవతి** ఐదవనెలలో బిడ్డకు వెన్నెముక ఏర్పడుతుంది. గతంలో

మొదటినెలలో	–	నోరు
రెండవనెలలో	–	ముక్కు
మూడవనెలలో	–	కనులు
నాల్గవనెలలో	–	చెవులు
ఐదవనెలలో	–	చర్మము

ఏర్పడి పంచేంద్రియ స్ఫూర్తి కలుగుతుంది. గర్భిణీ స్త్రీకి ఈ సమయంలో ముద్గాన్నము మంచి ఆహారము.

522. ఆజ్ఞాచక్రాబ్జనిలయా

భ్రూమధ్యభాగంలో రెండుదళాలు కలిగి ఉన్న స్థానాన్ని ఆజ్ఞాచక్రము అంటారు. ఈ చక్రానికి అధిదేవత సదాశివుడు. ఈ చక్రంలో సిద్ధమాతా అనే దేవత ఉంటుంది. ఆమెకు ఆరుముఖాలుంటాయి. ఈ పద్మము యొక్క రెండు దళాలలోనూ హకార క్షకారాలుంటాయి.

ఇది గంగ యమున సరస్వతిల సంగమస్థానము. ఇడ పింగళ సుషుమ్నల సంగమస్థానము. కూటత్రయము, మండలత్రయము, ఖండత్రయముల సమాప్తిస్థానము.

కూటత్రయము	–	వాగ్భవకూటమి, కామరాజకూటమి, శక్తికూటమి
ఖండత్రయము	–	చంద్రఖండము, సూర్యఖండము, అగ్నిఖండము
మండలత్రయము	–	చంద్రమండలము, సూర్యమండలము, అగ్నిమండలము,

ఇది త్రిపురానివాసస్థానము. అన్ని ఇంద్రియాలకు ఇక్కడి నుంచే ఆజ్ఞలు జారీచేయబడతాయి. కాబట్టి దీన్ని ఆజ్ఞాచక్రము అంటారు. ఇది ఆత్మస్థానము.

523. శుక్లవర్ణా

సిద్ధమాత అనే ఈ దేవి తెల్లనిరంగులో ఉంటుంది.

524. షడాననా

సిద్ధమాతకు ఆరుముఖాలుంటాయి. వాటినే ఆరు శిరస్సులు అంటారు. ఇది కుమారస్వామి శక్తిగా భావించవచ్చు.

525. మజ్జాసంస్థా

ఈ సిద్ధేశ్వరీదేవత మజ్జ యందుంటుంది. మజ్జ అంటే – ఎముకల యందు ఉండే గుజ్జులాంటి పదార్థము. **'ఓం మజ్జాసంస్థాయై నమః'** అని జపం చేస్తే మజ్జ అనే పదార్థం లోపించిన వారికి అది కలుగుతుంది.

526. హంసవతీముఖ్యశక్తిసమన్వితా

సిద్ధమాత అనబడే ఈ దేవత ఆజ్ఞాచక్ర కర్ణికలో ఉండగా రెండు దళాలయందు హంసవతీ క్షమావతి అని రెండు శక్తులు పరివేష్టించి ఉంటాయి. ఈ రెండు శక్తులే ఉచ్ఛ్వాసనిశ్వాసలు.

527. హరిద్రాన్నైకరసికా

హరిద్రాన్నమునందు ప్రీతి గలది.

మరీచీ రజనీచూర్ణై ర్జీరకాద్యైశ్చ సంయుతం
ఆజ్యేన సంప్లుతం దేవి ! హరిద్రాన్న మితీరితమ్

ఈ విధంగా తయారుచేసిన దాన్ని 'పులిహోర' అంటారు. హరిద్రాన్నమునందు సిద్ధమాతకు మక్కువ ఎక్కువ.

528. హాకినీరూపధారిణీ

ఆజ్ఞాచక్రాధిష్ఠానదేవత అయిన సిద్ధమాత యొక్క మంత్రానికి శక్తి, బీజము, కీలకము అన్నీ హకార సంకేతంగా ఉంటాయి కాబట్టి ఈమెను హాకినీ అంటారు.

యోగినీన్యాసంలో

భ్రూమధ్యే బిందుపద్మే దళయుగకలితే శుక్లవర్ణాం కరాబ్జైః
బిభ్రాణాం జ్ఞానముద్రాం డమరుక మక్షమాలాం కపాలం

షడ్వక్త్రాధారమధ్యాం త్రినయనలసితాం హంసవత్యాదియుక్తాం
హరిద్రాన్నైకరసికాం సకలశుభకరీం హాకినీం భావయామః ॥

కనుబొమల మధ్య రెండు దళములు గల పద్మమున్నది. ఆ పద్మమునందు హాకినీ దేవత ఉంటుంది. ఆమె చేతులలో జ్ఞానముద్ర, డమరుకము, అక్షమాల, కపాలము ధరించి ఉంటుంది. హాకినీ దేవతకు మూడుకనులు, ఆరు తలలు ఉంటాయి. ఆమెకు హరిద్రాన్నమునందు ప్రీతి ఎక్కువ.

ఆజ్ఞాచక్రాధిష్ఠానదేవతా హాకినీయుక్త సదాశివ
స్వరూపిణ్యంబా శ్రీపాదుకాం పూజయామి తర్పయామి నమః

శంకరభగవత్పాదులవారు సౌందర్య లహరిలోని 36వ శ్లోకంలో ఆజ్ఞాచక్రాన్ని వివరిస్తూ

తవాజ్ఞాచక్రస్థం తపనశశికోటిద్యుతిధరం
పరం శంభుం వందే పరమిళిత పార్శ్వం పరచితా
యమారాధ్యన్ భక్త్యా రవి శశి శుచీనామవిషయే
నిరాలోకేలోకే నివసతి హి భాలోకభువనే ॥

ఆజ్ఞాచక్రంలో శివాశివులు కోట్లకొలది సూర్యచంద్రులకాంతులతో ప్రకాశిస్తూ ఉంటారు.

లక్ష్మీధరుడు తన కర్ణావతంస స్తుతిలో

ఆజ్ఞాత్మక ద్విదళ పద్మగతే తదానీం
విద్యున్నిభే రవిశశి ప్రయుతోత్కటాభే
గండస్థలప్రతిఫల త్కరదీప జ్వాల
కర్ణావతంసకలికే కమలాయతాక్షి ! ॥

ఆజ్ఞా చక్రమనబడే రెండుదళములు గల పద్మమందున్న ఓ దేవీ ! మెరుపుతీగవలె కోట్లకొలది సూర్యచంద్రులకాంతులతో ప్రకాశిస్తున్నావు. షట్చక్రనిరూపణంలో "ఆజ్ఞాచక్రము అనేది గురువు యొక్క ఆజ్ఞలు లభించే స్థానము. ఇక్కడ నుంచే శరీరంలోని వివిధభాగాలకు ఆజ్ఞలు జారీచేయబడతాయి. ఇక్కడ ఓంకారాన్ని ధ్యానించేవాడు జ్ఞాని అవుతాడు. సర్వజ్ఞుడై సర్వదర్శి అయిన మునీంద్రుడవుతాడు. ఈ చక్రము కర్ణికలో త్రికోణమున్నది. ఈ

త్రికోణంలో ప్రణవానికి ఆధారమైన అకార ఉకారాలుంటాయి. దానిమీద బిందురూపంలో మకారముంటుంది. సంతానోపనిషత్తులో

షష్ఠేమాసి నాసాక్షిశ్రోత్రాణి భవంతి

ఆరవనెలలో గర్భస్థశిశువుకు ముక్కు, చెవులు, కనులు మొదలైన అవయవసౌష్టవం ఏర్పడుతుంది. ఈ నెలలోనే మనస్సుకూడా ఏర్పడుతుంది. అదే ఆరవ అవయవము. అందుచేతనే సిద్ధమాతకు ఆరు తలలుంటాయి. ఈ సమయంలో గర్భిణీస్త్రీకి హరిద్రాన్నము మంచి ఆహారము.

529. సహస్రదళపద్మస్థా

షట్చక్రాలకు పైన బ్రహ్మరంధ్రం దగ్గర సహస్రదళపద్మమున్నది. ఇందులో ఎనిమిది దిక్కులకు ఎనిమిది దళాలుంటాయి. ఒక్కొక్క దళంలోనూ 125 చిన్నచిన్న దళాలుంటాయి. ఈరకంగా మొత్తం వేయిదళాలుంటాయి. అందుకే దీన్ని సహస్రదళపద్మము అంటారు. ఇక్కడ ఉండేవాడు పరమేశ్వరుడు. ఈ చక్రానికి అధిదేవతగా ఉండేవాడు పరమేశ్వరుడు. ఈ చక్రానికి అధిదేవత యశస్విని. ఇక్కడ సహస్రదళాలలోను అన్ని రంగులు, అన్ని అక్షరాలు ఉంటాయి. ఇది పరమాత్మస్థానము. సహస్రదళంలో వేలకొలది సూర్యకాంతులు ప్రసరిస్తూ ఉంటాయి. యోగీశ్వరులకు ఇక్కడే ఆత్మదర్శనమవుతుంది. అంటే స్వస్వరూపజ్ఞానం కలుగుతుంది. ఇది జీవాత్మ పరమాత్మల సంగమస్థానం.

530. సర్వవర్ణోపశోభితా

సహస్రారంలో యశస్విని అనే ఈ దేవత అన్ని వర్ణములు అంటే రంగులతోనూ ప్రకాశిస్తుంటుంది. అన్ని అక్షరములతోనూ ప్రకాశిస్తుంటుంది. పైన చెప్పిన షట్చక్రాలలోను అక్షరాలు విడివిడిగా ఉంటాయి అని చెప్పాం. కాని ఇక్కడ అ నుంచి క్ష వరకు అన్ని అక్షరాలు ఉంటాయి.

సర్వవర్ణే మహాదేవీ సంధ్యావిద్యేసరస్వతీ

531. సర్వాయుధధరా

ఇంతవరకు చెప్పిన చక్రాలలో దేవతలు తమ నాలుగుచేతులయందు ఆయుధాలు ధరించి ఉంటారు. కాని ఇక్కడ ఉండేది పరమేశ్వరి. ఆవిడకు అనేక చేతులు ఉంటాయి. **సహస్రాణి సహస్రధా బాహువోస్తవమేతయః** కాబట్టి అన్ని చేతులయందు అన్నిరకాల ఆయుధాలు ధరించి ఉంటుంది. ఆమె చేతిలో లేని ఆయుధం లోకంలో లేనేలేదు.

532. శుక్లసంస్థితా

ఈ దేవత సర్వధాతుసారమైన శుక్లమందుంటుంది. ఇది శరీరమంతా వ్యాపించి ఉండే ధాతువు. కాబట్టి ఈ దేవత జీవకోటి శరీరమంతా వ్యాపించి ఉంటుంది.

ధాతుపుష్టి లేని వాళ్ళు ఓం శుక్ల సంస్థితాయై నమః అని జపం చేస్తే ధాతువృద్ధి కలుగుతుంది.

ఇప్పటి దాకా

1. **ఓం త్వక్కుస్థాయై నమః**
2. **ఓం రుధిరసంస్థితాయై నమః**
3. **ఓం మాంసనిష్ఠాయై నమః**
4. **ఓం మేధోనిష్ఠాయై నమః**
5. **ఓం అస్తి సంస్థితాయై నమః**
6. **ఓం మజ్జా సంస్థాయై నమః**
7. **ఓం శుక్ల సంస్థితాయై నమః**

అని మంత్రాలు చెప్పటం జరిగింది. వీటికి

వశిన్యాది వాగ్దేవతాఋషిః । అనుష్టుప్ఛ్చందః । శ్రీ లలితాత్రిపురసుందరీ దేవతా । ఐం బీజం । సౌం శక్తిః । క్లీం కీలకం । జపే వినియోగః

న్యాసము : ఐం । క్లీం । సౌః । సౌః । క్లీం ః । ఐం

ధ్యానము : సకుంకుమవిలేపనా.........

533. సర్వతోముఖీ

ఈ దేవతకు అన్నివైపులా ముఖాలుంటాయి. **సహస్రశీర్షాపురుషః సహస్రాక్షస్స హస్రపాత్** పరమేశ్వరుడికి కొన్నివేల తలలు ఉంటాయి. అంటే ప్రపంచంలోని జీవరాశి అంతా పరమేశ్వరి స్వరూపమే. అందుకే అన్ని జీవుల యొక్క శిరస్సులూ ఆ దేవతకుంటాయి. ఇదే విశ్వరూపము. విశ్వుడు ప్రపంచంలోని జీవరాశికంతటికీ ప్రతీక. అకారాది క్షకారాంతము సర్వదేవతలు ఇక్కడ పరమేశ్వరిరూపంలో ఉంటారు. అందుకే ఈ దేవి అన్నివైపులకూ ముఖాలుంటాయి. కాబట్టే ఈమె సర్వతోముఖీ అనబడింది.

534. సర్వౌదనప్రీతచిత్తా

అన్నిరకాలయిన ఆహారములందు ఈమెకు ప్రీతి ఉంటుంది. ప్రపంచంలోని సకల జీవరాశి రూపము ఈ పరమేశ్వరియే. అందుకే అన్ని జీవుల తలలు ఈమెకు ఉన్నాయి. అలాగే అన్నిరకాల ఆహారపదార్థాలను కూడా ఈ దేవి ప్రేమగానే స్వీకరిస్తుంది.

మనం కూడా అన్నాన్ని ఎప్పుడూ ఉపేక్షించరాదు. **అన్నంననిన్ద్యాత్** అన్నాన్ని నిందించరాదు. అన్నము పరబ్రహ్మస్వరూపము అని అందుకే చెబుతారు.

535. యాకిన్యంబాస్వరూపిణీ

యశశ్వినీ అనబడే ఈ దేవత యొక్క బీజము, శక్తి, కీలకము అన్నీ యకార సంకేతముగానే ఉంటాయి. అందుకే ఆమెను యాకినీ అంటారు.

యోగినీన్యాసంలో

ముండవ్యోమస్థపద్మే దశశతదళకే కర్ణికా చంద్ర సంస్థాం
రేతోనిష్ఠాం సమస్తాయుధకలితకరాం సర్వతోవక్త్ర పద్మాం
ఆదిక్షాంతార్ణశక్తి ప్రకటపరివృతాం సర్వవర్ణాం భవానీం
సర్వాన్నాసక్తచిత్తాం పరశివరసికాం యాకినీం భావయామః ॥

బ్రహ్మరంధ్రం దగ్గర సహస్రదళపద్మమున్నది. దాని కర్ణికలో అన్నిరకాల ఆయుధాలు ధరించి అన్నివైపులకు ముఖములు కలిగి, సర్వవర్ణములతోను ప్రకాశించునది, అన్నిరకాలైన ఆహారములందు ప్రీతి కలది, శుక్లమునందు ఉండునది అయిన యాకినీ అనే దేవత ఉన్నది.

యోఽ హమస్మి బ్రహ్మాహమస్మి । అహమస్మి బ్రహ్మాహమస్మి ।
తత్త్వమసి । బ్రహ్మాహమస్మి । సోహం బ్రహ్మాహమస్మి । ఓం
బ్రహ్మా హ మస్మి । ఆత్మైవేదగ్ం సర్వం । బ్రహ్మై వేదగ్ం
సర్వం । సర్వమేతద్బ్రహ్మ । సర్వం ఖిల్విదం బ్రహ్మ ।
బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి ॥

షట్చక్రనిరూపణంలో "ఆజ్ఞాచక్రం దాటిన తరువాత యోగి మహానాదాన్ని దర్శిస్తాడు. అతడికి వాక్సిద్ధి కలుగుతుంది. సహస్రదళము పూర్ణచంద్రునిలాగా ప్రకాశిస్తుంటుంది. దానికిరణాలు సూర్యకిరణాలవలె కాంతివంతంగా, చంద్రకిరణాలవలె చల్లగా ఉంటాయి. ఇక్కడ అకారాది సర్వవర్ణములు ఉంటాయి. ఇది కేవలము ఆనందరూపమైనది. ఇది చంద్రమండలము. ఇక్కడ వృద్ధిక్షయాలు లేనివాడు, కళంకరహితుడు అయిన చంద్రుడుంటాడు. ఈ చంద్రమండలము మధ్యన మహాశూన్యమున్నది.

తదంతః శూన్యం తత్సకల సురగణైః సేవితంచాతిగుప్తం

ఆ మహాశూన్యాన్ని దేవతలు రహస్యంగా సేవిస్తుంటారు. ఆ శూన్యము చాలా రహస్యమైనది. అతి ప్రయత్నము మీదగాని దాన్ని పొందలేరు. అక్కడే పరమేశ్వరుడుంటాడు. ఆయన సర్వాత్మరూపి. అజ్ఞానము మోహము పోగొట్టి సాధకుడికి సుధాధారలచే ఆత్మజ్ఞానం కలిగిస్తాడు. అప్పుడు సాధకుడు జీవాత్మ పరమాత్మల సమైక్యము సాధించి పరమహంస అవుతాడు.

శివస్థానంశైవాః పరమపురుషం వైష్ణవగణాః
లపంతీతిప్రాయో హరిహరపదం కేచిదపరే ।
పదం దేవ్యా దేవీచరణయుగళాం భోజరసికా
మునీనా మప్యంతే ప్రకృతి పురుషస్థాన మమలం ॥

ఈ ప్రదేశాన్ని శివస్థానమని శైవులు, పరమపురుషస్థానమని వైష్ణవులు, దేవీస్థానమని శాక్తేయులు, హరిహరస్థానమని కొందరు, ప్రకృతి పురుష స్థానమని మరికొందరు అంటారు.

ఇదం స్థానంజ్ఞాత్వా నియత నిజచిత్తో నరవరో
న భూయత్ సంసారే పునరపి న బుద్ధస్త్రిభువనే
సమగ్రాశాక్తః స్వాన్నియమ మనసస్తస్యకృతినః
సదాకర్తుం ఖగతిరపి వాణీసువిమలా ॥

ఈ స్థానాన్ని తెలుసుకున్న సాధకుడికి పునర్జన్మలేదు. ఈ లోకంలో బంధం ఉండదు. పాపపుణ్యాలుండవు. సంసారబంధనాలుండవు. ఇష్టార్థసిద్ధి కలుగుతుంది. ఇక్కడకు చేరిన యోగికి సాయుజ్యం లభిస్తుంది. సంతానోపనిషత్తులో

సప్తమేమాసే జీవసంయుక్తో భవతి ।
అష్టమేమాసే సర్వసంపూర్ణో భవతి । నవమే జీవతి ॥

ఏడవమాసంలో జీవం ఏర్పడుతుంది. పూర్వజన్మలో చేసిన కర్మతో జీవుడు ఇందులో ప్రవేశిస్తాడు. ఎనిమిదవ మాసంలో శిశువుకు అన్ని అవయవాలు పూర్తిగా ఏర్పడతాయి. తొమ్మిదవ మాసంలో చలనం ఏర్పడుతుంది. గర్భిణీ స్త్రీ అన్నిరకాల ఆహారాలు భుజించవచ్చును.

536. స్వాహా

దేవతలకు యజ్ఞంలో హవిస్సు అందచేసేటప్పుడు 'స్వాహా' అనే శబ్దాన్ని ఉచ్చరిస్తారు.

ఇంద్రాయస్వాహా - ఇంద్రాయ ఇదం న మమ

అగ్నయే స్వాహా - అగ్నయే ఇదం న మమ

ఈ రకంగా స్వాహా శబ్దంతో దేవతలకు ఆహుతులు అర్పిస్తారు. అంటే అగ్నిలో వేసిన ఆ హవిస్సు స్వాహాదేవి ద్వారా దేవతలకు చేరుతుంది. దేవీ భాగవతంలో

బ్రహ్మదేవుడు లోకాలన్నీ సృష్టించిన తరువాత దేవతలంతా బ్రహ్మవద్దకు వచ్చి, విధాతా ! ఆకలి బాధకు తట్టుకోలేకుండా ఉన్నాము. దీనికి ఏదైనా ఒక ఉపాయం చెప్పు అని అడిగారు. దానికి బ్రహ్మ 'ఇలాంటి విషయాలు చెప్పటానికి స్థితికారకుడైన నారాయణుడున్నాడు. మీరు వెళ్ళి అతన్ని వేడుకోండి. తరుణోపాయం చూపిస్తాడు' అన్నాడు ప్రజాపతి సలహా మీద దేవతలందరూ వైకుంఠానికి వెళ్ళి శ్రీహరిని ప్రార్థించారు. అప్పుడు ఆ హరి 'దేవతలారా ! భూలోకంలో బ్రాహ్మణులు, క్షత్రియులు చేసే యజ్ఞ యాగాలకు సంబంధించిన హవ్యము మీ ఆకలిని పోగొడుతుంది. ఆ హవ్యము మీ పేరుచెప్పి అగ్నిలో వేస్తారు. కాబట్టి దాన్ని అగ్నిమూలంగా మీకు అందించే శక్తివేరే ఉన్నది. ఆ శక్తి కోసం మీరంతా ఆ పరదేవతను ప్రార్థించండి. ఆవిడ ప్రసన్నురాలైతే ఆ శక్తిని పంపుతుంది' అన్నాడు.

దేవతలంతా అత్యంత శ్రద్ధాభక్తులతో పరమేశ్వరిని ఆరాధించారు. దేవి వారి దీక్షకు మెచ్చి ఆ శక్తిని పంపించింది. బ్రహ్మ ఆ శక్తికి నమస్కరించి "తల్లీ ! నువ్వు అగ్నిదేవునికి దాహకశక్తివై, అతని యందు హోమం చేసిన హవ్యాన్ని దేవతలకు అందించు" అన్నాడు. దానికి ఆ శక్తి "నేను శ్రీహరికి తప్ప ఇతరులకు చెందను. అగ్నికి దాహకశక్తిగా ఉండను' అని చెప్పి వెళ్ళి విష్ణుమూర్తిని గురించి తపస్సు చెయ్యటం ప్రారంభించింది.

కొంతకాలానికి హరి ప్రత్యక్షమై "దేవీ ! నీ మనసు నాకర్థమయింది. మరుజన్మలో నగ్నజిత్తు అనే రాజుకు నాగ్నజితిగా పుట్టి, నా అంశతోపుట్టిన శ్రీకృష్ణుని వివాహమాడు కాని ఇప్పుడు మాత్రం స్వాహ అనే పేరుతో అగ్నిదేవునికి ఇల్లాలివై, అతనికి దాహకశక్తివై ఉండు" అన్నాడు. స్వాహాదేవి విష్ణుమూర్తి మాటలకు ఒప్పుకుంది. అగ్నికి స్వాహాదేవికి వివాహమయింది. వారికి ముగ్గురుపిల్లలు కలిగారు. వారే

1. ఆహవనీయాగ్ని 2. గార్హ పత్యము 3. దక్షిణాగ్ని ఈ రకంగా స్వాహాదేవి అనుగ్రహంవల్ల దేవతల ఆకలిబాధ తీరింది. అని చెప్పబడింది. కాబట్టి స్వాహాదేవి అగ్నిదేవుని దాహకశక్తి. యజ్ఞంలో దేవతలకర్పించిన హవిస్సులను దేవతలకు చేరుస్తుంది.

మార్కండేయపురాణంలో "ఓ దేవీ ! నీ నామాన్ని ఉచ్చరించటం వల్ల దేవతలందరూ తృప్తి చెందుతున్నారు. యాగాలు అన్నింటిలోనూ స్వాహా అనే నామాన్ని ఉచ్చరిస్తే చాలు దేవతలు ప్రీతి చెందుతారు" అని చెప్పబడింది.

అగ్నిదేవుణ్ణి ప్రార్థించేటప్పుడు **స్వాహాంతు దక్షిణే పార్శ్వే** అంటాము. అంటే అగ్నిదేవుని దక్షిణభాగంలో స్వాహాదేవి ఉంటుంది.

పద్మపురాణంలో మహేశ్వరపుర పీఠాధిష్ఠాన దేవత స్వాహాఅనే పేరు గలది అని చెప్పబడింది.

537. స్వధా

పితృదేవతలకు తర్పణలు అర్పించేటప్పుడు కుడిచేతి బ్రొటనవేలు కిందికి ఉంచి నువ్వులు నీళ్ళు వదులుతూ స్వధాంతర్పయామి, స్వధాంతర్పయామి, స్వధాంతర్పయామి. అంటారు. ఆ వదిలిన తర్పణ స్వధాదేవి ద్వారా పితృదేవతలకు చేరుతుంది. దేవీభాగవతంలో 'పితృదేవతలకు సిద్ధకర్మలలో తర్పణద్వారా ఆహారం లభించేటట్లు చేశాడు బ్రహ్మ. కాని వారికి అది సక్రమంగా అందటంలేదు. పితృదేవతలు వారి బాధలు బ్రహ్మకు చెప్పుకున్నారు. వారి కష్టాలు తీర్చటానికి బ్రహ్మ 'స్వధా అనే కన్యను సృష్టించాడు. ఆమె అపురూప సౌందర్యరాశి. ఈమెను పితృదేవతలకు సమర్పించాడు.

శ్రాద్ధకర్మలలో పితృదేవతలకు సమర్పించిన తర్పణలను సవ్యంగా వారికి అందించటమే ఈమెపని.

దేవీవామే స్వధాంతథా అగ్నిదేవుడికి స్వాహాదేవి కుడి ప్రక్కన ఉంటే స్వధాదేవి ఎడమ ప్రక్కన ఉంటుంది.

538. అమతిః

అమతి – అజ్ఞానము. అవిద్యాస్వరూపము మొట్టమొదటిగా సృష్టి అవ్యక్తము. మూలప్రకృతి.

539. మేధా

మేధ అంటే – బుద్ధి అని అర్థం. సకలశాస్త్రసారమైనది మేధ. సర్వభూతాలయందు ఆ పరమేశ్వరి మేధారూపంలో ఉన్నది.

కాశ్మీరుమండలంలో మేధాదేవి పూజింపబడుతున్నది అని పద్మపురాణంలో చెప్పబడింది.

540. శ్రుతిః

వేదరూపిణి

ఋచో యజూగ్ంషి సామాని త దైవాథర్వణానిచ

బ్రాహ్మణ స్సహజం రూపం నిత్యైషా శక్తి రవ్యయా ॥

గురుశిష్య పరంపరంగా వచ్చినది. ఒకరు చెప్పుట వలన ఇంకొకరికి ఇలా ఒకరి నుంచి ఒకరికి పారంపర్యంగా వచ్చే విద్య. ఋగ్ యజు స్సామ అధ్వరణ వేదాలు శ్రుతులనబడతాయి. పరమేశ్వరి వేదమాత. సృష్టాదికాలంలో వేదాలను సృష్టించి బ్రహ్మదేవుడికిచ్చింది. ఆమె యొక్క ఉచ్ఛ్వాసనిశ్వాసలే వేదాలు. అందుకే ఆమె శ్రుతి అనబడుతోంది.

541. స్మృతిః

మన్వాదిస్మృతులరూపం కలిగినటువంటిది. వేదాలు స్మృతులు కూడా ఆ పరమేశ్వరి రూపాలే. ఆ దేవి శ్రవణస్మరణాత్మకమైన రూపము గలది. స్మరించుటయే దేవి యొక్క స్మృతి అని దేవీపురాణంలో చెప్పబడింది. ఎప్పుడూ పరమేశ్వరి నామాన్ని విడవకుండా చెయ్యటమే స్మృతి అనబడుతుంది.

వేదాలన్నీ బాగా ప్రచారమయిన తరువాత, ప్రతివారూ వేదాలను చదవలేరు. చదివినా అర్థం చేసుకోలేరు కాబట్టి, వేదాలసారాన్ని మనువు, పరాశరుడు, యాజ్ఞవల్క్యుడు మొదలైనవారు స్మృతులును వ్రాశారు. శ్రుతిపూర్వకమైన వాటి మననరూపమే స్మృతి.

సర్వజీవుల యొక్క భూతభవిష్యద్వర్తమానాలనన్నింటినీ ఆ పరమేశ్వరి స్మృతి పథంలో ఉంచుకుంటుంది. కాబట్టి 'స్మృతి' అనబడుతుంది.


542. అనుత్తమా

పరమేశ్వరికన్న ఉత్తమమైన వస్తువు ఏదీలేదు. అందుచేత ఆమె 'అనుత్తమా' అనబడుతుంది. వేదంలో పరమేశ్వరునితో సమానమైన వారుకాని, అతని కన్న అధికులుగాని లేరు" అని చెప్పబడింది.

దేవీ భాగవతంలో జనులు బలములేనివాడిని శక్తిహీనుడు అంటున్నారు కాని విష్ణుహీనుడు, రుద్రహీనుడు అనటంలేదు" అని చెప్పారు.

అందరికన్న ఉత్తమమైనది సర్వోత్తతమమైన దేవత.

ఈ రకంగా 542వ నామం వరకూ షట్చక్రాలను వివరించి, సహస్రారంలో ఉండే దేవత యశస్విని. ఆమె యాకిని అనే పేరుతో పిలువబడుతుంది. ఆమె అనంతమైనది శాశ్వతమైనది. దేవతలకు హవిస్సులర్పించే స్వాహాదేవి ఆమె. పితృదేవతలకు తర్పణలందించే స్వధాదేవి ఆమె. జగత్తుకు మూలకారణమైన మూలప్రకృతి ఆమె. ఆ దేవతయే బుద్ధి. వేదమాత, శ్రుతులు స్మృతులు కూడా ఆమెయే. ఈరకంగా ఆమె ఉత్తమమైనది. ఆమెకన్న అధికులుగాని, ఆమెతో సములుగానిలేరు అని చెప్పబడింది.



శ్రీ 'ఖ'కార దేవి

37. విమర్శరూపిణీవిద్య

నిరాకారుడు నిర్గుణస్వరూపుడు అయిన పరబ్రహ్మ సృష్టి ప్రారంభం కాకముందు, గతంలో జరిగిన కల్పంలో కర్మ పరిపక్వం కాకుండా తనలో లీనమైపోయినటువంటి జీవులయొక్క కర్మను పరిపక్వం చేసి, వాటికి మోక్షం కలిగించాలనే ఉద్దేశ్యంతో తనలో నుంచి కొంతశక్తిని బయటకు పంపాడు. అదే విమర్శశక్తి. అయితే బిందురూపుడయిన పరబ్రహ్మ నుంచి కొంతభాగము బయటకు వచ్చినట్లైతే, అతని యొక్క బిందుత్వానికి ముప్పు వాటిల్లదా అనేది సందేహం. అలా జరగదు. ఎందుకంటే

పూర్ణ మదః పూర్ణ మిదం పూర్ణాత్ పూర్ణ ముదచ్యతే ।
పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావ శిష్యతే ॥

పూర్ణస్వరూపుడయిన పరబ్రహ్మ నుంచి అనంతమైన విశ్వం బయటకు వచ్చినప్పటికీ, పరబ్రహ్మ యొక్క పూర్ణత్వానికి హానిరాదు.

సున్నాలో నుంచి సున్నా తీసి వేసినా, లేక సున్నాకు సున్నా కలిపినా సున్నాయే ఉంటుంది. అంతేకాని దాని విలువమారదు.

ఈరకంగా పరబ్రహ్మ నుంచి బయటకు వచ్చినదే శక్తి. అదే విమర్శరూపము. పరమేశ్వరుడు ప్రకాశరూపము. వీరిద్దరే ప్రకాశవిమర్శాంశలు. శివశక్తులు, కామేశ్వరీ కామేశ్వరులు. ప్రకాశాంశ అవ్యక్తము. విమర్శాంశ వ్యక్తము. శ్రీవిద్యలో బిందువు ప్రకాశాంశ. త్రికోణము విమర్శాంశ. ఈ రెండూ ఎప్పుడూ కలిసే ఉంటాయి. విడివిడిగా ఉండవు అందుకే

త్రికోణరూపిణీశక్తిః బిందురూపపర శ్శివః

శక్తి త్రికోణము కాగా బిందువు శివుడు

ఈ త్రికోణంనుంచే నామరుపాత్మకమైన జగత్తు ఏర్పడింది.

ఇక శ్రీవిద్యలో చూసినట్లైతే సృష్టి ప్రారంభమైన తరువాత, శ్రీవిద్యను లోకంలో ప్రచారం చెయ్యాలనే ఉద్దేశ్యంతో పరమేశ్వరుడు, తనలో నుంచి బయటకు వచ్చినటువంటి ఆత్మస్వరూపమైనటువంటి పరమేశ్వరికి శ్రీవిద్యను మొట్టమొదటగా ఉపదేశించాడు. వీరిద్దరే ప్రకాశాంశ విమర్శాంశలు. శివ శక్తులు. ఆ తరువాత పరమేశ్వరి నుండి పరంపరగా శ్రీవిద్య ఉమామహేశ్వరులకు, వారి నుండి లక్ష్మీనారాయణులకు, వారి నుండి వాణీ

హిరణ్యగర్భులకు, వారి నుండి ఇంద్రాది దేవతలకు, వారి నుండి సనక సనందనాది ఋషులకు, వారి నుండి విద్యారణ్యుడు, గౌడపాదుడు మొదలైన మానవులకు శ్రీవిద్య సంక్రమించింది.

మొత్తం మీద చూసినట్లైతే పరమేశ్వరుడు ప్రకాశాంశ. పరమేశ్వరి విమర్శాంశ. వారిద్దరూ వేరుకాదు. ఇద్దరూ ఒకటే. అదే అర్ధనారీశ్వరతత్త్వము.

లలితాసహస్రంలో 543 నుంచి 559 వరకు నామాలలో విమర్శరూపిణీ విద్య వివరించబడింది. దీన్నే కాత్యాయనీవిద్య అని కూడా అంటారు.

ఆ దేవతను కీర్తించినా, ఆవిడగాథలను శ్రవణం చేసినా పుణ్యమే. పూర్వజన్మల సుకృతం ఉంటేనే ఆమెకు నమస్కరించటమైనా జరుగుతుంది. ఆ దేవిని అర్చించినట్లైతే ఇహలోక బంధనాలు తెగిపోతాయి. ఆమె వేదస్వరూపిణి. స్థావరజంగమాత్మకమైన జగత్తుకు మాతృక. ఆమె భక్తులకు వ్యాధులు రావు. అపమృత్యువుండదు. కలియుగంలో వచ్చే పాపాలన్నింటినీ ఆమె నశింపచేస్తుంది. ఇక నామాలను చూద్దాం.

543. పుణ్యకీర్తిః

పుణ్యా పుణ్యప్రదా కీర్తి ర్యస్యాః – సా

పుణ్యమైన కీర్తి గలది. పుణ్యాన్ని ఇచ్చేటటువంటి కీర్తి గలది. పరమేశ్వరి పుణ్యదాయిని. ఆ దేవి తన భక్తులకు పుణ్యాన్ని పంచి పెడుతుంది. శ్రీవిద్య యొక్క ఉపాసన, శ్రీచక్రపూజ, అర్చన, లలితాసహస్రపారాయణ, పంచదశి, షోడశిమంత్రజపము అతి పుణ్యప్రదాలు. ఇవి పరమేశ్వరి భక్తులకు ముక్తిని ప్రసాదిస్తాయి. జ్ఞానాన్ని ప్రసాదిస్తాయి. దేవతలందరిలోకి ఆ పరమేశ్వరియే ఉత్తమమైనది. అంతకన్న అధికులు ఎవరూలేరు. కాబట్టి తన భక్తులకు ఎక్కువ పుణ్యఫలాన్ని అందించేశక్తి ఆ పరమేశ్వరికి తప్ప వేరెవరికీలేదు. అందుచేతనే ఆమె పుణ్యకీర్తి అనబడుతోంది.

544. పుణ్యలభ్యా

పుణ్యము చేత మాత్రమే పొందతగినది. పరమేశ్వరిని దర్శించటమనేది సామాన్యవిషయంకాదు. మానవుడి యొక్క పూర్వజన్మలకర్మఫలితాన్ని బట్టి ఉంటుంది. గతంలో చెప్పినట్లుగా పరమేశ్వరిని అర్చించాలన్నా, ఆరాధించాలన్నా, కూడా గతజన్మలో చేసిన సుకృతం ఉండాలి. అలాగే ఆవిడ మంత్రాన్ని జపం చెయ్యాలంటే అర్వాణచక్రం

వేసి చూస్తే అందులో సిద్ధము, సాధము, సుసిద్ధము అని వస్తాయి అని గతంలో వివరించాము. గత జన్మలలో ఆ దేవిని బాగా అర్చించి ఉంటే, జపం బాగా చేసి ఉంటే, అనగా శ్రీవిద్యలో నిష్ణాతుడై ఉంటే, ఈ జన్మలో అతడికి శ్రీవిద్య సుసిద్ధమవుతుంది. అలాగే మిగిలినవి కూడా.

గతజన్మలోని కర్మలఫలితంగానే మోక్షసాధనాలు సమకూరతాయి. వాటిని గతంలో వివరించాం. కాని మళ్ళీ ఒక్కసారి గుర్తుచేస్తున్నాం. మోక్షసాధనాలు నాలుగు. అవి

1. నిత్యానిత్యవివేకము
2. వైరాగ్యము
3. షట్సంపత్తి
4. ముముక్షుత్వము

ఈ లక్షణాలు కావాలంటే ఉపాసనలో సాదకుడు నిష్ణాతుడు కావాలి. దీనికి జన్మజన్మల సుకృతం ఉండాలి.

అందుకే పరమేశ్వరిని అర్చించాలంటే గతజన్మలో చేసిన సుకృతం ఉండాలి అంటాడు శంకరభగవత్పాదులు తమ సౌందర్య లహరిలోని మొదటి శ్లోకంలో

శివ శక్త్యాయుక్తో యది భవతి శక్తః ప్రభవితుం
న చే దేవం దేవో న ఖలు కుశలః స్పందితు మపి
అత స్త్వా మారాధ్యాం హరిహర విరంచాదిభిరపి
ప్రణన్తుం స్తోతుంవా కథ మకృతపుణ్యఃప్రభవతి

ఓ తల్లీ ! సర్వమంగళకారుడైన శివుడు కూడా జగన్నిర్మాణశక్తివైన నీతో కూడనిదే ఈ సృష్టిని చేయలేడు. కాబట్టి పూర్వజన్మ సుకృతం లేనివాడు హరిహర బ్రహ్మాదులచే అర్చించబడు నిన్ను స్మరించటానికి కూడా అనర్హుడే కదా ?

దేవీభాగవతంలో "వేదాంతులు, తపోవంతులు, పుణ్యచరితులు మాత్రమే దానిని గాంచగలరు. ఆశ గలవారు పరమేశ్వరిని గాంచలేరు" అని చెప్పబడింది.

కాబట్టి పుణ్యచరితులు మాత్రమే దేవిని దర్శించగలరు.

545. పుణ్యశ్రవణకీర్తనా

పుణ్యే విహితకర్మరూపే శ్రవణకీర్తనే యస్యాః - సా

పుణ్యమైన విహితకర్మలను వినుట పొగడుట గలది. పరమేశ్వరి యొక్క మంత్ర జపంగాని, కీర్తనలుగాని కథలు, గాథలుగాని వినటంవల్ల పుణ్యఫలం వస్తుంది. కాబట్టి దేవిని గురించిన విషయాలను వినటము, కీర్తించటము వల్ల పుణ్యము వస్తుంది.

పుణ్యప్రదము, శుభప్రదము అయిన విషయాలను శ్రవణం చేయుటయందుగాని, కీర్తనలను వినుటయందుగాని ఆసక్తి గలది. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 66వ శ్లోకంలో

విపంచ్యా గాయంతీ వివిధముపదానం పశుపతే
స్త్వయారబ్ధే వక్తుం చలితశిరసా సాధువచనే
తదీయై ర్మాధుర్యై రపలపిత తంత్రీకలరవాం
నిజాం వీణాం వాణీ నిచుళయంతి చోళేన నిభృతమ్ ॥

సరస్వతీదేవి తన వీణను శృతిచేసి నీ పతి అయిన శివుని వీరగాథలు పాడుచుండగా మెచ్చుకోలుగా నీవు ఆమెను అభినందించావు. అప్పుడు నీ వాక్కులు వీణానాదం కన్న మధురంగా ఉండటంచేత సిగ్గుపడి సరస్వతి ఆ వీణను గుడ్డతో కప్పివేసింది.

ఈ శ్లోకంలో పరమేశ్వరి తన భర్త అయిన శివుని వీరగాథలు వినటానికి ఆసక్తిగా ఉన్నది అని చెప్పబడింది. ఈ రకంగా పుణ్యాన్ని కలిగించే విషయాలను వినటమునందు ఆసక్తి గలది.

546. పులోమ జార్చితా

పులోముని కుమార్తె అయిన శచీదేవిచే పూజించబడినది.

పురూరవుడు రాజ్యం చేస్తున్న రోజులలో ఒకనాడు వనంలో ఊర్వశిని చూసి మోహించాడు. వారిద్దరూ కలిసి కొంత కాలం కాపురం చేశారు. వారికి పదిమంది సంతానం కలిగారు. అందులో ఆరవవాడి పేరు 'ఆయువు' ఇతని కుమారుడు నహుషుడు. వేదవేదాంగవిదుడు. తత్త్వవేత్త. పండితుడు. అనేక యజ్ఞాలు, యాగాలు నిర్వహించాడు. వంద అశ్వమేధాలు చేశాడు.

త్వష్టప్రజాపతి కుమారుడు వృత్రుడు. రాక్షసనైజం కలవాడు. యుద్ధంలో ఇంద్రుణ్ణి ఓడించాడు. వృత్రాసురునితో గెలవలేక ఇంద్రుడు అతనితో స్నేహంచేసి, వృత్రుడు ఏమరుపాటుగా ఉన్నప్పుడు అతణ్ణి సంహరించాడు. ఆ కారణంగా ఇంద్రుడికి బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. అతడి ముఖంకళావిహీనమైపోయింది. దాంతో ఇంద్రుడు అమరావతిని వదిలి మానససరోవరానికి పారిపోయి అక్కడ ఒక పద్మంలో దాక్కున్నాడు.

రాజు లేకుండా రాజ్యం సాగదు కాబట్టి ఇంద్రపదవికి అర్హుడైన వ్యక్తికోసం వెదికారు దేవతలు నూరు అశ్వమేధాలు చేసినవాడు ఇంద్రపదవికి అర్హుడు. భూలోకంలో నహుష

చక్రవర్తి ఆ పనిచేశాడు. కాబట్టి అతడికి ఇంద్రపదవిని కట్టబెట్టారు దేవతలు. ధర్మపరుడైన నహుషుడు, ఇంద్రపదవి వచ్చేసరికి భోగలాలసుడైనాడు. సర్వకాలసర్వావస్థలయందు భోగాలలో తేలియాడుతూ చివరకు ఇంద్రుని భార్య శచీదేవి కావాలి అన్నడు. దేవతలు పరిపరివిధాల నచ్చచెప్పటానికి ప్రయత్నించారు. వినలేదు నహుషుడు. చివరకు దేవగురువైన బృహస్పతి శచీదేవికి భువనేశ్వరీ మంత్రాన్ని ఉపదేశించి 'అమ్మా ! ఈ మంత్రాన్ని జపించు ఆమెయే నీ కష్టాలు తీరుస్తుంది' అన్నాడు.

బృహస్పతి మాటప్రకారం శచీదేవి పరమేశ్వరిని ఆరాధించింది. ఆమె ప్రసన్నమైంది. ఇంద్రుడు అశ్వమేధం చేశాడు. అతని పాపం పోయింది. నహుషుడికి పెద్దపామై పొమ్మని అగస్త్యుడు శాపమిచ్చాడు. ఈ రకంగా పరమేశ్వరి దయవల్ల శచీదేవికి నహుషుని పీడ వదిలింది. ఈ విధంగా పులోముని కుమార్తెతో అర్చించబడింది కాబట్టి ఆ దేవి పులోమజార్చితా అనబడింది.

547. బంధమోచనీ

అవిద్యాసంబంధమైన బంధాలను విడిపించేది. లౌకిక బంధాల నుండి విముక్తి కలిగించేది. అరిషడ్వర్గాలను జయింపచేసేది. రాగద్వేషాల నుండి తన భక్తులకు విడుదల కలిగించేది.

యయాతిదేవయానిల కుమారుడు తుర్వసుడు. అతని పెంపుడు కుమారుడు ఏకవీరుడు. పండితుడు, శాస్త్రవేత్త, ధర్మవిధుడు, పైగా పరాక్రమశాలి. ఏకవీరుడు రాజ్యం చేస్తున్నరోజులలో గంగానదీ తీరాన ఉన్న ఒక చిన్న రాజ్యాన్ని 'రభ్యుడు' అనే రాజు పాలిస్తున్నాడు. అతనికి పరమేశ్వరి అనుగ్రహంవల్ల ఒక కుమార్తె కలిగింది. ఆమె పేరు ఏకావళి.

ఒక రోజున రాకుమార్తె 'ఏకావళి, తన చెలికత్తె యశోవతితో కలిసి గంగాతీరానికి వెళ్ళింది. అక్కడ కాలకేతుడనే రాక్షసుడు రాకుమారిని చూసి మోహించి, వారిద్దరినీ ఎత్తుకుపోయాడు.

యశోవతి పరమేశ్వరి అనుష్ఠానమున్నది. ఒకరోజు రాత్రి పరమేశ్వరి ఆమెకు కలలో కనిపించి మరునాడు ఉదయమే గంగానది ఒడ్డుకువెడితే అక్కడ ఏకవీరుడు అనే రాజుంటాడు. అతనికి జరిగిన విషయం చెప్పు. అతడు రాక్షసుణ్ణి చంపి మిమ్మల్ని రక్షిస్తాడని చెప్పింది.

పరమేశ్వరి మాటప్రకారం మరుసటిరోజు ఏకవీరుణ్ణి కలిసింది. విషయం తెలుసుకున్న ఏకవీరుడు రాక్షసుణ్ణి సంహరించి ఏకావళిని వివాహమాడాడు. ఈ రకంగా పరమేశ్వరిని అర్చించటంచేత రాకుమార్తె చెరవిడింది. ఏకావళికేకాదు పరమేశ్వరిని అర్చించే ఎవరికైనా సరే బంధనాలు ఉండవు. కాబట్టి ఆ దేవి 'బంధమోచనీ' అనబడుతుంది.

548. బంధురాలకా

స్త్రీలకు నుసటన ఉండే ముంగురులు వంకరలు తిరిగి ఉంటాయి. ఇది సౌందర్యలక్షణం. ఆ విషయమే ఈ నామంలో చెబుతున్నారు. మనోహరమై, దట్టమై, వంకరలు తిరిగిన ముంగురులు గలది.

అయితే ఈ నామం అసలు **బర్బరాలకా** అంటున్నారు. భాస్కరాచార్యులవారు. బర్బరాలకా అంటే పొట్టిగా వంకరలు తిరిగిన వెంట్రుకలు అని భావము. ముఖముకు పైభాగాన ఉండే ముంగురులు ఎప్పుడూ పొట్టిగానే ఉంటాయి. అందుచేత బర్బరాలకా అనే నామమే సరియైనది అంటున్నారు.

ఏదిఏమైనా ముంగురులు సౌందర్యలక్షణముగా గమనించాలి.

549. విమర్శరూపిణీ

ప్రకాశాత్మ అయిన పరబ్రహ్మ యొక్క స్వాభావిక ప్రకాశరూపము విమర్శ. సౌభాగ్యసుభగోదయంలో

స్వాభావికీ స్ఫురత్తా విమర్శరూపాఽ స్య విద్యతే శక్తిః
సైవ చరాచర మఖిలం జనయతి జగ దేత దపిచ సంహరతి ॥

"పరమేశ్వరుడికి స్వాభావిక స్ఫురణ విమర్శరూపముగా ఉన్నది. ఆ విమర్శశక్తియే చరాచరములను పుట్టించుచున్నది" అని చెప్పబడింది.

నిరాకారుడు నిర్గుణస్వరూపుడు అయిన పరబ్రహ్మ సృష్టి చెయ్యాలని సంకల్పించినవాడై తనను తాను రెండుభాగాలుగా విభజించుకున్నాడు. లేక తనలో నుంచి కొంతభాగాన్ని బయటకు పంపాడు.

అదే విమర్శరూపము. పరమేశ్వరుడు – ప్రకాశరూపముగా పరమేశ్వరుని నుండి బయటకు వచ్చిన శక్తివిమర్శరూపము. వారే శివశక్తులు అని గతంలో వివరించటం జరిగింది.

ఈ రకంగా బయటకు వచ్చిన విమర్శరూపమే శక్తి. ఈ సృష్టికి కారణము. కాబట్టి ఈ జగత్తంతా విమర్శరూపమైన శక్తి నుంచే ఆవిర్భవించింది.

మాతృకావివేచనము అనేగ్రంథంలో

వాచకేన విమర్శేన వినా కిం వా ప్రకాశ్యతే
వాచ్యేనాపి ప్రకాశేన వినా కింవా విమృశ్యతే
తస్మా ద్విమర్శో విస్ఫూర్త్యై ప్రకాశం సమపేక్షతే
ప్రకాశ శ్చాత్మనోజ్ఞానే విమర్శం సమపేక్షతే ॥

వాచకరూపమైన విమర్శ లేకుండా ప్రకాశముండదు. అలాగే వాచ్యమైన ప్రకాశం లేకుండా విమర్శ కూడా ఉండదు. కాబట్టి విమర్శకు ప్రకాశము అవసరము. అలాగే ఆత్మజ్ఞానమైన ప్రకాశానికి విమర్శ అవసరము. ఈ రెండింటికీ అవినాభావ సంబంధమ్ముంది. ఈ రెండింటిలోనూ ఒకటి లేకుండా ఇంకొకటి ఉండదు.

550. విద్యా

విద్య అంటే జ్ఞానరూపమైనది, మోక్షదాయకమైనది విద్య. దేవీమాహాత్మ్యంలో "ఆ పరాశక్తి విద్యగా ఉన్నది" అని చెప్పబడింది. గౌడపాదులవారు కూడా పరమేశ్వరియే విద్య అని చెబుతున్నారు. మాయతో కూడినది అవిద్య. మాయలేనిది జ్ఞానము. అని శైవతంత్రంలో చెప్పారు.

విద్యయే స్వరూపంగా గల దేవి. దేవి వేదస్వరూపిణి. జ్ఞానస్వరూపిణి. కంటికి కనిపించే వాటిసాయంతో కంటికి కనిపించని దాన్ని కొనుక్కొవటమే విద్య అనబడుతుంది.

దేనిచేత అక్షరపరబ్రహ్మను గురించి తెలుసుకోగలమో అది విద్య. వేదంలో రెండురకాల విద్యలు చెప్పబడ్డాయి. 1. అపరావిద్య 2. పరావిద్య. ముండకోపనిషత్తులో వీటిని వివరించటం జరిగింది.

శునకుని కుమారుడు శౌనకుడు విద్యాభ్యాసం పూర్తిచేసి గృహస్థాశ్రమం స్వీకరించటానికి విముఖుడై తన గురువైన అంగిరసుణ్ణి అడుగుతాడు. "అర్యా ! దేన్ని గురించి తెలుసుకుంటే నాకు సర్వమూ తెలుస్తుందో, దాన్ని గురించి వివరించండి" అంటాడు. దానికి అంగిరసుడు "నాయనాలోకంలో తెలుసుకోవలసిన విద్యలు రెండు ఉన్నాయి. 1. అపరావిద్య 2. పరావిద్య

అపరావిద్య లౌకికప్రయోజనాలకు వర్తిస్తుంది. బుద్ధి సంపన్నులైన మహర్షులు యజ్ఞకర్మలు చేస్తారు. యజ్ఞాలవల్ల పుణ్యలోకాలు కలుగుతాయి. లోకంలో మనం చేసే కర్మలన్నింటివల్లా పుణ్యఫలం కలుగుతుంది. తద్వారా సిరిసంపదలు, భోగభాగ్యాలు, ఉన్నత పదవులు కలుగుతాయి.

పరావిద్య అంటే మోక్షవిద్య. సర్వ సంఘ పరిత్యాగం చేసి విరాగి అయినవాడు మాత్రమే అనుసరించగలిగినది. సాధకుడికి మోక్షమార్గం చూపేది.

ముందుగా అపరావిద్యనుపాసించి, కర్మఫలాన్ననుభవించి, ఆ తరువాత పరావిద్యను తెలుసుకోవాలి అంటాడు. అలాగే

ఛాందోగ్యోపనిషత్తులో దేవర్షి అయిన నారదుడు సనత్కుమారుని దగ్గరకుపోయి, స్వామీ గతంలో నేను వేదవేదాంగాలు ఉపనిషత్తులు, చతుష్షష్టికళలు, సర్వశాస్త్రాలు అభ్యసించాను. సంగీతసాధన చేశాను. కానీ నాకు మనశ్శాంతి లేదు. ఆత్మజ్ఞానం కలగలేదు. కాబట్టి నాకు ఆత్మజ్ఞానాన్ని ఉపదేశించి, దుఃఖవిమోచన కలిగించండి అంటాడు. తరువాత సనత్కుమారుడు నారదుడికి బ్రహ్మోపదేశం చేస్తాడు.

కాబట్టి విద్య అనేది పరావిద్య. జ్ఞానస్వరూపం. అపరావిద్య పూర్తిగా తెలిసిన తరువాతనే పరావిద్య లభ్యమవుతుంది. పరమేశ్వరియే జ్ఞానస్వరూపం. కాబట్టి విద్యా అంటే ఆ పరమేశ్వరియే కాని వేరుకాదు.

551. వియదాదిజగత్ప్రసూః

వియత్ అంటే ఆకాశము. ఆకాశము మొదలైన జగత్తులను ప్రసవించినది. లేక సృష్టించినది.

సృష్టిలో మొట్టమొదటగా ఆకాశం ఉద్భవించింది. ఆకాశం నుంచి – వాయువు, వాయువు నుంచి – అగ్ని, అగ్ని నుంచి – నీరు, నీటి నుంచి – భూమి. ఈ రకంగా పంచభూతాలు తన్మాత్రలు, జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు. గుణాలు క్రమేణా 84 లక్షల జీవరాశి ఆవిర్భవించింది.

ప్రళయం జరిగినప్పుడు కర్మ క్షయం కానటువంటి జీవరాశి అంతా, తమ కర్మ తమతోనే మూటకట్టుకుని మాయలో లీనమైపోయాయి. ఇక పంచభూతాలు క్రిందనుంచి పైకి లయమైయాయి. అంటే

భూమి	–	జలంలో లీనమైపోయింది
జలం	–	అగ్నిలో లీనమైపోయింది
అగ్ని	–	వాయువులో లీనమైపోయింది
వాయువు	–	ఆకాశంలో కలిసిపోయింది.

వీటన్నింటినీ కలుపుకున్న ఆకాశం మాయలో కలిసిపోగా, మాయ పరమాత్మునిలో లీనమైపోతుంది. ఈ విధంగా జగత్తునంతా తన గర్భాన ధరిస్తాడు పరమేశ్వరుడు. గర్భం ధరించటమనేది స్త్రీ లక్షణం కాబట్టి పరమాత్మకు స్త్రీత్వము ఆపాదించబడుతోంది. లేకపోతే, పరమాత్మకు లింగబేధాలు లేవు.

ఆ రకంగా గర్భంలో దాచుకున్న జగత్తును కొంతకాలానికి మళ్ళీ బయటకు పంపాడు పరమాత్మ. అదే జగత్సృష్టి. అందుకే శ్రీమద్భాగవతంలో

ఒక పరి జగముల వెలినిడి

ఒక పరి లోపలికి గొనుచు ఉభయము గనుచున్

ఒకసారి ఈ జగత్తులను తన గర్భం నుంచి బయటకు వదులుతాడు. అది సృష్టి. జగత్తును తన లోపల ఇముడ్చుకోవటం లయము. ఇది పరమాత్మ లక్షణం. పరమేశ్వరియే పరబ్రహ్మ. కాబట్టి ఈ లక్షణాలన్నీ ఆ దేవికి ఉన్నాయి.

552. సర్వవ్యాధిప్రశమనీ

సమస్తమైన వ్యాధులను నాశనము చేయునది. పరమేశ్వరి తన భక్తుల యొక్క వ్యాధులన్నింటినీ శమింపచేస్తుంది. వ్యాధులు అనేకరకాలు వాటిలో ముఖ్యమైనవి.

1. శారీరకములు 2. మానసికములు

శారీరకములు అంటే శరీరంలో కలిగే మార్పులవల్ల, శీతోష్ణాలవల్ల వచ్చేవి. లేదా పూర్వజన్మల కర్మ ఫలితంగా వచ్చే దీర్ఘవ్యాధులు. జ్వరం దగ్గర నుంచీ అన్నిరకాల వ్యాధులు. వీటిని నాశనం చేస్తుంది. ఇక రెండవది మానసికవ్యాధులు. ఇవి శరీరానికి సంబంధించినవి కావు. తన వారు దూరం కావటంవల్లనో, తానుకోరుకున్నది దొరకకపోవటంవల్లనో ఈ రకమైన వ్యాధికలుగుతుంది. ఇది మనసుకు సంబంధించిన వ్యధ. దీనికి వైద్యశాస్త్రంలో మందులేదు. కాని పరమేశ్వరి ఈరకమైన వ్యాధిని కూడా నాశనం చెయ్యగలదు. రోగి యొక్క మనసును ఆ పరమేశ్వరి మీదికి మళ్ళించటమువల్ల ఈ వ్యాధులు ఉపశమిస్తాయి.

జగత్తంతా పరమేశ్వరి స్వరూపమే. ఈ వ్యాధులు గత జన్మకర్మలు. వాటిని అనుభవించటం వల్ల కర్మక్షయం అవుతుంది. ఈ రకమైన జ్ఞానంవల్ల వ్యాధుల ఉపశమనం కలుగుతుంది.

553. సర్వమృత్యునివారిణీ

లోకంలో పుట్టిన ప్రతిప్రాణి మరణించి తీరవలసినదే. ఈ లోకము మరము. అంటే మరణము స్వభావంగా కలిగినటువంటిది. అయితే మృత్యువు రెండు రకాలు 1. అపమృత్యువు 2. కాలమృత్యువు

1. కాలమృత్యువు అంటే ప్రతిప్రాణికీ మరణమున్నది. ఎప్పుడో ఒకప్పుడు ప్రతివారూ మరణించాలి. కాబట్టి ఆయువు తీరగానే మృత్యువాతపడటం.

2. అపమృత్యువు అంటే అనుకోకుండా, ఆయువు తీరకుండానే మరణించటం. నీటిగండము, వాహనగండము. ఇలాంటి వాటివల్ల అంటే ప్రమాదాలు, యుద్ధాలు, భూకంపాలు, వరదలవల్ల మృత్యువు కలుగుతుంది.

పరమేశ్వరుణ్ణి నమ్మినవాడికి మృత్యువుండదు. వేదంలో 'మహాదేవుని తెలుసుకున్నవాడు మృత్యువును జయిస్తున్నాడు' అని చెప్పబడింది. లోకంలో పుట్టిన ప్రతిప్రాణీ మరణించి తీరాలి కదా ? మరి మృత్యువును ఏ రకంగా జయిస్తాడు ? అని సందేహము. ఇక్కడ విషయం ఏమిటంటే పుట్టిన ప్రతి ప్రాణీ తప్పనిసరిగా మరణిస్తుంది. పుట్టనివారికి మరణంలేదు. కాబట్టి అసలు పుట్టనేలేదు అనుకోండి. అప్పుడు మరణమే ఉండదుకదా. ఈ రకంగా మరణాన్ని జయించినట్లేకదా ? జన్మ లేకుండా ఉండాలంటే ఏం చెయ్యాలి ? ముక్తి రావాలి. జీవాత్మని పరమాత్మతో ఏకం చెయ్యాలి. అప్పుడు పునర్జన్మ ఉండదు. దీనికి జ్ఞానం కావాలి. వైరాగ్యం కావాలి. అందుకే అన్నపూర్ణాష్టకంలో శంకరాచార్యులవారు

అన్నపూర్ణే ! సదాపూర్ణే ! శంకరప్రాణవల్లభే !

జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహి చ పార్వతి !

అంటూ జ్ఞానవైరాగ్యాలు ప్రసాదించమని ఆ పరమేశ్వరిని వేడుకుంటున్నారు.

ఈ విధంగా పరమేశ్వరి తన భక్తులకు జ్ఞానవైరాగ్యాలు ఇచ్చి ముక్తిని ప్రసాదిస్తుంది. అందుచేత 'సర్వమృత్యునివారిణీ' అనబడుతుంది.

554. అగ్రగణ్యా

అందరిలోనూ మొట్టమొదటిది. గణితికెక్కినది. సృష్టిలో ముందుగా ఉన్నది ఆ పరమేశ్వరియే. ఆమె నుంచే ఈ జగత్తంతా సృష్టించబడింది. కాబట్టి అందరికన్నా ఆది, అనాది అయినది ఆ పరమేశ్వరియే అందుకే అగ్రగణ్యా అనబడుతోంది.

దేవతలు చాలామంది ఉన్నారు. వారందరూ సాధకుల కోర్కెలు తీరుస్తారు. అయితే ఈ దేవతలంతా కల్పించబడిన వాళ్ళు. **సాధకానాం హితార్థాయ బ్రహ్మణోరూపకల్పనా.** వీరందరికీ అంతం ఉన్నది. అనంతమైనది ఆ పరమేశ్వరి ఒక్కతే. అందుచేత దేవతలందరిలోకీ ఆమె అధికురాలు.

555. అచింత్యరూపా

పరమేశ్వరి నిర్గుణస్వరూపిణి. కాబట్టి చింతించటానికి వీలులేదు. రూపంలేదు. ఈమె అవ్యక్తస్వరూపిణి. పంచభూతభావనలేనిది. అవాంగ్మాన గోచరమైనది. మనస్సుకు, వాక్కుకు కూడా కారణమైనది. అంటే వాటికన్న పురాతనమైనది. కాబట్టే ఇంద్రియాలతో ఆత్మను తెలుసుకోలేము అంటోంది కఠోపనిషత్తు

నచక్షుర్గచ్ఛతి నవాగ్గచ్ఛతి నోమనః ఆత్మ ఉన్న చోటికి వాక్కు వెళ్ళలేదు. కనులు పోలేవు. అందుకే పరదేవత రూపము చింతించరానిది. ఆలోచించలేనిది. అచింత్యరూపా అని చెప్పబడింది.

556. కలికల్మషనాశనీ

కలియుగంలో పాపాలు ఎక్కువగా ఉంటాయి. ఎందుకంటే ధర్మం చాలా వరకు నశించిపోతుంది. ప్రజలకు పాపభీతి ఉండదు. ఐహికసుఖాలమీద వాంఛ బాగా పెరుగుతుంది. ఈ పాపాలను నశింపచేయటం ఒక్క పరమేశ్వరి వల్ల తప్ప ఎవరివల్లా కాదు. కూర్మపురాణంలో "నీటివల్ల నిప్పు చల్లారుతుంది. సూర్యుని వెలుగులవల్ల చీకట్లు తొలగిపోతాయి. అలాగే కలియుగంలో పరమేశ్వరిని స్మరిస్తేనే చాలు పాపాలు నశిస్తాయి" అని చెప్పబడింది. బ్రహ్మాండపురాణంలో "తెలిసిగాని, తెలియకగాని చేసిన పాపాలు పరమేశ్వరిని స్మరించినంత మాత్రానే నశిస్తాయి" అని చెప్పారు. కాబట్టి కలియుగంలో పాపాలను నశింపచేసే శక్తి ఆ పరమేశ్వరికి తక్క అన్యులకు లేదు.

557. కాత్యాయనీ

కతుడనే మహర్షి కుమార్తె కాత్యాయని. కతులు అనబడే బ్రహ్మవేత్తల యందు నెలకొని ఉన్నది కావటంచేత కాత్యాయని అనబడుతుంది. నిరంతరము కన్యాత్వమునే కోరి పరాధీనత లేనటువంటి స్వాతంత్ర్యము గలది. కాత్యాయని. రాక్షససంహారం కోసం దేవతల తేజస్సుతో ఆవిర్భవించిన దేవత. కాలికాపురాణంలో

కాత్యాయనీ చోడ్యాణే కామాఖ్యా కామరూపకే
పూర్ణేశీ పూర్ణగిరౌ చండీ జాలంధరే స్మృతా

ఓడ్యాణ పీఠమందు కాత్యాయని, కామరూపమందు కామాఖ్య, పూర్ణగిరిలో పూర్ణేశ్వరి, జాలంధరపీఠంలో చండీ అని ప్రసిద్ధిచెందినది.

దేవీపురాణంలో

కం బ్రహ్మ కం శిరః ప్రోక్త మశ్మసారం చ కం మతం ।
ధారణాద్వాసనా ద్వాపి తేన కాత్యాయనీ మతా ॥

కం అనగా బ్రహ్మ, శిరస్సు, అస్మసారము అనబడును. దానిని ధరించుటచేత ఆమె కాత్యాయని అనబడుతున్నది. అంటే బ్రహ్మ శిరస్సు మొదలగు స్థానములందు వసించుటచేత ఆమె కాత్యాయని అనబడుతుంది. దేవీకవచంలో నవదుర్గలను చెబుతూ

ప్రథమం శైలపుత్రీతి ద్వితీయం బ్రహ్మచారిణీ ।
తృతీయం చంద్రఘంటేతి కూష్మాండేతి చతుర్థకం ॥
పంచమం స్కందమాతేతి షష్ఠం కాత్యాయనీ తథా ।
సప్తమం కాలరాత్రీతి మహాగౌరీతి చాష్టమం ॥
నవమంసిద్ధిధాత్రీ చ నవదుర్గాః ప్రకీర్తితాః ।

నవదుర్గలలో ఆరవదుర్గ కాత్యాయని

558. కాలహంత్రీ

కాలస్య మృత్యోః హంత్రీ

మృత్యువును చంపునది. వేదంలో ఎరుగువాడు కాలకాలుడు. గుణి సర్వవిద్య కాలకాలుడు అంటున్నది. అంటే బ్రహ్మకాలమునకు కాలుడు అని అర్థం.

కాలోహి దురతిక్రమో మృత్యుః తమపి హంతీతి తథోచ్యతే

కాలము అంటే మృత్యువు. అటువంటి మృత్యువుకు కూడా మృత్యువు ఆ పరమేశ్వరి అందుచేతనే కాలహంత్రీ అనబడుతోంది.

ప్రళయం సంభవించినప్పుడు అన్ని జీవరాశులతోపాటుగా దేవతలు కూడా నశిస్తారు. అప్పుడు మిగిలేది ఒక్క పరమేశ్వరియే అందుకే ఆమె కాలహంత్రీ అనబడుతోంది. సప్తశతిలో చెప్పినట్లుగా

కాలాకాష్ఠాదిరూపేణ పరిణామప్రదాయినీ

కాష్ఠ అంటే - పద్దెనిమిది రెప్పపాట్ల కాలము

కల అంటే - ముప్ఫైకాష్టల కాలము

ఈ రకంగా కాలంలో మార్పులు కలిగిస్తుంది.

క్షణాలు, విఘడియ, ఘడియ, జాము, పగలు, రాత్రి, తిథి, పక్షము, మాసము, ఋతువు, ఆయనము, సంవత్సరము ఈ రకంగా యుగాలు, కల్పాలు అంటూ కాలంలో వివిధరకాలయిన తేడాలను చూపుతుంది ఆ పరమేశ్వరి. కాలాన్ని మ్రింగేస్తుంది. అందుకే కాలహంత్రీ అనబడుతుంది.

559. కమలాక్షనిషేవితా

కమలాక్షుడు అంటే - విష్ణువు. అతనిచే ఎక్కువగా సేవించబడినది. పద్మపురాణంలో

ఇంద్రనీలమయీం దేవీం విష్ణు రర్చయతే సదా

విష్ణుత్వం ప్రాప్తవాం స్తేన

ఇంద్రనీలమయమైన పరమేశ్వరిని అర్చించి విష్ణువు విష్ణుత్వం పొందినాడు అని చెప్పబడింది.

జగత్పరిపాలకుడైన విష్ణువుచే సేవించబడినది కాబట్టి కమలాక్షనిషేవితా అనబడింది.

విష్ణుస్థానం కావాలి అంటే విమర్శరూపిణీ విద్యను ఉపాసించాలి. ఇదే ఆ దేవత ఉపాసనా ఫలం.

ఈ రకంగా విమర్శరూపిణి అనే కాత్యాయనీ విద్యను వివరించటం జరిగింది.

38. పరమేశ్వరి - స్థూలరూపము

గతంలో ఆరవనామం దగ్గర నుంచి 54వ నామం వరకు పరమేశ్వరి యొక్క స్వరూపాన్ని వర్ణించారు. మళ్ళీ ఇక్కడ ద్వైదీభావం కలిగిన భక్తులకోసం స్థూలరూపాన్ని వివరిస్తున్నారు. శ్రీచక్రపూజ ఎవరు చేస్తారు అనే విషయం చెబుతూ యోగి హృదయంలో

ఆజ్ఞాంతం సకలంప్రోక్తం తత స్సకల నిష్కలం

ఉన్మన్యంతం పరేస్థానం నిష్కళంచ త్రిధాస్థితం

శరీరంలో 19 చక్రాలున్నాయి. అవి

1.	అకులము నుంచి	-	అజ్ఞ వరకు	-	మొదటి జట్టు
2.	అజ్ఞ నుంచి	-	ఉన్మని వరకు	-	రెండవజట్టు
3.	బ్రహ్మరంధ్రం లేదా మహాబిందువు	-			మూడవజట్టు

మొదటిజట్టువారు సకలులు. కేవలము ఐహిక వాంఛలయందే ఆసక్తి గలవారు.

రెండవ జట్టువారు మధ్యములు. కొంతసేపు మోక్షము అంటారు. మరికొంతసేపు ఇహము అంటారు.

మూడవజట్టు వారు కేవలము మోక్షవాదులు.

ఇప్పుడు వీరిలో మధ్యమాధికారులకోసము పరమేశ్వరి స్థూలరూపం వర్ణించటం జరుగుతోంది. ఆ పరమేశ్వరి తాంబూల చర్వణంలో ఎర్రనైన నోటితో, దాడిమీ కుసుమము అంటే దానిమ్మపూల వంటి రంగుతో ప్రకాశిస్తుంటుంది. ఆమె చంచలనేత్ర మహాసౌందర్యవతి. లోకంలోని సౌందర్యమంతా మూర్తీభవించిన దేవతామూర్తి. ముల్లోకాలనూ సమ్మోహనం చేయగల మోహినీరూపం. సాక్షాత్తూ శంకరుణ్ణి మోహింపచేసింది.

అన్నింటికన్నా పురాతనమైనది. జన్మలేనటువంటిది. ఆదియైనది. అందరి జన్మలకు కారణం ఆమె. ఆత్మజ్ఞాని అయిన మృడుని పత్ని. కోటిసూర్యప్రభలతో విరాజిల్లుతుంటుంది. ఏ రకమైన కోరికలులేనిది. అందరి కోరికలు తానే తీరుస్తుంది. భక్తుల కోసమే నవనిధులను ఉపయోగిస్తుంది. జగత్తునంతటినీ నియంత్రిస్తుంది. అఖిలాండకోటి బ్రహ్మాండాలకు మహాసామ్రాజ్ఞి. ఇక నామాలను చూద్దాం.

560. తాంబూలపూరితముఖీ

తాంబూలేన పూరితం ముఖం యస్యాః – సా

తాంబూలముచే నిండిన ముఖము గలది. తాంబూలచర్వణమునందు ప్రీతిగలది.

శంకరభగవత్పాదులు తమ సౌందర్య లహరిలోని 65వ శ్లోకంలో పరమేశ్వరి తాంబూలాన్ని చెబుతూ

రణేజిత్వా దైత్యా నపహృత శిరస్త్రైః కవచిభిః
నివృత్తై శ్చండాంశ త్రిపురహర నిర్మాల్యవిముఖైః
విశాఖేంద్రో పేంద్రై శ్శశివిశద కర్పూరశకలాః
విలీయంతే మాత స్తవ వదన తాంబూల కబళాః ॥

తల్లీ ! యుద్ధంలో రాక్షసులను జయించి, శిరస్త్రాణాలను తీసివేసి, యుద్ధభూమి నుంచి తిరగివస్తూ, చండీశ్వరునిచేత అనుభవింపతగిన శివనిర్మాల్యము వద్దు అన్నటువంటి విష్ణువు, ఇంద్రుడు, కుమారస్వామి మొదలైనవారు నీ నోటి వెంటవచ్చిన తాంబూల కబళములు తీసుకుంటున్నారు.

శివుని యొక్క నిర్మాల్యంకన్న, పరమేశ్వరి తాంబూల కబళమే మిన్న అంటున్నారు. **కర్పూరవీటికామోదస్సమాకర్షద్దిగంతరా** అన్నప్పటి అర్థమే ఇక్కడ కూడా చెప్పబడుతుంది.

561. దాడిమీకుసుమప్రభా

దాడిమీ వృక్షము – అంటే దానిమ్మ చెట్టు. ఈ చెట్టు రెండు రకాలుగా ఉంటుంది. 1. పండు దానిమ్మ 2. పువ్వు దానిమ్మ

పండు దానిమ్మనే కాయదానిమ్మ అనికూడా అంటారు. ఈ చెట్టుకు పూలు పెద్దగా ఉండవు. కాయలే ఇక్కడ ప్రాముఖ్యత

పూవ్వుదానిమ్మ. ఈ చెట్టు అసలు కాయలు కాయదు. కేవలం పూలే పూస్తుంది. ఈ పూలు ఎరుపురంగులో ఉంటాయి. పరమేశ్వరి శరీరవర్ణం, దానిమ్మపూలరంగు రెండూ ఒకటిగానే ఉంటాయి. అందుకే ఆ దేవి దాడిమీ కుసుమప్రభలతో ప్రకాశిస్తుంది అని చెప్పబడింది.

562. మృగాక్షీ

మృగస్యేన అక్షిణీయస్యాః – సా

జింకవంటికనులు గలది. పరమేశ్వరి లేడివంటి కనులు గలది. లేడికళ్ళు పెద్దగా ఉంటాయి. స్థిరంగా ఉండవు. చంచలమైనవి. లేడి ఎప్పుడూ బెదురు చూపులు చూస్తూ ఉంటుంది. విశాలము, ఔదార్యము, చంచలము అనేవి లోకము యొక్క సృష్టి స్థితులను సూచిస్తాయి. గతంలో పరమేశ్వరి విశాలాక్షి అని చెప్పాము. అదే అర్థం ఇక్కడ కూడా.

563. మోహినీ

మోహయతీతి మోహినీ

మోహింపచేయునది కాబట్టి మోహిని అనబడుతుంది. లఘునారదీయంలో 'ఓ సుందరీ ! ఈ లోకమంతా నీ చేత మోహింపచేయబడుచున్నది. అందుకని నీ పేరు మోహిని అవుతున్నది. ఈ పేరు నీ గుణమువల్లనే పుట్టినది.

జగత్తులన్నింటినీ మోహింపచేయునది. మహామాయా స్వరూపము.

దేవదానవులకు పూర్వకాలం నుండి పోరు జరుగుతూనే ఉన్నది. ఇది ధర్మాధర్మాలకు, న్యాయాన్యాయాలకు మధ్యన జరిగే పోరు. ఈ పోరులో ముందుగా రాక్షసులే విజయం సాధిస్తారు. దేవతలు నానాకష్టాలు అనుభవించి చివరకు ఏదో ఒక ఉపాయంతో దానవులను ఓడిస్తారు. ధర్మానికీ, మంచికీ ఎప్పుడూ ముందు పరాజయమే కలుగుతుంది. కాని అంతిమ విజయం మాత్రం ధర్మానిదే. దేవదానవ సంగ్రామాలన్నీ ఈ విషయమే చెబుతాయి.

ప్రతిసారీ దేవతలంతా అసురులచేతిలో ఓడిపోవటం, మరణించటం కూడా జరుగుతోంది. ఆ సమయంలో దేవతలంతా విష్ణువు దగ్గరకు పోయి మరణం లేకుండా ఏదైనా ఉపాయం చెప్పమన్నారు. అమృతపానం చేసిన వారికి మరణముండదు. అమృతం పాలసముద్రంలో ఉన్నది. సాగరమధనంచేస్తే అమృతం పుడుతుంది అని చెప్పాడు విష్ణువు. రాక్షసుల సహాయంతో సాగరమధనం చేశారు. దేవతలు. ఐరావతము, ఉచ్చైశ్వరము, కల్పవృక్షము, కామధేనువు, కాలకూటము సముద్రం నుంచి పుట్టినాయి. చివరకు అమృతం పుట్టింది. అమృతం మాదంటే మాదని పోట్లాడుకున్నారు దేవదానవులు. ఇంతలో

విష్ణుమూర్తి మోహినీరూపంలో వచ్చాడు. ఆమె రూపానికి తన్మయులైపోయారు రాక్షసులు. అమృతం నేను పంచుతానన్నది మోహిని. సరే అన్నారు. రాక్షసులు. అసురులను సమ్మోహింపచేసి అమృతాన్ని దేవతలకిచ్చింది.

ఈ రకంగా సమ్మోహింపచేసినది మోహిని. బ్రహ్మాండపురాణంలో

ఆదౌ ప్రాదు రభూ చ్ఛక్తి ర్బ్రహ్మణో ధ్యానయోగతః
ప్రకృతి ర్నామ సా ఖ్యాతా దేవానా మిష్టసిద్ధిదా ।
ద్వితీయ మదభూ ద్రూపం ప్రవృత్తేఽమృతమంథనే
సర్వసమ్మోహజనక మవాఙ్మానస గోచరం
యద్దర్శనా దభూ దీశ స్సర్వజ్ఞోఽపి విమోహితః

బ్రహ్మ యొక్క తపః ఫలంగా పరమేశ్వరి మొదటగా దేవతల కోరికలు తీర్చటానికి ప్రకృతిగా అవతరించింది. ఆ సాగరమధనం చేసేటప్పుడు అందరినీ మోహింపచేస్తూ మోహిని అయింది. ఈ రూపాన్ని శివుడు మోహించాడు అని చెప్పబడింది. ఈ శివకేశవుల పుత్రుడే హరిహరసుతుడు అయ్యప్ప.

564. ముఖ్యా

అన్నింటికన్న ముఖ్యమైనది. ముందుగా పుట్టినది. వేదంలో 'నేను సత్యము కన్న ముందుగా పుట్టితిని" అని చెప్పబడింది. దేవతలందరికన్నా ముందుగా పుట్టినది పంచకృత్యాలను నిర్వహించే దేవి. అందుకే ఆమె ముఖ్యమైనది అనబడుతుంది.

565. మృడానీ

మృడము – అనగా సుఖము అని అర్థం. శివరహస్యము అనే గ్రంథంలో 'జనులకు సుఖాన్ని కలిగించే మృడునకు నమస్కారము' అని చెప్పబడింది.

ఎల్లవేళలయందు ఆత్మజ్ఞానంలో తేలియుండేవాడు మృడుడు. ఆనందస్వరూపుడు. పరమేశ్వరుడు సత్త్వగుణ ప్రధానుడైనప్పుడు మానవులకు సుఖశాంతులు ప్రసాదిస్తాడు. అందుచేత మృడుడు అనబడతాడు. ఆ మృడుని యొక్క శక్తి మృడానీ.

566 మిత్రరూపిణీ

మిత్రాణాం సూర్యాణామివ రూపం యస్యాః – సా

స్నేహితులరూపము గలది. సూర్యుల యొక్క రూపము గలది.

పరమేశ్వరి కోటిసూర్యప్రభలతో వెలుగొందుతున్నది. కాబట్టి సూర్యరూపము గలది. ఆమె **ఉద్యద్భాను సహస్రాభా** అని, **తరుణాదిత్యపాటలా** అని చెప్పబడింది. కాబట్టి మిత్రరూపిణి.

మిత్రుడు అంటే – సూర్యుడు, స్నేహితుడు అని అర్థం. **హిరణ్యవర్ణాం హరిణీం సువర్ణరజత స్రజాం** అనబడింది. కాబట్టి మిత్రరూపిణి. ఆకాశంలో దూరంగా కనిపించేవాడు సూర్యుడు. అతడు దేవతలను తృప్తిపరచేవాడు. కాబట్టి అతడు మధువువంటివాడు. ఆ సూర్యుడివల్లనే కాంతులు ప్రసరిస్తున్నాయి. ఎండలు కాస్తున్నాయి. వెలుగులు చిమ్మబడుతున్నాయి. మంచుకరిగినదులు ప్రవహిస్తున్నాయి. నీరు ఆవిరిగా మారి వర్షం కురుస్తోంది. పంటలు పండుతున్నాయి. జన జీవనం సాఫీగా సాగుతున్నది. ఒక్క మాటలో చెప్పాలంటే సూర్యుడు జీవనప్రదాత. అటువంటి సూర్యునిరూపము గలది.

సూర్యులు 12 మంది. వీరినే ద్వాదశాదిత్యులు అంటారు.

1. ఇంద్రుడు	5. పూష	9. విష్ణువు
2. ధాత	6. అర్యముడు	10. అంశుమంతుడు
3. పర్జన్యుడు	7. భగుడు	11. వరుణుడు
4. త్వష్ట	8. వివస్వంతుడు	12. మిత్రుడు

ఈ రకంగా ద్వాదశాదిత్యులరూపం గలది.

బృహదారణ్యకోపనిషత్తులో "పన్నెండునెలలతో కూడిన సంవత్సరమే ఆదిత్యుడు. ప్రాణుల యొక్క ఆయుర్దాయాన్ని 'అదదానా' అంటే గ్రహిస్తుంది. కాబట్టి ఇవి ఆదిత్యులనబడతాయి అని చెప్పబడింది. సూర్యుని కళలు పన్నెండు అవి.

1. తపిని	5. జ్వాలిని	9. విశ్వకల
2. తాపిని	6. రుచికల	10. బోధిని
3. ధూమ్ర	7. సుషుమ్న	11. ధారిణీ
4. మరీచి	8. భోగద	12. క్షమా

సూర్యుడు అంటే అతని కళలే. కాబట్టి సూర్యునిరూపంలో ఉంటుంది. అంటే అతని కళలరూపంలోనే ఉంటుంది.

పరమేశ్వరి తన బక్తజనులకు కోరికలు తీరుస్తుంది కాబట్టి, వాళ్ళ హితవును కోరుతుంది కాబట్టి ఆమె భక్తులకు స్నేహరూపము గలది.

567. నిత్యతృప్తా

నిత్యం సర్వకాలం తృప్తా

సర్వకాల సర్వావస్థలయందు తృప్తి గలిగినది.

నిత్యేన సర్వరూపానందేన వా తృప్తా

నిత్యమైన సర్వరూపానందమందు తృప్తినొందినది. ఏరకమైన వాంఛలు లేనటువంటిది. నిత్యము స్వరూపానందము అంటే ఆత్మజ్ఞానము లేక ఆత్మానందము గలది. కేవలము బ్రహ్మానందమే స్వరూపముగా గలది.

568. భక్తనిధిః

భక్తానాం నిధి రివ

భక్తులకు నిధి వంటిది. భక్తుల కోరికలు తీర్చేది. భక్తులకు ఆశ్రయస్థానమైనది. భక్తులు వారికి కావలసినవి ఎంత తీసుకున్నప్పటికీ తరగని నిధులు గలది.

దేవీభాగవతంలో

యస్యా స్తు పార్శ్వ భాగేతు నిధీతవ్యౌ శంఖపద్మకౌ
నవరత్నమహానద్యా స్తదా వై కాంచనస్రవా ॥

పరమేశ్వరికి రెండు ప్రక్కలా శంఖ పద్మ నిధులున్నాయి. అక్కడ బంగారము, రత్నాలు కలిసిన నదులు ప్రవహిస్తుంటాయి.

పరమేశ్వరి ప్రక్కన శంఖ పద్మ నిధులు ఉన్నాయి. అవి నవనిధులలోకీ శ్రేష్ఠమైనవి. వాటిలో నుంచి ఎంత సంపద తీసుకున్నా అవి తరిగిపోనివి. నవనిధులు

1. కాళ	4. మాణవక	7. శంఖ
2. మహాకాళ	5. వైసర్ప	8. పద్మ
3. పాండుక	6. సర్వరత్న	9. పింగళక

భక్తులకోరికలు తీర్చటానికే పరమేశ్వరి ఈ నిధులను తన దగ్గర ఉంచుకున్నది.

569. నియంత్రీ

జగ న్నియామకత్వా న్నియంత్రీ

లోకాలను నియమించునది. నియంత అంటే ఏకైకము. ఒకే ఆధారము. సకల దేవతలకు పరమేశ్వరి ముఖ్యురాలు అందుచేత నియంత్రీ అనబడుతుంది.

సమస్తదేవతలను, దిక్పాలకులను, గ్రహాలను, నక్షత్రాలను నియమించి లోకపాలన సజావుగా జరిగేటట్లు చూస్తుంది. మధుకైటభ సంహారం తరువాత త్రిమూర్తులతో 'బ్రహ్మ సృష్టి కార్యక్రమం చూస్తాడు. హరిహరులు ఇద్దరూ అతడికి సహాయకారిగా ఉంటారు. కాళి లక్ష్మి సరస్వతి అనే శక్తులు మీ ముగ్గురికీ సహాయంగా ఉంటాయి. మీరు వెళ్ళి, మీ స్థావరాలు ఏర్పరచుకుని, సృష్టి కార్యం చూడండి అని చెబుతుంది. అంటే త్రిమూర్తులను ఆ పనులకు నియమించిందన్నమాట.

జీవులందరికీ వారివారి కర్మఫలాన్ని బట్టి జన్మలిస్తుంది. ఆ జన్మలో కష్టసుఖాలు, సుఖదుఃఖాలు కర్మఫలితంగానే కలుగుతాయి. వీటన్నింటినీ కలుగుచేసేది. నియంత్రించేది నియంత్రీ అనబడుతుంది.

570. నిఖిలేశ్వరీ

నిఖిలస్య కృత్స్నప్రపంచస్య ఈశ్వరీ

సకల ప్రపంచాలకు ఈశ్వరి. చతుర్దశభువనాలకు ఈశ్వరి. అనేకకోటి బ్రహ్మాండాలకు ఈశ్వరి.

ఈశ్వర అనే శబ్దం నాయకత్వాన్ని సూచిస్తుంది. రాజరికాన్ని, ప్రభుత్వాన్ని సూచిస్తుంది. రాజు, చక్రవర్తి అనే అర్థంలో వాడబడుతుంది. అన్నిలోకాలు ఆ పరమేశ్వరి ఆధీనంలోనే ఉన్నాయి. ఆ దేవి నియంత్రణలోనే ఉన్నాయి.

నా౽ విష్ణుః పృథివీ పతిః

విష్ణ్వంశలేనివాడు రాజు కాలేడు. ఆ పరమేశ్వరి విష్ణ్వంశ గలది. విష్ణుశక్తి. అందుచేతనే నిఖిలేశ్వరి అనబడుతోంది.

ఈ రకంగా పరమేశ్వరి స్థూలరూపం వర్ణించబడింది.

39. ప్రజ్ఞానఘనరూపిణీ

పరమేశ్వరి జ్ఞానస్వరూపిణి. సమస్త విషయాలు తెలిసినటువంటిది. ఏ విషయాన్ని తెలుసుకోవటంచేత చరాచర జగత్తులోని అన్ని విషయాలు తెలుస్తాయో, ఆ విషయం పూర్తిగా తెలిసినటువంటిది. అవిద్య అజ్ఞానము అనేవి లేశ మాత్రం కూడా లేనటువంటిది. నేను నాది అనే అహంకార మమకారాలు లేనటువంటిది. అజ్ఞానులు ఈ శరీరమే ఆత్మ అనుకుంటారు. జగత్తులో కంటికి కనిపించేదంతా సత్యము అని నమ్ముతారు. సిరి సంపదలు, భోగ భాగ్యాలు, భార్యా పిల్లలు ఇవన్నీ శాశ్వతము అని నమ్ముతారు. వీటివల్ల వచ్చే ఇహలోక ఆనందమే పరమానందము. దానిని మించినది లేదు అనుకుంటారు.

అర్థాగృహే నివర్తంతే స్మశానే మిత్రబాంధవాః ।
సుకృతం దుష్కృతం చైవ గచ్ఛంత మను గచ్ఛతి ॥

ఈ లోకంలో సంపాదించిన ధనధాన్యాలు ఇంటివద్దనే ఉంటాయి. మిత్రులు, బంధువులు మహా అయితే స్మశానం దాకా వస్తారు. ఆ తరువాత ఎవ్వరూ మనతో రారు. మరణానంతరము కూడా జీవితోపాటుగా వెళ్ళేది కేవలము అతను చేసిన పాపపుణ్యాలు మాత్రమే. అదే కర్మఫలం. ఆ కర్మఫలాన్ని అనుభవించి, కర్మశేషం అనుభవించటానికిగాను మళ్ళీ ఈ లోకంలో పుడతాడు జీవి. ఈ రకంగా సంసారంలో పడి గానుగకు కట్టిన ఎద్దులాగా తిరుగుతుంటాడు. అంతేకాని బంధనాల నుంచి విముక్తుడుకాడు.

ఈ రకంగా విముక్తి రావాలి అంటే జ్ఞానం కావాలి. 'బ్రహ్మ సత్యం జగన్మిధ్య' అనే విషయం తెలియాలి.

ఈ జగత్తంతా పరమేశ్వర స్వరూపమని, ఆ పరబ్రహ్మ ఒక్కడే సత్యము నిత్యము అయినవాడు. మిగిలినవన్నీ మిధ్యా స్వరూపాలే. కంటికి కనిపించే సిరి సంపదలు, భోగ భాగ్యాలు శాశ్వతంకావు. భార్యా పిల్లలు అంతకన్నా శాశ్వతం కాదు.

ఋణానుబంధరూపేణ పశుపత్ని సుతాలయాః

పూర్వజన్మలలోని ఋణానుబంధమే ఈ జన్మలో భార్యా పిల్లలు, పశువులు అన్నీ కూడా. ఋణం తీరగానే వారంతా మనల్ని వదిలి వెళ్ళిపోతారు. కాబట్టి ఈ బంధాలు ఏవీ శాశ్వతంకావు. వీటివల్ల వచ్చే ఆనందం కూడా శాశ్వతం కాదు. శాశ్వతమైనది బ్రహ్మానందం ఒక్కటే.

ఈ విషయాన్ని తెలుసుకోవటమే జ్ఞానసముపార్జన. పరమేశ్వరి జ్ఞానస్వరూపిణి. చిదగ్ని కుండ సంభూత. అందుకే ప్రజ్ఞానఘనరూపిణి.

ఆ దేవిని చతుర్విధవాసనలతోను పొందవచ్చు. అంటే జగత్తే పరబ్రహ్మ స్వరూపం అని భావన చేయటం ద్వారా ఆమెను పొందవచ్చు. ఆమెకు ఆద్యంతాలు లేవు. మహాప్రళయం జరిగినప్పుడు కూడా ఆమె ఉంటుంది. ఆమె పరాశక్తి. జ్ఞానముచేత మాత్రమే పొందదగినది. మధుపానం చేసినప్పుడు కూడా బాహ్యేంద్రియజ్ఞానం మరిచిపోయి, కేవలం ఆత్మానందాన్ని మాత్రమే పొందేది. ఆమె మాతృకావర్ణరూపిణి. అక్షరాలే రూపంగా గలది. ఆమె మహాకైలాసము. అంటే సహస్రారంలో ఉంటుంది. శ్రీచక్రంలోని బిందువు నందుంటుంది. ఆమె మహనీయురాలు. దయామూర్తి. మహాసామ్రాజ్యము అంటే ఆత్మసామ్రాజ్యానికి అధిపతి. ఈ విషయాలను 571 నుంచి 583 వరకు నామాలలో వివరించటం జరిగింది.

571. మైత్ర్యాదివాసనాలభ్యా

మైత్రి మొదలగు చతుర్విధ వాసనలతో పొంద దగినది. అవి

1. మైత్రి 2. కరుణ 3. ముదిత 4. ఉపేక్ష

1. స్నేహితులయందు చూపేది మైత్రి
2. దుఃఖితులయందు చూపేది కరుణ
3. పుణ్యాత్ములందు చూపేది ముదిత
4. పాపాత్ములందు చూపేది ఉపేక్ష

ఈ నాలుగు రకాల వాసనలచేత పొందదగినది. భాగవతంలో వీటిని వివరించటం జరిగింది. మైత్రి మొదలగు వాటిచేత పరిశుద్ధమైనటువంటి చిత్తము గలవారు క్లేశాలను తొలగించి యోగమార్గంలో పయనించేవారు సమాధిస్థితిని పొందుతారు. అంటే అలాంటి పరమయోగులకు ఆత్మసాక్షాత్కారమవుతుంది.

ఈ నాలుగు వాసనలను నిత్యజీవితంలో ఆచరించే వారికి పరమేశ్వర సాక్షాత్కారమవుతుంది. అంటే సాధకుడు సుఖము, దుఃఖము, పుణ్యము, పాపముల విషయమై జాగ్రత్త పడాలి.

సహృదయులైన వారితో బేధభావం లేకుండా చాలా సఖ్యంగా ఉండాలి అదే మైత్రి. దుఃఖించేవారు, బాధపడేవారు వీరందరియందు జాలి కలిగి ఉండటమే కరుణ. పుణ్య పురుషులతో సాంగత్యం చెయ్యటమే ముదిత. పాపాత్ములందు నికృష్టమైన యేహ్యాభావన లేకుండా ఉండటమే ఉపేక్ష. ఈ చతుర్విధ వాసనలు గలవారికి ఆ దేవి లభిస్తుంది. అందుకే భాగవతంలో

నీ పాద కమల సేవయు
నీ పాదార్చకుల తోడి నెయ్యమును
నితాంతాపార భూతదయయును
తాపసమందార ! నాకు దయచేయగదే ॥

572. మహాప్రళయసాక్షిణీ

మహాప్రళయం సంభవించినప్పుడు జగత్తులోని జీవరాశి అంతా లయమైపోతుంది. లోకంలోని జీవరాశితో పాటుగా మిగిలినవారు కూడా లయం అయిపోతారు. అంటే గతంలో చెప్పినట్లుగా దేవ, గంధర్వ, యక్ష, కిన్నెర, కింపురుష, సిద్ధ, సాధ్య గణాలన్నీ నాశనమయిపోతాయి. వీరందరికీ దైవత్వము, గంధర్వత్వము అనేవి గతజన్మలో చేసినటువంటి పుణ్యఫలంవల్ల వచ్చినవే. కల్పాంతందాకా బ్రహ్మ తన పదవిలో ఉంటాడు. కల్పాంతాన ఆ పరబ్రహ్మలో లీనమైపోతాడు. ఇప్పటిదాకా తొమ్మిదిమంది బ్రహ్మలు ఉన్నారు. వారే నవబ్రహ్మలు. వారు

1.	భృగువు	4.	అంగిరసుడు	7.	దక్షుడు
2.	పులస్త్యుడు	5.	అత్రి	8.	వసిష్ఠుడు
3.	పులహుడు	6.	క్రతువు	9.	మరీచి

అలాగే ఇంద్రపదవి కూడా. నూరు అశ్వమేధాలు చేసినవాడు ఇంద్రుడవుతాడు.

ఉత్తమ మనువు కాలంలో	–	సుశాంతుడనేవాడు ఇంద్రుడు
రైవతమన్వంతరంలో	–	విభుడనేవాడు ఇంద్రుడు
చాక్షుషమన్వతరంలో	–	మనోజవుడు ఇంద్రుడు

ఇతనికే బ్రహ్మహత్యాపాతకం చుట్టుకుంది. ఆ సమయంలో నూరు అశ్వమేధాలు చేసిన నహుషుణ్ణి ఇంద్రుడి స్థానంలో కూర్చుండబెట్టారు.

కాత్యాయనీ విద్యను ఉపాసన చేస్తే విష్ణుత్వం సిద్ధిస్తుంది. కఠోపనిషత్తులో యమధర్మరాజు నచికేతుడితో" అగ్నిచయనం చేసినవారు శాశ్వతంగా స్వర్గలోకం పొందుతారు. అంతేకాని వారికి మోక్షం రాదు. ఈ విషయం తెలిసి కూడా నేను అగ్నిచయనం చేసి ఈ పదవిలో ఉన్నాను." అంటాడు. ఈ రకంగా పైన చెప్పిన పదవులన్నీ జీవులు చేసిన పుణ్యకర్మలవల్ల వచ్చినవే. కాబట్టి వారి కర్మఫలం క్షయంకాగానే ప్రళయం సంభవిస్తుంది. ఆ మహాప్రళయానికి ఏకైక సాక్షి ఆ పరమేశ్వరియే అప్పుడు ఉండేది చిత్కలారూపమైన ఆమె తప్ప ఇంకెవరూ కాదు. అందుకే పంచదశిస్తవంలో

కల్పోపసంహరణకల్పితతాండవస్య
దేవస్య ఖండపరశోః పరభైరవస్య ।
పాశాంకుశైక్షవశరాసనపుష్పబాణా
సా సాక్షిణీ విజయతే తవ మూర్తి రేకా ॥

కల్పాంతంలో చేయబడిన శివతాండవానికి పాశము అంకుశము, ధనుర్బాణాలు ధరించిన పరమేశ్వరియే సాక్షి.

573. పరాశక్తిః

శరీరం తొమ్మిది ధాతువులతో ఏర్పడింది. పదవధాతువు సాక్షాత్తూ పరమేశ్వరి.

త్వగసృగ్ – మాంస మేధో స్థిధాతవశక్తి మూలకాః
మజ్జా శుక్ల ప్రాణ జీవ ధాతవ శ్శివమూలకాః
నవధాతు రయం దేహో నవయోని సముద్భవః
దశమీ యోని రే కైవ పరాశక్తి స్తదీశ్వరీ ॥

చర్మము, రక్తము, మాంసము, మెదడు, ఎముకలు అనే ఐదూ శక్తి ధాతువులు. కాగా మజ్జ, శుక్లము, ప్రాణము, జీవము అనేవి శివధాతువులు. ఈ తొమ్మిది ధాతువులతోను ఈ దేహం ఏర్పడింది. పదవ ధాతువు సాక్షాత్తూ ఆ పరమేశ్వరి అయి ఉన్నది. ఆమెయే పరాశక్తి. ఉత్కృష్టమైన శక్తియే పరాశక్తి. లింగపురాణంలో

యస్య యస్య పదార్థస్య యా యా శక్తి రుదాహృతా
సా సా విశ్వేశ్వరీ దేవీ సర్వా మహేశ్వరీ
శక్తిమంతః పదార్థా యే తే వై సర్వవిభూతయః
పదార్థే శక్తయో యా యా స్తాం తాం గౌరీం విదు ర్బుధాః ॥

జగత్తులో ఏ ఏ పదార్థానికి ఏ ఏ శక్తి చెప్పబడిందో, ఆ శక్తి పరమేశ్వరియే. ఆ పదార్థాలు మహేశ్వరుడు. శక్తిగల పదార్థాలన్నీ నీ విభూతులే. పదార్థాలలో ఉండే శక్తి అంతా గౌరియే. అని పండితులకు తెలుసును. పండితులు అంటే జ్ఞానులని అర్థం.

574. పరానిష్ఠా

ఉత్కృష్టమైన అంతము గలది. అన్ని కర్మలు, అన్ని జగత్తులు కూడా ఈ పరమేశ్వరి యందే లయం చెందుతాయి. ఇదే విషయాన్ని భగవానుడు గీతలో చెబుతూ

సర్వం కర్మాఖిలం పార్థ జ్ఞానే పరిసమాప్యతే

అర్జునా ! అన్ని కర్మలూ జ్ఞానమందు అంతమవుతాయి. సూతగీతలో శాస్త్రాధ్యయనం చెయ్యాలి. గురూపదేశం పొందాలి. విషయాన్ని తెలుసుకోవాలి. ఆత్మకన్న భిన్నమైనది ఏదీ లేదు. జగత్తులోని అన్ని వస్తువులలోనూ ప్రకాశించేది ఆత్మ ఒక్కటే అనే విషయం తెలుసుకుని ఆత్మ సాక్షాత్కారము పొందాలి. కాబట్టి ఆత్మసాక్షాత్కారమంటే తేలిక అయినది కాదు. ఉత్కృష్టమైనది. అదే పరానిష్ఠ అనబడుతుంది.

సకల ఇంద్రియాలు	–	మనస్సులో లయం అవుతాయి.
మనసు	–	బుద్ధిలో లయమవుతుంది
బుద్ధి	–	ఆత్మలో లయమవుతుంది

ఈ రకంగా చేసి ఉన్మనాస్థితిలో స్వరూప జ్ఞానం పొందటమే పరానిష్ఠ అనబడుతుంది.

575. ప్రజ్ఞానఘనరూపిణీ

నిత్యము జ్ఞానమయమైనది. అవిద్యా లేక అజ్ఞానముచేత ఏ మాత్రమూ తాకబడనిది. కొంచెముకూడా అవిద్యా సంబంధము లేనటువంటిది. మహోన్నతమైన నిత్యజ్ఞాన స్వరూపము గలది. పరానిష్ఠా అనే నామంలోని స్వరూపస్థితియే ప్రజ్ఞాన ఘనరూపము. అంటే పరమేశ్వరి జ్ఞానముకన్న వేరైన స్థితి లేనటువంటిది. ఉప్పుగడ్డ పైన క్రింద, లోపల, ప్రక్కల వివిధ రుచులతో ఉండదు. ఎక్కడైనా అది ఒకే రుచిలో ఉప్పగానే ఉంటుంది. అలాగే ఈ ఆత్మ లోపల, బయట అంతటా జ్ఞానమయమైనది. అందుచేతనే ఆమె ప్రజ్ఞాన ఘనరూపిణి అనబడుతున్నది.

576. మాధ్వీపానాలసా

మాధ్వీ అంటే – మధువు. ద్రాక్ష రసము. ద్రాక్ష రసము కన్న వేరైనటువంటి మధు పానము చేసినప్పటికీ నిశ్చలమైన మనసు గలది. మధు పానం చేసినప్పుడు మనోచాంచల్యం కలుగుతుంది. కాని పరమేశ్వరి విషయంలో అలా జరగదు. నిరంతరము బ్రహ్మానందానుభవము పొందుతూ విశ్రాంతిగా నిర్వికారస్థితిలో ఉండేటటువంటిది. అదే ప్రజ్ఞాన ఘనరూపము. ఆ స్థితిలో బాహ్యేంద్రియాలు పని చెయ్యవు. ద్వైతభావన ఉండదు. అంతా బ్రహ్మమయమే.

సాధకుడు యోగస్థితిలో కుండలిని జాగృతం చేసి, గ్రంథిత్రయాన్ని ఛేదించి, కుండలినిని సహస్రారం చేర్చినప్పుడు అక్కడినుండి సుధాదారలు వర్షిస్తాయి. వాటితో యోగి శరీరంలోని 72వేల నాడీమండలము తడుస్తుంది. ఆ స్థితిలో సాధకుడు అవ్యాజమైన, అనిర్వచనీయమైన ఆనందాన్ని పొందుతాడు. అతని శరీరం కంపిస్తుంది. ఆనందంలో తేలియాడుతాడు. ఆ స్థితిలో సాధకుడు నృత్యం చేస్తాడు. ఆ ఆనందము వర్ణనాతీతము అనుభవైక వేద్యము. అదే బ్రహ్మానందము.

ఈ రకంగా బాహ్యేంద్రియ జ్ఞానము, ద్వైత భావము నశించి బ్రహ్మానందంతో నిండినది కాబట్టే మాధ్వీపానాలసా అనబడుతోంది.

577. మత్తా

మధుపానముచే మదించినది. బ్రహ్మానందాన్ని పొందటము అనే మధుపానముచే మదించినది. మధుపానం చేస్తే బాహ్యేంద్రయ జ్ఞానం నశిస్తుంది. కాని బ్రహ్మానందం వలన నిర్వికార నిర్గుణస్థితి ఏర్పడుతుంది. ఆస్థితియే మత్తా అనబడుతుంది. తురీయ స్థితిలో ఉండేది.

578. మాతృకావర్ణరూపిణీ

మాతృకలు అంటే అకారాది క్ష కారాంతము ఉండే అక్షరాలు. క్షరము కానిది నాశనము లేనిది అక్షరము. ఆ అక్షరముల రూపం కలది. మాతృకల యొక్క వర్ణము అంటే రంగును తెలియచేసేది అని అర్థం.

ప్రతి అక్షరానికి ఒక దేవత ఉన్నది. ఆ దేవతయొక్క చేతులయందు ఆయుధాలు, ఆ దేవత పరిధి, రంగు వివరించబడ్డాయి.

మాతృకా వశినీ యుక్తాం యోగినీభి సమన్వితాం
గంధద్వారాదిసహితాం సంస్మరేత్ త్రిపురాంబికాం ॥

వశిన్యాది శక్తులతోను, యోగినీ గణములతోను, గంధాకర్షిణి మొదలైన ఆకర్షణ దేవతలతోను కూడిన మాతృకా రూపమయిన త్రిపురాంబికను పూజిస్తున్నాను.

సనత్కుమార సంహితలో అక్షర దేవతల గూర్చి చెప్పబడింది. అందులో అక్షరాలను ఐదు భాగాలుగా చేశారు.

1. స్వరాత్మిక శక్తులు : ఇవి అకారాది శక్తులు వీటికి ఎనిమిది చేతులుంటాయి. ఆ చేతులలో పాశము, అంకుశము, అభయ, వరదముద్రలు, పుస్తకము, అక్షమాల, కమండలము, వ్యాఖ్యా ముద్రలను కలిగి ఉంటాయి.

2. వ్యంజన శక్తులు : వీటికి నాలుగు చేతులుంటాయి. వాటిలో పాశము, అంకుశము, అక్షమాల, కమండలము ఉంటాయి.

3. య ర ల వ శక్తుల చేతులలో పాశము, అంకుశము, అభయ, వరద ముద్రలు ఉంటాయి.

4. శ ష స హ శక్తుల చేతులలో పాశము, అంకుశము, అభయ, వరదముద్రలుంటాయి.

5. ళ, క్ష శక్తులకు కూడా నాలుగు చేతులే ఉంటాయి. ఆ చేతులలో పాశము, అంకుశము, చెరకుగడ, పుష్పబాణము ఉంటాయి. ఇక

అకారాది శక్తులు	- ధూమ్రవర్ణాలు
క నుంచి ఠ వరకు శక్తులు	- సింధూర వర్ణాలు
డ నుంచి ఫ వరకు శక్తులు	- గౌరవర్ణాలు
బ నుంచి ల వరకు శక్తులు	- అరుణ వర్ణాలు
వ నుంచి స వరకు శక్తులు	- కనక వర్ణాలు
హకార క్ష కారముల శక్తులు	- విద్యుత్ వర్ణాలు

ఈ శక్తులకు పరిధులు కూడా చెప్పబడ్డాయి.

అ కార శక్తిమండల విస్తీర్ణము	- 80 లక్షల యోజనాలు
ఆ కార శక్తిమండల విస్తీర్ణము	- 160 లక్షల యోజనాలు

ఇ కార శక్తిమండల విస్తీర్ణము	- 90 లక్షల యోజనాలు
ఈ కార శక్తి మండల విస్తీర్ణము	- 180 లక్షల యోజనాలు
ఉ కార శక్తిమండల విస్తీర్ణము	- కోటియోజనాలు
ఊ కార శక్తిమండల విస్తీర్ణము	- రెండు కోట్ల యోజనాలు
ఋ కార శక్తిమండల విస్తీర్ణము	- 50 లక్షల యోజనాలు
ౠ కార శక్తిమండల విస్తీర్ణము	- కోటి యోజనాలు
ఌ ౡ కారశక్తి మండల విస్తీర్ణము	- అనంతము
ఏ ఐ శక్తిమండల విస్తీర్ణము	- 150 లక్షల యోజనాలు
ఓ ఔ శక్తిమండల విస్తీర్ణము	- 150 లక్షల యోజనాలు
అంతఃశక్తిమండల విస్తీర్ణము	- 320 లక్షల యోజనాలు
వ్యంజన శక్తులమండల విస్తీర్ణము	- 40 లక్షల యోజనాలు

యోగి అయినవాడు నిష్ఠగా ఈ బీజాలను ధ్యానం చేసినట్లైతే, వాటి శక్తులు ఇంత మేర విస్తరిస్తాయన్న మాట.

వశిన్యాదిశక్తులు, అక్షరాలు తమ తమ ఆయుధాలతో ఉన్నట్లుగా భావన చెయ్యటం వల్లనే శ్రీచక్రానికి మూడు ప్రస్తారాలు వచ్చినాయి.

ఈ రకంగా అక్షర స్వరూపం గలది కాబట్టే పరమేశ్వరి మాతృకా వర్ణరూపిణి అనబడుతోంది.

యజ్ఞవైభవ ఖండంలో

యథా పరతర శ్శంభుః ద్విధాశక్తిః శివాత్మనా
తథైవ మాతృకా దేవీ ద్విధా భూతా సతీ స్వయమ్
ఏకా కారేణ శక్తి స్తు వాచికా చేతరేణ తు
శివస్య వాచికా సాక్షా ద్విద్యేయం పదగామినీ ॥

పరమేశ్వరుడు శివుడు, శక్తి అని రెండుగా ఉన్నట్లుగానే మాతృకాదేవి కూడా అచ్చులు హల్లులు అని రెండు విధాలుగా ఉన్నది. దానిలో అచ్చులు శక్తి రూపము హల్లులు శివరూపము.

శ్రీవిద్యార్ణవ తంత్రంలో శ్రీచక్ర ప్రస్తారాలను వివరిస్తూ

ప్రస్తారో త్రివిధఃప్రోక్తః శ్రీచక్రస్య తథౌశ్వరీ
మేరు కైలాస భూ సంజ్ఞా బేదాస్య త్రిధాభవేత్
మేరు ప్రస్తారకం యంత్రం నిత్యా తాదాత్మకం స్మృతం
మాతృకాయ స్తు కైలాస ప్రస్తారాఖ్యాం సురేశ్వరీ
భూప్రస్తారం మహాదేవీ వశిన్యాత్మక ముత్తమమ్ ॥

శ్రీచక్రము యొక్క ప్రస్తారాలు మూడు రకాలు

1. భూప్రస్తారము 2. మేరు ప్రస్తారము 3. కైలాస ప్రస్తారము

1. భూప్రస్తారంలో వశిన్యాది దేవతల తాదాత్మ్యము
2. మేరు ప్రస్తారంలో షోడశ నిత్యల తాదాత్మ్యము
3. కైలాస ప్రస్తారంలో మాతృకా తాదాత్మ్యము చెప్పబడ్డాయి.

ఈ రకంగా కైలాస ప్రస్తారంలో మాతృకలచే తాదాత్మ్యము చెందుతున్నది కాబట్టి మాతృకావర్ణరూపిణీ అనబడుతోంది.

జ్ఞానార్ణవ తంత్రంలో చెప్పినట్లుగా

అకారః ప్రథమో దేవీ క్షకారోంత్యః తతః పరం
అక్షమాలేతి విఖ్యాతా మాతృకా వర్ణరూపిణీ

అకారము నుండి క్షకారము వరకు ఉండే అక్షర సముదాయ స్వరూపిణి కాబట్టి మాతృకావర్ణ రూపిణీ అనబడుతోంది.

579. మహాకైలాస నిలయా

కైలాస పర్వతం కన్న వేరైనది మహాకైలాసము. అక్కడ నివసించేది పరమేశ్వరి. అది పరమశివునికి నివాస స్థానము త్రిపురాసారంలో

ఏతత్ కైలాససంజ్ఞం పదం అకులపదం
బిందురూపీ స్వరూపీ యత్రా స్తే దేవదేవః

కైలాసము అనేది అకులస్థానము బిందురూపము. అక్కడ దేవదేవుడుంటాడు అని చెప్పబడింది. అంటే సహస్రారమే కైలాస స్థానము. అక్కడ ఆ పరమేశ్వరి ఉంటుంది.

శ్రీచక్రమే కైలాసము. అందులో బిందువు మహాకైలాసము. ఆ బిందువునందుండునది పరమేశ్వరి. కాబట్టి ఆమె మహాకైలాస నిలయా అనబడుతోంది.

580. మృణాలమృదుదోర్లతా

తామరతూడులోని దారంలాగా మృదువైన హస్తములు గలది. పరమేశ్వరి సుషుమ్న రూపిణి. **బిసతంతు తనీయసీ** అని గతంలో చెప్పబడింది. అంత సన్నగా మృదువుగా ఉంటుంది కాబట్టే మృణాల మృదుదోర్లతా అనబడుతుంది.

581. మహనీయా

పూజ్యాత్వాన్ - మహనీయా

పూజించతగినది కాబట్టి మహనీయా అనబడుతున్నది. ఆ పరమేశ్వరి ఇంద్రాది దేవతలచే ఆరాధించబడుతుంది. కాబట్టి మహనీయా అనబడుతుంది.

582. దయామూర్తిః

దయయే రూపముగా గలది. పరమేశ్వరి జగత్తులో ఉండే జీవరాసికంతటికీ మాత. అందుచేత ఆమెయొక్క దయకు ప్రేమకు హద్దులు ఉండవు. కేవలము దయయే మూర్తిగా గలది కాబట్టి దయామూర్తి. దయ అంటే - ఆనందము అని అర్థం చెప్పబడింది. ఆ దేవి ఆనందస్వరూపిణి. బ్రహ్మానందమే స్వరూపముగా గలది. అందుకే దయాస్వరూపిణి.

శ్రీచక్రంలోని తొమ్మిదవ ఆవరణ సర్వానందమయచక్రము. అది పరబ్రహ్మస్థానము. అక్కడ ఉంటుంది. కాబట్టే పరమేశ్వరి దయామూర్తి. శరీరంలో అనాహత పద్మమనబడే హృదయస్థానంలో ఉంటుంది. ఆ హృదయంలోనే దయ, ఆనందము, కరుణ అనేవన్నీ ఉంటాయి. అక్కడ ఉంటుంది. కాబట్టే పరమేశ్వరి దయామూర్తి.

583. మహాసామ్రాజ్యశాలినీ

మహాకైలాసాధిపత్యం - మహాసామ్రాజ్యం. త చ్ఛాలినీ

మహాసామ్రాజ్యమంటే మహాకైలాసాధిపత్యమే. అటువంటిదానితో ప్రకాశించునది.

సామ్రాజ్యాలన్నింటిలోకీ అధికమైనది, ఉన్నతమైనది మహా సామ్రాజ్యము. అటువంటి మహా సామ్రాజ్యానికి పాలకురాలు. చతుర్దశ భువనాలను పాలించేటటువంటిది. అనేక కోటి బ్రహ్మాండాలకు నాయకురాలు. మహా సామ్రాజ్యము అంటే ఆత్మ సామ్రాజ్యము. ఈ ఆత్మ సామ్రాజ్యానికి ప్రభ్వి. పెద్దవాటన్నింటిలోకి అతిపెద్దది ఆత్మ. అటువంటి ఆత్మ సామ్రాజ్యానికి ప్రభ్వి. కాబట్టి మహా సామ్రాజ్యశాలినీ అనబడుతోంది. ఈ రకంగా పరమేశ్వరి ప్రజ్ఞాన ఘనరూపిణీ అని వర్ణించబడింది.

40. ఆత్మవిద్య

ముడిపదార్థం గురించి మనకు తెలిసినట్లైతే ఆ పదార్థంతో తయారయిన వస్తువుల గురించి తేలికగా తెలుస్తుంది. ఉదాహరణకు మట్టిని గురించి తెలిస్తే, మట్టితో తయారుచేసే కుండలు, బానలు, చట్లు, మొదలైన వస్తువులగురించి తెలుస్తుంది. అలాగే బంగారం గురించి తెలిస్తే దానితో తయారుచేసే నగల పేర్లు వేరయినా, వాటన్నింటిలోఉండేది బంగారమే అని తెలుస్తుంది. అదే విధంగా ఏ విషయం తెలుసుకోవటంవల్ల సర్వమూ తెలుస్తాయో, దాన్ని తెలుసుకోవాలి. ప్రతివిషయంలోనూ అంతర్గతంగా ఉండే తత్త్వాన్ని గనక తెలుసుకుంటే మిగిలిన విషయాలన్నీ తెలుస్తాయి.

నదులు తూర్పునుంచి పడమరకు ప్రవహించినా, పడమర నుంచి తూర్పుకు ప్రవహించినా, చివరకు అవి సముద్రంలోనే కలుస్తాయి. సూర్యరశ్మికి నీరు ఆవిరిగామారి మేఘాలరూపం ధరిస్తుంది. ఆ మేఘాలు మళ్ళీ వర్షించి నదులుగా ప్రవహిస్తాయి. ఆ నదులు మళ్ళీ సముద్రంలో కలుస్తాయి. సముద్రంలో కలిసేవరకు వాటికి గంగ, గోదావరి, కృష్ణ అని వివిధరకాల పేర్లుంటాయి. కాని సముద్రంలో కలిసిన తరువాత ఆ నదీజలాన్ని విడదియ్యలేము. అలాగే జీవించి ఉన్నంతవరకు మనిషి, పులి, సింహము, ఆవు, మేక ఇత్యాదినామాలుంటాయి. కాని మరణించిన తరువాత జీవి తన ఉనికిని కోల్పోతాడు. అన్ని జీవాత్మలూ ఆ పరమేశ్వరునిలోని భాగాలే.

సృష్టి ఆరంభంకాకముందు, కృతయుగారంభంలో పరమేశ్వరుడు నిరాకారుడు నిర్గుణస్వరూపుడు అయి ఇతరులతో సంబంధం లేకుండా, తనకు సమానమైన వారుగాని, తనకన్న అధికులుగాని లేకుండా ఏకాకిగా ఉండేవాడు. ఈ రకంగా ఉన్న పరబ్రహ్మ బిందు స్వరూపుడు. ఆ ఏకత్వం అనేకం కావాలని సంకల్పించింది. రకరకాల వస్తువులుగా, చిత్ర విచిత్ర సమ్మేళనాలతో రూపుదాల్చింది. ఘన ద్రవ, వాయు పదార్థాలుగా మార్పు చెంది భిన్న రూపాలతో ఈ సృష్టి ఆకారం పొందింది. జీవరాశి ఉత్పన్నమయింది. సృష్టిలో భాగంగానే హకార సంజ్ఞ గలిగిన పరమేశ్వరుడు సకార సంజ్ఞ గలిగిన ప్రకృతితో కలిసి శబళబ్రహ్మమై బ్రహ్మరంధ్రం ద్వారా మానవ శరీరంలో ప్రవేశించి, ఇంద్రియాల ద్వారా ప్రాపంచిక సుఖాలననుభవిస్తూ పంజరంలోని పక్షిలాగా, ఈ దేహంలో బంధించబడి, బయటకు పోయే మార్గం తెలియక, కొట్టుమిట్టాడుతున్నాడు. జీవాత్మ అనబడే ఈ హంసకు

అగ్ని చంద్రమండలాలే	–	రెక్కలు
ఓంకారము	–	శిరస్సు
జ్ఞాననేత్రము	–	ముఖము
హకారసకారాలే	–	పాదాలు

ఈ రకంగా పరమాత్మ అన్ని ప్రాణులలోనూ, పాలలో ఉన్న నెయ్యిలాగా ఆవరించి ఉన్నాడు. అన్ని జీవాత్మలూ ఆ పరమాత్మలోని భాగాలే. మర్రిచెట్టు చాలా పెద్ద వృక్షం. కాని దానికి కారణమైన విత్తనంలో చూస్తే ఏమీ కనిపించదు. అంటే విత్తనంలో అంత పెద్ద వృక్షానికి కారణమైనది, మనకంటికి కనిపించనంత సూక్ష్మంగా దాగి ఉన్నది. అదేవిధంగా ఆత్మ బయటకు కనిపించకుండా సూక్ష్మరూపంలో సర్వత్రా వ్యాపించి ఉన్నది. ఆత్మకు నాశం లేదు. ముసలితనం లేదు. ఆత్మకు పాపం అంటదు. శోకం తాకదు. ఆకలి దప్పికలు ఉండవు. స్వప్నప్రపంచంలో ప్రభువులాగా విహరించే చైతన్యమే ఆత్మ సుషుప్తిలో ఆనందాన్ని అనుభవించేదే ఆత్మ.

ప్రకాశబిందువు పరబ్రహ్మస్వరూపమైన చంద్రమండలం. అకారబీజం. విమర్శ బిందువు శక్తి బీజం. అగ్నిమండలం హకార బీజం. ఈ రెండింటి సామరస్యమే అహం. ఇదే పరబ్రహ్మ స్వరూపం. పరమేశ్వరుని ప్రతిబింబమే శక్తి. అదే మాయ. అందుచేతనే శక్తి లేకుండా శివుడుగాని, శివుడు లేకుండా శక్తిగాని ఉండవు. ఇక్కడ శివశక్తులు అంటే త్రిమూర్తి ద్వంద్వంలోని వారు కాదు. పరమేశ్వరీ పరమేశ్వరులు. వీరిద్దరి కలయిక లేనిదే స్వరూప జ్ఞానం కలగదు. అహమనేది ఆత్మరూపం. ఇదే ఆత్మమంత్రం. ఆత్మమంత్రము, హంస మంత్రము రెండూ సమాన ధర్మాలు కలిగి ఉన్నాయి.

శరీరం అశాశ్వతమైనది. శాశ్వతమైన ఆత్మకు అశాశ్వతమైన శరీరం ఆవాసంగా ఉంటుంది. శరీరం ఉన్నంతకాలము ఆత్మకు గుణదోషాలు, సుఖ దుఃఖాలు అంటినట్లు, వాటితో శతమతమవుతున్నట్లూ అనిపిస్తుంది. ఆత్మ శరీరంతో సంబంధం ఏర్పరచుకోవటం వల్ల జీవులకు సుఖ దుఃఖాలతో సంబంధం ఏర్పడుతుంది. మానవుడు మాసిన వస్త్రాన్ని వదిలి నూతనవస్త్రాన్ని ధరించినట్లే ఆత్మజీర్ణమైన ఈ దేహాన్ని వదిలి ఇంకొక దేహాన్ని ఆశ్రయిస్తున్నది. ఆత్మ శరీరం నుంచి విడిపోతే భౌతిక బంధనాల నుండి విముక్తి కలుగుతుంది.

శ్రీవిద్య అనేది ఆత్మవిద్య. అదే బ్రహ్మవిద్య. అందులో షోడశి మహా మంత్రము మోక్ష కారకము. ఆ మంత్రాధిదేవత సాక్షాత్తూ పరబ్రహ్మ స్వరూపము.

ఆత్మవిద్యయే శ్రీవిద్య. అదే మహాషోడశి అని చెప్పి 584 నుంచి 590వ నామం వరకు ఆత్మవిద్యను వివరిస్తున్నారు.

584. ఆత్మవిద్యా

ఆత్మజ్ఞానరూపత్వాత్ ఆత్మవిద్యా

ఆత్మ జ్ఞాన రూపము గలది కావటంచేత ఇది ఆత్మవిద్య అనబడుతుంది.

అసలు ఆత్మ అంటే ఏమిటి? ఐతరేయోపనిషత్తులో పరమేశ్వరుడు పూర్వకల్పంలో ఏ విధంగా అయితే సృష్టి ఉన్నదో, అదే విధంగా మళ్ళీ సృష్టి చెయ్యాలి అని సంకల్పించాడు. లోకాలను సృష్టించాడు. లోక పాలకులను సృష్టించాడు. ఇంద్రియాలకు అధిష్ఠాన దేవతలను సృష్టించాడు. చివరకు విరాడ్రూపాన్ని పోలిన మానవుణ్ణి సృష్టించాడు. ఇప్పుడు పరమేశ్వరుడు మానవదేహంలో ప్రవేశించాలి అనుకున్నాడు. అలా ప్రవేశించటానికి రెండు మార్గాలున్నాయి. 1. పై నుంచి (శిరస్సు నుంచి) 2. క్రింద నుంచి (పాదాల దగ్గర నుంచి) పాదాల దగ్గర నుంచి ప్రవేశించటమనేది సేవకా లక్షణం. అందుచేత పరమాత్మ శిరస్సునుంచే మానవదేహంలో ప్రవేశించాడు. అదే ఆత్మ. అని చెప్పబడింది.

హకార సంజ్ఞగల పరమేశ్వరుడు సకార సంజ్ఞ కలిగిన ప్రకృతితో కలిసి శబళ బ్రహ్మమై నవరంధ్రాలతోనూ, దశేంద్రియాలతోనూ కూడినటువంటి మానవదేహంలో ప్రవేశించి, బయటకు వెళ్ళే మార్గం తెలియక పంజరంలో బంధించబడిన పక్షిలాగా కొట్టుమిట్టాడుతున్నాడు. ఇదే జీవాత్మ. ఈ జీవాత్మ గనక వచ్చిన దారిగుండానే బయటకు వెళ్ళగలిగినట్లైతే పరమాత్మలో లీనమవుతుంది. అంటే ఆత్మను బ్రహ్మరంధ్రంగుండా గనక బయటకు పంపగలిగినట్లైతే అది పరమాత్మలో లీనమవుతుంది.

తైత్తిరీయోపనిషత్తులో వరుణమహర్షి కుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తిచేసి ఆత్మవిద్యను బోధించమని తండ్రిని అడుగుతాడు. ఈ విషయమంతా గతంలో పంచకోశాంతర స్థితా అనే నామంలో వివరించటం జరిగింది.

బృహదారణ్యకోపనిషత్తులో ప్రజాపతి ఒకసారి ఆత్మను గురించి ఒక ప్రకటన చేశాడు. "ఆత్మకు పాపం అంటదు. ముసలితనం రాదు. మృత్యువు దాన్ని కబళించదు. శోకం తాకదు. ఆత్మకు ఆకలిదప్పికలు లేవు. మానవుడు సత్యకాముడు సత్యసంకల్పుడు అయి ఆత్మజిజ్ఞాసను అలవరచుకోవాలి. ఆత్మకోసం అన్వేషించినవాడు, ఆత్మను అనుభవించిన వాడు ఆత్మ స్వరూపాన్ని పొందుతాడు.

ఈ మాట విని దేవతల రాజైన ఇంద్రుడు, రాక్షసరాజైన విరోచనుడు బ్రహ్మదగ్గరకు వచ్చి ఆత్మవిద్యను పొందేటందుకుగాను, ఆయనకు శిష్యరికం చేస్తారు. విరోచనుడు దేహమే ఆత్మ అనుకుని వెళ్ళిపోతాడు. కాని ఇంద్రుడు మళ్ళీ, మళ్ళీ బ్రహ్మచర్యమవ లంబిస్తాడు. చివరకు ఇంద్రునిపట్టుదలకు మెచ్చి బ్రహ్మ ఆత్మతత్త్వాన్ని పూర్తిగా వివరించాడు.

శరీరం అశాశ్వతమైనది. ఆఖరు క్షణాలురాగానే మృత్యువు శరీరాన్ని కబళిస్తుంది. శాశ్వతమైన ఆత్మకు అశాశ్వతమైన శరీరమే ఆవాసం. శరీరంలో ఉన్నంతకాలమూ ఆత్మకు సుఖదుఃఖాలు, గుణదోషాలు అంటినట్లు, వాటితో శతమతమవుతున్నట్లు కనిపిస్తుంది. ఆత్మ శరీరంతో సంబంధం ఏర్పరచుకోవటంవల్లనే జీవులకు సుఖదుఃఖాలు ఏర్పడతాయి. శరీరం నుంచి విడిపోగానే ఆత్మకు ఈ బంధనాలతో సంబంధముండదు.

భౌతిక విషయాలనుండి విముక్తి పొంది, ఆత్మను మనస్సుకు, ఇంద్రియాలకు విలక్షణమైనదిగా గ్రహించి ఆత్మ తేజోమయము అని భావించి అనుభవజ్ఞుడు ఆనందిస్తాడు. ఆత్మజ్ఞానం పొందినవాడు ముక్తి సామ్రాజ్యంలో విహరిస్తాడు. అని చెప్పబడింది.

కఠోపనిషత్తులో వాజశ్రవుడు 'విశ్వజిత్' అనే యాగం చేస్తూ, దానిలో భాగంగా తనకుమారుడైన నచికేతుణ్ణి యమధర్మరాజుకు దానమిస్తాడు. నచికేతుడు యముడి దగ్గరకు వెళ్ళేసరికి అతడు ఇంట్లో లేడు. అందుచేత మూడు రోజులపాటు యముడు తిరిగి వచ్చేదాకా అతని ఇంటనే నిరాహారియై ఎదురుచూస్తూ కూర్చున్నాడు. యముడు తిరిగి వచ్చి, విషయం తెలుసుకుని, నచికేతుడికి మూడు వరాలిస్తాను కోరుకోమంటాడు. అందులో మూడవ వరంగా ఆత్మజ్ఞానం ఉపదేశించమని అడుగుతాడు నచికేతుడు. చివరకు యముడు నచికేతుడికి ఆత్మజ్ఞానాన్ని వివరిస్తాడు.

"ఆత్మజ్ఞానం అనే పదం వినటానికి కూడా చాలామందికి అర్హత ఉండదు. అందుకే వాళ్ళు దానికి ఇష్టపడరు. కొందరికి ఇది విన్నా అర్థం కాదు. దీన్నిగురించి చెప్పే గురువు దొరకటం కూడా చాలా విశేషం. బ్రహ్మజ్ఞానం పొందిన గురువుద్వారా ఈ విషయాన్ని తెలుసుకోవటం పూర్వజన్మ సుకృతం. అంటూ ప్రారంభించి...

ఆత్మసాక్షాత్కారమనేది వేదాలు వల్లించటం వల్ల, శాస్త్రాలు చదవటంవల్ల, ధారణశక్తివల్ల, ఉపన్యాసాలు వినటంవల్ల, ఉపదేశించటంవల్ల లభించదు. అది ఆత్మవల్ల మాత్రమే సాధ్యపడుతుంది. అర్హుడైన వ్యక్తికి ఆత్మ తన నిజస్వరూపం చూపుతుంది.

ఆత్మ అనేది సూక్ష్మమైన బుద్ధిచేత మాత్రమే గ్రహించబడుతుంది. ఆత్మసర్వవస్తువులందు ఉన్నది కాని పైకి కనపడదు.

శబ్దము, రూపము, రసము, వాసన లేనిది, ఆద్యంతాలు లేనిది, అయినటువంటి ఆత్మతత్త్వాన్ని తెలుసుకున్నవాడు మృత్యువాత పడడు. అని చెబుతాడు.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుని కుమారుడు శ్వేతకేతువు. విద్యాభ్యాసం పూర్తి చేశాడు. ఆత్మవిద్యను తెలుసుకోవాలనీ, దాన్ని వివరించమని తండ్రిని అడిగాడు. చెప్పటం మొదలుపెట్టాడు ఉద్దాలకుడు.

నదులు తూర్పునుంచి పడమరకు ప్రవహించినా, పడమర నుంచి తూర్పుకు ప్రవహించినా చివరకు అవి సముద్రంలోనే కలుస్తాయి. సూర్యరశ్మికి నీరు ఆవిరి అయి మేఘాలుగా మారి కొండలమీద వర్షం కురిసి, వాగులుగా, ఏరులుగా, నదులుగా ప్రవహించి చివరకు సముద్రంలో కలుస్తుంది. నీరు ప్రవహించేటప్పుడు ఇది గంగానది, ఇది డొంకవాగనీ, ఇది బుడమేరు అని రకరకాల పేర్లతో పిలువబడుతుంది. కాని సముద్రంలో చేరగానే నదులకు, వాగులకు అన్నింటికీ వాటికి ప్రత్యేకమైన గుర్తింపు ఇంక ఉండదు. అలానే జీవి అనేది ఏ రూపంలో ఉన్నప్పటికీ, చైతన్య సముద్రంలో కలిసిపోయాక తన రూపాన్ని పోగొట్టుకుంటుంది. ఈ రకంగా జీవులన్నీ ఏ తత్త్వంలో కలిసిపోతాయో, అదే ఆత్మ తత్త్వం. అది అద్వితీయమైనది, సూక్ష్మమైనది, సర్వవ్యాపకమైనది. అదే నీవు తత్త్వమసి శ్వేతకేతూ అదే నీవు.

అదే విధంగా ఉపకోశలుడికి అగ్నులు ఆత్మ తత్త్వాన్ని వివరిస్తాయి. భూమి, చంద్రుడు, సూర్యుడు అన్నీ ఆ పరబ్రహ్మ యొక్క రూపాలే. ఆకాశంలోని సూర్యునిలో ఏ తత్త్వమైతే ఉన్నదో అదే నాలోనూ, నీలోనూ కూడా ఉన్నది. తూర్పు పడమర ఉత్తరదక్షిణాలు, నేల, నీరు, నింగి, ఆకాశము, నక్షత్రాలు వీటన్నింటిలో ఉన్నతత్త్వం ఒక్కటే. ఆకాశంలోని మెరుపులో ఏ తత్త్వమైతే ఉన్నదో, అదే నాలోనూ ఉన్నది. అదే చరాచర జగత్తంతా వ్యాపించి ఉన్నది. అదే ఆత్మతత్త్వం. అదే బ్రహ్మతత్త్వం.

సనత్కుమారుడు నారదుడికి ఉపదేశించిన భూమా విద్య అంతా ఆత్మవిద్యే.

ఈ రకంగా ఆత్మ విద్యను గురించి ఉపనిషత్తులన్నింటిలోనూ వివరించబడింది. పరబ్రహ్మను గురించిన జ్ఞానమే ఆత్మజ్ఞానము. ఆత్మవిద్యయే బ్రహ్మవిద్య, ఆత్మవిద్య కలది కాబట్టి పరమేశ్వరి ఆత్మవిద్యా అనబడుతోంది.

585. మహావిద్యా

ఆత్మవిద్యే మహావిద్య. అదే బ్రహ్మ విద్య. సర్వ అనర్థాలను తొలగిస్తుంది కాబట్టి అది మహతత్త్వము గలిగినది. పరమేశ్వరి బ్రహ్మవిద్యా స్వరూపిణి కాబట్టి మహావిద్యా అని చెప్పబడుతోంది.

దేవీ భాగవతంలో మణిద్వీపంలోని ప్రాకారాలను వివరిస్తూ అక్కడ ఆమ్నాయ దేవతలు, భువనేశ్వరి అవతారమూర్తులు మహావిద్యలు సప్తకోటి మంత్రాలు ఉంటాయి.

కాళీ తారా మహావిద్యా షోడశీ భువనేశ్వరీ
భైరవీ భిన్నమస్తా చ విద్యా ధూమవతీ తథా
బగళా సిద్ధ విద్యా చ మాతంగీ కమలాత్మికా
ఏతా దశ మహావిద్యా సిద్ధ విద్యాః ప్రకీర్తితాః ॥

ఈ పది మహావిద్య సిద్ధవిద్యలుగా ప్రసిద్ధి చెందినాయి. వనదుర్గా పంచశతీ విద్యకు మహావిద్య అని పేరుంది. ఉపనిషత్తులలో చెప్పిన ఆత్మవిద్య అంతా మహావిద్యయే.

586. శ్రీవిద్యా

శ్రీ అంటే పరమేశ్వరి. స్త్రీ దేవతల గురించి చెప్పే యంత్ర తంత్ర మంత్ర విషయాలను 'విద్య' అని అంటారు. కాబట్టి శ్రీవిద్య అంటే ఆ పరమేశ్వరి యొక్క యంత్ర మంత్ర తంత్ర విభాగము. ఉపాసనాకాండ. విష్ణుపురాణంలో "ఓ దేవీ! యజ్ఞ విద్య, మహావిద్య, గుహ్యవిద్య, ఆత్మవిద్య, మోక్షవిద్య అన్నీ నువ్వే. కర్మకాండ, ఉపాసన, మంత్రవిద్య, బ్రహ్మవిద్య అన్నీ నువ్వే." అని చెప్పబడింది.

పంచదశీ స్వరూపంగల విద్య. అదే శ్రీవిద్య. పంచదశీ మహామంత్రాన్ని గురించి గతంలో వివరించటం జరిగింది. పంచదశి మహామంత్రం అంటే విశ్వరూపమే. అదే వైశ్యానరాత్మ. పరమేశ్వర స్వరూపము. అసలు ఆ మంత్రం పంచభూతాలనుండి ఏర్పడింది. ఈ మంత్రంలో హ క ర స ల అనే అక్షరాలున్నాయి. ఇవి పంచభూతాల బీజాలు.

హకారద్వయ సంభూతం కకారస్తు ప్రభంజనః
రేఫాదగ్నిః సకార శ్చ జలతత్త్వసముద్భవః
లకారాత్పృథివీబీజం తస్మా ద్విశ్వమయీ చసా ।

హకారము	–	ఆకాశము
కకారము	–	వాయుబీజం
రకారము	–	అగ్నిబీజము
సకారము	–	జలబీజము
లకారము	–	పృధ్వీబీజము

ఈ రకంగా శ్రీవిద్య పంచభూతమయమైనది. తైత్తిరీయోపనిషత్తులో

ఆకాశాద్వాయుః
వాయోరగ్నిః
అగ్నేరాపః
ఆపః పృథ్వీ

అని చెప్పబడింది. అంటే

ఆకాశము నుండి	–	వాయువు
వాయువు నుండి	–	అగ్ని
అగ్ని నుండి	–	జలము
జలము నుండి	–	భూమి ఉద్భవించాయి

ఈ కారణం చేత

1. ఆకాశమందు – ఆకాశతత్త్వము ఒకటే ఉన్నది
2. వాయువు నందు – ఆకాశ, వాయుతత్త్వాలున్నాయి
3. అగ్నియందు – ఆకాశ, వాయు, అగ్నితత్త్వాలు
4. జలమునందు – ఆకాశ, వాయు, అగ్ని, జలతత్త్వాలున్నాయి
5. భూమియందు – ఆకాశ, వాయు, అగ్ని, జల, భూతత్త్వాలున్నాయి.

ఈ రకంగా చూసినట్లైతే

ఆకాశము	–	5 భాగాలు
వాయువు	–	4 భాగాలు
అగ్ని	–	3 భాగాలు
జలము	–	2 భాగాలు
భూమి	–	1 భాగము
వెరసి	–	15 భాగాలు

ఈ రకంగా పంచభూతాలు మొత్తం 15 భాగాలుగా అయినాయి. ఈ 15 భాగాలవల్లనే 15 అక్షరాలు గల పంచదశీ మహామంత్రం ఏర్పడింది.

ఇప్పుడు మంత్రంలో

ఆకాశం	5 భాగాలు	బీజం హకారం	5 హకారాలు
వాయువు	4 భాగాలు	బీజం కకారం	4 కకారాలు
అగ్ని	3 భాగాలు	బీజం రకారం	3 రకారాలు
జలం	2 భాగాలు	బీజం రకారం	2 రకారాలు
పృధ్వి	1 భాగం	బీజం లకారం	1 లకారం

అయితే వాయుబీజం కకారం. ఇవి 4 ఉన్నాయి. కాని మంత్రంలో కకారాలు మూడు మాత్రమే ఉన్నాయి. అందుచేత కకారానికి బదులుగా ఈ కారం వాయుతత్త్వాత్మకంగా తీసుకోవాలి. అప్పుడు మంత్రంలో ఉన్న ఈకారము ఒకటి, మూడు హ్రీంకారాలలోనూ మూడు వెరసి నాలుగు ఈకారాలుంటాయి. ఇక మంత్రంలో లకారాలు మూడున్నప్పటికీ వాటిని ఒకటిగానే పరిగణించాలి. ఎందుకంటే అవి భూలోక భువర్లోక సువర్లోకాలకు ప్రతీక.

మంత్రంలో ఉన్న మూడు కకారాలచేత సాధకులు మూడు రకాలుగా విభజించబడుతున్నారు.

కకారత్రయవాచ్య స్తు సకలాః ప్రళయాః కళాః
విజ్ఞానకేవలశ్చేతి త్రిఃప్రకారా ఉపాసకాః

1. సకలులు – వీరు భగవంతుడు వేరు భక్తుడు వేరు అని నమ్ముతారు. వీరు కేవలము ఐహికవాదులు. భోగభాగ్యాల కోసం ప్రాకులాడతారు.

2. ప్రళయాకలులు – వీరు మిశ్రమ దృష్టి గలవారు. కర్మలను ఆచరిస్తుంటారు. వీరికి జ్ఞానదృష్టి కూడా ఉంటుంది.

3. నిష్కలులు – వీరు కేవలము జ్ఞాన స్వరూపులు. మోక్షవాదులు. నిర్గుణ బ్రహ్మను మాత్రమే ఆరాధిస్తారు.

ఈ రకంగా పంచభూతాల స్వరూపమే పంచదశీ మహామంత్రం.

పంచదశీ మహామంత్రంలో మొత్తం 37 బీజాలున్నాయి.

ఏవం సప్తత్రింశ త్సంఖ్యాక పదైర్మ హావిద్యా

షట్త్రింశ త్తత్త్వానాం తత్త్వాతీతస్య చాభిదాత్రయమ్ ॥

బీజాలు		తత్త్వాలు	
హకారములు	5	పంచభూతాలు	5
ఈకారములు	4	తన్మాత్రలు	5
రేఫలు	3	ఇంద్రియాలు	10
పకారాలు	2	మనస్సు, బుద్ధి, అహంకారము	3
లకారాలు	3	ప్రకృతి, పురుషుడు	
కకారాలు	3	కలా, విద్యా, రాగము,	
		కాలము, నియతి	5
ఆకారాలు	10	మాయ, శుద్ధ విద్య, మహేశ్వరుడు	
		సదాశివుడు	4
బిందువులు	3	శక్తి, శివుడు	2
నాదములు	3		
ఏకారము	1		
మొత్తం	37		36

తత్త్వాతీతము పరమేశ్వరుడు
అదే ఏకారము

పంచదశీ మహామంత్రానికి అర్థాన్ని చూసినప్పటికీ, అది పరమేశ్వర రూపమే. మంత్రం మూడు కూటములుగా ఉన్నది. అందులో

ప్రథమ కూటమి – ఇది సృష్టికూటమి

క – బ్రహ్మస్వరూపం
ఏ – భారతీ స్వరూపం
ఈ – విష్ణు స్వరూపం
ల – పృథివీ రూపం

హ – రుద్ర రూపం
రేఫ – రుద్రాణి
ఈం – ఇది శాంత, అంబికల సమిష్టి రూపం

ద్వితీయ కూటమి– స్థితి కూటమి

ఈ కూటమిలో మధ్యన ఉన్న హకారము వదలివేయాలి. అప్పుడు **హ స క ల హ్రీం** అవుతుంది.

హకారము – బ్రహ్మారూపము
సకారము – భారతి రూపము
కకారము – విష్ణువు రూపము
లకారము – పృథివి రూపము
హకారము – రుద్రరూపము
రకారము – రుద్రాణిరూపము
ఈంకారము – శాంతా అంబికల సమిష్టి రూపము
మూడవ కూటమి – సంహార కూటమి

రెండవ కూటమిలో వదలివేసిన హకారాన్ని మూడవ కూటమి మొదటన చేర్చాలి. అప్పుడు ఈ కూటమి కూడా రెండవ కూటమిలాగానే **హ స క ల హ్రీం** అవుతుంది. దాని అర్థంకూడా పైన చెప్పినట్లే ఉంటుంది.

ఈ రకంగా పంచదశీ మహామంత్రం పరమేశ్వరి రూపమేకాని వేరుకాదు. అందుచేతనే ఆ దేవి శ్రీవిద్యా అనబడుతోంది.

శ్రీవిద్యలో ప్రధానంగా పూజించబడే శ్రీచక్రము పంచదశీ మహామంత్రం నుంచే వచ్చింది. మంత్రంలో మొత్తం తొమ్మిది బీజాలున్నాయి. అవి

ల, స, హ, ఈ, ఏ, ర, క, అర్ధచంద్రము, బిందువు. ఈ తొమ్మిది బీజాలనుంచే తొమ్మిది ఆవరణలు వచ్చాయి.

1. లకారము పృథివీ బీజం. దీనివల్ల భూపురం పుట్టింది
2. సకారము చంద్రబీజం. దీనివల్ల షోడశదళం పుట్టింది.
3. హకారము శివబీజం. దీనివల్ల అష్టదళము పుట్టింది

4. ఈకారము మాయాబీజం. దీనివల్ల చతుర్దశారము పుట్టింది
5. ఏకారము శక్తి బీజం. దీనివల్ల బహిర్దశారం పుట్టింది
6. రకారము అగ్నిబీజం. దీనివల్ల అంతర్దశారం పుట్టింది
7. కకారము మన్మథబీజం. దీనివల్ల అష్టదళం పుట్టింది
8. అర్ధచంద్రము త్రిగుణాత్మకము. దీనివల్ల త్రికోణం పుట్టింది
9. బిందువు పరబ్రహ్మాత్మకము. దీనివల్ల బిందువు పుట్టింది

ఈ రకంగా మంత్ర, యంత్ర, తంత్రాలన్నీ పరమేశ్వరి స్వరూపమే. కాబట్టి ఆమె శ్రీవిద్యా అనబడుతోంది.

587. కామసేవితా

కామ అంటే మహాకామేశ్వరుడు. అతనిచే సేవించబడినది.

కాముడు – మన్మథుడు. మనువు, చంద్రుడు, కుబేరుడు మొదలగు శ్రీవిద్యోపాసకులు పన్నెండుమందిలోనూ ఒకడు. అతనిచే సేవించబడినది. లక్ష్మీదేవి కుమారుడైన అనంగుడు (మన్మథుడు) అయికూడా శ్రీవిద్యను పొందగలిగాడు. వ్రేళ్ళు లేనివాడైనప్పటికీ పరమేశ్వరికి మ్రొక్కాడు. మెడ లేనివాడయి కూడా శ్రీవిద్యామణిని ధరించాడు. నాలుక లేనివాడయినప్పటికీ దాని రుచి తెలుసుకున్నాడు. అతడే ఆ మంత్రానికి ఋషి అని అరుణోపనిషత్తులో చెప్పబడింది.

మన్మథుడు అంగములు లేనివాడయినప్పటికీ శ్రీవిద్యను పొందగలిగాడు. అర్చనాదివిధులు జ్ఞానికి అనవసరము. శివశక్తులు ఇద్దరూ ఒక్కటే. అనే విషయం తెలుసుకున్నవాడే ముక్తి పొందుతాడు.

మన్మథుడు పరమేశ్వరిని ధ్యానించి, చెరకువిల్లు పూలబాణాలు ఆయుధాలుగా పొందగలిగాడు. వాటితో లోకాలన్నీ జయిస్తున్నాడు. శంకర భగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 6వ శ్లోకంలో ఈ విషయాన్ని వివరిస్తూ

ధనుః పౌష్పం మౌర్వీ మధుకరమయీ పంచ విశిఖాః
వసంత స్సామంతో మలయమరు దాయోధన రథః
తథా ప్యేకః సర్వం హిమగిరిసుతే ! కామపి కృపాం
అపాంగా త్తే లబ్ధ్వా జగ దిద మనంగో విజయతే ॥

తల్లీ ! ఆ మనిషిని చూడబోతే అనంగుడు. అతనికి అసలు శరీరమే లేదు. ఇక ధనుస్సును చూద్దామా – పూవులతో తయారయినది. పట్టుకుంటే నలిగిపోతుంది. అల్లెత్రాడును చూద్దామా – తుమ్మెదల వరుస అవి సరిగా ఉండవు. బాణాలు చూద్దామా – పూలబాణాలు. అవీ తన్మాత్రలు. సామంతుడు (చెలికాడు) చూద్దామా – వసంతుడు. అది కాలం. పలకలేదు. మాట్లాడలేదు. సలహా చెప్పలేదు. ఇక రథం చూద్దామా – మలయ మారుతం. దక్షిణ కొండగాలి. అది ఎప్పుడు ఉంటుందో, ఉండదో తెలియదు.

అతడికి నుంచోటానికి కాళ్ళు లేవు. ధనుస్సు పట్టుకోవటానికి చేతులు లేవు. సలహా చెప్పే సచివుడు లేడు. రథం లేదు గుర్రాలు లేవు. ఇన్ని అవలక్షణాలు ఉండి కూడా కేవలము నీ కృపాకటాక్ష వీక్షణాలవల్లనే అతడు లోకంలో ప్రసిద్ధులైన తపోధనులతో యుద్ధంచేసి గెలవగలుగుతున్నాడు.

సృష్టి ప్రారంభానికి ముందు మహాకామేశ్వరునితో సేవించబడినది. కాబట్టి కామసేవితా అనబడుతోంది.

588. శ్రీషోడశాక్షరీవిద్యా

శ్రీవిద్యలో ప్రధానమైన మంత్రము షోడశాక్షరి. ఇది పదహారు అక్షరాలు గల మంత్రము. దీనినే శుద్ధవిద్య అనికూడా అంటారు. అయితే శుద్ధవిద్య అనే మంత్రం ఇంకొకటి ఉన్నది. దానికి సదాశివుడు ఋషి గాయత్రి ఛందస్సు. దీనిలో మూడు బీజాక్షరాలు మాత్రమే ఉంటాయి. దీని మంత్రము ఐం ఈం ఔం. దీన్ని గతంలో వివరించాం.

షోడశి మంత్రము పదహారు అక్షరాల మంత్రము.

కామరాజ మంత్రాంతే శ్రీబీజేన సమన్వితా
షోడశాక్షరీ విద్యేయం శ్రీవిద్యేతి ప్రకీర్తితా ॥

మన్మథుడు ఉపాసించిన మంత్రానికి చివర శ్రీం బీజాన్ని కలిపితే, అది షోడశి అవుతుంది.

క ఏ ఈ ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం । శ్రీం ॥

లొల్లా లక్ష్మీధరులు, భాస్కరాచార్యులవారు కూడా దీన్ని సమర్థించారు. కాని పంచదశీ మహామంత్రానికి ఈం బీజం చేర్చినట్లైతే షోడశాక్షరి అవుతుంది. అని కొందరి వాదన. వీరి ప్రకారం మంత్రం.

క ఏ ఈ ల హ్రీం । హ స క హల హ్రీం । సకల హ్రీం । ఈం ॥

అయితే ఇది కేవలము పదహారు అక్షరాల మంత్రం. అంతేకాని బ్రహ్మవిద్య కాదు. బ్రహ్మవిద్య అంటే మోక్షవిద్య. జీవాత్మను పరమాత్మలో కలిపేందుకు సాధనమైన విద్య. బ్రహ్మవిద్య అయిన షోడశిని 'మహాషోడశి' అంటారు. దీనిలో ఇరవై ఎనిమిది అక్షరాలుంటాయి.

అష్టౌ బీజాక్షరా ణ్యాదౌ పశ్చా త్పంచదశీ తతః ।
పంచబీజాక్షరా ప్యేషా శ్రీ మహాషోడశీ మతా ॥

పంచదశీ మహామంత్రానికి ముందు ఎనిమిది బీజాక్షరాలు, తరువాత ఐదు బీజాక్షరాలు ఉన్నట్లైతే, దాన్ని మహాషోడశి అంటారు. ఇది బ్రహ్మవిద్య. ఐతే ముందు ఉండవలసిన బీజాక్షరాలు ఏవి ? తరువాత ఉండవలసినవి ఏవి ?

శ్రీబీజమాయా స్మరయోనిశక్తిః సర్వం చ మాయా కమలాత్మవిద్యా ।
శక్త్యాదిబీజాని విలోమితాని శ్రీషోడశార్ణాః పరదేవతాయాః ॥

దీని ప్రకారం మహాషోడశికి పదహారు అక్షరాలే ఉంటాయి. ప్రణవము అంటే ఓంకారము. అయితే **శ్రీం హ్రీం క్లీం ఐం సౌః** అనేవి శక్తి ప్రణవాలు. అవే పంచ ప్రణవాలు. ఈ పంచ ప్రణవాలు, **ఓం హ్రీం శ్రీం** మొత్తం ఎనిమిది బీజాలు పంచదశి మహామంత్రానికి ముందు, తరువాత మళ్ళీ పంచప్రణవాలు. అక్షరాలను లెక్క పెట్టేటప్పుడు పంచదశి మంత్రంలోని మూడు కూటాలను మూడు అక్షరాలుగా లెక్కపెట్టాలి. ఇప్పుడు 8+3+5 = 16 అక్షరాలుంటాయి. ఇదే మహాషోడశి. విడివిడిగా చూస్తే ఇందులో 28 అక్షరాలుంటాయి. ఇప్పుడు మహాషోడశి మంత్రము.

శ్రీం హ్రీం క్లీం ఐం సౌః ఓం హ్రీం శ్రీం క ఏ ఈ ల హ్రీం ।
హ స క హ ల హ్రీం । స క ల హ్రీం । సౌః ఐం క్లీం హ్రీం శ్రీం ॥

ఈ మంత్రంలో మొత్తం 16 అక్షరాలుంటాయి. ప్రతి అక్షరంలోనూ శివశక్తులు ఉంటాయి. అలా గనక చూసినట్లైతే 16 × 2 = 32 భాగాలవుతాయి. అదే పదహారు జతలు. అవి నోటిలోని దంతాలు.

ఈరకంగా షోడశి మంత్రరూపిణి కాబట్టి పరమేశ్వరి శ్రీ షోడశాక్షరీ విద్యా అనబడుతోంది.

589. త్రికూటా

త్రిపుటియే స్వరూపంగా గలది. మూడు కూటములుగా గలది.

శిరస్సు	–	వాగ్భవకూటమి
కంఠము నుండి కటి వరకు	–	కామరాజకూటమి
కటి నుండి క్రింది భాగము	–	శక్తి కూటమి

ఈ మూడింటినీ త్రికూటములు అంటారు. ఇదే పరమేశ్వరి స్వరూపం. మంత్ర స్వరూపం.

త్రికోణంలోని మూడు కోణాలయందు

1.	మండలత్రయము	–	చంద్ర సూర్య అగ్ని మండలాలు
2.	గుణత్రయము	–	సత్వరజస్తమో గుణాలు
3.	బీజత్రయము	–	వాగ్భవకామరాజశక్తి బీజాలు
4.	శక్తిత్రయము	–	ఇచ్ఛా జ్ఞానక్రియా శక్తులు
5.	మూర్తిత్రయము	–	బ్రహ్మవిష్ణు రుద్రులు
6.	త్రిపుటి	–	జ్ఞాత జ్ఞాతృజ్ఞేయములు
7.	అవస్థాత్రయము	–	జాగ్రత్స్వప్న సుషుప్తులు
8.	పీఠత్రయము	–	పూర్ణగిరి, కామరాజ, జాలంధర పీఠాలు
9.	ముల్లోకాలు	–	భూలోక భువర్లోక సువర్లోకాలు

ఈ రకంగా మూడు కూటముల స్వరూపము గలది. కాబట్టి పరమేశ్వరి త్రికూటా అని చెప్పబడింది.

590. కామకోటికా

కాముడు అంటే శివుడు. అటువంటి శివుడు ఏకదేశముగా గలది. శక్తి సామరస్యమైన పరబ్రహ్మ స్వరూపము గలది.

ధర్మార్థ కామ మోక్షాలనబడే చతుర్విధ పురుషార్థాలలో మోక్షమే స్వరూపంగా గలది.

ఈ రకంగా ఆత్మవిద్యను వివరించటం జరిగింది.

41. దాక్షాయణీ విద్య

బ్రహ్మ మానసపుత్రుడు దక్షుడు. ప్రజాపతులలో ఒకడు. ఇతడి భార్య వీరిణి. ఈమెనే ధరణి అని కూడా అంటారు. ఇతనికి యాభైమంది ఆడపిల్లలు. వారిలో పెద్ద కుమార్తె సతీదేవి. ఆమె పేరే దాక్షాయణి. 591 నుంచి 621వ నామం వరకు దాక్షాయణీ విద్య చెప్పబడింది. ఈమె పరమేశ్వరి యొక్క రూపం. రాక్షస సంహారం చెయ్యటమే ఈమె ధ్యేయం. భగవంతుడి యొక్క అవతార విశేషమే రాక్షస సంహారం అయితే పూర్తిగా రాక్షస ప్రవృత్తిగల వారిని సంహరించటం, గర్వించినవారి గర్వం అణచి వారికి సన్మార్గం చూపటం. ఇదికూడా భగవంతుడి లక్ష్యమే అందుచేతనే అనేకసార్లు దేవతలకు కూడా గర్వభంగమవుతుంది. కృష్ణావతారంలో శ్రీకృష్ణుడు సత్యభామ గర్వాన్ని పోగొట్టి సత్యాన్ని తెలియచేస్తాడు. విష్ణుమూర్తి నారదుడి గర్వాన్ని అణచివేస్తాడు. ఈ రకంగా దక్షుడు కూడా తాను గొప్పవాడిని ప్రజాపతిని. తనను అందరూ గౌరవించాలి అని అహంకరించాడు. అతని అల్లుడే అయినప్పటికీ యాగానికి శివుణ్ణి పిలవలేదు. అతణ్ణి అవమానించాడు నిందించాడు. ఫలితంగా దక్షయజ్ఞం నాశనమై పోయింది. దక్షునితల కూడా ఎగిరిపోయింది. చివరకు దేవతల కోరికమీద అతడికి మేక తల అతకించబడింది.

ఆ దేవి గురుమూర్తి. శ్రీవిద్యను లోకంలో ప్రచారం చేసింది ఆమెయే. ఆమే గురుశిష్యులుగా రెండు రూపాలు పొంది శ్రీవిద్యను దేవలోకం నుంచి భూలోకానికి, మనదాకా తెచ్చింది. సద్గుణ సంపన్నురాలు. గోవులకు మాత. గోవులు అంటే జీవులు. జగత్తులోని జీవరాశికంతటికీ తల్లి.

కుమారస్వామిని కన్న తల్లి. లోకంలో అజ్ఞానులందరికీ తల్లి. ఆమె దేవతలచేత కూడా పూజింపబడుతుంది. దండనీతి బాగా తెలుసు. దేవీ భాగవతంలో చెప్పినట్లుగా మణిద్వీపంలో నాలుగు మంటపాలున్నాయి. వాటిలో

చతుర్థే మంటపే చైవ జగద్రక్షా వివించనమ్

నాల్గవ మంటపంలో మంత్రులతో సమాలోచనలు జరిపి జగత్తును రక్షిస్తుంటుంది.

దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తుంది. మరి ఆమె ఎక్కడ ఉంటుంది. సహస్రారమనేది చంద్రమండలం. అక్కడ వృద్ధిక్షయాలు లేని చంద్రుడుంటాడు. ఆ చంద్రరూపమే పరమేశ్వరి.

ఆమె హృదయస్థానంలో ఉన్న అనాహత పద్మంలో ఉంటుంది. అది భానుమండలము. అక్కడ సూర్యునివలె ప్రకాశిస్తూ ఉంటుంది. అదే దహరాకాశము.

ఆధారచక్రంలోని త్రికోణమందుంటుంది. ఆ త్రికోణంలోని దీపశిఖయే పరమేశ్వరి.

ఆమె దేవతల చేత కూడా పూజించబడుతుంది. ఈ దేవతను అర్చించేటప్పుడు ప్రతిరోజూ ఆ తిథిన ఉన్న నిత్యాదేవతను పూజిస్తూ మహాత్రిపురసుందరిని అంటే 16వ నిత్యను తప్పనిసరిగా పూజించాలి. అన్ని కళల స్వరూపమూ ఆమె. కళలకు అధిపతి కూడా ఆమె. ఆమెకు లక్ష్మీ సరస్వతులు వింజామరలు వీస్తుంటారు. ఆమెయే ఈ సృష్టికి మూలమయిన ఆదిశక్తి. అద్వితీయమైనది. ఆద్యంతములు లేనిది. నిర్గుణమైనది. ఆమె సత్యము, నిత్యము, అనంతము అయినది. పరమపవిత్రురాలు అనేక కోటి బ్రహ్మాండాలను సృష్టించినది ఆ పరమేశ్వరియే. ఇదే పరమేశ్వరి ఉపాస్యరూపము. ఇక నామాలను చూద్దాం.

591. కటాక్షకింకరీభూతకమలాకోటిసేవితా

పరమేశ్వరి యొక్క కృపాకటాక్ష వీక్షణాలు ఎవరియందుంటాయో వారికి కోటిమంది లక్ష్మీదేవులు సేవిస్తుంటారు. తన భక్తులమీద అవ్యాజమైన కరుణగలది. వారు కోరిన దానికన్న కొన్ని రెట్లు ఎక్కువగా ఇచ్చేది. దేవి కరుణ ఉన్నంతమాత్రంచేత లక్ష్మీ అనే పేరుగల దేవతలు అనేకమంది ఆ భక్తునికి సేవకులవుతారు.

పరమేశ్వరి బిందురూపిణి. ఓడ్యాణపీఠంలో బిందుమండలమందుంటుంది. ఆ దేవిని ప్రతి ఆవరణలోను 64 కోట్లమంది యోగినీ గణము సేవిస్తుంటారు. మొత్తంమీద $64 \times 9 = 576$ కోట్లమంది యోగినీగణం ఆమెను సేవిస్తుంటారు. ఆ పరమేశ్వరిని ప్రార్థించినవారికి ఈ యోగినీ దేవతలు కోరికలు తీరుస్తాయి.

592. శిరఃస్థితా

శిరసి బ్రహ్మరంధ్రే గురురూపతయా స్థితా ॥

శిరసున బ్రహ్మరంధ్రం దగ్గర గురురూపంతో ఉండేది. శ్రీచక్రంలోని బిందువే ఉపాసకులకు బ్రహ్మరంధ్రము.

బైందవమ్ బ్రహ్మరంధ్రం చ మస్తకం చ త్రికోణకమ్ ॥

ఉపాసకులు బ్రహ్మరంధ్రం దగ్గర గురువును భావించి అక్కడ నమస్కరించటం జరుగుతుంది. అందుచేతనే దేవి శిరస్థితా అనబడుతోంది.

ఉపాసనలో బ్రహ్మరంధ్రం దగ్గర పరమేశ్వరిని భావన చెయ్యటం సంప్రదాయం. కాబట్టి పరమేశ్వరి శిరస్థితా అనబడుతుంది.

593. చంద్రనిభా

శిరోభాగంలో సహస్రారంలో చంద్రుడున్నాడు. ఇది చంద్రమండలము. ఇక్కడ ఉన్న చంద్రుడు షోడశ కళాప్రపూర్ణుడు. అతడికి వృద్ధిక్షయాలు ఉండవు.

ఆజ్ఞాచక్రంలో ఉన్న కుండలిని సహస్రారానికి చేరినట్లైతే అక్కడ కోట్లకొలది సూర్యచంద్రుల కాంతులతో దివ్యమైన తేజోబింబము దర్శనమవుతుంది. అక్కడకు చేరిన కుండలిని సహస్రదళ పద్మాన్ని తననోటితో కరిచి పట్టుకుంటుంది. ఆ చంద్రమండలంలోని మధువు అంతా ఘనీభవించి ఉంటుంది. కాని కుండలిని ప్రజ్వలితమయ్యేటప్పుడు వచ్చిన స్వాధిష్ఠానాగ్ని యొక్క వేడివల్ల సహస్రారంలో ఘనీభవించిన అమృతము యోగియొక్క శరీరంలోని 72వేల నాడీమండలాన్ని తడుపుతుంది.

ఇప్పుడు పరమేశ్వరి కోట్లకొలది సూర్యచంద్రుల కాంతులతో ఇక్కడ ప్రకాశిస్తున్నది. అందుచేతనే చంద్రనిభా – చంద్రుని కాంతులతో ప్రకాశించునది అని చెప్పబడింది.

594. ఫాలస్థా

ఫాలభాగమందు హ్రీంకార రూపంలో ఉండే దేవి. ఫాలభాగము – లలాటము. లలాట భాగాన ఆ దేవి భువనేశ్వరీ బీజంతో ఉంటుంది. అందుకనే జపం చేసేటప్పుడు కనులు మూసుకుని, దృష్టిని భృకుటి స్థానంలో కేంద్రీకృతం చెయ్యాలి అని చెప్పటం జరుగుతుంది. ఆజ్ఞాచక్రంలో నివశించే దేవి.

595. ఇంద్రధనుః ప్రభా

ఇంద్రధనుస్సు వలె ప్రకాశించునది. ఉపాసకులను మూడు భాగాలుగా విభజించారు. యోగినీ హృదయంలో

ఆజ్ఞాంతం సకలం ప్రోక్తం తత స్సకల నిష్కలం ।
ఉన్మన్యంతం పరేస్థానం నిష్కళంచ త్రిధాస్థితం ॥

ఉపాసకులు 1. సకలులు 2. నిష్కలులు 3. ప్రళయాకలులు

1. సకలులు కేవలం ఐహికవాదులు. వీరు అకులం దగ్గర నుండి ఆజ్ఞాచక్రం దాకా పరమేశ్వరిని ఉపాసన చేస్తారు.

2. నిష్కలులు. వీరు మోక్షవాదులు. బ్రహ్మరంధ్రం దగ్గర ఉపాసన చేస్తారు.

3. సకల నిష్కలులు. వీరినే ప్రళయాకలులు అంటారు. వీరు శుద్ధాశుద్ధ మిశ్రులు. అంటే ద్వైదీభావం కలవారు. వీరు ఆజ్ఞాచక్రంనుంచి ఉన్మన వరకు దేవీ ఉపాసన చేస్తారు.

శరీరంలో మొత్తం 19 చక్రాలున్నాయి. అవి. మొదటి జట్టులో తొమ్మిది.

రెండవ జట్టులో తొమ్మిది. మూడవ జట్టులో బ్రహ్మరంధ్రం ఒక్కటి.

ఆజ్ఞాచక్రం నుంచి ఉన్మని వరకు తొమ్మిది చక్రాలు

ఇందౌ తదర్థం రోదిన్యాం నాదోనాదాంత ఏవ చ ।
శక్తిః పున ర్వ్యాపికాయాం సుమనా ఉన్మన గోచరే ॥

1. బిందువు	4. నాదము	7. వ్యాపిక
2. అర్ధ చంద్రము	5. నాదాంతము	8. సుమన
3. రోదిని	6. శక్తి	9. ఉన్మన

భృకుటి స్థానంలో ఉండేది బిందువు. ఆపైన అర్ధచంద్రం ఉంటుంది.

దీపాకారో అర్ధమాత్రశ్చ లలాటే వృత్త ఇష్యతే
అర్ధచంద్ర స్తదాకారః పాదమాత్ర స్తదూర్ధ్వకే ॥

లలాటంలో బిందువున్నది. దానిపైన అర్ధమాత్ర లేక అర్ధచంద్రమున్నది. దీని కాంతికూడా అష్టమి నాటి చంద్రునిలాగా ఉంటుంది. ఇది దీపాకారంగా అర్ధచంద్రాకారంలో ఉంటుంది. దీని ఉచ్చారణ కాలము 1/4 వంతు మాత్ర. అంటే 64 లవములు. మాత్రకు 256 లవములు. బిందు ఉచ్చారణ కాలము 128 లవములు.

ఇంద్రధనుస్సు నానా వివిధరకాలయిన కాంతులు గలది. ఉదయంపూట ఉపాసకులు భృకుటి స్థానంలో దేవిని భావించి వివిధ వర్ణాలు కలదానినిగా అర్చిస్తారు.

సర్వవర్ణే ! మహాదేవి ! సంధ్యా విద్యే సరస్వతీ

ఇక్కడ పరమేశ్వరి ఏడు రంగులు కలిగి ఉంటుంది. సప్తవర్ణుడు లేక సప్త జిహ్వుడి (అగ్ని దేవుడు) వంటి తేజస్సు గలది.

596. హృదయస్థా

హృదయస్థానంలో ఉండేది. పరమశివుని స్థానమే ఉపనిషత్తు హృదయము. ఆ ఉపనిషత్తు హృదయమందుండునది. లేక ఉపనిషత్తులతో ప్రతిపాదింపబడినది. మర్రి విత్తనంలో గల శక్తి అంతటా వ్యాపించినట్లే హృదయస్థానంలో ఉన్న ఈ శక్తి జగత్తంతా వ్యాపించి ఉన్నది. పరమేశ్వరి హృదయస్థానంలో ఉంటుంది.

పద్మకోశ ప్రతీకాశగ్ం హృదయం చా పృథోముఖమ్

అని మొదలుపెట్టాలి

స బ్రహ్మ స శివ స్స హరి స్స ఇంద్రః సః అక్షరః పరమస్వరాట్

హృదయస్థానంలో ఉన్నవాడే బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, ఇంద్రుడు, అక్షర స్వరూపుడైన పరబ్రహ్మ. అని చెప్పబడింది. అతడే పరమేశ్వరుడు. ఉపాసకులు మధ్యాహ్నకాలంలో హృదయంలో ఉండే దేవిని ఉపాసించాలి.

597. రవిప్రఖ్యా

హృదయమందు సూర్యమండలమున్నది.

ఆధారస్వాధిష్ఠానాలు	-	అగ్ని మండలం
మణిపూర అనాహతాలు	-	సూర్యమండలం
విశుద్ధి ఆజ్ఞాచక్రాలు	-	చంద్రమండలం

హృదయస్థానము మణిపూరం. అది సూర్యమండలము. అక్కడ దేవిని ఉపాసించాలి.

సూర్యమండల మధ్యస్థాం దేవీం త్రిపుర సుందరీం
పాశాంకుశధనుర్బాణహస్తాం ధారయంతీం ప్రపూజయేత్ ॥

ఆధార స్వాధిష్ఠానాలలో కౌళులు మాత్రమే అర్చించాలి అని చెప్పి, సమయాచారులు మణిపూరం దగ్గర నుంచి మాత్రమే పరమేశ్వరిని అర్చించాలి అన్నారు గౌడపాదులు.

సూర్యునితో సమానమైన కాంతి గలది. పరమేశ్వరి తేజోరూపిణి. అందుకనే

అగ్ని రూపంలో	-	ఉదయం పూట
సూర్య రూపంలో	-	మధ్యాహ్న కాలంలో
చంద్రుని రూపంలో	-	సాయం సమయంలో

భక్తులచే ధ్యానింపబడుతూ ఉంటుంది.

598. త్రికోణాంతరదీపికా

మూలాధార చక్రంలో త్రికోణమున్నది. దాని మధ్యలో అగ్నిమండలమున్నది. ఆ త్రికోణము మధ్యలో ప్రకాశించు దీపశిఖయే పరమేశ్వరి.

తంత్రరాజంలో "జీవుల మూలాధారంలో అగ్ని ఉన్నది.

హృదయ స్థానంలో సూర్యుడున్నాడు. శిరస్సులో సహస్రదళ పద్మంలో చంద్రుడున్నాడు అని చెప్పబడింది. నిత్యావిద్య ఈ మూడింటిచేత త్రిఖండమైనది.

విష్ణుపురాణంలో ఇతడు శక్రాది పురములందు మధ్యాహ్న కాలంలో ఉన్నప్పుడు మూడు పురములను సృష్టిస్తాడు. ఇటువంటి త్రికోణమందుంటుంది. కాబట్టి త్రికోణాంతరదీపికా అనబడుతోంది.

599. దాక్షాయణీ

దక్ష ప్రజాపతి యొక్క కుమార్తె. దేవీభాగవతంలో విష్ణువు యొక్క నాభికమలం నుంచి పుట్టిన బ్రహ్మ కొన్ని వేల సంవత్సరాలు తపస్సు చేసి పరమేశ్వరిని మెప్పించి ఆమె అనుజ్ఞతో సృష్టి కార్యక్రమం ప్రారంభించాడు. అందులో భాగంగా మానసికంగా

1. మరీచి	3. అత్రి	5. పులస్త్యుడు	7. క్రతువు
2. అంగీరసుడు	4. వసిష్ఠుడు	6. పులహుడు	

అనేవారిని సృష్టించాడు. వీరు బ్రహ్మ మానసపుత్రులు వీరు కాక

రోషము వల్ల	-	రుద్రుడు
తొడ నుంచి	-	నారదుడు
కుడి చేతి బ్రొటన వేలు నుంచి	-	దక్షుడు
ఎడమచేతి బ్రొటన వేలు నుంచి	-	వీరిణి అనే కన్య

పుట్టారు. దక్షుడు వీరిణిని వివాహం చేసుకున్నాడు. వీరికి యాభైమంది కుమార్తెలు, ఐదుగురు కుమారులు కలిగారు. వీరిలో పెద్దకుమార్తె సతి. ఆమె పేరే దాక్షాయణి. ఈమె పరమేశ్వరియొక్క అంశతో పుట్టింది.

600. దైత్యహంత్రీ

దైత్యాదీనాం, భండాసురాదీనాం హంత్రీం

భండాసురాది దైత్యులను సంహరించినది. భండాసుర, మహిషాసుర, శుంభ, నిశుంభ, మొదలగు దైత్యులను సంహరించినది. వేదాన్ని దూషించేవారు, పరబ్రహ్మ లేడనేవారు, దేవతలను నిందించేవారు, ధర్మాన్ని నాశనం చేసేవారు, తేలిక అయిన అర్థంలో చెప్పాలి అంటే సంఘ వ్యతిరేకులు, సమాజ వ్యతిరేకులు – వీరు దైత్యులు అనబడతారు. దితియొక్క సంతానం దైత్యులు. వీరంతా ధర్మదూరులు. వీరు యజ్ఞయాగాలను ద్వేషిస్తారు. బ్రహ్మను ద్వేషిస్తారు. కేవలము ఐహికవాంఛల కోసమే జీవిస్తారు. తమోగుణ ప్రధానులు. ఇటువంటివారిని సంహరిస్తుంది కాబట్టి దైత్యహంత్రీ అనబడుతుంది.

601. దక్షయజ్ఞవినాశినీ

దక్షుని యొక్క కుమార్తె దాక్షాయని అని గతంలో వివరించటం జరిగింది. దక్షుడు తన కుమార్తె అయిన సతీదేవిని శివునికిచ్చి వివాహం చేశాడు.

ఒకరోజున బ్రహ్మ ఒక యాగం చెయ్యటానికి ఉపక్రమించి, ఆ యాగానికి దేవతలనందరినీ ఆహ్వానించాడు. అనుకున్నట్లుగానే అందరూ విచ్చేశారు. దక్షప్రజాపతి కొద్ది ఆలస్యంగా వచ్చాడు. అతడు రావటంతోనే దేవతలంతా లేచినుంచుని ఆయన్ను గౌరవించారు. శివుడు మాత్రం లేవలేదు సరికదా తలత్రిప్పి చూడను కూడా లేదు. అది అవమానంగా భావించాడు దక్షుడు. తన ఇంటికి మిగిలిన కుమార్తెలను పిలిచేవాడు. కాని సతీదేవిని మాత్రం పిలవటం మానేశాడు. ఈ రకంగా చాలాకాలం గడిచింది.

ఒకసారి దక్షుడు యజ్ఞం చెయ్యాలి అనుకున్నాడు. దేవతలందరికీ వర్తమానం పంపాడు. కుమార్తెలందరికీ కబురంపాడు. కానీ సతీదేవిని మాత్రం పిలువలేదు. పుట్టింటికి వెళ్ళి చాలాకాలమయింది. సోదరీమణులను చూసి ఎంతో కాలమయింది. తండ్రి యాగం చేస్తున్నాడు. పిలవకపోతే మాత్రం ఏమిటి? వెడదామనుకుంది. భర్తతో అదే మాట చెప్పింది. పిలవకుండా వెళ్ళటం మంచిది కాదు. వద్దు అవమానం పొందవలసి వస్తుంది అన్నాడు భర్త. సతీదేవి వినలేదు. సరే వెళ్ళమని భటులను తోడిచ్చి పంపాడు.

పుట్టింటికి చేరింది దాక్షాయణి. తండ్రి పలకరించలేదు. తనే వెళ్ళి నేను వచ్చాను అంది. ఎందుకు వచ్చావు? నిన్నెవరు పిలిచారు. అన్నాడు దక్షుడు, నేను చేసిన తప్పేమిటి? అని అడిగింది సతీదేవి. నీ భర్త ఒక అహంభావి. నా అంతటివాణ్ణి గౌరవించడు. సేవలు చెయ్యడు. అంటూ శివుణ్ణి దూషించాడు. ఈ అవమానం భరించలేక యోగాగ్ని సృష్టించుకుని అందులో దగ్ధమైపోయింది దాక్షాయణి.

భటులు తెచ్చిన వార్తను విన్నాడు. సతీ వియోగాన్ని భరించలేకపోయాడు. ప్రళయకాల రుద్రుడై పోయాడు. వీరభద్రుని సృష్టించి దక్షయజ్ఞం నాశనం చెయ్యమన్నాడు. శివుని ఆజ్ఞను శిరసా వహించిన ప్రమథగణాలు దక్షుని యజ్ఞాన్ని పాడుచేశాయి. వీరభద్రుడు దక్షప్రజాపతిని సంహరించాడు. ఆ తరువాత దేవతలందరి కోరికపై దక్షునికి మేకతల అంటించి బ్రతికించారు. అప్పటి నుంచే దక్షుడు అజముఖుడైనాడు.

ఈ రకంగా దక్షుని యజ్ఞం నాశనం కావటానికి కారణమైంది కాబట్టి ఆ దేవి 'దక్ష యజ్ఞ వినాశినీ' అనబడింది.

602. దరాందోళితదీర్ఘాక్షీ

కొంచెము చంచలమై, చెవులవరకు వ్యాపించిన కనులు గలది. భయాన్ని నశింపచేసే దీర్ఘమైన కనులు గలది. ఆమెయొక్క కడకంటి చూపు సోకినంత మాత్రం చేతనే భయాలు తొలగిపోతాయి.

కొంచెము చలించే ఆ కర్ణాంత విశాలనేత్రములు గలది. వీక్షణ మాత్రం చేతనే సమస్త లోకాలను భృత్యులుగా చేసుకోగలిగినది.

603. దరహాసోజ్జ్వలన్ముఖీ

చిరునగవుతో ప్రకాశించే ముఖము గలది. సుందరమగు మందహాసముచే ప్రకాశించు ముఖము గలది. ఆనందమే స్వరూపంగా గలది. హృదయంలో ఉన్న ఆనందం ముఖంలో కనిపిస్తుంది కాబట్టి దరహాసో జ్వలన్ముఖీ అనబడుతుంది. ఇది ఆత్మనందానికి సూచికము. దేవి బ్రహ్మానంద స్వరూపిణి.

604. గురుమూర్తిః

గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుః సాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమః ॥

అజ్ఞానమనే అంధకారాన్ని పారద్రోలి, జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు గురువు. సాధకుడికి మంత్రోపదేశం చేసి, దీక్ష ఇచ్చి, సాధనా విధానము చెప్పి, ముక్తి మార్గం చూపేవాడు గురువు. అతడు త్రిమూర్తి స్వరూపుడు. సాక్షాత్తూ పరమేశ్వరుడు.

శక్తి రహస్యంలో చెప్పినట్లుగా

గుకార స్త్వంధకారః స్యాత్ రుకార స్తన్నివర్తకః

గుకారము అంటే కటిక చీకటి రుకారము అనగా దానిని పోగొట్టేది.

అఖండమండలాకారం వ్యాప్తంయేన చరాచరం ।
తత్పదం దర్శితం యేన తస్మై శ్రీగురవే నమః ॥

విశాలమైన విశ్వమంతా వ్యాపించినవాడు, శిష్యుని యొక్క అజ్ఞానాన్ని పారద్రోలి జ్ఞానజ్యోతిని వెలిగించేవాడు అయిన గురువు యొక్క పాదాలకు నమస్కరిస్తున్నాను.

అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజనశలాకయా
చక్షు రున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః

ఏ మహాత్ముడు నీకు బాగా గుర్తుంటాడో, ఏ మహానుభావుని రూపం నీ మనసులో సదా నిలిచిపోతుందో, ఏ సన్యాసి నీకు స్వప్నంలో కూడా కనిపించి సన్మార్గాన్ని బోధిస్తుంటాడో, ఏ సాధువు చెప్పిన ధర్మసూత్రాలు నీ మదిలో సదా నిలిచిపోతాయో, ఏ మహనీయుని దగ్గరకు వెళ్ళగానే నీ అనుమానాలు తీరిపోతాయో, ఏ వ్యక్తి దగ్గర నీకు ప్రశాంతత, ఆనందము కలుగుతుందో, ఏ వ్యక్తి మీద నీకు నమ్మకము గురి కుదురుతాయో, ఆ మహనీయుడే నీకు గురువు. స్థూలంగా చెప్పాలంటే తన శిష్యునకు సన్మార్గాన్ని బోధించి తరుణోపాయం చూపేవాడు గురువు.

గురువు ఏ జాతివాడైనా, ఏ మతంవాడైనా, ఏ కులంవాడైనా సరే అతన్ని పూజించాలి. గౌరవించాలి. ఆరాధించాలి. లోకంలో అస్థిరమైనవి ఐహికసుఖాలనిచ్చేవి ఎన్ని ఉన్నప్పటికీ గురుకటాక్షం లేకపోతే అవన్నీ నిష్ప్రయోజనం ఈ విషయాన్ని శంకరభగవత్పాదులవారు తమ గుర్వష్టకంలో వివరిస్తూ గురువు అంటే సాక్షాత్తూ పరమేశ్వరుడే అని చెప్పారు.

శరీరం సురూపం తథా వా కలత్రం
యశ శ్చారుచిత్రం ధనం మేరుతుల్యమ్
మన శ్చేన్న లగ్నం గురో రంఘ్రిపద్మే
తతః కిం తతః కిం తతః కిం తతః కిం ॥

అందమైన శరీరమున్నది. ఇంకా అందమైన భార్య ఉన్నది. బోలెడంత ధనమున్నది. కావలసినంత కీర్తి ఉన్నది. అయినప్పటికీ గురుకటాక్ష వీక్షణాలు లేకపోయినట్లైతే అవన్నీ నిష్ప్రయోజనము అందుకనే

న గురోరధికం తత్త్వం నగురోరధికం తపః
తత్త్వ జ్ఞానాత్ పరంనాస్తి తస్మై శ్రీ గురవే నమః

గురువును మించిన తపస్సు లేదు. గురువును మించిన తత్త్వం వేరే లేదు. భగవంతుడు కోపిస్తే గురువు రక్షిస్తాడు. కాని గురువు కోపిస్తే ఆ పరమేశ్వరుడు కూడా రక్షించలేడు అందుకనే పరమేశ్వరుడికన్నా కూడా గురువే అధికుడు.

సృష్టి ఆవిర్భావ కాలంలో, కృతయుగం ప్రారంభంలో సర్వానందమయమైన ఓడ్యాణ పీఠమనే బిందుమండలమందు, పరమాత్మ స్వరూపుడైన కామేశ్వరుడు ఊర్ధ్వానంద నాథ అనే పేరుతో అనుత్తరానందం కోసం మాయాస్వరూపిణి స్వాత్మరూప అయిన కామేశ్వరీ దేవికి శ్రీవిద్యను ఉపదేశించాడు. కామేశ్వరీ కామేశ్వరులిద్దరూ పరబ్రహ్మ స్వరూపులే. వారికి బేధం లేదు. అయినప్పటికీ లోకాలను అనుగ్రహించాలి అనే కోరికతో, సత్సంకల్పంతో పరమాత్మ తానే గురుశిష్యులుగా మారి సర్వోపనిషత్సారమైన శ్రీవిద్యా తంత్రాన్ని ఆమెకు ఉపదేశించాడు.

ఈ రకంగా పరమాత్మ శ్రీవిద్యను లోకంలో వ్యాప్తి చెయ్యటం కోసం తాను ఊర్ధ్వ దేవానందనాథ అనే దీక్షానామం ధరించి, కామేశ్వరీదేవికి శ్రీవిద్యను ఉపదేశించి ఆమెకు మిత్రేశదేవనాథ అని నామకరణం చేశాడు.

కామేశ్వరీ కామేశ్వరులు తమదీక్షా నామాలతో ఓడ్యాణ పీఠమనే బిందుమండలము నందు పురాణదంపతులుగా ఉన్నారు. ఇది శ్రీవిద్యకు మొదటి స్థానము.

ఆ తరువాత పరమేశ్వరుని ఆజ్ఞమేరకు ఆ పరాభట్టారిక శ్రీవిద్యా రహస్య వ్యాప్తి కోసం తనయొక్క అంశలు, అవ్యక్త మహత్తత్త్వ అహంకార స్వరూపులు, వాగ్భవ కామరాజశక్తి బీజాధిపతులు, సత్త్వరజస్తమో గుణాధిపతులు, సృష్టి స్థితిలయకారకులు అయిన త్రిమూర్తి ద్వంద్వానికి శ్రీవిద్యను ఉపదేశించింది. వారిద్వారా ఉపదేశ పరంపరగా ఈ విద్య విస్తరించి దివ్యౌఘ, సిద్ధౌఘ, మానవౌఘ గురుమండలం లోకంలో ప్రసిద్ధి చెందింది.

దివ్యౌఘులు అంటే - దేవతలు
సిద్ధౌఘులు అంటే - సనకసనందనాది సిద్ధులు
మానవౌఘులు అంటే - విద్యారణ్య, గౌడపాద, శంకర ప్రభృతులు

బిందు మండలవర్తిని అయిన ఆ పరమేశ్వరి మొదటగా శ్రీవిద్యను త్రికోణంలోని ఉత్తరకోణంలోని జాలందర పీఠంలో ఉన్న శక్తి బీజాధిపతులైన ఉమామహేశ్వరులకు ఉపదేశించి, వారికి ఊర్ధ్వదేవనాథ, కామేశ్వర్యంబా అని నామకరణం చేసింది. ఉమామహేశ్వరులు శ్రీవిద్యను ఉపాసన చేసి కొంత కాలం తరువాత యోనిచక్రంలోని దక్షిణ కోణంలోని పూర్ణగిరి పీఠంలో ఉన్న, కామరాజ బీజాధిపతులైన లక్ష్మీనారాయణులకు ఆ విద్యను ఉపదేశించి వారికి షష్ఠీశ దేవనాథ వజ్రేశ్వర్యంబా అని నామకరణం చేశారు. షష్ఠీశ దేవనాథ ద్వంద్వము శ్రీవిద్యను కొంత కాలము ఉపాసన చేసి యోనిచక్రంలోని అగ్రకోణంలోని కామగిరి పీఠాధిపతులు, వాగ్భవ బీజాధిపతులైన వాణీ హిరణ్య గర్భులకు శ్రీవిద్యనుపదేశించి వారికి మిత్రేశనాథ, భగమాలిన్యంబా అని నామకరణం చేశారు. మిత్రేశనాథ ద్వంద్వము శ్రీవిద్యను ఇంద్రాది దేవతలకు, వారు సనకసనందనాది సిద్ధులకు, వారు విద్యారణ్యాది మానవులకు ఉపదేశించారు. ఈ రకంగా శ్రీవిద్య ఈ రోజున మనదాకా వచ్చింది. అందుచేతనే జపం చేసేటప్పుడు ముందుగా

ఆదినాథ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।
అస్మదాచార్య పర్యంతాం వందే గురుపరంపరామ్ ॥

అంటూ ఆ పరమేశ్వరుని దగ్గర నుండి మనకు మంత్రోపదేశం చేసిన గురువుదాకా అందరికీ నమస్కరించాలి.

ఈ రకంగా శ్రీవిద్యా సంప్రదాయాన్ని వెలుగులోకి తెచ్చినది ఆ పరమేశ్వరి. అందుచేతనే ఆమె గురుమూర్తి అనబడుతోంది.

605. గుణనిధిః

గుణములకు నిధి, సత్త్వరజస్తమో గుణాలకు ఆ పరమేశ్వరి నిధి. ఈ గుణాలు మూడే అయినప్పటికి వృత్తి బేదం చేత అనంతమవుతున్నాయి.

1. ఐశ్వర్యము 3. యశము 5. జ్ఞానము
2. వీర్యము 4. శ్రీ 6. వైరాగ్యము

వీటిని షడ్గుణాలు అంటారు. అలాగే పంచభూతాల యొక్క గుణాలు శబ్ద స్పర్శ రూప రస గంధాలు. త్యాగము, శౌర్యము, ఔదార్యము మొదలైనవి గుణాలు. గుణములు అంటే - నవవ్యూహాలు. కామకలావిద్యలో

కాలవ్యూహః కులవ్యూహో నామవ్యూహ స్తథైవ చ
జ్ఞానవ్యూహ స్తథా చిత్తవ్యూహ స్స్యా త్తదనంతరమ్
నాదవ్యూహ స్తథా బిందువ్యూహ స్స్యా త్తదనంతరమ్
కలావ్యూహ స్తథా జీవవ్యూహ స్స్యా దితి తే నవ ॥

1. కాలవ్యూహము-నిమిషము మొదలు కల్పాంతమువరకు ఉన్న కాలము యొక్క సముదాయము.
2. కులవ్యూహము - ఎరుపు, తెలుపు, నీలము మొదలైన రంగులను గురించి తెలిపేది.
3. నామవ్యూహము - లోకంలోని ప్రాణులపేర్లను తెలిపేది.
4. జ్ఞానవ్యూహము - ఇంద్రియాలద్వారా ప్రపంచాన్ని గురించి తెలుసుకునే జ్ఞానము.
5. చిత్తవ్యూహము - మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము, మహతత్త్వము అనే అహంకార పంచకము గురించి తెలిపేది.
6. నాదవ్యూహము - రాగము, ఇచ్ఛ, ప్రయత్నము, మాయ శుద్ధవిద్య, మహేశ్వరుడు, సదాశివుడు, పరా, పశ్యంతి మధ్యమ, వైఖరిల గురించి తెలిపేది.
7. బిందువ్యూహము - ఆధారాది షట్చక్రాల సమూహము
8. కళావ్యూహము - యాభై కళలుగా వర్ణస్వరూపాలయిన అక్షరాలను గురించి తెలిపేది.
9. జీవవ్యూహము - భోక్తలగు జీవసమూహము.

వీటన్నింటినీ కలిపి నవవ్యూహాలంటారు.

నవవ్యూహాత్మకోదేవః పరానంద పరాత్మకః
నవాత్మా భైరవో దేవో భుక్తిముక్తిప్రదాయకః
పరానందః పరాశక్తిః చిద్రూపాऽఽనంద భైరవీ
తయో ర్యదా సామరస్యం జగ దుత్పద్యతే తదా ॥

పరానందుడు, పరాత్మకుడు, అయిన భైరవుడు నవవ్యూహాత్మకుడు. ఆయనే భుక్తిముక్తి ప్రదాత. పరానందమయమైన పరాశక్తి చిద్రూప అయిన ఆనందభైరవి అవుతుంది. ఈ భైరవీ భైరవులకు సామరస్యం ఎప్పుడు కలుగుతుందో అప్పుడు జగత్తు ఉత్పత్తి అవుతుంది.

వీటన్నింటిచేత ఆ పరమేశ్వరి గుణనిధి అవుతుంది.

606. గోమాతా

ధేనువులకు తల్లి. కామధేను రూపమయినది. గో అనే శబ్దం వాక్కు అవటంచేత, అన్ని వర్ణాలకు మాత ఆ పరమేశ్వరియే అని చెప్పబడుతోంది.

పూర్వకాలంలో, అంటే సృష్టి ప్రారంభంలో పంటలు పండించటమువంటివి లేవు. అప్పుడు ఉన్నదంతా పశుసంపదయే. ఆ రోజులలో అందరూ పాలు త్రాగి జీవించేవారు. అప్పట్లో పశుసంపద అంటే ఆవులు. అంతేకాని గేదెలు కావు. శ్రీకృష్ణుడు కూడా గోవర్ధనగిరి ఎత్తి గోవులను రక్షించాడు. అందుచేత పశుసంపద అంటే గోసంపదే. ఇవే జీవులన్నింటికీ ఆహారమైన పాలను ప్రసాదించాయి. అందుకే గోవు మాత అయింది.

గో అనే శబ్దానికి – స్వర్గము, వృషభము, వజ్రము, చంద్రుడు, నేత్రము, దిక్కు, బాణము. ఇలా అనేకార్థాలున్నాయి. వీటన్నింటికీ మాత కాబట్టే ఆ పరమేశ్వరి గో మాతా అనబడుతోంది.

607. గుహజన్మభూః

గుహుడు అంటే – కుమారస్వామి. అతనికి తల్లి కాబట్టి గుహ జన్మ భూః అనబడింది.

అవిద్యతో కూడిన వారు గుహులు. వీరే జీవులు అటువంటి జీవులకు జన్మస్థానమైనది.

జీవులకు ఉత్పత్తిస్థానము ఆ పరమేశ్వరి. బాగా కాగిన లోహపు ముద్దనుంచి నిప్పురవ్వలు ఎలా వస్తాయో అదే విధంగా పరమేశ్వరి నుండి జీవులు పుడుతున్నాయి.

శరీరంలో హృదయస్థానము నివాసముగా గలది. తైత్తిరీయోపనిషత్తులో చెప్పిన విధంగా పంచకోశాల నడుమ ఉండేది.

శరీరంలో హృదయస్థానము నివాసముగా గలది.

608. దేవేశీ

దేవానాం బ్రహ్మవిష్ణ్వా దీనాం ఈశీ ఈశ్వరీ

బ్రహ్మ, విష్ణువు మొదలైన దేవతలకు ఈశ్వరి.

పంచదశీ మహామంత్రాన్ని జపించి తరించిన వారిలో విష్ణువు, శివుడు, ఇంద్రుడు, అగ్ని, సూర్యుడు ఇత్యాది దేవతలు ప్రముఖులు. కాబట్టి అటువంటి దేవతలకు కూడా ఈశ్వరి.

దేవీ భాగవతంలో మధుకైటభ సంహారం చేసిన తరువాత దివ్యమైన విమానంలో త్రిమూర్తులు మణిద్వీపం చేరి, అక్కడ పరమేశ్వరిని దర్శించి, ఆమెను పరిపరివిధాల కీర్తిస్తారు.

వృత్రాసురుని బాధలు పడలేక స్థితికారకుడైన విష్ణుమూర్తితో కలిసి దేవతలంతా హిమాలయాలకు వెళ్ళి ఆ పరమేశ్వరిని నియమనిష్ఠలతో పరిపరివిధాల ప్రార్థిస్తారు.

శుంభనిశుంభులు దేవతలను నానాబాధలు పెడుతుంటే సహించలేక చివరకు హిమాలయ ప్రాంతాలకు వెళ్ళి

నమోదేవ్యై మహాదేవ్యై శివాయై సతతం నమః
నమః ప్రకృత్యై భద్రాయై నియతాః ప్రణతాః స్మృతాః ॥

అంటూ పరిపరివిధాల ప్రార్థించారు. ఈ రకంగా దేవతలందరిచేత పూజించబడిన దేవత. దేవతలకు ఈశ్వరి. కాబట్టి దేవేశీ అనబడుతోంది.

దివి అంటే ఆకాశము. దివియందు సంచరించేవారు దేవతలు. వారందరికీ ఈశ్వరి. కాబట్టి దేవేశి.

శరీరంలో వివిధమైన ఇంద్రియాలున్నాయి. వీటన్నింటికీ దేవతలున్నారు. ఇంద్రియాలకు ముఖ్యమైనది ప్రాణశక్తి. అదే పరమేశ్వరి స్వరూపము. ఈ విధంగా ఆ దేవి దేవేశీ అనబడుతోంది.

609. దండనీతిస్థా

అర్థశాస్త్రమునందు ఉండేది. నీతిశాస్త్రంలో చెప్పబడేది ఈ దేవియే.

పరమేశ్వరి దేవేశి కావటంచేతనే దండనీతి కలిగి ఉంటోంది. విద్యలు నాలుగు రకాలు.

ఆన్వీక్షకీ త్రయీ వార్తా దండనీతి స్త్వ మేవ చ

1. అన్వీక్ష – విజ్ఞానబోధకమైన విద్య
2. త్రయీవిద్య – ధర్మాధర్మాలను వివరించేది
3. వార్తావిద్య – అర్థానర్థ బోధకము
4. దండనీతి – నేరం చేసినవారిని శిక్షించి సన్మార్గంలో పెట్టటము.

దేవీ పురాణంలో అన్యాయ మార్గంలో చరించేవారిని శిక్షించేది కాబట్టి దండనీతిస్థా అనబడింది.

610. దహరాకాశరూపిణీ

హృదయాకాశము నందుండునది. ఈ బ్రహ్మపురం (శరీరం)లో దహరమనే పుండరీకము (హృత్పద్మము) ఉన్నది. దాని మధ్య ఆకాశమున్నది. అందులో పరబ్రహ్మ ఉన్నాడు. అని వేదం చెబుతోంది. ఈ విషయాన్ని గతంలో వివరించాం.

జగత్తులో పైన కనిపించే ఆకాశము – మహదాకాశము. ఘటంలో కనిపించే ఆకాశము – ఘటాకాశము హృదయస్థానంలో ఉండే ఆకాశము – దహరాకాశము. ఆ దహరాకాశమే రూపంగా గలది. కాబట్టి దహరాకాశ రూపిణీ అనబడుతోంది.

611. ప్రతిపన్ముఖ్యరాకాంతతిథిమండలపూజితా

పాడ్యమి నుంచి పూర్ణిమవరకు గల తిథులయందు పూజింపబడునది.

పరమేశ్వరి అనుష్ఠానంలో తిథుల ప్రకారం చేసే విధానం ఒకటి ఉన్నది అని గతంలో వివరించాం. అయినప్పటికీ ఇక్కడ అది అత్యావశ్యకము కాబట్టి మళ్ళీ చెబుతున్నాం.

ప్రతిప న్నామ విజ్ఞేయా చంద్రస్య ప్రథమాకళా
ద్వితీయాద్యా ద్వితీయాద్యా పక్షయోః శుక్లకృష్ణయోః

పాడ్యమి మొదలైన తిథులు పదిహేను. ఇవి శుక్ల కృష్ణ పక్షాలయందుంటాయి.

దర్శాద్యాః పూర్ణిమాంతస్తు కళాః పంచద శైవ తు ।
షోడశీతు కలాజ్ఞేయా సచ్చిదానందరూపిణీ ॥

పాడ్యమి మొదలు పూర్ణిమ వరకు తిథులు పదిహేను. పదహారవ కళ సాక్షాత్తూ ఆ పరమేశ్వరి అయి ఉన్నది.

చంద్రకళలు తిథులస్వరూపాలు. తిథులు నిత్యాస్వరూపాలు. కాబట్టి అర్చనా విధానంలో ఆ రోజు ఉండే తిథిని బట్టి ఆ నిత్యాదేవిని పూజించాలి. పాడ్యమినాటి నిత్యాదేవత కామేశ్వరి. విదియనాడు భగమాలిని. ఈ రకంగా రోజూ తిథుల మాదిరిగానే నిత్యాదేవతలుకూడా మారుతుంటారు. అర్చనా విధానంలో ఆ రోజు ఉన్న తిథి ఆధారంగా, ఆ రోజున ఉండే నిత్యాదేవతను అర్చించాలి. ఇలాగే ప్రతిరోజూ ఒక్కొక్క నిత్యను పదిహేను తిథులయందు అర్చిస్తూ, పదహారవ నిత్య అయిన మహాత్రిపురసుందరిని ప్రతిరోజూ అర్చించాలి. ఇది తిథిమండల పూజ.

తిథులు దేవతాస్వరూపాలు. వరాహపురాణంలో తిథి దేవతల ఉత్పత్తి ఎలా జరిగిందో వివరిస్తూ

1. వహ్ని	5. భుజంగ	9. దుర్గ	13. యముడు
2. దస్ర	6. షణ్ముఖ	10. దిక్కులు	14. హరుడు
3. ఉమ	7. సూర్య	11. కుబేరుడు	15. చంద్రుడు
4. విష్ణు	8. మాతలు	12. కేశవుడు	

నిత్యాదేవతలు ఆ పరమేశ్వరికి ప్రతీక. అందుచేతనే నిత్యాదేవతల స్థితిని బట్టి అర్చించబడుతుంది. ఈ తిథి దేవతలలోనే మతాంతరాలున్నాయి.

612. కలాత్మికా

కళలే స్వరూపంగా గలిగినది.

అగ్నికళలు – 10, చంద్రకళలు – 16, సూర్యకళలు – 12. ఈ కళలే స్వరూపంగా గలది.

తంత్రగ్రంథాలలో అగ్నికళలు	108
చంద్ర కళలు	136
సూర్యకళలు	116
వెరసి	360

షోడశ కళలు, చతుష్షష్ఠి కళలు గతంలో వివరించబడ్డాయి. ఈ కళలకన్నింటికీ అధిదేవత. కాబట్టే కలాత్మికా అనబడుతోంది.

జాగ్రదవస్థలో నాలుగు కళలున్నాయి. అవి శక్తి స్వరూపాలు 1. ఉత్పత్తి 2. జాగ్రత్త 3. బోధ 4. మనోవ్యాపారము స్వప్నావస్థలో నాలుగు కళలున్నాయి. అవి శివశక్తి స్వరూపాలు. 1. అభిలాష 2. భ్రమ 3. చింత 4. విషయవాంఛ సుషుప్తిలో నాలుగు కళలున్నాయి. అవి శివస్వరూపాలు 1. మరణము 2. పరాకు 3. మూర్ఛ 4. నిద్ర

తురీయావస్థ కళలు నాలుగు అవి.

1. వైరాగ్యము 2. మోక్షేచ్ఛ 3. మనశ్శుద్ధి 4. సద్వస్తు విచక్షణ. ఈ పదహారు కళలూ పరమేశ్వరి స్వరూపాలే. ఈ రకంగా కళలన్నింటికీ ప్రతిరూపము. అందుచేత కలాత్మికా అనబడుతుంది.

613. కలానాథా

ఇటువంటి కళలకు అధిపతి. కలాత్మికా అనే నామంలో వర్ణించిన కళలన్నీ పొంది ఉన్నది కాబట్టి కళానాథా అనబడుతుంది. 64 కళలకు స్థానమైనది. కళానాథుడు అంటే – చంద్రుడు. చంద్రమండలానికి శ్రీచక్రస్వరూపమున్నది. కాబట్టి పరమేశ్వరి చంద్రరూప, చంద్రస్వరూపిణి. చంద్రుడు షోడశకళా ప్రపూర్ణుడు. షోడశకళలనేవి ఈ శరీరంలోనే ఉన్నాయి. ప్రశ్నోపనిషత్తులోని ఆరవ ప్రశ్నలో

1. ప్రాణము	5. అగ్ని	9. మనస్సు	13. వేదమంత్రాలు
2. శ్రద్ధ	6. జలము	10. అన్నము	14. కర్మలు
3. ఆకాశము	7. భూమి	11. బలము	15. లోకాలు
4. వాయువు	8. ఇంద్రియాలు	12. తపస్సు	16. ప్రాణులపేర్లు

వీటన్నింటికీ ముఖ్య ప్రాణరూపంలో పరమేశ్వరియే అధిపతి. అందుచేతనే కళానాథా అనబడుతున్నది.

614. కావ్యాలాపవినోదినీ

వాల్మీకి మొదలైన కవులచే రచింపబడిన పద్దెనిమిది లక్షణాలు గల కావ్యాలు, దశవిధ రూపకాల ఆలాపనచే సంతసించునది. దోషరహితములై, గుణాలంకార సహితములై రసవ్యంజకములైన శబ్దార్థములు కావ్యములనబడతాయి.

1. నగర	6. సూర్యోదయ	11. విప్రలంభము	16. యుద్ధం
2. సముద్ర	7. ఉద్యానవన	12. వివాహము	17. ప్రయాణం
3. శైల	8. మధుపాన	13. కుమారోదయం	18. నాయికాభ్యుదయం
4. ఋతు	9. రతి	14. మంత్రం	
5. చంద్రోదయ	10. జలక్రీడ	15. ద్యూతం	

ఇవి కావ్యంలో ఉండే 18 రకాల వర్ణనలు.

దశవిధరూపకాలు :

1.	నాటకము	– వీర శృంగార రసాలలో ఒకదానికి మాత్రమే ప్రాధాన్యము.
2.	ప్రకరణము	– శృంగార రస ప్రాధాన్యము
3.	భాణము	– శృంగార వీరరసములు సూచన మాత్రము
4.	ప్రహసనము	– హాస్యరస ప్రధానము
5.	డిమము	– దేవగంధర్వ పిశాచాదులు నాయకులు
6.	వ్యాయోగము	– వీరరస ప్రధానము
7.	సమవాకారము	– వీరరస ప్రధానము
8.	వీధి	– శృంగార రసము సూచనా మాత్రము
9.	అంకము	– కరుణరస ప్రధానము
10.	ఈహామృగము	– శృంగార రసానికి రసాభాస.

ఇక్కడ వీటి ప్రాముఖ్యత ఏమీలేదు. కాబట్టి వీటిని వివరించటం అనవసరం.

పరమేశ్వరి తన ఆస్థానంలోని వశిన్యాది వాగ్దేవతలు చేసే వేదాంతవిచారము, రహస్య నామాలాపము, సంగీతాలాపములను వింటుంది. కాబట్టి కావ్యాలాపవినోదినీ అనబడుతుంది.

615. సచామరరమావాణీసవ్యదక్షిణ సేవితా

లక్ష్మీ, సరస్వతులు కుడి ఎడమలందుండి వింజామరలచేత వీస్తూ పరమేశ్వరిని సేవిస్తుంటారు. సర్వైశ్వర్యప్రదాయిని అయిన లక్ష్మీదేవి, సర్వజ్ఞానమయి అయిన సరస్వతీదేవి ఇద్దరూకూడా హృదయపూర్వకంగా, భక్తి ప్రపత్తులతో ఆ దేవిని సేవిస్తుంటారు.

616. ఆదిశక్తిః

సమస్త జగత్తులనూ సృష్టించేది కాబట్టి ఆదిశక్తి. ఇచ్ఛాశక్తి స్వరూపురాలు. జగత్సృష్టికి కారణమైనది. సకలసృష్టికీ కారణమైన మొదటి శక్తి. మాయాశబలితరూపము. ఈ జగత్తును సృష్టించాలి అనుకుని పరమేశ్వరుడు తనను తాను రెండుగా విభజించుకున్నాడు. ఆ సమయంలో పరబ్రహ్మ నుంచి బయటకు వచ్చినదే శక్తి. అదే మాయాస్వరూపము. నామరూపాత్మకమైన జగత్తు అంతా ఆ శక్తినుంచే ఆవిర్భవించింది. అన్ని శక్తులూ దానిలోనే ఉన్నాయి. కాబట్టి అది మూలశక్తి. అన్నింటికీ చైతన్యరూపమైన ముఖ్యప్రాణశక్తి. ఐశ్వర్యప్రదాయిని అయిన లక్ష్మికి, విజ్ఞానప్రదాయిని అయిన సరస్వతి కూడా మూలశక్తి అదే ఆదిశక్తి.

617. అమేయాత్మా

అమేయము – కొలవటానికి వీలు కానిది. పరమేశ్వరిని కొలవటం వీలుకాదు. ఆమెకు మించినదిగాని, ఆమెతో సమమైనదిగాని ఇంకేదీ ఈ జగత్తులో లేదు. లింగపురాణంలో చెప్పినట్లుగా చతుర్దశభువనాలలోను, ఈ బ్రహ్మాండమంతటిలోనూ కొలవదగినది ఆ పరమేశ్వరి రూపమే. కొలిచేవాడు ఈశ్వరుడు అంతేకాని వేరెవరూకాదు.

ఆత్మ అంటే – జీవుడు. అగ్నిలో నిప్పురవ్వలు ఏరకంగా ఉంటాయో, అలాగే పరమేశ్వరునిలో ఈ జీవులందరూ ఉంటారు. శివుని యొక్క ఎనిమిదవ మూర్తి ఆత్మ. ఇది మిగిలిన ఏడు మూర్తులను వ్యాపించి ఉన్నది కాబట్టి విశ్వమంతా వ్యాపించి ఉన్నది అని అర్థం.

ఆత్మ అంటే – పరబ్రహ్మమే. ఆ పరబ్రహ్మయే జీవులన్నింటి యందు బ్రహ్మరంధ్రం గుండా ప్రవేశించాడు అని చెప్పటం జరిగింది.

ఆత్మ అనేది **అణోరణీయాం మహతోమహీయాం** అణువుకన్న చిన్నదైనది. మహత్తు కన్న పెద్దదైనది. ఆది మధ్యాంతములు లేనిది. సృష్టిస్థితిలయాలకు కారణభూతమైనది, నిరాకారమైనది, నిర్గుణమైనది, అన్నింటికీ సాక్షీభూతమైనది, జీవులు చేసిన కర్మలకు తగిన ఫలితాన్ని ఇచ్చేది, సత్యము, నిత్యము అయినది, జ్ఞానమయమైనది, అనంతమైనది, అపరిచ్ఛిన్నమైనది, ఆనందమయమైనది, స్వతంత్రము, స్వతఃసిద్ధము, స్వతః ప్రమాణము గలది, నిర్మలము, నిశ్చయము, శుద్ధము, అనంతము అయినది. ఇదే ఆత్మ. ఆత్మ అంటే – పరబ్రహ్మమే.

ఆత్మ అనేది అమేయము. ఇది సర్వవ్యాప్తి. ఈ జగత్తంతా వ్యాపించి ఉన్నది కాబట్టి దీన్ని కొలవటానికి వీలులేదు. ఆత్మను తెలుసుకోవటం కష్టము. ఇంద్రియాలచేత ఇది తెలుసుకోబడదు. ఆత్మ ఉండే చోటికి కనులుగాని, చెవులుగాని మనస్సుగాని పోలేవు. ఇంద్రియాలకు అతీతమైనది. ఇంద్రియాలకు ఆ శక్తినిచ్చేదే ఆత్మ. కళ్ళకు చూసే శక్తిని ఇచ్చేది ఆత్మ. చెవులకు వినికిడి శక్తిని ఇచ్చేది ఆత్మ. మనసుకు ఆలోచించే శక్తిని ఇచ్చేది ఆత్మ. ఈ రకంగా ఇంద్రియాలకు వాటిశక్తినిచ్చేదే ఆత్మ.

కాబట్టి ఆత్మను ఇంద్రియాల ద్వారా తెలుసుకోలేము. అందుకే అది ఆమేయాత్మా అనబడుతున్నది.

618. పరమా

పరం అంటే – బ్రహ్మ అని అర్థం. అతడే శివుడు. పరబ్రహ్మ నాలుగు రూపాలు కలిగి ఉంటుంది. వాటిలో

మొదటిరూపము	–	పురుషుడు
రెండవరూపము	–	వ్యక్తము
మూడవరూపము	–	అవ్యక్తము
నాల్గవరూపము	–	కాలము

అని విష్ణుపురాణంలో చెప్పబడింది. వీటన్నింటికన్నా గొప్పది. అదే పరమేశ్వరి.

కార్యకారణములకన్న వేరైనది అయిన నిత్యశుద్ధ బుద్ధ ముక్త స్వరూపము పరమ అనబడుతుంది. నశించేటటువంటి దేహాదులచే నశించనిది. శ్రేష్ఠమైనది. వేదమందు చెప్పబడినది. లింగపురాణంలో

గౌరీరూపాణి సర్వాణి శరీరాణి శరీరిణాం
శరీరిణ స్తథా సర్వే శంకరాంశేౖ వ్యవస్థితా ॥

ప్రపంచలోని జీవరాశి అంతా పరమేశ్వరి యొక్క అంశమే. అందులోని చైతన్యము శంకరాంశ.

ఈ జగత్తును అందంగా ప్రకాశింపచేసే తత్త్వమే పరమా అనబడుతుంది.

619. పావనాకృతిః

పవిత్రమైన శరీరము గలది. సచ్చరిత్ర గలది. జ్ఞానము గలది. తపస్సు, జ్ఞానము, విద్య, బుద్ధి అనేవి జీవిని పవిత్రుడుగా చేస్తాయి.

పరమైనదంతా పావనమైనదే. జగత్తులో పవిత్రమైనవన్నీ ఒక ఆకారం ధరిస్తే, ఆ స్వరూపమే పరమేశ్వరి. శ్రేష్ఠమైన వాటి సముదాయమే పరమేశ్వరి. కేవలము దర్శనమాత్రంచేతనే భక్తులను పవిత్రులుగా చేస్తుంది. అటువంటి స్వరూపం గలది. ఆ పరమేశ్వరి రూపాన్ని దర్శించి ధన్యత చెందాలని అనేకానేకులు ఎదురుచూస్తుంటారు. అంటే దర్శనమాత్రంచేతనే ఆమె భక్తుల పాపాలను నాశనం చేస్తుంది. వారికి ముక్తి లభిస్తుంది. అభీష్టసిద్ధి గలుగుతుంది. అందుచేతనే ఆ పరమేశ్వరి 'పావనాకృతిః అని చెప్పబడింది.

620. అనేకకోటి బ్రహ్మాండజననీ

అనంతమైన – లెక్కించటానికి సాధ్యం కానటువంటి బ్రహ్మాండాలను సృష్టించినది. ఆ బ్రహ్మాండాలకు తల్లి.

స్థూలమైన పంచభూతాల చేరికయే బ్రహ్మాండము. ఆ బ్రహ్మాండాభిమాని విరాడ్రూపుడు. ఆ విరాడ్రూపుని సృష్టించినది, అతనికి తల్లి. వేదంలో విరాట్పురుషుడు బ్రహ్మాండానికి ఆత్మ, స్వరాట్ స్వరూపము అని చెప్పబడింది. అంటే బ్రహ్మాండానికి ఆత్మ, శరీరము అయిన విరాట్, స్వరాట్‌లను దేవతలకు తల్లి.

ఇన్నికోట్ల బ్రహ్మాండాలను సృష్టించిన పరమేశ్వరి, మనం నివసించే ఈ జగత్తు దిక్పాలకులతో, సూర్య చంద్రాది గ్రహాలతో, త్రిమూర్తులు, త్రిశక్తులు మొదలైన వారితో నిండి ఉన్నది. ఈ రకంగా ఉన్న స్థావరజంగమాత్మకమైన జగత్తే ఒక బ్రహ్మాండము. ఇటువంటివి అనేక కోటిబ్రహ్మాండాలను సృష్టించింది ఆ దేవి.

మహాసంకల్పంలో

మహాజలౌఘస్య మధ్యే పరిభ్రమమాణానాం

అనేకకోటి బ్రహ్మాండానాం ఏకతమే

మహా జలరాశి నడుమ పరిభ్రమిస్తున్నటువంటి అనేక కోట్ల బ్రహ్మాండాలయందు ఒకదానిలో మనము ఉన్నాము. మనమున్నది భూలోకం. దీని క్రింద ఏడు లోకాలున్నాయి. అలాగే పైన ఆరులోకాలున్నాయి.

అతల వితల సుతల తలాతల రసాతల మహాతల

పాతాళ సప్తలోకానాం ఉపరితలే.......

భూ, ర్భువ, స్సువ, ర్మహ, ర్జన, స్తప, స్సత్య మితి సప్తలోకానాం అథోభాగే......


అని చెప్పబడింది. మనం ఎలా ఉన్నామో ఆ లోకాల వారు కూడా అలాగే ఉంటారు. సైన్సు ప్రకారం ఇతర గ్రహాలలో కూడా నీరున్నది. అక్కడ జీవులు నివసించే ఛాయలున్నాయి. కాబట్టి మనకు తెలియనివి, కంటికి కనిపించనివి అనేక లోకాలున్నాయి. వాటన్నింటినీ సృష్టించినది పరమేశ్వరి. అందుచేతనే ఆమె 'అనేకకోటి బ్రహ్మాండజననీ' అనబడుతోంది.

621. దివ్యవిగ్రహా

దివ్యమైన రమణీయమైన దేహము గలది. దివ్యము అంటే – ఆకాశము. విగ్రహము – దేహము. ఆకాశమువలె విస్తారమైన దేహము గలది. చరాచరజగత్తునంతా ఆక్రమించినది.

దేవతలకు సహజమైన ప్రకాశము గలది. **ఉమా హైమవతీం బహుశోభమానాం** అని చెప్పబడింది. అలాగే పరమేశ్వరి స్వరూపాన్ని వివరిస్తూ **నిజారుణ ప్రభాపూర మధ్యద్బ్రంహ్మాండ మండలా** ఈ రకంగా దేవి ప్రకాశిస్తుంటుంది. అని చెప్పటం జరిగింది. అందుచేతనే ఆమె దివ్యవిగ్రహా అనబడుతోంది.

ఈ రకంగా దాక్షాయనీ విద్యను వివరించటం జరిగింది. ఇదే పరమేశ్వరి ఉపాశ్యరూపము.



శ్రీ 'గ'కార దేవి

42. లోపాముద్ర విద్య

పంచదశీ మహామంత్రాన్ని జపించి తరించినవారు పన్నెండుమంది మహానుభావులు అని గతంలో చెప్పటం జరిగింది. వారిలో లోపాముద్ర ఒకరు. ఈమె అగస్త్యుని భార్య. అగస్త్యుడు హయగ్రీవుని దగ్గర శ్రీవిద్యను ఉపదేశం పొందాడు. శ్రీవిద్య హాదివిద్య కాదివిద్య అని రెండు విధాలుగా ఉన్నది. పంచదశి మహామంత్రం హకారంతో మొదలయితే హాదివిద్య. కకారంతో మొదలయితే కాదివిద్య. లోపాముద్ర ఉపాసించిన మంత్రం హాదివిద్య. పైన చెప్పిన పన్నెండుమందీ శ్రీవిద్యను పన్నెండువిధాలుగా ఉపాసించారు. వీటిలో హాదివిద్య, కాదివిద్య రెండే శ్రేష్టమైనవి. కాగా హాదివిద్యలో లోపాముద్ర ఉపాసనచేసిన మంత్రం శ్రేష్ఠమైనది.

పరమేశ్వరి క్లీంకార బీజస్వరూపురాలు. క్లీంకారము మహాసమ్మోహనము. ఆమెను ఉపాసించినట్లైతే ముల్లోకాలూ వశమవుతాయి. పరమేశ్వరి మహామంత్రం గుహ్యాతి గుహ్యమైనది. అంటే అతి రహస్యమైనది. ఆమెను అర్చిస్తే వచ్చే ఫలం కైవల్యము. అదే సాయుజ్యం. ఆమె ఆదియైనది. అంటే సృష్టి ప్రారంభంకాకముందు నుంచీ ఉన్నది. జగత్తంతా శూన్యంగా ఉన్నప్పుడు ఆమె ఉన్నది. త్రిమూర్తులను, త్రిశక్తులను కూడా ఆమె సృష్టించింది. అందుచేతనే మానవులే కాదు దేవతలు కూడా ఆమెకు నమస్కరిస్తారు. ఆమె త్రిమూర్తి స్వరూపం గలది. దేవతలచే పూజించబడుతుంది. మనకు కావలసిన వాగ్భవ, కామరాజ, శక్తిబీజాలే ఆ దేవత మంత్రం. సుగంధద్రవ్యాలు కలిపిన హరిచందనం లేపనం గావించబడుతుంది. పాపిట సింధూరం ధరించి ఉంటుంది. ఆవిడే ఉమాదేవి. హిమవంతుని కుమార్తె. శుంభ నిశుంభులతో బాధలు పడలేక దేవతలు హిమాలయాలకు వెళ్ళి ఉమాదేవినే ప్రార్థించారు.

ఆ ఉమాదేవి గౌరవర్ణం గలది కాబట్టి గౌరి అనబడుతోంది. ఆమెను గంధర్వులు సేవిస్తూ ఉంటారు. సృష్టి స్థితి లయాలకు కారణం ఆమె. ప్రళయకాలంలో ఈ సృష్టి మొత్తాన్ని తన కడుపులో దాచుకుని, జీవుల కర్మలు పరిపక్వం చెందిన తరువాత మళ్ళీ వారిని బయటకు పంపుతుంది. ఆవిడే వాగధీశ్వరి అనబడుతుంది.

ఆమెను తెలుసుకోవాలంటే ధ్యానమే మార్గము. ఆమె ఇటువంటిది అని చెప్పటానికి వీలులేనటువంటిది. అనంతమైనది. జగత్తంతా ఆమె రూపమే. ఆమెను అర్చించిన భక్తులకు జ్ఞానాన్ని ప్రసాదిస్తుంది. ఆ పరమేశ్వరి జ్ఞానస్వరూపిణి. ఉపనిషత్తుల సారమే ఆమె

రూపము. సత్యము నిత్యము ఆనందమయము. సంకల్పమాత్రంచేతనే లోకాలను సృష్టిస్తుంది. ఆమెను కంటితో చూడలేము. ఇతర ఇంద్రియాలతో తెలుసుకోలేము. ఆమె తప్పించి ఇంకా తెలుసుకోవలసినది ఏదీలేదు. ఆ పరమేశ్వరి యోగిని స్వరూపం గలది. తన భక్తులకు యోగాన్నిస్తుంది. వారు యోగము అనుభవించే సాధనం కూడా చూపుతుంది. యోగముచేతనే అంటే జీవాత్మ పరమాత్మల సామరస్యంచేతనే ఆనందం పొందుతుంది. ఆమె కాలస్వరూపిణి. ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులరూపము ఆమె. అన్నిలోకాలకు ఆధారమైనది ఆమె. సత్తు ఆమె, అసత్తు ఆమె. ఆ దేవియే అష్టమూర్తి. అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తుంది. లోకాలను సక్రమంగా నడిపిస్తుంది. ఆమె ఏకాకి. ఆమెకు ఎవరూ లేరు. అందరికీ ఆమే ఉన్నది. ఆమె పరబ్రహ్మ స్వరూపము. రెండవది ఏదీ లేనటువంటిది. ద్వైతాన్ని వర్జించినది. అంటే జీవాత్మ పరమాత్మ రెండూ ఒక్కటేనని భక్తులకు సాయుజ్యం ప్రసాదిస్తుంది.

ఈ విషయాలను 622 నుండి 669 నామాల వరకు వివరించటం జరిగింది.

622. క్లీంకారీ

క్లీం అనేది కామరాజబీజము. క్లీం అంటే శివకాముడు. అతని భార్య శివకామేశ్వరి. క్లీం కారబీజస్వరూపురాలు. హ్రీం అనేది భువనేశ్వరి బీజమని అది ప్రత్యేకమైన మంత్రమని చెప్పటం జరిగింది. అలాగే క్లీం కూడా ప్రత్యేకమైన మంత్రము. పరమేశ్వరి సర్వసమ్మోహన విగ్రహం అందరినీ ఆకర్షిస్తుంది. సర్వజనులను వశీకరణం చేస్తుంది. క్లీం కామరాజబీజం. సృష్టిని కామించినవాడు, సృష్టి చెయ్యాలి అనుకున్నవాడు ఈశ్వరుడు. కాబట్టి అతడు శివకామేశ్వరుడు. అతని భార్య లేక అతని శక్తి కాబట్టి ఆ దేవి క్లీంకారీ అనబడుతుంది.

623. కేవలా

అన్నిరకాలయిన ధర్మాలను వదలివేయుటవలన ఒంటరిగా ఉంటుంది. కాబట్టి కేవలా అనబడుతుంది. ఏ ధర్మములు లేనటువంటిది. ధర్మాధర్మ వివర్జితా. పరమేశ్వరికన్న భిన్నమైన పదార్థం ఏదీలేదు. కాబట్టి ఆమెకు ధర్మాధర్మాలు ఉండవు. అందుకే ఆమె ఏకాకి. సజాతీయలుగాని, విజాతీయులుగాని ఎవరూ లేనట్టిది. కేవలము శుద్ధ బ్రహ్మ స్వరూపమైనట్టిది. ఈంకారము పరమేశ్వరి బీజం. దీనివల్లనే మోక్షం వస్తుంది. కేవలము ఈంకారము వల్లనే అది జరుగుతుంది. కాబట్టి ఆమె కేవలా అనబడుతుంది.

624. గుహ్యా

మిక్కిలి రహస్యమైనది. గృహను ప్రవేశించినది గుహ్యా. కంటికి కనిపించదు. రహస్యాతి రహస్యము. పరమేశ్వరి సూక్ష్మరూపమైన మంత్రము అతి రహస్యము. అందుకే త్రిశతి ఫలశృతిలో 'తల్లి జారిణి అని తెలిసినప్పుడు, ఆ విషయాన్ని ఎంత జాగ్రత్తగా దాచుకుంటావో, శ్రీవిద్యను కూడా అంత రహస్యంగా ఉంచాలి అని చెప్పబడింది. శ్రీవిద్య అంత రహస్యమైనది.

రాజ్యం దేహి శ్రియం దేహి న దేహి షోడశాక్షరీ

ధన ధాన్యాలు ఇచ్చెయ్యి, రాజ్యాలు దానం చెయ్యి. కాని షోడశిమంత్రాన్ని మాత్రం చెప్పవద్దు అది గోప్యం. అంటే ఎవరికీ చెప్పవద్దని కాదు. అర్హత లేనివారికి చెప్పవద్దు.

పరమేశ్వరి హృదయమనే గుహలో పదిలంగా రహస్యంగా ఉన్నది. పంచకోశాలయందు రహస్యంగా ఉన్నది. కాబట్టి గుహ్యా అనబడుతుంది.

625. కైవల్యపదదాయినీ

కేవలము ఒక స్వభావము మాత్రమే ఉండేది. గుణరహితమైనది. ఇది ఐదవముక్తి. షట్చక్రాలలో పరమేశ్వరిని అర్చించే వారికి అంటే అంతరారాధనాపరులకు ముక్తి కలుగుతుంది. అయితే ఒక్కొక్క చక్రంలో ఒక్కొక్క రకమైన ముక్తి కలుగుతుంది.

ఆధారస్వాధిష్ఠానాలు అంధకార బంధురాలు. ఇక్కడ పరమేశ్వరిని అర్చించే వారికి ముక్తి ఉండదు. వీరికి ఐహికవాంఛలపైననే ఆసక్తి. ఇక ఆ పరమేశ్వరిని

1. మణిపూరంలో అర్చించే వారు – సార్ష్టిరూపముక్తి పొందుతారు. అంటే దేవి పురమునకు దగ్గరగా ఇంకొకపురము నిర్మించుకుని అక్కడ ఉంటారు.

2. అనాహతంలో అర్చించేవారు – సాలోక్యముక్తి పొందుతారు. వీరు దేవి పట్టణంలోనే ఒక మూల నివశించగలుగుతారు.

3. విశుద్ధి చక్రంలో అర్చించేవారు – సామీప్యముక్తి పొందుతారు. అంటే దేవికి అతి దగ్గరగా సేవకులుగా ఉంటారు.

4. ఆజ్ఞాచక్రంలో అర్చించేవారు – సారూప్యముక్తి పొందుతారు. వీరు వేరే దేహము ధరించి దేవితో సమానమైన రూపంలో ఉంటారు.

5. సహస్రారంలో అర్చించేవారు – సాయుజ్యం పొందుతారు. ఇది శాశ్వతమైన ముక్తి. వీరి జీవాత్మ పరమాత్మలో లీనమవుతుంది.

ఏ రకమైన మార్పులూ లేకుండా స్వరూపమాత్రంతో ఉండే చిచ్ఛక్తియే కైవల్యము. వేదంలో 'అరణ్యంలో తపస్సు, శ్రద్ధ గలిగి విద్వాంసులు శాంతస్వరూపులై భిక్షాటనాపరులై ఉండేవారు, పరమాత్మ ఉండే చోటికి సూర్యద్వారం గుండా వెళతారు. అది అర్చిరాదిమార్గము.

బ్రహ్మలోకానికి పోయే మార్గం అతి కాంతియైన బింబముతో కప్పబడి ఉంటుంది. ఆ కాంతిని మనం చూడలేము. అందుకే సాధకుడు ఆ కాంతిబింబాన్ని కొద్దిగా తొలగించి బ్రహ్మలోకానికి దారి చూపమని వేడుకుంటాడు.

హిరణ్మయేన పాత్రేణ సత్యస్యా పిహితం ముఖం
తత్త్వం పూష న్నపావృణు సత్యధర్మాయ దృ ష్టయే.

ఓ సూర్యభగవానుడా ! సర్వమూ నీకు తెలుసునయ్యా ! గగన వీధిలో ఒంటరిగా ప్రయాణించే ఓ బాటసారీ ! నీ తేజోమయమైన కాంతి పుంజాన్ని కొద్దిగా తగ్గించినట్లైతే బ్రహ్మలోకమార్గం నాకు కనపడుతుంది. కాబట్టి నీ కాంతిని కొద్దిగా ఉపసంహరించుకో అంటూ జ్యోతిరూపమైన సూర్యుణ్ణి ప్రార్థిస్తున్నారు.

పరమేశ్వరిని అర్చించినవారికి కేవలము ఇహమే కాకుండా పరము కూడా లభించింది.

కైవల్యము అంటే తురీయాతీతము. మనోవృత్తులు శాశ్వతముగా వదలటమే మోక్షము. ఐహికబంధనాల నుండి విముక్తి పొందటమే ముక్తి. అదే సాయుజ్యము.

తన భక్తులకు మోక్షం ప్రసాదిస్తుంది. వేదంలో చెప్పినట్లుగా, కర్మలు చేస్తూ ఉండేవారికి చంద్రలోకం ప్రాప్తిస్తుంది.

ఇతర దేవతల ఉపాసన చేసేవారికి – సూర్యమండలం లభిస్తుంది.

శ్రీ విద్యోపాసకులుకు బ్రహ్మజ్ఞానము లభిస్తుంది. అంత్యకాలంలో మోక్షము కూడా లభిస్తుంది.

విద్యలు రెండు రకాలు 1. అపరావిద్య 2. పరావిద్య. అపరావిద్య కేవలము ఐహికపరమైనది. ఈ విద్యను ఉపాసించేవారు లౌకికమైనవన్నీ పొందుతారు. పరావిద్య

నిత్యము సత్యము, శాశ్వతమైనది అయిన పరబ్రహ్మను చేరుస్తుంది. పరావిద్యోపాసకులు మోక్షవాదులు అదే వీరి లక్షణం. దానికోసం శరీరాన్ని శుష్కింపచేసి, నియమనిష్ఠలతో కాలంగడుపుతూ, మనసా వాచా కర్మణా పరమేశ్వరినే ధ్యానించేవారికి ముక్తి లభిస్తుంది.

జీవి తను చేసిన కర్మల ఫలితాలను అనుభవించాలి. కర్మ శేషం లేనివారికి అతి త్వరలో ముక్తి లభిస్తుంది.

ఈ రకంగా సాధకుల యొక్క కర్మను బట్టివారికి కైవల్యము ప్రసాదిస్తుంది.

కైవల్యము కేవలము జ్ఞానఫలం. తైత్తిరీయంలో "ఈ విషయాలు తెలుసుకున్నవాడు సూర్యుడు ఉత్తరాన ఉండగా మరణిస్తే అతడు సూర్యునితో సాయుజ్యం పొందుతాడు. సూర్యుడు దక్షిణాన ఉన్నప్పుడు మరణిస్తే పితురుల మహిత పొంది చంద్రునితో సాయుజ్యం పొందుతాడు. ఈ రెండూ కాకుండా పరబ్రహ్మను గురించి తెలుసుకుంటే అతడు బ్రహ్మపదం పొందుతాడు" అని చెప్పబడింది. కేవలము కర్మలను మాత్రమే చేసేవాడు చంద్రలోకం పొందుతాడు. కర్మలన్నింటినీ పరిత్యజించి పరబ్రహ్మను ధ్యానించేవాడు బ్రహ్మలోకం పొందుతాడు. ఈ రకంగా జీవుల కర్మలను బట్టి వారికి మోక్షాన్ని ప్రసాదిస్తుంది. కాబట్టే ఆమె కైవల్యపదదాయనీ అనబడుతోంది.

626. త్రిపురా

శరీరంలో ఇడ పింగళ సుషుమ్నలు మూడు ముఖ్యనాడులు. ఈ నాడులనే త్రిపురములు అంటారు. అలాగే మనస్సు, బుద్ధి, చిత్తము త్రిపురములు. ఆ ప్రదేశాలలో ఉండటంచేత దేవికి త్రిపుర అని పేరు వచ్చింది. ఈ త్రయములు అన్నీ ఎవరివల్ల కలిగాయో ఆమె త్రిపుర. లోకంలో మూడుగా చెప్పబడేవన్నీ త్రిపురములే.

త్రిమూర్తులకన్న కూడా పురాతనమైనది. త్రిమూర్తులను కూడా ఆమె సృష్టించింది. కాబట్టి త్రిపురా అనబడుతోంది. తత్త్వాలకు అతీతమైనది. ఈ జగత్తు అంతా తత్త్వముల చేతనే ఆవిర్భవించింది. **తత్త్వాతీతంచ బైందవమ్.** శ్రీచక్రంలో ఈ తత్త్వాలకు అతీతంగా బిందువున్నది. ఆ బిందువలోనే పరమేశ్వరి ఉంటుంది. అంటే ఆ దేవి తత్త్వాలన్నింటికీ అతీతమైనది కాబట్టే త్రిపురా అనబడుతోంది.

బ్రహ్మతత్త్వమే – స్థూలశరీరాభిమాని అయిన ఆత్మతత్త్వముగ సూక్ష్మశరీరాభిమాని అయిన విద్యాతత్త్వముగ, కారణశరీరాభిమాని అయిన శివతత్త్వముగ ఉన్నాడు. అవే త్రిపురములు. లఘుస్తవంలో

దేవానాం త్రితయం త్రయీ హుతభుజాం శక్తిత్రయం త్రిస్వరా
త్రై లోక్యం త్రిపదీ త్రిపుష్కరమథో త్రిబ్రహ్మ వర్ణా స్త్రయః
య త్కించి జ్జగతి త్రిధా నియమితం వస్తు త్రివర్గాత్మకం
త త్సర్వం త్రిపురేతి నామ భగవ త్యన్వేతి తే తత్త్వతః ॥

బ్రహ్మ విష్ణు రుద్రులు, ఆహవనీయ, గార్హపత్య, దక్షిణాగ్నులు, ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు, వామజ్యేష్ఠరౌద్రులు, ఉదాత్తము అను దాత్తము స్వరితాలు. భూలోకభువర్లోక సువర్లోకాలు, స్వర్గమర్త్యపాతాళాలు, గంగాయమున సరస్వతులు, త్రిబ్రహ్మలు, త్రివర్ణములు, అకారఉకారమకారాలు. ఈ రకంగా మూడుగా ఉన్నవన్నీ త్రిపుటి. అదే త్రిపుర. వాటి స్వరూపమే కాబట్టి ఆమె త్రిపురా అనబడుతుంది.

627. త్రిజగద్వంద్యా

త్రిభి ర్జగద్భి ర్వంద్యా

ముల్లోకములచే నమస్కరించబడునది. జగత్తు అంటే కేవలము చెట్లుపుట్టలుకాదు. అందులో ఉండే సమస్తజీవజాలము. ఆ దేవి భూలోక భువర్లోక సువర్లోకాలలో ఉండే వారందరితోనూ నమస్కరింపబడేది.

మనకు కనిపించే మానవులే కాకుండా యక్ష కిన్నెర కింపురుష సిద్ధ సాధ్య గంధర్వాదులచేత కూడా నమస్కరింపబడునది. దేవ దానవులచే నమస్కరింపబడేది. అందుకే ఆ పరమేశ్వరి 'త్రిజగత్‌వంద్యా' అనబడుతోంది.

628. త్రిమూర్తిః

త్రిమూర్తి – మూడు సంవత్సరములు గల కన్య. ఎరుపుతెలుపు కలిసిన రంగుగలది.

బ్రహ్మ విష్ణు మహేశ్వరులు, వామ జ్యేష్ఠ రౌద్రి, ఇచ్ఛా జ్ఞాన క్రియా శక్తులు. ఇవన్నీ పరమేశ్వరికి సంబంధించినవే కాబట్టి ఆమె త్రిమూర్తి అనబడింది. వరాహపురాణంలో "బ్రహ్మ ఈరకంగా శివునకు చెప్పి విష్ణువును స్మరించాడు. అప్పుడు విష్ణువు వారిద్దరి మధ్యనా ప్రత్యక్షమైనాడు. ఆ సమయాన వారు ముగ్గురూ ఒకటై పరస్పరం చూసుకున్నారు. ఆ దృష్టి నుండి దివ్యరూపమైన కన్యకామణి పుట్టింది. ఆమె నలుపు, తెలుపు పీతవర్ణాలు కలిగి ఉన్నది. ఆ బాలిక వారితో "నేను భగవద్దృష్టితో పుట్టాను నేను సర్వశక్తిసమన్వితమైన పరమేశ్వరిని" అని చెప్పింది.

కాబట్టి పరమేశ్వరి త్రివర్ణములు కలిగిఉన్నది. ఆమె త్రిమూర్తి. ఆ పరమేశ్వరి శ్వేతవర్ణం గలిగి సత్వగుణంతో బ్రహ్మనిష్ఠురాలుగా, రక్తవర్ణం గలిగి రజోగుణంతో వైష్ణవిగా, పసుపువర్ణం గలిగి తమోగుణంతో రౌద్రిగా పిలువబడుతుంది. పరమాత్మ ఒక్కడే అయినప్పటికీ మూడురకాలుగా త్రిమూర్తులుగా ఉన్నట్లుగానే, దేవి ఒక్కతే అయినప్పటికీ ప్రయోజనం కోసం మూడువిధాలవుతున్నది.

దేవీభాగవతంలో

శాంభవీ శుక్లరూపా చ శ్రీవిద్యా రక్తరూపికా ।
శ్యామలా శ్యామరూపాస్యా ది త్రేతా గుణశక్తయః

శాంభవి	–	తెలుపు రంగు
శ్రీవిద్య	–	ఎరుపు రంగు
శ్యామ	–	నలుపు రంగు అని చెప్పబడింది.

629. త్రిదశేశ్వరీ

దేవతలకు ఈశ్వరి. మూడు అవస్థలకు ఈశ్వరి. పదముగ్గురువిశ్వేదేవతలకు ఈశ్వరి. ముప్పైమూడుగుణాలకు ఈశ్వరి.

త్రిదశులు – బాల్య కౌమార యవ్వన వార్ధక్యములనబడు దశలలో ఎల్లప్పుడూ మూడవదశయందే ఉండేవారు – దేవతలు.

ధర్ముడు అనేవాడు ఒక మనువు. అతడికి పదిమంది భార్యలు. అందులో విశ్వ అను భార్యకు పుట్టినవారు విశ్వేదేవతలు.

దేవతలకు, విశ్వేదేవతలకు కూడా ఈశ్వరి ఆ పరమేశ్వరి. జాగ్రస్వప్నసుషుప్తులందు మార్పులేని శరీరాభిమాని అయిన దేవత. సృష్టిస్థితిలయాలనబడే మూడుదశలకు ఈశ్వరి. 33 మంది దేవతలకు ఈశ్వరి. వీరు

ఏకాదశరుద్రులు	11
ద్వాదశాదిత్యులు	12
అష్టవసువులు	8
ఇంద్రుడు, ప్రజాపతి	2
మొత్తం	33 మంది

యజ్ఞాలలో హవిర్భాగంతీసుకునేది వీరే.

630. త్ర్యక్షరీ

వాగ్బీజము, కామరాజ బీజము, శక్తిబీజము. ఈ మూడింటి యొక్క సమూహము.

త్ర్యక్షరీ – **శుద్ధవిద్యాకుమారీచ**

శుద్ధవిద్యా మంత్రస్వరూపిణి అని, బాలామంత్రస్వరూపురాలని, త్రివర్ణ మంత్రస్వరూపిణి అని చెప్పవచ్చును.

ఐం	–	వాగ్భవబీజము
క్లీం	–	మన్మథబీజము
సౌః	–	శక్తిబీజము

వామకేశ్వరతంత్రంలో

వాగీశ్వరీ జ్ఞానశక్తి ర్వాగ్భవే మోక్షరూపిణీ
కామరాజే క్రియాశక్తిః కామేశీ కామరూపిణీ
శక్తిబీజే పరాశక్తి రిచ్ఛైవ శివరూపిణీ
ఏవం దేవీ త్ర్యక్షరా తు మహాత్రిపురసుందరీ ॥

వాగీశ్వరి	జ్ఞానశక్తి	వాగ్భవబీజం	మోక్షప్రదం
కామేశి	క్రియాశక్తి	కామరాజబీజం	కామరూపిణి
శివరూపిణి	ఇచ్ఛాశక్తి	శక్తిబీజం	పరాశక్తి

ఈ రకంగా త్ర్యక్షరియే మహాత్రిపురసుందరి అని చెప్పబడింది.

అక్షరత్రయవిభాగరూపిణి. యుగాక్షర, మాసాక్షర, నిత్యాక్షరములు అనే వీటి సమూహమే ఆ పరమేశ్వరి.

631. దివ్యగంధాఢ్యా

దివియందు పుట్టినవారు దివ్యులు వీరే దేవతలు. ఈ లోకంలో ఉండే రాజులా కాకుండా పరలోకములోని దివ్యుల సంబంధముతో నిండినది. అంటే దేవతలచేత సేవించబడేది.

మనోహరమైన హరిచందనము మొదలైన పరిమళద్రవ్యాలచే ఒప్పునది. గంధాష్టకముచే సేవించబడునది. గంధాష్టకము అంటే సువాసనలు వెదజల్లే ఎనిమిది పదార్థాలు విద్యార్థికల్పతరువులో అవి.

1. జాపత్రి	3. దాల్చినచెక్క	5. నాగకేసరములు	7. కస్తూరి
2. లవంగాలు	4. ఏలకులు	6. మిరియాలు	8. ఆకుపత్రి

అయితే వీటికి మతాంతరమున్నది.

1. చందనము	3. కర్పూరము	5. కుంకుమపువ్వు	7. జటామాంసి
2. అగరు	4. కచోరము	6. గోరోచనము	8. కుందురుష్కము

ఈ ద్రవ్యాలు కలిపిన గంధాన్ని దివ్యగంధము అంటారు. అటువంటి దివ్యగంధముచే అలంకరించబడినది.

632. సిందూరతిలకాంచితా

సిందూరము అంటే – ఎర్రని చూర్ణము, గోరోచనము సీమంతమందు సిందూర తిలకముచే భాసించునది. పాపటయందు సింధూరము ధరించునది. ఇది సౌభాగ్య చిహ్నము. పరమేశ్వరి స్వరూపాన్ని వివరిస్తున్నప్పుడు ఫాలభాగాన కస్తూరికా తిలకమున్నది అని చెప్పాం. **ముఖచంద్రకళంకాభామృగనాభ విశేషకా** ఇప్పుడు పాపిట సిందూరం ధరించింది అని చెబుతున్నారు. స్త్రీలచే పూజించబడినది. శ్రీకృష్ణపరమాత్ముని తమకు భర్తగా ఇమ్మని గోపికలంతా ఆ దేవిని పూజించారు.

633. ఉమా

ఉకారము శివుడు. మా అంటే పార్వతి. ఉమ అంటే శివశక్తులు అని అర్థం.

తారకాసుర సంహారం కోసం దేవతలు పరమేశ్వరిని ప్రార్థించారు. అప్పుడు ఆమె వారికి ప్రత్యక్షమై నా అంశతో హిమవంతునికి ఒక కుమార్తె పుడుతుంది. ఆమెను శివునకిచ్చి వివాహం చెయ్యండి. వారిద్దరికీ పుట్టిన కుమారుడు తారకుని సంహరిస్తాడు అని చెబుతుంది.

కొంతకాలానికి హిమవంతుని భార్య మేనక గర్భవతి అయి ఆడపిల్లను ప్రసవించింది. ఆ బాలిక దినదినప్రవర్ధమానమైంది. సర్వకాలసర్వావస్థలయందు శివనామాన్నే జపిస్తుండేది. రానురాను తాను శివుణ్ణి తప్ప వేరెవరినీ వివాహమాడను అని తేల్చి చెప్పింది. ఆ సమయంలో శివుడు విరాగియై తపోదీక్షలో ఉన్నాడు. అతణ్ణి భర్తగా పొందాలంటే తపస్సు ఒక్కటే మార్గం. అందుకని తపస్సు చెయ్యటానికి ఇంటి నుంచి బయలుదేరింది. అప్పుడు తల్లి అయిన మేనక కుమార్తెను వారిస్తూ ఉ – ఓయమ్మా, మా – వద్దు అన్నది. అప్పటి నుండీ ఆమెకు 'ఉమా' అనే పేరు సార్థకమై పోయింది.

ఉత్తమమైన చిత్తవృత్తి గలది. సూతసంహితలో పరానుభూతియు, సంసార పాపములను నశింపచేయునదియు, సదాశివుని కన్న మించిన శోభనసంపద గల ఉమ అను పేరు గల అనేక విధాలయిన వైభవముగల ఉత్తమ చిత్తవృత్తికి మ్రొక్కెదను అని చెప్పబడింది.

విష్ణు శివ బ్రహ్మ వాచకములైన అకార ఉకార మకారములతో కూడిన త్రిమూర్త్యాత్మకమైన ప్రణవస్వరూపిణి. అందుచేతనే ఉమా అంటే – దేవీ ప్రణవము అని చెప్పబడినది. లింగపురాణంలో శివుడు దేవితో 'అకార ఉకార మకారములు నా ప్రణవము. ఉకార మకార అకారములు నీ ప్రణవమందు గలవు' అంటాడు.

మహావాసిష్టంలో "ఓంకార సారశక్తి గలదగుటచే ఉమ అని కీర్తించబడింది" అని చెప్పబడింది. ఉమ అంటే చంద్రకళ. ఇది ముల్లోకాలలోను నిద్రించువారి మేల్కొనువారి హృదయాలను ప్రేరేపిస్తుంది.

శివసూత్రాలలో ఇచ్ఛాశక్తి ఉమాకుమారి అని చెప్పబడింది. యోగుల యొక్క ఇచ్ఛకు ఉమ అని పేరు, సింధువనమున ఉండే దేవత.

ఉమా అంటే – కాంతి అని అర్థం.

యా దేవీ సర్వభూతేషు కాంతిరూపేణ సంస్థితా

అన్ని జీవులయందు కాంతిరూపంలో ఉంటుంది.

కేనోపనిషత్తులో "ఒకసారి దేవదానవులకు భీకరయుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో దేవతలు విజయం సాధించారు. ఆ తరువాత వారందరూ ఒకచోట చేరి యుద్ధం ఏ రకంగా జరిగింది. తాము ఏ విధంగా విజయం సాధించాము అనే విషయాలను గాథలుగా చెబుతున్నారు. ఆ విజయానికి కారణం నేనే అని ప్రతివారూ చెబుతున్నారు.

అగ్నిదేవుడు అంటున్నాడు. "ఆ యుద్ధంలో నేను నిప్పులు కురిపిస్తుంటే రాక్షసులంతా మాడిమసి అయిపోయారు"

వాయుదేవుడు అంటున్నాడు " ఆయుద్ధంలో నేను చండప్రచండగా గాలులు వీస్తుంటే రాక్షసులు ఆ గాలులకు కొట్టుకుపోయారు"

పరబ్రహ్మతత్త్వం ఈ మాటలువిన్నది. దేవతలంతా గర్వించి ఉన్నారు వారికి జ్ఞానోదయం చెయ్యాలి అనుకున్నది. అనుకున్నదే తడవుగా వారి ఎదుట పెద్ద

భూతాకారంగా ప్రత్యక్షమైంది. దాన్ని చూసి భయపడ్డారు దేవతలు. ఆ భూతం ఏమిటో వారికి అర్థం కాలేదు. అప్పుడు వారు అగ్నిదేవుని దగ్గరకు వచ్చి, "ఓ దేవా ! నీ పరాక్రమం వల్లనే రాక్షసులను జయించగలిగాము. ఇప్పుడు ఆ భూతం ఏమిటో కనుక్కోవలసినది అన్నారు. సరేనన్నాడు అగ్నిదేవుడు. ఆ భూతాన్ని సమీపించాడు. అప్పుడు ఆ భూతం అగ్నిని చూసి ఎవరు నువ్వు ? అన్నది.

అగ్ని : నేను అగ్నిదేవుడను. జాతవేదుడు అంటారు నన్ను.

భూతం : నీ శక్తి ఏమిటి ?

అగ్ని : ఎటువంటి వస్తువునైనా క్షణాల్లో దహించివేస్తాను.

భూతం : అలా అయితే ఈ గడ్డిపరకను దహించు. అంటూ ఒక గడ్డిపరకను చూపించింది. అగ్నిదేవుడు శతవిధాల ప్రయత్నించాడు. గడ్డిపరక కసికందలేదు. అవమానంతో వెళ్ళిపోయాడు అగ్నిదేవుడు. ఆ తత్త్వం ఏమిటో తెలుసుకోవటం తనవల్ల కాలేదన్నాడు. దేవతలంతా ఈ సారి వాయువును ప్రార్థించారు. ఆ తత్త్వం ఏమిటో తెలుసుకోమని అర్థించారు. సరేనన్నాడు వాయువు. ఆ తత్త్వం దగ్గరకు వెళ్ళాడు. అప్పుడు ఆ భూతం వాయువుతో అన్నది.

భూతం : ఎవరు నువ్వు ?

వాయువు : నేను వాయుదేవుడను. ఆకాశంలో చరిస్తుంటాను. అందుచేత నన్ను మాతరిశ్వుడంటారు.

భూతం : నీ గొప్పతనం ఏమిటి ?

వాయువు : ఏ వస్తువునైనా క్షణాల్లో ఎగరగొట్టగలను.

భూతం : అలా అయితే ఈ గడ్డిపరకను ఎగరగొట్టు.

వాయుదేవుడు తన శక్తి అంతా కూడదీసుకుని గాలులు వీచాడు. గడ్డిపరక కదలను కూడాలేదు. అవమానంతో వెళ్ళిపోయాడు వాయువు. దేవతల దగ్గరకు వెళ్ళి ఆ తత్త్వం ఏమిటో తనకు తెలియలేదు అన్నాడు. ఈ సారి దేవతలు ఇంద్రుణ్ణి వెళ్ళమన్నారు. ఇంద్రుడు బయలుదేరి ఆ తత్త్వాన్ని సమీపించాడు.

ఆ తత్త్వం మాయమైపోయింది. ఆ స్థానంలో ఉమాదేవి ఉన్నది. అప్పుడు ఇంద్రుడు ఆమెతో అమ్మా ! ఇప్పటి దాకా ఇక్కడ ఉన్న తత్త్వం ఏమిటి ? అన్నాడు అందుకు ఉమాదేవి.

దేవేంద్రా ! అదే పరబ్రహ్మతత్త్వము. దాన్ని మీరు గుర్తించలేకపోయారు. ఆ తత్త్వానికీ నాకూ తేడాలేదు. మేమిద్దరమూ ఒకటే అని చెబుతుంది. ఈ రకంగా పరబ్రహ్మను ముందుగా దర్శించినవాడు కాబట్టే ఇంద్రుడు దేవతలకు రాజయినాడు. అగ్ని వాయువులు దిక్పాలకులయినారు అని చెప్పబడింది.

కాబట్టి ఉమ అంటే ఆ పరబ్రహ్మమే. ఆరు సంవత్సరాల బాలికను కూడా ఉమ అంటారు.

634. శైలేంద్రతనయా

పర్వతరాజు యొక్క కుమార్తె పార్వతి. దక్షయజ్ఞం సమయంలో దాక్షాయణి దగ్ధమైపోయింది. సతి వియోగాన్ని భరించలేని శివుడు కొంతకాలం దేశాల వెంబడి తిరిగి ఆ తరువాత విరాగియై హిమాలయాల్లో తపస్సు చేసుకుంటున్నాడు.

వజ్రాంగుడి కుమారుడు తారకాసురుడు బ్రహ్మను మెప్పించి ఇప్పటివరకు తన సృష్టిలో ఉన్న ఏ ప్రాణితోనూ మరణం లేకుండా వరం పొందాడు. వరబలంతో గర్వించి దేవతలను బాధించటం ప్రారంభించాడు. దేవతలంతా హిమాలయాలకుపోయి ఆ పరమేశ్వరిని ప్రార్థించారు. ఈ లోకంలో తన అంశపుడుతుందని, దాన్ని శివునకిచ్చి వివాహంచేస్తే, వారికి కలిగే కుమారుడు తారకుణ్ణి సంహరిస్తాడు అని చెప్పింది. అప్పుడు హిమవంతుడు ఆ పరమేశ్వరుణ్ణి ప్రార్థించి తన యింట, తన కుమార్తెగా పుట్టమన్నాడు. అతని కోరిక మన్నించి హిమవంతుని ఇంట పుట్టి హైమవతిగా ప్రసిద్ధిచెందింది.

ప్రసిద్ధి చెందిన పర్వతాలు ఏడు. అవి

1. హిమవత్పర్వతము	4. మాల్యవంతము	6. గంధమాదనము
2. నిషధము	5. పారియాత్రము	7. హేమకూటము
3. వింధ్యపర్వతము		

వీటిలో హిమవత్పర్వతము శ్రేష్ఠమైనది. అందుకే దాన్ని శైలేంద్రము అంటారు. ఆ పరమేశ్వరి హిమవంతుని గర్భానపుట్టింది కాబట్టి శైలేంద్రతనయా అనబడుతుంది.

635. గౌరీ

గౌరవర్ణము గలది గౌరి. పై నామంలో చెప్పిన శైలేంద్రతనయయే గౌరి. దక్షయజ్ఞం సమయంలో యోగాగ్నిలో భస్మమైపోయిన సతీదేవియే మళ్ళీ హిమవంతుడు, మేనకలకు గౌరిగా జన్మించింది.

కాళి నల్లగా ఉంటుంది. పరమేశ్వరుడు ఆమెను నల్లనిదానా అంటాడు. ఈ పరిహాసం భరించలేక కాళి బ్రహ్మను గురించి తపస్సుచేసి గౌరవర్ణముతో ఉండేటట్లు వరం పొందింది.

వరుణుని యొక్క ప్రియురాలు గౌరి.

కన్యాకుబ్జే తథాగౌరీ కన్యాకుబ్జ మందు పీఠాధిదేవత గౌరి.

అష్టవర్షా భవేత్కన్యా గౌరీ ఎనిమిది సంవత్సరముల బాలిక గౌరి అని చెప్పబడింది.

మంత్రశాస్త్రంలో గౌరీ పంచాక్షరి మంత్రమున్నది

అస్యశ్రీ గౌరీ పంచాక్షరీ మహామంత్రస్య ఆనందభైరవ ఋషిః పంక్తిచ్ఛందః। శ్రీ గౌరీ దేవతా । ఐం బీజం । హ్రీం శక్తిః । క్లీం కీలకం । జపే వినియోగః ।

న్యాసము : మహేశ్వర్యై నమః । అనంతరూపిణ్యై నమః ।
మహాలక్ష్మై నమః । సర్వలోక రక్షణ్యై నమః ।
త్రిపురసుందర్యై నమః । త్రైలోక్యమోహిన్యై నమః ।

ధ్యానము : **గౌరి ! మమ ప్రియే ! దేవి ! శంకరార్ధ శరీరిణి !**
సౌభాగ్యం కురు మే దేవి ! శివశక్త్యై నమోఽస్తు తే ॥
ధనధాన్య పశుక్షేత్రం భర్తృసంరక్షణం తథా ।
సుపుత్రం చ మహాదేవి ! దేహి మే కరుణాలయే ॥

మంత్రము : **ఐం హ్రీం శ్రీం క్లీం గౌర్యై నమః ॥**

636. గంధర్వసేవితా

గంధర్వులచేత సేవింపబడునది. మానవుల తరువాత గొప్ప శక్తులు గల వారిలో గంధర్వులు ఒకరు. వీరు రెండు రకాలుగా ఉన్నారు.

1. మానవ గంధర్వులు – మనుష్యులుగా ఉండి, తాము చేసిన పుణ్యకర్మలవల్ల గంధర్వత్వం పొందినవారు.

2. దేవ గంధర్వులు – వీరు పుట్టుకతోనే గంధర్వులుగా ఉన్నారు. దేవతలలో ఒక జాతి. విశ్వావసువు మొదలైనవారు దేవగంధర్వులు. పరమేశ్వరి గంధర్వులచే సేవింపబడుతుంది.

గంధర్వులు మంచి సంగీతవిద్వాంసులు. అందుకే గంధర్వగానం అంటారు. వీరంతా ఆకాశంలో చరిస్తూ పర్వతశిఖరాలమీద ఉంటూ, హిమాలయ శిఖరాలమీద వీణా వేణు మృదంగాల వాద్యాలతో పరమేశ్వరిని కీర్తిస్తూ సేవించుకుంటారు. అందుకే ఆ దేవి 'గంధర్వసేవితా' అనబడింది.

637. విశ్వగర్భా

విశ్వము గర్భమునందు గలది. ప్రళయం సంభవించినప్పుడు జగత్తు అంతా లయమైపోతుంది. కర్మక్షయమైన జీవులకు మోక్షం కలుగుతుంది. కర్మక్షయం కాని జీవులు ఆ కర్మఫలాన్ని అనుభవించాలి. కర్మ చెయ్యగానే ఫలితంరాదు. కర్మ పరిపక్వం కావాలి అప్పుడే ఫలితం వస్తుంది. ఈ జీవులు గతంలో చేసిన కర్మతాలూకు ఫలితాన్ని అనుభవించాయి. కాని వర్తమానంలో చేసిన కర్మఫలితాన్ని అనుభవించాలి అంటే ఆ కర్మ పరిపక్వత చెందే వరకు ఆగాలి. అటువంటి జీవసమూహం అంతా కూడా మాయా స్వరూపిణి అయిన పరమేశ్వరిలో లీనమైపోతుంది. అలాగే పంచభూతాలు కూడా

భూమి	–	జలంలో కలిసిపోతుంది
జలం	–	అగ్నిలో కలిసిపోతుంది
అగ్ని	–	వాయువులో కలిసిపోతుంది
వాయువు	–	ఆకాశంలో కలిసిపోతుంది
ఆకాశం	–	మాయలో కలిసిపోతుంది

ఈ రకంగా సృష్టి అంతా పరమేశ్వరిలో లీనమైపోతుంది. ఇప్పుడు ఆ సృష్టి అంతటినీ తన గర్భంలో దాచుకుని, మాయాశక్తి పరమేశ్వరునిలో లీనమైపోతుంది. ఈ రకంగా విశ్వమంతా తన గర్భంలో దాచుకుంటుంది. కాబట్టి ఆమె విశ్వగర్భా అనబడుతోంది.

638. స్వర్ణగర్భా

స్వర్ణము యొక్క గర్భం నుంచి పుట్టినది. వాయుపురాణంలో

హిరణ్యా మస్య గర్భో భూ ద్ధిరణ్యా స్యాపి గర్భజః
యస్మా ద్ధిరణ్యగర్భ స్సః పురాణేఽస్మి న్నిరుచ్యతే ॥

ఈమె గర్భము హిరణ్యము. లేక హిరణ్యగర్భము నుండి పుట్టినది కాబట్టి హిరణ్యగర్భా అనబడుతోంది.

హిరణ్యగర్భుడు – హిరణ్యమును గర్భములో కలవాడు బ్రహ్మ. పరమేశ్వరి బ్రహ్మదేవుని స్వరూపమే. కాబట్టి స్వర్ణగర్భ అనబడుతోంది. దేవి భూదేవతా స్వరూపము. బంగారం అంతా భూగర్భంలోనే ఉంటుంది. కాబట్టి ఆమె స్వర్ణగర్భ.

639. అవరదా

అవరులు అనగా – అనార్యులైన రాక్షసులు. వారిని చంపుతుంది కాబట్టి అవరదా అనబడుతుంది.

కాంతి కలిగినటువంటి, ప్రకాశము గలిగినట్టి దంతాలుకలది.

కొన్నిచోట్ల ఈ నామాన్ని 'వరదా' అని చెప్పటం జరుగుతోంది. వరదా – వరములను ఇచ్చునది. భక్తుల యొక్క కోరికలను తీర్చునది. భక్తులకు జ్ఞానాన్ని ప్రసాదించేది. భక్తుల హృదయాలను బట్టి వారివారి కోరికలు తీరుస్తుంది. అందుకే వరదా అనబడుతుంది.

640. వాగధీశ్వరీ

వాచాం అధీశ్వరీ వాక్కులకు అధీశ్వరి. వాక్కుకు మూలమైన పరాశక్తి. వాక్కు నాలుగురూపాలుగా ఉంటుంది. అని గతంలో వివరించాం. అవి పరా పశ్యంతీ మధ్యమా వైఖరి. వీటిలో మొట్టమొదటిది పరావాక్కు. అఖరుది వైఖరీవాక్కు. వైఖరీవాక్కులో మిగిలిన మూడు అంటే పరా, పశ్యంతీ, మధ్యమలు కలిసిపోయి ఉంటాయి. మూడూ దాదాపుగా అవ్యక్తములు. కంటికి కనిపించవు. నాల్గవదైన వైఖరీవాక్కు మాత్రమే స్పష్టంగా తెలుస్తుంది. అయితే వాక్కుకు ప్రారంభదశ పరావాక్కు. ఇది పరాస్థానంలో అంటే సహస్రారంలో ఉద్భవిస్తుంది. సైన్సు ప్రకారము కూడా ముందుగా ఆలోచన వచ్చేది మెదడులోనే. ఆ మెదడు సహస్రారంలో ఉన్నది. అదే పరాస్థానము. పరావాక్కు పరదేవతా స్వరూపము. అందుచేతనే పరమేశ్వరి వాగధీశ్వరీ అనబడుతున్నది. భారతి, వాణి, సరస్వతి మొదలైన పేర్లతో చెప్పబడే దేవత ఈమె. వశిన్యాది దేవతలుగా చెప్పబడేది కూడా ఈమె.

1. వశిని	3. మోదిని	5. అరుణ	7. సర్వేశ్వరి
2. కామేశ్వరి	4. విమల	6. జయ	8. కౌళిని

వీరందరూ వాగ్దేవతలు. సరస్వతీదేవి స్వరూపాలు. వీరందరికీ అధీశ్వరి కాబట్టి వాగధీశ్వరీ అనబడుతుంది.

641. ధ్యానగమ్యా

ధ్యానముచేత ఎరుగబడినది. వేదంలో ధ్యానయోగము చేత దేవతాశక్తిని పొందవచ్చును అని చెప్పబడింది. పరమేశ్వరిని పూజించటము, స్తోత్రం చెయ్యటమువల్ల కాకుండా నిశ్చలమైన మనస్సుతో ధ్యానించటంచేత మాత్రమే పొందదగినది ఆ పరమేశ్వరి. అందుచేతనే ధ్యానగమ్యా అనబడుతుంది. భగవంతుడు సత్యజ్ఞానస్వరూపుడు. అనంతుడు, అవ్యయుడు. వీటికి భిన్నమైనవాడు జీవి. పరమాత్మ – జీవాత్మల మధ్య భేదాలు

పరమాత్మ	–	**జీవాత్మ**
సత్యము	–	అసత్యము
శాశ్వతము	–	అశాశ్వతము
అనంతము	–	అంతముగలది
జ్ఞాని	–	అజ్ఞాని
శాశ్వతమైన ఆనందము	–	క్షణికానందము

ఈ రకంగా జీవాత్మ పరమాత్మలు భిన్న ధృవాలు అయితే జీవుడు అవిద్యను వదిలి, తానే పరబ్రహ్మ అని తెలుసుకున్నప్పుడు అతడే పరబ్రహ్మ అవుతాడు.

అజ్ఞాని అయిన జీవి ధ్యానము ద్వారా గాని, ఇంకొక మార్గం ద్వారా కాని పరమాత్మ దర్శనం చేసుకోలేడు. ఇది కేవలము జ్ఞానంద్వారానే జరగాలి. బ్రహ్మను గురించి తెలుసుకోవటం బ్రహ్మద్వారానే జరుగుతుంది. ధ్యానం చెయ్యాలంటే ఇద్దరికీ ఒకే లక్షణాలుండాలి. ధ్యానంకాని ఇంకొకటిగాని చేసి పరమాత్మను చేరలేడు. జ్ఞాని మాత్రమే ఆ పని చెయ్యగలడు.

అందుచేతనే పరమేశ్వరి భక్తులను కనికరించాలనే ఉద్దేశ్యంతో సగుణబ్రహ్మను ఏర్పరచింది. ఆ సగుణబ్రహ్మయే భగవంతుడు. సాధకుని యొక్క కోరిక మేరకు భగవంతుడికి రూపం కల్పించబడింది.

సాధకానాం హితార్థాయ బ్రహ్మణో రూపకల్పనా

భంగవంతుడికి ఆరు లక్షణాలుంటాయి. అవి

1. సర్వజ్ఞత	3. అనాదిబోధ	5. అనంతత
2. నిత్యతృప్త	4. స్వతంత్రత	6. అలుప్తత

వీటిని గతంలో వివరించటం జరిగింది. ఈ లక్షణాలు జీవిలో కూడా ఉంటాయి. కాని అవి అతని అజ్ఞానం వల్ల బయటకు కనపడవు. ఈ అజ్ఞానం గనక వదలినట్లైతే, జీవికి భగవత్సాక్షాత్కారము జరుగుతుంది. దీనికి ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తుల బలం తగ్గి విజ్ఞానం పెరిగితే, జీవి తానే భగవత్స్వరూపుడనని తెలుసుకుంటాడు. దీనికి సగుణోపాసనే సాధనము.

ధ్యానము అంటే – విషయాన్ని ధారణచేసే స్థలంలో బుద్ధిని స్థిరంగా ఉంచటము. మళ్ళీ ధ్యానము రెండు రకాలు 1. సగుణ ధ్యానము 2. నిర్గుణధ్యానము. ధ్యానంలో ఒక ముఖ్యసూత్రం గుర్తుంచుకోవాలి. ఏ దేవతనైతే అర్చిస్తామో, అదే రూపాన్ని మనం కూడా పొందుతాము. అంటే ఆ రూపం పూర్తిగా మనకు రాకపోయినా, దాని లక్షణాలు తప్పనిసరిగా వస్తాయి. అందుచేతనే సగుణబ్రహ్మను ఆరాధించేవారికి ఆ దేవత లక్షణాలే వస్తాయి. మరి నిర్గుణబ్రహ్మోపాసన చేసేవారికి నిర్గుణత్వం, నిరాకారత్వం వస్తుంది. అదే సాయుజ్యం. అంటే నిరాకార అయిన పరమేశ్వరిని ధ్యానం చేస్తే మోక్షం కలుగుతుంది.

642. అపరిచ్ఛేద్యా

పరిచ్ఛేదము – ఇటువంటిది, ఇంతటిది అని చెప్పతగినది. అపరిచ్ఛేదము – ఇటువంటిది అని చెప్పటానికి వీలులేనిది. లోకంలోని ప్రతివస్తువూ కంటికి కనిపిస్తుంది. కాబట్టి దాన్ని గురించి చెప్పవచ్చు. అందుకే అది పరిచ్ఛేదము. అయితే పరమేశ్వరి కంటికి కనపడదు. ఆమె ఇటువంటిది అనిగాని, ఆమెను గురించి ఇంకేమైనాగాని చెప్పలేము. అందుకే ఆమె అపరిచ్ఛేద్యమైనది. సత్యము జ్ఞానము అనంతమయమైనది పరబ్రహ్మ. జ్ఞానము ఎంత ? అంటే అపరిచ్ఛేద్యము. అనంతమైనది. ఆ దేవి రూపము లేనిది. జగత్తంతా వ్యాపించి ఉన్నది. జగత్తులోని ప్రతి వస్తువూ ఆ పరమేశ్వరి రూపమే. కళ్ళు పరమేశ్వరి స్వరూపం. కాని కళ్ళే పరమేశ్వరి రూపం కాదు. చెవులు పరమేశ్వరి స్వరూపం. అలా అని చెవులే దేవిరూపం కాదు. ఈ రకంగా జగత్తులోని ప్రతి వస్తువూ ఆమె స్వరూపమే. అందుచేత ఆమె రూపాన్ని నిర్ణయించటంకాని, వర్ణించటంకాని చేయలేము. అందుకే ఆమె అపరిచ్ఛేద్యా అనబడుతోంది.

643. జ్ఞానదా

అన్నింటికీ మూలమైనది ఏదో, దేనివలన ఈ జగత్తు సృష్టించబడుతోందో, ఆ విషయపరిజ్ఞానమే జ్ఞానము అనబడుతుంది. ఏ విషయాన్ని తెలుసుకున్నంత మాత్రం

చేత అన్ని విషయాలూ తెలుస్తాయో ఆ విషయమే జ్ఞానము. జ్ఞానమనేది పరమాత్మ స్వరూపము అందుచేతనే పరమాత్మ తేజోమయమైన కాంతిపుంజము అని చెప్పబడింది. అదే జ్ఞానజ్యోతి సాధకుడు కుండలినీశక్తిని నిద్రలేపి సహస్రారం చేర్చగలిగితే అక్కడ తానెవరు అనే విషయం తెలుస్తుంది. అదే స్వరూపజ్ఞానం. ఆత్మజ్ఞానం. **బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి.** బ్రహ్మను గురించి తెలుసుకున్నవాడు తాను కూడా బ్రహ్మమే అవుతాడు. ఈ చరాచర జగత్తు అంతా తనలో చూడగలుగుతాడు అదే జ్ఞానము. ఆ జ్ఞానాన్ని పొందినవాడు జ్ఞాని. ఇతని దృష్టిలో కులాలు లేవు. మతాలు లేవు. రూపభేదం, రంగు భేదం లేదు. జగత్తులోని మానవులంతా ఒకటే. శంకర భగవత్పాదులవారికి కాశీలో ఒక ఛండాలుడు త్రోవలో అడ్డు వస్తాడు. అతణ్ణి తప్పుకోమంటారు శంకరుని శిష్యులు. అప్పుడు ఆ ఛండాలుడు ఎవర్ని తప్పుకోమన్నారు? నన్నా ? నా ఆత్మనా ? ఆత్మనే గనక అయితే నీలో ఉన్నది, నాలో ఉన్నది ఒకే ఆత్మ. ఈ శరీరాన్ని అయితే అందరి శరీరాల్లోని రక్తమాంసాలు ఒకటే. మరి ఎవరు తప్పుకోవాలి? అని అడుగుతాడు. దీంతో శంకరులవారికి జ్ఞానోదయమవుతుంది. అప్పుడు ఆ ఛండాలుడి పాదాలమీద పడతాడు శంకరుడు. ఆ వచ్చిన వాడు సాక్షాత్తూ పరమేశ్వరుడు. ఈ రకంగా అనేకమందికి అనేకచోట్ల జ్ఞానోదయమవుతుంది. జ్ఞానికి అన్ని విషయాలు తెలుస్తాయి. సకల శాస్త్రాలు తెలుస్తాయి. వాటిని ప్రత్యేకంగా చదువవలసిన అవసరం లేదు.

జ్ఞానమనేది రెండు రకాలుగా ఉంటుంది. 1. ఐహలోక జ్ఞానము 2. పరలోక జ్ఞానము. ఐహలోక జ్ఞానము అంటే ఈ లోకంలోని వస్తువులను గురించిన పరిజ్ఞానము. లౌకికమైన అన్ని విషయాలు పూర్తిగా తెలుస్తాయి.

2. పరలోక జ్ఞానము – పరదేవతను గురించి ఆత్మను గురించి క్షుణ్ణంగా తెలుసుకోవటం. అటువంటి జ్ఞానము పూర్తిగా ఇచ్చేది.

ఈ జ్ఞానమనే దాన్ని భక్తులకు ఇచ్చేది. జ్ఞానదా అంటే తన భక్తులకు జ్ఞానాన్ని సమకూర్చేది. బంధజ్ఞానాన్ని పోగొట్టి పరమజ్ఞానాన్ని ఇచ్చేది.

644. జ్ఞానవిగ్రహా

జ్ఞానమే శరీరముగా గలది. జ్ఞానమే పరబ్రహ్మ. జ్ఞానమే బంధహేతువు, ఈ విశ్వమంతా జ్ఞానాత్మకము. జ్ఞానానికి మించినది ఏదీ లేదు. జ్ఞానమే విద్య అని విష్ణుపురాణం చెబుతోంది.

పరమేశ్వరి జ్ఞానమే మూర్తిగా దాల్చినది. ఆమె చిదగ్నికుండ సంభూత. జ్ఞానమయి. జ్ఞానజ్యోతి అని గతంలో వివరించటం జరిగింది. ఆ దేవి ప్రజ్ఞాన ఘనరూపిణి. పాదాది శిరః పర్యంతము జ్ఞానమూర్తి. విశ్వమంతా జ్ఞానమయము. జ్ఞానానికి మించినది ఏదీ లేదు. విద్య అవిద్య రెండూ జ్ఞానస్వరూపమే అని గుర్తించాలి.

అయితే ఈ జ్ఞానము ఎక్కడ ఏ రూపంలో ఉంటుంది? అంటే అన్ని జీవులయొక్క హృదయాంతరాళాలలోనూ ప్రకాశరూపంలో ఉంటుంది. అంతఃకరణ వృత్తులను ప్రకాశింపచేస్తుంది. ఈ జగత్తును ప్రకాశింపచేసేవి సూర్యుడు చంద్రుడు అగ్ని అని గతంలో చెప్పుకున్నాం. అవి బయట ఉన్న వాటినే ప్రకాశింపచేస్తాయి. అంతేకాని లోపల ఉన్నవాటిని ప్రకాశింపచేయలేవు. ఈ జ్ఞానజ్యోతి బయట, లోపల ఉన్న అన్నింటినీ ప్రకాశింపచేస్తుంది.

గతజన్మలోని విషయాలు కొన్ని మనకు గుర్తుంటాయి. కలలో ఏవో వస్తువులు, సంఘటనలు చూస్తాం. అవన్నీ గతజన్మలో మనకు పరిచయమున్నవే. వాటిని ఈ జన్మలో ఎక్కడా చూడలేదు. అయినా ఎక్కడో చూసినట్లుంటుంది. అలాగే కొంతమందిని వారు క్రొత్త వారైనా సరే మనకు ఎక్కడో పరిచయం ఉన్నట్లు అనిపిస్తుంది. కొంతమందిని చూస్తే విపరీతమైన కోపం, చికాకు, అసహ్యం అనిపిస్తుంది. ఇవన్నీ గతజన్మ వాసనలు. మనకు తెలియకుండానే గతజన్మలోని జ్ఞానం మనకు తెలియచేస్తుంది.

కాబట్టి జ్ఞానమనేది సత్యము నిత్యము. అదే పరబ్రహ్మ స్వరూపము. జ్ఞానము జీవులందరికీ ఉంటుంది. ఈ జ్ఞానమనేది లౌకిక విషయ పరిజ్ఞానము, ఆత్మ జ్ఞానము అని రెండు రకాలు. లౌకిక విషయ పరిజ్ఞానము అంటే ఇతర వస్తువులకు, విషయాలకు సంబంధించిన జ్ఞానము. భౌతిక శాస్త్రము, రసాయన శాస్త్రము మొదలగు విషయాలు.

ఈ రకంగా అన్ని రకాల జ్ఞానాలు, అన్ని రకాల విషయ సంపద మూర్తీభవించిన ఆ పరమేశ్వరివే. అందుచేతనే ఆ దేవి జ్ఞానస్వరూపిణి. జ్ఞానమయి జ్ఞానవిగ్రహా అనబడుతోంది.

645. సర్వ వేదాంత సంవేద్యా

వేదాంతము వేదముల చివర చెప్పబడినది. ఉపనిషత్తు. వేదం మొత్తం నాలుగు భాగాలుగా ఉంటుంది.

1. సంహితలు : ఇది మంత్రభాగం. ఇందులో స్తోత్రాలు ఆవాహనలు ఉంటాయి.

2. బ్రాహ్మణాలు : సంహితలో ఉన్న విషయాన్ని వివరించేవి బ్రాహ్మణాలు. యజ్ఞయాగాదులు ఎలా చెయ్యాలి? యజ్ఞాల విలువ ఏమిటి? అనే విషయాలు ఇందులో చెప్పబడ్డాయి.

3. అరణ్యకాలు : బ్రాహ్మణాలకు ఉపనిషత్తులకు మధ్యస్థాయిలో ఉంటాయి. ఇవికూడా బ్రాహ్మణాలలాగానే కర్మవిధులను ప్రతిపాదిస్తాయి. కాని వీటిలో కర్మల భౌతిక భాగం ఉండదు. కర్మల వెనుక గల నిగూఢమైన తత్త్వం మీద ధ్యానానికి ప్రాధాన్యత ఇవ్వబడింది.

ఏకాంతవాసం చేసేవారు, అరణ్యాలలో నివశించే వారికోసం ఇవి నిర్దేశించబడ్డాయి.

4. ఉపనిషత్తులు : ఇది బ్రహ్మవిద్య. జీవాత్మ, పరమాత్మ, జ్ఞానము, మోక్షముల గురించి వివరించేవి.

పరమేశ్వర స్వరూపము అనేది ఉపనిషద్వాక్యాలచే తనే ఎరుగబడునది. ఉపనిషత్సారమే బ్రహ్మవిద్య. అందుచేతనే పరమేశ్వరి 'సర్వవేదాంత సంవేద్యా' అనబడుతున్నది.

646. సత్యానంద స్వరూపిణీ

సత్యము ఆనందము స్వరూపముగా గలది.

పరమేశ్వరికి బాధలు దుఃఖాలు, కష్టాలు ఉండవు. ఆమె కేవలము ఆనంద స్వరూపిణి.

సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ.

సత్యము నిత్యము అయినది, ఆనందస్వరూపమైనది, అనంతమైనది ఆ పరబ్రహ్మ.

ఆనంద స్వరూపము గలది. ఆనందం రెండు రకాలు 1. లౌకికానందం 2. పరమానందం.

1. లౌకికానందమనేది క్షణికానందం. ఇది శాశ్వతం కాదు. ఈ ఆనందంలో దుఃఖము ఉంటుంది. త్రిపురా రహస్యంలో ఈ విషయం చాలా గొప్పగా చెప్పబడింది.

పూర్వకాలంలో దశార్ణ దేశాన్ని ముక్తాచూడుడు అనే రాజు పాలిస్తుండేవాడు. అతనికి ఇద్దరు కుమారులు. పెద్దవాడు హేమచూడుడు. రెండవవాడు మణిచూడుడు. వీరు మంచి రూప గుణ లావణ్యాలు గలవారు. వేదవేదాంగవిదులు. సకల శాస్త్ర విశారదులు. ఒకరోజు వీరు వేటకు వెళ్ళారు. అక్కడ పెద్ద వడగళ్ళ వాన వచ్చింది. దాంతో హేమచూడుని గుర్రం దారి తప్పి దగ్గరలో ఉన్న వ్యాఘ్రపాద మహర్షి ఆశ్రమం

చేరింది. అక్కడ ఒక మునిబాలిక అత్యంత రూప లావణ్యవతి అతనికి స్వాగతం పలికింది. ఆమె పేరు హేమలేఖ.

హేమచూడుడు తొలిచూపులోనే ఆమెను ప్రేమించాడు. వ్యాఘ్రపాదుని అనుమతితో హేమలేఖను వివాహమాడాడు హేమచూడుడు. ఆమెతో సహా రాజ్యానికి తిరిగి వచ్చాడు. సుఖంగా కాపురం చేస్తున్నాడు.

ఒకరోజున హేమచూడుడు తన భార్యతో "దేవీ ! నన్ను నువ్వు ఇష్టపడే వివాహమాడావు కదా! మరి ఎందుకు పరాకుగా ఉంటావు. నేను వచ్చిన సంగతికూడా వెంటనే నీకు తెలియదు. నిన్ను ప్రేమగా దగ్గరకు తీసుకున్నా, కొద్దిసేపటిదాకా నువ్వు ఈ లోకంలోకి రావు. ఏదో ఆలోచిస్తుంటావు. ఈ సుఖాలు నీకు ఇష్టం లేదా? నిజం చెప్పు" అంటాడు.

దానికి హేమలేఖ "రాజా ! ఇవి సుఖాలు కాదు. దుఃఖహేతువులు. నిజంగా ఇదే సుఖమైతే రతిక్రీడలో పాల్గొన్న పశువు, తరువాత వళ్ళునొప్పితో ఎందుకు బాధపడుతుంది? కాబట్టి ఇది నిజమైన సుఖం కాదు. ఇది క్షణికం. అనుభవించినంతవరకే ఉంటుంది. ఆ తరువాత ఉండదు. ఇది దుఃఖహేతువు. అంటూ భర్తకు జ్ఞానబోధ చేస్తుంది.

కాబట్టి లౌకిక విషయాలవల్ల వచ్చే సుఖం శాశ్వతమైనది కాదు.

2. పరమానందం. ఇది శాశ్వతమైన ఆనందం నిత్యము సత్యము అయినది. పరబ్రహ్మ అనుభవించే ఆనందం ఇదే. శ్రీచక్రంలోని తొమ్మిదవ ఆవరణ అయిన సర్వానందమయ చక్రంలో ఆ పరమేశ్వరి ఉంటుంది. అంటే ఆమె ఆనందమయి.

సాధకుడు కుండలినీ శక్తిని సహస్రారం చేరిస్తే అక్కడ నుండి అమృతపు ధారలు కురిసి యోగి శరీరంలోని నాడీ మండలమంతా తడుస్తుంది. అప్పుడు అతడు పొందే ఆనందం అనిర్వచనీయం.అది అనుభవైక వేద్యం.

పంచకోశాలలోను ఐదవదైన ఆనందమయ కోశమందు ఆ పరమేశ్వరి ఉంటుంది. ఆమె సత్యానంద స్వరూపిణి.

647. లోపాముద్రార్చితా

అగస్త్య మహర్షి భార్య లోపాముద్ర. శ్రీవిద్యను ఉపాసించినవారిలో 12 మంది శ్రేష్ఠులున్నారు అని చెప్పబడింది. వారిలో లోపాముద్ర ఒకరు. ఈమె ఉపాసించిన పంచదశి మహామంత్రం హాదివిద్యకు సంబంధించినది.

అస్యశ్రీ లోపాముద్రాంబా మహామంత్రస్య । దక్షిణామూర్తి ఋషిః । అనుష్టుప్ ఛందః । లోపాముద్రా విద్యాంబా దేవతా । హ స క ల హ్రీం బీజం । హ స క హ ల హ్రీం శక్తిః । స క ల హ్రీం కీలకం । జపే వినియోగః ।

న్యాసము : **కూటత్రయముతో రెండు ఆవృత్తులు న్యాసము అని చెప్పాలి.**

ధ్యానము : **సకుంకుమ విలేపనా ...**

మంత్రము : **హ స క ల హ్రీం । హ స క హ ల హ్రీం । స క ల హ్రీం ।**

648. లీలాక్లప్త బ్రహ్మాండ మండలా

లీలామాత్రం చేత, ఏ విధమైన కష్టము లేకుండా, అనాయాసంగా ఈ బ్రహ్మాండాన్ని ఏర్పరచేది. పరమేశ్వరుని యొక్క ఇచ్ఛాశక్తియే పరమేశ్వరి. ఈక్షితి వలన కల్పించబడినదియే బ్రహ్మాండ మండలము. జ్ఞానవాసిష్టంలో చెప్పినట్లుగా

తస్యశక్తి ముల్లాస మాత్రం జగ దితి స్థితమ్ ॥

పరమేశ్వరి యొక్క సంకల్ప మాత్రం చేతనే అఖిలాండకోటి బ్రహ్మాండాలు సృష్టించబడుతున్నాయి. అందుచేత పరమేశ్వరి లీలాకప్త బ్రహ్మాండ మండలా అనబడుతోంది.

649. అదృశ్యా

కనిపించనిది. కంటికిగాని ఇతర ఇంద్రియాలకుగాని కనిపించనిది. పరమేశ్వరుడు నిరాకారుడు నిర్గుణ స్వరూపుడు. అందుకే కంటికి కనిపించడు. ఉపనిషత్తులలో చెప్పినట్లుగా కళ్ళకు చూసే శక్తినిచ్చేది ఆ పరమేశ్వరుడు. చెవులకు వినికిడి శక్తినిచ్చేది ఆ పరమేశ్వరుడు. ఈ రకంగా ఇంద్రియాలకు ఆయాశక్తిని సమకూర్చేవాడు పరమేశ్వరుడు. కాబట్టి కంటితో అతణ్ణి చూడలేము చెవులతో అతని గురించి వినలేము. ఇంద్రియాలతో అతని గురించి తెలుసుకోలేము. అందుచేతనే ఆ పరమేశ్వరి అదృశ్యా అనబడుతోంది.

నామరూపాత్మకమైన జగత్తును కంటితో చూడగలము. రూపమున్నదానిని చూడగలము. కాని రూపం లేనిదానిని మాత్రం మనం చూడలేము. పరమాత్మకు రూపం లేదు. అందుకే కంటికి అగుపడదు.

650. దృశ్యరహితా

దృశ్యము లేనిది. కాబట్టి కంటికి కనిపించదు. పైన చెప్పిన నామార్థాన్నే మళ్ళీ ఇక్కడ చెబుతున్నారు. ప్రాపంచిక వ్యవహారాలు లేనటువంటిది. దృశ్యము అంటే కంటికి మాత్రమే కనిపించేది అని అర్థం కాదు. గాలి కంటికి కనిపించకపోయినా శరీరానికి తాకుతుంది. అంటే స్పర్శతో తెలుస్తుంది. శబ్దం చెవులకు తెలుస్తుంది. ఈ రకంగా ఇంద్రియాలచే గుర్తించబడనిది దృశ్యరహితా.

ప్రపంచమంతా పరమేశ్వరి ఆవరించి ఉన్నది కాని పరమేశ్వరిలో ప్రపంచం లేదు. అందుకే ఆమె కనిపించదు. కాబట్టి ఆమె దృశ్యరహితా అనబడుతోంది.

651. విజ్ఞాత్రీ

విశేషేణ జానానీతి - విజ్ఞాత్రీ

విశేషముగ ఎరుగుది. వేదంలో

విజ్ఞాతార మనేకేన విజానీయాత్

తెలుసుకొను దానిని అనేకముచే ఎరుగదగును అని చెప్పబడింది.

సాక్షి చేతా కేవలో నిర్గుణ శ్చ

కేవలము సాక్షి మాత్రంగా ఉండి ప్రపంచాన్ని గురించి తెలుసుకుంటుంది. ఆమె జ్ఞానరూపిణి. శరీరంలోని ఇంద్రియాలన్నీ కేవలం జడపదార్థాలు. వీటికి స్వయంగా పని చేసేశక్తి ఉండదు. ఆ శక్తే చైతన్యము. అటువంటి శక్తిని ఇంద్రియాలకు అనుగ్రహించేది పరమేశ్వరి. అందుచేతనే ఆమె విజ్ఞాత్రీ అనబడుతోంది.

652. వేద్యవర్జితా

వేద్యము - తెలుసుకొనవలసినది. వేద్యవర్జితా. తెలుసుకొనవలసినది అంటూ లేనిది. సర్వజ్ఞత గలది. అన్ని విషయములయందు పరిపూర్ణమైన జ్ఞానము గలది. పరమేశ్వరికన్న భిన్నమైనది ఏదీ లేదు. కాబట్టి ఆమె తెలుసుకోవలసినది ఏదీ లేదు. అందుచేతనే వేద్యవర్జితా అనబడుతోంది.

653. యోగినీ

యోగము అంటే - ఐక్యభావన. అటువంటి ఐక్యభావము గలది. ఐక్యభావము నిచ్చేది.

అసలు యోగాలు నాలుగు రకాలు

1. మంత్ర యోగము
2. రాజయోగము
3. హఠ యోగము
4. లయయోగము

యోగము అంటే - అదృష్టము అనికూడా అర్థం.

1. మంత్ర యోగము : మంత్ర జపం చెయ్యటంవల్ల వచ్చే ఫలితము. మంత్రసిద్ధి జరిగినవారికి అతీంద్రియ శక్తులు వస్తాయి. వీటిని సమాజశ్రేయస్సుకే వాడాలి. లేకపోతే సాధకుడు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుంది.

2. రాజయోగము : ఇది జాతకుడి అదృష్టం. అప్పటి వరకు సామాన్యుడుగా ఉన్న అతడికి రాజయోగం పడుతుంది. దాంతో అతను ముఖ్యమంత్రో, ప్రధానమంత్రో అవుతాడు. అయితే అందరికీ అలా జరగదు. తాను ఉన్నటువంటి స్థితిలో, అదే వృత్తిలో ఉన్నతుడు కావటం రాజయోగం. పైన చెప్పినట్లు పదవులు అలంకరించటం విపరీత రాజయోగం.

3. హఠయోగము : ఇది యోగ ప్రక్రియలో ఒక పద్ధతి. ఈ పద్ధతిలో హఠయోగులు సిద్ధులు సంపాదిస్తారు. నీటిమీద నడవటం. గాలిలో తేలటంవంటివి. అటువంటివారు ఇప్పుడు లేరనే చెప్పవచ్చు.

4. లయయోగం : సాధకుని సాధనశక్తి ఎంత ఉన్నది అనే విషయం ఇక్కడ తెలుస్తుంది. యోగి అయినవాడి ప్రాణాలు బ్రహ్మరంధ్రంద్వారా బయటకు పోతాయి. ఇది చాలా గొప్ప అదృష్టం. అటువంటి వాడికి పునర్జన్మ ఉండదు. అతడి ఆత్మ పరమాత్మలో లీనమైపోతుంది. అంత్యకాలంలో యోగులు ఈ విధంగానే చేస్తారు. యాదవ వంశ నాశనం తరువాత బలరాముడు యమునానదీ తీరంలో చేసిన పని ఇదే. యోగి యొక్క సాధనను బట్టి సహజంగానే ఈ పని జరుగుతుంది. అందుచేతనే "మహాత్ముల పాపపుణ్యంబులు మరణకాలంబునందెలియు" అంటారు.

యోగశాస్త్ర ప్రకారం జీవాత్మను పరమాత్మతో సంధానం చెయ్యటమే యోగము. జ్ఞాత జ్ఞానము జ్ఞేయముల యొక్క ఏకత్వ భావనే యోగము. మనసును అదుపు చేసి,

ఇంద్రియాలను అంతర్ముఖం చెయ్యటమే యోగము. **"యోగః చిత్త వృత్తి నిరోధక్తః"** మనసును అదుపుచేయటమే యోగము. మనసును గనక నిశ్చలం చెయ్యగలిగితే ఏకాగ్రత కుదురుతుంది. జపంలో కూర్చునప్పుడు అనేక విషయాలు కళ్ళముందు తిరుగుతాయి. అంటే మనసు పరి పరి విధాల ఆలోచిస్తోందన్న మాట. అలాంటప్పుడు ముందుగా మనస్సును నిరోధించి, తరువాత లక్ష్యాన్ని ఏకాగ్రం చెయ్యాలి.

ఏకాగ్రతతో చేసిన జపం త్వరగా సిద్ధిస్తుంది. మనసా వాచా కర్మణా చేసే అర్చనకు ఫలితం ఎక్కువ. అందుచేతనే యోగం చెయ్యండి అనటం జరుగుతుంది.

షట్చక్రాలలోను అకారాది క్షకారాంతము మాతృకలున్నాయి అవి

చక్రము	అక్షరాలు	అక్కడ ఉండే దేవత పేరు
విశుద్ధి	అ నుంచి అః వరకు	డాకిని
అనాహతము	క నుంచి ఠ వరకు	రాకిని
మణిపూరము	డ నుంచి ఫ వరకు	లాకిని
స్వాధిష్ఠానము	బ నుంచి ల వరకు	కాకిని
మూలాధారము	వ నుంచి స వరకు	సాకిని
ఆజ్ఞా	హకార క్షకారాలు	హాకిని
సహస్రారము	సర్వవర్ణములు	యాకిని

ఈ విధంగా షట్చక్రాలలో అక్షరాలతోపాటుగా యోగినీ దేవతలు కూడా ఉన్నాయి. అలాగే శ్రీచక్రంలోని తొమ్మిది ఆవరణలలోను విడివిడిగా యోగినీదేవతలున్నారు.

ఆవరణ	చక్రంపేరు	యోగినీ పేరు
1. భూపురం	త్రైలోక్యమోహన చక్రం	ప్రకటయోగిని
2. షోడశదళం	సర్వాశా పరి పూరకం	గుప్తయోగిని
3. అష్టదళం	సర్వ సంక్షోభిణీ చక్రం	గుప్తతరయోగిని
4. మన్వస్రం	సర్వ సౌభాగ్యదాయక చక్రం	సంప్రదాయయోగిని
5. బహిర్దశారం	సర్వార్థసాధక చక్రం	కుళోత్తీర్ణయోగిని
6. అంతర్దశారం	సర్వ రక్షాకర చక్రం	నిగర్భయోగిని
7. అష్టకోణం	సర్వ రోగహర చక్రం	రహస్యయోగిని
8. త్రికోణం	సర్వ సిద్ధిప్రద చక్రం	అతిరహస్యయోగిని
9. బిందువు	సర్వానందమయ చక్రం	పరాపరరహస్యయోగిని

ఇవికాక పన్నెండు మంది యోగినులున్నారు. వారు

1.	విద్యాయోగిని	5.	దీపికాయోగిని	9.	మేధాయోగిని
2.	రేచికాయోగిని	6.	జ్ఞానయోగిని	10.	వ్యోమరూపాయోగిని
3.	మోచికాయోగిని	7.	ఆప్యాయనీయోగిని	11.	సిద్ధరూపాయోగిని
4.	అమృతాయోగిని	8.	వ్యాపినీయోగిని	12.	లక్ష్మీయోగిని

పరమేశ్వరి చతుష్షష్టికోటియోగినీ గణసేవితా అని చెప్పబడుతోంది. వీరందరూ ఆ దేవితో సమానమైన శౌర్యము, పరాక్రమము, పాండిత్యము, చతురత కలవారు. శ్రీచక్రంలోని ప్రతి ఆవరణలోనూ ఒక్కొక్క మూల ఒక్కొక్కయోగిని చొప్పున, ఆవరణకు 8 మంది యోగినులుంటారు. వీరిలో ఒక్కొక్కరికీ ఎనిమిది కోట్లమంది పరిచారికలుంటారు. ఈ రకంగా ఆవరణకు 64 కోట్లమంది యోగినులుంటారు. ఇలా తొమ్మిది ఆవరణలయందు కలిపి $9 \times 64 = 576$ కోట్లమంది యోగినీగణం దేవిని సేవిస్తుంటుంది.

భాస్కరరాయలవారిని కాశీలోని పండితులంతా ఈ యోగినీదేవతలను వివరించమని అడిగినప్పుడు, ఆ యోగినీదేవతలు ప్రత్యక్షమై వారి వారిపేర్లు, రూపాలు, వాహనాలు, ఆయుధాలు మొదలైన వివరణ ఇచ్చాయి.

654. యోగదా

యోగమును ఇచ్చునది. యోగము అంటే తనకు లేని దాన్ని పొందటము. భక్తులంతా పరమేశ్వరిని ఆరాధిస్తారు. ఆ దేవిని తమ కోరికలు తీర్చమని వేడుకుంటారు. వాళ్ళకి ఉన్నవే మళ్ళీ ఇమ్మని దేవిని ఎవరూ అడగరు. వాళ్ళకి లేనివి ఇమ్మని అడుగుతారు. ధనధాన్యాలు, సిరిసందలు, భోగభాగ్యాలు లేదా కైవల్యము వీటిని అడుగుతారు.

భక్తుల యొక్క ప్రాప్తాన్నిబట్టి వారు కోరినవి వారికి ప్రసాదిస్తుంది పరమేశ్వరి. అందుచేతనే యోగదా అనబడుతుంది.

జీవికి అనుభవించే శక్తినిస్తుంది కాబట్టి 'యోగదా' అనబడుతుంది. మంచి దృశ్యాన్ని చూడాలి అనుకున్నాడు. ఆ దృశ్యాన్ని చూసే శక్తి కంటికి ప్రసాదించేది పరమేశ్వరి. మంచి విషయాన్ని వినే శక్తి చెవులకు ప్రసాదించేది పరమేశ్వరి. ఈ రకంగా ఇంద్రియాల ద్వారా అనుభవించే శక్తినిచ్చేది ఆ పరమేశ్వరి కాబట్టి యోగదా అనబడుతోంది.

655. యోగ్యా

మనస్సుచేత ఇంద్రియాలను నిగ్రహించి జీవాత్మను పరమాత్మతో కలపటమే యోగము. దుఃఖము యొక్క సంయోగ వియోగమే యోగము. యోగము నాలుగురకాలు అని గతంలో వివరించాం. డాకిని మొదలైన షట్చక్రాలలోని యోగినీ సమూహము వీటియొక్క స్వరూపమైనది కాబట్టి పరమేశ్వరి యోగ్యా అనబడుతోంది. యోగ్యా అంటే – అనుభవసాధనమగు యోగము. యోగ్యత – అర్హత. ఫలితాన్ని అనుభవించే అర్హత. ఇప్పుడు ఇక్కడ చెప్పిన మూడు నామాలు

1. యోగిని, 2. యోగదా 3. యోగ్యా. యోగ విషయంలో త్రిపుటి అని చెప్పవచ్చు. ఆ పరమేశ్వరియే యోగిని. యోగాన్ని ఇచ్చేది ఆమె. ఆ యోగం అనుభవించే సాధనం చూపేది ఆమె.

భక్తులు భగవంతుణ్ణి ఏదో ఒక ఫలితమపేక్షించి మాత్రమే అర్చిస్తారు. వీటిలో ఒక్కొక్క ఫలితం కోసం ఒక్కొక్క ప్రక్రియ ఆచరిస్తారు. ఒక్కొక్క దేవత నారాధిస్తారు. విద్య కావాలంటే – సరస్వతి. ధనం కావాలంటే – లక్ష్మి. అయితే అన్నిరకాల ఫలితాలను ఇవ్వగల యోగ్యత ఆ పరమేశ్వరి ఒక్కతికే ఉన్నది. అందుచేత ఆమె యోగ్యా అనబడుతుంది.

656. యోగానందా

యోగము అంటే – జీవాత్మ పరమాత్మల సమైక్యము. అదే శివశక్తుల సామరస్యము. జీవాత్మ పరమాత్మను చేరితే అనిర్వచనీయమైన ఆనందం కలుగుతుంది. కుండలినీశక్తిని జాగృతంచేసి, సహస్రారం చేర్చినట్లైతే అక్కడ నుంచి అమృతపుధారలు కురిసి యోగి శరీరంలోని 72వేల నాడీమండలము తడపబడుతుంది. అప్పుడు సాధకుడు అనిర్వచనీయమైన ఆనందం పొందుతాడు. అది అనుభవైకవేద్యము. యోగం వల్ల ఈ రకమైన ఆనందం పొందుతుంది. కాబట్టే ఆ పరమేశ్వరి యోగానందా అనబడుతుంది.

పరమేశ్వరి యోగనిద్రాస్వరూపిణి. నిద్ర ఆనందాన్నిస్తుంది. అందుకే యోగనిద్రలో అద్భుతమైన ఆనందం ఉంటుంది. మధుకైటభ సంహారానికి ముందు విష్ణుమూర్తి యోగనిద్రలో ఉన్నాడు. బ్రహ్మ పరమేశ్వరిని ప్రార్థించి విష్ణుమూర్తిని వదలమంటాడు. ఆ రకంగా యోగనిద్రలో నుంచి బయటకు వచ్చి రాక్షస సంహారం చేశాడు శ్రీ మహావిష్ణువు.

హరివంశంలో పరమేశ్వరి ఆనందఘనమైన యోగనిద్రగా ఉంటుంది. దేవతలలో కూడా విష్ణువు తప్ప ఆమెను ఎవరూ ధరించలేరు ఆమె మాయాశక్తి అని చెప్పబడింది.

యోగత్రిపుట యొక్క అనుభవఫలమే యోగానందము. జీవాత్మ పరమాత్మల ఏకీభావమే యోగము యొక్క ఫలము. ఆ సమయంలో కలిగే ఆనందస్వరూపమే పరమేశ్వరి. యోగసాధన వలన చిత్తశుద్ధి కలుగుతుంది. చిత్తశుద్ధి వలన బ్రహ్మానందం కలుగుతుంది. యోగసాధనకు మైత్రి, కరుణ, ముదిత, ఉపేక్ష అనబడే సాధనాలుండాలి. అష్టాంగమార్గాలుండాలి. అష్టాంగమార్గాలు అంటే

1. యమ	3. ఆసన	5. ప్రత్యాహార	7. ధ్యాన
2. నియమ	4. ప్రాణాయామ	6. ధారణ	8. సమాధి

ఇవన్నీ సాధనచేస్తేనే యోగం సిద్ధిస్తుంది. యోగంలో 'సుమన' వరకు మనసు పనిచేస్తుంది. సుమన దాటిన తరువాత ఉన్మన. ఇక్కడ మనసు కూడా పనిచెయ్యని స్థితి. ఆ స్థితిలోనే బ్రహ్మానందం కలుగుతుంది.

అవస్థాత్రయంలో సుషుప్తి మూడవది. సుషుప్తి అంటే గాఢనిద్ర. ఈ స్థితిలో కూడా సాధకుడు ఆనందాన్ని అనుభవిస్తాడు. అతడి ఇంద్రియాలు మనస్సులో లీనమవుతాయి. మనస్సు ప్రాణంలో లీనమవుతుంది. కాబట్టి అప్పుడు చలించేది ముఖ్యప్రాణము ఒక్కటే. అయితే సుషుప్తి నిద్రావస్థ. ఇది తమోగుణ ప్రధానమైనది. కాబట్టి ఇక్కడ పొందే ఆనందము బ్రహ్మానందంలాగానే ఉంటుంది. కాని బ్రహ్మానందం మాత్రంకాదు.

యోగానందలక్ష్మీనృశింహరూపం. నందగోపుని కుమార్తె మహామాయాశక్తి.

657. యుగంధరా

రథాన్ని గుర్రాలు ఏవిధంగా మోస్తున్నాయో, బండిని ఎద్దులు ఏవిధంగా మోస్తున్నాయో అదేవిధంగా పరమేశ్వరి సకలలోకాలను ధరిస్తున్నది కాబట్టి యుగంధరా అనబడుతున్నది. యుగము అంటే కాలచక్రము. కృతయుగము, ద్వాపరయుగము, త్రేతాయుగము, కలియుగము, ఈనాలుగు యుగాలు కలిపితే ఒక మహాయుగము. ఇటువంటి యుగాలను ధరించేది. కాలస్వరూపిణి.

658. ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణీ

ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తులస్వరూపమైన గుణత్రయ స్వరూపము గలది.

ఇచ్ఛా శిరః ప్రదేశ శ్చ జ్ఞానం తదధోగతా ।
క్రియాపదగతా హ్యస్యా ఏవంశక్తి త్రయం వపుః ॥

ఇచ్ఛాశక్తి	–	శిరస్సు
జ్ఞానశక్తి	–	కంఠము నుంచి కటి వరకు
క్రియాశక్తి	–	కటి నుంచి పాదాలవరకు

ఈ రకంగా రూపం కలిగి ఉన్నది ఆ పరమేశ్వరి. వామకేశ్వరతంత్రంలో

త్రిపురా త్రివిధాదేవీ బ్రహ్మవిష్ణ్వీశ్వరరూపిణీ
జ్ఞానశక్తిః క్రియాశక్తిః ఇచ్ఛాశ క్త్యాత్మికా ప్రియా ॥

త్రిపురసుందరి త్రివిధమైన దేవి. బ్రహ్మవిష్ణు శివరూపిణి. ఇచ్ఛాజ్ఞానక్రియాశక్తి స్వరూపిణి.

చలనాత్మకమైన క్రియాపరురాలు ఆ పరమేశ్వరి. క్రియాశక్తి ఐదురకాలు

1. స్పందము 2. పరిస్పందము 3. ప్రక్రమము 4. పరిశీలనము 5. ప్రచారము

మాలినీ విజయతంత్రంలో చెప్పినట్లుగా "జగత్కారకుడైన బ్రహ్మ సృష్టిచెయ్యాలి అనుకున్నప్పుడు ఆ పరాశక్తి ఇచ్ఛాశక్తి అవుతుంది. వేగంగా దీన్ని జ్ఞాపకం చేస్తుంది. కాబట్టి జ్ఞానశక్తి అవుతున్నది. దానిని తెలుసుకుని ఆ వస్తువులను చేయటం వలన క్రియాశక్తి అవుతున్నది అని చెప్పబడింది.

శివమే బ్రహ్మ. అది శాంతమైనది. దాని స్పందనశక్తియేఇచ్ఛ. అని వాసిష్ఠరామాయణంలో చెప్పబడింది.

బ్రహ్మ ఈ సృష్టిని గురించి ఆలోచించనప్పుడు పరాశక్తి అతని యందు ఇచ్ఛాశక్తి రూపంలో ఉంటుంది. దానితో స్పందన ఏర్పడుతుంది. తరువాత ఇచ్ఛాశక్తి పరాశక్తి అనే జ్ఞానశక్తి అవుతుంది. తరువాత క్రియాశక్తి గలిగి సృష్టి జరుగుతుంది. కాబట్టి ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులరూపం ఆ పరమేశ్వరి.

ప్రకాశ విమర్శాంశలు రెండూ కలిసి దంపతులై ఈ జగత్తును సృష్టించాయి. అయితే ప్రకాశరూపము – పురుషుడు. కాగా విమర్శరూపము స్త్రీరూపము.

ప్రకాశరూపము – వామజ్యేష్ఠరౌద్రి శక్తులు ఇవే సమిష్టిగా అంబికా అనబడుతున్నాయి. అలాగే

విమర్శరూపము – ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులు. సమిష్టిగా ఇవి శాంతా అనబడుతున్నాయి. ఇప్పుడు

వామేచ్ఛా బ్రహ్మభారత్యౌ జ్యేష్ఠాజ్ఞాన హరిక్షితీ ॥
రౌద్రీ క్రియాశివాపర్ణే ఇత్యే తన్మిధునత్రయం

ఇచ్ఛా వామశక్తులు	–	వాణీ హిరణ్యగర్భులు
జ్యేష్ఠా జ్ఞానశక్తులు	–	లక్ష్మీనారాయణులు.
శివా – అపర్ణే	–	శివపార్వతులు

ఈ రకంగా పంచదశి మహామంత్రం మూడు మిధునాలవుతుంది.

బ్రహ్మ, సరస్వతి	–	వాగ్భవకూటమి
లక్ష్మీనారాయణులు	–	కామరాజకూటమి
శివపార్వతులు	–	శక్తికూటమి

ఈ రకంగా పంచదశికి అర్థం చెప్పటం జరిగింది. ఈ విధంగా పరమేశ్వరి త్రిశక్తి స్వరూపిణి. త్రిమూర్తి స్వరూపమే.

659. సర్వాధారా

సమస్త జగత్తుకూ ఆధారరూపమైనది. మార్కండేయపురాణంలో "పరమేశ్వరి ఒక్కతే. కాని ఆమె నుంచి నిత్యానిత్యములు, స్థూలసూక్ష్మాలు, మూర్తామూర్తాలు. మూర్తిమంతములు అన్నీ ఆమె నుంచి వచ్చినవే.

ఆ దేవి సమస్త బ్రహ్మాండాలకు అధిపతి. అన్నింటికీ సూత్రాత్మ ఆమె. గ్రహాలు గతులు తప్పకుండా తిరుగుతున్నాయి అంటే కారణం ఆమె.

660. సుప్రతిష్ఠా

శోభనమైన ప్రతిష్ఠగలది. అఖిలాండకోటి బ్రహ్మాండాలకు ఆధారమైనది. దేవతలందరిలోనూ శ్రేష్ఠమైనది. భక్తుల యొక్క కోరికలు తీర్చేది. సకలదేవతాగణానికి అధినాయక. భక్తవరద.

ఎన్ని సంవత్సరాలుమారినా, యుగాలుమారినా అవన్నీ పరమేశ్వరి రూపమే. యుగాలు, కల్పాలు అన్నీ కూడా ఆమె జగదాధారత్వము సుస్థిరం. అందుకే సుప్రతిష్ఠా అనబడుతోంది.

661. సదసద్రూపధారిణీ

సత్తు అంటే – బ్రహ్మ. అసత్తు అంటే – జగత్తు. ఈ సృష్టిలో పరబ్రహ్మ ఆవిడే. ఈ సృష్టి అంతా ఆవిడే. కాబట్టి సత్తు, అసత్తు రెండూ ఆమెయే.

సత్తు అంటే – పారమార్థికసత్యము. అసత్తు అంటే – తుచ్ఛము. ఈ రెండింటినీ ప్రకాశింపచేసేది ఆ పరమేశ్వరి.

అసత్తు అంటే నామరూపాలు గలది. కళ్ళకు కనిపించేది అయిన జగత్తు. ఇదే మాయ. సత్తు అంటే జగత్తును సృష్టించిన పరబ్రహ్మ. అవ్యక్తము ఇదే పరమేశ్వరి. ఈ రకంగా వ్యక్తావ్యక్తరూపాలు ధరించినది పరమేశ్వరి. అందుచేతనే సదసద్రూపధారిణీ అనబడుతోంది. "సత్యాసత్యాలు రెండూ పరమేశ్వరుని నుంచే కలుగుతున్నాయి. కాబట్టి సదసద్రూపమే పరమేశ్వరి యొక్క ఉపాస్యరూపము" అని వేదం చెబుతోంది లింగపురాణంలో

భూత భావవికారేణ ద్వితీయేన స దుచ్యతే
వ్యక్తం తేనవిహీనత్వా దవ్యక్త మన దిత్యసి"

తన కన్న వేరైనదేదీ కూడా త్రికాలములలోనూ లేదు. అని పరమేశ్వరుడు చెబుతున్నాడు. ప్రపంచమంతా పరమేశ్వరి స్వరూపమే. జీవులు కంటికి కనిపిస్తాయి. కనిపించవు. ఈ రెండు భావనలు పరమేశ్వరియే. అందుచేతనే ఆమె సదసద్రూపధారిణీ అనబడుతోంది.

ఆరూపా చ సరూపా చ సగుణా నిర్గుణా తథా
నామరూపాఽ తిరిక్తా చ సత్తామాత్రా చిదాత్మికా ॥

నామరూపాలకు కారణమైనది కాబట్టి రూపం లేనిది. ఆవిడ కారణంచేతనే నామరూపాలు కలుగుతున్నాయి. కాబట్టి రూపమున్నది. ఈ రకంగా రూపం ఉన్నది. లేదు. అందుచేతనే ఆ పరమేశ్వరి 'సదసద్రూప ధారిణీ' అనబడుతోంది.

అవస్థలు మూడు జాగ్రస్వప్నసుషుప్తులు.

1. జాగ్రదావస్థలో స్థూలమైన జగత్తు కంటికి కనిపిస్తుంది.
2. స్వప్నావస్థలో జగత్తు కంటికి కనిపించదు. కేవలము మనస్సుకు మాత్రమే కనిపిస్తుంది. ఎందుకంటే ఆ స్థితిలో ఇంద్రియాలన్నీ మనసును ఆశ్రయించి ఉంటాయి.

3. సుషుప్తిలో మనస్సు కూడా పనిచేయదు. అది ముఖ్యప్రాణంలో లయమవుతుంది. కాబట్టి సుషుప్తి అంటే గాఢనిద్ర. అందులో సుఖమున్నది. కాని సుషుప్తి, సమాధి వేరువేరని గుర్తుంచుకోవాలి. ఈ మూడుస్థితులు ఆ పరమేశ్వరియే. అందుకే ఆమె సదసద్రూపధారిణీ అనబడుతోంది.

662. అష్టమూర్తిః

ఎనిమిది స్వరూపాలుగా ఉన్నది. అనేక మూర్తి సముదాయాలు ఈ రకంగా ఉన్నాయి.

1. **పంచభూతాని చంద్రార్కా వాత్మేతి మునిపుంగవ !**
మూర్తి రష్టౌ శివ స్యాహు ర్దేవదేవస్య ధీమతః
ఆత్మా తస్యాఽ ష్టమీ మూర్తి ర్యజమానాహ్వయా పరా ॥

పంచభూతాలు, చంద్రుడు, సూర్యుడు, యజ్ఞదీక్ష గల సోమయాజి. వీరు అష్టమూర్తులు.

2.
1. భవుడు	3. ఈశానుడు	5. రుద్రుడు	7. భీముడు
2. శర్వుడు	4. పశుపతి	6. ఉగ్రుడు	8. మహాదేవుడు.

3. ఈశ్వరగీతలో

భూమి రాపోఽనలో వాయుః ఖం మనోబుద్ధి రేవ చ ।
అహంకార ఇతీయం మే భిన్నా ప్రకృతి రష్టధా ॥

పంచభూతాలు, మనస్సు, బుద్ధి, అహంకారము వీటిని అష్టమూర్తులంటారు.

4. శక్తిరహస్యంలో

లక్ష్మీ ర్మేధా ధరా పుష్టి ర్గౌరీ తుష్టిః ప్రభా ధృతిః
ఏతాభిః పాహి తనుభి రష్టాభి ర్మాం సరస్వతి !

1. లక్ష్మీ	2. మేధ	3. ధర	4. పుష్టి
5. గౌరీ	6. తుష్టి	7. ప్రభ	8. ధృతి

5. యోగశాస్త్రంలో

గుణభేదాత్మమూర్తి : అష్టధాపరికీర్తితా

జీవాత్మా చాంతరాత్మా చ పరమాత్మా చ నిర్మలః
శుద్ధాత్మా జ్ఞానరూపాత్మా మహాత్మా సప్తమఃస్మృతః
అష్టమ స్తే షు భూతాత్మే త్యష్టాత్మానః ప్రకీర్తితాః ॥

గుణభేదములచే ఆత్మ ఎనిమిది రకాలుగా అవుతున్నది. అవి.

1. జీవాత్మ	3. పరమాత్మ	5. శుద్ధాత్మ	7. మహాత్మ
2. అంతరాత్మ	4. నిర్మలాత్మ	6. జ్ఞానరూపాత్మ	8. భూతాత్మ

6. విష్ణుపురాణంలో

1. సూర్యుడు	3. పృథివి	5. వాయువు	7. దీక్షితుడైన బ్రాహ్మణుడు
2. జలము	4. అగ్ని	6. ఆకాశము	8. చంద్రుడు

వీరి భార్యలు వరుసగా

1. సువర్చల	3. సుకేశి	5. పరాశివ	7. దీక్ష
2. సోమ	4. స్వాహా	6. దితి	8. రోహిణి

వీరి కుమారులు

1. శని	3. లోహితాంగ	5. స్కంద	7. సంతాన
2. శుక్ర	4. జీవ	6. స్వర్గ	8. బుధ

7.	1. అనంగకుసుమ	3. అనంగమదన	5. అనంగరేఖ	7. అనంగాంకుశ
	2. అనంగమేఖల	4. అనంగమదనాతుర	6. అనంగవేగిని	8. అనంగమాలిని
8.	1. బ్రాహ్మి	3. కౌమారి	5. వారాహి	7. చాముండ
	2. మహేశ్వరి	4. వైష్ణవి	6. మాహేంద్రి	8. మహాలక్ష్మి
9.	1. జ్ఞానేంద్రియాలు	3. అహంకార చతుష్టయం	5. భూతపంచకం	7. కర్మ
	2. కర్మేంద్రియాలు	4. ప్రాణపంచకం	6. కామము	8. అవిద్య.

ఈ రకంగా ఎనిమిదిగా ఉన్న స్వరూపమంతా ఆ పరమేశ్వరియే. అందుకే ఆమె అష్టమూర్తి అనబడుతోంది. అంతేకాకుండా

1. కాదివిద్య 2. హాదివిద్య 3. సంఖ్యావిద్య 4. భూమావిద్య

ఈ నాలుగు లింగభేదంతో ఎనిమిది అవుతున్నాయి. వీటి స్వరూపం కూడా పరమేశ్వరియే అందుకే ఆవిడ అష్టమూర్తి.

663. అజా

పుట్టుకయే లేనిది. అష్టమూర్తుల రూపం ధరించి ఉన్నప్పటికీ, జీవులకు ఉండేటటువంటి షడ్భావవికారాలు లేనిది. షడ్భావవికారాలు అంటే :

1. పుట్టటము	3. ఉండటము	5. క్షయం కావటము
2. పెరగటము	4. పరిణామం చెందటము	6. నశించటము

ఇవి ఏవీకూడా లేనటువంటిది. భావవికారాలు లేనటువంటిది. నిత్యము సత్యము అయిన పరబ్రహ్మస్వరూపము.

664. జైత్రీ

ప్రసిద్ధమైన అవిద్యారూపాన్ని జయించినది. అజ్ఞానాన్ని జయించి తన వశంలో ఉంచుకున్నది. జ్ఞానస్వరూపిణి. సర్వమును జయించినది. సర్వమును తనకు లోబరచుకున్నది. సర్వమును అతిక్రమించి ఉన్నది. సర్వప్రపంచాన్నీ ఏకాధిపత్యంగా పాలించునది. పంచకృత్యపరాయణ అయిన పరమేశ్వరి.

రాక్షసులను వధించిన తరువాత విజయోత్సవం జరిపించుకునేది. సర్వరాక్షససంహార సూచకముగా ఆశ్వీయుజశుద్ధ దశమినాడు విజయోత్సవము చేసుకునేది. ఆ రోజు విజయదశమి. ఈ రకంగా విజయం కలిగినది కాబట్టి జైత్రీ అనబడుతుంది.

665. లోకయాత్రా విధాయినీ

పధ్నాలుగు లోకాలయొక్క సృష్టిస్థితిలయాలనబడే యాత్రను చేసే స్వభావం గలది. ఈ లోకాలలో జన్మించే ప్రతిజీవికీ వారు చేయవలసిన పనులు అన్నీ ముందుగానే నిర్ణయిస్తుంది. కాబట్టి లోకయాత్రా విధాయినీ అనబడుతోంది. లోకంలోని మానవాళికి వర్ణాశ్రమధర్మాలను విధించినది. గత జన్మలో చేసిన కర్మల ఫలితాలను అంటే సంచితకర్మను వారు తరువాత జన్మలలో జాగ్రత్తగా అనుభవించేటట్లు ఏర్పాటు చేసేది. ఆ కర్మ ఫలితము అనుభవించటానికి అనుగుణంగా శరీరాన్నిఏర్పాటుచేసేది.

జీవులు తాము చేసిన కర్మలననుసరించి వారికి మానవులు, పశువులు, పక్షులు, గంధర్వులు, యక్షులు. ఇలా వారికి జీవనవిధానం ఏర్పరుస్తుంది. వారందరూ ఆ విధంగా కర్మఫలం అనుభవించేటట్లు చూస్తుంది. కాబట్టి ఆ పరమేశ్వరి లోకయాత్రా విధాయినీ అనబడుతుంది.

666. ఏకాకినీ

ఒంటరిగా ఉండేది. ఇంకొకరు ఎవరూలేనిది. బృహదారణ్యకోపనిషత్తులో చెప్పినట్లుగా ఈ సృష్టికి పూర్వం మానవాకారంలో ఉన్న విరాడాత్మ మాత్రమే ఉండేది. అతని కన్న భిన్నమైనది ఏదీలేదు. అంతటా నేనే ఉన్నాను అనుకున్నాడు. పురుషాకారంలో ఉన్న ప్రజాపతి తాను ఒక్కడే అయి ఉండి కూడా భయభ్రాంతుడైనాడు. కాని తాను తప్ప ఇంకెవరూ లేరనే ఆలోచనతో ఆ భయాన్ని పోగొట్టుకున్నాడు.

పరమేశ్వరుడు ఏకాకి. ఒంటరివాడు. అతనితో సమానమైనవారుగాని, అతని కన్నఎక్కువైన వారుగాని ఎవరూ లేరు. **ఏకమేవాద్వితీయమ్ బ్రహ్మ.** పరబ్రహ్మ అద్వితీయమైనది. రెండవది అనేదిలేనిది. సజాతీయత, విజాతీయత మొదలైన ఏరకమైన భేదభావాలు లేనటువంటిది. శ్రీమద్భాగవతంలో

ఒరులు గారు నాకు ఒరులకు నే నౌదు
ఒంటివాడను చుట్ట మొకడు లేడు

అతనికి ఎవరూ ఏమీకారు. అంటే అతడికి ప్రేమ, అభిమానం, ఆప్యాయత, అనురాగం ఏవీ ఉండవు. ఎవరి మీదా పక్షపాతం ఉండదు. కాని అందరికీ అతడు కావాలి. ఒంటరివాడు, చుట్టాలు, పక్కాలు ఎవరూలేనివాడు. నా అనేవారు ఎవరూ లేనివాడు. అందుకే ఆ పరమేశ్వరుడు ఏకాకి.

667. భూమరూపా

భూమరూపము అంటే పరబ్రహ్మరూపము. సర్వాధారస్వరూపము. ఏ అవస్థలో రెండవది కనపడదో, రెండవది వినపడదో, అటువంటి స్థితి భూమారూపము. అదే తురీయావస్థ. పరమసుఖావస్థ. ఇంద్రియాలన్నీ మనసులో, మనసు బుద్ధిలో, బుద్ధి ఆత్మలో లయమయ్యేస్థితి భూమారూపము. అమృతస్వరూపమైనది. నిత్యము సత్యమైనది. నిరవధికమైనది. అఖండమైనది. అటువంటిస్థితిలోనే పరమేశ్వరి ఎల్లవేళలయందు ఉంటుంది కాబట్టి భూమరూపా అనబడుతుంది.

భూమ అంటే అనేకము అని అర్థం. పరమేశ్వరి ఏకాకి అయినప్పటికీ అనేకరూపాలు గలది. దేవీపురాణంలో దేవి ఏకాకి అయినప్పటికీ ఉపాదులచే భూమ అవుతున్నది. స్ఫటికము తెల్లగా ఉన్నప్పటికీ అనేక రంగులతో అనేకరీతులుగా కనిపిస్తుంది. అలాగే పరమేశ్వరి కూడా అనేకరూపాలు గలది అని చెప్పబడింది. వాయువు ఒకటేకాని సుగంధ,

దుర్గంధ భరితమవుతున్నది అలాగే ఉమాదేవి కూడా కూర్మపురాణంలో కామేశ్వరీ, శక్తి ఒకటే అయినప్పటికీ ఉపాధిభేదంతో ఒకరికి పరాశక్తిగా ఇంకొకరికి వేరుగా కనిపిస్తుంది అని చెప్పబడింది.

668. నిర్ద్వైతా

ద్వైతభావనలేనిది. పరమేశ్వరి ఏకాకి. ఇంకొకరెవరూ లేనిది. పరబ్రహ్మస్వరూపము. నిర్ద్వైతా. రెండవవారులేనిది. కంటికి కనిపించే జగత్తంతా ద్వైతము. భగవంతుడు వేరు భక్తుడు వేరు అనేది ద్వైతభావన. ఇటువంటి భావన లేనిది పరమేశ్వరి. ఇది అద్వైతభావన. అంటే భక్తుడు భగవంతుడు ఇద్దరూ ఒకటే. జగత్తంతా పరబ్రహ్మ స్వరూపము. అంతకుమించినది ఏదీలేదు. ఆకాశంలో కనిపించే సూర్యునిలో ఉన్న తేజస్సే నాలోనూ ఉన్నది. అగ్నిలో ఉన్న తేజస్సే నాలోనూ ఉన్నది. దూరంగా మిలమిలామెరిసే నక్షత్రాలలో ఉన్న తేజస్సే నాలోనూ ఉన్నది.

ఛాందోగ్యోపనిషత్తులో ఉద్దాలకుడు తన కుమారుడైన శ్వేతకేతువుతో "మానవుడు నిద్రించేటప్పుడు ఆత్మలో తాత్కాలికంగా లీనమవుతాడు. మరణకాలంలో వాక్కు మనసులో లీనమవుతుంది. మనసు ప్రాణంలో లీనమవుతుంది. ప్రాణం తేజస్సులో లీనమవుతుంది. చివరకు అది పరమశక్తితో కలిసిపోతుంది. ఆ శక్తి అతి సూక్ష్మమైనది. కాని విశ్వమంతా వ్యాపించి ఉన్నది. అదే సత్యము. అదే నిత్యము. అదే ఆత్మ. అదే నీవు శ్వేతకేతూ అదేనీవు.

జీవించినంత కాలము పులి, సింహము, క్రిమి కీటకము ఇత్యాది పేర్లుంటాయి. మరణించిన తరువాత ఆ పేర్లన్నీ పోతాయి. జీవికి గుర్తింపు ఉండదు. ఆ జీవి పరమాత్మలో చేరిపోతుంది. అదే నీవు. శ్వేతకేతూ ఆ పరమాత్మే నీవు అని చెబుతాడు. ఇది అద్వైతసిద్ధాంతం. భగవంతుడు, భక్తుడు ఇద్దరూ వేరుకాదు. జీవాత్మ అజ్ఞానంతో ఉన్నంతవరకూ తాను వేరు అనుకుంటుంది. బంధనాలు విడివడి అజ్ఞానపు పొరలు తొలగిపోతే తానే పరబ్రహ్మ అని తెలుస్తుంది.

బ్రహ్మవి ద్బ్రహ్మై వ భవతి

బ్రహ్మ నెరిగినవాడు కూడా బ్రహ్మమే. ఈ రకంగా అద్వైతసిద్ధాంతాన్ని ప్రతిపాదిస్తుంది కాబట్టి పరమేశ్వరి నిర్ద్వైతా అనబడుతుంది.

815. నిత్యతృప్తా

నిత్యము తృప్తి చెందేది. కేవలం భక్తి మాత్రంచేతనే ప్రీతి చెందేది.

తృప్తి అనేది ఆనందం యొక్క లక్షణం. పరమేశ్వరి బ్రహ్మానందమే స్వరూపముగా గలది. కాబట్టి నిత్యతృప్తా అనబడుతోంది. పరమేశ్వరిని అర్చించటానికి అనేక పూజావిధానాలున్నాయి. చతుష్షష్ట్యుపచారాలు, షోడశోపచారాలు ఈ రకంగా అనేకమున్నాయి. కాని

పత్రం పుష్పం ఫలం తోయం యో మే భక్త్యా ప్రయచ్ఛతి ।
త దహం భక్త్యుపహృతం అశ్నామి ప్రయతాత్మనః ॥

భక్తితో సమర్పించే నీటిబొట్టుతోనైనా సరే నేను సంతసిస్తాను. అంటున్నాడు భగవానుడు.

పైన చెప్పిన ఉపచారాలన్నీ సంప్రదాయసిద్ధము. కార్యసాధనకు అనుకూలము. వాటివల్ల పనులు జరుగుతాయి. కాని భగవత్సాక్షాత్కారం కావాలి అంటే భక్తి, అందులోనూ తాదాత్మ్యము ఒక్కటే ప్రధానమైనది. భక్తులు చేసే ఉపచారముతో నిత్యము తృప్తి చెందేది.

816. మునిమానసహంసికా

మహర్షుల యొక్క మనస్సు అనే సరోవరంలో తిరుగాడే ఆడు హంస.

మంత్రానుష్ఠానంలో నిష్ణాతులైన వారిని మునులు అంటారు. వారియొక్క మనస్సునందు సదా పరమేశ్వరిని ధ్యానిస్తుంటారు. కాబట్టి ఆ పరమేశ్వరి ఎల్లవేళలయందు వారి హృదయాలలోనే ఉంటుంది. వారి మనసులే 'మానస సరోవరం'. హంసలు మానస సరోవరంలోనే తిరుగాడుతాయి. కాబట్టి పరమేశ్వరి అనే హంస మునులయొక్క మనస్సు అనే సరోవరంలో తిరుగాడుతుంటుంది.

లలితా త్రిశతిలో 211వ నామము **హ్రీంకార దీర్ఘికాహంసీ** అని చెప్పబడింది. దీర్ఘికము అంటే దిగుడు బావి. హ్రీంకారమనే దిగుడుబావిలో ఆ పరమేశ్వరి హంస. రాజోద్యానవనంలో క్రీడాసరస్సు హ్రీంకారము. అక్కడివారికి హాయినిచ్చినట్లే సంసార సాగరమనే వనంలో సంచరించే మానవులకి హ్రీంకారమనే సరస్సు హాయినిస్తుంది. ఆహ్లాదాన్ని కలుగచేస్తుంది. అందులోని హంసను, ఆ పరమేశ్వరిని చూసినప్పుడు తాపసులు తాము పడ్డశ్రమ అంతా మరచిపోతారు.

కామేశ్వరీ కామేశ్వరులు హంస ద్వంద్వముగా చెప్పబడ్డారు. సౌందర్యలహరిలోని 38వ శ్లోకంలో అనాహతపద్మాన్ని వర్ణిస్తూ శంకరభగవత్పాదులవారు

సమున్మీల త్సంవి త్కమల మకరందైకరసికం ।
భజే హంసద్వంద్వం కి మపి మహతాం మానసచరమ్ ॥

శరీరంలో ఇడ పింగళ నాడులున్నాయి. అవి ఉచ్ఛ్వాస, విశ్వాసలను చేస్తుంటాయి. ఈ శ్వాసక్రియనే హంస అంటారు. సమాధికోరే సాధకుడు ఈ శ్వాసను బంధిస్తాడు. అప్పుడు ఆ శ్వాసగమనం ఆగిపోతుంది. ఇలా ఎంతసేపు శ్వాసను దిగ్బంధం చెయ్యకలడనేది అతని సాధనమీద అది ఆధారపడి ఉంటుంది. శ్వాసను బంధించి, శ్వాసమీద ఆధిపత్యం సంపాదించగలవాడు పరమహంస అనబడతాడు. శంకర భగవత్పాదులవారు పరమహంస అని పిలువబడ్డారు.

పుణ్యానందముని ఆశ్రమంలో కూర్చుని ఉన్న సమయంలో ఆకాశంలో శివశక్తులు రెండూ హంసల రూపంలో ఎగురుతూ మాట్లాడుకున్న విషయాన్నే 'కామకలావిలాసము' అనే పేరుతో ఒక గ్రంథాన్ని వ్రాశాడు. దానికి **శ్రీవిద్యాసర్వస్వము** పేరుతో మేము తెలుగులో వివరణ వ్రాశాము.

817. సత్యవ్రతా

సత్యము అంటే – బ్రహ్మ. సత్యమే వ్రతముగా గలది. బ్రహ్మవ్రతమే ప్రియముగా గలది. పరబ్రహ్మను సేవించే వ్రతాలలో యజ్ఞము శ్రేష్ఠమైనది. యజ్ఞమే విష్ణుస్వరూపమని గతంలో వివరించాం. ఆ విష్ణువు పరమేశ్వరిఅంశ సంభూతుడు. యజ్ఞము పరమేశ్వరి స్వరూపము. అందుచేత పరమేశ్వరి సత్యవ్రతా అనబడుతోంది.

ఎల్లవేళల యందు పరమేశ్వరి ధ్యానము, ఉపాసన మొదలైన వాటియందు మనసును లగ్నం చెయ్యటమే బ్రహ్మోపాసన. అదే సత్యవ్రతము.

దేవీభాగవతంలో సత్యవ్రతుని కథ ఒకటుంది. పూర్వకాలంలో కోసలదేశంలో దేవదత్తుడు అనే పండితుడు ఉండేవాడు. అతనికి చాలాకాలం సంతానంలేదు. మిగిలిన పండితులతో ఆలోచించి పుత్రసంతానం కోసం తమసానదీ తీరాన యజ్ఞం చెయ్యటం ప్రారంభించాడు ఆ యజ్ఞానికి.

సహోత్రుడు	– బ్రహ్మ
యాజ్ఞవల్క్యుడు	– అధ్వర్యుడు

బృహస్పతి - హోత
గోబిలుడు - ఉద్గాత
సమర్ధులైన పండితులు - ఋత్విక్కులు

ఉద్గాత అంటే యజ్ఞ సమయంలో సామవేదాన్ని పారాయణ చేసేవాడు. గోబిలుడు వేదాన్ని చక్కగా పారాయణ చేస్తున్నాడు. దేవతలు కూడా దీనికి బాగా సంతోషించారు. కాని ఒకరోజు వేదపారాయణ చేస్తుండగా ఊపిరి పట్టి స్వరం తప్పు వచ్చింది. దానికి దేవదత్తుడు కోపించి "ఓరి మూర్ఖుడా! పుత్రులకోసం నేను యజ్ఞం చేస్తుంటే నువ్వు వేదాం తప్పు చదువుతావా? దానివల్ల నాకు చెడుఫలితం రాదా?" అన్నాడు. ఆ మాటలకు కోపించిన గోబిలుడు "నాకు ఊపిరి పట్టటం వలన స్వరం తప్పు వచ్చింది. అంతేకాని నేను కావాలని తప్పు చదవలేదు. అయినప్పటికీ నన్ను 'మూర్ఖుడు' అన్నావు కాబట్టి నీకు మూర్ఖుడైన కుమారుడే పుడతాడు" అన్నాడు.

ఆ మాటలు విన్న దేవదత్తుడు చాలా విచారించి పుత్రులు లేకపోయినా పరవాలేదు. అంతేకాని మూర్ఖుడైనవాడు, విద్యావిహీనుడు అయిన కుమారుడు ఉండి ప్రయోజనం ఏముంటుంది. అంటూ దుఃఖించాడు. ఆ రకంగా శపించినందుకు గోబిలుడు కూడ చాలా చింతించి 'నేను తొందరపడకుండా ఉంటే బాగుండేది. సరే. ముందుగా నీకు మూర్ఖుడు పుట్టినా, పరమేశ్వరి అనుగ్రహంవల్ల తరువాత వాడు గొప్పపండితుడౌతాడు అన్నాడు.

దేవదత్తుని భార్య గర్భవతి అయి మగశిశువును ప్రసవించింది. బాలుడికి ఏడు సంవత్సరాలు వయసురాగానే, ఉపనయనం చేసి, వేదం చెప్పటం మొదలుపెట్టాడు. ఎంతకాలమైనప్పటికీ బాలుడికి వేదం రాలేదుసరికదా పలకటానికి నోరుకూడా తిరగలేదు. దాంతో తోటిపిల్లలు ఎగతాళి చెయ్యటం మొదలుపెట్టారు. అది భరించలేని బాలుడు ఇంట్లోనించి వెళ్ళిపోయి గంగానదీ తీరం చేరాడు. అక్కడ తపస్సు చేద్దాము అని అతడి సంకల్పం. కాని ఏం చెయ్యాలో, ఎలా చెయ్యాలో తెలియదు. చిన్న పర్ణశాల నిర్మించుకుని ప్రతిరోజూ మధ్యాహ్నందాకా అందులో కదలకుండా కళ్ళుమూసుకుని కూర్చునేవాడు. అపరాహ్ణం వేళ అడవిలోకి పోయి, దొరికిన కాయో పండో తిని మళ్ళీ పర్ణశాలలో అదే స్థితిలో కూర్చునేవాడు. ఎవరితోనూ మాట్లాడేవాడు కాదు. అయితే ఎల్లవేళలా సత్యమే చెప్పేవాడు. అందుచేత అతణ్ణి అందరూ సత్యవ్రతుడు అనేవారు. అలా చాలా రోజులు గడిచినాయి.

ఒక రోజు అడవిలో వేటగాడు ఒక పందిని తరుముతూ వస్తున్నాడు. అది అరుచుకుంటూ సత్యవ్రతుడి ఆశ్రమం ప్రక్కనుంచిపోయింది. ఆ పంది చేసిన శబ్దం 'ఐం'కారంలా వినిపించింది సత్యవ్రతుడికి. దాంతో వాగ్బీజమైన ఐంకారాన్ని జపించటం మొదలుపెట్టాడు సత్యవ్రతుడు. ఆకాశంలో అదే సమయంలో పార్వతీ పరమేశ్వరులు వెడుతున్నారు. సత్యవ్రతుడి దీక్షకుమెచ్చి పాండిత్యాన్ని అనుగ్రహించింది పరమేశ్వరి.

వేటగాడు పందిని తరుముకుంటూ వచ్చి సత్యవ్రతుణ్ణి చూసి పంది ఎటుపోయింది అని అడిగాడు దానికి సత్యవ్రతుడు.

యా పశ్యతి న సా బ్రూతే యా బ్రూతే సా న పశ్యతి
అహో । వ్యాధ । స్వకార్యార్థిన్ ! కింపృచ్ఛసి పునఃపునః

ఓ కిరాతకుడా ! నీ పని కావాలనే కోరికతో నన్ను మాటిమాటికీ అడుగుతున్నావు. చూసే కనులు మాట్లాడలేవు. మాట్లాడే నోరు చూడలేదు. కాబట్టి నేను ఏం చెప్పగలను. ఈ మాటలకు అందరూ ఆశ్చర్యపోయారు. సత్యవ్రతుడు తరువాత కాలంలో పెద్దపండితుడుగా ప్రసిద్ధి చెందారు.

818. సత్యరూపా

సత్యమే రూపముగా గలది. సత్యాన్ని రక్షించునది.

పరమేశ్వరి త్రికాలములందు ఉంటుంది. కాబట్టి సత్యమైనది. మిగిలిన దేవతలు ఎక్కడో మాత్రమే గలరు. కాని పరమేశ్వరి అన్ని జీవులయందు ఉన్నది. లోకంలో అన్నీ పరమేశ్వరి రూపమే. కాబట్టి ఆమె 'సత్యరూపా' అనబడుతోంది.

819. సర్వాంతర్యామినీ

సమస్తమైన అంతఃకరణలను నియమించునది. పరమేశ్వరి సర్వజీవులయొక్క హృదయాకాశములయందు జీవరూపంలో ఉంటుంది. జీవులను సృష్టించి, తాను ఆ జీవులందు ప్రవేశిస్తుంది. ఐతరేయోపనిషత్తులో "ఈ రకంగా పరబ్రహ్మ జీవకోటిని సృష్టించి, తాను ఆ జీవరాసిలో ప్రవేశించాలి అనుకుంది. అందుకు రెండే మార్గాలు ఉన్నాయి. 1. పై నుంచి 2. క్రింద నుంచి

క్రిందనుంచి ప్రవేశించటమనేది సేవకుల లక్షణం కాబట్టి పైనుంచి అంటే బ్రహ్మరంధ్రంద్వారా శరీరాలలో ప్రవేశించింది" అని చెప్పబడింది.

హకార సంజ్ఞగల పరమేశ్వరుడు, సకారసంజ్ఞ గల ప్రకృతితో కలిసి శబళ బ్రహ్మమై, తొమ్మిదిద్వారాలు గల మానవ శరీరము అనే పట్టణంలో ప్రవేశించి, ఇంద్రియాలు, ప్రాణాలు, మనస్సుతో కూడినవాడై, పంజరంలో బంధించబడిన పక్షిలాగా, బయటకు వచ్చే ఉపాయం తెలియక, ప్రాపంచిక బంధనాలలోపడి కొట్టుమిట్టాడుతున్నాడు. అంటువంటి హంస అనబడే జీవుడికి

అగ్ని, చంద్రమండలాలు	-	రెక్కలు
ఓంకారము	-	శిరస్సు
జ్ఞాననేత్రము	-	ముఖము
హకార సకారాలు	-	పాదాలు

ఈ రకంగా ఉన్న హంస అనే జీవుడు పాలలో కలిసిన నెయ్యిలాగా సమస్త ప్రాణికోటిని ఆవరించి ఉన్నాడు. అందుచేతనే పరమేశ్వరి సర్వాంతర్యామిణీ అనబడుతోంది.

820. సతీ

పాతివ్రత్యాత్ సద్రూపత్వాచ్చ సతీ

పాతివ్రత్యము సద్రూపముగా గలది కాబట్టి సతి. దక్షుని యొక్క కుమార్తె సతి.

సత్ అంటే - బ్రహ్మ అని అర్థం. త్రికాలములందు ఉండునది. భూతభవిష్యద్వర్తమాన కాలాలలో ఉండేది. కాబట్టి సతీ అనగా - బ్రహ్మము. నిత్యము సత్యమైనది.

పతివ్రత. పతియే వ్రతముగా గలది. అన్నివేళలయందు భర్తనే అనుసరించేది.

దక్షుని కుమార్తె దాక్షాయణి. తండ్రిచేస్తున్న యజ్ఞానికి వెళ్ళి, అక్కడ పరాభవింపబడి, యోగాగ్నిలో భస్మమై, మరుజన్మలో హిమవంతుని ఇంట హైమవతిగా జన్మించింది.

దేవీ సప్తశతిలోని ప్రథమ చరితంలో

1. కాళీ	3. ఛిన్నమస్తా	5. భువనేశ్వరీ	7. కుబ్జా
2. తారా	4. సుముఖీ	6. బాలా	

మధ్యమ చరితంలో

1. లక్ష్మీ	3. కాళీ	5. గాయత్రీ	7. సరస్వతి
2. లలితా	4. దుర్గా	6. అరుంధతి	

ఉత్తమ చరితంలో

1. బ్రాహ్మీ	3. కౌమారి	5. వారాహి	7. చాముండా
2. మాహేశ్వరి	4. వైష్ణవి	6. మాహేంద్రి	

వీరందరూ సమిష్టి రూపాలయిన

1. నందా	3. శాకంభరీ	5. రక్తదంతికా	7. భ్రామరీ
2. శతాక్షి	4. భీమా	6. దుర్గా	

ఏడుగురు సతులు అని చెప్పబడుతున్నారు. వీరందరి సమిష్టిరూపమే పరమేశ్వరి. అందుచేత సతీ అని చెప్పబడుతున్నది.

821. బ్రహ్మాణీ

పంచభూతాలయందు అంతర్యామిగా ఉండేది బ్రహ్మ. దీన్ని జ్ఞానంతో మాత్రమే సాధించగలము. చతుర్దశ భువనాలకు ఆధారమైంది బ్రహ్మ. తనకన్న ఎక్కువైనది మరొకటి లేదు. సర్వము తానే అయినది. అంతటా తానే ఉండేది. ఆది మధ్యాంత రహితమైనది. శుద్ధ బుద్ధ ముక్త స్వరూపము. సంతత శ్రీకరము. సకల మంగళకరము. ఈ జగత్తునంతా ఆవరించి ఉన్నది.

తైత్తిరీయంలో చెప్పినట్లుగా

విజ్ఞానమయకోశము లోపల ఆనందమయ కోశమున్నది. ఇక్కడ ఆనంద మయుడున్నాడు. అతడికి

ప్రియము (తనవారిని చూసినప్పుడు కలిగే ఆనందం)	-	శిరస్సు
మోదము (కోరుకున్నది లభించునపుడు కలిగే సంతోషము)	-	దక్షిణపక్షమ
ప్రమోదము (మోదము ఎక్కువైనప్పుడు కలిగేది)	-	ఉత్తరపక్షము
ఆనందము (అన్నిటికీ మించిన సంతోషము)	-	ఆత్మ

చరాచర జగత్తంతా బ్రహ్మమే. ఆకాశానికి కారణం బ్రహ్మ. అతడు స్వయంభువు. ఆనందకారకుడు. బ్రహ్మనుగూర్చిన ఆనందంతోనే గాలి వీస్తోంది. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఇంద్రాది దేవతలు తమ విధులను నిర్వహిస్తున్నారు.

ఈ రకంగా ఆనందమయ కోశంలో ఉన్న పరమేశ్వరి స్వరూపమే బ్రహ్మాణీ అనబడుతోంది.

822. బ్రహ్మజననీ

సకల ప్రపంచాన్ని పుట్టించునది కాబట్టి జనని. సృష్టికి పూర్వమే ఉన్నది. సృష్టి చెయ్యాలని సంకల్పించినప్పుడు, ముందుగా బ్రహ్మ విష్ణు మహేశ్వరులను సృష్టించింది. ఈ రకంగా సృష్టికర్త అయిన బ్రహ్మను సృష్టించింది. కాబట్టే ఆమె బ్రహ్మ జననీ అనబడుతోంది. వేదాలు బ్రహ్మముఖం నుంచే వచ్చాయి. అవి పరబ్రహ్మ స్వరూపాలు. ఆ వేదాలను సృష్టించింది కూడా పరమేశ్వరియే కాబట్టి బ్రహ్మజననీ అనబడుతోంది. జ్ఞానులంతా పరబ్రహ్మను చేరాలి, సాయుజ్యం పొందాలి అనుకుంటారు. అటువంటి బ్రహ్మభావన వారిలో కలుగచేసేది పరమేశ్వరి. కాబట్టి బ్రహ్మజననీ అనబడుతోంది.

823. బహురూపా

నామరూపాత్మకమైన జగత్తును సృష్టిస్తున్నది. అంతటా తానే ఉన్నది. అన్ని జీవులయందు తానే ఉన్నది. ఈ రకంగా అన్ని రూపాలలోనూ ఉన్నది కాబట్టి పరమేశ్వరి బహురూపా అనబడుతుంది. దేవీ పురాణంలో

బహూని యస్యా రూపాణి స్థిరాణి చ చరాణిచ
దేవమానుషతిర్యంచో బహురూపా తత శ్శివా

స్థావర జంగమాత్మకమైన ఈ జగత్తులో అన్ని రూపాలు ఆ పరమేశ్వరివే. దేవతలు, మానవులు. అందరూ ఆమే. అందుచేత బహురూపా అనబడుతున్నది.

లింగపురాణంలో

శంకరాః పురుషాః సర్వే స్త్రియ స్సర్వా మహేశ్వరీః
స్త్రీలింగ మఖిలం గౌరీ పుంలింగం తు మహేశ్వరః

లోకంలోని పురుషులంతా శివస్వరూపులు కాగా స్త్రీలంతా శక్తిస్వరూపులు. ఈ రకంగా శివా శివరూపంలో ఈ ప్రపంచమంతా పరమేశ్వరీ స్వరూపమే అవుతుంది. కాబట్టి బహురూపా అనబడుతోంది. వామన పురాణంలో

విశ్వం బహువిధం జ్ఞేయం సా చ సర్వత్ర వర్తతే
తస్మా త్సా బహురూపత్వా ద్బహురూపా శివా మతా ॥

అనేక విధాలుగా ఉన్న ఈ ప్రపంచంలో అన్నిరూపాలలోను పరమేశ్వరి కనిపిస్తుంది. కాబట్టి బహురూపా అనబడుతోంది. నారదపురాణంలో

ఉమైవ బహురూపేణ పత్నీత్వేన వ్యవస్థితా

ఉమాదేవియే శివుని అన్ని రూపాలయందు పత్నిగా ఉన్నది కాబట్టి బహురూపా అనబడుతోంది.

విద్యలన్నీ పరమేశ్వరి రూపాలే

బాల	మహావిద్య	వారాహి
పంచదశి	సౌభాగ్యవిద్య	బగళా
షోడశి	శుద్ధవిద్య	అశ్వారూఢా

ఇలా ఒకటేమిటి? అన్నిరకాల విద్యలూ పరమేశ్వరి స్వరూపమే. కాబట్టి ఆమె బహురూపా అనబడుతుంది.

824. బుధార్చితా

బుధులచేత అర్చించబడునది. బుధులు అంటే పండితులు జ్ఞానులు అని అర్థం. భగవానుడు గీతలో చెప్పినట్లుగా

చతుర్విధా భజంతే మాం జనా స్సకృతినోఽర్జున ।
ఆర్తో జిజ్ఞాసు రర్థార్థీ జ్ఞానీ చ భరతర్షభ ॥

అర్జునా ! చోరులవల్ల, వ్యాధులవల్ల ఆపదలు పొందేవాడు, నా తత్త్వాన్ని తెలియగోరువాడు, ధనాన్ని కోరేవాడు, దరిద్రుడు, వీరంతా నన్ను అర్చిస్తారు.

ఇక్కడ పండితులు, జ్ఞానులేకాక అనేకమంది అనేక రకాలయిన కోరికలతో పరమేశ్వరిని అర్చిస్తారు. అయితే ఐహికవాంఛాపరులంతా బాహ్యపూజలు చేస్తే, జ్ఞానులు అంతఃపూజ చేస్తారు. ఈ రకంగా వీరు పరమేశ్వరి సాయుజ్యం కోరి ఆమెను అర్చిస్తారు కాబట్టి దేవి బుధార్చితా అనబడుతుంది.

825. ప్రసవిత్రీ

పిపీలికాది బ్రహ్మపర్యంతము ప్రసవింప చేయునది కాబట్టి పరమేశ్వరి ప్రసవిత్రీ అనబడుతున్నది. ఆ దేవి అనేకకోటి బ్రహ్మాండాలకు తల్లి. విష్ణు ధర్మోత్తరంలో

ప్రజానాం చ ప్రసవనాత్ సవితేతి నిగద్యతే

భూతములను సృష్టించింది కాబట్టి సవిత అనబడుతుంది దేవీపురాణంలో

బ్రహ్మాద్యాః స్థావరాంతాశ్చ యస్యా ఏవ సముద్గతాః

మహదాది విశేషాంతం జగద్యస్యాః సముద్గతం

తా మేవ సకలార్థానాం ప్రసవిత్రీం పరాం నమః ॥

బ్రహ్మము మొదలు స్తంభము వరకు అన్నింటికీ జన్మకు కారణభూతురాలయిన పరమేశ్వరికి నమస్కారము. అని చెప్పబడింది.

ఈ రకంగా సకల జగత్తును ప్రసవింపచేసింది కాబట్టి ప్రసవిత్రి అనబడుతుంది.

826. ప్రచండాజ్ఞా

చండా – కోపము గలది. ప్రచండా తీవ్రమయిన కోపముగలది. ఆజ్ఞ – శాసనము. ఆ పరమేశ్వరి తీవ్రమైన శాసనములు గలది. ఆమె యొక్క ఆజ్ఞలు మీరటానికి లేదు. శాసనాలు ధిక్కరించటానికి లేదు. ఎదురులేని పాలనాతంత్రము గలది. చండశాసనురాలు తైత్తిరీయంలో

పరబ్రహ్మను గూర్చిన భయంతోనే గాలి వీస్తున్నది. సూర్యుడు ఉదయిస్తున్నాడు. ఇంద్రాదిదేవతలు తమ విధులను సక్రమంగా నిర్వర్తిస్తున్నారు. దేవతలు తమ విధులను సక్రమంగా నిర్వర్తించటానికి కారణము బ్రహ్మ ఉండటమే. అని చెప్పబడింది. అందుచేత జగత్తులో ప్రతివిషయము సక్రమంగా జరుగుతున్నదంటే దానికి కారణము పరమేశ్వరిపట్ల భయము అందుకే ఆమె ప్రచండాజ్ఞా అనబడుతోంది.

827. ప్రతిష్ఠా

సకల జగత్తులకు అధిష్ఠానము కాబట్టి విశ్వాసాన్ని ప్రతిష్టిస్తున్నది. అందుచేత పరమేశ్వరి ప్రతిష్ఠా అనబడుతోంది. ఈ జగత్తంతటికీ ఆమె ఆధారభూతురాలు. బ్రహ్మగీతలో

ప్రతిష్ఠా సర్వవస్తూనాం ప్రజ్ఞైషా పరమేశ్వరి

పరమేశ్వరి స్వరూపమైన విజ్ఞానమే ప్రపంచమున ప్రతివస్తువుకు ఆధారమైనది. అన్నీ ఆ దేవియందు ప్రతిష్ఠించబడి ఉన్నాయి కాబట్టి ఆమె ప్రతిష్ఠా అనబడుతోంది. ఈ ప్రపంచం సమృద్ధిగా ఉండటానికి కారణమైనది కాబట్టి, పరమేశ్వరి ప్రతిష్ఠా అనబడుతున్నది.

828. ప్రకటాకృతిః

అందరిచేత అనుభవించదగు రూపము గలది ప్రతిష్ఠితమైన కారణమే ప్రకటాకృతి. తాము ఎవరు అనేది ఎవరికీ తెలియదు. కాని హృదయస్థానమందు తాకి గుండెలమీద చెయ్యి వేసుకుని అందరూ నేను అని చెబుతారు. అంటే పరమేశ్వరుడు హృదయస్థానంలో ఉన్నాడని తెలియకుండానే చెబుతున్నారు. సూతసంహితలో

త మహం ప్రత్యయవ్యాజాత్ సర్వే జానంతి జంతవః ।

తథాపి శివరూపేణ న విజానంతి మాయయా ॥

అతనిని అహం అని అందరూ తెలుసుకొనుచున్నారు. కాని మాయచేత అతడే శివుడు అని తెలుసుకోలేకపోతున్నారు. శ్రీచక్రముయొక్క ప్రథమావరణ. భూపురము త్రైలోక్యమోహన చక్రము. అందులో ఉండే యోగిని పేరు ప్రకటయోగిని.

ప్రకటమైన ఆకారం కలిగి, ఇంద్రియాలకు కనిపించే రూపంలో ఉన్నది. లోకాలన్నీ ఆవరించి దృశ్యమానమైంది కాబట్టి పరమేశ్వరి ప్రకటాకృతిః అనబడింది.

829. ప్రాణేశ్వరీ

ప్రాణాలకు ఈశ్వరి. అధిష్ఠాన దేవత. ముఖ్యప్రాణము. ఇంద్రియాలకు అధిష్ఠాన దేవత. వేదంలో పరమేశ్వరుడు ప్రాణానికి ప్రాణము అని చెప్పబడింది.

శరీరంలో ప్రాణము ఐదు రూపాలుగా ఉంటుంది.

1. ప్రాణ
2. అపాన
3. వ్యాన
4. ఉదాన
5. సమాన వాయువులు

ఈ ఐదింటికీ ముఖ్య ప్రాణస్వరూపిణి ఆ పరమేశ్వరి. జీవరాశి (ప్రాణులు) ముఖ్యంగా మూడు రకాలు.

1. అండజాలు – గ్రుడ్డు నుంచి పుట్టినవి
2. జారజాలు – స్త్రీ జననేంద్రియం నుంచి పుట్టినవి.
3. ఉద్భిజాలు – భూమి నుంచి పుట్టినవి.

జీవులు తమ కర్మఫలాన్ని అనుసరించి పునర్జన్మ పొందుతుంటాయి. ఈ రకంగా వాటికి జన్మనిచ్చేది పరమేశ్వరి. అన్ని ప్రాణులమీద అధికారం కలిగినది కాబట్టి ఆమె ప్రాణేశ్వరీ అనబడుతోంది.

830. ప్రాణదాత్రీ

ప్రాణానాం ధాత్రీ

ప్రాణములనిచ్చునది. జగత్తులన్నింటినీ జీవింపచేయునది, జగత్తులోని జీవులందరికీ పరమేశ్వరి వారి వారి కర్మఫలాన్ని బట్టి ప్రాణాలను అంటే మరుజన్మనిస్తుంది. కాబట్టి ప్రాణధాత్రీ అనబడుతుంది.

831. పంచాశత్పీఠరూపిణీ

అక్షరాలు మొత్తం 51. అచ్చులు 16 హల్లులు 35 ఇవి పీఠాలు. వీటిని మాతృకాపీఠాలు అంటారు. తంత్రశాస్త్రాలలో పీఠాలు 51 అని ఉన్నది. ఆ పీఠాల రూపంలో ఉన్నటువంటిది.

ఋగ్వేదంలో **ఆదిక్షాంతమూర్తిః** అంటే అకారము నుంచి క్షకారందాకా ఉన్న 51 అక్షరముల రూపమే పరబ్రహ్మ. అని చెప్పబడింది. అదే పరమేశ్వరి స్వరూపం.

ఈ మాతృకారూపిణి నుండే సకల మంత్రశాస్త్రము వచ్చింది. వాగ్రూపాలలో వైఖరీ స్థానాలయిన 51 పీఠాలు భారతదేశంలోని వివిధ ప్రదేశాలలో ఉన్నాయి. వీటినే మాతృకాపీఠాలు అంటారు.

కామరూపం వారణాసీ నేపాలం పౌండ్రవర్ధనం
పురస్థిరంకాన్యకుబ్జమ్ పూర్ణశైలం తథార్బుదం
ఆమ్రాత్రకేశ్వరైకామ్రం త్రిస్రోత్రః కామకోటకం
కైలాసం భృగునగరం కేదారం చంద్రపుష్కరం
శ్రీపీఠ మోంకారపీఠం జాలంధ్రం మాలవం తథా
కులాంతకం దేవీకోటం గోకర్ణం మారుతేశ్వరం
అట్టహాసం చ విరజం రాజగేహం మహాప థం
కోలాపుర మేలాపురం కాలేశశ్చ జయంతికా
ఉజ్జయిన్యపి చిత్రా చ క్షీరకం హస్తినాపురం
ఉద్దేశశ్చ ప్రయాగాఖ్యాం షష్ఠీమాయాపురీ తథా

జలేశో మలయః శైలో మేరు ర్గిరివర స్తథా
మహేంద్రో వామనశ్చైవ హిరణ్యపురమేవచ
మహాలక్ష్మి పురోఢ్యానం ఛాయాఛత్ర మతః పరం
ఏతే పీఠా సముద్దిష్టా మాతృకా రూపకాస్థితాః ॥

1. కామరూపము	18. ఓంకారపీఠము	35. క్షీరకము
2. వారణాసి	19. జాలంధరము	36. హస్తినాపురము
3. నేపాలము	20. మాలాఓత్కలము	37. ఓడ్డీశము
4. పౌండ్రవర్ధనము	21. కులాంతము	38. ప్రయాగ
5. పురస్థిరము	22. దేవీకోటము	39. షష్ఠము
6. కన్యాకుబ్జము	23. గోకర్ణము	40. మాయాపురము
7. పూర్ణశైలము	24. మారుతేశ్వరము	41. జలేశము
8. అర్బుదము	25. అట్టహాసము	42. మలయము
9. ఆమ్రాతకేశ్వరము	26. విరజము	43. శైలము
10. ఏకామ్రము	27. రాజగేహము	44. మేరువు
11. త్రిస్రోతము	28. మహాపథము	45. గిరివరము
12. కామకోటకము	29. కోలాపురము	46. మహేంద్రము
13. కైలాసము	30. మేలాపురము	47. వామనము
14. భృగునగరము	31. ఓంకారము	48. హిరణ్యపురము
15. కేదారము	32. జయంతికము	49. మహాలక్ష్మి
16. పూర్ణచంద్రము	33. ఉజ్జయిని	50. ఓడ్యాణము
17. శ్రీపీఠము	34. చిత్రము	51. ఛాయాఛత్రము

ఈ 51 పీఠాలకు సమానమైన స్థానాలు శ్రీచక్రంలోను మానవదేహంలోనూ ఉన్నాయి.

శ్రీపర్వతం శిరస్థానే కేదారంతు లలాటకే ।
వారణాసీ మహాప్రాజ్ఞ ! భృవోర్ఘాణస్యమధ్యమే ॥
కురుక్షేత్రం కుచస్థానే ప్రయాగం వ్రాత్సరోరుహే ।
చిదంబరంతు హృత్పద్మా ఆధారే కమలాలయం ॥

ఆత్మతీర్థం సముత్సృజ్య బహిస్తీర్థాని యోవ్రజేత్ ।
కంఠస్థన మహారత్నం త్యక్త్వా కాచంవిమార్గతే ॥
తీర్థాని తోయ పూర్ణాని దేహాని కాష్ఠాది నిర్మితాన్ ।
యోగినో న ప్రపూజ్యంతే స్వాత్మ ప్రత్యయకారణమ్ ॥

శివమాత్మని పశ్యంతి ప్రతిమాసు న యోగినః ।
అజ్ఞానాం భావనార్థాయ ప్రతిమాః పరికల్పితాః ॥

ఈ రకంగా చెప్పటంవల్ల మాతృకావర్ణరూపిణి అయిన దేవి మాతృకాపీఠ రూపిణి అయింది.

832. విశృంఖలా

సంకెలలు లేనిది అదుపులేనిది. పరమేశ్వరి సర్వస్వతంత్రమయి. ఆమె అధికారానికి ఏ హద్దూ లేదు. భక్తులయొక్క సంసార శృంఖలాలను జ్ఞానజ్యోతులచే త్రెంచి పారేస్తుంది. యోగులకు శృంఖలాలయిన గ్రంథులను భేదిస్తుంది. కాబట్టి పరమేశ్వరి విశృంఖలా అనబడుతుంది.

విశృంఖలా – వస్త్రహీన. దిగంబరి. అలంపురి మొదలైన శక్తి క్షేత్రాలలో పరమేశ్వరి దిగంబరి. కాబట్టి విశృంఖలా అనబడుతుంది.

833. వివిక్తస్థా

వివిక్తము అంటే – జనులు లేని పవిత్రప్రదేశము. ఎక్కడైతే లోకులు కనిపించరో ఆదేశమంతా పవిత్రము. అందుచేతనే తపస్సు చేసేటప్పుడు నిర్జన ప్రదేశంలో, పవిత్రమైన చోట మాత్రమే చెయ్యాలి.

పరమేశ్వరి తాను విడిగా ఉండటంచేత వివిక్తస్థా అనబడుతుంది. పంచభూతాల మధ్యన ఉన్నప్పటికీ వాటితో ఆమెకు సంబంధం లేదు. జీవులమధ్యన ఉన్నప్పటికీ వారితో సంబంధం లేదు. లోకంలో ఎన్నిరకాల ఆకారాలున్నప్పటికీ వాటితో సంబంధం లేకుండా, భిన్నంగా, ఒకే ఆకారంతో ఉండేది. లోకవ్యవహారాలు లేనిచోట ఉంటుంది. ఆకాశంలో ఉంటుంది.

834. వీరమాతా

వీరులు అంటే – శ్రీవిద్యలో నిష్ణాతులైనవారు ఉపాసక శ్రేష్ఠులు. ఈ విషయం 'మహావీరేంద్రవరదా' అనే నామంలో వివరించబడింది.

యుద్ధంలో వెన్ను చూపనివారు వీరులు. వీరిని రక్షించునది.

ఉత్సాహం సాహసం ధైర్యం బుద్ధిఃశక్తిః పరాక్రమః
షడైతే యత్ర తిష్టంతి తత్ర దేవోఽపి తిష్ఠతి

ఉత్సాహము, సాహసము, ధైర్యము, బుద్ధి, శక్తి, పరాక్రమము, ఇవి ఎక్కడుంటాయో, దేవతలు కూడా అక్కడే ఉంటారు.

ఇవన్నీ వీరుల లక్షణాలు. కాబట్టి వీరులను రక్షిస్తుంది.

మహావీరులైన త్రిమూర్తులు, ఇంద్రుడు, దిక్పాలకులు, కుమారస్వామి, గణపతిలకు తల్లి.

835. వియత్ప్రసూః

వియత్ అనగా – ఆకాశము. ఆకాశాన్ని ప్రసవించినది. సృష్టిలో అన్నింటికన్నా ముందు నుంచి ఉన్నది. ఆత్మనుంచే అన్నీ ఆవిర్భవించినాయి. వేదంలో 'ఆత్మ నుంచి ఆకాశం పుట్టింది' అని చెప్పబడింది.

పరమేశ్వరినుంచే మహతత్త్వము. దాని నుంచి అహంకారము పంచభూతాలు ఉద్భవించినాయి. కాబట్టి ఆకాశానికి తల్లి పరమేశ్వరి. అందుకే వియత్ప్రసూః అని చెప్పబడింది.

836. ముకుందా

ముక్తినిచ్చేది కాబట్టి ముకుందా అనబడుతోంది. పరమేశ్వరి తనను నమ్మినవారికి, భక్తులను, జ్ఞానులకు వారి అర్హతలను బట్టి ముక్తినిస్తుంది కాబట్టి ముకుందా అనబడుతుంది.

కదాచి దాద్యా లలితా పుంరూపా కృష్ణవిగ్రహా

పరమేశ్వరి అయిన లలితాంబికయే. ముకుందుడు అనగా కృష్ణుని రూపం ఎత్తింది.

సప్తశతి ద్వాదశోధ్యాయంలో

వైవస్వతేం తరే ప్రాప్తే అష్టావింశతిత మే యుగే ।
శుంభో నిశుంభశ్చైవాన్ ఉత్పత్యేతౌ మహాసురౌ ॥
నందగోపగృహే జాతా యశోదాగర్భసంభవా ।
తతస్తౌన్నాశయిష్యామి వింధ్యాచలనివాసినీ ॥

వైవస్వత మన్వంతరంలోని 28వ మహాయుగంలో శుంభ నిశుంభులని ఇద్దరు రాక్షసులు పుడతారు. అప్పుడు నేను నందగోపుని ఇంట యశోదా గర్భాన పుట్టి, వారిని సంహరించి, వింధ్యాచలం మీద ఉంటాను. అని చెప్పబడింది. అందుచేత లలితాంబిక యే శ్రీకృష్ణుడు. అందుచేతనే పరమేశ్వరి ముకుందా అనబడుతోంది.

837. ముక్తినిలయా

పంచవిధముక్తులకు స్థానమైనది. పరమేశ్వరిని అర్చించేవారికి ఐదురకాల ముక్తులు వారి వారి అర్హతలను బట్టి లభిస్తాయి.

1. మణిపూరంలో పరమేశ్వరిని ఆరాధించేవారు దేవిపురానికి దగ్గరగా ఇంకొక పురము నిర్మించుకుని ఉంటారు. దీన్ని 'సార్ష్టిరూపముక్తి' అంటారు.

2. అనాహతంలో పరమేశ్వరిని అర్చించే వారు దేవి పట్టణంలోనే నివశించగలుగుతారు. దీన్ని 'సాలోక్యముక్తి' అంటారు.

3. విశుద్ధి చక్రంలో పరమేశ్వరిని ఆరాధించేవారు దేవికి అతిదగ్గరగా సేవకులుగా ఉంటారు. దీన్ని 'సామీప్యముక్తి' అంటారు.

4. ఆజ్ఞాచక్రంలో పరమేశ్వరిని పూజించేవారు వేరే దేహం ధరించి, దేవితో సమానమైన రూపంలో ఉంటారు. దీన్ని 'సారూప్యముక్తి' అంటారు.

5. సహస్రారంలో దేవిని అర్చించేవారు జన్మరాహిత్యం పొందుతారు. ఇది 'సాయుజ్యము'.

ఈ రకంగా ఐదురకాల ముక్తులకు స్థానమైనది పరమేశ్వరి.

838. మూలవిగ్రహరూపిణీ

బాల, బగళ మొదలైన శక్తులకు మూలభూతమైనది. ఇది ఒక్కటే శ్రీవిద్య. ఇందులోనుంచి అనేక శక్తులు ఉత్పత్తి అవుతున్నాయి.

మూలము అంటే - కారణము. ప్రపంచానికి కారణం బ్రహ్మ. బ్రహ్మయొక్క స్వరూపమే పరమేశ్వరి. అందుచేత విగ్రహరూపిణీ అనబడుతోంది.

పరమేశ్వరుడికి సృష్టి చెయ్యాలనే సంకల్పం కలిగింది. అంటే తాను అనేకం కావాలనుకున్నాడు. అప్పుడు తనలోనుంచి కొంతశక్తిని బయటకు పంపాడు. ఆ శక్తే మూలవిగ్రహరూపిణి అనబడుతుంది.

మూలము అంటే - మంత్రం. మంత్రం దేవతా స్వరూపము. దేవతలందరినీ సృష్టించింది ఆ పరమేశ్వరి. అంటే దేవతలకు మూలం ఆమే. కాబట్టి మూలవిగ్రహ రూపిణీ అనబడుతోంది.

839. భావజ్ఞా

భావములను ఎరుంగునది. భావనమాత్రము చేతనే తెలియబడునది. పరమాత్మ ఇంద్రియాలవల్ల తెలియబడదు. ఉపనిషత్తులలో ఆత్మను కంటితో చూడలేము, చెవులతో వినలేము, చర్మముతో ఆత్మ ఉనికిని తెలుసుకోలేము. ఆత్మను ఏ ఇంద్రియాలద్వారా తెలుసుకోలేము. జ్ఞానంతో మాత్రమే తెలుసుకోవాలి. ఆత్మ ఉన్నది అని భావన చెయ్యటంద్వారా మాత్రమే ఆత్మను తెలుసుకోవాలి. అందుచేతనే ఆత్మ స్వరూపమయిన పరమేశ్వరి భావజ్ఞా అనబడుతుంది.

840. భవరోగఘ్నీ

భవము అంటే సంసారము. సంసారమనే రోగము. దాన్ని నాశనం చేసేది. భవబంధాలను తెంచివేసేది. నేను నాది అనే అహంకార మమకారాలను నాశనం చేసేది. తద్వారా జ్ఞానాన్ని కలిగించేది.

సంసారబంధనాలు త్రెంచి వెయ్యాలంటే పరమేశ్వరి ధ్యానమే శరణము. దానివల్లనే అజ్ఞానం పటాపంచలవుతుంది. భవబంధాలనుండి విముక్తి కలుగుతుంది. అందుచేతనే భవరోగఘ్నీ అనబడుతుంది.

841. భవచక్రప్రవర్తినీ

భవచక్రము అంటే - సంసార చక్రం. పరమేశ్వరి ఈ సంసార చక్రాన్ని ప్రవర్తింపచేస్తుంది. కాబట్టి భవచక్ర ప్రవర్తినీ అనబడుతుంది. మనుస్మృతిలో చెప్పినట్లుగా పరమేశ్వరుడు సమస్త భూతాలయందు వ్యాపించి సృష్టి స్థితి లయాలను ఎల్లప్పుడూ నడిపిస్తున్నాడు. కాబట్టి సంసారమనే బండిని నడిపించేది పరమేశ్వరియే.

జన్మించిన తరువాత జీవి కర్మను చేస్తూనే ఉంటుంది. ఆ కర్మఫలితాన్ని మరణానంతరము స్వర్గ నరకాలలో అనుభవించి, కర్మశేషాన్ని అనుభవించటంకోసం మళ్ళీ జన్మిస్తుంది. మళ్ళీ కర్మ చేస్తుంది. ఈ రకంగా సంసారమనే బండి చక్రంలో పడి గిరగిరా తిరుగుతూ ఉంటుంది. జీవి చేసిన కర్మననుసరించి ఉత్తర జన్మలనిచ్చేది పరమేశ్వరి. ఈ రకంగా సంసారచక్రాన్ని త్రిప్పేది పరమేశ్వరి. అందుచేతనే ఆమె భవ చక్రప్రవర్తినీ అనబడుతుంది.

భవచక్రము అంటే – అనాహతము. అనాహతంలో ఉండేది. దహరాకాశరూపిణి. ఆ పరమేశ్వరి.

శ్రీచక్రంలోని శివచక్రాలు, భవచక్రాలనబడతాయి. వీటిని ప్రవర్తింపచేసేది పరమేశ్వరి కాబట్టి భవచక్ర ప్రవర్తినీ అనబడుతోంది.

842. ఛందస్సారా

ఛందస్సు అంటే – వేదము. పరమేశ్వరి వేదరూపంలో ఉంటుంది కాబట్టి ఛందస్సారా అనబడుతున్నది. వేదసారాంశమే దేవి.

ఛందస్సు – గాయత్రి మొదలగు మంత్రాలు. పరమేశ్వరి గాయత్రి మొదలగు మంత్రస్వరూపంలో ఉన్నది. మంత్ర సారాంశమే పరమేశ్వరి.

ఛందస్సు అనేది పద్యలక్షణం. సారము అంటే – గొప్పదనము, బలము అని అర్థం. వైఖరీ రూపంలో సరస్వతీ రూపంలో పొగడబడుతుంది.

పరమేశ్వరి వేదరూపంలో ఉన్నది. వైదిక ఛందోబద్ధమైన మంత్రం, మంత్రాల సముదాయమే వేదం. వేదాలసారము – ఉపనిషత్తులు. ఉపనిషత్తులలో ప్రతిపాదించింది పరబ్రహ్మ. ఆ పరబ్రహ్మ స్వరూపమే పరమేశ్వరి. కాబట్టి ఛందోబద్ధమైన వేదమంత్రాల సారము, ఉపనిషత్సారము అంతా ఆ పరమేశ్వరియే. అందుకే ఆమె ఛందస్సారా అనబడుతోంది.

843. శాస్త్రసారా

శాశించేది శాస్త్రము. ఈ రకంగా చెయ్యాలి. ఈ రకంగా చెయ్యకూడదు అని నిర్దేశించేదే శాస్త్రము. శాస్త్రాలు రెండు రకాలు.

1. పౌరుషేయాలు : ఇవి పురుషుడివల్ల చెప్పబడ్డాయి ఇవి మొత్తం పది.

1. పురాణాలు
2. న్యాయశాస్త్రము
3. మీమాంశ
4. ధర్మశాస్త్రము
5. శిక్ష
6. కల్పము
7. వ్యాకరణము
8. నిరుక్తము
9. ఛందస్సు
10. జ్యోతిష్యము

2. అపౌరుషేయాలు : ఇవి సాక్షాత్తూ బ్రహ్మముఖం నుండి వచ్చినాయి. ఇవే చతుర్వేదాలు. ఈ రకంగా మొత్తం శాస్త్రాలు 10+4=14. వీటన్నింటికీ పరమేశ్వరియే కారణము. వీటిసారము పరమేశ్వరియే అందుచేతనే శాస్త్రసారా అనబడుతోంది.

844. మంత్రసారా

దైవాధీనం జగ త్సర్వం మంత్రాధీనం తు దైవతమ్

చరాచర జగత్తు అంతా కూడా దైవము యొక్క అధీనంలో ఉంటుంది. దైవం మంత్రానికి అధీనం అయి ఉంటుంది. కాబట్టి మంత్రానికి ప్రాముఖ్యత ఉన్నది.

మననాత్త్రాయత ఇతి మంత్రః

మననము చేయుటవలన మననము చేయువానిని రక్షించునది మంత్రము. దేవతల దయకు పాత్రులు కావాలంటే మంత్ర జపం చెయ్యాలి. దీన్నే ఉపాసన అంటారు.

అరణి మధిస్తే అగ్ని ఎలా పుడుతుందో అలాగే మంత్రాన్ని జపించినట్లైతే శక్తి పుడుతుంది. ఆ శక్తి సాధకుడికి సర్వార్థాలూ చేకూరుస్తుంది. బీజాక్షరాలచే సంపుటం చేయబడిన మంత్రజపంవల్ల దేవతానుగ్రహం త్వరగా కలుగుతుంది. ఆయా దేవతలయొక్క తత్త్వాలకు అనుగుణమైన బీజాక్షరాలు ఋషులచేత సంపుటీకరణం చేయబడ్డాయి.

పరమేశ్వరుని బీజం ఓంకారము. అలాగే

1. శ్రీం – లక్ష్మీబీజం
2. క్లీం – మన్మథ బీజం
3. గం – గణపతి బీజం
4. ఐం – వాగ్బీజం
5. హ్రీం – మాయాబీజం

దేవతలకే కాక పంచభూతాలకు కూడా విడివిడిగా బీజాక్షరాలున్నాయి.

1. లం	–	పృథివీబీజం	4. రం	–	అగ్నిబీజం
2. హం	–	ఆకాశబీజం	5. వం	–	అమృతబీజం
3. యం	–	వాయుబీజం			

ప్రతి మంత్రంలోనూ దేవత పేరూ, బీజాక్షరాలూ ఉంటాయి. అసలు మంత్రాలు మూడు రకాలు అవి

1. వైదికములు 2. తాంత్రికములు. 3. అపభ్రంశములు

1. వేదాలలో చెప్పబడిన మంత్రాలను వైదికమంత్రాలు అంటారు అవి జ్ఞానప్రదాలు.
2. కామ్యప్రదమైనవి తాంత్రికాలు.
3. సంస్కృతంలో కాక ఇతర భాషలలో ఉన్న మంత్రాలను అపభ్రంశాలు అంటారు.

వైదికా ప్రణవై ర్యుతా ప్రణవేన విహీనంతు
తాంత్రికా ఏవ ప్రకీర్తితాః ॥

ఓంకార సహితములైనవి వైదికమంత్రాలని, ఓంకార రహితములైనవి తాంత్రికాలని చెప్పబడుతున్నాయి.

మంత్రాలను స్త్రీ, పురుష, నపుంసకమంత్రాలు అని మూడు రకాలుగా విభజించవచ్చు.

'స్వాహా' అనే పదము చివరకలవి స్త్రీ మంత్రాలు.

'హుంఫట్' అనే పదము చివర కలవి పురుష మంత్రాలు.

'నమః' అనే పదం చివర కలవి నపుంసక మంత్రాలు

పురుష దేవతలనుపాసించే వాటిని – మంత్రాలని

స్త్రీ దేవతలనుపాసించే వాటిని – విద్యలని అంటారు. వీటిలో

ఒక అక్షరము గల మంత్రాలను	– పిండము
మూడు అక్షరములు గల మంత్రాలను	– కర్తరులు
మూడు నుంచి తొమ్మిది వరకు అక్షరాలు గల మంత్రాలను	– బీజము
పది నుంచి ఇరవై అక్షరాలు గల మంత్రాలను	– మంత్రాలు అని
ఇరవై కన్న ఎక్కువ అక్షరాలున్న మంత్రాలను	– మాలామంత్రాలు అంటారు.

వైదిక మంత్రాలు సమయాచారానికి, తాంత్రిక మంత్రాలు కౌళ, వామాచారాలకు సంబంధించినవి. ఈ రకంగా మంత్రాల సారాంశమంతా పరమేశ్వరి స్వరూపమే కాబట్టి ఆమె మంత్రసారా అనబడుతుంది.

845. తలోదరీ

తలము అంటే లోకము. బ్రహ్మాండము అని అర్థం. లోకాలను ఉదరముగా గలది. విరాడ్రూపిణి. దేవియొక్క పాదాది శిరః పర్యంతము చతుర్దశ లోకాలు అని భావిస్తే తలము అనే లోకము ఉదరము అవుతుంది. అందుచేత తలోదరి అనబడుతుంది. సర్వానికి కారణస్థానమైనది. కృశించిన ఉదరము గలది.

846. ఉదారకీర్తిః

మహత్తరమైన కీర్తి గలది. సర్వత్రా వ్యాపించిన కీర్తి గలది. పరమేశ్వరిని ఉపాసించటంవల్ల అనతికాలంలోనే కీర్తి దిగంతాలకు వ్యాపిస్తుంది. తన భక్తులకు అపారమయిన కీర్తిని ప్రసాదిస్తుంది.

శ్రీవిద్య అనేది అత్యుత్తమైనది. దాని మంత్ర తంత్రాలను ఉపాసన చేసేవారి పట్ల దేవి అతిశయమైన కీర్తి కలిగి ఉంటుంది. అందుకే పరమేశ్వరి ఉదారకీర్తిః అనబడుతుంది.

847. ఉద్దామవైభవా

దామ అంటే – బంధించే త్రాడు అనంతకోటి బ్రహ్మాండాలకు ప్రభ్వి. పరమపూజ్యమగు దేవత. అనంత స్వరూపిణి. మహదైశ్వర్య సంపన్నురాలు. జ్ఞాన స్వరూపిణి. కేవలము ముక్తియే స్వరూపిణిగా గలది. భక్తులపాలిట కల్పవల్లి కాబట్టి ఉద్దామ వైభవా అనబడుతుంది.

848. వర్ణరూపిణీ

వర్ణముల యొక్క రూపమైనది. వేదంలో నాలుగు వర్ణాలున్నాయని చెప్పబడింది. పురుష సూక్తంలో

బ్రాహ్మణోస్య ముఖమాసీత్ బాహూ రాజన్యః కృతః
ఊరూతదస్య యద్వైశ్యః పద్భ్యాగ్ం శూద్రో అజాయత

పరమేశ్వరుని ముఖం నుంచి	-	బ్రాహ్మణుడు
బాహువుల నుంచి	-	క్షత్రియుడు
ఊరువుల నుంచి	-	వైశ్యుడు
పాదాల నుంచి	-	శూద్రుడు జన్మించారు

భగవద్గీతలో

చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మ విభాగశః

గుణాల, కర్మల విభాగంచేత నాలుగు వర్ణాలను నేను సృష్టించాను అంటున్నాడు భగవానుడు. బృహదారణ్యకోపనిషత్తులో "నామరూపాత్మకమైన సృష్టికి ఆరంభంలో పరబ్రహ్మ స్వరూపం మాత్రమే ఉన్నది. అంటే విరాట్స్వరూపంలో ఉన్న అగ్ని. అదే బ్రాహ్మణరూపం. అంతవరకు క్షత్రియాది ఇతర వర్ణాలు లేవు. క్షత్రియులు లేకపోవటంవల్ల పాలనా వ్యవహారాలు కష్టమైనాయి. అప్పుడు బ్రహ్మ నేను బ్రాహ్మణుడను ఇవి నా విధులు" అని తలచి క్షత్రియుల్ని సృష్టించాడు. దేవతలలో ఇంద్రుడు, సోముడు, వరుణుడు, రుద్రుడు, మేఘుడు, యముడు మొదలైన వారంతా క్షత్రియులే ఇక్కడ ప్రజాపతి క్షత్రియుల్ని ప్రత్యేక ప్రయోజనం కోసం సృష్టించాడు. వారు బ్రాహ్మణులకు రక్షకులు.

క్షత్రియుల్ని సృష్టించిన తరువాత కూడా బ్రహ్మ తన పనిలో కృతకృత్యుడు కాలేకపోయాడు. ధనాన్ని కూడబెట్టేవారు లేకపోవటంవల్ల తన పనిలో సమర్థుడు కాలేకపోయాడు. అందుకని బ్రహ్మ వైశ్య జాతిని సృష్టించాడు. వసువులు, రుద్రులు, ఆదిత్యులు, విశ్వే దేవతలు, మరుత్తులు మొదలైన దేవతలను గణాలుగా సృష్టించాడు. వైశ్యులంతా గణాలుగా, సమూహాలుగా సృష్టించబడ్డారు.

వసువులు	-	8
రుద్రులు	-	11
ఆదిత్యులు	-	12
విశ్వేదేవతలు	-	13
మరుద్గణాలు	-	49
దేవ వైశ్యులు	-	93 మంది

సేవకులు లేకపోవటంవల్ల బ్రహ్మ తన పనిలో సమర్థుడు కాలేకపోయాడు. అందుచేత శూద్రులను సృష్టించాడు. పూషుడు శూద్రుడు. భూమియే పూష. పూషా దేవతయే అందర్నీ పోషిస్తున్నది అని చెప్పబడింది.

ఈ రకంగా నాలుగు వర్ణాల వారిని పరమేశ్వరుడే సృష్టించాడు. ఇక్కడ మనం సరిగా అర్థం చేసుకోవలసినది ఏమంటే

1. బ్రహ్మ తేజస్సుతో ఉన్నవాడు బ్రాహ్మణుడు. సత్యాన్వేషి. బ్రహ్మదర్శనం కోసం పరితపించేవాడు. అతని ముఖం అగ్ని తేజస్సుతో ప్రకాశిస్తుంటుంది.

2. బ్రాహ్మణులను రక్షించటానికి వచ్చినవాడు క్షత్రియుడు. రక్షణ అతని విధి. కాబట్టి పరాక్రమ సంపన్నుడు. బాహు బలం కలవాడు. బ్రహ్మయొక్క బాహువులే ఇతని జన్మస్థానం.

3. ధనం సంపాదించటానికి, రహస్యంగా ఉంచటానికి ఆవిర్భవించినవాడు వైశ్యుడు. గుహ్యమైన స్థానం ఊరువులు. అందుచేతనే వైశ్యుడు బ్రహ్మ ఊరువుల నుంచి ఉద్భవించాడని చెప్పబడింది.

4. వీరందరినీ పోషించాలి కాబట్టి శూద్రుడు జన్మించాడు. ఇతడి కర్తవ్యం మిగిలినవారి పోషణ. వ్యవసాయము అందుచేతనే ఇతను పాదాలనుంచి పుట్టాడు.

ఈ రకంగా అన్ని వర్ణాలవారు పరమేశ్వరినుంచే ఉద్భవించారు. కాబట్టి ఆమె వర్ణరూపిణీ అనబడింది.

849. జన్మమృత్యుజరాతప్తజనవిశ్రాంతిదాయినీ

పుట్టటము, పెరగటము, ముసలితనం, మరణం ఈ రకమైన శారీరక మార్పులవల్ల ప్రతి జీవి అవస్థ పడుతూనే ఉంటుంది. అటువంటి అవస్థలను జనులకు లేకుండా చేసేది పరమేశ్వరి.

ఈ సంసార సాగరంలో పూర్వజన్మ కర్మఫలితం వలన జన్మించటం జరుగుతుంది. పుట్టిన ప్రతిజీవికి శారీరకావస్థలు తప్పవు. మరణం తథ్యం. ఈ ప్రక్రియలో అనేకమైన కష్టాలను జీవి అనుభవిస్తాడు. ఈ కష్టాలు రెండు రకాలుగా ఉంటాయి. 1. కర్మఫలం వల్ల వచ్చే కష్టాలు. ఇవి అనుభవించక తప్పదు. 2. మానసికమైన బాధలు. కష్టాలు అనుభవించవలసి వచ్చిందే అని జీవి బాధపడుతుంటాడు. కర్మఫలంవల్ల వచ్చే కష్టాలు

ఎక్కుపెట్టి వదిలిన బాణం లాంటివి. వాటిని అనుభవించక తప్పదు. అవి అనుభవించాల్సి వచ్చింది అని మనం పడే బాధ అసలు కష్టం కన్న ఎక్కువైనది. ఈ రకమైన బాధలను ముందుగా రూపుమాపుతుంది పరమేశ్వరి. తన భక్తులకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించటంద్వారా శాశ్వతమైన ఆనందాన్ని పొందే అవకాశం కల్పిస్తుంది. ఆ ఆనందం ముందు ఈ కష్టాలను మరిచిపోతాడు. ఈ రకంగా ఆత్మజ్ఞానాన్ని పంచి తన భక్తులకు బాధలను తీరుస్తుంది కాబట్టి జన్మమృత్యు జరాతప్తజనవిశ్రాంతిదాయినీ అనబడుతుంది.

850. సర్వోపనిషదుద్ఘుష్టా

పరమేశ్వరి అన్ని ఉపనిషత్తులలోనూ ప్రతిపాదించబడిన పరబ్రహ్మ స్వరూపిణి.

వేదాలు మొత్తం మూడు కాండలుగా ఉన్నాయి. అవి 1. కర్మ 2. ఉపాసన 3. జ్ఞానకాండలు. వీటిలో ఉపాసన, జ్ఞానకాండలను ఉపనిషత్తులు అంటారు.

ఉప అంటే	–	సమీపము నందు
ని అనగా	–	దిగువ స్థానంలో
షద్ అంటే	–	కూర్చునుట

గురువుగారి దగ్గర ఆయన కన్న దిగువస్థానంలో కూర్చుని, వారు చెప్పే బ్రహ్మోపదేశాన్ని శ్రద్ధగా వినటం మనోవాక్కాయ కర్మలలో ఎక్కడా కూడా గురువు తనకన్న తక్కువ వాడు అనే భావన రాకూడదు. గురువు ఏ స్థితిలో ఉన్నప్పటికీ, అతను తనకన్న గొప్పవాడే అని మరిచిపోకూడదు.

ఉపనిషత్తు అంటే బ్రహ్మవిద్య. బ్రహ్మవిద్యా పరిశీలకులైన విద్వాంసులకు కర్మ, జన్మ, మరణాలను లేకుండా చేసేది. ఆ జన్మాది మరణాదికమైన దానిని నశింపచేసేది. బ్రహ్మ పదార్థ లాభాన్ని కలుగచేసేది.

ఉపనిషత్తులన్నీ గురుశిష్య సంవాదంగానే ఉంటాయి. బ్రహ్మశోధకుడైన శిష్యుడు, బ్రహ్మజ్ఞాని అయిన గురువును సమీపించి, ఆయన దగ్గర నియమనిష్ఠలతో కొంతకాలం గడిపి, గురువుగారి అనుగ్రహం పొంది ఆయన దగ్గర బ్రహ్మోపదేశం పొందుతాడు. ఆ సమయంలో శిష్యుడు తన అనుమానాలను అడుగుతుంటాడు. గురువుగారు వాటిని తీరుస్తుంటారు.

వేదాలన్నింటికీ కలిపి 1180 ఉపనిషత్తులు ఉన్నాయి. వాటిలో 108 ముఖ్యమైనవి. అందులోనూ

ఈశ కేన కఠ ప్రశ్న ముండక మాండూక్య తిత్తిరిః
ఐతరేయం చ ఛాందోగ్యం బృహదారణ్యకం దశః

1. ఈశావాశ్యోపనిషత్తు	6. మాండూక్యోపనిషత్తు
2. కేనోపనిషత్తు	7. తైత్తిరీయోపనిషత్తు
3. కఠోపనిషత్తు	8. ఐతరేయోపనిషత్తు
4. ప్రశ్నోపనిషత్తు	9. ఛాందోగ్యోపనిషత్తు
5. ముండకోపనిషత్తు	10. బృహదారణ్యకోపనిషత్తు

ఇవి ముఖ్యమైనవి అన్నారు శంకరభగవత్పాదులవారు

వేదాలయొక్క సారాంశమే ఉపనిషత్తులు. వీటిలో పరమాత్మ స్వరూపాన్ని వివరించటానికి ఎక్కువ ప్రయత్నం చేశారు.

బ్రహ్మసత్యం జగన్మిథ్య పరబ్రహ్మ ఒక్కటే సత్యము, నిత్యము అయినది. శాశ్వతమైనది. ఆది మధ్యాంతములు లేనటువంటిది. జన్మమృత్యు జరాదులు లేనటువంటిది. ఎవరియందు ఏ రకమైన అపేక్ష, పక్షపాతము లేనటువంటిది. జీవులు చేసిన కర్మలననుసరించి వారికి పునర్జన్మను ప్రసాదించేది. అర్హత గల వారికి మోక్షాన్ని ఇచ్చేది. **సత్యం జ్ఞానమనంతం బ్రహ్మ** సత్యమైనది. జ్ఞానమయమైనది. అనంతమైనది ఆ పరబ్రహ్మ. ఈ చరాచర జగత్తంతా వ్యాపించి ఉన్నది. చైతన్య రూపంలో అందరి హృదయాలలోనూ కొలువై ఉన్నది. దానికి జాతిబేధం లేదు. రూపబేధం లేదు. లింగబేధం లేదు. అన్ని జీవులయందు పిపీలికాది బ్రహ్మపర్యంతము, బ్రహ్మము మొదలు స్తంభమువరకు అన్నిటా ఆక్రమించి ఉన్నది. అంతటా తానై ఉన్నది. జగత్తులో ఉన్న సర్వపదార్థాలు ఆ పరమేశ్వరుని రూపమే. ప్రాణమున్నవి, ప్రాణము లేనివి, చలనమున్నవి, చలనంలేనివి. అన్నీ పరబ్రహ్మ స్వరూపాలే లోకంలో నాలుగు దిక్కులూ పరబ్రహ్మ స్వరూపమే. సముద్రాలు, నదులు, పర్వతాలు, చెట్లు చేమలు, పశువులు, పక్షులు, క్రిమికీటకాలు అన్నీ పరబ్రహ్మస్వరూపమే దూరంగా ఆకాశంలో ప్రకాశించే సూర్యునిలో ఉన్న తేజస్సే అన్నిజీవులయందు ఉన్నది. అగ్నిలో ఉండే తేజస్సే అన్ని జీవులయందు ఉన్నది. సృష్టిస్థితిలయాలు అతనివల్లనే జరుగుతున్నాయి. బ్రహ్మయందున్న భయంవల్లనే గాలి వీస్తోంది. అగ్నిమండుతోంది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. దిక్పాలకులు తమ పనులను తాము సక్రమంగా నిర్వర్తిస్తున్నారు.

పరబ్రహ్మ త్రికాలజ్ఞుడు. త్రికాలాతీతుడు. త్రిగుణాతీతుడు. సర్వతత్త్వాతీతుడు. అతనివల్లనే ఈ లోకం సృష్టించబడుతోంది. అతనివల్లనే ప్రవర్తిల్లుతున్నది. అతనివల్లనే లయమవుతున్నది. పంచకృత్యాలకు కారకుడు అతడే. మానవదేహంలో పంచకోశాల యందు ఉన్నాడు. అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ కోశాల మధ్య ఆనందమయకోశ మందున్నాడు. అతడు ఎప్పుడూ బ్రహ్మానందం పొందుతూనే ఉంటాడు. అది శాశ్వతమైన ఆనందం. అనిర్వచనీయం అనుభవైక వేద్యం. లోకంలో జరిగే ప్రతిపనికి సాక్షి ఆయన. ప్రళయం జరిగినప్పుడు లోకాలను తన ఉదరంలో దాచుకుని, సృష్టి చెయ్యాలనుకున్నప్పుడు ఆ లోకాలను వమనం చేస్తాడు. అంటే బయటకు పంపుతాడు.

సృష్టి ఆరంభం కాక ముందు తానొక్కడే ఉన్నాడు. సృష్టి అంతమైన తరువాతకూడా అతడే ఉంటాడు. అతడు సత్యము నిత్యమైనవాడు. అతన్ని ఎవరైతే తెలుసుకుంటారో వారుకూడా బ్రహ్మత్వాన్ని పొందుతారు. **బ్రహ్మవిద్ బ్రహ్మైవభవతి** ఆ పరబ్రహ్మే ఈ పరమేశ్వరి. కాబట్టి ఆమె 'సర్వోపనిషదుద్ఘుష్టా' అనబడుతోంది.

851. శాంత్యతీతకలాత్మికా

ఆకాశమునందుండేకల శాంత్యతీతకల. దాని స్వరూపమందుండునది. శైవాగమంలో

శాంత్యతీతకలా ద్వైతనిర్వాణానంద బోధదా

శాంత్యతీతకల అంటే ద్వైతభావన తొలగించి, ఆనందాన్ని బోధించేది అని చెప్పబడింది. కాబట్టి పరమేశ్వరి ద్వైతబుద్ధిని తొలగించి మహదానందాన్నిస్తుంది. అని భావము.

సహస్రారంలో ఉండే కల శాంత్యాతీతకల. కలలలో ఉత్తమమైనది. జ్ఞానమే స్వరూపముగా గలది. ఇదే ధృవకల, సాదాఖ్యకల, చిత్కల, బ్రహ్మకల, పరాకల అనబడుతోంది.

852. గంభీరా

అంతములేనిది. అనంతమైనది కాబట్టి గంభీరా అనబడుతోంది. మహోద్రూపురాలు.

జ్ఞానైశ్వర్యబల వీర్యాదిభి ర్గంభీరా

జ్ఞానము, ఐశ్వర్యము, బలము, వీర్యము, మొదలగు వానిచే నిండి ఉన్నది. కాబట్టి పరమేశ్వరి గంభీరా అనబడుతున్నది.

పరమేశ్వరి అనంతమైనది. ఆమె ఈ విశ్వాన్ని ఇచ్ఛాశక్తితో సృజించి కాపాడి గంభీరురాలై, దేశకాలాలకు అతీతమై ప్రకాశిస్తుంటుంది. అని శివసూత్రాలలో చెప్పబడింది.

పరమేశ్వరి జ్ఞానస్వరూప. ధ్యానకాలంలో ఆమెను మహోహ్రదముగా భావించి ధ్యానించినట్లైతే మంత్రసిద్ధి జరుగుతుంది.

853. గగనాంతస్థా

గగనమునందుంటుంది. ఆకాశమునందు ఉంటుంది. దహరాకాశమందుంటుంది. భూతాకాశమందుంటుంది. పరాకాశమందుంటుంది. మహాప్రళయకాల మందు ఆకాశము నశించినప్పటికీ పరమేశ్వరి మాత్రం ఉంటుంది.

గగనము అంటే హకారము. అంతస్థములు అనగా – య ర ల వ లు ఇవి పంచభూతాల బీజాలు. ఈ రకంగా పంచభూత స్వరూపిణి అయిన పరమేశ్వరి హ య ర ల వ రూపిణి.

పరమేశ్వరి ఆకాశంలో ఉంటుంది అంటే భూతాకాశంలో ఉంటుంది. దహరాకాశంలోనూ ఉంటుంది. అందుచేతనే గగనాంతస్థా అనబడుతోంది.

854. గర్వితా

గర్వము అంటే – జగత్తును నిర్మించే పరాహంత. అటువంటి పరాహంత ఈమెయందు పుట్టినది. స్వాధిష్ఠానంలో ఉండే దేవి పీతవర్ణ, అతిగర్వితా అని చెప్పబడుతోంది.

855. గానలోలుపా

తతము, అనద్ధము, సుషిరము, ఘనము అనే నాలుగు విధములగుంపే గానము. అటువంటి గానమందు ఆసక్తి కలది.

పరమేశ్వరి, శ్రీకృష్ణుని స్వరూపమని గతంలో వివరించాం. ఆ శ్రీకృష్ణుడు మురళీగాన లోలుడు, కాబట్టి శ్రీకృష్ణుని స్వరూపమయిన పరమేశ్వరి గానలోలుపా అనబడుతుంది.

గతంలో పరమేశ్వరి సామగాన ప్రియ అని కూడా చెప్పబడింది. వీణాదులందు ఆసక్తి గలది. సంగీత పాఠములయందు ఆసక్తి గలది.

856. కల్పనారహితా

కల్పనలు లేనిది. ప్రాపంచికపు వాసనలు అన్నీ కల్పితాలు. అటువంటి వాసనలు లేనిది. కల్పాంతము నందు జీవులకు హితవు చేయునది.

ప్రళయకాలంలో కర్మ పరిపక్వంకాని జీవులను తన గర్భమునుంచుకొనునది.

గుణములచే కల్పించబడిన సంకల్ప వికల్పములందుగాని, భావనాకల్పమునందు గాని, రూపకల్పనయందుగాని ఏ రకమైన సంబంధము లేనిది.

కల్పనలు అనేవి దృశ్యానికేగాని దృక్కుకు ఉండవు. పరమేశ్వరి కేవలము ద్రుగ్రూపము. అందుచేత ఆమెకు కల్పనలుండవు.

857. కాష్ఠా

పద్దెనిమిది రెప్పపాట్ల కాలము కాష్ఠ అనబడుతుంది. సప్తశతిలోని పదకొండవ అధ్యాయంలో

కలాకాష్ఠాదిరూపేణ పరిణామ ప్రదాయినీ ।
విశ్వస్యోపరతౌశక్తే నారాయణి ! నమోఽస్తు తే ॥

కాష్ఠ – 18 రెప్పపాట్ల కాలము. కల – 30 కాష్టముల కాలము. ఈ రకంగా కాలంలో మార్పులు కలిగిస్తూ జగత్తును నాశనం చేసే శక్తిగల ఓ నారాయణీ ! నీకు ప్రణామములు. అని చెప్పబడింది. అంటే పరమేశ్వరి కాలస్వరూపిణి.

సా కాష్ఠా సా పరా గతిః

పరమేశ్వరియే గమ్యమైనది. మార్గమైనది. కాబట్టి కాష్ఠా అనబడుతోంది.

కాష్ఠా అనే శబ్దము దారుహరిద్రమందు, కాలమాన భేదమందు ఉన్నది. కాలమానం పైన చెప్పాం ఇక హరిద్రావృక్షముయొక్క కొయ్యముక్క కాష్ఠ అనబడుతుంది. అని మైరాళతంత్రం చెబుతోంది. కాబట్టి పరమేశ్వరి కాలస్వరూపిణి. అలాగే దారు స్వరూపిణి. లింగపురాణంలో

చరాచరాణాం భూతానాం సర్వేషా మవకాశతః
వ్యోమాత్మా భగవా న్దేవో భీమ ఇత్యుచ్యతే బుధైః
మహామహిమ్నో దేవస్య భీమస్య పరమాత్మనః
దశస్వరూపా దిక్పత్నీ సుతః స్వర్గశ్చ సూరిభిః

సకల చరాచరభూతాలకు అవకాశమిచ్చేవాడు వ్యోమాత్మకుడైన దేవుడు భీముడు. ఆ భీమునికి పది దిక్కులయందు భార్యలున్నారు. స్వర్గము అతని కుమారుడు.

వాయుపురాణంలో భీమదేవుని ఆరవదేహము – ఆకాశము, దిక్కులు – భార్యలు, స్వర్గము వారి కుమారుడు అని చెప్పబడింది.

గగనాత్మకుడైన భీముడు అనుపేరు గల పరమేశ్వరుని భార్య కాష్ఠ. స్వర్గమాత. దిక్స్వరూపిణి.

వేదాంతవాక్యములచే నిరూపించబడిన తత్త్వముకూడా కాష్ఠా అనబడుతున్నది. సూతసంహితలో

ప్రతీత మప్రతీతం వా స దస చ్చ పర శ్శివః ।
ఇతి వేదాంతవాక్యానాం నిష్ఠా కాష్ఠేతి కథ్యతే ॥

ప్రత్యక్షముగాగాని, పరోక్షంగాగాని, సత్తుగాని, అసత్తుగాని అదియే పరమశివుడు.

858. అకాంతా

అకము – పాపము, దుఃఖము. వాటిని అంతము లేదా నాశనము చేయునది. పరమేశ్వరి తన భక్తజనుల పాపాలను, దుఃఖాలను నాశనం చేస్తుంది కాబట్టి అకాంతా అనబడుచున్నది.

859. కాంతార్ధవిగ్రహా

విగ్రహము – దేహము. అర్ధవిగ్రహము – అర్ధదేహము. కాంతుడు – భర్త అయిన శివుడు.

తన భర్తయైన ఈశ్వరుని అర్ధదేహంగా గలది. కాంతునియొక్క అర్ధభాగమే కాంతార్ధము. ఇదే నారీశ్వరతత్త్వము.

అర్ధనారీశ్వరుడు అంటే సగం దేహం పురుషుడు. సగం దేహం స్త్రీ అని అర్థం. బొమ్మలో కుడివైపు శివుడు, ఎడమ భాగం పార్వతి ఉంటుంది. ఇది సరికాదు. శరీరాన్ని నిలువుగా కోసినట్లైతే అందులో ఒక భాగం శివుడని, రెండవ భాగం శక్తి అని కాదు. శివశక్తులు ప్రతి అణువులోనూ ఆవరించి ఉన్నారు. ఒక అణువును రెండు భాగాలుగా చేస్తే అందులో ఒక భాగం శివుడుకాగా, రెండవ భాగం శక్తి. ఈ రకంగా జగత్తంతా శివశక్తులమయం అని గుర్తించాలి.

షోడశి మహామంత్రం చెప్పేటప్పుడు, అందులోని పదహారు అక్షరాలను శివ, శక్తి భాగాలుగా విడదీస్తే మొత్తం $16 \times 2 = 32$ భాగాలవుతాయి. అవే నోటిలోని పలువరుస. క్రింది వరుస భాగాలు కాగా పై వరుస శక్తి భాగాలు.

ఈ రకంగా అర్ధనారీశ్వర తత్త్వము అంటే ప్రతి అణువులోనూ శివశక్తులుంటాయి. అందుచేతనే పరమేశ్వరి కాంతార్ధవిగ్రహా అనబడుతుంది.

860. కార్యకారణ నిర్ముక్తా

కార్యములు, కారణములచే విడివడినది. కార్యములు–మహత్వాదులు. కారణములు – మూలప్రకృతి. ఈ కార్యకారణాలు లేనిది. వాస్తవంగా చైతన్యంలో అవి లేవు.

పరమేశ్వరి కార్యరూపమయినటువంటి మహదాది తత్త్వాలతో సూచించబడే నామరూపాత్మకమైన జగత్తును, దానికి కారణమైనటువంటి అవ్యాకృతాన్ని వదిలినటువంటి కేవల నిర్వికారచైతన్య స్వరూపిణి. కాబట్టి 'కార్యకారణ నిర్ముక్తా' అనబడుతోంది. ఆమెకు కారణాలుగాని, కార్యాలుగాని ఏ మాత్రం లేవు.

సూక్ష్మదేహము అంటే పంచప్రాణాలు, దశేంద్రియాలు, అంతఃకరణ చతుష్టయము. వెరసి 19. ఇది కంటికి కనిపించనిది. కాని దీని విశేషం జ్ఞానులకు తెలుస్తుంది. జ్ఞాన చక్షువులకు కనిపిస్తుంది. స్థూలదేహాన్ని ఆయా పనులు చేసేటట్లుగా చూసేది ఈ సూక్ష్మదేహమే. స్థూలదేహంలో ఉన్న ఇంద్రియాలలో ప్రవేశించి ఆ అనుభూతులు పొందుతూ ఉంటుంది. ఈ రకంగా స్థూలదేహం పనులు చేస్తుంది. వాటియొక్క అనుభూతులు పొందేది సూక్ష్మదేహము. సుఖదుఃఖాలు, రాగద్వేషాలు, లోభము, మోహము, శోకము, చింత, అలసత్వము, ఇవన్నీ సూక్ష్మదేహం యొక్క ధర్మాలు. ఇది కారణదేహంలో కలుగుతుంది అందుచేత దానికి ఇది కార్యము అనబడుతుంది.

సూక్ష్మదేహానికి ప్రకృతి కారణము. కాబట్టి అది కారణ దేహము అనబడుతున్నది. అరిషడ్వర్గాలు, జ్ఞానేంద్రియ కర్మేంద్రియాల లక్షణాలు. జ్ఞానము, సంకల్పము, సందేహము మొదలైనవన్నీ ప్రయత్న సాధ్యకృత్యాలు కాబట్టి కృతులు అనబడతాయి. ఇవన్నీ సుషుప్తిలో జీవియొక్క కారణదేహంలో లయమై ఉంటాయి కాబట్టి కారణదేహాన్ని ప్రకృతి అంటారు. సుషుప్తిలో జీవికి ప్రవర్తన ఉండదు. సూక్ష్మదేహం కారణదేహంలో లీనమై ఉంటుంది. అందుచేత సూక్ష్మదేహానికి ఉన్న ధర్మాలన్నీ కారణదేహం నుంచి కలిగినవే.

కారణదేహంలో ఉన్నటువంటి కృత్యాలన్నీ సూక్ష్మదేహానికి వచ్చి అక్కడ నుంచి స్థూలదేహంతో కార్యాలు చేయిస్తాయి. ఈ రకంగా కార్యకారణాలు ఏవీ లేనిది పరమేశ్వరి.

861. కామకేళీతరంగితా

కామస్య కామేశ్వరస్య కేళీనాం క్రీడావిలాసానాం

తరంగాః పరంపరాః సంజాతా అస్యాః

కామేశ్వరుని క్రీడా విలాసములయొక్క పరంపరలు గలది.

కామ	–	కామేశ్వరుని యొక్క
కేళి	–	పంచకృత్య పరాయణత్వము
తరంగిత	–	కలుగునట్లు చేయునది.

జగత్సృష్టికి సంకల్ప స్వరూపమైనది. ఇచ్ఛాశక్తి స్వరూపిణి. సృష్టి చెయ్యాలనే భావాన్ని పరమేశ్వరుడికి కలిగిస్తుంది. పంచకృత్యములు చెయ్యాలనే భావన పరమేశ్వరుడికి కలిగిస్తుంది. అందుచేతనే కామకేళీ తరంగితా అనబడుతోంది.

862. కనత్కనకతాటంకా

కనతీ దీప్యమానే కనకస్య వర్ణమయే తాటంకే కర్ణాభరణవిశేషౌ యస్యాః

దేదీప్యమానంగా ప్రకాశించే చెవికమ్మలు అనబడే బంగారు ఆభరణాలు కలది. సూర్య చంద్రులే కర్ణాభరణాలు.

కన చ్ఛ్రీచక్ర తాటంక విటంక వదనాం బుజా ॥

అంటోంది దేవీభాగవతం. ఇవన్నీ గతంలో 'తాటంక యుగళీభూత తపనోడుపమండలా' అనే నామంలో వివరించబడినాయి.

863. లీలావిగ్రహధారిణీ

అనాయాసముగా అవతారవిశేషములు గలది. పంచకృత్యాలు నిర్వహించేటప్పుడు

సృష్టి చెయ్యటానికి	–	బ్రహ్మగా
స్థితి కార్యానికి	–	విష్ణువుగా
లయం చెయ్యటానికి	–	రుద్రుడుగా

తిరోదానమునకు – మహేశ్వరుడుగా

అనుగ్రహానికి – సదాశివుడుగా

రూపుదాలుస్తుంది. దుష్టశిక్షణ, శిష్టరక్షణ చెయ్యటానికి అనేక రూపాలు దాలుస్తుంది. వీటిలో కొన్ని పూర్తి అవతారాలు. కొన్ని అంశలు అలాగే భక్తులు తనను ఏ రూపంలో ఆరాధిస్తే వారికి ఆ రూపంలోనే దర్శనమిస్తుంది. కాబట్టి ఆమె లీలావిగ్రహధారిణీ అనబడుతోంది.

864. అజా

పుట్టుకలేనిది. భారతంలో "నేను పుట్టలేదు. పుట్టబోను. పుడుతూ ఉండటము ఎప్పుడూ లేదు. సర్వభూతాలకు క్షేత్రజ్ఞుడను నేనే. అందువలన నేను అజుడు అవుతున్నాను" అని చెప్పబడింది. పుట్టటము అనేది చావటంకోసమే పుట్టిన ప్రతివాడికి చావు తప్పదు. చచ్చినవాడు మళ్ళీ పుట్టి తీరతాడు.

పరమేశ్వరి శుద్ధ మాయా స్వరూపము. జననములేనిది. జననములేక వ్యాపించునది. అందుచేతనే అజా అనబడుతున్నది.

865. క్షయవినిర్ముక్తా

క్షయము లేనిది. మరణము లేనిది. నాశనము లేనిది. ఇందాకటి నామంలో పుట్టుక లేనిది పరమేశ్వరి అని చెప్పి ఇప్పుడు నాశనంలేనిది అంటున్నారు. ఈ రకంగా పరమేశ్వరికి జరామరణాలు లేవు. పుట్టుక లేనటువంటిది కాబట్టి ఆమెకు మరణంకూడా లేదు. ఆమె నిత్యము, సత్యము శాశ్వతమైనది.

866. ముగ్ధా

ముగ్ధా సౌందర్యవతీ

సౌందర్యముగలది. ఆ దేవిని గురించి చెప్పేటప్పుడు **సదాషోడశవర్షీయాం** నిత్యము పదహారు సంవత్సరాల ప్రాయమునందుండునది. అందమైన ఆకారము గలది.

867. క్షిప్రప్రసాదినీ

క్షిప్రం స్వల్పదినై రేవ ప్రసీద తీతి

శీఘ్రముగా కొన్ని దినములలోనే అనుగ్రహించునది సౌరపురాణంలో

క్రమేణ లభ్యతేఽన్యేషాం ముక్తి రారాధనా ద్విజాః ।
ఆరాధనా దుమేశస్య తస్మిన్ జన్మని ముచ్యతే ॥

ఇతర దేవతలనారాధిస్తే క్రమంగా ముక్తి కలుగుతుంది. కాని పరమేశ్వరుణ్ణి ఆరాధిస్తే, ఆ జన్మలోనే ముక్తి కలుగుతుంది.

పరమేశ్వరి అనుగ్రహం కావాలి అంటే ఎక్కువ కష్టపడవలసిన అవసరం లేదు. అతిసులభంగా ఆమె ప్రసన్నమవుతుంది.

ఆశానాం పూరకం చక్రం అర్చకానా మహర్నిశం

భక్తులయొక్క కోరికలు అహర్నిశలు తీరుస్తూనే ఉంటుంది. అందుచేతనే క్షిప్ర ప్రసాదినీ అనబడుతుంది.

868. అంతర్ముఖసమారాధ్యా

ఆత్మాభిముఖమైన చిత్త ప్రవృత్తిగలవారిచే బాగుగా ఆరాధింపబడేది.

పూజ రెండు విధాలు 1. బాహ్యాపూజ 2. అంతఃపూజ

1. బాహ్యాపూజ అంటే షోడశ ఉపచారాలు, చతుష్షష్టి ఉపచారాలతో పరమేశ్వరిని పూజించటం.

2. అంతఃపూజ అంటే మన శరీరంలోనే దేవతని అర్చించటం. అంతఃపూజ భావనోపనిషత్తులో వివరించబడింది.

"సలిలమితి సౌహిత్యకరణగ్ం సత్త్వమ్"

ఇక్కడ నుంచి అంతర్యాగము వివరించబడుతోంది. బాహ్యామైన వస్తువులన్నీ విషయ వాంఛలకు ప్రతీకలు. కాబట్టి వాటిని వదలి పెట్టెయ్యాలి. శరీరంలో ఉండే వస్తువులచేతనే పూజ జరగాలి. పూజకు ముఖ్యమైనది జలము. సాధకుని శరీరంలో సత్వరజస్తమో గుణాలున్నాయి. వీటిలో మొదటి దానిని పెంపొందించి, మిగిలిన రెండింటినీ తగ్గించాలి. సత్వగుణమే జలము.

"కర్తవ్య మకర్తవ్య మౌదాసీన్యమితి వివేక భావనాయుక్త ఉపచారః"

ఉపచారాలు : బాహ్యాపూజలో దేవికి రాజోపచారాలు, దేహోపచారాలు, మంత్రోపచారాలు అని వివిధరకాలైన ఉపచారాలున్నాయి. అయితే అంతఃపూజలో

ఉపచారము అంటే నిత్యము కాని వాటిని వదలివేయటము. బ్రహ్మపదార్థమే సత్యము కాబట్టి మిగిలినవి వదలివేయాలి. ఉదాసీనభావము తూష్ణీభావంగా రూపొందకూడదు. ఇదే అంతఃపూజలో ప్రధానమైన ఉపచారము.

"అస్తి నాస్తీతి కర్తవ్యతా అనుపచారః"

అనుపచారాలు : బ్రహ్మము ఒక్కటే సత్యము, నిత్యము. అది కనిపించనంత మాత్రము చేత లేదు. అనుకోరాదు. సర్వజీవరాశులయందు పరబ్రహ్మమున్నది. అంతేకాని బ్రహ్మము లేదనుకోవటము అపచారము తెలియనితనము. అపరాధము. ఇదే అనుపచారము చేయతగనిది.

"బాహ్యాంతఃకరణానాం రూపగ్రహణ యోగ్యతాస్తీ త్యావాహనమ్"

ఆవాహన : దేహంలో బాహ్యేంద్రియాలు, అంతరింద్రియాలు ఉన్నాయి. ఆత్మ అనేది ఈ ఇంద్రియాలద్వారానే ప్రకాశిస్తోంది. కాబట్టి వాటియొక్క దేవతారూపాన్ని ఆవాహన చెయ్యటమే దేవిని ఆవాహన చెయ్యటము.

"తస్యబాహ్యాంతఃకరణానామేకరూప విషయ గ్రహణమాసనమ్"

ఆసనము : శరీరంలో ఉన్న జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలు, మనస్సు, బుద్ధి, చిత్తము, అహంకారము అనే పద్నాలుగు విభిన్నమైన ధర్మాలు కలిగి ఉన్నాయి. ఆ ధర్మాలను అరికట్టి సర్వము బ్రహ్మపదార్థము అని భావించటమే ఆసన సమర్పణ.

"రక్త శుక్ల పదైకీకరణం పాద్యమ్"

పాద్యము : అంటే కాళ్ళు కడుక్కునే నీరు ఆ దేవి సాధకుడి శరీరంలో ద్వాదశాంతంలో ఉన్నది. బ్రహ్మము (ప్రకాశశక్తి) ఆత్మశక్తిలో ప్రవేశించి శుక్లబిందువయింది. విమర్శశక్తి శుక్లబిందువులో ప్రవేశించి రక్తబిందువయింది. ఈ రెండింటి కలయిక వలన మిశ్రమ బిందువు ఏర్పడింది. ఇప్పుడు

రక్తబిందువు	–	చంద్రుడు
శుక్లబిందువు	–	అగ్ని
మిశ్రమబిందువు	–	సూర్యుడు

మిశ్రమ బిందువు నుంచి నాదము, దాని నుంచి కళలు ఆవిర్భవిస్తాయి. ఇప్పుడు మిశ్రమ బిందుస్వరూపమైన కామేశ్వరీద్వంద్వము యొక్క

కుడికాలు	–	శుక్లవర్ణమైన ప్రకాశాంశము
ఎడమకాలు	–	రక్తవర్ణమైన విమర్శాంశము

ఈ రెండు పాదాలనూ ధ్యానిస్తూ, వాటికి భేదము లేదు అనుకోవటమే పాద్యము

"ఉజ్జ్వల దామోదానుసంధానమర్ఘ్యమ్"

అర్ఘ్యము : అంటే చేతులు కడుక్కునే నీరు. శ్రమ తీరటానికి ఇచ్చే అల్పాహారం అంటే త్రాగేందుకు ఇచ్చేనీరు. అంతఃపూజలో ఆత్మయే శ్రీదేవి అని గ్రహించి బ్రహ్మానందాను సంధానము చెయ్యటమే అర్ఘ్యప్రదానము

"స్వచ్ఛం స్వతస్సిద్ధ మిత్యాచమనీయమ్"

ఆచమనము : ఆచమనము అంటే మంత్రపూర్వకంగా నోటిలోకి తీసుకునే నీరు ఆత్మ స్వరూపమైన దేవి స్వచ్ఛమైనది. ఆ స్వచ్ఛత స్వయంసిద్ధమైనది అని గ్రహించుట.

"చిచ్ఛంద్రమయీ సర్వాంగస్రవణగ్ంస్నానమ్"

స్నానము : బాహ్యపూజలో దేవతకు పంచామృత స్నానము చేయిస్తారు. కాని అంతః పూజలో అది లేదు. కుండలినీశక్తి ఆధారచక్రంలో నిద్రిస్తూ ఉంటుంది. సాధకుడు ప్రాణాయామంచేసి కుండలినీ శక్తిని గనక నిద్రలేపినట్లైతే, అది షట్చక్రాలగుండా ప్రయాణించి గ్రంథిత్రయాన్ని భేదించి సహస్రారంచేరి తననోటితో సహస్రదళ పద్మాన్ని కరిచి పట్టుకుంటుంది. అప్పుడు సహస్రారము అనే చంద్రమండలం నుండి అమృతధారలు స్రవించి శరీరంలోని డెబ్బైరెండువేల నాడీమండలాన్నీ తడుపుతాయి. ఈ రకంగా అమృతవర్షము కురిపించటమే ఆత్మదేవత (పరదేవత)కు స్నానము. ఈ అమృతవర్షము వలన శరీరము సమశీతోష్ణమవుతుంది.

"చిదగ్ని స్వరూప పరమానందశక్తిస్ఫురణం వస్త్రం"

వస్త్రము అంటే శరీరాచ్ఛాదనకు ఉపయోగించేది. సాధకుని శరీరంలోని కాంతి అంతా ఆ పరాశక్తి యొక్క తేజస్సే. ఈ విషయం తెలిసి బ్రహ్మానందము పొందుటమే వస్త్రప్రదానము

"ప్రత్యేకగ్ం సప్తవింశతిధా భిన్నత్వేనేచ్ఛాజ్ఞాన క్రియాత్మక బ్రహ్మ గ్రంథి మద్రసతంతు బ్రహ్మనాడీ బ్రహ్మసూత్రమ్"

యజ్ఞోపవీతము : దీన్నే బ్రహ్మసూత్రము అంటారు. జగత్తు అంతా బ్రహ్మమయమని సూత్రము కాబట్టి ఇది బ్రహ్మసూత్రము. దేహంలో ఉండేనాడులలో సుషుమ్నానాడి ముఖ్యమైనది దీన్నే బ్రహ్మనాడి అంటారు. అంతఃపూజలో ఈ సుషుమ్నానాడినే బ్రహ్మసూత్రము అని భావించాలి.

గాయత్రీ మంత్రానికి ప్రతీక యజ్ఞోపవీతము. తొంభై ఆరు బెత్తలు ప్రమాణంకల సూత్రము (దారము) తయారుచేసి దాన్ని మూడుచుట్లు చుట్టాలి. ఇప్పుడు రెండు చివరలుకలిపి ముడివెయ్యాలి. ఇందులోని సూత్రములో మూడుపోగులుంటాయి. అంటే మొత్తం ఇరవై ఏడు పోగులు ఉంటాయి. తోంభై ఆరు బెత్తలు ప్రమాణము తత్త్వములు.

మూడు ఆవృతులు	–	త్రిగుణములు
మూడు ముడులు	–	మూడుగ్రంథులు
మూడు గ్రంథులు	–	బ్రహ్మముడి
ఇరవైఏడు పోగులు	–	ఇరవై ఏడు భేదములు కల జగత్తు

బ్రాహ్మణులు యజ్ఞోపవీతాన్ని ధరించి కర్మలుచేస్తారు. యజ్ఞోపవీతాన్ని తీసివేయట మంటే సన్యాసం స్వీకరించటము. అట్టి సన్యాసి బ్రహ్మకాండను చేసేవాడు. సర్వకర్మ విముక్తుడు జీవన్ముక్తుడు.

సుషుమ్నానాడిలో సూక్ష్మనాడులు కలిసే చోటును గ్రంథి అంటారు.అది ఇరవై ఏడు సూక్ష్మనాడుల సమూహము. అందుకనే సుషుమ్నానాడి యజ్ఞోపవీతము కంటె సత్యమైనది. సహజమైనది. ఇదే కంఠసూత్రము.

"స్వవ్యతిరిక్తవస్తు సంగరహిత స్మరణం విభూషణమ్"

ఆభరణాలు : దేవతకు కంఠసూత్రంతో పాటుగా వివిధ ఆభరణాలు సమర్పించాలి. సాధకుడు తానుకూడా పరబ్రహ్మస్వరూపమే అని,మాయా మోహంచేత తాను మనిషిగా ఉన్నానని గ్రహించి మాయాది వస్తువులతో తనకు సంబంధము లేదు అని వాటిని పరిత్యజించటమే దేవికి ఆభరణాలు అర్పించటము.

"సత్పంగపరిపూతా మన్మరణంగంధః"

గంధము : దేహానికి గంధము రాసుకోవటంచేత సువాసన రావటమే కాకుండా పవిత్రత కూడా వస్తుంది. సాధకుడి సహస్రారంలో ఆ పరాశక్తి ఉన్నది, దాని కాంతిచేతనే అతని శరీరము తేజస్సుతో ప్రకాశిస్తుందని ముందే చెప్పటం జరిగింది. ఈ రకంగా

జరగటంచేత సాధకుడు తాను ఎప్పుడూ పవిత్రుడనే అనే భావం కలిగి ఉంటాడు. ఇదే దేవికి శ్రీచందనం సమర్పణ.

"సమస్త విషయాణాం మననం స్థైర్యేణానుసంధానం కుసుమమ్"

పూజ : భగవంతుణ్ణి భక్తుడు నానావిధ పుష్పాలతో పూజిస్తాడు. ఇంద్రియవాంఛలకు లోనుగాకుండా, మనసును పరబ్రహ్మమందు లయం చేసి, సర్వము బ్రహ్మమయమని తెలుసుకోవటమే పుష్పపూజ.

"అహింసా ప్రథమం పుష్పం, పుష్ప మింద్రియ నిగ్రహః
దయాక్షమాజ్ఞానపుష్పం పంచపుష్పం తతఃపరం"

అహింస, ఇంద్రియనిగ్రహము, దయ, క్షమ, జ్ఞానము అనేవి పంచపుష్పాలు. సాధకుడు అరిషడ్వర్గాలు జయించి, అహంకారమనే పుష్పంతో దేవిని పూజించాలి. అంటే ఈ స్థితిలో నేను, అనే అహంకారాన్ని, నాది అనే భ్రాంతిని వదలివెయ్యాలి.

"తేషా మేవ సర్వదాస్వీకరణం ధూపః"

ధూపం : సాధకుడు ఇంద్రియచాపల్యానికి లోనుగాకుండా, ఇంద్రియాలను తన స్వాధీనంలో ఉంచుకోవటమే ధూపము.

"పవనావచ్ఛిన్నోర్ధ్వజ్వలన వచ్ఛిదుల్కాకాశదేహో దీపః"

దీపం : బ్రహ్మతేజస్సు వాయువుతో కలసి జ్వాలగా ప్రకాశిస్తుంది. అది విశ్వమంతా వ్యాపించి ఉంది. సాధకుడి శరీరము పరబ్రహ్మము యొక్క కాంతి పుంజములతో ప్రకాశిస్తోంది. ఇప్పుడు సాధకుడు ఆకాశాన్నే తన శరీరంగా భావించి, తన శరీరంలో ఉన్న ఆ పరాశక్తిని చిత్కలను దీపముగా భావించటమే దేవికి దీపసమర్పణ.

"సమస్తయాతాయాత వర్జనం నైవేద్యమ్"

నైవేద్యము : పూజానంతరము నైవేద్యము చెయ్యాలి. ఇంద్రియ చాంచల్యము లేకుండా అంటే ఇంద్రియాలను జయించి బ్రహ్మాకారవృత్తితో ఉండటమే నైవేద్యము. ఇది బ్రహ్మానందానుభవము.

"అవస్థాత్రయైకీకరణం తాంబూలమ్"

తాంబూలము : ఆకు వక్క సున్నము కలిస్తే తాంబూలము అవుతుంది. అవే జాగ్ర స్వప్న సుషుప్తి అనే మూడు అవస్థలు. ఆ మూడు అవస్థలను తురీయావస్థలో విలీనం చెయ్యటమే తాంబూల సమర్పణ.

మూలాధారాది బ్రహ్మబిల పర్యంతం, బ్రహ్మరంధ్రాదిమూలాధార పర్యంతం గతాగత రూపేణ ప్రాదక్షిణ్యమ్"

ప్రదక్షిణము : శరీరంలో ప్రాణవాయువు ఆధారచక్రం నుండి సహస్రారము వరకు, సహస్రారం నుంచి ఆధారచక్రం వరకుసుషుమ్నా మార్గంగుండా తిరుగుతూ ఉంటుంది. ఈ రకంగా ప్రాణవాయువు సంచారము చెయ్యటమే ఆత్మరూపంలో ఉన్న దేవతకు ప్రదక్షణము. దీనికే అజపారూప హంస అని పేరు.

హకారసంజ్ఞ గల పరమాత్మ సకార సంజ్ఞగల ప్రకృతితో కలసి హంసరూపమైన శబల బ్రహ్మము అవుతాడు. ఈ శబలబ్రహ్మము తొమ్మిదిద్వారాలు గల మానవశరీరము అనే పట్టణంలో ప్రవేశించి ఇంద్రియములు, ప్రాణములు, మనస్సుతో కూడిన వాడై పంజరంలో బంధించబడిన పక్షిలాగా బయటకు వచ్చే ఉపాయం తెలియక ప్రాపంచిక బంధనాలతో కొట్టుమిట్టాడుతున్నాడు. అటువంటి హంస అనబడే జీవుడికి.

అగ్ని, చంద్రమండలాలు	–	రెక్కలు
ఓంకారము	–	శిరస్సు
జ్ఞాననేత్రము	–	ముఖము
హకారసకారములు	–	పాదాలు

(హకారము రుద్రబీజము సకారము శక్తి బీజము)

ఈ రకంగా ఉన్న హంస అనే జీవుడు పాలలో ఉన్న నెయ్యిలాగా సమస్త ప్రాణికోటినీ ఆశ్రయించి ఉన్నాడు.

సహస్రారము అనేది ఎనిమిది దళాలు కలిగిన పద్మము. ఇందులోని ఒక్కొక్క దళంలోనూ చిన్నచిన్న రేకులు నూటఇరవై అయిదు చొప్పున ఉంటాయి. ఈ రకంగా మొత్తం వెయ్యి దళాలుంటాయి. అందుకే దాన్ని సహస్రదళ కమలం అంటారు. ఎనిమిది దళాలు ఎనిమిది దిక్కులకు తిరిగి ఉంటాయి.

ఎనిమిది దళాల వివరాలు ఈ విధంగా ఉంటాయి.

తూర్పు దిక్కు	–	సద్బుద్ధి
ఆగ్నేయం	–	నిద్ర, దప్పిక, ఆలస్యము
దక్షిణము	–	క్రూరబుద్ధి

నైరుతి	–	తాపబుద్ధి
పడమర	–	విలాసము
వాయువ్యము	–	నడచుట మొ ॥ విషయములందు బుద్ధి
ఉత్తరము	–	సురతము నందు ఆసక్తి
ఈశాన్యము	–	ద్రవ్యము దానంచేసే తలంపు
పద్మాంతరాళంలో	–	ఇహపరలోక విముక్తి
కింజల్కము (తామరపువ్వులోని కేసరములు)	–	మెలకువ
తామరదుద్దు	–	కల
దుంప	–	నిద్ర

ఆత్మ ఏ క్షణానైతే సహస్రారాన్ని వదులుతుందో ఆక్షణంలోనే పరబ్రహ్మలో ఐక్యమవుతుంది.

"తురీయావస్థా నమస్కారః"

నమస్కారము : దేవికి నమస్కారము చెయ్యటమంటే సాధకుడు తురీయావస్థ చేరటమే.

"దేహశూన్య ప్రమాతృతా నిమజ్జనం బలిహరణమ్"

బలిహరణము : సాధకుడి స్థూలశరీరము మాయతోకూడుకున్నది. సూక్ష్మశరీరము జ్ఞాన స్వరూపము తాను జ్ఞానస్వరూపుడు కాబట్టి జీవాత్మను పరమాత్మయందు విలీనం చేసినట్లు భావించటమే బలిసమర్పణ.

"సత్యమస్తికర్తవ్య మకర్తవ్య మౌదాసీన్య విత్యాత్మ విలాపనగ్ం హోమః"

హోమము : పూజ, జపము అయిన తరువాత హోమము చేయటం విధి.సాధకుడి అహంభావము, జీవభావము, పరబ్రహ్మ స్వరూపం ఉంది, లేదు అనే ద్వైదీభావము మొదలైనవన్నీ పరబ్రహ్మమనే అగ్నిలో విలీనము అనే ఆహుతి చేయటమే హోమము.

"స్వయం తత్పాదుకా నిమజ్జనం పరిపూర్ణధ్యానమ్"

ధ్యానము : సాధకుడు తాను ఆ దేవి యొక్క పాదముల నుండి వచ్చే తేజస్సులో విలీనమయినట్లుగా తలచి, తానుకూడా ఆ తేజస్సులో ఒక భాగమేనని, సర్వము పరబ్రహ్మ మమయని భావించటమే పరిపూర్ణ ధ్యానము.

"ఏవం ముహూర్తత్రయం భావనయా యుక్తో భవతి, తస్య దేవతాత్మైక్యసిద్ధిః

బ్రహ్మత్వసిద్ధి : ఈ విధంగా తననుతాను పరబ్రహ్మ స్వరూపంగా భావించి మూడు ముహూర్తముల కాలము దేవియందు మనసును లగ్నం చేసినవాడు ఆ దేవితో ఐక్యత పొందుతాడు. దీనినే బ్రహ్మత్వం సిద్ధించటం అంటారు.

"చింఛితకార్యాణ్యయత్నేన సిధ్యంతి స ఏవ శివయోగీతి కథ్యత ఇత్యుపనిషత్"

ఫలము : ఈ విధంగా అంతఃపూజ చేసి సిద్ధుడైన సాధకుడికి కోరిన కోరికలు అప్రయత్నంగా నెరవేరతాయి. అతడినే శివయోగి అంటారు అని ఈ ఉపనిషత్తులో చెప్పబడింది.

869. బహిర్ముఖసుదుర్లభా

బాహ్యవిషయాలయందు ఆసక్తిగల వారికి లభించనిది. దుర్లభమైనది.

తనలో ఉన్న ఆత్మయే పరమేశ్వరుడు అని తెలుసుకోలేనివారికి లభ్యము కానిది. ఇంద్రియాలద్వారా ఆత్మను దర్శించాలనుకునేవారికి దుర్లభమైనది. లౌకికవాదులకు లభ్యము కానిది.

పూర్వకాలంలో ఒకసారి ఇంద్రుడికి బ్రహ్మతత్త్వాన్ని గురించి తెలుసుకోవాలని పించింది. ఆ కాలంలో దధ్యుడు అనే మహర్షి చాలా శ్రేష్ఠుడు. బ్రహ్మజ్ఞాని. అందుకని అతని దగ్గరకు వెళ్ళి "స్వామీ ! మీవల్ల నాకు ఒక సహాయం కావాలి" అన్నాడు ఇంద్రుడు. 'చేస్తాను" అనే మాటను మహర్షి దగ్గర తీసుకున్న తరువాత చెప్పాడు "నాకు పరబ్రహ్మ తత్త్వాన్ని గురించి తెలియజెయ్యండి" అని

ఆ మాటలు విన్న దధ్యుడు కొంచెంసేపు మాట్లాడలేదు. అది చూచి, మహర్షి ఏదో సంశయిస్తున్నాడని గ్రహించి 'ఏమిటి మహర్షీ ఆలోచిస్తున్నావు. నాకు బ్రహ్మవిద్య చెబుతావాలేదా?" అన్నాడు. ఆలోచించాడు మహర్షి. చెబితే అపాత్రదానం చెప్పకపోతే అసత్యపాపం ఏం చెయ్యాలో పాలుపోలేదు మహర్షికి. మళ్ళీ ఇంద్రుడే "ఏం మహర్షీ ! మాటిచ్చావు నిలబెట్టుకుంటావా లేదా?' అన్నాడు. చేసేందేంలేక మర్నాడు ఉదయం మిగిలిన శిష్యులతో కలిసి రమ్మన్నాడు దధ్యుడు ఇంద్రుణ్ణి.

మర్నాడు ఉదయం కౌపీనం ధరించి దర్భలు చేత్తో పట్టుకుని వచ్చాడు ఇంద్రుడు. అందరితోపాటే కూర్చున్నాడు. చెప్పటం మొదలుపెట్టాడు మహర్షి.

అంతా మిధ్య, కంటికి కనిపించేదేదీ నిజం కాదు ఈ రాజ్యాలు, సింహాసనము, అప్సరసలు, సుఖాలు ఏవీ నిజం కాదు అన్నాడు మహర్షి.

ఆ మాటలు విన్న ఇంద్రుడు లేచి మహర్షీ నువ్వు అబద్ధం చెబుతున్నావు. ఏది అసత్యం. నా రాజ్యామా నా సింహాసనమా, అప్సరసలా ? కేవలం నన్ను ఎగతాళి చెయ్యటానికే ఈ మాటలు చెబుతున్నావు. ఇలాంటి మాటలు ఇంకొకసారి చెప్పావంటే నీ తల నరికి పారేస్తాను జాగ్రత్త" అని హెచ్చరిస్తూ అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

అతని దృష్టిలో ఇంకా రాజ్యము. అప్సరసలూ అంతా నిజమే. కాబట్టి అటువంటి వాడికి బ్రహ్మవిద్యను చెప్పరాదు. వారికి పరబ్రహ్మ సాక్షాత్కారంకాదు. అందుకే ఆ పరమేశ్వరి బహిర్ముఖ సుదుర్లభా అనబడింది.

శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 95వ శ్లోకంలో

పురారాతే రంతః పుర మసి తత స్త్వచ్చరణయో
స్సపర్యా మర్యాదా తరళ కరణానా మసులభా
తథాహ్యేతే నీతా శ్శత మఖ ముఖా స్సిద్ధి మతులాం
తవ ద్వారోపాంతస్థితిభి రణి మాద్యాభి రమరాః ॥

తల్లీ ! పాదపద్మములను పూజించు భాగ్యము చపలచిత్తులైన వారికి లభించదు. ఇంద్రాదిదేవతలకు కూడా నిను సేవించే భాగ్యము లభించక నీ ద్వారము చెంతకావలి ఉన్నారు.

స్థిరచిత్తులకే కాని చంచల చిత్తులకు నిన్ను సేవించే భాగ్యము లభించదు.

870. త్రయీ

త్రయీవిద్య అదే వేదవిద్య. ఋగ్వేదము, యజుర్వేదము, సామవేదము. వీటిలోని విషయాన్ని త్రయీవిద్య అంటారు కూర్మపురాణంలో

మమైవాఽ న్యా పరా శక్తి ర్వేదసంజ్ఞా పురాతనీ ।
ఋగ్యజుస్సామరూపేణ సర్గాదౌ సంప్రవర్తతే ॥

"ప్రాచీనమైన నా పరాశక్తియే వేదము అనే పేరుతో ఋగ్ యజు స్సామములనే పేరుతో ఉన్నది" అంటుంది పరమేశ్వరి. అంటే ఆ వేదాలు పరమేశ్వరి స్వరూపమే దేవీపురాణంలో

ఋగ్యజుస్సామభావేన సాంగవేదగతా యతః ।
త్రయీతి కథ్యతే లోకే దృష్టాఽ దృష్టప్రసాదినీ ॥

పరమేశ్వరి ఋగ్ యజు స్సామరూపమున ఉన్న పరమేశ్వరి త్రయీ అని చెప్పబడింది. నిత్యాతంత్రంలో

అకారాదిస్సామవేదో ఋగ్వేదశ్చ తదాదికః ।
యజుర్వేద ఇకారాది స్తేషాం సంయోగత శ్శుచిః ॥

ఋక్, స్సామవేదాలు అకారంతో ప్రారంభంకాగా యజుర్వేదం ఇకారంతో ప్రారంభమవుతుంది. ఈ మూడింటి స్వరూపమే దేవి. కాబట్టి త్రయీ అనబడుతుంది.

తైత్తిరీయోపనిషత్తులోని ఐదవ అనువాకంలో పరబ్రహ్మకు అంగభూతాలయిన వ్యాహృతుల ఉపాసన చెప్పబడింది. వ్యాహృతులు అంటే కర్మలలో ఉపయోగించేవి అని అర్థం. భూః, భువః, సువః అనేవి మూడు వ్యాహృతులు. ఈ వ్యాహృతులను వేదదృష్టితో ఉపాసన చెయ్యాలి. అప్పుడు

భూః	–	ఋగ్వేదము
భువః	–	సామవేదము
సువః	–	యజుర్వేదము
మహః	–	ఓంకారము

అని భావన చెయ్యాలి అన్నారు.

ఛాందోగ్యోపనిషత్తులో ప్రజాపతి లోకాలను సృష్టించి వాటిసారాన్ని గ్రహించాలనే తలంపుతో తపస్సు చేశాడు. ఆ తరువాత లోకాలనుండి రసాన్ని అంటే సారాన్ని తీశాడు.

పృథివి నుండి	–	అగ్ని అనే రసాన్ని
అంతరిక్షం నుండి	–	వాయువు అనే రసాన్ని
ద్యులోకం నుండి	–	ఆదిత్యుడు అనే రసాన్ని

సారంగా గ్రహించాడు. తరువాత అగ్ని, వాయువు, ఆదిత్యులను గూర్చి తపస్సు చేశాడు. వారి నుండి వేదాలసారాన్ని పిండాడు. అంటే

అగ్ని నుండి	–	ఋగ్వేదాన్ని
వాయువు నుండి	–	యజుర్వేదాన్ని
ఆదిత్యుని నుండి	–	సామవేదాన్ని

సారంగా గ్రహించాడు. ఆ తరువాత ప్రజాపతి మూడు వేదాలను గూర్చి తపస్సు చేశాడు. అదే త్రయీవిద్య దానినుండి మళ్ళీ సారాన్ని తీశాడు అంటే

ఋగ్వేదము నుంచి	–	భూలోకము
యజుర్వేదము నుంచి	–	భువర్లోకము
సామవేదం నుంచి	–	సువర్లోకము

రసం రూపంలో గ్రహించాడు అని చెప్పబడింది. ఇదే త్రయీవిద్య. వేదాలు పరమేశ్వరుని స్వరూపము అందుచేత పరమేశ్వరి త్రయీ అని చెప్పబడింది. త్రయీవిద్య అంటే వాగ్భవబీజము ఐం.

871. త్రివర్గనిలయా

ధర్మార్థకామాలకు నెలవైనది. భూతభవిష్యద్వర్తమానాలకు, అకార ఉకార, మకారాలకు స్థానమైనది. అందుచేత పరమేశ్వరి త్రివర్గ నిలయా అనబడుతున్నది.

872. త్రిస్థా

మూడు లోకాలలోనూ కూడా భేదము లేక ఉండునది. మార్కండేయ పురాణంలో

త్రయోలోకా స్త్రయో దేవా స్త్రైవిద్యం పావకత్రయం
త్రీణి జ్యోతీంషి వర్గాశ్చ త్రయో ధర్మాదయ స్తథా
త్రయో గుణా స్త్రయశ్శబ్దాస్త్రయో దోషాస్తథాశ్రమాః
త్రయః కాలా స్తథావస్థాః పితరోహర్నిశాదయః
మాత్రాత్రయం చ తే రూపం త్రిస్థే దేవి సరస్వతి ॥

1. త్రిమూర్తులు	4. త్రివేదాలు	7. జ్యోతిస్త్రయము
2. త్రిగుణాలు	5. త్రికాలాలు	8. అవస్థాత్రయము
3. త్రిలోకాలు	6. త్రివర్గము	9. ఆశ్రమత్రయము

ఈ త్రయములన్నింటియందు ఉంటుంది. కాబట్టి పరమేశ్వరి త్రిస్థా అనబడుతుంది.

873. త్రిపురమాలినీ

అంతర్దశార చక్రమందు అభిమానము గల దేవత. త్రిపురముల యొక్క స్వరూపము గలది. పంచదశి మహామంత్రంలోని మూడు కూటములను త్రికూటములు అంటారు. అవే త్రిపురములు. వాటి స్వరూపముగలది గాన పరమేశ్వరి త్రిపురమాలిని అనబడుతుంది.

874. నిరామయా

నిర్గతా ఆమయా రోగా యస్యాః-సా

నశించిన వ్యాధులు గలది. ఆమయములు అంటే - వ్యాధులు పరమేశ్వరికి ఏ రకమైన వ్యాధులు లేవు. రోగాలు అనేవి శరీరానికేగాని ఆత్మకు కాదు. పరమేశ్వరి పరబ్రహ్మరూపం. కాబట్టి ఆమెకు ఏ వ్యాధులు లేవు.

875. నిరాలంబా

జగత్తులో సర్వానికీ ఆలంబమైనది పరమేశ్వరియే. కాని వేరెవరూ కాదు. అందుచేత అందరికి ఆలంబమైనది పరమేశ్వరి. ఆమెకు వేరెవరి సహాయ సహకారాలూ అవసరం లేదు. ఏ ఆధారమూ అవసరం లేదు. ఆలంబనము అనేది దృశ్యపదార్థాలకే గాని దృగ్రూపానికి కాదు. అందుచేత పరమేశ్వరి నిరాలంబా అనబడుతోంది.

876. స్వాత్మారామా

దేవిస్వతంత్రురాలు. తన ఆత్మయందే క్రీడిస్తుంటుంది. అయితే ఒకటిగా క్రీడించదు. రెండుగా క్రీడిస్తుంది. బృహదారణ్యకంలో "పరమేశ్వరుడు రెండవదానిని కోరాడు. తనను స్త్రీ పురుషుల జంటగా చేసుకున్నాడు. వారు పరస్పరం భార్యాభర్తలు అయినారు." అని చెప్పబడింది.

ఈ రకంగా పరమేశ్వరుడు తన ఆత్మయందే తాను క్రీడిస్తున్నాడు. కాబట్టి పరమేశ్వరి స్వాత్మారామా అనబడుతోంది.

పరమేశ్వరుడు ఒకడే. తాను అనేకం కావాలనుకుని అనేక రూపాలు పొందాడు. ఈ రకంగా తనవే అయిన అనేక రూపాలలో విహరిస్తున్నాడు. కాబట్టి స్వాత్మారామా అనబడుతున్నాడు.


కంటికి కనిపించే ప్రపంచమంతా పరమేశ్వరి స్వరూపమే. ఈ రకంగా ఈ లోకంలో విహరించినా అదంతా తనస్వరూపమే కాబట్టి స్వాత్మారామా అనబడుతోంది.

877. సుధాస్రుతిః

సహస్రార కర్ణికలోని చంద్రమండలం నుండి కారే అమృత స్వరూపిణి.

సాధకుడు కుండలినీ శక్తిని జాగృతం చేసినట్లైతే, అది గ్రంథిత్రయాన్ని ఛేదించి, షట్చక్రాలను దాటి సహస్రారం చేరి అక్కడున్న కర్ణికను (అదే చంద్రమండలం) నోటితో కరచి పట్టుకుంటుంది. అప్పుడు అక్కడినుంచి అమృతపు ధారలు స్రవిస్తాయి. వాటితో యోగిశరీరంలోని 72 వేల నాడీమండలము తడుస్తుంది. అప్పుడతడు అనిర్వచనీయమైన ఆనందం పొందుతాడు. అది అనుభవైక వేద్యము అని గతంలో వివరించాం. ఆ అమృతపు ధారలే పరమేశ్వరి రూపము. అందుచేతనే ఆమె సుధాస్రుతిః అని చెప్పబడుతోంది.

ఈ రకంగా 813 నుంచి 877 వరకు నామాలలో జ్ఞానవిద్యను వివరించారు.



శ్రీ 'ఝ'కార దేవి

49. నిత్యనైమిత్తిక కర్మవిధి

లలితా సహస్రంలో ఇప్పటిదాకా అనేక విషయాలను వివరించి ఇక ఉపాసన విధానాన్ని వివరిస్తున్నారు.

బృహదారణ్యకోపనిషత్తులాగానే ఇందులో కూడా చివరి భాగంలో ఖిలకాండ అంటే ఉపాసనా విధానము వివరించబడుతోంది. ఇందులో మొదటగా నిత్య, నైమిత్తిక కర్మలను వివరిస్తున్నారు. ఈ కర్మలు రెండు రకాలు 1. నిత్యము 2. నైమిత్తికము. ఇవి ఫలాపేక్ష లేకుండా ప్రతివారూ చేసి తీరవలసినవి.

1. నిత్యకర్మలు – వీటిని ప్రతినిత్యం విధిగా నిర్వర్తించాలి. వీటికి తిథివార నక్షత్రాలతో పని లేదు. సంధ్యావందనము, అగ్నికార్యము, వైశ్యదేవము, దేవతార్చన మొదలైనవి. ఇవి చేస్తే పుణ్యం రాదు కాని చెయ్యకపోతే పాపం మాత్రం వస్తుంది.

2. నైమిత్తిక కర్మలు – నిమిత్తం ఆచరించేవి. అంటే దేని నిమిత్తమైనా ఆచరించే కర్మలు. ఆబ్దీకాలు, అమావాస్య తర్పణాలు, మిధున, కన్య, ధనుస్సు, మీన సంక్రమణాలు మొదలైనవి. ఇవి తిథులనుబట్టి గాని, నక్షత్రాన్నిబట్టి గాని ఆచరించాలి. ఇవికూడా చెయ్యకపోతే పాపం.

ఇక వ్రతాలు, పూజలు మొదలైనవి కామ్యకర్మలు. అవి వీటితో బాటుగా లెక్కలోకి రావు. అయితే దేవ పితృకార్యాలన్నీ యజ్ఞాలే.

పరమేశ్వరి యజ్ఞములందు ప్రీతిగలది. యజ్ఞము విష్ణుస్వరూపమైనది. యజ్ఞాన్ని చేసేది ఆమే. యజమాని అయిన సోమయాజి కూడా ఆమే. పరమేశ్వరి వేదసమ్మతమైన ధర్మాలను రక్షిస్తుంది. ఆమె విష్ణుస్వరూపురాలే కాకుండా లక్ష్మీస్వరూపురాలు కూడా. తన భక్తుల ధనధాన్యాలను వృద్ధి పరుస్తుంది. ఆమె వేదమాత. వేదపండితులైన, శ్రోత్రీయులయందు ప్రీతి గలిగి ఉంటుంది. శ్రోత్రీయులైన బ్రాహ్మణుల రూపంలోనే ఉంటుంది. సమస్త జగత్తులకు, అఖిలాండకోటి బ్రహ్మాండాల సృష్టి స్థితి లయాలకు కారణమైనది. అటువంటి పరమేశ్వరిని గనక నిత్యకర్మలో భాగంగా అర్చించినట్లైతే తన భక్తులను సంసారమనే లంపటంలోంచి బయటపడేస్తుంది.

అందుచేతనే నిత్యకర్మలలో భాగంగా ప్రతిరోజూ గృహంలో పరమేశ్వరిని అర్చించాలి. నైమిత్తిక కర్మలలో భాగంగా ప్రతిపూర్ణమికి హోమాలు, ప్రత్యేక అర్చనలు పారాయణలు చెయ్యాలి.

యోగినీ హృదయంలో నైమిత్తికకర్మను గురించి చెబుతూ

పుష్యభేనతు వారేచ సౌరేచ పరమేశ్వరి
గురో ర్దినే స్వనక్షత్రే చతుర్ద శ్యష్టమీషు చ
చక్రపూజాం విశేషేణ యోగినీనాం సమాచరేత్

నిత్యపూజను నిష్ఠతో చేసేవారికి మాత్రమే నైమిత్తికార్చన యందు అధికారమున్నది. పుష్యమి నక్షత్రము, ఆదివారము, గురువుల జన్మదినము, సాధకుని జన్మనక్షత్రము, చతుర్దశి, అష్టమితిధులయందు, నైమిత్తికార్చన చెయ్యాలి. యోగులు, యోగినులు, వీరులతో కలిసి విశేషద్రవ్యాలతో చక్రార్చన చెయ్యాలి. పూజలో చెప్పిన ద్రవ్యాలు మాత్రమే వాడాలి. అంతేకాని పర్యాయములు వాడరాదు అని చెప్పబడింది.

ఈ విషయాలను 878 నుంచి 887 వరకు నామాలలో వివరించటం జరిగింది.

878. సంసారపంక నిర్మగ్నసముద్ధరణపండితా

సంసారము అనే బురదలో మునిగినవారిని ఉద్ధరించుటలో అఖండురాలు. కూర్మపురాణంలో

యే మనా గపి శర్వాణీం స్మరంతి శరణార్థినః ।
దుస్తరాపారసంసారసాగరే న పతంతి తే ॥

పరమేశ్వరిని శరణుజొచ్చినవారు సంసారసాగరంలో పడరు. అని చెప్పబడింది.

ఈ విషయాన్ని శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 3వ శ్లోకంలో వివరిస్తూ

అవిద్యానా మంతస్తిమిరమిహిరద్వీపనగరీ
జడానాం చైతన్యస్తబకమకరందస్రుతిఝరీ
దరిద్రాణాం చింతామణిగుణనికా జన్మజలధౌ
నిమగ్నానాం దంష్ట్రా మురరిపు వరాహస్య భవతి ॥

అమ్మా ! నీ పాదరేణువు అజ్ఞానమనే అంధకారాన్ని పోగొట్టే సూర్యబింబము. మందబుద్ధులకు జ్ఞానము కలిగించే దీపము. దరిద్రులకు సకల సంపదలిచ్చే చింతామణి. సంసారసాగరంలో మునిగిపోయిన వారికి, సముద్రంలో మునిగిపోయిన భూమిని బైటికి తీసుకువచ్చిన వరాహస్వామి అవుతున్నది.

సంసారసాగరంలో మునిగిపోయిన వారిని పరమేశ్వరి రక్షిస్తుంది.

879. యజ్ఞప్రియా

యజ్ఞాః ప్రియాః యస్యాః

యజ్ఞములు ప్రియముగా గలది. యజ్ఞము విష్ణుస్వరూపమని గతంలో వివరించబడింది. అటువంటి విష్ణుస్వరూపమైన యజ్ఞమందు ప్రీతిగలది.

నిత్య, నైమిత్తిక కర్మలయందు, దేవ, పితృయాగములందు, చండీయాగము, రుద్రయాగము, పాకయాగము మొదలైన యాగములు ఆచరించుటలో ప్రీతిగలది. అందుచేత పరమేశ్వరి యజ్ఞప్రియా అనబడుతున్నది.

880. యజ్ఞకర్త్రీ

యజ్ఞస్యకర్తా

యజ్ఞము నొనర్చునది

అహం హి సర్వయజ్ఞానాం భోక్తా చ ప్రభు రేవచ

సర్వయజ్ఞములను ఆచరించువాడను, అనుభవించువాడను నేనే అని భగవానుడు గీతలో చెప్పాడు. కాబట్టి యజ్ఞము చేసేది ఆమే. అందుచేత ఆమె యజ్ఞకర్త్రీ అనబడుతున్నది. యజ్ఞంచేసే వాడు కర్త. సోమయాజి. అతడు పరమేశ్వర స్వరూపుడు. అతని భార్య శక్తి స్వరూపము. అందుచేతనే ఆమె యజ్ఞకర్త్రీ అనబడుతోంది.

యజ్ఞం చెయ్యాలంటే భార్యాభర్తలు ఇరువురూ ఉండాలి. భార్యలేనివాడు యజ్ఞం చెయ్యరాదు. ఆ కారణంచేతనే ఉత్తరకాండలో శ్రీరామచంద్రుడు యజ్ఞం చెయ్యటానికి స్వర్ణసీతను చేయించాడు. సోమయాజి భార్య సోమిదేవమ్మ పరమేశ్వరి ఇక్కడ సోమిదేవి స్వరూపురాలు కాబట్టి యజ్ఞకర్త్రీ అనబడుతోంది.

881. యజమానస్వరూపిణీ

యజమాని సోమయాజి. పరమేశ్వర స్వరూపం దీక్షితమూర్తి. అతని భార్య దీక్ష. వారి కుమారుడు సంతానుడు. లింగపురాణంలో ఆ ప్రభువునే పండితులు ఉగ్రుడు అని పిలుస్తారు. ఇతరులు ఈశానుడు అంటారు. ఉగ్రుడైన దేవునకు దీక్ష అనే పేరుగల భార్య ఉన్నది. సంతానుడు వారి కుమారుడు" అని చెప్పబడింది.

వాయుపురాణంలో శివుని ఉగ్రతనువు బ్రాహ్మణ స్వరూపము. ఉగ్రుని పత్ని దీక్ష. కుమారుడు సంతానుడు అని చెప్పబడింది.

యజ్ఞమే పరమేశ్వరుడు. కార్యకారణాలకు భేదం లేదు. కాబట్టి యజ్ఞస్వరూపమైన పరమేశ్వరియే, యజమాని అయిన సోమయాజి. యజ్ఞ దీక్షితుడైన బ్రాహ్మణుడు పరమేశ్వరి. అష్టమూర్తులలో ఎనిమిదవ వాడైన సోమయాజి. ఇతడు దీక్ష తీసుకుని కంకణధారణ చేస్తాడు. కాబట్టి యజమాని అనబడుతున్నాడు. పరమేశ్వరి యజమాన స్వరూపిణి.

882. ధర్మాధారా

ధర్మములకు అడ్డులేని ప్రవాహము. శ్రుతి, స్మృతులకు సమ్మతమైనవి ధర్మాలు. అంటే వేదవిరుద్ధముకానివి ధర్మాలు. వేదాలలోను, ధర్మశాస్త్రాలలోను చెప్పబడినటువంటిది.

ఈ ధర్మాలు అన్ని కాలాలయందు, అన్ని ప్రాంతాలయందు ఒకే రకంగా ఉండవు. దేశ కాల మాన పరిస్థితులననుసరించి మారుతుంటాయి. ఇవి పెద్దలచే నిర్ణయించబడి ఉంటాయి. ఎక్కువమందికి మేలు చేకూర్చేవిధంగా ఉంటాయి. నీతి నియమాలకు లోబడి ఉంటాయి. దేశ శ్రేయస్సు, సంఘ శ్రేయస్సు దృష్టిలో పెట్టుకుని చెప్పబడతాయి. సంవర్తస్మృతిలో "దేశదేశాలయందు పారంపర్యముగా వచ్చినది ఆచారము. వేదాలకు విరుద్ధముగానిది ధర్మము" అని చెప్పబడింది. అటువంటి ధర్మాలకు అడ్డులేని ప్రవాహము.

ధర్మమే ఆధారముగా గలది. ధర్మమునందు ఉండేది. ఆ పరమేశ్వరిచేతనే అన్నింటికీ ధర్మము ఆధారంగా చెయ్యబడింది. కాబట్టి పరమేశ్వరి ధర్మాధారా అనబడుతోంది.

883. ధనాధ్యక్షా

ధనస్య అధ్యక్షా స్వామినీ

ధనమునకు స్వామి. కుబేరస్వరూపురాలు. ధనము లక్ష్మీస్వరూపం. లక్ష్మీదేవి పరమేశ్వరి అంశ. కాబట్టి ధనానికి స్వామి పరమేశ్వరియే.

ధనాధిపతి కుబేరుడు. పంచదశీ మహామంత్రాన్ని జపించి తరించిన వారిలో కుబేరుడు ఒకడు. ఇతడు కూడా పరమేశ్వరి స్వరూపమే. కాబట్టి ఆమె ధనాధ్యక్షా అనబడుతోంది.

884. ధనధాన్యవివర్ధినీ

ధనధాన్యాలను వృద్ధి పరచేది.

యజ్ఞకాలంలో అహంకారం లేకుండా దక్షిణ రూపంలో ఇవ్వబడేది ధనము.

ఒకసారి బ్రహ్మాది దేవతలు యజ్ఞం చేసి యజ్ఞఫలం సఫలంకావాలి అని పరమేశ్వరిని పరిపరి విధాల ప్రార్థించారు. పరమేశ్వరి సలహామీద విష్ణుమూర్తి లక్ష్మీదేవి అంశతో దక్షిణాదేవిని సృష్టించి వారికిచ్చాడు. బ్రహ్మ ఆమెను యజ్ఞపురుషుడికి సమర్పించాడు. యజ్ఞం సఫలమైంది.

కాబట్టి దక్షిణ లేని కర్మ సఫలం కాదు. అందుచేత యజ్ఞకాలంలో ధనాన్ని దక్షిణగా ఇస్తారు. అలాగే హోమకాలంలో పేల్చబడునది అవటంచేత ద్రవ్యాన్ని యజమానికి పుష్కలంగా ఇస్తుంది. కాబట్టి పరమేశ్వరి ధనధాన్యవివర్ధినీ అనబడుతుంది.

ఆ పరమేశ్వరి లక్ష్మీ స్వరూపంతో ధనాన్ని , భూదేవి స్వరూపంతో ధాన్యాన్ని ఇస్తుంది కాబట్టి ధనధాన్యవివర్ధినీ అనబడుతున్నది.

885. విప్రప్రియా

వేద శాస్త్రాలు బాగా తెలిసినవారు బ్రాహ్మణులు. వారిని విప్రులు అంటారు. బ్రహ్మవైవర్తపురాణంలో

జన్మనా బ్రాహ్మణోజ్ఞేయః సంస్కారై ర్ద్విజఉచ్యతే
విద్యయా యాతి విప్రత్వం త్రిభి శ్శ్రోత్రియ ఉచ్యతే

జన్మచేత బ్రాహ్మణుడవుతున్నాడు. ఉపనయనాది సంస్కారములచే ద్విజుడు అనబడుతున్నాడు. విద్యచేత విప్రుడవుతున్నాడు. ఈ మూడు లక్షణాలు గలవాడు శ్రోత్రీయుడు అని చెప్పబడింది. అటువంటి విప్రులు అభీష్టముగా గలది.

వేదపఠనంచేత బ్రాహ్మణుడికి విప్రత్వం వస్తుంది. పరమేశ్వరి వేదస్వరూపిణి. వేదజనని కాబట్టి వేదపండితులయిన విప్రులందు అపేక్ష కలిగి ఉంటుంది.

886. విప్రరూపా

పై నామంలో చెప్పిన విప్రుల రూపం గలది. అందుకే 'దేవతలయందు వేదవేత్తలైన బ్రాహ్మణులున్నారు.' అని వేదం చెబుతోంది.

పరాశర స్మృతిలో

బ్రాహ్మణా జంగమం తీర్థం త్రిషులోకేషు విశ్రుతం ।
యేషాం వాక్యోదకేనైవ శుధ్యంతి మలినా జనాః ॥

బ్రాహ్మణులు కదిలియాడే తీర్థములు. వాటివలన మలినమైన జనులు పరిశుద్ధులౌతున్నారు. ఆపస్తంబస్మృతిలో

అవమానాత్తపోవృద్ధిః సన్మానా త్తపసః క్షయః
అర్చితః పూజితో విప్రః దుగ్ధా గౌ రివ సీదతి
ఆప్యాయతే యథాహస్సు తృణై రమృత సంభవైః
ఏవం జపైశ్చ హోమైశ్చ పున రాప్యాయతే ద్విజః

అవమానంతో – తపో వృద్ధి కలుగుతుంది.
సన్మానంతో – తపస్సు క్షీణిస్తుంది

విప్రుడు పూజించబడినట్లైతే పాలుపితికిన ఆవులాగా కృశించిపోతాడు. మృదువైన గడ్డితిని గోవు బలిసినట్లుగా మంత్రజపంతోను, హోమంతోను బ్రాహ్మణుడు పుష్టిగా ఉంటాడు. అటువంటి విప్రుని రూపంలో ఉంటుంది పరమేశ్వరి. బ్రహ్మవైవర్తపురాణంలో

అవిద్యోవా సవిద్యోవా బ్రాహ్మణో మామకీ తనుః

విద్వాంసుడైనా, విద్యావిహీనుడైనా బ్రాహ్మణుడు నా స్వరూపము అని పరమేశ్వరి చెప్పింది. అందుచేతనే ఆమె విప్రప్రియా అనబడుతోంది.

887. విశ్వభ్రమణకారిణీ

సమస్త బ్రహ్మాండముల యొక్క సృష్టి స్థితి లయాలను చేసేది. కాలచక్రం తిరగటానికి పరమేశ్వరియే కారణము.

విశ్వము అంటే విష్ణువు. అతడికి భ్రమణము కలుగచేయునది. కాలికాపురాణంలో ఒకసారి శ్రీమహావిష్ణువు గరుడునిమీద ఎక్కి ఆకాశమార్గంలో వెడుతూ కామరూప దేశంలో ఉన్న కామాఖ్యాదేవికి నమస్కరించలేదు. దానికి కోపించినదేవి విష్ణువును సముద్రంలోకి త్రోసివేసింది. కొంతకాలం తరువాత లక్ష్మీదేవి విష్ణుమూర్తి కనపడక వెతుకుతూ కామరూపం వచ్చి కామాఖ్యాదేవిని ప్రసన్నం చేసుకుని విష్ణువును రక్షించుకున్నది. ఆ తరువాత విష్ణువు పరమేశ్వరిని పూజించి వైకుంఠం చేరాడు. అని చెప్పబడింది.

ఈ రకంగా విష్ణువుయొక్క భ్రమణానికి కారణమైనది కాబట్టి విశ్వభ్రమణకారిణి అనబడింది.

సమస్త లోకాలకు తిరిగే శక్తి ఇస్తుంది కాబట్టి విశ్వభ్రమణకారిణీ అనబడింది.

ఈ రకంగా నిత్యనైమిత్తిక కర్మల ప్రాధాన్యత వివరించబడింది.

50. సన్యాసులజ్ఞానవిషయము

బ్రాహ్మణుడికి నాలుగు ఆశ్రమాలు చెప్పబడ్డాయి. అవి.

1. బ్రహ్మచర్యము 2. గృహస్తాశ్రమము 3. వానప్రస్థము 4. సన్యాసము

మిగిలిన వర్ణాలవారికి సన్యాసం లేదు. మిగిలిన మూడు ఆశ్రమాలే ఉంటాయి. అందుచేతనే భారతంలో దృతరాష్ట్రుడు కుంతి, గాంధారి మొదలగు వారితో కలిసి చివరిదశలో వానప్రస్థానికి వెళ్ళి, అక్కడ దావాగ్నిలో దగ్ధమైపోతాడు.

సన్యాసాశ్రమం స్వీకరించటమంటే, కేవలము కాషాయం కట్టటం కాదు. ముందుగా భార్య అనుమతి తీసుకుని, తనకున్న యావదాస్తిని ప్రజలకు దానం చెయ్యాలి. ఆ తరువాత శిరోముండనం, కౌపీనధారణ, కాషయవస్త్రం, దండకమండలాలు, భిక్షాటన. ఇది చేయవలసిన విధానం. మొట్టమొదటి భిక్ష భార్యదగ్గరే స్వీకరించాలి.

సన్యాసికి ఐహికబంధనాలు ఉండరాదు. కేవలము భగవన్నామస్మరణలోనే కాలం గడపాలి. మనోవాక్కాయకర్మలతో నిరంతరము భగవంతుణ్ణే ధ్యానం చెయ్యాలి. అది కూడా ఓంకారోపాసన మాత్రమే చెయ్యాలి. అది మోక్షానికి మార్గం.

కర్మలు చేస్తే ఏరకమైన ఫలితం వస్తుందో కర్మ చెయ్యకపోయినా అదే ఫలితం వస్తుంది. అనే స్థితికి అతడు చేరాలి. సన్యాసి భిక్షాటన కూడా చెయ్యరాదు. తనని తాను పోషించుకోవాలి అని చెబుతోంది ఈశావాస్యోపనిషత్తు.

సన్యాసి సాకారాన్ని అర్చించరాదు. నిరాకారాన్నే ధ్యానించాలి. పరమేశ్వరి పరబ్రహ్మ స్వరూపం. మహాప్రళయకాలంలో ఈ జగత్తునంతటినీ తన ఉదరంలో దాచేసుకుంటుంది. అంటే ఇందులో ఉన్న జీవరాశినంతటినీ బక్షించేస్తుంది. జగత్తులోని జీవజాలమంతా ఆమె ఆహారమే.

ఆమె స్థితికారకుడైన విష్ణువు స్వరూపం. ఆమెకు, శ్రీమహావిష్ణువుకూ భేదంలేదు. ఆ దేవికి జననమరణాలు లేవు. అన్ని కారణాలకు ఆమె స్థానము. తన భక్తులకు కోర్కెలు తీర్చి, ఐహికసుఖాలనిచ్చి వారిని అజ్ఞానాంధకారంలో ఉంచి, సంసారసాగరంలో ముంచివేస్తుంది. యోగి ఆధారచక్రంలోని కుండలినీశక్తిని మేల్కొల్పితే, అది సుషుమ్నగుండా ప్రయాణించి సహస్రారం చేరుతుంది.

ఆ పరమేశ్వరికి ఉపాసకులయందు ప్రీతి ఎక్కువ. కర్మ వాసనలేనటువంటిది. కర్మ అనేది శరీరానికేగాని ఆత్మకు కాదు. పరమేశ్వరి ఆత్మస్వరూపిణి. ఆమెను సన్యాసి నాదరూపంలోనే ఉపాసించాలి. అంతేకాని సన్యాసి కామ్యమంత్రాలను ఉపాసించరాదు. అలా నాదోపాసనచేసినట్లైతే బ్రహ్మ సాక్షాత్కారం కలుగుతుంది. అదే ఆత్మ సాక్షాత్కారం ఆమె శ్రీచక్రంలో బిందువునందుంటుంది.

అలాగే మానవదేహంలో సహస్రారంలో ఉంటుంది. అన్ని తత్త్వాలకు అతీతమైనది. ఆమెను ఉపాసించినట్లైతే ఆత్మ సాక్షాత్కారం కలిగి జీవాత్మ పరమాత్మ ఒకటే అనే భావం కలుగుతుంది. అదే బ్రహ్మత్వసిద్ధి. తద్వారా సన్యాసికి ముక్తి కలుగుతుంది.

ఈ విషయం 888 నుంచి 906 వరకు నామాలలో వివరించటం జరిగింది.

888. విశ్వగ్రాసా

చరాచరజగత్తును మ్రింగివేసేది. అనగా చరములను, అచరములను సంహరించునది. కారకములలో

యస్య బ్రహ్మ చ క్షత్రం చోభే భవతి ఓదనః
మృత్యు ర్యస్యోప సేచనం క ఇత్థా వేద యత్ర సః

ఆ పురుషునకు బ్రహ్మ క్షత్రియులు ఆహారము. మృత్యువు అతడికి నంచుకునే పదార్థము. దీనిని ఎవరు తెలుసుకోగలుగుతారు ?

చరాచరజగత్తునంతా ప్రళయకాలంలో గ్రహించునది. కాబట్టి పరమేశ్వరి విశ్వగ్రాసా అనబడుతున్నది. సృష్టిలో ఒక జీవిని ఇంకొక జీవి ఆహారంగా తీసుకుంటుంది. ఇది సాధారణన్యాయము. గడ్డి, ధాన్యాలు. వీటిని పశువులు, పక్షులు ఆహారంగా తీసుకుంటాయి. ఈ పశుపక్షులు మృగాలకు ఆహారం. మృగాలు మానవుడికి ఆహారం. ఈ రకంగా ఒక దానికి ఒకటి ఆహారము. అయితే ప్రళయకాలంలో సర్వజగత్తునూ పరమేశ్వరుడు మ్రింగివేస్తాడు. అంటే ఈ జగత్తంతా అతడికి ఆహారం. అందుకే పరమేశ్వరి విశ్వగ్రాసా అనబడుతోంది.

889. విద్రుమాభా

పగడమువలె ఎర్రని కాంతి గలది. పగడము సింహళప్రాంతంలోను, దక్షిణభారతం లోనూ సముద్రతీరంలో దొరుకుతుంది. ఇందులో కూడా జాతి పగడాలు మంకెన్న పువ్వులాగా పాటలవర్ణంలో ఉంటాయి. పరమేశ్వరి శరీరకాంతి మంచిజాతిగల పగడపుకాంతివలె ప్రకాశిస్తుంది. అందుచేతనే ఆమె విద్రుమాభా అనబడుతుంది.

జ్ఞానవృక్షముతో సమానమైనది.

890. వైష్ణవీ

విష్ణోరియం వైష్ణవీ

విష్ణుమూర్తి యొక్క శక్తి వైష్ణవి. దేవీపురాణంలో

శంఖ చక్రగదాన్ ధత్తే విష్ణుమాతా తథాஉరిహా

విష్ణురూపాஉథవా దేవీ వైష్ణవీ తేన గీయతే

1. శంఖము, చక్రము, గద ధరించినది.
2. విష్ణువునకు తల్లి.
3. శత్రువులను చంపునది.
4. విష్ణురూపము గలది.

ఈమె వైష్ణవీ అనబడుతున్నది. పరమేశ్వరి విష్ణువు యొక్క శక్తి. లక్ష్మీ స్వరూపురాలు. స్థితికారిణి. సర్వవ్యాపి. శంఖచక్రములు ధరించిన గరుడవాహనమైనది. కాబట్టి వైష్ణవీ అనబడుతోంది. సప్తశతిలో

శంఖ చక్ర గదా శార్గ&జ గృహీత పరమాయుధే

ప్రసీద వైష్ణవీరూపే నారాయణి ! నమోஉస్తు తే ॥

వైష్ణవీరూపం ధరించి శంఖము, చక్రము, గద, ధనుస్సు ఆయుధములు గలగిన ఓ నారాయణీ నీకు ప్రణామములు.

891. విష్ణురూపిణీ

శ్రీ మహావిష్ణువుతో వేరుగాని రూపము గలది. సృష్టికి పూర్వం పరమేశ్వరి ఈ జగత్తును సృష్టించటం కోసం అతని అంశతో బ్రహ్మ విష్ణు రుద్రులను సృష్టించింది అని చెప్పబడింది. అలాగే తన అంశలే అయిన మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతులను సృష్టించి వారికి సహాయకులుగా ఉంటారని చెప్పింది. కాబట్టి శ్రీమహావిష్ణువు అంటే పరమేశ్వరి అంతేకాని వేరుకాదు.

బ్రహ్మాండపురాణంలో 'నా రూపమే గోపికా స్త్రీలను మోహింపచేయునది' అని చెప్పటంచేత పరమేశ్వరియే విష్ణురూపిణి అనబడుతుంది.

ఆద్యా శక్తిర్మహేశస్య చతుర్ధా భిన్న విగ్రహా

భోగే భవానీరూపా సా దుర్గారూపా చ సంగరే

కోపేచ కాళికారూపా పుంరూపాచ మదాత్మికే

ఆ పరమేశ్వరుని శక్తినాలుగురూపాలుగా ఉంటుంది.

1.	భోగరూపంలో	–	భవాని
2.	యుద్ధరంగంలో	–	దుర్గ
3.	కోపమున	–	కాళి
4.	పురుషరూపంలో	–	విష్ణువు

అని బ్రహ్మాండపురాణంలో విష్ణుమూర్తి చెబుతాడు. కాబట్టి పరమేశ్వరి విష్ణురూపిణి అని చెప్పబడింది. ఆమె విష్ణురూపిణి కాబట్టి భక్తులు ఆమెను సేవించి విష్ణుసాన్నిధ్యం పొందుతారు.

కూర్మపురాణంలో హిమవంతుడు పరమేశ్వరిని

సహస్ర మూర్ధాన మనంత శక్తిం సహస్ర బాహుం పురుషం పురాణం

శయానమబ్ధౌ లలితే తవైవ నారాయణాఖ్యం ప్రణతోஉస్మిరూపం ॥

వేయితలలు గల దానిని, గొప్పశక్తి గల దానిని, వేయి చేతులు గల దానిని, సాగరమందు శయనించు దానిని ఓ దేవీ ! నీదైన నారాయణరూపమునకు నమస్కరించు చున్నాను. అంటూ స్తుతిస్తాడు.

కూర్మపురాణంలో శివుడు మంకణుడు అనే వాడికి విశ్వరూపం చూపుతాడు. అది చూచిన అతడు ఆ రూపాన్ని వర్ణించి నీ పార్శ్వమందున్నది ఎవరు ? అంటాడు. అప్పుడు శివుడు

మమ సా పరమా మాయా ప్రకృతి స్త్రిగుణాత్మికా

యోచ్యతే మునిభి శ్శక్తి ర్జగద్యోని స్సనాతనీ

స ఏవ మాయయా విశ్వం వ్యామోహయతి విశ్వజిత్

ఆమెయే పరమైన మాయాశక్తి. మునులు ఆ శక్తినే త్రిగుణాత్మకమైన ప్రకృతి అంటున్నారు. ఆమెయే ఈ విశ్వానికి ప్రాచీనమైన యోని. (మూలకారణము) ఆమె మాయతో విశ్వాన్ని మోహింపచేస్తున్నది. అతడు విశ్వాన్ని తెలుసుకుంటున్నాడు. నారాయణుడే మాయారూపుడు అని వేదాలు చెబుతున్నాయి అంటాడు.

కాబట్టి నారాయణుడే పరమశక్తి. పరమేశ్వరియే విష్ణురూపిణి. అందుచేతనే ఆమె విష్ణురూపిణీ అనబడింది.

892. అయోనిః

కారణములేనిది. యోని అనేది ఒకస్థానం. జన్మస్థానం. అయోనిః – స్థానములేనిది. జన్మస్థానములేనిది పరమేశ్వరి.

ప్రతిపదార్థానికి జన్మ ఉంటుంది. ఆ జన్మస్థానమే యోని. జగత్తులో చెట్లుచేమలు మొదలైన వాటన్నింటికీ జన్మస్థానం పృథివి. అందుచేతనే **పృథివీయోనిః** అని చెప్పబడింది. అయితే పరమేశ్వరి సకలభూతాలకు, జగస్సృష్టికీ కారణమైనది. కాబట్టి ఆమె జగద్యోని.

పరమేశ్వరికి జననమరణాలు లేవు. జననమే లేని దేవికి ఇంక జనస్థానం ఎక్కడ ఉంటుంది ? అందుకే ఆమె అయోనిః అని చెప్పబడుతోంది. జన్మమనేది కనిపించే ఈ జగత్తుకేగాని కనిపించని పరమేశ్వరికి కాదు. అందుచేత ఆమెకు జన్మస్థానం లేదు.

893. యోనినిలయా

యోని అంటే – త్రికోణము. శ్రీచక్రంలో ఎనిమిదవ ఆవరణ సర్వసిద్ధిప్రదచక్రము. ఈ చక్రం మధ్యన బిందురూపంలో పరమేశ్వరునితో కలిసి ఉంటుంది. అందుచేత ఆమె యోనినిలయా అనబడుతోంది.

త్రికోణరూపిణీ శక్తిః బిందురూప పరశ్శివః

బిందురూపుడైన పరబ్రహ్మ నుంచి కొంతశక్తి బయటకు వచ్చింది. అదిశక్తి కాబట్టి త్రికోణరూపంలో ఉన్నది. దాని నుంచే ఈ జగత్తంతా ఆవిర్భవించింది. బిందురూపంలో ఉన్న శివుడు కూడా ఆ త్రికోణంలోనే ఉన్నాడు. శివశక్తులు ఎప్పుడూ కలిసే ఉంటారు.

యోని అంటే – కారణము. పరమేశ్వరి సమస్త జగత్తుకూ కారణము. అన్ని లోకాలు ప్రళయకాలంలో పరమేశ్వరిలోనే లీనమవుతున్నాయి. అందుచేత ఆమె యోనినిలయా అనబడుతోంది.

894. కూటస్థా

అజ్ఞానానికి అధ్యక్షురాలు. అజ్ఞానమునకు స్థానమైనది. మానవులను మోహంలో పడేసి సంసారసాగరంలో ముంచివేస్తుంది. పరమేశ్వరి విషస్వరూపిణి. భక్తుల యొక్క

కోరికలు వెంటనే తీర్చేస్తుంది. సామాన్యంగా భక్తులు ఐహికవాంఛలనే కోరతారు. ధనధాన్యాలు, పుత్రపౌత్రాదులు, సిరిసంపదలు, భోగభాగ్యాలు. ఇవన్నీ భక్తులకిస్తుంది. వీటివల్ల వారు సంసారలంపటంలో ఇంకా కూరుకుపోతారు.

కూటత్రయమునందుటుంది. 1. వాగ్భవ 2. కామరాజ 3. శక్తికూటాలు. వీటియందు ఉండునది పరమేశ్వరి.

కూటము అంటే యంత్రము. శ్రీచక్రమనే యంత్రరాజంలో ఉంటుంది. కాబట్టి ఆమె కూటస్థా అనబడుతోంది.

మేరు పర్వతంలోని మధ్యకూటమినందుంటుంది. కాబట్టి కూటస్థా అనబడుతోంది.

అన్ని జీవుల యొక్క హృదయాలలో ఉంటూ కూడా, అవి చేసే కర్మలతో ఏ రకమైన సంబంధములేనిది కావటంచేత కూటస్థా అనబడుతోంది.

895. కులరూపిణీ

కులము అంటే–కౌళమార్గము. ఇది బాహ్యపూజ. వంశాచారాన్ని బట్టి ఇది వస్తుంది.

కులము అంటే – వంశము. ఇది రెండురకాలు.

తండ్రి, తాత, ముత్తాతల నుంచి వచ్చేది. దీనిని జననవంశము అంటారు. రెండవది గురువు, పరమగురువు, పరమేష్ఠి గురువు. వీరి ద్వారా గురు సంప్రదాయంగా వచ్చేది. ఈ రెండురకాల వంశాలు పరమేశ్వరిరూపమే కాబట్టి ఆమె కులరూపిణీ అనబడుతోంది.

ఆధారచక్రం నుంచి సహస్రారం దాకా సుషుమ్నానాడి ఉన్నది. ఆ మార్గంకుండానే కుండలినీశక్తి ప్రయాణం చేస్తుంది. ఈ మార్గాన్నే కులమార్గము అంటారు. ఈ మార్గంలో చరించే ముఖ్యప్రాణస్వరూపిణి కాబట్టి కులరూపిణీ అనబడుతుంది.

896. వీరగోష్ఠీప్రియా

వీరుల యొక్క సభలయందు ప్రీతిగలది. వీరగాథలయందు ప్రీతి గలది. తాను దైత్యసంహారం చేసినప్పుడు అంటే, మహిషాసురుడు, భండాసురుడు, శుంభనిశుంభులు ఇత్యాది రాక్షససంహారగాథలయందు ప్రీతి గలది.

వీరులు అంటే ఉపాసక శ్రేష్ఠులు. శ్రీవిద్యా విశారదులు. భక్తితత్పరులు. అరిషడ్వర్గాన్ని జయించినవారు. సర్వకాలసర్వావస్థలయందు పరమేశ్వరి ధ్యానంతోనే కాలం గడిపేవారు. అటువంటివారు చేసే వేదాంతగోష్ఠులయందు ప్రీతిగలది.

897. వీరా

మహిషాసుర, భండాసురాది రాక్షసులను సంహరించినది. కాబట్టి పరమేశ్వరి వీరా అనబడుతోంది. ప్రపంచంలో దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేస్తుంది. కాబట్టి వీరా అనబడుతుంది. వీరులైన శ్రీవిద్యోపాసకులరూపంలో ఉంటుంది. కాబట్టి వీరా అనబడుతుంది.

ధర్మపరులయందు, వీరులయందు పరమేశ్వరి ఉంటుంది. కాబట్టి ఆమె వీరా అనబడుతుంది.

898. నైష్కర్మ్యా

కర్మలు లేనటువంటిది. వదలబడిన కర్మలు గలది. పరమేశ్వరికి ఏ రకమైన కర్మలుగాని వాటివల్ల వచ్చే ఫలితాలుగాని లేవు.

అసలు కర్మ అంటే – క్రియాచరణ, పని. క్రియలన్నీ దేహానికేగాని ఆత్మకు కాదు. పరమేశ్వరి ఆత్మ స్వరూపిణి. కాబట్టి ఆమెకు కర్మలు ఉండవు. అందుచేతనే నైష్కర్మ్యా అనబడుతోంది. కర్మలనేవి పుణ్యపాపాల సముదాయము. పుణ్యపాపాలతో దేవికి సంబంధంలేదు. కాబట్టి ఆమె నైష్కర్మ్యా అనబడుతోంది.

899. నాదరూపిణీ

ప్రణవము యొక్క శిరస్సు పైనున్నదియే నాదము. ఆనందరూపమైన పరమేశ్వరి నాదరూపమున అనాహతచక్రంలో ఉన్నది. అంతర్ముఖులైన వారు దాన్ని దర్శించ గలుగుతారు అని జ్ఞానులు చెబుతున్నారు. నాదము అనేది రోదినికి పైభాగాన ఉన్నది.

ఇందౌ తదర్థం రోదిన్యాం నాదో నాదాంత ఏవ చ

బిందువు, అర్ధచంద్రము, రోదిని, ఆ తరువాత నాదము ఉన్నాయి. ఆ నాదరూపిణి అయిన పరమేశ్వరిని ధ్యానిస్తున్నాను అని స్వచ్ఛంద్రతంత్రంలో చెప్పబడింది.

అక్షరాలు పుట్టకముందు ఉండే స్థితి నాదము. ఆ నాదమే రూపాంతరం చెంది వర్ణాలుగా పరిణమిస్తుంది. వేదాలన్నీ నాదరూపమే. వేదమాత పరమేశ్వరి. కాబట్టి ఆమె నాదరూపిణీ అనబడుతుంది.

అవ్యక్తమైన పరమేశ్వరి శక్తిని లోకంలో వ్యక్తపరిచేది నాదమే. ఈ నాదము జగత్తునంతా ఆవరించి ఉన్నది. ఏ విషయాన్ని గ్రహించటానికైనా నాదమే ఆధారము. ఆ నాదము పరమేశ్వరి రూపము.

అందుచేత పరమేశ్వరి నాదరూపిణీ అవుతున్నది.

900. విజ్ఞానకలనా

విజ్ఞానము అంటే పరబ్రహ్మ సాక్షాత్కారము. కలనా అంటే – ఆత్మ సాక్షాత్కారము.

ఆ పరమేశ్వరి బ్రహ్మజ్ఞానమే స్వరూపంగా గలది. జ్ఞానాన్ని బోధించే ఉపనిషత్తులు వేదాలలో భాగాలు. ఆ వేదాలు బ్రహ్మ చెప్పినవే. అందుచేతనే పరమేశ్వరి విజ్ఞానకలనా అనబడుతోంది.

ఆత్మానందాన్నిచ్చే బ్రహ్మజ్ఞానమే విజ్ఞానము. ఇటువంటి విజ్ఞాన స్వరూపిణి కాబట్టే ఆ దేవి విజ్ఞానకలనా అనబడుతోంది.

901. కల్యా

కళలను సృష్టించుటయందు నేర్పరి. పరమేశ్వరి సర్వకళలకు నిధి. ఆనందకలా స్వరూపిణి. కాబట్టి కల్యా అనబడుతున్నది. సకల శుభములు మూర్తీభవించినది.కాబట్టి కల్యా అనబడుతోంది.

902. విదగ్ధా

విదగ్ధా చాతుర్యశీలా

చాతుర్య స్వభావం గలది. నైపుణ్యం గలది.

పరమేశ్వరి అత్యంత చతురమైన స్వభావముగలది. సంభాషణలో చాతుర్యము గలది. సృష్టిస్థితిలయాలలో నేర్పరితనము గలది. కార్యనిర్వహణలో నైపుణ్యము గలది. అందుచేత ఆమె విదగ్ధా అనబడుతోంది.

903. బైందవాసనా

కనుబొమ్మల మీద వృత్తాకారంలో ఉండేది బైందవము, అది ఆసనముగా గలది. స్వచ్ఛందతంత్రంలో

హాకినీ మండలా దూర్ధ్వం బిందురూపంతు వర్తులమ్

హాకినీ మండలానికి పైభాగాన బిందువు వర్తులాకారమైనది అని చెప్పబడింది. అక్కడ శివుడుంటాడు. అతడికి

వామభాగే సమాసీనా శాంత్యతీతా మనోన్మనీ

ఎడమవైపున ఆసీనురాలై శాంత్యతీత, మనోన్మని ఉంటుంది. అదే సర్వానంద మయమైన బిందుచక్రము.

బిందువుల సమూహమే బైందవము. అది ఆసనముగా గలది. బిందువుతో కూడిన హకారముబ్రహ్మ. సకారము బిందువు విసర్గతో కూడినది హరి. ఈ రకంగా లోకంలో హరిహరులకు భేదం లేదు అని జ్ఞానార్ణవతంత్రమందు చెప్పబడింది.

వామాదిత్రయము, ఇచ్ఛాదిత్రయము, జాగ్రదాదిత్రయము. ఇదంతా బిందురూపమే. అటువంటి బిందుత్రయంతో కూడినదే త్రిపుర.

శ్రీచక్రానికి కారణం బిందువు. ఆ బిందువును ఆసనంగా గలది. కాబట్టి బైందవాసనా మానవశరీరంలో సహస్రారమందు పరమేశ్వరి ఉంటుంది. అదే బిందుస్థానము. అందుచేతనే దేవి బైందవాసనా అనబడుతోంది.

జ్ఞానార్ణవతంత్రంలో

బిందువ్యూహం ప్రవక్ష్యామి బీజరూపం వరాననే !
హ కారం బిందురూపేణ బ్రహ్మాణం విద్ధి పార్వతి !
స కారం బిందుసర్గాభ్యాం హరిశ్చాహం సురేశ్వరి !
అవినాభావ సంబంధో లోకే హరిహరావితి ॥

ఓ శ్రేష్ఠురాలా ! పార్వతీ ! బీజరూపమైనటువంటి బిందువ్యూహాన్ని గురించి చెబుతాను వినవలసినది.

బిందువుతో కూడిన హకారము - బ్రహ్మ
విసర్గతో కూడిన సకారము - నేను (శివుడు) హరి.

లోకమందు హరిహరులు అవినాభావ సంబంధులు. ఈ రకంగా మూడు బిందువుల కలయికయే త్రిపుర అని చెప్పబడింది. ఆ బిందువు పైన ఉండే త్రిపురవాసినియే బైందవాసనా అనబడుతుంది.

బ్రహ్మరంధ్రే మహాస్థానే వర్తతే సతతం శివా ।
చిచ్ఛక్తిః పరమాదేవీ మధ్యమే సుప్రతిష్ఠితా ॥

బ్రహ్మరంధ్రంలో పరమేశ్వరుడు ఉంటాడు. చిచ్ఛక్తి అయినటువంటి పరమేశ్వరి కూడా ఆ బ్రహ్మ రంధ్రమందే ఉంటుంది. అదే బిందువు.

బిందువునందు ఉంటుంది కాబట్టే ఆమె బైందవాసనా అనబడుతోంది.

904. తత్త్వాధికా

తత్త్వాలు అనేకరకాలు 36 అనీ, 51 అనీ, 96 అనీ రకరకాల వాదనలు ఉన్నాయి. ఇవన్నీ కాదని 24 తత్త్వాలనే చెప్పారు శంకరభగవత్పాదులు. ఈ తత్త్వాలు జగత్తంతా వ్యాపించి ఉన్నాయి. ఈ తత్త్వముల వల్లనే జగత్తు సృష్టించబడింది. ఈ తత్త్వాలన్నీ నాశనమయిపోతాయి. మిగిలేది ఒక్కటే అదే పరమేశ్వరతత్త్వం ఈ తత్త్వాలన్నింటికీ అతీతమైంది. అదే ఈ జగత్తును సృష్టిస్తున్నది. పంచకృత్యాలు చేస్తున్నది. అదే పరమేశ్వరి తత్త్వము. అందుచేతనే ఆమె తత్త్వాధికా అనబడుతోంది.

905. తత్త్వమయీ

తత్త్వవిస్తారము గలది. పరమేశ్వరి ఆత్మస్వరూపిణి. అంటే పరబ్రహ్మస్వరూపిణి. అందుచేత మిగిలిన విద్యాతత్త్వము, విష్ణుతత్త్వము, రుద్రతత్త్వము, బ్రహ్మతత్త్వము, మహేశ్వరతత్త్వము, సదాశివతత్త్వము. వీటన్నింటి కన్న అధికమైనది. అదే పరబ్రహ్మతత్త్వము. బ్రహ్మజ్ఞానమే స్వరూపంగా గలది.

906. తత్త్వమర్థస్వరూపిణీ

మహావాక్యాలలో ఉండే తత్ – అదిత్వం – నీవు. ఈ పదాలకు జీవాత్మ పరమాత్మలు. తత్ – శివుడు. త్వం – జీవుడు. ఈ రెండింటి స్వరూపమే పరమేశ్వరి. అఖండసచ్చిదానంద పరబ్రహ్మస్వరూపమే పరమేశ్వరి. జీవాత్మ పరమాత్మ రెండూ వేరుకాదు. రెండూ ఒకటే. అనే విషయాన్ని తెలియచేస్తుంది. కాబట్టి పరమేశ్వరి తత్త్వమర్థస్వరూపిణీ అనబడింది.

ఈ రకంగా సన్యాసులకు జ్ఞానవిషయం బోధించబడింది.

51. అగ్నిష్టోమాది సంకేతము

దూరంగా ఆకాశంలో ప్రకాశిస్తూ కాంతినిచ్చేవాడు సూర్యుడు. అతడు అమృతమయుడు. అతని కాంతివల్లనే లోకాలన్నీ ప్రవర్తిల్లుతున్నాయి. సూర్యుని యొక్క వేడివల్లనే సముద్రంలోని నీరు ఆవిరై మేఘాలుగా మారుతున్నది. ఆ మేఘాలు తిరిగి వర్షిస్తున్నాయి. ఆ వర్షాలవల్ల వాగులు, వంకలు, ఏరులు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. వాటివల్లనే సాగునీరు లభ్యమవుతున్నది. పంటలు పండుతున్నాయి. జీవికి ఆహారం లభిస్తోంది. కాబట్టి మనకు ప్రత్యక్షదైవం సూర్యభగవానుడే అందుచేత అతణ్ణి అర్చించాలి. అయితే సూర్యభగవానుడు ఆకాశంలో ఉంటాడు. అతన్ని అర్చించటం చాలా కష్టం. భూలోకంలో సూర్యుడికి ప్రతీక అగ్ని. కాబట్టి అగ్నిని గనక ఆరాధించినట్లైతే సూర్యుని ఆరాధించినట్లే అని చెబుతోంది వేదం. శ్రీచక్రం అగ్నిష్టోమాత్మకము. జగత్తు అగ్నిష్టోమమయము. రుద్రయామళంలో ఈ విషయాలు చెప్పబడ్డాయి.

అగ్నిష్టోమాత్మకం చక్రం అగ్నిష్టోమమయం జగత్
అగ్నావంతర్భాభానుః అగ్నిష్టోమమయం స్మృతమ్

శ్రీచక్రము అగ్నిష్టోమాత్మకమై ఉన్నది. జగత్తు అంతా అగ్నిష్టోమమయమే. జగత్తే శ్రీచక్రం కాబట్టి శ్రీచక్రము అగ్నిష్టోమాత్మకము. అగ్ని యొక్క అంతర్భాగంలో భానుడు ప్రకాశిస్తున్నాడు. కాబట్టి జగత్తు అగ్నిష్టోమమయంగా చెప్పబడుతున్నది.

త్రిఖండం మాతృకాచక్రం సోమసూర్యానలాత్మకం
త్రికోణం బైందవం సౌమ్య మష్టకోణం చ మిశ్రకమ్
చక్రం చంద్రమయం చైవ దశారద్వితయం తథా
చతుర్దశారం వహ్నేస్తు చతుశ్చక్రం చ భానుమత్

మాతృకాచక్రమైన శ్రీచక్రము సోమసూర్య అనలాత్మకమై మూడు ఖండాలుగా ఉన్నది. అందులో

బిందువు, త్రికోణము, అష్టకోణము	–	చంద్రఖండము
దశారద్వయము, చతుర్దశారము	–	అగ్నిమయము
మిగిలినవి	–	భానుమయము

ఏ తత్ప్రసాదా దింద్రాద్యా వసవోఽ ష్టౌమరుద్గణాః ।
యేయే సమృద్ధాలోకేఽస్మిన్ త్రిపురాచక్రసేవకాః ॥
పురత్రయంచ చక్రస్య సోమసూర్యా నలాత్మకమ్ ।
మహాలక్ష్మ్యాః పురం చక్రం తత్రై వాస్తే సదాశివః ॥

శ్రీచక్ర ప్రసాదంవల్లనే ఇంద్రాదిదేవతలు, అష్టవసువులు, మరుద్గణాలు వెలయుచున్నారు. లోకంలో సిరిసంపదలతో వెలయు వారందరూ శ్రీచక్రసేవకులే. శ్రీచక్రము యొక్క పురత్రయము సోమ సూర్య అనలాత్మకమై ఉన్నది. ఈ చక్రము మహాలక్ష్మీపురము. ఇందే సదాశివుడున్నాడు అని చెప్పబడింది.

మానవశరీరమే శ్రీచక్రం. అందుకే శరీరం కూడా మూడుభాగాలుగా ఉంటుంది.

ఆధారస్వాధిష్ఠానాలు	–	అగ్నిమండలం
మణిపూరఅనాహతాలు	–	సూర్యమండలం
విశుద్ధి ఆజ్ఞాచక్రాలు	–	చంద్రమండలం
సహస్రారం	–	చంద్రలోకం

ఈ రకంగా శ్రీచక్రాన్ని భావించి అర్చన చేస్తే సిరిసంపదలు భోగభాగ్యాలు, ఉన్నతపదవులు లభిస్తాయి.

907. సామగానప్రియా

సామగానం ప్రియం యస్యాః

సామగానమునందు ప్రీతి గలది.

సామము సాధువైనది, ఉత్తమమైనది. శుభప్రదమైనది. సామోపాసన గురించి తెలుసుకున్నవాడు లోకంలో ఐదువిధాలయిన సామాలను ఆరోపించుకుని ఉపాసన చేస్తాడు.

సాధువైనది	–	సామము
అసాధువైనది	–	సామంకాదు
సామరూపము అంటే	–	ఉత్తమరూపము
అసామరూపము అంటే	–	అశుభరూపము

సామం కలిగింది అంటే - శుభం కలిగింది.

అసామం కలిగింది అంటే - కీడు కలిగింది అని అర్థం.

అంటూ ఛాందోగ్యోపనిషత్తులోని రెండవ అధ్యాయంలో పంచవిధసామోపాసన, సప్తవిధసామోపాసన చెప్పబడింది.

సామవేదము అంతా సంగీతపరమైనదే. సామగానం చేసినట్లైతే దేవతలు సంతోషిస్తారు అని దేవీభాగవతంలోని సత్యవ్రతునికథలో చెప్పబడింది. అలాగే పరమేశ్వరి కూడా సామవేద పఠనమందు మిక్కిలి ప్రేమ గలిగినది. అందుచేతనే ఆమె సామగానప్రియా అనబడింది.

908. సోమ్యా

సోమయాగానికి తగినది సోమ్యా. పరమేశ్వరి చంద్రమండలంలో ఉంటుంది. యజ్ఞంలో సోమలతారూపంలో ఉంటుంది. అందుచేత సోమ్యా అనబడుతున్నది. సోమేశ్వరుడు అనే శివుని స్వరూపము గలది.

909. సదాశివకుటుంబినీ

సదాశివుడికి భార్య శ్యామల. శుద్ధవిద్య అశ్వారూఢ రూపము గలది. బ్రహ్మ, విష్ణువు, రుద్రుడు, మహేశ్వరుడు, సదాశివుడు. వీరు పంచబ్రహ్మలు. వీరిలో ఐదవవాడు సదాశివుడు. అటువంటి సదాశివునితో భేదము లేనటువంటిది. వేదంలో ఈ శక్తినే అదితి అని, ఇడా అని, సరస్వతి అని వివిధనామాలతో వివరించబడింది. రాజరాజేశ్వరి, శుద్ధవిద్యా, అశ్వారూఢా, శ్యామలా మొదలైన దేవతలంతా సదాశివకుటుంబానికి చెందినవారే కాబట్టి పరమేశ్వరి సదాశివకుటుంబినీ అనబడుతోంది.

910. సవ్యా పసవ్యమార్గస్థా

పరమేశ్వరి ఆరాధించే పద్ధతులలో రెండు మార్గాలు ప్రసిద్ధమైనవి. 1. సవ్యము. 2. అపసవ్యము. అవే సమయాచారము వామాచారము. వీటిలో మళ్ళీ అనేకరకాలున్నాయి. సమయాచారాన్నే దక్షిణాచారము అనే పేరుతో ప్రస్తుతం వ్యవహరిస్తున్నారు. ఇది వేదసమ్మతమైన శిష్టాచారము. రెండవది వామాచారము వేదబాహ్యమైనది. తాంత్రికమైనది.

క్షీరసాగరమధన కాలంలో దేవతలు ఆచరించినది సమయాచారము. రాక్షసులది వామాచారము. సాధకుని యొక్క మానసిక ప్రవృత్తిని బట్టి ఈ ఆచారాలు ఉపదేశించ

బడ్డాయి. దక్షిణాచార వామాచారాలు రెండూ పరమేశ్వరిని అర్చించటానికే ఏర్పడ్డాయి. ఈ అర్చనావిధానం కోసం 64 తంత్రాలు ఉన్నాయి. ఈ రెండుమార్గాలలోనూ పరమేశ్వరి సేవించబడుతుంది. కాబట్టి 'సవ్యాపసవ్యమార్గస్థా' అనబడుతుంది.

శ్రీచక్రార్చన చేసేటప్పుడు కొన్ని ఆవరణలలో దేవతలను సవ్యంగాను, కొన్ని ఆవరణలలో అపసవ్యంగాను అర్చించటం జరుగుతుంది.

శ్రీచక్రంలోని ఆవరణలను ఏవిధంగా అర్చిస్తారో ఈ దిగువ ఇవ్వబడింది.

1.	భూపురం	-	ప్రాదక్షిణ్యేన సవ్యము
2.	షోడశదళము	-	వామావర్తేన అపసవ్యము
3.	అష్టదళము	-	ప్రాదక్షిణ్యేన సవ్యము
4.	మన్వస్రము	-	వామావర్తేన అపసవ్యము
5.	బహిర్దశారము	-	వామావర్తేన అపసవ్యము
6.	అంతర్దశారము	-	వామావర్తేన అపసవ్యము
7.	అష్టకోణము	-	వామావర్తేన అపసవ్యము
8.	త్రికోణము	-	ప్రాదక్షిణ్యేన సవ్యము

ఈ రకంగా భూపురము, అష్టదళము, త్రికోణములను సవ్యంగాను, షోడశదళము, మన్వస్రము, బహిర్దశారము, అంతర్దశారము, అష్టకోణములను అపసవ్యంగానూ అర్చిస్తారు. బిందువునందు శివశక్తులుంటారు. అక్కడ ఇంకే దేవతలు ఉండరు కాబట్టి సవ్యము, అపసవ్యము అనే ప్రసక్తిరాదు.

ఈ రకంగా కొన్ని ఆవరణలలో సవ్యంగాను, కొన్ని ఆవరణలలో అపసవ్యంగాను అర్చన జరుగుతుంది. కాబట్టి పరమేశ్వరి సవ్యాపసవ్యమార్గస్థా అనబడుతోంది.

ఆధారచక్రంలో నిద్రావస్థలో ఉండే కుండలినీశక్తి ముఖ్యప్రాణ స్వరూపిణి. అది జాగృతమైనప్పుడు సుషుమ్నగుండా బయలుదేరి సహస్రారం దాకా చేరి అక్కడ నుండి మళ్ళీ మూలాధారానికి వస్తుంది. భావనోపనిషత్తులో

మూలాధారాది బ్రహ్మబిలపర్యంతం, బ్రహ్మరంధ్రాది
మూలాధార పర్యంతం గతాగతరూపేణ ప్రాదక్షిణ్యమ్

ఈ రకంగా ప్రాణవాయువు ఆధారచక్రం నుండి సహస్రారానికి, సహస్రారం నుంచి ఆధారచక్రానికి సుషుమ్న గుండా తిరగటాన్నే అంతఃపూజలో ప్రదక్షిణ అంటారు.

ఈ విధంగా సవ్యంగాను అపసవ్యంగాను తిరుగుతుంది. కాబట్టి సవ్యాపసవ్యమార్గస్థా అనబడుతోంది పరమేశ్వరి.

911. సర్వాపద్వినివారిణీ

ఈ విధంగా సవ్య, అపసవ్య మార్గాలలో పరమేశ్వరిని ఆరాధించే వారికి ఏ రకమైన ఆపదలు రాకుండా చూస్తుంది ఆ పరమేశ్వరి. గీతాచార్యుడు చెప్పినట్లుగా

అనన్యా శ్చింతయంతో మాం యే జనాః పర్యుపాసతే ।
తేషాం నిత్యాభియుక్తానాం యోగక్షేమం వహా మ్యహమ్ ॥

ఏ విధమైన సందేహాలు లేకుండా మనోవాక్కాయ కర్మలచే పరమేశ్వరిని ఉపాసించేవారి బాధలను తొలగించి వారి రక్షణభారము పరమేశ్వరుడు స్వయంగా తనే స్వీకరిస్తాడు.

కూర్మపురాణంలో "సంగరహితులై నన్ను శరణుపొందేవారు, సర్వభూతములందు దయగలవారు, శాంతులు, వేదాంతులు, బుద్ధిమంతులు, తాపసుల, కష్టాలు అనతికాలంలోనే లీనమయిపోతాయి. పై లక్షణాలు లేకపోయినా నిత్యము నా నామజపం చేసేవారు, నన్నే ధ్యానించేవారి ఆపదలు కూడా త్వరగా వదలిపోతాయి.

దేవిని స్మరించేవారి అన్ని ఆపదలను పరమేశ్వరి తొలగిస్తుంది. అందుచేతనే ఆమె సర్వాపద్వినివారిణీ అనబడుతుంది. వరాహపురాణంలో బ్రహ్మాదులు దేవిని ప్రార్థిస్తూ

శరణం త్వాం ప్రపద్యంతే యే దేవీం పరమేశ్వరీం ।
న తేషా మాపదః కాశ్చిజ్జాయంతే క్వాపి సంకటే ॥

పరమేశ్వరీ ! నిన్ను శరణు పొందితే వారికి కొంచెమైన ఆపదలు కలగవు. ఇందులో సందేహంలేదు అంటారు.

దేవిని స్మరించేవారి ఆపదలన్నింటినీ ఆ పరమేశ్వరియే తొలగిస్తుంది. కాబట్టి ఆమె సర్వాపద్వినివారిణీ అనబడుతుంది.

ఈ విధంగా అగ్నిష్టోమాది సంకేతం వివరించబడింది.

52. జపయజ్ఞము

మననాత్ త్రాయత ఇతి మంత్రః

మననము చేయుట వలన మననము చేయువారిని రక్షించునది మంత్రము.

ఏదైనా ఒక అక్షరం గాని, కొన్ని అక్షరాల సముదాయాన్ని గాని మంత్రము అంటారు. బీజాక్షరాలతో మంత్రాలు సంపుటం చెయ్యబడతాయి అని చెప్పబడింది. అసలు బీజాక్షరాలు అంటే ? భాషకు ఉన్నవి 50 అక్షరాలు. ఇవన్నీ బీజాక్షరాలే. ఇవే సంయుక్తాక్షరాలు, ద్విత్త్వాలు అని చెప్పబడుతుంటాయి. కాబట్టి బీజములు అంటే భాషకు ఉన్న అక్షరాలే అవే మాతృకలు. ఏవైనాసరే కొన్ని అక్షరాలను కలిపి అదే పనిగా మననంచేసినట్లైతే దానివల్ల ఫలితం వస్తుంది. 'రామ' అనేది కూడా మంత్రమే.

జపం అంటే – మంత్రావృత్తి. సామాన్యంగా జపం కామ్యం కోసమే చెయ్యటం జరుగుతుంది. కామ్యం కోసం చేసే ఏ పనికైనా నియమనిష్ఠలు ఉంటాయి. అలా నియమనిష్ఠలతో, ఏకాగ్రతతో చేసే మంత్ర ఆవృత్తినే జపం అంటారు. జపం చేసేటప్పుడు మనోవాక్కాయకర్మలతో, తాదాత్మ్యంచెంది చెయ్యాలి. అప్పుడే మంత్రం త్వరగా సిద్ధిస్తుంది. అంతేకాని ఏదో ఆలోచిస్తూ చేసిన జపంవల్ల కాలం వృథాతప్ప ఫలితం ఉండదు. అయితే జపం చేసేటప్పుడు దేన్ని జపమాలగా వాడాలి ? అనే దానిమీద భిన్నాభిప్రాయాలున్నాయి. అసలు జపమాలను వాడితే మాలతిరుగుతున్నదా ? లేదా ? అనేదానిమీదనే ధ్యాస ఉంటుంది. తప్ప మంత్రం మీద ధ్యాస ఉండదు. కాబట్టి మాలలేకుండా జపం చెయ్యటం శ్రేయస్కరం. తరువాత జపసంకల్పం ఎప్పుడూ ఇతరులమేలుని కోరేదిగానే ఉండాలి. అంతేకాని ఇతరులకు కీడుకలగాలని మాత్రం ఆశించకూడదు. ఇతరులవల్ల మనకి ఆపదవస్తుంది అనిపిస్తే నన్ను రక్షించమని భగవంతుణ్ణి వేడుకోవాలి. అంతేకాని అవతలి వ్యక్తిని శిక్షించమని అతడికి హాని కలిగించమని మాత్రం అడగకూడదు.

పరమేశ్వరి రాగద్వేషాలు ఏమాత్రములేనిది. మధురమైన స్వభావం గలది విదుషీమణి. 64 కళలు ఆమెయందున్నాయి. అన్నింటియందు ఆమె ప్రవీణురాలు. ఆమె ధీరులచే అంటే అద్వైతబుద్ధి గలవారిచే పూజించబడుతుంది. జపం చేసేటప్పుడు కామ్యం కోసం కాక మోక్షసాధన కోసం దేవిని ప్రార్థించటం ఉత్తమం. అందుకే ఆమె అర్చనలో చైతన్యమునే అర్ఘ్యంగా వాడాలి. జ్ఞానపుష్పాలంటే పరమేశ్వరికి చాలా ప్రీతి. ఆమె స్వయం ప్రకాశి. ఇతరుల సహాయం ఆమెకు అవసరంలేదు. ఆమె ఇతరులకు

సహాయం చేస్తుంది. ఎప్పుడూ సంతుష్టాంతరంగయై ఉంటుంది. సజ్జనుల హృదయాలలో ఉంటుంది.

అటువంటి పరమేశ్వరిని గనక మంత్రానుష్ఠానంతో అర్చినట్లైతే సాధకుడికి ఇహపరాలు అన్నీ సమకూరుతాయి.

912. స్వస్థా

దుఃఖము వలన గలుగు చాంచల్యము లేనిది. రాగద్వేషాలనేవి ఆ పరమేశ్వరికి ఏమాత్రమూ ఉండవు. అందుచేత ఆమెకు చిత్తచాంచల్యము కలగదు. ఆ దేవి గుణాతీతురాలు. ఎల్లవేళల మంచి ఆరోగ్యస్థితిలో స్థిరమైన చిత్తముతో ఉంటుంది. అంతే కాదు పరమేశ్వరి ఎక్కడ ఉంటుంది అంటే స్వస్థా–తన యందే ఉంటుంది. హృదయ స్థానంలో ఉంటుంది. మానవుని యొక్క దహరాకాశంలో ఉంటుంది. దహరాకాశరూపిణి. అందుచేతనే దహరాకాశము భక్తులకు పవిత్రస్థానము.

913. స్వభావమధురా

మధురమైన స్వభావము గలది. స్వభావముచేతనే అందరితోనూ కోరబడునది. ఆ దేవి యొక్క స్వభావమే కాదు. మాట మధురం, చూపు మధురం, రూపం మధురం, వదనం మధురం. ఒకటేమిటి ఆ పరమేశ్వరి అంతా మధురమే. ఆమె నుంచి అమృతధారలు వర్షిస్తాయి. తన భక్తులకు ఎనలేని ఆనందాన్నిస్తుంది. అదే బ్రహ్మానందం. అది అనిర్వచనీయం. అనుభవైకవేద్యం. తనను తలచినంత మాత్రంచేతనే భక్తజనహృదయాలలో ఆనందమును కలుగచేయు స్వభావము గలది. అందుచేతనే ఆమె స్వభావమధురా అనబడుతోంది.

914. ధీరా

పండితురాలు ధైర్యవతి. ఆ పరమేశ్వరి 64 కళలయందు పాండిత్యము గలది. సజ్జనులకు ఉండవలసిన ధైర్యము, ఓర్పు, వాక్చాతుర్యము, బలము మొదలైన గుణాలన్నీ ఆమెకు ఉన్నాయి. అందుచేత ధీర అనబడుతుంది.

భగవంతుడు భక్తుడు ఒకటే. వీరిద్దరి మధ్య భేదం లేదు. అనే అద్వైతబుద్ధి గలవారు ధీరులు. అటువంటి ధీరులరూపంలో ఉండేది కాబట్టి పరమేశ్వరి ధీరా అనబడుతోంది.

915. ధీరసమర్చితా

ధీరైః పండితైః సమర్చితా

ధీరులచే పూజించబడునది. ధీరులు అంటే అద్వైతబుద్ధి గలవారు అని గతంలో చెప్పాం. అటువంటి జ్ఞానులచే అర్చించబడునది. అంతర్ముఖులైన వారిచే పూజించబడునది. కాబట్టి ధీరసమర్చితా అనబడుతోంది. చంచలచిత్తులకు అందుబాటులో ఉండనిది.

916. చైతన్యార్ఘ్యసమారాధ్యా

చైతన్యము అనే అర్ఘ్యంచేత పూజింపబడునది. భావనోపనిషత్తులో

ఉజ్జ్వల దామోదాను సంధానమర్ఘ్యమ్

అర్ఘ్యము అంటే చేతులు కడుక్కునే నీరు. త్రాగేందుకు ఇచ్చే నీరు. అంతఃపూజలో ఆత్మయే శ్రీదేవి అని గ్రహించి బ్రహ్మానందానుసంధానం చెయ్యటమే అర్ఘ్యప్రదానము అని చెప్పబడింది.

పరమేశ్వరిని అర్చించేటప్పుడు బాహ్యపూజ కన్న అంతఃపూజ విశేషఫలప్రదము. **సోహం భావేన పూజయేత్** సాధకుడు తానే పరమేశ్వరస్వరూపము అని భావించి అర్చన చెయ్యాలి.

చైతన్యము అంటే – చిద్రూపము. ఆత్మ ఈ చైతన్యమే అర్ఘ్యము అని భావించి అర్చన చెయ్యాలి. అందుచేత పరమేశ్వరి చైతన్యార్ఘ్యసమారాధ్యా అనబడుతోంది. ఇక్కడ జ్ఞానమే అర్ఘ్యము అని భావన. ఆత్మజ్ఞానంతో, ఆత్మనే అర్ఘ్యముగా ఉపయోగించి దేవిని అర్చించాలి. జ్ఞానంతో ఆత్మానుభవం పొంది ఆత్మార్పణ గావించాలి.

917. చైతన్యకుసుమప్రియా

పరమేశ్వరి పూజలో బయటనుంచి పుష్పాలుకొని తేవటంకాదు చేయవలసినది. ఆత్మ చైతన్యాన్నే పుష్పాలుగా భావించి దేవిని అర్చించాలి. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని మూడవశ్లోకంలో **జడానాం చైతన్యస్తబకమకరంద స్రుతిఝరీ** అన్నారు. చైతన్యపుష్పములో స్రవించే తేనే దేవి. చైతన్యకుసుమాలు ఎనిమిది.

1. అహింస	3. క్షమ	5. వివేకము	7. సత్యము
2. ఇంద్రియనిగ్రహము	4. కనికరము	6. తపస్సు	8. ధ్యానము

సాధకుడు వీటిని కలిగి ఉండాలి. ప్రపంచంలో ఇతరులపట్ల వీటిని వినియోగించాలి. అదే చైతన్యకుసుమారాధన. దానియందు ప్రీతి గలవి. కాబట్టి పరమేశ్వరి చైతన్యకుసుమప్రియా అనబడుతుంది.

అహింసా ప్రథమ పుష్పం పుష్ప మింద్రియ నిగ్రహః
దయా క్షమా జ్ఞాన పుష్పం పంచపుష్పం తతః పరం

1. అహింస 2. ఇంద్రియనిగ్రహము 3. దయ 4. క్షమ 5. జ్ఞానము

వీటిన పంచపుష్పాలు అంటారు. వీటితో ఆ పరమేశ్వరిని అర్చించాలి. అదే చైతన్యకుసుమార్చన. అటువంటి అర్చన యందు ప్రీతి గలది. కాబట్టి పరమేశ్వరి చైతన్యకుసుమప్రియా అనబడుతుంది.

918. సదోదితా

నిత్యము స్వయం ప్రకాశము గలది. పరమేశ్వరి నిత్యబ్రహ్మస్వరూపిణి. ఉదయించే సూర్యమండలములాగా ప్రకాశిస్తుంటుంది. అన్నిచోట్ల ప్రత్యక్షమవుతుంది. స్మరించినంత మాత్రంచేతనే స్ఫురిస్తుంది. సర్వకాలసర్వావస్థలయందు భక్తుల హృదయాలలో ఉండేది. కాబట్టి సదోదితా అనబడుతుంది.

919. సదాతుష్టా

ఎప్పుడూ సంతుష్టిగలది. సజ్జనులయందు ప్రీతిగలది. పరమేశ్వరికి ఏ రకమైన కోరికలులేవు. ఎల్లప్పుడూ సంతృప్తి కలిగి ఉంటుంది. ఆమె నిత్యానందస్వరూపిణి. అందుచేత సదాతుష్టా అనబడుతోంది. తన భక్తుల కోర్కెలను తీర్చి, వారిని సంతుష్టాంత రంగులుగా చేస్తుంది. కాబట్టి సదాతుష్టా అనబడుతోంది.

53. యాగఫలము

యాగము – దేవతలకు హవిర్భాగాలివ్వటము. యజ్ఞము అని అర్థం. యజ్ఞం చేసేటప్పుడు దేవతలకు హవిర్భాగం ఇస్తారు. ఈ రకంగా హవిర్భాగం తీసుకునేవారు 33 మంది దేవతలు అని బృహదారణ్యకోపనిషత్తులో చెప్పబడింది.

ఒకసారి జనకమహారాజుయాగం చేస్తున్నాడు. సంప్రదాయం ప్రకారం ఆధ్యాత్మిక ప్రవచనాలు, వాదనలు జరుగుతున్నాయి. అప్పుడు జనకుని గోశాలలో నుంచి వేయి బాగా బలసిన ఆవులు, ఆంబోతులు తీసుకువచ్చారు భటులు. వాటి గిట్టలకు కొమ్మలకు బంగారు తాపడాలున్నాయి. వాటిమీద పట్టువస్త్రాలు కప్పబడి ఉన్నాయి. జనక మహారాజు లేచి ఆధ్యాత్మిక ప్రపంచంలో రారాజు ఎవరో, వారు వీటిని తోలుకుపోవచ్చును అన్నాడు. యాజ్ఞవల్క్యుడు తన శిష్యుణ్ణి పిలిచి గోవులను ఆశ్రమానికి తోలుకుపొమ్మన్నాడు. అప్పుడు సభలోని పండితులు అడ్డుకుని అనేకవిధాల యాజ్ఞవల్క్యుణ్ని పరీక్షించారు. ఆ సమయంలో శాకల్యుడు అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ

దేవతలు 33 మంది. వారికే యజ్ఞాలలో హవిర్భాగము ఇవ్వబడుతుంది. వారు

ద్వాదశాదిత్యులు	–	12	మంది
అష్టవసువులు	–	8	మంది
ఏకాదశరుద్రులు	–	11	మంది
ఇంద్రుడు, ప్రజాపతి	–	2	ఇద్దరు
వెరసి		33	మంది

అంటాడు. వీరికే హవిర్భాగం ఇవ్వటం జరుగుతుంది. అది తీసుకుని దేవతలు యజ్ఞఫలాన్ని మనకందచేస్తారు.

పరమేశ్వరి ప్రీతి కోసం యాగాలు చెయ్యటం జరుగుతుంది. చండీయాగము, అంబాయాగము వంటి యాగాలతో తృప్తి చెందిన దేవి యజమానికి ఫలితాన్నిస్తుంది.

పరమేశ్వరి మధ్యందిన మార్తాండునిలాగా తెలుపు ఎరుపు కలిసిన రంగులతో ప్రకాశిస్తుంటుంది. ఆ దేవి తనను అర్చించేవారి కోరికలను బట్టి వివిధ రంగులలో దర్శనమిస్తుంది. ఈ విషయం బృహదరాణ్యకోపనిషత్తులోను, వేదంలోనూ చెప్పబడింది.

యజ్ఞం చేసిన తరువాత, ఆ క్రియలో ఆఖరుగా ఋత్విక్కులకు దక్షిణసమర్పించాలి. ఆ దక్షిణతో వారు సంతృప్తి చెందాలి. అప్పుడే యాగఫలం మనకు దక్కుతుంది. దక్షిణలేని కర్మ సఫలంకాదు. పరమేశ్వరి దక్షిణ ఇవ్వటం చేతనే ఆరాధింపబడుతుంది. తృప్తి చెందుతుంది. అర్చనావిధానంలో దక్షిణాచార సంపన్నులుచేసే అర్చనలతో తృప్తి చెందుతుంది. ఆ విధంగా యాగం పూర్తి అయిన తరువాత, కర్తకు వాంఛితార్థాన్నిస్తుంది.

ఈ విషయం 920 నుంచి 922 వరకు నామాలలో వివరించబడింది.

920. తరుణాదిత్యపాటలా

తరుణాదిత్యుడు – మధ్యందినమార్తాండడు. పాటలా – పాటలవర్ణము గలిగినది. మధ్యాహ్నకాలమునందున్న సూర్యునివలె ఎరుపుతెలుపు కలిసిన రంగుతో ప్రకాశించేది. పరమేశ్వరి శ్యామవర్ణంలో ఉంటుందని, గౌరవర్ణంలో ఉంటుందని చెప్పటం తప్పుకాదు. ఆమె తనను అర్చించే వారి మనసును బట్టి వివిధ వర్ణములలో ప్రకాశిస్తుంటుంది. బృహదారణ్యకోపనిషత్తులో పరమేశ్వరుడు మంచి వస్త్రంలాగా, తెల్లని ఉన్నిగుడ్డలాగా, వర్షాకాలంలో కనిపించే ఆర్ద్రపురుగులాగా, అగ్నిజ్వాలలాగా, తెల్లనిపద్మంలాగా, మెరుపు కాంతిలాగా ఉంటాడు. ఈ విషయం తెలుసుకున్నవాడి సంపద విద్యుత్ప్రకాశంలాగా అంతటా వ్యాపిస్తుంది అని చెప్పబడింది. వేదంలో

శాంతా ధవళవర్ణాభా మోక్షధర్మ ప్రకల్పనే
స్త్రీవశ్యే రాజవశ్యేచ జనవశ్యే చ పాటలా
పీతా ధనస్య సంపత్తౌ కృష్ణా మారణకర్మణి
బభ్రుర్విద్వేషణే ప్రోక్తా శృంగారే పాటలాకృతిః
సర్వవర్ణా సర్వలాభే ధ్యేయా జ్యోతిర్మయీ పరమ్ ॥

మోక్షమిచ్చేటప్పుడు	–	శ్వేతవర్ణము, శాంతము.
స్త్రీ, రాజ, జనవశ్యమందు	–	పాటలవర్ణము
ధనసంపత్తిలో	–	పీతవర్ణము
మారణకర్మలో	–	కృష్ణవర్ణము
విద్వేషములందు	–	కపిలవర్ణము
శృంగారమున	–	పాటలవర్ణము
సర్వార్థములందు	–	సర్వవర్ణములు

కలిగి ఉంటుంది. ఈ రకంగా సర్వవర్ణములతోను శోభించు దేవిని సేవించుట శ్రేయస్కరము.

921. దక్షిణా

ఏదైనా క్రతువు సఫలం కావాలి అంటే అఖరున బ్రాహ్మణుడికి దక్షిణ సమర్పించాలి. క్రతువంతా పూర్తి అయిపోయిన తరువాత **యధాశక్తి హిరణ్యం తుభ్య మహం సంప్రతతే నమమ.** అంటూ యధాశక్తి వశిష్ఠుని చేతిలో దక్షిణ ఉంచి ఆయన పాదాలకు నమస్కరించాలి. అప్పుడే యాగము పూర్తి అయినట్లుగా చెప్పబడుతుంది.

ఒకసారి బ్రహ్మ యజ్ఞం చేసి, యజ్ఞం సఫలం కావాలని పరమేశ్వరిని పరిపరివిధాల ప్రార్థించాడు. పరాశక్తి సలహామీద విష్ణువు లక్ష్మి అంశతో దక్షిణను సృష్టించి బ్రహ్మకు ఇవ్వగా, బ్రహ్మ ఆమెను యజ్ఞపురుషుడికి సమర్పించాడు. యజ్ఞం సఫలమైంది. ఈ విషయం గతంలో వివరించటం జరిగింది.

కాబట్టి దక్షిణలేని కర్మ సఫలం కాదు. పరమేశ్వరి దక్షిణా స్వరూపురాలు. యాగాలలో ఋత్విక్కులకు ఇచ్చే దక్షిణ పరదేవతా స్వరూపము. ఈ దక్షిణే యజ్ఞయాగాది క్రతువులందు పూర్తి ఫలితాన్నిచ్చేది.

922. దక్షిణారాధ్యా

పరమేశ్వరి సమయాచారుల చేత, దక్షిణాచారులచేత కూడా ఆరాధింపబడునది. కాబట్టి దక్షిణారాధ్యా అనబడుతోంది. క్రతువు చివరలో ఇచ్చే దక్షిణ యజమానిని కవచమువలె కాపాడుతుంది. దక్షిణ తీసుకుని ఋత్విక్కులు సంతోషించాలి. వారు తృప్తి చెందితేనే యజమానికి ఫలం దక్కుతుంది. వారు తృప్తి చెందితేనే పరమేశ్వరి సంతసిస్తుంది. ఈ రకంగా దక్షిణ దానముచే ఆరాధింపబడుతుంది కాబట్టి పరమేశ్వరి దక్షిణారాధ్యా అనబడుతుంది. ఈ విధంగా యాగఫలం వివరించబడింది.

54. యతి - అనుష్ఠానము

యతి అంటే సన్యాసి, జితేంద్రియుడు, పరివ్రాజకుడు.

యతీశ్వరుడు ఏకాక్షరీ మంత్రాన్ని మాత్రమే అనుష్ఠానం చెయ్యాలి. అది కూడా ఓంకారమే. యతి మనోవాక్కాయ కర్మలతో సదా పరమేశ్వరుణ్ణే ఆరాధిస్తూ ఉండాలి. ఎల్లఎడలా పరమేశ్వరుణ్ణే దర్శిస్తుండాలి. జగత్తంతా పరబ్రహ్మ స్వరూపంగానే భావించాలి.

పూజ రెండు రకాలు 1. బాహ్యపూజ 2. అంతఃపూజ. యతికి బాహ్యపూజలేదు. అంతఃపూజ మాత్రమే చెయ్యాలి. అంటే ప్రాణాయామంచేసి ఆధారచక్రంలో నిద్రావస్థలో ఉన్న కుండలినీశక్తిని జాగృతం చెయ్యాలి. అప్పుడు ఆ శక్తి మేల్కొని పూత్కారం చేస్తూ ఊర్ధ్వముఖంగా బయలుదేరుతుంది. అలా బయలుదేరి షట్చక్రాలను భేదించి, గ్రంథిత్రయాన్ని దాటి సహస్రారం చేరి సహస్రకమలాన్ని తన నోటితో కరచిపట్టుకుంటుంది. అప్పుడు అక్కడి నుండి అమృతపుధారలు ప్రవించి సాధకుని శరీరంలోని 72 వేల నాడీమండలాన్నీ తడుపుతాయి.

ఈ రకంగా కులమార్గంలో కౌళినిని గనక అర్చించినట్లైతే ఆ దేవి అవిచ్ఛిన్నమైనటువంటి కైవల్యాన్ని ప్రసాదిస్తుంది.

ఆమె స్తోత్రప్రియ. శ్రుతులలో ఆమె వైభవము చెప్పబడింది. మానవుడి పూర్వజన్మ కర్మను బట్టి అతని మానసికస్థితి ఉంటుంది. అట్టి మానసికస్థితిని నియంత్రిస్తుంది. ఆ పరమేశ్వరి జగత్తునంతా సృష్టించింది. ఈ జగత్తుకు అధిపతి. కాని ఆమెకు ఏ విషయమందు ఆసక్తి ఉండదు. విరాగి. ఆమె తన భక్తులపట్ల పరమ ఉదారస్వభావురాలు. ఎప్పుడూ ఆనందస్థితిలోనే ఉంటుంది. తనను ఈ రకంగా అర్చించే భక్తులకు ఆనందస్థితి అంటే సాయుజ్యము ప్రసాదిస్తుంది.

ఈ విషయాన్ని 923 నుంచి 941 వరకు నామాలలో వివరించటం జరిగింది.

923. దరస్మేరముఖాంబుజా

చిరునగవుతో కూడిన ముఖారవిందము గలది. పరమేశ్వరి మనోహరమైన మందహాసంతో ప్రకాశించే ముఖము గలిగినది. కాబట్టి దరస్మేరముఖాంబుజా అనబడింది.

దరము అనగా – శంఖము.

స్మేర అంటే – ప్రకాశము

పరమేశ్వరి ముఖపద్మము శంఖంలాగా తెల్లగా ప్రకాశిస్తున్నది.

కల్పాంతమునందు అంటే మహాప్రళయకాలంలో కూడా చిరునవ్వుతో కూడిన ముఖము గలది. భక్తులను ఆదరించటంలో చిరునగవుతో కూడిన ప్రసన్నమైన ముఖము కలది.

924. కౌళినీ

కులమార్గంలో ఉండేది కాబట్టి కౌలినీ అనబడుతుంది.

విభిన్నకులములను ఏకము చేయునది. భిన్నజాతికి చెందిన భోక్తలను, భోజ్యములను ఏకము చేయునది.

మానవులదంతా ఒకజాతి. వీరు తీసుకునే ఆహారం భిన్నజాతులకు సంబంధించినది. అంటే కూరలు, కాయలు, పండ్లు, మాంసము ఇత్యాదులు. ఈ రకంగా తీసుకున్న ఆహారం శరీరంలో జీర్ణమయి, రక్తము, మాంసము, ఎముకలు, మజ్జ, వెంట్రుకలు, చర్మములుగా మార్పు చెందుతుంది. ఇంకొకజాతిని ఆహారంగా తీసుకున్నప్పటికీ, వాటిని జీర్ణంచేసి మానవదేహంలోని భాగాలుగా ఏకం చేస్తుంది. ఇదేవిధంగా పశుపక్ష్యాదులకు కూడా జరుగుతుంది. ఈ రకంగా భిన్నజాతులను ఏకం చేస్తుంది. కాబట్టి కౌళినీ అనబడుతుంది.

925. కేవలా

పరమేశ్వరి సాక్షాత్తూ పరబ్రహ్మమే. కాబట్టి కేవలా అనబడుతుంది. అంతటా ఉన్నది తానొక్కతే. వేరెవ్వరూ లేరు. **ఏకమే వాద్వితీయం బ్రహ్మ** తానుగాక రెండవపదార్థమేదీలేదు. జ్ఞానస్వరూపిణి.

ఆ పరబ్రహ్మ శబళబ్రహ్మయై శరీరంలో ప్రవేశించి బ్రహ్మ కలను సహస్రారంలో వదిలి కేవలయై కులమార్గంలో కుండలిని చేరి ఆధారచక్రంలో నిద్రిస్తున్నది. కాబట్టి పరమేశ్వరి కేవలా అనబడుతున్నది.

926. అనర్ఘ్యకైవల్యపదదాయినీ

అమూల్యమైనది, అవిచ్ఛిన్నమైనది అయిన ముక్తినిస్తుంది. అదే సాయుజ్యము. సహస్రారంలో పరమేశ్వరిని అర్చించే వారికి సాయుజ్యం లభిస్తుంది. అటువంటి ముక్తిని భక్తులకు వారి అర్హతనుబట్టి ఇస్తుంది. అంతములేని కైవల్యమునిస్తుంది. ఆమె సాన్నిధ్యమును మించిన కైవల్యమేలేదు. అటువంటి కైవల్యమునిస్తుంది. కాబట్టి పరమేశ్వరి 'అనర్ఘ్యకైవల్యపదదాయినీ' అనబడుతుంది.

927. స్తోత్రప్రియా

స్తోత్రములందు ప్రీతిగలది. స్తోత్రము అంటే లోకసంబంధమైన గుణాలను అనువదించి చెప్పటము. ఇది ఆరువిధాలు.

నమస్కార స్తథా శీ శ్చ సిద్ధాంతోక్తిః పరాక్రమః ।
విభూతిః ప్రార్థనా చేతి షడ్విధం స్తోత్రలక్షణం ॥

1. నమస్కారము 3. సిద్ధాంతోక్తి 5. విభూతి
2. ఆశీస్సు 4. పరాక్రమము 6. ప్రార్థన

ఈ విధంగా చేసే స్తోత్రాలయందు ప్రీతిగలది. స్తుతిరూపమైన నామములు గలది. లలితాసహస్రంలో ఆమెను స్తుతిచేస్తూ అనేక నామాలున్నాయి. వాటిలో కొన్ని

1. స్తుతిమతీ 4. మిధ్యాజగదధిష్ఠానా
2. త్రిజగద్వంద్యా 5. ఇచ్ఛాశక్తి జ్ఞానశక్తి క్రియాశక్తి స్వరూపిణీ
3. సామ్రాజ్యదాయినీ 6. భండాసురేంద్ర నిర్ముక్తశస్త్రప్రత్యస్త్రవర్షిణీ

ఈ రకమైన స్తుతినామాలు గలది.

మంత్రాలతో కలిసిన వైదికస్తుతులందు ప్రీతిగలది.

సహస్రనామాలు, త్రిశతి, ఖడ్గమాల, సప్తశతి మొదలగు స్తోత్రపాఠములందు ప్రీతి గలది.

928. స్తుతిమతీ

పరమేశ్వరిని స్తుతించటంతో జ్ఞానము, ఐశ్వర్యము లభిస్తాయి. మానవులచేత, దేవతలచేత స్తుతింపబడదగిన గుణములు కలది. లోక కంటకులైన రాక్షససంహారముచేసిన వైభవముగలది. తనను నామాలతోగాని, స్తోత్రాలతోగాని స్తుతించే వారియందు ప్రీతిగలది.

929. శ్రుతిసంస్తుతవైభవా

శ్రుతులచేత గొప్పగా పొగడబడిన విభుత్వముగలది. వేదాలలో లెస్సగా పరిచితమైన వైభవముగలది.

సర్వే వేదా యత్పద మామనంతి

నాలుగువేదములచేత కొనియాడబడు వైభవము గలది. కాబట్టి పరమేశ్వరి శ్రుతి సంస్తుతవైభవా అనబడుతోంది.

పరమేశ్వరుని గొప్పతనాన్ని చెప్పటానికి వేయితలలుగల ఆదిశేషుడికి కూడా శక్యముకాదు.

930. మనస్వినీ

మనః అస్యాః స్వతంత్రతయా తిష్ఠతి

మనస్సు ఈమె యందు స్వతంత్రంగా అధివసించి ఉన్నది. అంటే మనస్సు ఆమెపైనే ఆధారపడి ఉన్నది.

పరమేశ్వరికి మనోవికృతులు ఏమాత్రములేవు. ఎల్లవేళలయందు తురీయాతీత స్థితిలో ఉండేటటువంటి సచ్చిదానందమాత్రస్వరూపిణి. కాబట్టి ఆమె మనస్వినీ అనబడుతోంది.

మనోవికృతులు పదకొండు. అవి :

1. కామ 4. శ్రద్ధ 7. అధృతి 10. భీః
2. సంకల్ప 5. సత్యము 8. శ్రీః 11. ధీః
3. విచికిత్స 6. ధృతి 9. హ్రీః

ఈ వికృతులు మానవుని పూర్వకర్మను బట్టి మారుతుంటాయి. అంటే పండితుడి యందు ఒక రకంగాను పామరుడి యందు ఒక రకంగాను ఉంటాయి. కాబట్టి మనస్సును పూర్వజన్మ సుకృతాన్ని బట్టి ప్రేరణచేసేది ఆ పరమేశ్వరి. అందుకే మనస్విని అనబడుతుంది.

జీవి జన్మించినప్పుడు స్థూలసూక్ష్మకారణ దేహాలు మూడు ఉంటాయి. స్థూలదేహం ఈ జన్మలో కల్పించబడింది. సూక్ష్మకారణదేహాలు పురాకృతసుకృతాలు. అవి గతజన్మలలో నుండి వస్తూనే ఉంటాయి. గత జన్మలలో ఉన్న బలమైన కోరికలు పూర్తిగా తీరకపోతే, అవి ఈ జన్మలో కొనసాగుతాయి. వాటి ఆధారంగానే క్రొత్త కోరికలు కూడా పుడతాయి. ఈ రెండూ కలిసి మనసులో పనిచేస్తాయి. తదనుగుణంగా మానవుడి ఆలోచనలు సాగుతాయి. ప్రతిజన్మలోను జీవి మనస్సుకు, కర్మలకు సాక్షి పరమేశ్వరియే. కాబట్టి ఆమె మనస్వినీ అనబడుతోంది.

931. మానవతీ

ఆదరణ గలది, గౌరవము గలది. కీర్తి ప్రతిష్ఠలు గలది. పరమేశ్వరి అపారమైన ఆదరాభిమానాలు కలిగి కామేశ్వరి అనే కీర్తి, దైత్యహంత్రి అనే ప్రతిష్ఠ గలది కావటంచేత మానవతీ అనబడుతోంది.

మానవతీ – అంటే పతివ్రత అని కూడా అర్థం. ప్రతిజన్మలోనూ పరమేశ్వరుడినే భర్తగా పొందుతుంది. కాబట్టి ఆమె మహాపతివ్రత. మానవతీ అనబడుతుంది.

932. మహేశీ

మహేశుని భార్య మహేశి. దేవీపురాణంలో

మహాదేవాత్ సముత్పన్నా మహద్భిర్యత ఆదృతా

మహేశస్య వధూర్యస్మాత్ మహేశీ తేనసాస్మృతా

మహాదేవుని వలన పుట్టింది. గొప్పవారిచే ఆదరించబడింది. మహేశ్వరుని అర్ధాంగి కాబట్టి మహేశీ అనబడుతుంది.

వేదాలలో ప్రతిపాదింపబడే దేవతయే మహేశీ. ఈమె మహా ప్రభ్వి. సకల భువనాలకు అధిపతి. అఖిలాండకోటి బ్రహ్మాండాలకు అధిపతి. కాబట్టి మహేశి అనబడుతుంది.

పరమేశ్వరుడికి ఆరు అంగాలున్నాయి. అవి.

1. సర్వజ్ఞత
2. అనాదిబోధ
3. స్వతంత్రత
4. నిత్యత
5. సంపూర్ణత
6. అనంతత

వీటన్నింటినీ కలిగి ఉన్నది. కాబట్టి పరమేశ్వరి మహేశీ అనబడుతోంది.

933. మంగళాకృతిః

మంగళరూపా ఆకృతి ర్యస్యాః

మంగళరూపమైన ఆకారము గలది.

సర్వమంగళమాంగల్యే ! శివే ! సర్వార్థసాధకే !

శరణ్యే ! త్ర్యంబకే ! దేవి ! నారాయణి ! నమోఽస్తు తే ॥

అన్నిరకాలయిన శుభములు కలిసి ఆకృతి ధరించినది. సర్వమంగళస్వరూపురాలు. శోభనమైన నిత్యమంగళస్వరూపురాలు. కాబట్టి మంగళాకృతిః అనబడుతోంది.

934. విశ్వమాతా

విశ్వస్య జగతో విష్ణో ర్వా మాతా

జగత్తులకు తల్లి. విష్ణువుకు తల్లి.

పరమేశ్వరి ఈ జగత్తుకంతటికీ తల్లి. సమస్త ప్రపంచాన్ని ప్రసవించిన మూలప్రకృతి అని ముందే చెప్పాం. ఈ కారణాలచేత పరమేశ్వరి విశ్వమాతా అని చెబుతోంది. శ్రీమాతయే – విశ్వమాత.

935. జగద్ధాత్రీ

భూ రూపముచే జగత్తును ధరించినది.

వామకేశ్వరతంత్రంలో

శింశుమారాత్మనావిష్ణుః భూరాదీనూర్ధ్వతః స్థితాన్

దధ్రే శేషతయాలోకాన్ సప్తలోకాన్ అధస్థితాన్

శ్రీ మహావిష్ణువు శింశుమార (మొసలి) రూపంలో ఊర్ధ్వలోకాలను, ఆదిశేషుని రూపంలో అధోలోకాలను మోస్తున్నాడు. శ్రీ మహావిష్ణువు అంటే పరమేశ్వరి రూపమే. కాబట్టి పరమేశ్వరియే ఈ రకంగా జగత్తులను ధరిస్తున్నది. కాబట్టి జగద్ధాత్రీ అనబడుతోంది. జగాలనన్నింటినీ పోషించేది ఆమె. కాబట్టి జగద్ధాత్రీ అనబడుతుంది.

936. విశాలాక్షీ

విశాలే విస్తీర్ణే అక్షిణీయస్యాః

విశాలమైన కనులు గలది. విస్తీర్ణమైన కనులు గలది. సర్వకాల సర్వావస్థలయందు అతి జాగ్రత్తగా, విప్పారిన నయనాలతో లోకముల యోగక్షేమాలు చూస్తుంటుంది. కాబట్టి విశాలాక్షి అనబడుతోంది.

త్రికాలములు అంటే భూతభవిష్యద్వర్తమానకాలములను తెలిసినది. కాబట్టి విశాలాక్షీ అనబడుతుంది.

వారణాస్యాం విశాలాక్షీ

అష్టాదశ శక్తి పీఠాలయందు వారణాశిలో ఉండేది విశాలాక్షి

విశాల అంటే బదరికాశ్రమం. హిమాలయాల దగ్గర ఉండే నేపాల్‌దేశము.

937. విరాగిణీ

విరాగో వైరాగ్యం అస్యాః అస్తీతి విరాగిణీ

వైరాగ్యము గలది. విషయ వాంఛలు ఏమాత్రములేనిది. రాగద్వేషాలు అణుమాత్రము కూడా లేనిది. అరిషడ్వర్గాలను పూర్తిగా జయించినది. కేవలము నిర్గుణస్వరూపిణి. త్రిగుణాలు సృష్టించబడక ముందే ఉన్నది. గుణాలను ఆ పరమేశ్వరియే సృష్టించింది. గుణాలకు కారణభూతమైనది. ఈ రకంగా గుణాలకు, అరిషడ్వర్గాలకు అతీతమైనది కాబట్టి విరాగిణీ అనబడుతున్నది.

938. ప్రగల్భా

సృష్ట్యాదికర్మసు ప్రౌఢత్వాత్ ప్రగల్భా

సృష్ట్యాది కర్మలయందు మంచి నేర్పు గలది. కాబట్టి ప్రగల్భా అనబడుతుంది.

సృష్టి, స్థితి, లయ, తిరోదాన, అనుగ్రహములనబడే పంచ కృత్యములయందు ఎనలేని ప్రతిభగలది. నేర్పుగలది. రాక్షస సంహారంలో అనన్య సామాన్యమైన నేర్పుగలది. భక్తులకోరికలు తీర్చటంలో సాటిలేనిది. జగత్తులో తను తప్ప ఇంకేదీ లేనిది. కాబట్టి పరమేశ్వరి ప్రగల్భా అనబడుతున్నది.

939. పరమోదారా

దేశకాలములకన్న గొప్పదైన మహిమ గలది. చెప్పలేని గొప్పతనము గలది.

ప్రకృష్టమైన ఆనందాన్ని అంతటా ఇచ్చేది. సంసార సాగరాన్ని నశింపచేసేది.

ఆ పరమేశ్వరి ఉత్కృష్టమైన ఔదార్యము గలది. భక్తుల కోరికలు తీర్చటంలో అత్యంత ఉదారస్వభావురాలు. ఎన్ని పాపాలు చేసినప్పటికీ మనసా వాచా కర్మణా పరమేశ్వరిని ఒక్కసారి గనక ధ్యానిస్తేచాలు, వారిని కాచి రక్షిస్తుంది.

క్రూరాత్ము దజామీలుడు

నారాయణ అనుచు ఆత్మ నందనుబిలువన్

ఏ రీతి నేలుకొంటివి ?

అటువంటి ఉదారస్వభావురాలు. కాబట్టే పరమోదారా అనబడుతోంది.

940. పరామోదా

ఉత్కృష్టమైన కీర్తి గలది. పరమేశ్వరి ఆత్మానందస్వరూపిణి. పరమానందమే ఆ దేవిస్వరూపము. చిదానంద ఘన స్వరూపిణి. కాబట్టి పరమేశ్వరి పరామోదా అనబడుతోంది.

941. మనోమయీ

శుద్ధ బ్రహ్మకు మనస్సు స్థానము. అందుచేత పరమేశ్వరి మనోమయి అనబడుతుంది. ఎటువంటి ద్వైతభావము లేకుండా వృత్తశూన్యమైన మనస్సు పరమేశ్వరికి నివాసస్థానము. అటువంటి నిర్మలమైన మనస్సు స్థానముగా గలది. కాబట్టి పరమేశ్వరి మనోమయి అనబడుతుంది. మనస్సు అనేది సంకల్పవికల్పాలకు కారణమైనది. మాయాస్వరూపం. ఈ మాయ గనక పటాపంచలైతే పరమేశ్వరి సాక్షాత్కరిస్తుంది.

మనస్సే పరబ్రహ్మస్వరూపము. తైత్తిరీయోపనిషత్తులో ఈ విషయం చెప్పబడింది. దీన్ని గతంలో వివరించాం. కాని పాఠకులకు మళ్ళీ గుర్తు చేస్తున్నాం. వరుణమహర్షి కుమారుడు భృగుమహర్షి. విద్యాభ్యాసం పూర్తిచేసి బ్రహ్మోపదేశం చెయ్యమని తండ్రిని అడిగాడు. బ్రహ్మతత్త్వం చెబితే తెలిసేదికాదు. తపస్సు చేసి తెలుసుకోమన్నాడు తండ్రి.

కొంతకాలం తపస్సుచేశాడు భృగువు. అప్పుడు అన్నమే బ్రహ్మ అని తెలిసింది. ఈ విషయం తండ్రికి చెప్పాడు. కాదన్నాడు తండ్రి. మళ్ళీ తపస్సు చెయ్యమన్నాడు. ఇప్పుడు తెలిసింది ప్రాణమే బ్రహ్మ అని. కాదన్నాడు తండ్రి. మళ్ళీ తపస్సు చెయ్యమన్నాడు. తపస్సు చేశాడు భృగువు. ఇప్పుడు తెలిసింది. మనస్సే బ్రహ్మ. మనస్సు అనేది సంకల్ప వికల్పాలకు నెలవైంది. మనసుతోనే ఆలోచించటం జరుగుతుంది. ఈ ఆలోచన వల్లే స్త్రీ పురుషులు ఏకమవుతారు. సంసారం అభివృద్ధి చెందుతుంది. కాబట్టి ఈ జగత్తుకు కారణం మనస్సు. మనస్సే బ్రహ్మ అని చెప్పబడింది. అటువంటి మనస్సునందు నివాసముండేది కాబట్టి మనోమయీ అనబడుతుంది.

ప్రతి జీవిలోనూ జ్ఞానేంద్రియాలు, కర్మేంద్రియాలుంటాయి. ఇవి వాటి పని నిర్వర్తిస్తూ ఉంటాయి. అయితే వీటన్నింటినీ సక్రమంగా నడిపించేది మనస్సు. అదే పరాశక్తి.

నివృత్తి ధర్మం గల బుద్ధి ప్రకాశాత్మకము. పరబ్రహ్మ స్వరూపం. ప్రవృత్తి ధర్మం గల మనసు విమర్శాత్మకం. శక్తిస్వరూపం. జీవిలో బుద్ధి వికసిస్తే మనస్సు లయమవుతుంది. మనస్సు వికసిస్తే బుద్ధి లయమవుతుంది. ప్రాపంచిక విధానమంతా ప్రవృత్తిరూపం. అందుకని ఆ పరమేశ్వరి ప్రవృత్తికి కారణమైన మనసునందుంటుంది. అందుచేతనే మనోమయీ అనబడుతుంది.

ఈ రకంగా యతి అనుష్ఠానం వివరించబడింది.



శ్రీ 'ఇ'కార దేవి

55. స్మార్తకర్మ

శ్రుతులయందు చెప్పిన కర్మలు స్మార్తము అనబడతాయి. స్మార్తకర్మలు చెయ్యటం వల్ల పరమేశ్వరి సంతసిస్తుంది. ఇవి యజ్ఞాలు యాగాలు క్రతువులు మొదలైనవి. అగ్నిహోత్రము, దర్శపూర్ణమాసలు, చాతుర్మాస్యము, పశుయాగము, సోమయాగము వీటిని పంచయజ్ఞాలంటారు.

యజ్ఞము అనేది విష్ణుస్వరూపం. కాబట్టి యజ్ఞం చెయ్యాలి. దేవయజ్ఞం, పితృయజ్ఞం, బ్రహ్మయజ్ఞం, మనుష్యయజ్ఞం, భూతయజ్ఞం. ఈ రకంగా యజ్ఞయాగాది క్రతువులు వేదాలలో చెప్పిన విధంగా చెయ్యాలి. ఇవిగాక వాజపేయము, పౌండరీకము, చైనము మొదలగు కర్మలు కూడా ఉన్నాయి.

పరమేశ్వరికి యజ్ఞములయందు మక్కువ ఎక్కువ. యజ్ఞము పరమేశ్వరి స్వరూపము. యజమాని ఆమె స్వరూపమే. యజమాని భార్య కూడా దేవిస్వరూపమే.

ఈ రకంగా స్మార్తకర్మలు చేసిన వారికి ఆ పరమేశ్వరి శాశ్వతమైన ఐశ్వర్యమునిస్తుంది. అంతేకాని మోక్షాన్ని ఇవ్వదు. కర్మలు చెయ్యటంవల్ల మోక్షంరాదు. పుణ్యం మాత్రమే వస్తుంది. తద్వారా స్వర్గలోక సుఖాలనుభవించి తిరిగి ఉత్తరజన్మ ఎత్తుతాడు. అదే స్మార్తకర్మల వలన ఫలితం. ఈ విషయాన్నే 942 నుంచి 963 వరకు నామాలలో చెప్పటం జరిగింది.

942. వ్యోమకేశీ

ఆకాశమే కేశములుగా గలది. ఆకాశమే ఆమె శిరస్సు. పరమేశ్వరుడు వ్యోమకేశుడు. అతని శక్తి కాబట్టి పరమేశ్వరి వ్యోమకేశి.

943. విమానస్థా

ఆకాశంలో తిరిగేవి విమానాలు. వాటిరూపంలో ఉండేది పరమేశ్వరి. కాబట్టే విమానస్థా అనబడుతోంది.

విమానము అంటే మెడ పై భాగము. శరీరంలో సహస్రారం శిరస్సునందుంటుంది. ఆ సహస్రారంలోని చంద్రమండలంలో ఉంటుంది పరమేశ్వరి. అందుకే విమానస్థా అనబడుతోంది.

దేవి మేరుపర్వత శిఖరాగ్రాన ఉంటుంది. అందుచేత విమానస్థా అనబడుతుంది.

శ్రీచక్రంలో పైభాగాన తొమ్మిదవ ఆవరణలో ఉంటుంది. కాబట్టి విమానస్థా అనబడుతుంది. సదా అంతరిక్షంలోనే ఉంటుంది. కాబట్టి విమానస్థా అనబడుతుంది.

944. వజ్రిణీ

వజ్రి - వజ్రాయుధం ధరించినవాడు. ఇంద్రుడు అతని భార్య వజ్రిణీ. ఇంద్రాణి, శచీదేవి.

వజ్రమును ఆయుధముగా ధరించినది.

వజ్రములు పొదిగిన ఆయుధములు ధరించినది.

945. వామకేశ్వరీ

వామకేశ్వర తంత్రరూపము గలది. వామకేశ్వర తంత్రాన్ని ప్రతిపాదించే దేవి.

దేవతలలో వామకులు అనేవారు ఒక గణము. వారికి ఈశ్వరి. కాబట్టి వామకేశ్వరి అనబడింది.

వామకేశ్వరుని శక్తి కాబట్టి వామకేశ్వరి అనబడింది.

946. పంచయజ్ఞప్రియా

ఐదురకాల యజ్ఞములయందు ప్రీతి గలది. వేదములో ఈ యజ్ఞాలను.

1. అగ్నిహోత్ర
2. దర్శపూర్ణమాసలు
3. చాతుర్మాస్యలు
4. పశుయాగము
5. సోమయాగము

స్మృతులలో

1. దేవయజ్ఞము
2. పితృయజ్ఞము
3. బ్రహ్మయజ్ఞము
4. మనుష్యయజ్ఞము
5. భూతయజ్ఞము

పాంచరాత్రాగమంలో

1. అభిగమనము
2. ఉపాదానము
3. ఇజ్య
4. స్వాధ్యాయము
5. యోగము

కులాగమమునందు పూజావిధులు ఐదురకాలు.

1. కౌవల
2. యామళ
3. మిశ్ర
4. చక్రయక్
5. వీరసంగ్రహము

మంత్రమహొదధిలో

1. ఆతురీ
2. సౌతుకీ
3. దౌర్బోధీ
4. త్రాసిసాధన
5. భవాని

పంచగవ్యములు

1. గోమూత్రము
2. గోమయము
3. గోక్షీరము
4. గోదధి
5. గోఘృతము

1. ద్యురూపాగ్నిలో
2. పర్జన్యరూపాగ్నిలో
3. పృథివీరూపాగ్నిలో
4. పురుషరూపాగ్నిలో
5. స్త్రీరూపాగ్నిలో

చేసే యాగాలు. వీటన్నింటినీ పంచయజ్ఞాలు అంటారు. వీటియందు పరమేశ్వరికి ప్రీతి ఎక్కువ. అందుచేత పంచయజ్ఞప్రియా అనబడుతోంది.

దైనందిన జీవితంలో ప్రతివారూ ఏదోరకంగా హింసచేస్తారు. హింస అంటే జంతువులను చంపటము లేక బాధించటమేకాదు. చెట్ల ఆకులు, పూవ్వులు, కాయలు, దుపంలు వంటివి కోసుకురావటం కూడా హింసే. అయితే చెట్లు బాధపడటం మన కంటికి కనిపించదు. అంతమాత్రంచేత అది హింసకాకపోదు. ఈ రకంగా ఎటువంటి వారైనా సరే హింస చేస్తూనే ఉంటారు. అటువంటి హింసలకు ప్రాయశ్చిత్తమే పంచయజ్ఞాలు. పరమేశ్వరికి వీటియందు ప్రీతి. కాబట్టి పంచయజ్ఞప్రియా అనబడుతుంది.

947. పంచప్రేతమంచాధిశాయినీ

బ్రహ్మ, విష్ణు, రుద్ర, మహేశ్వరులు నాలుగుకాళ్ళుగ, సదాశివుడు పలకగ ఉన్న మంచముపైన అధిష్టించి ఉన్నది.

ఆధార స్వాధిష్ఠాల తరువాత	-	బ్రహ్మగ్రంథి
మణిపూర అనాహతాల తరువాత	-	విష్ణుగ్రంథి
అనాహత, విశుద్ధిల తరువాత	-	రుద్రగ్రంథి
లలాటం పైన	-	ఈశ్వరగ్రంథి
సహస్రారంలో	-	సదాశివగ్రంథి

ఇవే పంచప్రేతాసనాలు. వీటిపైన బైందవ స్థానంలో మహాకామేశ్వరుడు. అతని వామాంకమునందు మహాకామేశ్వరి ఉంటారు. అందుచేతనే పరమేశ్వరి పంచప్రేత మంచాధిశాయినీ అనబడింది.

గతంలో 'పంచప్రేతాసనాసీనా' అనే నామంలో ఇచ్చిన వివరణ అంతా ఇక్కడ కూడా వర్తిస్తుంది.

948. పంచమీ

పంచ బ్రహ్మలలో ఐదవవాడయిన సదాశివుని భార్య. త్రిమూర్తులలో రుద్రుడు శ్రేష్ఠుడు. పరమశివుడు మాయాయుక్తుడు. అంబాసహితుడైన సదాశివుడు మాయతో కూడినవాడు కాబట్టి సర్వజ్ఞుడు. వీరందరిలోనూ సదాశివుడే శ్రేష్ఠుడు అని సూతగీత యందు చెప్పబడింది.

బ్రహ్మాది శక్తులలో ఐదవది వారాహి

1. బ్రాహ్మి
2. మాహేశ్వరి
3. కౌమారి
4. వైష్ణవి
5. వారాహి

కాబట్టి పంచమీ అంటే – వారాహి దేవత అని అర్థం. మకార పంచకంలో ఐదవది ఆనందరూపము. కాబట్టి పంచమీ అంటే – ఆనందరూపిణి.

పంచవిధ ముక్తులలో ఐదవది సాయుజ్యము. పరమేశ్వరి ఎప్పుడూ తురీయాతీతంలోనే ఉంటుంది. కాబట్టి పంచమీ అనబడుతుంది.

949. పంచభూతేశీ

పృథివి మొదలైన పంచభూతాలకు ఈశ్వరి. ఐదువిధాలయిన భూతాలుగా పుట్టినది. పంచమహాభూతాత్మురాలు.

పంచభూతేశి – వైజయంతిమాల. దీనిని పంచభూతమాల అనికూడా అంటారు. ముత్యములు, మాణిక్యములు, మరకతములు, ఇంద్రనీలమణులు, వజ్రములు వీటితో సమానమైన వర్ణములు గలది.

పృథివి నుండి	–	నీలమణి
నీటి నుండి	–	ముత్యము
తేజస్సు నుండి	–	కౌస్తుభము
వాయువునుండి	–	వైదూర్యము
ఆకాశము నుండి	–	పుష్యరాగము

వచ్చినాయి. ఈ మొత్తం కలిసి వైజయంతిమాల అయి విష్ణువునలంకరించింది. అని విష్ణుపురాణంలో చెప్పబడింది. కాబట్టి పంచభూతేశి అంటే వైజయంతిమాలచే అలంకరించబడినది.

పంచభూతాలను తన వశములో ఉంచుకుని, వాటిని కావలసినవిధంగా ఉపయోగించి ఈ జగత్తును సృష్టిస్తున్నది. కాబట్టి పరమేశ్వరి పంచభూతేశీ అనబడింది.

950. పంచసంఖ్యోపచారిణీ

పంచ సంఖ్యా గంధ, పుష్ప, ధూప, దీప, నైవేద్యాఖ్యా ఉపచారా అస్యాః

గంధము, పుష్పము, ధూపము, దీపము, నైవేద్యములను ఐదు ఉపాచారములచే పూజించబడునది.

పరమేశ్వరి పూజలో ఉపచారాలు చెయ్యటం విధి. అవి 1. పంచోపచారాలు 2. షోడస్యోపచారాలు 3. చతుష్షష్ఠి ఉపచారాలు ఇలా ఉంటాయి. వీటిలో సాధారణంగా జపం చేసుకునే సమయంలో **లమిత్యాది పంచపూజాం కరిష్యే** అంటారు. అవి

1. లం పృథివీతత్త్వాత్మికాయై శ్రీపరదేవతాయై గంధం సమర్పయామి.
2. హం ఆకాశతత్త్వాత్మికాయై శ్రీ పరదేవతాయై పుష్పం సమర్పయామి.
3. యం వాయుతత్త్వాత్మికాయై శ్రీ పరదేవతాయై ధూపమాఘ్రాపయామి.
4. రం తేజస్తత్త్వాత్మికాయై శ్రీ పరదేవతాయై దీపం సమర్పయామి.
5. వం అమృతతత్త్వాత్మికాయై శ్రీ పరదేవతాయై నైవేద్యం సమర్పయామి.

సం సర్వతత్త్వాత్మికాయై శ్రీ పరదేవతాయై సర్వోపచార పూజాం సమర్పయామి.

ఈ రకంగా పంచోపచారములచే పూజింపబడేది. కాబట్టి పంచసంఖ్యోపచారిణీ అనబడుతుంది.

పరమేశ్వరి నుంచే పంచభూతాలు ఏర్పడ్డాయి. వాటివల్లనే మానవుడికి రాగద్వేషాలు, అహంకార మమకారాలు కలుగుతున్నాయి. కాబట్టి వాటితోనే పరమేశ్వరిని అర్చించాలి. అంటే వాటిని త్యజించి, పరమేశ్వరికి నివేదన చెయ్యాలన్నమాట. అదే పంచోపచారపూజ. ఈ రకంగా పూజించబడుతుంది. కాబట్టి పంచసంఖ్యోపచారిణీ అనబడుతుంది.

951. శాశ్వతీ

మరల మరల అభ్యసించబడునది.

ఈ శ్వత్ సర్వేషుకాలేషు భవతీతి శాశ్వతః

సర్వకాలములందు ఉండునది. కాబట్టి శాశ్వతి నిత్యురాలు.

సత్యం జ్ఞాన మనంతం బ్రహ్మ

సత్యము జ్ఞానము అనంతమైనది. భూతభవిష్యద్వర్త మానకాలాలు మూడింటియందు ఉండేది.

శాశ్వతం శివ మచ్యుతమ్

పరమేశ్వరుడు శాశ్వతుడు. నాశనములేనివాడు. అదే పరమేశ్వరి. అందుకే శాశ్వతీ అనబడుతున్నది.

952. శాశ్వతైశ్వర్యా

శాశ్వతం నిత్యం ఐశ్వర్యం యస్యాః సౌ

నిత్యమైన ఐశ్వర్యముగలది. ఆమె ఐశ్వర్యము మహదైశ్వర్యము. బ్రహ్మాదిదేవతలు ఆమె సింహాసనానికి కాళ్ళు. లక్ష్మీపార్వతులు వింజామరలు వీస్తుంటారు. ఇంద్రుడు తమ్మిపడిగ. ఈ రకంగా పధ్నాలుగు భువనాలలోను ప్రసిద్ధులైన దేవతలు, సృష్టిస్థితి లయకారకులైన త్రిమూర్తులు ఎల్లవేళలా ఆమెను సేవిస్తూ ఉంటారు.

ఐశ్వర్యానికి ఫలము కోరికలన్నీ తీరిపోవటం. ఇంక ఏ కోరికా లేకపోవటం. అటువంటి కోరికలులేని స్థితి శాశ్వతముగా పొందినది. అందుచేత శాశ్వతైశ్వర్యా అనబడుతోంది. ఇదే మోక్షస్థితి. రాగద్వేషాలు లేకుండా ఉండే స్థితి. దేవి ఎల్లవేళలయందు ఆ స్థితిలోనే ఉంటుంది. తన భక్తులకు అర్హతలను బట్టి ఆ స్థితిని ప్రసాదిస్తుంది. అందుకే ఆమె శాశ్వతైశ్వర్యా అనబడుతోంది.

953. శర్మదా

శర్మ సుఖందత్తే

సుఖము నిచ్చునది. పరమేశ్వరి తన భక్తులకు సుఖము సంతోషము ఇస్తుంది. కాబట్టి శర్మదా అనబడుతోంది. శర్మము అంటే – సుఖం. అది వట్టి సుఖం కాదు. అనంతమైన సుఖము. మహదానందము. ఆ దేవివలన భక్తులు అనంత సుఖ స్వరూపమైన బ్రహ్మానందాన్ని పొందుతున్నారు.

కోరికలు ఉన్నవాడు ఆనందం పొందలేడు. ఒక కోరిక తీరితే ఇంకొక కోరిక పుడుతుంది. కోరికలు లేనటువంటి స్థితే ఆనందము. అటువంటి ఆనందస్వరూపిణి పరమేశ్వరి. అదే బ్రహ్మానందం. ఇది ముక్తి పొందినవారికి మాత్రమే లభిస్తుంది. ఇటువంటి ఆనందాన్ని ఇస్తుంది. కాబట్టి పరమేశ్వరి శర్మదా అనబడుతోంది.

954. శంభుమోహినీ

శం భావయతి భవతే వా శంభుః

సుఖమును గలిగించువాడు శంభుడు. సుఖస్వరూపుడు శంభుడు. శంభుడు ఇంద్రియాలను జయించినవాడు. అటువంటి శంభుని చలింపచేయునది. శంభుని భ్రమింపచేయునది. శంభుని మోహింపచేయునది. సృష్టి ప్రారంభానికి ముందు మహా కామేశ్వరుణ్ణి చలింపచేసి సృష్టి చెయ్యాలనే సంకల్పం కలిగించింది కాబట్టి శంభుమోహినీ అనబడుతుంది.

అమృతం కోసం దేవదానవులు క్షీరసాగరమధనం చేస్తున్నారు. క్షీరసాగరంలో నుంచి కామధేనువు, కల్పవృక్షం, ఐరావతం, కాలకూటం పుట్టినాయి. చివరగా అమృతం వచ్చింది. ఆ అమృతం కోసం దేవదానవులు మళ్ళీ తగవులాడుకుంటున్నారు. ఈ సమయంలో విష్ణుమూర్తి మోహినీ రూపంలో అక్కడికి వచ్చి రాక్షసులను భ్రమింపచేసి అమృతాన్ని దేవతలకు పంచాడు. అప్పుడు మోహినిని చూశాడు గరళకంఠుడు. అంతే, అతని మనస్సుకాస్తా చలించిపోయింది. ఆ తరువాత జరిగినదే హరిహరసుత (అయ్యప్ప) జననం. ఈ రకంగా జితేంద్రియుడైన శంభుని కూడా మోహింపచేసింది. కాబట్టి శంభుమోహినీ అనబడుతోంది.

955. ధరా

ధరా పృథ్వీస్వరూపా

పృథ్వీ స్వరూపము గలది. సమస్త జగత్తులను ధరించునది.

సర్వస్య జగతోధారణాత్

చరాచరజగత్తునంతటినీ ధరించునది. జగత్తులకన్నింటికీ అధిష్ఠానమైంది. ఆధారమైంది. అదే పృథివి. వరాహరూపంలో విష్ణువు యొక్క కోరలచే రక్షించబడినది. క్షమాస్వరూపిణి.

956. ధరసుతా

ధరస్య హిమవత్పర్వతస్య సుతా

ధరుడు – హిమవంతుడు. హిమవంతుని కుమార్తె పార్వతి పరమేశ్వరి స్వరూపము. కాబట్టి ఆ పరమేశ్వరి ధరసుతా అనబడుతున్నది. ఈ భూమి నుంచి పుట్టే ప్రతి వస్తువు అంటే కొండలు, బండలు, ఔషధులు అన్నీ పరమేశ్వరి స్వరూపమే. అందుకే ప్రకృతి స్వరూపమైన పరమేశ్వరి ధరసుతా అనబడుతోంది.

957. ధన్యా

ధన్యా కృతార్థా

కృతార్థురాలు.

ఉపనిషత్తులను భావించటము, మహావ్రతాలభావన, బంధమోక్షము, గతాగతముల కారణచింత, పంచేంద్రియాలను శాంతింపచేయుట, భూతదయతో చేయు ధ్యానము ధన్యము అని బ్రహ్మాండపురాణంలో చెప్పబడింది.

పరమేశ్వరి సకలైశ్వర్యములతో తులతూగునది. కాబట్టి ధన్యా అనబడుతున్నది. తన భక్తులందరినీ ధన్యులుగా చేస్తుంది. కాబట్టి ధన్యా అనబడుతుంది. చెయ్యాలనుకున్నది అంతా చేస్తుంది. ఏమీ మిగల్చదు. కాబట్టి ధన్యా అనబడుతుంది.

958. ధర్మిణీ

ధర్మశీలత్వాత్ ధర్మిణీ

ధర్మగుణం గలది కాబట్టి ధర్మిణీ అనబడుతుంది. పరమేశ్వరి శ్రుతి, స్మృతులలో చెప్పిన సకలధర్మస్వరూపిణి.

ధర్మాన్ ధారయతీతి ధర్మీ

ధర్మాలను ధరించునది. ధర్మాలను ఆచరించునది. కాబట్టి ధర్మిణీ అనబడుతున్నది.

ధర్మము అంటే – పుణ్యము, న్యాయము, స్వభావము, ఆచారము, వేదోక్తవిధి, సత్కార్యము, నీతి అని అర్థం. సమాజంలో ఎక్కువమందికి మంచిని చేకూర్చేది ధర్మము. శిష్టరక్షణకోసం రాక్షస సంహారం చెయ్యటం ధర్మం. ఈ రకంగా ధర్మాన్ని ఆచరించేది. తన భక్తులతో కూడా ధర్మాన్ని ఆచరింపచేసేది. కాబట్టి ధర్మిణీ అనబడుతుంది.

959. ధర్మవర్ధినీ

ధర్మం వర్ధయతీతి ధర్మవర్ధనీ

ధర్మాన్ని వృద్ధి పరచునది. శృతి స్మృతులలో చెప్పిన విధానమే ధర్మము. అటువంటి ధర్మాలను ఆచరించటానికి ప్రోత్సహించేది కాబట్టి పరమేశ్వరి దర్మవర్ధినీ అనబడుతుంది. ఆమెను ఆరాధించేవారి హృదయాలలో ధర్మవర్తన, మోక్షవాంఛ ప్రవర్తిల్లచేస్తుంది. కాబట్టి ధర్మవర్ధినీ అనబడుతుంది.

మోక్షగామి అయినవాడు ఆచరించవలసిన ధర్మాలు కొన్ని ఉన్నాయి. అవి

1. భూశయనము
2. మితాహారము
3. శాంతస్వభావము
4. ఇంద్రియాలను జయించటము
5. సద్గుణసంపత్తి
6. పరోపకారము
7. మితభాషణ
8. శాకాహారభక్షణ
9. సాత్వికాహారభక్షణ
10. చాంద్రాయణాది వ్రతాచారణ

ఇవి సామాన్య ధర్మాలు. ఇవికాక

1. బ్రహ్మచర్య పాలన
2. దేవఋణము పితృఋణము తీర్చుకోవటం
3. యజ్ఞయాగాదులు నిర్వర్తించటం.

ఇవికూడా ధర్మాలే. ఇటువంటి ధర్మాలను చెయ్యటానికి పరమేశ్వరి తన భక్తులను ప్రోత్సహిస్తుంది. కాబట్టి ధర్మవర్ధినీ అనబడుతుంది.

ధర్మానికి నాలుగుపాదాలున్నాయి. అవి

1. సత్యము 2. న్యాయము 3. దయ 4. తపస్సు

ఈ నాలుగుపాదాలు గల ధర్మాన్ని రక్షించేది.

ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే

ధర్మం నాశనమయిపోయినప్పుడు, ఆ ధర్మాన్ని రక్షించటానికి పరమాత్మ ప్రతియుగంలోనూ అవతరిస్తూనే ఉంటాడు.

960. లోకాతీతా

అన్ని లోకాలకు అతీతమైనది. సత్యలోకం తరువాత కైలాసమున్నది. కైలాసానికి పైన విష్ణులోకమున్నది. దానిపైన గోలోకమున్నది. గోలోకానికి పైభాగాన మణిద్వీపమున్నది. అక్కడ పరమేశ్వరి నివశిస్తుంది. ఈ రకంగా అన్ని లోకాలకు అతీతమైనది. కాబట్టి లోకాతీతా అనబడుతుంది.

మానవశరీరంలో ఆధారాదిషట్చక్రాలు ఉన్నాయి. వాటిపైభాగాన సహస్రదళ పద్మమున్నది. అందులో చంద్రమండలమున్నది. ఆ చంద్రమండలంలో పరమేశ్వరి ఉంటుంది. అందుచేతనే లోకాతీతా అనబడుతోంది.

961. గుణాతీతా

అత ఏవ గుణా న తీతా

గుణములను మించినది. పరమేశ్వరుడు నిరాకారుడు నిర్గుణస్వరూపుడు. గుణాలు ఏవీ లేనివాడు గుణాలకు పూర్వమే ఉన్నవాడు. గుణాలను సృష్టించినవాడు.

పంచతన్మాత్రలైన శబ్ద స్పర్శ రూప రస గంధాలను సృష్టించినవాడు. సత్వరజస్తమో గుణాలను సృష్టించినవాడు.

ధైర్యము, సాహసము, పరాక్రమము, దయ, క్షమ ఇత్యాదిగుణాలను సృష్టించినవాడు. ఉప్పు, పులుపు, తీపి, కారం, చేదు, వగరు మొదలైన గుణాలను సృష్టించినవాడు.

ఇన్ని గుణాలను సృష్టించినప్పటికీ, తన కంటూ ఏ గుణములేనివాడు. గుణాతీతుడు. అందుచేతనే పరమేశ్వరి గుణాతీతా అనబడుతుంది.

962. సర్వాతీతా

అన్నింటినీ మించినది. అన్నింటికీ అతీతమైనది. 'శబ్దాన్ని కూడా మించినది ఆత్మరూపము' అని జ్ఞానార్ణవ తంత్రం చెబుతోంది. చరాచరవస్తుసముదాయానికి అతీతమైనది. నామరూపాత్మకమైన జగత్తుకు అతీతమైనది. త్రిగుణాలకు అతీతమైనది త్రిశుక్తులకు అతీతమైనది. త్రిమూర్తులకు అతీతమైనది. సృష్టి,స్థితి, లయాలకతీతమైనది. పంచభూతాలకు అతీతమైనది. చతుర్వింశతి తత్వాలకు అతీతమైనది. ఈ రకంగా అన్ని పదార్థాలకు అతీతమైనది. కాబట్టి సర్వాతీతా అనబడుతోంది.

963. శమాత్మికా


శమః ప్రపంచోపశమ ఏవ ఆత్మా స్వరూపం యస్యాః

ప్రపంచోపశమమే స్వరూపముగా గలది. నృశింహోపనిషత్తులో "ప్రపంచోపశమము నాల్గవశివాద్వైతము" అని చెప్పబడుతోంది.

ఉపశాంతోఽయ మాత్మా

శాంతమే స్వరూపంగా గల ఆత్మస్వరూపము. ఇది శాంతమైన ఆత్మగుణాలు గల వారి దగ్గర మాత్రమే ఉంటుంది. నిష్క్రియాపరత్వము గలది. శాంతస్వభావం గలది. కాబట్టి శమాత్మికా అనబడుతోంది.

ఈ రకంగా స్మార్తకర్మలను గురించి వివరించబడింది.



శ్రీ 'ట'కార దేవి

56. సువాసినీపూజ

చక్రార్చనలో సువాసినీపూజ అత్యంత ముఖ్యమైనది. సువాసిని అంటే సుమంగళి. భర్తతో సంసారం చేస్తున్న స్త్రీ. బిడ్డల తల్లి.

పరమేశ్వరి నిత్యసువాసిని. లోకంలోని సువాసినులందరియందు ఉంటుంది. కాబట్టి పూజావిధానంలో ఒక స్త్రీని పరమేశ్వరి స్వరూపంగా భావించి ఆమెను షోడశోపచారవిధిని పూజించాలి. ఆ సువాసినికి కులమతాలతో సంబంధంలేదు. ఈ పూజకు ఎక్కువ కులం వారు కూర్చోవాలని, తక్కువ కులం వారు కూర్చొనరాదని ఏ రకమైన నియమాలు లేవు. అందరు స్త్రీలు పరమేశ్వరి స్వరూపమే. అందుకని ఎవరినైనా సువాసినిగా కూర్చుండబెట్టవచ్చు. అయితే ఇందులో ఏరకమైన స్వార్థం ఉండరాదు. సువాసినిగా కూర్చునే స్త్రీకి మంత్రానుష్ఠానము తప్పనిసరిగా ఉండితీరాలి. మంత్రోపదేశం లేకపోతే బ్రాహ్మణ స్త్రీ అయినా పూజకు పనికిరాదు. మంత్రోపదేశం గనక ఉంటే తక్కువ కులం స్త్రీనయినా సువాసినిగా అర్చించవచ్చు. అని కులార్ణవతంత్రం చెబుతోంది. చక్రార్చన చేసినప్పుడల్లా శక్త్యానుసారం సువాసినీపూజ చెయ్యాలి.

నవరాత్రులలో తొమ్మిదిరోజులూ పరమేశ్వరిని అర్చించటం జరగుతుంది. దేవీ నవరాత్రులు సంవత్సరానికి నాలుగుసార్లు చెయ్యాలి.

1. చైత్రమాసం 2. ఆషాఢమాసం 3. ఆశ్వీయుజమాసం 4. మాఘమాసం

ఈ నవరాత్రులలో ఉదయంపూట కుమారి అర్చన. రాత్రిపూట సువాసిని అర్చన చెయ్యాలి.

పరమేశ్వరి మంకెన్నపువ్వు వంటి శరీరచ్ఛాయతో ప్రకాశిస్తుంటుంది. ఆమె బాలాత్రిపురసుందరి రూపం కూడా. పరమేశ్వరి నిత్యసుమంగళి. అందుకనే దేవీపూజలో విధిగా సువాసిని అర్చన చెయ్యబడుతుంది. సువాసినీ అర్చనతో ఆమె ప్రీతి చెందుతుంది. ఈ రకంగా అర్చన చేసిన వారి మనోవాంఛితాలన్నీ ఆ పరమేశ్వరి నెరవేరుస్తుంది.

964. బంధూకకుసుమప్రఖ్యా

బెంగాల్ ప్రాంతంలో ప్రసిద్ధమైనది బంధూకవృక్షము. బంధూకపుష్పపుకాంతివలె ఎర్రనైన కాంతి గలది. దీన్నే మన ప్రాంతంలో జపాకుసుమము అంటారు. అదే

మంకెనచెట్టు. పరమేశ్వరి జపాకుసుమములాగా, దాడిమీ కుసుమములాగా అరుణారుణ వర్ణంతో ప్రకాశిస్తుంది అని గతంలో వివరించటం జరిగింది.

జపాకుసుమ సంకాశౌ మధుఘూర్ణిత లోచనౌ
జగతః పితరౌవందే భైరవీ భైరవాత్మకౌ ॥

965. బాలా

బాలా అంటే – కుమారీ అని అర్థం. త్రిపురాసిద్ధాంతంలో

బాలా లీలావిశిష్టత్వాత్ బాలే తికథితా ప్రియే.

బాలలీలలు కల దానివి కాబట్టి బాలా అనబడుచున్నావు అని చెప్పబడింది.

పరమేశ్వరియే బాలాత్రిపురసుందరి రూపంలో ఉన్నది. భండాసురునితో యుద్ధం జరుగుతున్నప్పుడు భండాసురుని పుత్రులందరినీ బాల సంహరించింది. ఈ విషయం భండాసురవధలో వివరించబడింది. నవరాత్రులలో పూజచేసేటప్పుడు ప్రతిరోజూ కుమారీ పూజ చెయ్యాలి. అందులో రెండు సంవత్సరాల బాలిక నుంచి పది సంవత్సరాల బాలిక వరకు, రోజూ ఒకరిని చొప్పున, వయస్సు ప్రకారం అర్చించాలి.

ఏకవర్షా నకర్తవ్యా కన్యా పూజా విధౌనృప ।
పరమజ్ఞాతు భోగానాం గంధాదీనాంతు బాలికా ॥
కుమారికా తు సా ప్రోక్తా ద్వివర్షా యా భవే దిహ ।
త్రిమూర్తిశ్చ త్రివర్షాచ కల్యాణీ చతురబ్దికా ॥
రోహిణీ పంచవర్షా చ షడ్వర్షా కాలికా స్మృతా ।
చండికా సప్తవర్షా స్యా దష్టవర్షా చ శాంభవీ ॥
నవవర్షా భవే ద్దుర్గా సుభద్రా దశవార్షి కీ ।
అత ఊర్ధ్వం నకర్తవ్యా సర్వకార్య విగర్హితా ॥

రెండు సంవత్సరాల వయసు గలది	–	కుమారి
మూడు సంవత్సరాల వయసు గలది	–	త్రిమూర్తి
నాలుగు సంవత్సరాల వయసు గలది	–	కళ్యాణి

ఐదు సంవత్సరాల వయసు గలది	–	రోహిణి
ఆరు సంవత్సరాల వయసు గలది	–	కాళి
ఏడు సంవత్సరాల వయసు గలది	–	చండిక
ఎనిమిది సంవత్సరాల వయసు గలది	–	శాంభవి
తొమ్మిది సంవత్సరాల వయసు గలది	–	దుర్గ
పది సంవత్సరాల వయసు గలది	–	సుభద్ర

రెండు సంవత్సరాలకన్న తక్కువ వయస్సువారుగాని, పది సంవత్సరాలకన్న ఎక్కువ వయస్సువారు కాని కుమారి పూజకు పనికిరారు.

వీరిని అర్చించినట్లైతే పరమేశ్వరి మహాప్రీతి చెందుతుంది. మంత్రశాస్త్రంలో బాలామంత్రం ప్రత్యేకంగా ఉన్నది.

వాగ్భవం ప్రథమం బీజం కామరాజం ద్వితీయకమ్
తృతీయం శక్తికూటాఖ్యం నిగమ త్రితయోద్ధృతమ్
ఇత్థం కుమారీ విద్యాయా బీజత్రయ ముదీరితమ్ ॥

బాలామంత్రానికి

మొదటిది	–	వాగ్భవబీజము
రెండవది	–	కామరాజబీజము
మూడవది	–	శక్తిబీజము

966. లీలావినోదినీ

ప్రాపంచిక క్రీడయే లీల. జగసృష్టి స్థితి లయలే లీల. అటువంటి క్రీడయే వినోదముగా గలది. పరమేశ్వరి పంచకృత్యపరాయణ. అటువంటి పంచకృత్యములే క్రీడగా గలది కాబట్టి లీలావినోదినీ అనబడుతున్నది.

967. సుమంగలీ

శోభనం మంగళం అస్యాః

శోభనమైన మంగళము గలది. ఇది సువాసినికి పేరు. పరమేశ్వరి నిత్యసుమంగళి. ఆమె భర్త మృత్యుంజయుడు. అతడు మృత్యువుకు కూడా మృత్యువు.

జగత్తులో శ్రీవిద్యామంత్ర దీక్ష తీసుకున్న స్త్రీ మూర్తులందరియందు ఉంటుంది. కాబట్టి సుమంగళీ అనబడుతుంది. మంగళము అంటే బ్రహ్మ. కాబట్టి ఆమె పరబ్రహ్మ స్వరూపము.

అశుభాని నిరాచష్టే తనోతి శుభసంతతిం
స్మృతి మాత్రేణ యత్పుంసాం బ్రహ్మ తన్మంగళం విదుః

ఏ పరమశక్తిని స్మరించినంత మాత్రంచేత సర్వమానవులకు దౌర్భాగ్యాలు నశిస్తాయో ఆ దేవత సుమంగళి అనబడుతుంది.

మానవులు చెడుపనులు చెయ్యకుండా చేసేది, మంచి పనులు మాత్రమే ఆచరించేటట్లు చేసే శక్తి ఏదైతే ఉన్నదో అదే సుమంగళి.

968. సుఖకరీ

సుఖ కర్తృత్వా త్సుఖకరీ

సుఖమును చేయునది సుఖకరీ అనబడుతుంది. శరన్నవరాత్రులు, వసంత నవరాత్రలు జరిపే సందర్భంలో ప్రతిరోజూ కుమారీపూజ విధిగా చెయ్యాలి అని చెప్పబడింది. అలాగే శ్రీచక్రార్చన చేసేటప్పుడు అర్చనలో భాగంగా సువాసినీ పూజ చేస్తారు. ఈరెండు పూజలయందు పరమేశ్వరికి ప్రీతి ఎక్కువ. ఆ పూజచేసే వారియందు కూడా దేవికి ప్రీతి. వారియొక్క కోరికలు తీరుస్తుంది. వారికి ఇహము పరము అన్నీ సమకూరుస్తుంది. వారి అర్హతనుబట్టి శాశ్వతమైన ఆనందాన్ని ప్రసాదిస్తుంది. అదే ముక్తి.

లోకంలో తాత్కాలికంగా సుఖాన్ని కలుగచేసే సిరిసంపదలు, భోగభాగ్యాలు అన్నీ దుఃఖదాయకాలు. వీటివల్ల తాత్కాలిక సుఖం కలిగినా చివరగా దుఃఖమే మిగులుతుంది. శాశ్వతమైన సుఖాన్ని, ఆనందాన్ని ఇచ్చేది ముక్తి ఒక్కటే. అటువంటి మోక్షము ప్రసాదిస్తుంది. కాబట్టి సుఖకరీ అనబడుతుంది.

969. సువేషాఢ్యా

శోభనేన వేషేణ ఆఢ్యా యుక్తా

శోభనమైన వేషముతో కూడినది. మంచి అలంకారముతో ఉన్నది.

పరమేశ్వరి మంచి గుణవంతురాలు, శీలవంతురాలు, ఔదార్యసంపన్నురాలు. ఎంతటివారినైనా సమ్మోహనం చెయ్యగల వస్త్రభూషణాదులచే అలంకరించబడి ఉంటుంది. కాబట్టి సువేషాఢ్యా అనబడుతుంది.

970. సువాసినీ

సర్వకాల సర్వావస్థలయందు జీవించిఉన్న భర్త గలది. నిత్యసుమంగళి నిత్యమూ ఐదు అలంకారాలు గలది.

1. పసుపు కుంకుమ
2. గాజులు
3. మెట్టెలు
4. మంగళసూత్రాలు
5. నల్లపూసలు

ఇవి సౌభాగ్యాభరణాలు. సుమంగళిచిహ్నాలు. వీటిని నిత్యము ధరించునది. వీటిని ధరించి సువాసినిరూపంలో సర్వత్రా ఉండేది. కాబట్టి సువాసినీ అనబడుతుంది.

971. సువాసిన్యర్చనప్రీతా

సువాసినీనా మర్చనేన ప్రీతా

సువాసినీ స్త్రీల అర్చనచే ప్రీతినొందినది. శ్రీచక్రార్చన చేసిన తరువాత ముత్తైదువ అయిన ఒక స్త్రీని పరమేశ్వరి స్వరూపంగా భావించి ఆమెను షోడశోపచారవిధిని అర్చిస్తారు. ఇది సువాసినీపూజ. ఈ రకమైన పూజ యందు ప్రీతి గలది. అందుచేతనే సువాసిన్యర్చనప్రీతా అనబడుతోంది.

972. ఆశోభనా

సమంతతః సౌందర్యవతీ

అంతటా సౌందర్యము గలది.

తారకాసుర సంహారం కోసం దేవతలు పరమేశ్వరిని ప్రార్థించగా, ఆమె వారికి దర్శనమిచ్చింది. ఆమె రమణీయాంగి, కుమారి, నవయవ్వనయై అలరారుతున్నది. కిణకిణమను కింకిణుల మంజుల రావముచేయు మంజీర మేఖలము గలది. బంగారు కేయూరములతోను, గ్రైవేయములతోను అలంకరించబడినది. మెడను జాతిమణులతో కూర్చిన హారములు ధరించినది. శిగలో ధరించిన కేతకీ మొదలైన పూలవాసనకు గండుతుమ్మెదలు ఝుంకారము చేస్తున్నాయి. కర్పూరపు వీడియము నమలుచున్నది. అష్టమినాటి చంద్రుని వంటి ముఖము గలది. వెడల్పైన కనుబొమ్మలు, పద్మములవంటి కనులు గలది. ఎత్తైన నాసిక, మధురాధరము గలది. ఆమె దంతములు మల్లెమొగ్గలు.

వజ్రాలు పొదిగిన కిరీటం ధరించింది. కేశపాశాలు మల్లిక, మాలతీ సుమాలహారాలతో గుబాళిస్తున్నాయి. కస్తూరితిలకము ధరించింది. రక్తవస్త్రములు ధరించి దానిమ్మపూలవలె ఎర్రనికాంతులు విరజిమ్ముతున్నది. చేతులయందు పాశము, అంకుశము, వరద, అభయముద్రలు ధరించి జగన్మోహనాకారంగా ఉన్నది. అని దేవీభాగవతంలో చెప్పబడింది. పరమేశ్వరి అద్వితీయసౌందర్యవతి. అందుకే ఆశోభనా అనబడుతుంది.

973. శుద్ధమానసా


శుద్ధం మానసం యస్యాః

శుద్ధమైన మనస్సు గలది.

పరమేశ్వరి ఏవిధమైన రాగద్వేషాలు లేనటువంటిది. నిర్మలమైన మనస్సు గలది. అంతేకాదు. నిర్మల మనస్సులయందు నివసించునది.

సంకల్ప వికల్పాలకు కారణము మనస్సు. ఎప్పుడైతే కోరికలు నశిస్తాయో, అప్పుడు మనస్సు నిర్మలము, శుద్ధము అవుతుంది. కోరికలు లేని మనస్సు ముఖ్యప్రాణంలో లయం చెందటమే తురీయస్థితి. పరమేశ్వరి ఎల్లవేళలయందు తురీయస్థితిలోనే ఉంటుంది. కాబట్టి శుద్ధమానసా అనబడుతుంది.

ఈ రకంగా 964 నుంచి 973 నామాలదాకా సువాసినీ అర్చన వివరించబడింది.



శ్రీ 'ర'కార దేవి

57. చక్రార్చన

పరమేశ్వరి యొక్క యంత్రరూపాన్నే శ్రీచక్రము అంటారు. ఇందులో మొత్తం తొమ్మిది ఆవరణలుంటాయి. ఆ ఆవరణలలో వివిధ దేవతలు ఉంటారు. వీరందరినీ తొమ్మిది ఆవరణలలోనూ విడివిడిగా అర్చించటాన్నే శ్రీచక్రపూజ, నవావరణార్చన లేదా చక్రార్చన అంటారు. శ్రీచక్రం మూడు ప్రస్తారాలుగా ఉంటుంది. అవి

1. భూప్రస్థారము
2. మేరు ప్రస్థారము
3. కైలాస ప్రస్థారము

అలాగే శ్రీచక్రపూజ కూడా మూడురకాలు అవి.

1. సృష్టిపూజ 2. స్థితిపూజ 3. సంహారపూజ. వీటిలో

మేరు చక్రం మీద	–	సృష్టిక్రమంలోను
కైలాసము, అర్ధమేరువుల మీద	–	సంహారక్రమము
భూప్రస్థారం మీద	–	స్థితిక్రమము

లో ఈ అర్చన చెయ్యాలి. అయితే ఈ అర్చనావిధానంలో

1. సృష్టిక్రమము	–	బిందువు దగ్గర మొదలుపెట్టి భూపురం దాకా అన్ని ఆవరణలను అర్చించటం.
2. సంహారక్రమము	–	భూపురం దగ్గర మొదలుపెట్టి బిందువుదాకా ఆవరణ దేవతలను అర్చించటం.
3. స్థితి క్రమము	–	అంతర్దశారం దగ్గర మొదలుపెట్టి భూపురం దాకా, ఆ తరువాత అష్టకోణం దగ్గర నుండి బిందువు దాకా ఆవరణ దేవతలను అర్చించాలి.

చక్రార్చన ఎప్పుడూ సంహారాంతంగానే ఉండాలి. ప్రతి ఆవరణలోను ధూప దీప నైవేద్యాలు సమర్పించాలి. చక్రార్చనలో పాత్రాసాధన అనేది సంప్రదాయాన్ని బట్టి వేరువేరుగా ఉంటుంది. కాబట్టి దాన్ని గురు సంప్రదాయం ప్రకారమే చెయ్యాలి.

శ్రీచక్రాధి దేవత అయిన పరమేశ్వరి సృష్టికి ముందునుంచీ ఉన్నది. మేరుపర్వత శిఖరాన త్రిపురముల యందు ఉంటుంది. ఆమె పరబ్రహ్మ స్వరూపం. కాబట్టి జ్ఞానమయి. జ్ఞానముచేతనే ఆమెను తెలుసుకోవాలి. గుణాతీతురాలు. మహాత్రికోణమందుంటుంది. ఆమె నిష్కళంక. ఆమె చరిత్ర మహాద్భుతము. తన భక్తుల కోరికలను తీరుస్తుంది. ఆమెను పునశ్చరణ ద్వారానే పొందాలి. ఆమె తత్త్వాతీత. షడధ్వాతీత. కరుణాసముద్రురాలు. పాపాత్ములు పుణ్యాత్ములు అనే భేదం లేకుండా అందరి మీదా ఒకే రకమైన కరుణచూపుతుంది. భక్తుల యొక్క అజ్ఞానపు చీకట్లను పారద్రోలి జ్ఞానజ్యోతులు వెలిగిస్తుంది. ఆ బాలగోపాలము ఆమెను ఎరుగుదురు. ఆ పరమేశ్వరి శాసనాలు మీరటానికి లేదు. ఇటువంటి పరమేశ్వరి ఎక్కడ ఉంటుంది. అంటే శ్రీచక్రరాజమందు ఉంటుంది. ఆమె త్రిపురసుందరి. శివునితో తాదాత్మ్యం చెందిన లలితాంబిక. పరమేశ్వరి శ్రీచక్రంలో ఉంటుంది. కాబట్టి శ్రీవిద్యలో చక్రార్చన చాలా ముఖ్యమైనది.

ఆశానాం పూరకం చక్రం అర్చకానాం అహర్నిశం

తనను అర్చించే భక్తుల కోరిక ఇహముగాని పరముగాని తప్పక తీరుస్తుంది.

974. బిందుతర్పణసంతుష్టా

శ్రీచక్రంలో తొమ్మిదవ ఆవరణ సర్వానందమయ చక్రము. అక్కడ ఉండేది బిందువు. అదే నిరాకారుడు నిర్గుణస్వరూపుడు అయిన పరబ్రహ్మ. నాలుగు వర్ణములవారు తర్పణ చెయ్యటంచేత తృప్తి చెందుతుంది కాబట్టి బిందుతర్పణసంతుష్టా అనబడుతుంది.

బ్రాహ్మణులు	–	క్షీరముతోనూ
క్షత్రియులు	–	ఆజ్యముతోనూ
వైశ్యులు	–	తేనెతోనూ
శూద్రులు	–	కల్లుతోనూ

బిందువునందు పరమేశ్వరికి తర్పణ చెయ్యాలి అని తంత్ర శాస్త్రాలు చెబుతున్నాయి.

శ్రీచక్రంలో బిందువు ముఖ్యమైనది. అది శివశక్తుల సంగమస్థానం. కాబట్టి అర్చనా కాలంలో పరమేశ్వరికి బిందువునందే తర్పణ చెయ్యాలి. ఆ తర్పణ దేవిని సంతృప్తి పరుస్తుంది. అందుచేతనే దేవి బిందుతర్పణసంతుష్టా అనబడుతుంది.

975. పూర్వజా

మొదట పుట్టినది. అన్నింటికన్నా ఆదియైనది. చతుర్ముఖుడైన బ్రహ్మకు పూర్వమే ఉన్నది. కర్మ బ్రహ్మను కూడా ఆమే సృష్టించింది. సృష్టికి ముందు పరమేశ్వరి ఇచ్ఛాశక్తిగా పరమేశ్వరునియందు ఆవిర్భవించి సృష్టి చెయ్యాలనే సంకల్పం కలిగించింది. ఈ రకంగా జగత్తును సృష్టించక పూర్వమే ఆమె ఉన్నది. ఆమె కారణంచేతనే ఈ జగత్తంతా సృష్టించబడింది. అందుచేతనే 'పూర్వజా' అనబడుతోంది.

976. త్రిపురాంబికా

శ్రీచక్రంలో ఎనిమిదవ ఆవరణ అయిన సర్వసిద్ధిప్రద చక్రమునకు అధిదేవత త్రిపురాంబా అనబడుతుంది.

ఎనిమిదవ ఆవరణే మహాత్రికోణము. దానికి అధిదేవత. త్రిపురములకు అధిపతి. స్థూలసూక్ష్మ కారణ దేహాలకు అధిపతి. వాగ్భవకామరాజు శక్తికూటాలకు అధిపతి. సత్వరజస్తమో గుణాలకు అధిపతి. సృష్టి స్థితి లయాలకు అధిపతి, జాగ్రస్వప్న సుషుప్తులకు అధిపతి. ఇచ్ఛాజ్ఞాన క్రియాశక్తులకు అధిపతి. వామజ్యేష్ఠరౌద్రి శక్తులకధిపతి. మాతృ మాన మేయముల కధిపతి. ఈ రకంగా త్రిపుటికంతటికీ అధిపతి.

శ్రీచక్రంలో నవావరణ దేవతలు అంటే ఇచ్ఛా జ్ఞాన క్రియా శాంతాశక్తులు నలుగురు. వీరు ప్రకాశాంశ స్వరూపులు. వామా, జ్యేష్ఠా, రౌద్రి, అంబికా, పశ్యంతిలు విమర్శరూపులు ఈ తొమ్మిదిమంది నవావరణ దేవతలు. వీరికి మూలమైనది కాబట్టి పరమేశ్వరి త్రిపురాంబా అనబడుతున్నది.

977. దశముద్రాసమారాధ్యా

దశముద్రలతో, నిత్యాహృదయంలో చెప్పబడినట్లుగా ఆరాధించబడునది.

స్థితికాలమందు త్రిపురసుందరీ దేవి దశముద్రల రూపము పొంది నవచక్రాత్మకమైన ఈ విశ్వాన్ని సర్వసంక్షోభిణీ మొదలైన ముద్రలచే పాలించుచున్నది. శ్రీచక్రంలోని ఒక్కొక్క ఆవరణలో ఒక్కొక్క ముద్రను ప్రదర్శించాలి.

సర్వసంక్షోభిణీముద్ర	–	భూపురము
సర్వవిద్రావిణీముద్ర	–	షోడశదళము
సర్వాకర్షిణీముద్ర	–	అష్టదళము
సర్వవశంకరీ ముద్ర	–	మన్వస్రము
సర్వోన్మాదినీముద్ర	–	బహిర్దశారము
సర్వమహాంకుశముద్ర	–	అంతర్దశారము
సర్వఖేచరీముద్ర	–	అష్టకోణము
సర్వబీజముద్ర	–	త్రికోణము
సర్వయోనిముద్ర	–	బిందువు
సర్వత్రిఖండముద్ర	–	శ్రీచక్రమంతా

సర్వత్రిఖండముద్ర త్రిపురసుందరీ రూపము. శ్రీచక్రమంతా వ్యాపించి ఉంటుంది. కాబట్టి ఈ ముద్ర ఆ దేవి సన్నిధిని కలుగచేస్తుంది. ఈ ముద్ర అన్ని చక్రములందు వ్యాపించి ఉంటుంది కాబట్టి బిందువులో ఉన్న త్రిపురసుందరితోపాటుగా అన్ని ఆవరణ దేవతలను ఆహ్వానించటానికి సర్వత్రిఖండముద్ర ఉపయోగపడుతుంది.

పరమేశ్వరి ఆరాధనలో ఈ ముద్రలను ప్రదర్శించాలి. అది పరమేశ్వరకి ప్రీతిదాయకం. కుడిచేతివ్రేళ్ళు శివతత్త్వము. ఎడమచేతి వ్రేళ్ళు శక్తితత్త్వము. ఈ రెండూ కలపటము అంటే శివశక్తుల సామరస్యము అదే సృష్టికి ప్రతీక.

ఈ ముద్రలు వేయటంలో సంప్రదాయ భేదమున్నది. కాబట్టి ముద్రలను వారివారి సంప్రదాయాలనుబట్టి గురువుగారి దగ్గర నేర్చుకోవటం మంచిది.

ఈ రకంగా పదిముద్రలచేత ఆరాధించబడుతుంది కాబట్టే దశముద్రాసమారాధ్యా అనబడింది.

978. త్రిపురా

మేరు పర్వత శిఖరాన తూర్పు, నైరుతి, వాయువ్య దిశలలో నిర్మించబడిన మూడు పురములు గలది. కాబట్టి త్రిపురా అనబడుతోంది.

ఇడా పింగళా సుషుమ్నా మూడు నాడుల స్వరూపంలో ఉన్నది కాబట్టి త్రిపురా అనబడుతుంది.

జాగ్రస్వప్న సుషుప్తులందుంటుంది కాబట్టి త్రిపురా అనబడుతుంది. చంద్రసూర్యాగ్నుల స్వరూపము కాబట్టి త్రిపురా అనబడుతున్నది.

సృష్టి స్థితి లయాల స్వరూపం. త్రిమూర్తుల స్వరూపం. త్రిశక్తుల స్వరూపం. ఈరకంగా త్రిపుటి అంతా పరమేశ్వరి రూపమే కాబట్టి త్రిపురా అనబడుతోంది.

979. శ్రీ వశంకరీ

శ్రీ వశంకరి – బ్రహ్మమునే వశము చేయునది. పరమేశ్వరి తన భక్తులకు మోక్షము ఇస్తుంది మోక్షము అంటే పరబ్రహ్మస్వరూపము. అనగా అర్హులైన భక్తులకు మోక్షమనే పరబ్రహ్మను వశం చేస్తుంది. కాబట్టి శ్రీ వశంకరి అనబడుతుంది. శ్రీ అంటే – లక్ష్మి. లక్ష్మీదేవిని కటాక్షింపచేయునది. భక్తులకు సిరిసంపదలను ఇచ్చునది. కాబట్టి శ్రీవశంకరీ అనబడుతుంది.

980. జ్ఞానముద్రా

తర్జని అంగుష్టములను కలపటమే జ్ఞానముద్రా అనబడుతుంది. చేతికి ఉన్న ఐదువ్రేళ్ళలో

కనిష్ఠిక	–	భార్య సంబంధము
అనామిక	–	పుత్ర సంబంధము
మధ్యమ	–	ధన సంబంధము
తర్జని	–	జీవాత్మ
అంగుష్టము	–	పరమాత్మ

జీవాత్మ పరమాత్మల ఏకీభావమే జ్ఞానము. అందుచేత తర్జని, అంగుష్టాలను కలిపి సున్నాలా ఉంచితే అది జ్ఞానముద్ర అవుతుంది. దీన్నే చిన్మయముద్ర అని కూడా అంటారు. ఈ ముద్ర పరదేవతా స్వరూపము జీవాత్మ పరమాత్మల ఏకీభావమును చెబుతుంది. ఈ రెండు వ్రేళ్ళూ సున్నాలా ఉండటం పరబ్రహ్మ బిందురూపుడు అని చెప్పటం. అన్ని ముద్రలకన్న ఈ ముద్ర ఉత్తమోత్తమము. పరమేశ్వరికి ప్రీతిదాయకము.

981. జ్ఞానగమ్యా

జ్ఞానముచే పొందదగినది. ఏ ఇతర ఆధారాలు లేకుండా తనకు తానే ప్రకాశించేది. స్వయంప్రకాశి. ఇతరులను ప్రకాశింపచేస్తుంది అదే జ్ఞాన స్వరూపము. అటువంటి దేవతారూపం గురించి తెలుసుకోవటము జ్ఞానముచేత మాత్రమే సాధ్యమవుతుంది.

వేదాలు చదివినంత మాత్రంచేత ముక్తిరాదు. శాస్త్ర పాండిత్యంవల్ల ముక్తిరాదు. ఆధ్యాత్మిక ప్రవచనాలు చేస్తే ముక్తిరాదు. వాటిని విన్నంతమాత్రంచేత కూడా ముక్తిరాదు. విన్న విషయాన్ని మనసుకు పట్టించుకోవాలి. దాన్ని ఆచరణలో పెట్టాలి. ఈ జగత్తంతా పరమేశ్వర స్వరూపమే అని భావించాలి. త్రికరణశుద్ధిగా వాటిని ఆచరించాలి. తెలియని విషయాలను సద్గురువు దగ్గర తెలుసుకోవాలి. అప్పుడే ముక్తి లభిస్తుంది. జీవాత్మ పరమాత్మ ఒక్కటే ఆ రెండూ వేరు కాదు అనే భావన కలగటమే జ్ఞానము.

జ్ఞానా దేవ తు కైవల్యం

జ్ఞానంవల్లనే ముక్తి లభిస్తుంది. అందుచేత సాయుజ్యము అనేది కేవలం జ్ఞానంతో మాత్రమే పొందటానికి వీలవుతుంది. ఆ జ్ఞానస్వరూపమే పరమేశ్వరి కాబట్టే ఆమె జ్ఞానగమ్యా అనబడుతోంది. కూర్మపురాణంలో

య త్తు మే నిష్కలం రూపం చిన్మాత్రం కేవలం శివం
సర్వోపాధి వినుర్ముక్త మనంత మమృతం పరం
జ్ఞానేనైకేన తల్లభ్యం క్లేశేన పరమం పదం

నా నిష్కళమైన రూపము చిన్మాత్రము. కేవలము శివమైనది. సమస్త ఉపాధులచేత వదలబడినది. అటువంటి అమృతపరమైన నా రూపము కేవలము జ్ఞానముచేతనే పొందదగినది. జ్ఞానదృష్టిగల వారు మాత్రమే నన్ను చేరగలరు అని చెప్పబడింది.

జ్ఞాన స్వరూపమైన పరబ్రహ్మను చేరాలి అంటే కేవలము జ్ఞానమే మార్గము. అందుకే పరమేశ్వరి జ్ఞానగమ్యా అనబడుతోంది.

982. జ్ఞానజ్ఞేయస్వరూపిణీ

జ్ఞానముచేత మాత్రమే తెలుసుకోగలిగిన దృశ్యరూపము గలది. వేదాంత వాక్యాల విచారమువల్ల కలిగేటటువంటి జ్ఞానము, దాని ఫలితంగా పొందేటటువంటి పరదేవతా పదము. ఈ రెండూ ఒక్కటే. అంటే జ్ఞానము ఆమే. జ్ఞానంచేత పొందదగినది కూడా ఆమె. అందుచేతనే పరమేశ్వరి జ్ఞానాజ్ఞేయస్వరూపిణి అనబడుతోంది.

983. యోనిముద్రా

దశముద్రలలో తొమ్మిదవది యోనిముద్ర. దీన్నే నమస్కారముద్ర అని కూడా అంటారు. అన్ని ముద్రలయందు కూడా ఉత్తమమైన ముద్ర ఇది. బిందుతత్త్వాన్ని తెలుసుకోకుండా మాయలో పడేస్తుంది. ఇదే మూల ప్రకృతి. మహాత్రికోణాకారంలో

ఉంటుంది. యోగినీ హృదయంలో దీన్ని గురించి వివరిస్తూ "శివశక్తుల సామరస్యం గలిగి పరమానందమయమైన పరబ్రహ్మను ఉపాసించే స్థానమే బిందువు. సర్వానందమయ చక్రమైన బిందుస్థానంలో యోనిముద్రాశక్తి పరిపాలిస్తున్నది అని చెప్పబడింది. గుద మేఢ్రాంతము యోని అంటున్నారు.

అన్ని ఆవరణలలోనూ అర్చన పూర్తయిన తరువాత నమస్కారం చెయ్యటానికి యోనిముద్రను ఉపయోగిస్తారు. **ఇతి యోనిముద్రయా ప్రణమేత్**

984. త్రిఖండేశీ

దశముద్రలలో ఆఖరుది త్రిఖండముద్ర. ఆ త్రిఖండముద్రకు ఈశ్వరి. ఈ ముద్రను నవావరణలలో సర్వత్రా ఉపయోగించటం జరుగుతుంది. ఇది పరమేశ్వరి స్వరూపము.

త్రిఖండములు – మూడు ఖండములు. వాటికి ఈశ్వరి. కాబట్టి త్రిఖండేశీ అనబడుతోంది.

పంచదశి మహామంత్రం మూడు ఖండాలుగా ఉన్నది. అవి

1. అగ్ని ఖండము 2. సూర్య ఖండము 3. చంద్ర ఖండము

ఈ మూడు ఖండాలకు ఈశ్వరి. కాబట్టి త్రిఖండేశీ. మానవ శరీరము మూడు భాగాలుగా ఉంటుంది.

1. వాగ్భవ కూటమి 2. కామరాజ కూటమి 3. శక్తి కూటమి

ఈ మూడు కూటములకు ఈశ్వరి

వ్యాహృతులు మూడు

1.	భూః	–	భూలోకము
2.	భువః	–	భువర్లోకము
3.	సువః	–	సువర్లోకము

ఈ మూడు వ్యాహృతులకు అధిపతి.

ఈ రకంగా త్రిపుటికంతటికీ అధిపతి. అందుచేతనే త్రిఖండేశీ అనబడుతోంది.

985. త్రిగుణాంబా

గుణత్రయానికి కారణభూతురాలు. పరమేశ్వరి మూలప్రకృతి స్వరూపం. ఆమెనుంచే సత్వరజస్తమో గుణాలు ఉద్భవించినాయి. అందుచేతనే ఆమె త్రిగుణాలకు అంబా – తల్లి అనబడుతోంది. వాయుపురాణంలో

యోగేశ్వరీ శరీరాణి కరోతి వికరోతి చ
నానాకృతి క్రియారూపా నానావృత్తిః స్వలీలయా
త్రిధా య ద్వర్తతే లోకే తస్మా త్సా త్రిగుణోచ్యతే ॥

యోగేశ్వరి శరీరాలను సృష్టిస్తుంది. నాశనం చేస్తుంది. ఆమె అనేక రూపాలు గలది. అనేక కృత్యములు గలది. అనేక నామములుగలది. తన లీలలచే త్రివిధముగ నున్నది. కాబట్టి త్రిగుణాంబా అనబడుతున్నది అని చెప్పబడింది విష్ణుపురాణంలో

సర్వభూతేషు సర్వాత్మన్ యాశక్తి పరా
తవ గుణాశ్రయా నమ స్తస్యై శాశ్వతాయై సురేశ్వరి ॥

సర్వభూతములందు, సర్వప్రాణులందు ఉండు నీ శక్తి త్రిగుణములకు ఆధారమై ఉన్నది. గుణాశ్రయురాలైన సురేశ్వరికి నమస్కారము అని చెప్పబడింది.

సృష్టి స్థితి లయాదులచేత పరమేశ్వరి త్రిగుణా అని చెప్పబడుతోంది. త్రిగుణాలకు తల్లి కాబట్టి ఆమె త్రిగుణాంబా అనబడుతుంది.

986. త్రికోణగా

త్రికోణం యోనిచక్రం గచ్ఛతీతి త్రికోణగా

యోని చక్రమును పొందినది

త్రికోణరూపిణీ శక్తిః బిందురూపః పర శ్శివః

పరమేశ్వరి త్రికోణరూపిణి. పరమేశ్వరుడు బిందురూపుడు. బిందువికసనము వల్లనే త్రికోణం ఏర్పడింది. సృష్టి ప్రారంభానికి ముందు అంతా శూన్యంగా ఉండేది. పరమేశ్వరుడు బిందురూపంలో అంతటా ఆవరించి ఉన్నాడు. ఆ పరమేశ్వరుడు సృష్టి చెయ్యాలనే సంకల్పంతో తననుంచి కొంతశక్తిని బయటకు పంపాడు. అదే విమర్శరూపము. మాయాశక్తి త్రికోణము. ఆ శక్తియే

సత్త్వగుణ సంయోగంతో	–	అవ్యక్తంగాను
రజోగుణ సంయోగంతో	–	మహత్తత్త్వంగాను
తమోగుణ సంయోగంతో	–	అహంకారంగాను

అవుతున్నది. ఈ రకంగా త్రికోణమే పరమేశ్వరి స్వరూపం కాబట్టి ఆమె త్రికోణగా అనబడుతున్నది.

987. అనఘా

అఘం న విద్యతేఽ స్యేతి అనఘః

ఏ విధమైన పాపములు లేనిది. ఏ విధమైన దుఃఖములు లేనిది. పాపరహితురాలు. కర్మలేశము ఏ మాత్రములేనిది. సచ్చిదానంద స్వరూపిణి. శుద్ధజ్ఞాన స్వరూపిణి.

988. అద్భుతచారిత్రా

అద్భుతాని ఆశ్చర్యకరాణి చారిత్రాణి యస్యాః

ఆశ్చర్యకరమైన చరిత్ర కలది. లోకంలో ఎవరికీ చేతకానటువంటి పనులు చేసింది. కాబట్టి ఆశ్చర్యకరమైన చరిత్ర గలది.

త్రిమూర్తులకు కూడా సాధ్యంకాని భండాసుర, మహిషాసుర సంహారం చేసింది. దేవదానవ యుద్ధంలో రాక్షసులను తమ పరాక్రమంవల్లనే గెలవగలిగాము అని దేవతలు గర్వించినప్పుడు వారికి జ్ఞానోదయం చేసింది.

తారకాసుర సంహారానికి దేవతలకు దారి చూపింది. భక్తులకు ముక్తిని చేకూర్చుతుంది. పంచకృత్యాలు చేస్తుంది. ఈ రకంగా సృష్టిలో దేవతలవల్ల కూడా కాని పనులను చేస్తుంది కాబట్టి అద్భుతచారిత్రా అనబడుతుంది.

989. వాంఛితార్థప్రదాయినీ

వాంచితార్థాన్ ప్రదాతుం శీలమస్యాః

కోరిన కోరికలనిచ్చు స్వభావం కలది.

ఆరోగ్యార్థేఽ ర్చయేత్సూర్యం ధర్మమోక్షాయ మాధవం

శివం ధర్మార్థమోక్షాయ చతుర్వర్గాయ చండికామ్ ॥

ఆరోగ్యాన్నిచ్చేవాడు	–	సూర్యుడు
ధర్మము, మోక్షములను ఇచ్చేవాడు	–	మాధవుడు
ధర్మార్థ మోక్షాలనిచ్చేవాడు	–	శివుడు
పై నాల్గింటినీ ఇచ్చేది	–	చండిక

ప్రతి దేవతకు కొంతపరిధి ఉంటుంది. దానిని మించి వారేమీ చేయలేరు. కాని పరమేశ్వరికి పరిధి లేదు. ఆమెను భక్తులు ఏ కోరిక కోరినా తీర్చగలదు. అందుకే వాంఛితార్థప్రదాయినీ అనబడుతుంది.

990. అభ్యాసాతిశయజ్ఞాతా

మరణము వరకు కాలము వేదాంత చింతనతోనే గడపాలి. విన్న విషయాలే మళ్ళీ మళ్ళీ వినాలి. ఆలోచించాలి. వాటిని తర్కించాలి. ఈ రకంగా అభ్యాసం చెయ్యటంవల్లనే అందులో ఉండే రహస్యాలు బోధపడి, చివరకు ఆత్మసాక్షాత్కారం జరుగుతుంది. బ్రహ్మాండ పురాణంలో

ధ్యానైకదృశ్యా జ్ఞానాంగీ విద్యాత్మా హృదయ స్సదా ।

ఆత్మైక్యా న్మక్తి మాయాతి చిరానుష్ఠాన గౌరవాత్ ॥

ఆమె అవయవాలు జ్ఞానము. ఆమె శరీరము శాస్త్రము. ఆమె స్థానము హృదయము. అటువంటి దేవి చిరకాల అనుష్ఠానమువలన, ఆత్మైక్యమువలన ప్రత్యక్షమవుతుంది. అని చెప్పబడింది.

ఆమెను గురించిన పునశ్చరణవల్లనే తెలుసుకోదగినది కాబట్టి 'అభ్యాసాతిశయజ్ఞాతా' అనబడుతుంది.

991. షడధ్వాతీతరూపిణీ

అధ్వము అనగా – మార్గము అని అర్థం. ఇవి ఆరు రకాలు.

1. వర్ణ	3. మంత్ర	5. తత్త్వ
2. పద	4. కలా	6. భువనములు

వీటినే షడధ్వలు అంటారు. వీటిలో మొదటి మూడు విమర్శాంశలు కాగా మిగిలినవి ప్రకాశాంశలు.

విరూపాక్ష పంచాంశికలో పదములు, మంత్రములు, వర్ణములు విమర్శ గుణములని, భువన, తత్త్వ, కలాత్మకములు ప్రకాశగుణములని చెప్పబడింది. జ్ఞానార్ణవ తంత్రంలో ఈ విధంగా షడధ్వలచే నిర్మలమైన శ్రీచక్రమును చింతించుము అని చెప్పబడింది.

ఈ ఆరు మార్గాలు పరమాత్మవల్లనే కలుగుతున్నాయి. వీటికి అతీతమైనది ఆ పరమేశ్వరి. అందుచేతనే షడధ్వాతీతరూపిణీ అనబడుతోంది.

992. అవ్యాజకరుణామూర్తిః

ఎనలేని కరుణ గలది. ఏ రకమైన ప్రతిఫలం ఆశించకుండాను, ఏ కారణం లేకుండానే తన భక్తులమీద దయ చూపిస్తుంది. వాంఛారహితురాలు. అన్ని జీవులమీదా ఒకేరకమైన ప్రేమ, కరుణ గలిగి ఉంటుంది. దానికి కులమత భేదాలు లేవు. వయోభేదాలు లేవు. జాతిభేదం లేదు. వీడు ధనికుడని, వీడు దరిద్రుడని తేడా లేదు. పాలిచ్చే ఆవుమీద, విషం క్రక్కే పాముమీద కూడా ఒకే రకమైన కరుణ చూపిస్తుంది. అందుకే ఆమె అవ్యాజ కరుణామూర్తిః అనబడుతుంది.

993. అజ్ఞానధ్వాంతదీపికా

అజ్ఞానమనే చీకటిలో దీపములాంటిది. భగవానుడు గీతలో చెప్పినట్లుగా 'ప్రకాశిస్తున్న జ్ఞానజ్యోతిచే భక్తులయొక్కఅజ్ఞానాంధకారమును పటాపంచలు చేస్తుంది.

చీకటివల్ల వస్తువులు కంటికి కనపడవు. వాటిమీద వెలుతురు ప్రసరిస్తే అవి కనిపిస్తాయి. అలాగే అజ్ఞానపు చీకట్లు క్రమ్ముకొని సంసార సాగరంలో మునిగిపోతున్న వాడికి జ్ఞానజ్యోతులు ప్రసరింపచేసి అజ్ఞానాన్ని పటాపంచలు చేస్తుంది పరమేశ్వరి. అంటే గురువు రూపంలో శిష్యునికి జ్ఞానోపదేశం చేస్తుంది. జ్ఞానమార్గం ముక్తిమార్గం చూపుతుంది.

అజ్ఞానతిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా ।
చక్షు రున్మీలితం యేన తస్మై శ్రీగురవే నమః ॥

ఈ దేహమే ఆత్మ అనుకుంటారు. అదే అజ్ఞానము. ఇలా భావించినవారు పతనమై పోతారు. బృహదారణ్యకోపనిషత్తులో ఈ విషయం వివరించబడింది. దాన్ని గతంలో వివరించాం. కాని ఇప్పుడు మళ్ళీ గుర్తు చేస్తున్నాము. దేవతల రాజైన ఇంద్రుడు, రాక్షస రాజైన విరోచనుడు బ్రహ్మజ్ఞానం కోసం ప్రజాపతి దగ్గరకు వెళ్ళి నియమనిష్ఠలతో కొంత కాలం గడిపారు. ఆ తరువాత ప్రజాపతి 'మీ కనుపాపలో కనిపించే పురుషుడే పరబ్రహ్మ' అన్నాడు. వారిద్దరూపోయి నీటిలో తమ ముఖాలు చూసుకున్నారు. వారి కనుపాపలలో వారి రూపమే కనిపించింది. అందుకని ఈ దేహమే ఆత్మ అని ప్రచారం చేశాడు విరోచనుడు. అందుచేతనే రాక్షసులు అజ్ఞానంతో నాశనమైపోయారు. ఇంద్రుడు మళ్ళీ మళ్ళీ బ్రహ్మచర్యం పాటించి పరబ్రహ్మ స్వరూపాన్ని తెలుసుకుని తరించాడు. ఈ రకంగా దేహమే ఆత్మ అని భావించే అజ్ఞానులకు జ్ఞానజ్యోతులు చూపించేది కాబట్టి అజ్ఞానధ్వాంత దీపికా అనబడుతోంది.

994. ఆబాలగోపవిదితా

ఆ బాలగోపాలము అందరికీ తెలిసినది. యాదువులు యజ్ఞం చెయ్యటం మొదలు పెట్టారు. కృష్ణుడు వద్దు అన్నాడు. ఇంద్రుణ్ణి అర్చించవలసిన అవసరం లేదు అన్నాడు. దాంతో కోపించిన ఇంద్రుడు వడగళ్ళ వాన కురిపించాడు. శ్రీకృష్ణ పరమాత్ముడు గోవర్ధనగిరినెత్తి బాలురను, వృద్ధులను, గోవులను అందరినీ రక్షించాడు. అంటే పిల్లల దగ్గరనుండి పశువులదాకా అందరినీ రక్షించాడు. పరమేశ్వరి రూపమే శ్రీకృష్ణుడు. అందుచేతనే ఆ బాలగోపవిదితా అనబడుతున్నది.

ఈ రకంగా పసిపిల్లల మొదలు పశువులవరకు అందరిచేత తెలియబడు దేవత కాబట్టి ఆబాలగోపవిదితా అనబడుతున్నది.

995. సర్వానుల్లంఘ్యశాసనా

దేవేంద్రాదులు కూడా మీరుటకు వీలులేని శాసనములు గలది. లోకంలోని సర్వజీవులు, గోళాలు, గ్రహాలు, మానవులు, దేవతలు, గంధర్వులు, యక్షులు ఎవరూకూడా ఆ పరమేశ్వరి ఆజ్ఞను మీరటానికి లేదు. అందుచేతనే సర్వానుల్లంఘ శాసనా అనబడుతున్నది. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 24వ శ్లోకంలో

జగ త్సూతే ధాతా హరిరవతి రుద్రః క్షపయతే
తిరస్కుర్వ న్నేతత్స్వమపి వపురీశ స్థిరయతి
సదాపూర్వ స్సర్వం తదిద మనుగృహ్ణాతి చ శివః
తమజ్ఞా మాలంబ్య క్షణచలితయో ర్భ్రూలతికయోః ॥

ఓ భగవతీ ! బ్రహ్మ లోకాలను సృష్టిస్తున్నాడు. విష్ణువు రక్షిస్తున్నాడు. రుద్రుడు లయంగావిస్తున్నాడు. మహేశ్వరుడు ఈ ముగ్గురినీ తనలో లీనం చేసుకుని తాను సదాశివునిలో లీనమవుతున్నాడు. సదాశివుడు ఇదంతా నీ ఆజ్ఞ ప్రకారమే ఈపనంతా చేస్తున్నాడు.

ఉపనిషత్తులలో ''జగసృష్టికి కారకుడు పరబ్రహ్మ. అతడి శాసనాలు అనుల్లంఘనీయాలు. అతడున్నాడన్న భయంతోనే గాలి సవ్యంగా వీస్తోంది. సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు వెన్నెలలు విరజిమ్ముతున్నాడు. దిక్పాలకులు తమ పనులు

క్రమం తప్పకుండా నిర్వర్తిస్తున్నారు. త్రిమూర్తులు సృష్టి స్థితి లయాలు గావిస్తున్నారు.” అని చెప్పబడింది.

అందుచేతనే పరమేశ్వరి “సర్వానుల్లంఘ్యశాసనా” అనబడుతున్నది.

996. శ్రీచక్రరాజనిలయా

శ్రీచక్రరాజమందు నివశించునది. శంకరభగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 11వ శ్లోకంలో శ్రీచక్రాన్ని వివరిస్తూ

చతుర్భిః శ్రీకంఠై శ్శివయువతిభిః పంచభి రపి
ప్రభిన్నాభి శంభో ర్నవభి రపి మూలప్రకృతిభిః
చతుశ్చత్వారింశ ద్వసుదళ కలాశ్రతివలయ
త్రిరేఖాభి స్సార్ధం తవ శరణకోణాః పరిణతాః ॥

తల్లీ ! నాలుగు శివచక్రములతోను, ఐదు శక్తి చక్రములతోను, తొమ్మిది మూలప్రకృతులతోను, అష్టదళము, షోడశదళము, మేఖలాత్రయము, భూపురములతో 44 కోణములు గలిగి శ్రీచక్రము అలరారుతున్నది.

శ్రీచక్రంలోని నవావరణలు, వాటిలోని దేవతలు, మానవదేహమే శ్రీచక్రము అనే విషయాలు 68వ నామంలో వివరించబడ్డాయి.

శ్రీచక్రంలో మర్మస్థానాలు 28, సంధులు 24 ఉంటాయి.

ద్విరేఖా సంగమస్థానం సంధిరిత్యభిధీయతే

రెండు రేఖలు కలిసిన చోటును సంధి అంటారు.

త్రిరేఖా సంగమస్థానం మర్మం మర్మవిదో విదుః

మూడు రేఖలు కలిసేచోటును మర్మస్థానము అంటారు.

ఇక్కడ సంధులుగాని, మర్మస్థానాలుగాని కోణాలయందు మాత్రమే ఉంటాయి. ఈ రకంగా

మన్వస్ర ద్విదశార అష్టకోణ వృత్త చతుష్టయమ్
అష్టావింశతి మర్మాణి చతుర్వింశతి సంధయః

మన్వస్రము, దశారద్వయము, అష్టకోణములందు 28 మర్మస్థానాలు, 24 సంధులు ఉంటాయి. శ్రీచక్రంలో శక్తిచక్రాలన్నీ కోణాకారంలోనే ఉంటాయి. అయితే శ్రీచక్రంలో 45 కోణాలుంటాయి. అవి

త్రికోణంలో	-	3
అష్టకోణంలో	-	8
అంతర్దశారంలో	-	10
బహిర్దశారంలో	-	10
మన్వస్రంలో	-	14
వెరసి	-	45 కోణాలు

అయితే శ్రీచక్రంలో బీజాక్షరాలుండాలా? వద్దా? ఇక్కడ సంప్రదాయభేదమున్నది.

బీజాక్షరయుతం చక్రం యతీనా ముత్తమోత్తమమ్
బీజాక్షర విహీనంతు గృహస్థానాం ప్రశస్తకమ్

బీజాక్షరాలున్న శ్రీచక్రము యతీశ్వరులకు ఉత్తమమైనది. బీజాక్షరాలు లేని శ్రీచక్రము గృహస్థులకు ప్రశస్త్యము. కాగా ఇంకొక సంప్రదాయంలో

బీజం వినా తునిర్జీవం శవవ త్పరికీర్తితమ్
బీజహీనం తు య చ్ఛక్రం త చ్ఛక్రం సిద్ధిదం న చ

బీజాక్షరములు లేని శ్రీచక్రము నిర్జీవమైన శవమువంటిది. దానిమీద పూజ సిద్ధించదు ఈ రకంగా సంప్రదాయ భేదమున్నది కాబట్టి గురుసంప్రదాయాన్నే పాటించాలి.

శ్రీచక్రంలో మూడు ప్రస్తారాలున్నాయి. అని శ్రీవిద్యార్ణవ తంత్రంలో చెప్పబడింది.

ప్రస్తారో త్రివిధఃప్రోక్తః శ్రీచక్రస్య
మేరుకైలాస భూసంజ్ఞా భేదాస్య త్రిధాభవేత్

శ్రీచక్రం మూడు ప్రస్తారాలుగా ఉంటుంది. అవి

1. భూప్రస్తారము : బల్లపరుపుగా ఉంటుంది. వెండి బంగారం, రాగి రేకులమీద, నేలమీద గీస్తారు.

2. మేరుప్రస్తారము : బోర్లించిన గరాటులా ఉంటుంది. ఒక దానిమీద ఒకటిగా తొమ్మిది అంతస్థులుగా ఉంటుంది. దీనిపొడవు వెడల్పు ఎత్తులు సమానంగా ఉంటాయి.

3. కైలాసప్రస్తారము : ఇదికూడా మేరువులాగానే ఉంటుంది. కాకపోతే ఎత్తు తక్కువ.

1. భూ ప్రస్తారంలో – వశిన్యాది దేవతల తాదాత్మ్యం
2. మేరు ప్రస్తారంలో – షోడశ నిత్యల తాదాత్మ్యం
3. కైలాస ప్రస్తారంలో – మాతృకా తాదాత్మ్యం చెప్పబడ్డాయి.

అయితే వీటిలో ఇంకా అనేక రకాలున్నాయి.

1. మేరు ప్రస్తారము : (సమదళము) శృంగేరీ సంప్రదాయము : ఇది బోర్లించిన గరాటులాగా ఉంటుంది. ఒకదానిమీద ఒకటిగా తొమ్మిది ఆవరణలు ఉంటాయి. ఇందులో దళాలన్నీ సమంగా ఉంటాయి. అందుకే దీనిని సమదళము అంటారు. ఇందులో వృత్తాలు మూడు భూపురానికి, షోడశీదళానికి మధ్యన ఉన్నాయి. ఈ చక్రము శృంగేరి సంప్రదాయంలోనిది.

2. మేరు ప్రస్తారము : (సమదళము) శ్రీ కళ్యాణానంద భారతీవారి సంప్రదాయము: ఇందులో వృత్తాలు మూడు ఒకచోట కాకుండా భూపురానికి షోడశీదళానికి మధ్యన ఒకటి, షోడశీదళానికి అష్టదళానికి మధ్యన ఒకటి, అష్టదళానికి చతుర్దశారానికి మధ్యన ఒకటి ఉంటాయి. ఇది గుంటూరులోని శృంగేరీ శ్రీవిరూపాక్ష పీఠానికి సంబంధించిన శ్రీ కళ్యాణానంద భారతీస్వామి వారి సంప్రదాయంలోది.

3. మేరు ప్రస్తారము : (ఊర్ధ్వదళము) ఇందులోని దళాలు ఊర్ధ్వముఖంగా ఉంటాయి. ఇవి భారతదేశంలో అతికొద్దిగా మాత్రమే ఉన్నాయి.

4. మేరు ప్రస్తారము : (అథోదళము) ఇందులోని దళాలు అథోముఖంగా ఉంటాయి. వీటిని మద్రాసులో తయారుచేస్తున్నారు.

5. కూర్మ ప్రస్తారము : ఇది వైష్ణవ సంప్రాదాయంలోని శ్రీచక్రము. కూర్మవతారంలో ఉన్న విష్ణుమూర్తి వీపుమీద శ్రీచక్రము ఉంటుంది.

6. శివకామేశ్వరము : ఇది శైవ సంప్రదాయంలోని శ్రీచక్రము. శివలింగము మీద శ్రీచక్రము ఉంటుంది.

7. అర్ధమేరువు : ఇందులో భూపురము, షోడశీదళము, అష్టదళములు ఒకదాని మీద ఒకటిగా ఉండి ఆపైన కోణములన్ని సమతలముగా ఉంటాయి.

8. కైలాస ప్రస్తారము : ఇదికూడా మేరులానే ఉంటుంది. కాకపోతే పొడవు వెడల్పులు సమానంగా వుంటాయి. కాని ఎత్తు 1/4 వంతు మాత్రమే ఉంటుంది. ప్రస్తుతము ఇవి కాశీలో దొరుకుతున్నాయి.

ఈ చిత్రాలన్నీ ప్రక్కపేజీలలో ఇవ్వబడ్డాయి.

అసలు శ్రీచక్రము పంచదశీ మహామంత్రంనుంచే ఆవిర్భవించింది అని 'పరివశ్యా రహస్యము'లో భాస్కరరాయలవారు అన్నారు. ఇదే విషయం జ్ఞానార్ణవతంత్రంలో కూడా చెప్పబడింది. పంచదశి మహామంత్రంలో బీజాక్షరాలను ఒకసారి లెక్కపెట్టిన దానిని మళ్ళీ లెక్కించకుండా అంటే పునరావృత్తి లేకుండా చూస్తే 9 అక్షరాలే వస్తాయి. ఆ 9 బీజాక్షరాలవల్లనే శ్రీచక్రం ఏర్పడింది.

భూమి శ్చంద్రః శివో మాయా శక్తిః కృష్ణమాదనౌ ।
అర్ధచంద్ర శ్చ బిందుశ్చ నవార్ణో మేరు రుచ్యతే ॥

ఇందులో	1.	భూమి	–	ల కారము
	2.	చంద్ర	–	స కారము
	3.	శివ	–	హ కారము
	4.	మాయా	–	ఈ కారము
	5.	శక్తి	–	ఏ కారము
	6.	కృష్ణమాద్య	–	రే ఫ
	7.	మాదన	–	క కారము
	8.	అర్ధచంద్ర	–	నాదము
	9.	బిందు	–	బిందువు

ఈ 9 అక్షరముల సముదాయమే పంచదశి మహామంత్రము. దానినుంచే శ్రీచక్రం ఆవిర్భవించింది. ముందుగా

1. ల కారము పృధివీ బీజము. దీనివల్ల భూపురం పుట్టింది.
2. స కారము చంద్రబీజము దీనివల్ల షోడశకళలుండే షోడశదళము పుట్టింది.
3. హ కారము శివబీజము అష్టమూర్త్యాత్మకము. దీనివల్ల అష్టదళము పుట్టింది.
4. ఈ కారము మాయాబీజము. అందుచేత దీనివల్ల చతుర్దశభువనాత్మకమైన చతుర్దశారము పుట్టింది.
5. ఏ కారము శక్తిబీజము. దీనివల్ల దశావతారాలకు ప్రతీకగా బహిర్దశారము పుట్టింది.
6. ర కారము అగ్నిబీజము. దీనివల్ల అగ్నికళలతో కూడిన అంతర్దశారము పుట్టింది.
7. క కారము మన్మథ బీజము. వసుకోణాత్మకము. దీనివల్ల వసుకోణము పుట్టింది.
8. అర్ధచంద్రము, త్రిగుణాత్మకము. దీనివల్ల త్రికోణం పుట్టింది.
9. బిందువు పరబ్రహ్మాత్మకము. దీనినుంచి పరబ్రహ్మాత్మకమైన బిందువు పుట్టింది.

ఈ రకంగా పంచదశీ మహామంత్రం నుంచే శ్రీచక్రం పుట్టింది. మరి పంచదశీ మహామంత్రానికి అధిదేవత త్రిమూర్తి ద్వంద్వము, పరమేశ్వర స్వరూపము అయినప్పుడు శ్రీచక్రానికి అధిదేవత కూడా ఆ పరమేశ్వరి స్వరూపమే కదా.

పరమేశ్వరి ఈ శ్రీచక్రంలోనే ఉంటుంది. కాబట్టి శ్రీచక్ర రాజనిలయా అనబడుతుంది.

997. శ్రీమత్త్రిపురసుందరీ

త్రిపురస్య పరశివస్య సుందరీ పత్నీ

త్రిపురుడు – త్రిపురాసురులను జయించినవాడు పరమశివుడు. అతని భార్య త్రిపురసుందరీ అనబడుతుంది. త్రిపురుడు – మూడు పురములు గలవాడు. బ్రహ్మవిష్ణు శివపురములు గలవాడు. అతని భార్య. శ్రీచక్రానికి అధిష్ఠానదేవత ముల్లోకాలను పాలించేతల్లి. భూతభవిష్యద్వర్తమానాలయందు, జాగ్రస్వప్న సుషుప్తులయందు, స్థూల సూక్ష్మ కారణదేహాలయందు సాక్షీభూతమైనది. చరాచర జగత్తును నడిపించేది లోకాలను పాలించే ఆదిశక్తి. కాళికాపురాణంలో

ప్రధానేచ్ఛావశా చ్ఛంభోః శరీర మభవ త్త్రిధా
తత్రోర్ధ్వభాగ స్సంజ్ఞాతః పంచవక్త్ర శ్చతుర్భుజః ।
పద్మకేసరగౌరాంగః కాయో బ్రహ్మ మహేశ్వరి
తన్మధ్యభాగో నీలాంగ ఏకవక్త్ర శ్చతుర్భుజః ॥
శంఖచక్రగదాపద్మపాణిః కాయ స్స వైష్ణవః
అభవ త్తదధోభాగే పంచవక్త్ర శ్చతుర్భుజః ।
స్ఫటికాభ్రమయ శ్శుక్ల స్సకాయ శ్చంద్రశేఖరః
ఏవం త్రిభిః పురై ర్యోగాత్ త్రిపురః పరమశ్శివః ॥

శివుని శరీరము మూడు భాగాలయింది. అందులో 1. పై భాగము – ఐదు ముఖములు, నాలుగు చేతులు, పద్మకేసరములవలె గౌరవర్ణముగల బ్రహ్మ.

2. మధ్యభాగము – నల్లని దేహము, ఏకముఖము, నాలుగు చేతులయందు శంఖచక్ర గదాపద్మములు ధరించిన విష్ణువు.

3. అధోభాగము – ఐదు ముఖాలు, నాలుగు చేతులు, స్ఫటికమువలె తెల్లని దేహముగల చంద్రశేఖరుడు. ఈ రకంగా మూడు పురముల సంబంధముచేత పరమశివుడు త్రిపురుడు అని పిలువబడ్డాడు.

ఆ త్రిపురుని యొక్క శక్తి త్రిపురసుందరి అని పిలువబడుతుంది.

998. శ్రీశివా

శ్రీయుక్తా శివా శ్రీశివా

శ్రీతో అనగా శోభతో కూడినది. శివశక్తులకు భేదంలేదు. వారిద్దరూ ఒకటే. అందు చేతనే పరమేశ్వరి శివా అనబడుతోంది. శివునియొక్క శక్తి శివుని అర్ధాంగి కాబట్టి శివా.

999. శివశక్త్యైక్యరూపిణీ

శివశక్తుల సామరస్యము గలది. శివతత్త్వముతో ఏకత్వము పొందినది. బ్రహ్మకన్న బ్రహ్మశక్తి వేరు కాదు. శక్తికీ శక్తిగల వానికి భేదము లేదు. ఇక్కడ శక్తిగలవాడు శివుడు. అందుకే పరమేశ్వరి శివశక్త్యైక్యరూపిణీ అనబడుతోంది.

పరమేశ్వరునితో ఐక్యముగల రూపము గలది. భైరవ యామళంలో

చతుర్భి శ్శివచక్రై శ్చ శక్తిచక్రై శ్చ పంచభిః
శివశక్త్యాత్మకం జ్ఞేయం శ్రీచక్రం శివయో ర్వపుః

నాలుగు శివచక్రములతోను, ఐదు శక్తి చక్రములతోను శ్రీచక్రము శివశక్తుల స్వరూపంగా విరాజిల్లుతున్నది. వీటిలో

త్రికోణమష్టకోణం చ దశకోణద్వయంతథా
చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచభిః

1. త్రికోణము
2. అష్టకోణము
3. దశారద్వయము
4. చతుర్దశారము

ఈ ఐదు శక్తి చక్రాలు

బిందుశ్చాష్టదళం పద్మం పద్మ షోడశ పత్రకం
చతురస్రంచ చత్వారి శివచక్రా ణ్యనుక్రమాత్

1. బిందువు   3. షోడశ దళము
2. అష్టదళము   4. భూపురము

ఈ నాలుగు శివచక్రాలు

అయితే పరమేశ్వరి శివశక్త్యైక్యరూపిణి. అంటే శివశక్తులు కలిసే ఉంటారు. విడివిడిగా ఉండరు. అందుకే శ్రీచక్రంలోకూడా శివచక్రాలకు శక్తి చక్రాలకు అవినాభావ సంబంధమున్నది. అది ఎలా అంటే

త్రికోణే బైందవంశ్లిష్టం అష్టారేష్టదళాంబుజమ్
దశారయే షోడశారం భూగృహం భువనాశ్రకే

త్రికోణంలో	–	బిందువున్నది
అష్టకోణంలో	–	అష్టదళ పద్మమున్నది
దశారయుగ్మంలో	–	షోడశదళమున్నది
చతుర్దశారంలో	–	భూపురమున్నది

శైవానామపి శాక్తానాం చక్రాణాంచ పరస్పరమ్
అవినాభావ సంబంధం యో జానాతి స చక్రవిత్

ఈ రకంగా శివశక్తి చక్రాలయొక్క అవినాభావ సంబంధము నెరిగినవాడే చక్రవిదుడు. అతడే చక్రసంకేతము నెరిగినవాడు.

న తేషాం సిద్ధిదా విద్యా కల్పకోటిశతై రపి

ఈ విషయం తెలియకుండా ఎన్ని కోట్ల సంవత్సరాలు జపం చేసినప్పటికీ మంత్రం సిద్ధించదు.

ఈ రకంగా శివశక్తులు కలిసే ఉంటారు. అదే అర్ధనారీశ్వరతత్త్వము. ప్రతి అణువు లోను వారిద్దరూ కలిసే ఉన్నారు. అందుకే పరమేశ్వరి శివశక్త్యైక్యరూపిణీ అనబడుతోంది.

శివశక్తులు ఒకటిగా ఉన్నారు కాబట్టి ఈ సమైక్యతత్త్వానికి జగత్కారణత్వము కలుగుతున్నది. వీరిద్దరూ కలిసే ఉన్నారు కాని ఒకే బొమ్మను చూసి కొందరు ఎద్దు అని కొందరు ఏనుగు అని అనుకుంటున్నారు. అలాగే ఒకే బ్రహ్మను చూసి కొందరు శివుడని కొందరు శక్తి అని అనుకుంటున్నారు. కాబట్టి చైతన్యశక్తియుతమైన పరబ్రహ్మమే శివశక్త్యైక్యరూపిణి అనబడుతోంది.

హకార సంజ్ఞగల పరమేశ్వరుడు సకార సంజ్ఞగల ప్రకృతితో కలిసి శబళ బ్రహ్మమైనాడు. ఇదే హంస మంత్రము. హంసస్వరూపిణి. ముఖ్యప్రాణస్వరూపిణి. ఆ పరమేశ్వరి శివశక్త్యైక్యరూపిణి.

పరమేశ్వరుని శక్తులు ఐదు

1.	ధూమవతీ శక్తి	–	పృథివీ శక్తి
2.	హ్లాదశక్తి	–	జలశక్తి
3.	భాస్వచ్ఛక్తి	–	అగ్నిశక్తి
4.	స్పందన శక్తి	–	వాయుశక్తి
5.	వైభవ శక్తి	–	ఆకాశశక్తి

వీటి సమిష్టిరూపము పరమేశ్వరి. ఈ పంచభూత శక్తులు సత్తాతో చేరి శివశక్త్యైక్యరూపిణీ అనబడుతోంది.

1000. లలితాంబికా

లలితా సహస్రనామాలలో మొదటి మూడు నామాలలోను పరమేశ్వరి సృష్టి స్థితి లయ కారిణి అని చెప్పి ఆ తరువాత పరమేశ్వరి పంచకృత్య పారాయణగా ఇప్పటిదాకా వివరించారు. ఇప్పుడు ఆమె ప్రత్యేకనామాన్ని వివరిస్తున్నారు.

లలితాంబికా – లలితమైన అంబికా. పద్మపురాణంలో

లోకానతీత్య లలితే లలితా తేన సోచ్యతే

లోకములను మించిన లలిత కాబట్టి ఆమె లలిత అనబడింది.

కిరణములు లేక ఆవరణ దేవతలు పై స్థానమున ఉన్న బిందువునందే ప్రకాశించేది.

1. శోభ	3. గాంభీర్యము	5. స్థైర్యము	7. లాలిత్యము
2. విలాసము	4. మాధుర్యము	6. తేజస్సు	8. ఔదార్యము.

ఇవి లలిత అనే పదానికి అర్ధాలు. వీటిని గలది కాబట్టి లలితా అనబడుతోంది. లలితము అంటే సౌకుమార్యము, లాలిత్యము అని కూడా అర్ధం. వాటిని గలది లలిత. ఆమె ధనుస్సు – చెరకు, బాణాలు – పుష్పాలు. అవన్నీ లలితములు కాబట్టి లలితా అనబడుతుంది. ప్రయాగపీఠాధిష్ఠాన దేవత లలితా అనబడుతుంది.

'లలితాంబికా' అనేది ఆరు అక్షరాలమంత్రం.

ఓంకారము బ్రహ్మకంఠం నుంచి వచ్చింది. కాబట్టి మంగళకరమైనది. ఓం కారపూర్వకము కాని మంత్రం సత్ఫలితాన్ని ఇవ్వదు. అందుచేతనే ముందుగా ఓంకారాన్ని చెప్పకపోవటం దోషం. ఇప్పుడు ఈ నామానికి ఓంకారం గనక ముందు చేర్చినట్లైతే "ఓం లలితాంబికా" ఆరు అక్షరాలవుతుంది.


అస్యశ్రీ సౌభాగ్య విద్యాలలితా త్రిపురసుందరీ మహామంత్రస్య దక్షిణామూర్తిఋషిః । పంక్తిచ్ఛందః । శ్రీసౌభాగ్యవిద్యేశ్వరీ లలితా త్రిపురసుందరీ దేవతా । ఐం క ఏ ఈ ల హ్రీం బీజం । సౌః సకల హ్రీం శక్తిః । క్లీం హ స క హల హ్రీం కీలకం । జపే వినియోగః ॥

న్యాసము : **ఐం క ఏ ఈ ల హ్రీం । సర్వజ్ఞశక్తిధామ్నే హ్రాం ।**
క్లీం హ స క హల హ్రీం । నిత్య తృప్తిశక్తిధామ్నే హ్రీం ।
సౌః సకల హ్రీం । అనాదిబోధశక్తి ధామ్నే హ్రూం ।
ఐం క ఏ ఈ ల హ్రీం । స్వతంత్రశక్తిధామ్నే హ్రైం ।
క్లీం హ స క హల హ్రీం । నిత్యాలుప్తశక్తిధామ్నే హ్రౌం ।
సౌః సకల హ్రీం । అనంతశక్తిధామ్నే హ్రః ॥

ధ్యానము : **సకుంకుమవిలేపనా .... స్మరామ్యంబికామ్ ॥**

మంత్రము : **ఐం క ఏ ఈ ల హ్రీం । క్లీం హ స క హల హ్రీం । సౌః సకల హ్రీం।**

ఈ రకంగా 974 నుంచి 1000 నామాలదాకా శ్రీచక్రపూజ వివరించబడింది.



శ్రీ 'ద'కార దేవి

58. ఫలశ్రుతి

గురువుగారూ ! ఇప్పటిదాకా లలితాసహస్రనామాలకు చక్కటి భాష్యం చెప్పారు. అయితే ఈ సహస్రనామాలను చదవటం వల్ల ఫలితము ఏమైనా ఉన్నదా ? దయచేసి వివరించండి. అన్నాడు నారాయణభట్టు. ఆ మాటలు విన్న రత్నాకరుడు "నారాయణ భట్టారకా ! లలితాసహస్రానికి ఉత్తరభాగం కూడా ఉన్నదయ్యా. అందులో 86 శ్లోకాలలో సహస్రనామ పారాయణ ఫలం వివరించడింది. ఇప్పుడు దాన్ని మీకు వివరిస్తాను వినండి" అంటూ ప్రారంభించాడు.

లలితాసహస్రం చెప్పిన తరువాత హయగ్రీవుడు అంటున్నాడు. ఓ అగస్త్యమహర్షీ!

అనేన సదృశం స్తోత్రం న భూతం న భవిష్యతి
సర్వరోగ ప్రశమనం సర్వసంపత్ప్రవర్ధనమ్

ఈ స్తోత్రంతో సమానమైనది గతంలోగాని, ఇప్పుడుగానిలేదు. ఇక ముందు కూడా రాబోదు. దీన్ని పఠించినంత మాత్రంచేతనే సర్వరోగాలు ఉపశమిస్తాయి. సర్వసంపదలు ప్రాప్తిస్తాయి.

సర్వాపమృత్యు శమనం కాలమృత్యునివారణం
సర్వజ్వరార్తి శమనం దీర్ఘాయుష్య ప్రదాయకమ్

అపమృత్యువును శాంతింపచేస్తుంది. అకాలమృత్యువును నివారిస్తుంది. అన్నిరకాల జ్వరాలను తగ్గించి సంపూర్ణాయుష్యనిస్తుంది.

పుత్రప్రదం అపుత్రాణాం పురుషార్థప్రదాయకమ్
ఇదం విశేషాచ్ఛ్రీదేవ్యాః స్తోత్రం ప్రీతి విధాయకమ్

పుత్రులులేని వారికి పుత్రలనిస్తుంది. ధర్మార్థకామమోక్షాలనిస్తుంది. లలితాదేవికి విశేషమైన ప్రీతి కలిగిస్తుంది.

పరమేశ్వరి యందు భక్తి ఉన్నవారు ప్రతినిత్యము ఈ సహస్రనామాలను పారాయణ చెయ్యాలి. ఉదయాన్నేలేచి స్నానము సంధ్యావందనము ముగించి ముందుగా శ్రీచక్రాన్ని అర్చించాలి. తరువాత పంచదశి మహామంత్రాన్ని కనీసం 300 సార్లు జపంచేసి ఆ తరువాత సహస్రనామపారాయణ చెయ్యాలి. అలా చేసినట్లైతే

గంగాది సర్వతీర్థేషు యఃస్నాయాత్ కోటిజన్మసు

గంగానది మొదలైన పవిత్రతీర్థాలలో కోటిజన్మలు స్నానం చేసిన ఫలం వస్తుంది.

కాశీక్షేత్రంలో కోటిశివలింగాలు ప్రతిష్ఠించిన ఫలం వస్తుంది. శ్రోత్రీయులైన బ్రాహ్మణులకు కోటిబారువుల బంగారం దానంచేసిన ఫలం దక్కుతుంది. గంగానదీతీరంలో కోటి అశ్వమేధాలు చేసిన ఫలం దక్కుతుంది. ఎడారి ప్రాంతంలో కోటిబావులు త్రవ్వించిన ఫలం దక్కుతుంది. కరువుకాలంలో కోటిమంది సద్బ్రాహ్మణులకు భోజనం పెట్టిన ఫలం దక్కుతుంది. వేయి నామాలూ పారాయణ చెయ్యనవసరం లేదయ్యా. అందులో ఒక నామం పారాయణ చేసినా అతని పాపాలన్నీ ప్రక్షాళనమైపోతాయి. నిత్యకర్మలు చెయ్యకపోవటంవల్ల కలిగే పాపము పోతుంది. నిత్యము ఈ నామాలను పారాయణచేసేవాడి అభీష్టాలు ఆ పరమేశ్వరి నెరవేరుస్తుంది.

నవమ్యాం వా చతుర్దశ్యాం సితాయాం శుక్రవాసరే
కీర్తయే న్నామ సాహస్రం పౌర్ణమాస్యాం విశేషతః

ప్రతి మాసంలోను శుద్ధనవమి, చతుర్దశి, పౌర్ణమియందు లలితాసహస్రాన్ని విశేషంగా పారాయణ చెయ్యాలి.

అగస్త్యమహర్షీ ! వేయి అశ్వమేధాలు, నూరు వాజపేయాలు లలితాసహస్రంలోని ఒక నామానికి కూడా సాటిరావు. సర్వకాలసర్వావస్థలయందు పరమేశ్వరిని గంధపుష్పాదులచే పూజించేవాడే దాత, ముని, తపస్వి అవుతున్నాడు.

చందనము, అగరు, కర్పూరములను, కుంకుమతో కలిపి పరమేశ్వరికి లేపనము గావించినవాడు చిరకాలము జీవిస్తాడు. సహస్రనామ పారాయణచేసి జ్వరంగా ఉన్నవాడి తలను తాకితే ఆ జ్వరం తగ్గిపోతుంది. భస్మముచేతిలోకి తీసుకుని సహస్రనామ పారాయణ చేసి దాన్ని ధరించినట్లైతే సర్వవ్యాధులు ఉపశమిస్తాయి. పిల్లలు లేనివారికి పిల్లలు కలుగుతారు.

మహర్షీ ఇహముగాని పరముగాని ఎవరికి ఏమి కావాలంటే అది కలుగుతుందయ్యా. సంతానంలేనివారికి సంతానం కలుగుతుంది. అలాగే సిరిసంపదలు, భోగభాగ్యాలు, సర్వమూ సిద్ధిస్తాయి. అర్హులైనవారికి మోక్షం కూడా సిద్ధిస్తుంది.

ఈ రకంగా లలితాసహస్రనామాలను పారయణచేస్తే అన్ని కోరికలు తీరతాయి. అయితే అర్థంలేని విద్య వ్యర్థం. కాబట్టి పారాయణ చేసేటప్పుడు ఆ నామం యొక్క అర్థం కూడా తెలుసుకుని పారాయణ చేస్తే దానివల్ల వచ్చే ఫలితము కొన్ని రెట్లు ఉంటుంది.

భగవంతుణ్ణి ఆరాధించేవారు రెండు రకాలుగా ఉంటారు. 1. లౌకికవాదులు 2. పారలౌకికులు. లౌకికవాదులు అంటే ఈ లోకంలో పొందే సుఖసౌఖ్యాలు, భోగభాగ్యాలు, ఉన్నతపదవులు ఆశించేవారు. వీరిదృష్టిలో శ్రీచక్రంలో ఉండే పరమేశ్వరి సాకార అంటే ఒక ఆకారము కలిగినటువంటిది.

చతుర్భుజే ! చంద్రకళావతంసే ! కుచోన్నతే ! కుంకుమరాగశోణే ! ।
పుండ్రేక్షుపాశాంకుశపుష్పబాణహస్తే ! ॥

ఆమె 4 భుజముల యందు పాశము, అంకుశము, ఇక్షుచాపము, పుష్పబాణాలు ధరించి ఉంటుంది. కొంతమంది దృష్టిలో ఆ దేవి దశభుజ, గౌడపాదులవారు ఆ దేవిని స్తుతి చేస్తూ

భవాని శ్రీహస్తైః ర్వహసి ఫణిపాశం సృణి మథో
ధనుః పౌండ్రం పౌష్పం శరమథ జపస్ర క్శుకవరౌ ।
అథద్వాభ్యాం ముద్రా మభయ వరదానైకరసికాం
క్వణద్వీణాం ద్వాభ్యా మురసి కరాభ్యాం చ భిభృషే ॥

చేతులయందు సర్పరూపపాశము, 2 అంకుశము 3 పుండ్రేక్షు చాపము, 4 పుష్పబాణము 5. జపమాల, 6. శుకవరము 7,8 వరదఅభయముద్రలు 9,10 చేతులయందు వీణ ధరించి పది బాహువులతో ఉంటుంది.

ఈ విధంగా ప్రకాశించే పరమేశ్వరిని గనక ఆరాధించినట్లైతే సాధకుడికి ముల్లోకాలను రంజింపచేసే కవిత్వము, ధనధాన్యాలు, భోగభాగ్యాలు లభిస్తాయి. ఈ విధంగా లౌకికవాదుల కోరికలు తీరతాయి.

ఇక పారలౌకిక లేక మోక్షవాదులను గనక చూసినట్లైతే, వారికి కావలసినది ఇహంకాదు పరం. అంటే సాయుజ్యం. శ్రీచక్రంలో ఉన్న ఒక్కొక్క ఆవరణ, జగత్తులోని ఒక్కొక్క దానికి గుర్తు.

భూపురం	–	భూలోక భువర్లోక సువర్లోకాలకు
షోడశదళం	–	చంద్రకళలు
అష్టదళం	–	అష్టమూర్తులు
చతుర్దశారం	–	చతుర్దశ భువనాలు

బహిర్దశారం	-	దశావతారాలు
అంతర్దశారం	-	అగ్నికళలు
అష్టకోణం	-	అష్టవసువులు
త్రికోణం	-	త్రిమూర్తులు, త్రిశక్తులు, త్రిగుణాలు, షోడశనిత్యలు, పంచదశ తిథులు, అ నుంచి క్ష వరకు అక్షరాలు ఈ రకంగా అన్నీ ఇక్కడే ఉన్నాయి. జగత్తంతా ఈ త్రికోణంలోనే ఉంది.
బిందువు	-	పరమేశ్వర స్వరూపం. నిరాకారుడు నిర్గుణ స్వరూపుడు అయిన పరబ్రహ్మ బిందురూపంలోనే ఉన్నాడు. అదే ఈ బిందువు. తేజోమయమైన కాంతి పుంజము.

ఈ రకంగా ఉన్న శ్రీచక్రాన్ని అర్చించినట్లైతే చరాచర జగత్తును అర్చించినట్లే. విశ్వమానవాళినంతటినీ అర్చించినట్లే. జగత్తులోని ప్రాణికోటినంతటినీ అర్చించినట్లే.

మోక్షవాదులకు బాహ్యపూజలేదు. వారు శ్రీచక్రాన్ని తమ శరీరంలోనే ఊహించుకుని అంతరారాధన చేస్తారు. వీరు తమ శరీరంలో బిందువు అంటే బ్రహ్మరంధ్రం దగ్గర పరమేశ్వరి సాక్షాత్కారం పొందుతారు. సాధకుడు, పరమేశ్వరి ఇద్దరూ ఒక్కటే. వేరు కాదు అని తెలుసుకుంటారు. ఇదే ఆత్మసాక్షాత్కారము. ఈ విధంగా ఆత్మసాక్షాత్కారం పొందిన వారికి సాయుజ్యం లభిస్తుంది. మోక్షం సిద్ధిస్తుంది. వారి ఆత్మ పరమాత్మలో లీనమైపోతుంది. వారికి మరుజన్మ ఉండదు.

యత్రా పి భోగో న చ తత్ర మోక్షః యత్రా పి మోక్షో న చ తత్ర భోగః ।
శ్రీ సుందరీ సేవన తత్పరాణాం భోగ శ్చ మోక్షశ్చ కరస్థ ఏవ ॥

లోకంలో భోగభోగ్యాలు అనుభవించే వారికి మోక్షము లభించదు. అలాగే మోక్షగాములకు సిరిసంపదలుండవు. కాని ఆ పరమేశ్వరిని అర్చించేవారికి ఇహము, పరము రెండూ లభిస్తాయి. అంటూ లలితా సహస్రనామ పారాయణ ఫలితాన్ని వివరించాడు రత్నాకరుడు.

59. పారాయణ ఎవరు చెయ్యాలి ?

గురువుగారూ ! ఇంతవరకూ లలితాసహస్రనామ వ్యాఖ్య, పారాయణ ఫలితము కూలంకషంగా వివరించారు. అయితే చిన్న సందేహం పీడిస్తోంది. సహస్రనామాలను ఎవరైనా పారాయణ చెయ్యవచ్చా ? నిషేధం ఏమైనా ఉన్నదా ? తెలియచెయ్యండి అన్నాడు కృష్ణశర్మ. సమాధానం చెబుతున్నాడు రత్నాకరుడు.

నీ అనుమానం నాకు అర్థమయిందయ్యా ! జాగ్రత్తగా విను. ఎవరైనా అంటే ఏ కులంవారైనా పారాయణ చెయ్యవచ్చా అని కదా నీ అనుమానం ? చెయ్యవచ్చు. 'బిందుతర్పణ సంతుష్టా' అనే 974వ నామంలో చాతర్వర్ణాలవారు శ్రీచక్రంలోని బిందువు దగ్గర తర్పణ చేస్తారు అని చెప్పుకున్నాం కదా. అంటే ఏ కులంవారైన సరే లలితాసహస్రము పారాయణ చెయ్యవచ్చు. శ్రీచక్రాన్ని అర్చించవచ్చు అనే కదా ? అది కాకుండా గాయత్రీ మంత్రము బ్రహ్మ క్షత్రియుల కోసం ఏర్పడగా, పంచదశి మహామంత్రం చాతుర్వర్ణాలవారి కోసము ఏర్పడింది అని అగస్త్య మహర్షి శ్రీవిద్యాదీపిక అనే గ్రంథంలో వ్రాశాడు. కాబట్టి ఈ సహస్రనామాలను ఎవరైనా పారాయణ చెయ్యవచ్చు. ఇందులో సందేహంలేదు.

ఇక పారాయణ చేసేవారు రెండురకాలు.

1. పూజావిధానంలో పారాయణ. 2. మంత్రంగా పారాయణ. మొదటివిధానంలో అమ్మవారికి షోడశోపచారవిధిని అర్చన చేస్తూ పూజచేయవలసినప్పుడు సహస్రనామాలను విడివిడిగా చదవకుండా, శ్లోకాలను పారాయణ చెయ్యటం.

రెండవవిధానంలో దీన్ని ఒక మంత్రంగా భావించి అంగన్యాసకరన్యాసాలు చెప్పి సహస్రనామ పారాయణ చెయ్యటం.

ఈ రెండింటిలోను మొదటిది కేవలం పూజావిధానం. దీన్నిఎవరైనా చెయ్యవచ్చు. రెండవదైన మంత్ర భాగంగా పారాయణ చెయ్యాలంటే గురువుగారి దగ్గర ఉపదేశం ఉండితీరాలి. అయితే మొదటిపద్ధతి అయిన పూజావిధానంలో కూడా శ్లోకాలుగా పారాయణచేసే కన్న నామాలను చెప్పటమే ఉత్తమం. ప్రతి నామానికీ ముందు ఓంకారము, తరువాత నమః అని చెప్పటం ఉత్తమోత్తమమైన సంప్రదాయం. నామపారాయణప్రీతా అన్నారు. కాబట్టి ఈ రకంగా శ్లోకాలు చదువుతాము. ఇందులో సమయం తక్కువ పడుతుంది. అనరాదు. దేనివల్ల ఫలితమెక్కువ ఉంటుందో ఆలోచించి చెయ్యటం మంచిది.

పారాయణ క్రమంలో కూడా ప్రతినామము స్పష్టంగా ఉచ్చరించాలి. తప్పులు రాకుండా చూసుకోవాలి. లేకపోతే దుష్ఫలితాలు వచ్చే ప్రమాదం ఉన్నది. అంతేకాదు. పారాయణలోగాని, జపంలోగాని, అర్చనలోగాని తాదాత్మ్యత కావాలి. అప్పుడు సంఖ్యతో నిమిత్తం ఉండదు. ఫలం మాత్రం ఎక్కువ ఉంటుంది.

సువాసిని, కుమారి పూజలు చేసేటప్పుడు కూడా మన బంధువులనో, కావలసిన వారినో కూర్చోబెట్టరాదు. అక్కడ ఉండేది పరదేవత అనే భావంతో సరియైన వ్యక్తులను కూర్చోబెట్టి, వారిని పరమేశ్వరి స్వరూపంగానే భావించి అర్చించాలి. సువాసినికి ఏవిధమైన అంగవైకల్యముగాని, వ్యాధిగాని, కురుపులుగాని ఉండరాదు. సంపూర్ణ ఆరోగ్యవంతురాలు సంతానవతి అయి ఉండాలి. దీక్షాపరురాలై ఉండాలి.

పరమేశ్వరిని అర్చించేటప్పుడు వెండి, బంగారములతో చేసిన పూలను వాడటం శ్రేష్ఠము. వీటిని ప్రతిసారీ కడిగివాడాలి. పరమేశ్వరిని రోజూ రెండు పర్యాయాలయినా అర్చించాలి. దేవికి రాత్రిపూజ చాలా ముఖ్యము. పగలు శివ రూపము రాత్రి శక్తి రూపము.

ఈ విషయాలను గ్రహించి ఆ పరమేశ్వరిని గనక అర్చించినట్లైతే సాధకుడికి ఆయురారోగ్య ఐశ్వర్యాలు, సిరిసంపదలు, భోగభాగ్యాలు, ధనధాన్యాలు లభిస్తాయి. మనోవాంఛితము నెరవేరుతుంది. ఇష్టకామ్యార్థసిద్ధి జరుగుతుంది. అర్హులకు సాయుజ్యం లభిస్తుంది.

నాయనలారా ! ఇప్పటిదాకా నాకు తెలిసిన విషయమంతా లలితారహస్యనామ భాష్యంగా మీకు వివరించాను. ఇదేదో నా గొప్పతనం కాదు. శంకర భగవత్పాదులవారు తమ సౌందర్య లహరిలోని 100వ శ్లోకంలో

ప్రదీపజ్వాలాభి ర్దివసకరనీరాజనవిధిః
సుధా సూతే శ్చంద్రోపలజలల వై ర ర్ఘ్య రచనా
స్వకీయై రంబోభి స్సలిలనిధి సాహిత్యకరణం
త్వదీయాభి ర్వాగ్భి స్తవ జనని ! వాచాం స్తుతి రియమ్

ఓ పరమేశ్వరీ ! నీవిచ్చిన వాక్కులతో, నీవిచ్చిన జ్ఞానంతో నిన్ను స్తోత్రం చేస్తూ ఉంటే, సూర్యుడికి దివిటీలతో హారతి ఇచ్చినట్లుగా ఉన్నది. చంద్రకాంతిమణుల నుండి

జాలువారే జలబిందువులచే చంద్రునికి అర్ఘ్యమిచ్చినట్లుగా ఉన్నది. సముద్రంలోని నీటిని తీసుకుని మళ్ళీ సముద్రుడికే తర్పణలు అర్పించినట్లుగా ఉన్నది అంటారు.

అలాగే పరమేశ్వరి కృపచేత నాకు తెలిసినంతవరకు, నా బుద్ధికి తోచినంతవరకు, నాకు గుర్తున్నంతవరకు లలితారహస్యనామభాష్యాన్ని మీకు వివరించాను. మీ జన్మ ధన్యమైంది. ఆ పరమేశ్వరి మీకు ఆయురారోగ్య, ఐశ్వర్యాలను, సుఖశాంతులను ప్రసాదించుగాక.

లోకా సమస్తా స్సుఖినో భవన్తు !

అన్నాడు రత్నాకరుడు.

లలితారహస్యనామ భాష్యము, ఫలసృతి ఆసాంతం విన్నటువంటివారైన శిష్యులు నారాయణభట్టు, కృష్ణశర్మలు గురువుగారికి ప్రదక్షిణలుచేసి, పరిపరివిధాల ఆయనను పూజించి ఇంత మంచి భాష్యం చెప్పినందుకు గురువుగారిని సత్కరించి పాదాభివందనం చేసి వారి దగ్గర సెలవు తీసుకున్నారు.

హరితస గోత్రీకుడు శ్రీ క్రోవి పురుషోత్తమ శర్మ,
శ్రీమతి లక్ష్మీ నరసమ్మగార్ల పౌత్రుడు
శ్రీ క్రోవి కృష్ణమూర్తి శ్రీమతి సత్యపర్వత వర్ధనమ్మగార్ల
జ్యేష్ఠపుత్రుడు అయిన క్రోవి పార్థసారథి
సర్వజనామోదము పొందునట్లుగా సులభశైలిలో వ్రాసిన
"శ్రీవిద్యా సారథి" అను లలితా రహస్యనామ భాష్యము సమాప్తము.
ఓం తత్సత్

౬౦. శ్రీ లలితాంబా త్రిశతీస్తోత్ర రత్నమ్

శ్రీ బ్రహ్మాండ పురాణే

స కుంకుమ విలేపనా మళిక చుంబి కస్తూరికాం ।
స మంద హసితేక్షణాం స శరచాప పాశాంకుశాం ।
అశేష జనమోహినీ మరుణ మాల్య భూషాంబరాం ।
జపాకుసుమ భాసురాం జపవిధౌ స్మరే దంబికామ్ ॥

అగస్త్య ఉవాచ :

హయగ్రీవ దయాసింధో భగవన్ భక్తవత్సల ।
త్వత్త శ్శృత మశేషేణ శ్రోతవ్యం యద్య దస్తి తత్ ॥ 1

రహస్యం నామసాహస్ర మపి తత్సంశ్రుతం మయా ।
ఇతః పరం చ మే నాస్తి శ్రోతవ్య మితి నిశ్చయః ॥ 2

తథాపి మమ చిత్తస్య పర్యాప్తి ర్నైవ జాయతే ।
కార్త్స్న్యార్థః ప్రాప్య ఇత్యేవ శోచయిష్యా మ్యహం ప్రభో ॥ 3

కిమిదం కారణం బ్రూహి జ్ఞాతవ్యాంశోఽపి వా పునః ।
అస్తి చేన్మమ తం బ్రూహి బ్రూహిత్యుక్త్వా ప్రణమ్య తమ్ ॥ 4

సూత ఉవాచ :

సమాలలంబే తత్పాద యుగళం కలశోద్భవః ।
హయాననో భీతభీతః కిమిదం కిమిదం త్వితి ॥ 5

ముంచ ముంచేతి తం చోక్త్వా చింతాక్రాంతో బభూవ సః ।
చిరం విచార్య నిశ్చిన్వ న్వక్తవ్యం సమయేత్యసౌ ॥ 6

తూష్ణీం స్థితః స్మరన్నాజ్ఞాం లలితాంబా కృతాం పురా ।
తంప్రణమ్యైవ స ముని స్తత్పాదా వత్యజన్ స్థితః ॥ 7

వర్షత్రయావధి తథా గురుశిష్యౌ తథా స్థితౌ ।
తచ్ఛృణ్వంతశ్చ పశ్యంత స్సర్వలోకా స్సువిస్మితాః ॥ 8

తత్ర శ్రీలలితాదేవీ కామేశ్వర సమన్వితా ।
ప్రాదుర్భూతా రహస్యేవం హయగ్రీవ మవోచత ॥ 9

శ్రీ దేవ్యువాచ :

అశ్వాననావయోః ప్రీతి శ్శాస్త్ర విశ్వాసినే త్వయా ।
రాజ్యం దేయం శిరో దేయం న దేయా షోడశాక్షరీ ॥ 10

స్వమాతృజారవ ద్గోప్యా విద్యైషే (వే) త్యాగమా జగుః ।
తతోఽతి గోపనీయా మే సర్వపూర్తికరీ స్తుతిః ॥ 11

మయా కామేశ్వరేణాపి కృతా సా గోపితా భృశమ్ ।
మదాజ్ఞయా వచో దేవ్యశ్చక్రు ర్నామసహస్రకమ్ ॥ 12

అవాభ్యాం కథితం ముఖ్యం సర్వపూర్తికరం స్తవమ్ ।
సర్వక్రియాణాం వైకల్య పూర్తి ర్యజ్జపతో భవేత్ ॥ 13

సర్వపూర్తికరం తస్మా దిదంనామకృతం మయా ।
తద్బ్రూహి త్వ మగస్త్యాయ పాత్రభూతో న సంశయః ॥ 14

పత్న్యస్య లోపాముద్రాఖ్యా మా ముపాస్తేఽతిభక్తితః ।
అయం చ నితరాం భక్త స్తస్మాదస్య వదస్వ తత్ ॥ 15

అముంచమాన స్త్వత్పాదౌ వర్షత్రయ మసౌ స్థితః ।
ఏతత్ జ్ఞాతు మతో భక్త్యా హీదమేవ నిదర్శనమ్ ॥ 16

చిత్తపర్యాప్తి రేతస్య నాన్యథా సంభవిష్యతి ।
సర్వపూర్తికరం తస్మా దనుజ్ఞాతో మయా వద ॥ 17

సూత ఉవాచ :

ఇత్యుక్త్వాంతర్దధా వంబా కామేశ్వర సమన్వితా ।
అథోత్థాప్య హయగ్రీవః పాణిభ్యాం కుంభసంభవమ్ ॥ 18

హయగ్రీవ ఉవాచ :

సంస్థాప్య నికటే వాచ మువాచ భృశవిస్మితః ।
కృతార్థోఽసి కృతార్థోఽసి కృతార్థోఽసి ఘటోద్భవ ॥ 19

త్వత్సమో లలితాభక్తో నాస్తి నాస్తి జగత్త్రయే ।
యేనాగస్త్య స్వయం దేవీ తవ వక్తవ్య మన్వశాత్ ॥ 20

సచ్ఛిష్యేణ త్వ యాహం చ దృష్టవానస్మితాం శివాం ।
యతన్తే యద్దర్శనాయ బ్రహ్మా విష్ణ్వీశ పూర్వకాః ॥ 21

అతః పరం తే వక్ష్యామి సర్వపూర్తికరం స్తవం ।
యస్య స్మరణ మాత్రేణ పర్యాప్తి స్తే భవే ద్ధృది ॥ 22

రహస్య నామసాహస్రా దతిగుహ్యతమం మునే ।
అవశ్యకం తతో హ్యేతల్లలితాం సముపాసతామ్ ॥ 23

తదహం తే ప్రవక్ష్యామి లలితాంబానుశాసనాత్ ।
శ్రీమత్పంచదశాక్షర్యాః కాదివర్ణ క్రమాన్మునే ॥ 24

పృథ గ్వింశతి నామాని కథితాని ఘటోద్భవ ।
ఆహత్య నామ్నాం త్రిశతీ సర్వ సంపూర్తికారిణీ ॥ 25

రహస్యాతిరహస్యైషా గోపనీయా ప్రయత్నతః ।
తాం శృణుష్వ మహాభాగ సావధానేన చేతసా ॥ 26

కేవలం నామబుద్ధి స్తే న కార్యా తేషు కుంభజ ।
మంత్రాత్మకత్వ మేతేషాం నామ్నాం నామాత్మతాపి చ ॥

తస్మా దేకాగ్రమనసా శ్రోతవ్యం భవతా మునే ।

సూత ఉవాచ :

ఇత్యుక్త్వాతు హయగ్రీవః ప్రోచే నామ శత త్రయమ్ ॥ 28

అస్య శ్రీలలితా త్రిశతీస్తోత్ర మహామంత్రస్య భగవాన్ హయగ్రీవ – ఋషిః; అనుష్టుప్ – ఛందః; శ్రీలలితా మహేశ్వరీ దేవతా; ఐం – బీజం; సౌః – శక్తిః; క్లీం – కీలకం; మమ చతుర్విధ ఫల పురుషార్థ సిద్ధ్యర్థే జపే వినియోగః ॥ ఐమిత్యాదిభి రంగన్యాస కరన్యాసాః కుర్యాః ।

ధ్యానమ్ :

అతిమధుర చాపహస్తా మపరిమితామోద బాణ సౌభాగ్యాం ।
అరుణా మతిశయ కరుణా మభినవ కుళ సుందరీం వందే ।

హయగ్రీవ ఉవాచ :

కకారరూపా కల్యాణీ కల్యాణగుణ శాలినీ ।
కల్యాణశైలనిలయా కమనీయా కళావతీ ॥ 1

కమలాక్షీ కల్మషఘ్నీ కరుణామృత సాగరః ।
కదంబ కాననావాసా కదంబ కుసుమ ప్రియా ॥ 2

కందర్పవిద్యా కందర్ప జనకాపాంగ వీక్షణా ।
కర్పూరవీటి సౌరభ్య కల్లోలిత కకుప్తటా ॥ 3

కలిదోషహరా కంజ లోచనా కమ్రవిగ్రహా ।
కర్మాది సాక్షిణీ కారయిత్రీ కర్మఫలప్రదా ॥ 4

ఏకారరూపా చైకాక్ష ర్యేకానేకాక్షరాకృతిః ।
ఏత త్త దిత్యనిర్దేశ్యా చైకానంద చిదాకృతిః ॥ 5

ఏవ మిత్యాగమా బోధ్యా చైకభక్తిమదర్చితా ।
ఏకాగ్రచిత్త నిర్ధ్యాతా చైషణా రహితాదృతా ॥ 6

ఏలాసుగంధి చికురా చైనః కూట వినాశినీ ।
ఏకభోగా చైకరసా చైకైశ్వర్య ప్రదాయినీ ॥ 7

ఏకాతపత్ర సామ్రాజ్యప్రదా చైకాంత పూజితా ।
ఏధమానప్రభా చైజ దనేజ జ్జగదీశ్వరీ ॥ 8

ఏకవీరాది సం సేవ్యా చైకప్రాభవ శాలినీ ।
ఈకారరూపిణీశిత్రీ ఈప్సితార్థ ప్రదాయినీ ॥ 9

ఈదృగిత్య వినిర్దేశ్యా ఈశ్వరత్వ విధాయినీ ।
ఈశానాది బ్రహ్మమయీ ఈశిత్వా ద్యష్టసిద్ధిదా ॥ 10

ఈక్షిత్రీ క్షణసృష్టాండ కోటిరీశ్వర వల్లభా ।
ఈడితా చేశ్వరార్ధాంగ శరీరేశాధిదేవతా ॥ 11

ఈశ్వర ప్రేరణకరీ చేశతాండవ సాక్షిణీ ।
ఈశ్వరోత్సంగ నిలయా చేతబాధా వినాశినీ ॥ 12

ఈహా విరహితా చేశశక్తి రీషత్స్మితాననా ।
లకారరూపా లలితా లక్ష్మీ వాణీ నిషేవితా ॥ 13

లాకినీ లలనారూపా లస ద్దాడిమ పాటలా ।
లలంతికా లసత్ఫాలా లలాట నయనార్చితా ॥ 14

లక్షణోజ్జ్వల దివ్యాంగీ లక్ష్యకోట్యండ నాయికా ।
లక్ష్యార్థా లక్షణాగమ్యా లబ్ధకామా లతాతనుః ॥ 15

లలామరాజదళికా లంబముక్తా లతాంచితా ।
లంబోదర ప్రసూర్లభ్యా లజ్జాఢ్యా లయవర్జితా ॥ 16

హ్రీంకారరూపా హ్రీంకారనిలయా హ్రీంపద ప్రియా ।
హ్రీంకారబీజా హ్రీంకార మంత్రా హ్రీంకార లక్షణా ॥ 17

హ్రీంకారజప సుప్రీతా హ్రీం మతిః హ్రీం విభూషణా ।
హ్రీంశీలా హ్రీంపదారాధ్యా హ్రీంగర్భా హ్రీంసదాభిదా ॥ 18

హ్రీంకారవాచ్యా హ్రీంకార పూజ్యా హ్రీంకార పీఠికా ।
హ్రీంకారవేద్యా హ్రీంకార చింత్యా హ్రీంహ్రీం శరీరిణీ ॥ 19

హకారరూపా హలధృత్పూజితా హరిణేక్షణా ।
హరప్రియా హరారాధ్యా హరి బ్రహ్మేంద్ర సేవితా ॥ 20

హయారూఢా సేవితాంఘ్రిర్హయమేధ సమర్చితా ।
హర్యక్షవాహనా హంసవాహనా హతదానవా ॥ 21

హత్యాది పాపశమనీ హరిదశ్వాది సేవితా ।
హస్తి కుంభోత్తుంగ కుచా హస్తికృత్తి ప్రియాంగనా ॥ 22

హరిద్రా కుంకుమా దిగ్ధా హర్యశ్వా ద్యమరార్చితా ।
హరికేశసఖీ హాదివిద్యా హాలామదాలసా ॥ 23

సకారరూపా సర్వజ్ఞా సర్వేశీ సర్వమంగళా ।
సర్వకర్త్రీ సర్వభర్త్రీ (ధాత్రీ) సర్వహంత్రీ సనాతనీ ॥ 24

సర్వానవద్యా సర్వాంగ సుందరీ సర్వసాక్షిణీ ।
సర్వాత్మికా సర్వసౌఖ్య దాత్రీ సర్వవిమోహినీ ॥ 25

సర్వాధార సర్వగతా సర్వావగుణ వర్జితా ।
సర్వారుణా సర్వమాతా సర్వాభరణ భూషితా ॥ 26

కకారార్థః కాలహంత్రీ కామేశీ కామితార్థదా ।
కామ సంజీవినీ కల్యా కఠినస్తన మండలా ॥ 27

కరభోరూః కళానాథ ముఖీ కచ జితాంబుదా ।
కటాక్షస్యంది కరుణా కపాలి ప్రాణనాయికా ॥ 28

కారుణ్య విగ్రహా కాంతా కాంతిధూత జపావళిః ।
కలాలాపా కంబుకంఠీ కర నిర్జిత పల్లవా ॥ 29

కల్పవల్లీ సమభుజా కస్తూరీ తిలకోజ్జ్వలా ।
హకారార్థా హంసగతి ర్హాటకాభరణోజ్జ్వలా ॥ 30

హారహారి కుచాభోగ హాకినీ హల్యవర్జితా ।
హరిత్పతి సమారాధ్యా హఠాత్కార హతాసురా ॥ 31

హర్షప్రదా హవిర్భోక్త్రీ హార్దసం తమసాపహా ।
హల్లీ హాలాస్య సంతుష్టా హంసమంత్రార్థ రూపిణీ ॥ 32

హానోపాదాన నిర్ముక్తా హర్షిణీ హరిసోదరీ ।
హాహా హూహూ ముఖస్తుత్యా హానివృద్ధి వివర్జితా ॥ 33

హయ్యంగవీన హృదయా హరి కోపారుణాంశుకా ।
లకారార్థా లతాపూజ్యా లయస్థి త్యుద్భవేశ్వరీ ॥ 34

లాస్యదర్శన సంతుష్టా లాభాలాభ వివర్జితా ।
లం ఘ్యేతరాజ్ఞా లావణ్య శాలినీ లఘు సిద్ధిదా ॥ 35

లాక్షారస సవర్ణాభా లక్ష్మణాగ్రజ పూజితా ।
లభ్యేతరా లబ్ధశక్తి సులభాలాంగలాయుధా ॥ 36

లగ్నచామరహస్త శ్రీశారదా పరివీజితా ।
లజ్జాపద సమారాధ్యా లంపటా లకుళేశ్వరీ ॥ 37

లబ్ధమానా లబ్ధరసా లబ్ధ సంపత్సమున్నతిః ।
హ్రీంకారిణీ హ్రీంకారాది హ్రీంమధ్యా హ్రీంశిఖామణిః ॥ 38

హ్రీంకార కుండాగ్నిశిఖా హ్రీంకార శశిచంద్రికా ।
హ్రీంకార భాస్కరరుచి హ్రీంకారాంబోధ చంచలా ॥ 39

హ్రీంకార కందాంకురితా హ్రీంకారైక పరాయణా ।
హ్రీంకార దీర్ఘికా హంసీ హ్రీంకారోద్యాన కేకినీ ॥ 40

హ్రీంకారారణ్య హరిణీ హ్రీంకారావాల వల్లరీ ।
హ్రీంకార పంజర శుకీ హ్రీంకారాంగణ దీపికా ॥ 41

హ్రీంకార కందరా సింహీ హ్రీంకారాంబుజ భృంగికా ।
హ్రీంకార సుమనో మాధ్వీ హ్రీంకార తరు మజరీ ॥ 42

సకారాఖ్యా సమరసా సకలోత్తమ సంస్తుతా ।
సర్వ వేదాంత తాత్పర్యభూమి స్సదసదాశ్రయా ॥ 43

సకలా సచ్చిదానందా సాధ్వీ సద్గతి దాయినీ ।
సనాకాది మునిధ్యేయా సదాశివ కుటుంబినీ ॥ 44

సకలాధిష్ఠానరూపా సత్త్వరూపా సమాకృతిః ।
సర్వప్రపంచ నిర్మాత్రీ సమానాధిక వర్జితా ॥ 45

సర్వోత్తుంగా సంగహీనా సద్గుణా సకలేష్టదా ।
కకారిణీ కావ్యలోలా కామేశ్వర మనోహరా ॥ 46

కామేశ్వర ప్రాణనాడీ కామేశోత్సంగ వాసినీ ।
కామేశ్వరాలింగితాంగీ కామేశ్వర సుఖప్రదా ॥ 47

కామేశ్వర ప్రణయినీ కామేశ్వర విలాసినీ ।
కామేశ్వర తపస్సిద్ధిః కామేశ్వర మనః ప్రియా ॥ 48

కామేశ్వర ప్రాణనాథా కామేశ్వర విమోహినీ ।
కామేశ్వర బ్రహ్మవిద్యా కామేశ్వర గృహేశ్వరీ ॥ 49

కామేశ్వరా హ్లాదకరీ కామేశ్వర మహేశ్వరీ ।
కామేశ్వరీ కామకోటి నిలయా కాంక్షితార్థదా ॥ 50

లకారిణీ లబ్ధరూపా లబ్ధధీ ర్లబ్ధ వాంఛితా ।
లబ్ధపాప మనోదూరా లబ్ధాహంకార దుర్గమా ॥ 51

లబ్ధశక్తిర్లబ్ధదేహా లబ్ధైశ్వర్య సమున్నతిః ।
లబ్ధబుద్ధి ర్లబ్ధలీలా లబ్ధ యౌవనశాలినీ ॥ 52

లబ్ధాతిశయ సర్వాంగ సౌందర్యా లబ్ధవిభ్రమా ।
లబ్ధరాగా లబ్ధగతి ర్లబ్ధ నానాగమ స్థితిః ॥ 53

లబ్ధభోగా లబ్ధసుఖా లబ్ధహర్షాభిపూజితా ।
హ్రీంకారమూర్తి ర్హ్రీంకారసౌధ శృంగ కపోతికా ॥ 54

హ్రీంకార దుగ్ధాబ్ధిసుధా హ్రీంకార కమలేందిరా ।
హ్రీంకార మణీదీపార్చి ర్హ్రీంకార తరు శారికా ॥ 55

హ్రీంకార పేటిక మణీర్హ్రీంకారాదర్శ బింబికా ।
హ్రీంకార కోశాసిలతా హ్రీంకారాస్థాన నర్తకీ ॥ 56

హ్రీంకార శుక్తికా ముక్తా మణీర్హ్రీంకార బోధితా ।
హ్రీంకారమయ సౌవర్ణ స్తంభ విద్రుమ పుత్రికా ॥ 57

హ్రీంకార వేదోపనిష ద్ధ్రీంకారాధ్వర దక్షిణా ।
హ్రీంకార నందనారామ నవ కల్పక వల్లరీ ॥ 58

హ్రీంకార హిమవద్గంగా హ్రీంకారార్ణవకౌస్తుభా ।
హ్రీంకారమంత్ర సర్వస్వ హ్రీంకారపర సౌఖ్యదా ॥ 59

శ్రీ హయగ్రీవ ఉవాచ :

ఇతీదం తే మయాఽఖ్యాతాం దివ్యనామ్నాం శతత్రయం ।
రహస్యాతి రహస్యత్వా ద్గోపనీయం మహామునే ॥ 60

శివవర్ణాని నామాని శ్రీదేవీ కథితాని వై ।
శక్త్యక్షరాణి నామాని కామేశ కథితాని హి ॥ 61

ఉభయాక్షర నామాని హ్యుభాభ్యాం కథితాని వై ।
తదన్యైర్గ్రథితం స్తోత్ర మేతస్య సదృశం కిము ॥ 62

నానేన సదృశం స్తోత్రం శ్రీదేవీ ప్రీతిదాయకం ।
లోకత్రయేఽపి కల్యాణం సంభవే న్నాత్ర సంశయః ॥ 63

సూత ఉవాచ :

ఇతి హయముఖగతం స్తోత్రరాజం నిశమ్య ।
ప్రగళిత కలుష్యా(షో)ఽభూచిత్తపర్యాప్తి మేత్య ।
నిజగురు మథనత్వాత్ కుంభజన్మా తదు క్తైః ।
పున రధిక రహస్యం జ్ఞాతు మేవం జగాద ॥ 64

అగస్త్య ఉవాచ :

అశ్వానన మహాభాగ రహస్య మపి మే వద ।
శివవర్ణాని కాన్యత్ర శక్తివర్ణాని కానిహి ॥ 65

ఉభయో రపి వర్ణాని కాని మే వద దేశిక ।
ఇతి పృష్టః కుంభ జేన హయగ్రీవోఽవదత్పునః ॥ 66

శ్రీ హయగ్రీవ ఉవాచ :

తవ గోప్యం కి మస్తీహ సాక్షా దంబా కటాక్షతః ।
ఇదం త్వతిరహస్యం తే వక్ష్యామి శృణు కుంభజ ॥ 67

ఏత ద్విజ్ఞాన మాత్రేణ శ్రీవిద్యా సిద్ధిదా భవేత్ ।
కత్రయం హద్వయం చైవ శైవోభాగః ప్రకీర్తితః ॥ 68

శక్త్యక్షరాణి శేషాణి హ్రీంకార ఉభయాత్మకః ।
ఏవం విభాగ మజ్ఞాత్వా శ్రీవిద్యా జపశాలినః ॥ 69

న తేషాం సిద్ధిదా విద్యా కల్ప కోటిశతై రపి ।
చతుర్భి శ్శివచక్రై శ్చ శక్తిచక్రైశ్చ పంచభిః ॥ 70
నవచక్రై స్తు సంసిద్ధం శ్రీచక్రం శివయో ర్వపుః ।
త్రికోణ మష్టకోణం చ దశకోణ ద్వయం తథా ॥ 71
చతుర్దశారం చైతాని శక్తిచక్రాణి పంచ వై ।
బిందు శ్చాష్టదళం పద్మం పద్మం షోడశ పత్రకమ్ ॥ 72
చతురస్రం చ చత్వారి శివచక్రా ణ్యనుక్రమాత్ ।
త్రికోణే బైందవం శ్లిష్ట మష్టారేఽ ష్ట దళాంబుజమ్ ॥ 73
దశారయో ష్షోడశారం భూపురం భువనాశ్రకే ।
శైవానా మపి శాక్తానాం చక్రాణాం చ పరస్పరమ్ ॥ 74
అవినాభావ సంబంధం యో జానాతి స చక్రవిత్ ।
త్రికోణరూపిణీ శక్తి ర్బిందురూప శివ స్స్మృతః ॥ 75
అవినాభావ సంబంధ స్తస్మా ద్బిందుత్రికోణయోః ।
ఏవం విభాగ మజ్ఞాత్వా శ్రీచక్రం య స్సమర్చయేత్ ॥ 76
న తత్ఫల మవాప్నోతి లలితాంబా న తుష్యతి ।
యే చ జానంతి లోకేఽ స్మిన్ శ్రీవిద్యాం చక్రవేదినః ॥ 77
సామాన్య వేదిన స్తే వై విశేషజ్ఞోఽ తిదుర్లభః ।
స్వయం విద్యా విశేషజ్ఞో విశేషజ్ఞం సమర్చయేత్ ॥ 78
తస్మై దేయం తతో గ్రాహ్యం శ్రీవిద్యా చక్ర వేదినా ।
అంధం తమః ప్రవిశంతి యే హ్యవిద్యా ముపాసతే ॥ 79
ఇతి శ్రుతి రపాహైతా నవిద్యోపాసకాన్ పునః ।
విద్యాఽ నుపాసకా నేవ నిందత్యారుణికీ శ్రుతిః ॥ 80
అశ్రుతా సశ్రుతాస శ్చ యజ్వానో యే ప్యయజ్వనః ।
స్వర్యంతో నాపేక్షంత ఇంద్ర మగ్నిం చ యే విదుః ॥ 81
సికతా ఇవ సంయంతి రశ్మిభి స్సముదీరితాః ।
అస్మాల్లోకా దముష్మా చ్చే త్యపాహారుణికీ శ్రుతిః ॥ 82

యః ప్రాప్తః పృశ్నిభావం వా యది వా శంకర స్స్వయం ।
తేనైవ లభ్యతే విద్యా శ్రీమత్పంచదశాక్షరీ ॥ 83
ఇతి తంత్రేషు బహుధా విద్యాయా మహిమోచ్యతే ।
మోక్షైకహేతు విద్యా తు శ్రీ విద్యైవ న సంశయః ॥ 84
న శిల్పాదిజ్ఞానయుక్తే విద్వ చ్ఛబ్దః ప్రయుజ్యతే ।
మోక్షైకవిద్యా సా శ్రీవిద్యైవ న సంశయః ॥ 85
తస్మా ద్విద్యావిదే దద్యాత్ ఖ్యాపయే త్తద్గుణా న్సుధీః ।
స్వయం విద్యావిశేషజ్ఞో విద్యామాహాత్మ్య వేద్యపి ॥ 86
విద్యావిదం నార్చయే చ్చే త్కో వా తం పూజయే జ్జనః ।
ప్రసంగా దేత దుక్తం తే ప్రకృతం శృణు కుంభజ ॥ 87
యః కీర్తయే త్సకృ ద్భక్త్యా దివ్యం నామ్నాం శతత్రయం ।
తస్య పుణ్యఫలం వక్ష్యే విస్తరేణ ఘటోద్భవ ॥ 88
రహస్య నామసాహస్ర పాఠే యత్ఫల మీరితం ।
త త్కోటి కోటిగుణిత మేకనామ జపాద్భవేత్ ॥ 89
కామేశ్వరాభ్యాం తదిదం కృతం నామ శతత్రయం ।
నాన్యేన తులయే దేత త్స్తోత్రేణాన్యకృతేన తు ॥ 90
శ్రియః పరంపరా యస్య భావినీ తూత్తరోత్తరం ।
తేనైవ లభ్యతే నామ్నాం త్రిశతీ సర్వకామదా ॥ 91
అస్యా నామ్నాం త్రిశత్యా స్తు మహిమా కేన వర్ణ్యతే ।
యా స్వయం శివయో ర్వక్త్ర పద్మాభ్యాం పరినిస్సృతా ॥ 92
నిత్యా షోడశికా రూపా న్విప్రా నాదౌ తు భోజయేత్ ।
అభ్యక్తాన్ గంధ తైలేన స్నాతాఽ నుష్ణేన వారిణా ॥ 93
అభ్యార్చ్య వస్త్ర గంధాద్యైః కామేశ్వర్యాది నామభిః ।
అపూపైశ్శర్కరాజ్యైశ్చ ఫలైః పుష్పై స్సుగంధిభిః ॥ 94
విద్యావిదో విశేషేణ భోజయే త్షోడశ ద్విజాన్ ।
ఏవం నిత్యబలిం కుర్యా దాదౌ బ్రాహ్మణ భోజనే ॥ 95

పశ్చాత్త్రిశత్యా నామ్నాంతు బ్రాహ్మణాన్ క్రమశోఽర్చయేత్ ।
తైలాభ్యంగాదికం దద్యా ద్విభవేసతి భక్తితః ॥ 96

శుక్ల ప్రతిపదారభ్య పౌర్ణమాస్యావధి క్రమాత్ ।
దివ సే దివసే విప్రా భోజ్యా వింశతి సంఖ్యయా ॥ 97

దశభిః పంచభి ర్వాపి తిథి రేకేన వా దినైః ।
త్రింశ త్షష్టిం శతం విప్రాన్ భోజయే త్త్రిశతం క్రమాత్ ॥ 98

ఏవం యః కురుతే భక్త్యా జన్మమధ్యే సకృన్నరః ।
తస్త్యైవం సఫలం జన్మముక్తి స్తస్య కరే స్థితౌ ॥ 99

రహస్య నామసాహస్రై రర్చనేఽప్యేవ మేవ హి ।
ఆదౌ నిత్యబలిం కుర్యా త్పశ్చా ద్బ్రాహ్మణ భోజనమ్ ॥ 100

రహస్య నామసాహస్త్ర మహిమా యో మయోదితః ।
స శీక రాణు రత్రైక నామ్నో మహిమ వారిధేః ॥ 101

వాగ్దేవీ రచితే నామ సాహస్రే యద్యదీరితం ।
త త్త త్ఫల మ వాప్నోతి నామ్నోఽప్యేకస్య కీర్తనాత్ ॥ 102

ఏత దన్యైర్జపై స్తోత్రై రర్చనై ర్యత్ఫలం భవేత్ ।
తత్ఫలం కోటి గుణితం భవేన్నామ శతత్రయాత్ ॥ 103

రహస్య నామసాహస్ర కోట్యావృత్త్యా స్తు యత్ఫలం ।
తద్భవే త్కోటి గుణితం నామత్రిశతి కీర్తనాత్ ॥ 104

వాగ్దేవీ రచితే స్తోత్రే తాదృశో మహిమా యది ।
సాక్షాత్కామేశ కామేశీ కృతేఽస్మిన్ గృహ్యతా మితి ॥ 105

సకృ త్సంకీర్తనాదేవ నామ్నా మస్మిన్ శతత్రయే ।
భవే చ్చిత్తస్య పర్యాప్తి ర్న్యూన మన్యానపేక్షిణి ॥ 106

న జ్ఞాతవ్య మిత స్త్వన్య జ్జగత్సర్వం చ కుంభజ ।
యద్య త్సాధ్యతమం కార్యం తత్తదర్థ మిదం జపేత్ ॥ 107

త త్త త్సిద్ధి మవాప్నోతి పశ్చా త్కార్యం పరీక్షయేత్ ।
యే యే ప్రసంగా స్తంత్రేషు తై స్సైర్య త్సాధ్యతే ధ్రువమ్ ॥ 108

తత్సర్వం సిద్ధ్యతి క్షిప్రం నామ త్రిశత కీర్తనాత్ ।
ఆయుష్కరం పుష్టికరం పుత్రదం వశ్యకారకమ్ ॥ 109

విద్యాప్రదం కీర్తికరం సుకవిత్వ ప్రదాయకం ।
సర్వ సంపత్ప్రదం సర్వ భోగదం సర్వ సౌఖ్యదమ్ ॥ 110

సర్వాభీష్ట ప్రదం చైవ దేవీ నామ శతత్రయం ।
ఏత జ్జపపరో భూయా న్నాన్య దిచ్ఛే త్కదాచన ॥ 111

ఏతత్కీర్తన సంతుష్టా శ్రీదేవీ లలితాంబికా ।
భక్తస్య యద్య దిష్టంస్యా త్త త్త త్పూరయతే ధ్రువమ్ ॥ 112

తస్మా త్కుంభోద్భవ మునే కీర్తయ త్వ మిదం సదా ।
అపరం కించి దపి తే బోద్ధవ్యం నావశిష్యతే ॥ 113

ఇతి తే కథితం స్తోత్రం లలితా ప్రీతిదాయకం ।
నావిద్యావేదినో బ్రూయా న్నాభక్తాయ కదాచన ॥ 114

న శఠాయ న దుష్టాయ నావిశ్వాసాయ కర్హిచిత్ ।
యో బ్రూయా త్త్రిశతీం నామ్నాంతస్యానర్థో మహాన్ భవేత్ ॥ 115

ఇత్యాజ్ఞా శాంకరీ ప్రోక్తా తస్మాద్గోప్య మిదం త్వయా ।
లలితా ప్రేరితేనైవ మయోక్తం స్తోత్ర ముత్తమమ్ ॥ 116

రహస్య నామసాహస్రా దతిగోప్య మిదం మునే ।
ఏవ ముక్త్వా హయగ్రీవః కుంభజం తాపసోత్తమం ॥ 117

స్తోత్రేణానేన లలితాం స్తుత్వా త్రిపుర సుందరీమ్ ।
ఆనందలహరీ మగ్న మానస స్సమవర్తత ॥ 118

ఇతి శ్రీ బ్రహ్మాండపురాణే, ఉత్తరఖండే, హయగ్రీవాగస్త్య సంవాదే,
లలితోపాఖ్యానే, స్తోత్రఖండే, లలితాంబా త్రిశతీ స్తోత్రరత్నం సమాప్తమ్.

61. శ్రీదేవీ ఖడ్గమాలా స్తోత్రరత్నమ్

హ్రీంకారాసనగర్భితానలశిఖాం సౌః క్లీం కళాం బిభ్రతీం
సౌవర్ణాంబరధారిణీం వరసుధా ధౌతాం త్రినేత్రోజ్జ్వలామ్
వందేపుస్తక పాశమంకుశధరాం స్రగ్భూషితాముజ్జ్వలాం
త్వాంగౌరీం త్రిపురాం పరాత్పరకళాం శ్రీచక్రసంచారిణీమ్.

అస్య శ్రీ శుద్ధశక్తిమాలామహామంత్రస్య, ఉపస్థేంద్రియా ధిష్ఠాయి వరుణాదిత్య ఋషిః దైవీ గాయత్రీచ్ఛందః సాత్విక కకార భట్టారక పీఠస్థిత కామేశ్వరాంక నిలయా మహాకామేశ్వరీ శ్రీ లలితా పరాభట్టారికా దేవతా, ఐం బీజం క్లీం శక్తిః సౌః కీలకం, మమఖడ్గ సిద్ధ్యర్థే జపేవినియోగః మూలమంత్రేణ షడంగన్యాసం కుర్యాత్,

ధ్యానము : తాదృశం ఖడ్గమాప్నోతి యేనహస్త స్థితేన వై ।
అష్టాదశ మహాద్వీప సమ్రాడ్భోక్తా భవిష్యతి ॥

ఆరక్తాభాం త్రినేత్రా మరుణిమ వసనాం రత్నతాటంకరమ్యాం ।
హస్తాంభోజైస్సపాశాంకుశ మదన ధనుస్సాయ కైర్విస్ఫురంతీం ।
ఆపీనోత్తుంగ వక్షోరుహ కలశలుఠత్తార హారోజ్జ్వలాంగీం ।
ధ్యాయేదంభోరుహస్థా మరుణిమవసనా మీశ్వరీ మీశ్వరాణామ్ ॥

లమిత్యాది పంచపూజాం కుర్యాత్, యథాశక్తి మూలమన్త్రం జపేత్.

న్యాసము :

ఓం ఐం హ్రీం శ్రీం ఐం క్లీం సౌః ఓం నమస్త్రిపురసుందరి హృదయదేవి, శిరోదేవి, శిఖాదేవి, కవచదేవి, నేత్రదేవి, అస్త్రదేవి.

షోడశ నిత్యలు :

కామేశ్వరి, భగమాలిని, నిత్యక్లిన్నే, భేరుండే, వహ్నివాసిని, మహావజ్రేశ్వరి శివదూతి త్వరితే కులసుందరి, నిత్యే, నీలపతాకే, విజయే, సర్వమంగళే, జ్వాలామాలిని, చిత్రే మహానిత్యే పరమేశ్వర పరమేశ్వరి

గురుమండలం :

మిత్రేశమయి, షష్ఠీశమయి, ఉడ్డీశమయి, చర్యానాథమయి, లోపాముద్రామయి, అగస్త్యమయి, కాలతాపనమయి, ధర్మాచార్యమయి, ముక్తకేశీశ్వరమయి, దీపకళా

నాథమయి, విష్ణుదేమయి, ప్రభాకర దేవమయి, తేజో దేవమయి, మనోజ దేవమయి, కళ్యాణ దేవమయి, వాసుదేవమయి, రత్నదేవమయి, శ్రీరామానందమయి.

ప్రథమావరణలో ప్రథమరేఖలోని దేవతలు :

అణిమాసిద్ధే, లఘిమాసిద్ధే, గరిమాసిద్ధే, మహిమాసిద్ధే, ఈశిత్వసిద్ధే, వశిత్వసిద్ధే, ప్రాకామ్యసిద్ధే, భుక్తిసిద్ధే, ఇచ్ఛాసిద్ధే, ప్రాప్తిసిద్ధే, సర్వకామసిద్ధే.

ప్రథమావరణలో ద్వితీయరేఖలోని దేవతలు :

బ్రాహ్మి, మాహేశ్వరి, కౌమారి వైష్ణవి వారాహి, మాహేంద్రి, చాముండే, మహాలక్ష్మి,

ప్రథమావరణలో తృతీయరేఖలోని దేవతలు :

సర్వసంక్షోభిణి, సర్వవిద్రావిణి, సర్వాకర్షిణి, సర్వవశంకరి, సర్వోన్మాదిని సర్వమహాంకుశే, సర్వఖేచరి, సర్వబీజే, సర్వయోనే, సర్వత్రిఖండే, త్రైలోక్య మోహన చక్రస్వామిని, ప్రకటయోగిని.

ద్వితీయావరణలోని దేవతలు :

కామాకర్షిణి, బుద్ధ్యాకర్షిణి, అహంకారాకర్షిణి, శబ్దాకర్షిణి, స్పర్శాకార్షిణి, రూపాకర్షిణి, రసాకర్షిణి, గంధాకర్షిణి, చిత్తాకర్షిణి, ధైర్యాకర్షిణి, స్మృత్యాకర్షిణి, నామాకర్షిణి, బీజాకర్షిణి, ఆత్మాకర్షిణి, అమృతాకర్షిణి, శరీరాకర్షిణి, సర్వాశా పరిపూరక చక్రస్వామిని, గుప్తయోగిని.

తృతీయావరణలోని దేవతలు :

అనంగకుసుమే, అనంగమేఖలే, అనంగమదనే, అనంగమదనాతురే, అనంగరేఖే, అనంగవేగిని, అనంగాంకుశే అనంగమాలిని, సర్వసంక్షోభణ చక్రస్వామిని, గుప్తతరయోగిని.

చతుర్థావరణలోని దేవతలు :

సర్వసంక్షోభిణి, సర్వవిద్రావిణి, సర్వాకర్షిణి, సర్వాహ్లాదిని, సర్వసమ్మోహిని, సర్వస్తంభిని, సర్వజృంభిణి, సర్వవశంకరి, సర్వరంజని, సర్వోన్మాదిని, సర్వార్థసాధికే, సర్వసంప్తిపూరణి, సర్వమంత్రమయి, సర్వద్వంద్వ క్షయంకరి, సర్వసౌభాగ్యదాయక చక్రస్వామిని, సంప్రదాయ యోగిని.

పంచమావరణలోని దేవతలు :

సర్వసిద్ధిప్రదే, సర్వసంపత్ప్రదే సర్వప్రియంకరి, సర్వమంగళకారిణి, సర్వకామప్రదే, సర్వదుఃఖ విమోచని, సర్వమృత్యుప్రశమని, సర్వవిఘ్న నివారిణి, సర్వాంగసుందరి, సర్వసౌభాగ్యదాయిని, సర్వార్థ సాధక చక్రస్వామిని, కుళోత్తీర్ణయోగిని.

షష్ఠావరణలోని దేవతలు :

సర్వజ్ఞే సర్వశక్తే సర్వైశ్వర్యప్రదాయిని సర్వజ్ఞానమయి సర్వవ్యాధి వినాశిని, సర్వాధార స్వరూపే, సర్వపాపహరే, సర్వానందమయి, సర్వరక్షా స్వరూపిణి, సర్వేప్సిత ఫలప్రదే, సర్వ రక్షాకరచక్ర స్వామిని, నిగర్భయోగిని.

సప్తమావరణలోని దేవతలు :

వశిని, కామేశ్వరి, మోదిని, విమలే, అరుణి జయిని, సర్వేశ్వరి, కౌళిని, సర్వరోగహర చక్రస్వామిని, రహస్యయోగిని.

అష్టమావరణలోని దేవతలు :

బాణిని, చాపిని, పాశిని, అంకుశిని, మహాకామేశ్వరి మహావజ్రేశ్వరి, మహా భగమాలిని, సర్వసిద్ధిప్రద చక్రస్వామిని, అతిరహస్యయోగిని.

నవమావరణలోని దేవత :


శ్రీశ్రీ మహాభట్టారికే, సర్వానందమయ చక్రస్వామిని పరాపర రహస్యయోగిని,

నవావరణల అధిదేవతలు :

త్రిపురే, త్రిపురేశి, త్రిపురసుందరి, త్రిపురవాసిని త్రిపురా శ్రీః త్రిపురమాలిని, త్రిపురాసిద్ధే, త్రిపురాంబ, మహా త్రిపుర సుందరి.

మహామహేశ్వరి, మహామహారాజ్ఞి, మహామహాశక్తే, మహామహా గుప్తే, మహా మహాజ్ఞప్తే, మహామహానందే, మహామహాస్కంధే, మహామహాశయే మహామహా శ్రీచక్రనగర సామ్రాజ్ఞి ! నమస్తే నమస్తే నమస్తే నమః.

నవావరణలు



62. అకారాదిగ అనుక్రమణిక

375. కామపూజితా
796. కామరూపిణీ
455. కామరూపిణీ
587. కామసేవితా
62. కామాక్షీ
39. కామేశజ్ఞాతసౌభాగ్యమార్దవోరు ద్వయాన్వితా
30. కామేశబద్ధమాంగల్యసూత్ర శోభితకంధరా
373. కామేశ్వరప్రాణనాడీ
33. కామేశ్వరప్రేమరత్నమణి ప్రతిపణస్తనీ
77. కామేశ్వరముఖాలోక కల్పిత శ్రీగణేశ్వరా
82. కామేశ్వరాస్త్రనిర్దగ్ధసభండా సురశూన్యకా
321. కామ్యా
860. కార్యకారణనిర్ముక్తా
465. కాలకంఠీ
558. కాలహంత్రీ
492. కాళరాత్ర్యాదిశక్త్యౌఘవృతా
798. కావ్యకలా
614. కావ్యాలాపవినోదినీ
857. కాష్ఠా
70. కిరిచక్రరథారూఢదండనా థాపురస్కృతా
622. క్లీంకారీ
110. కుండలినీ
442. కుమారగణనాథాంబా
438. కురుకుల్లా
14. కురువిందమణిశ్రేణీకనత్కోటీర మండితా
440. కులకుండాలయా
91. కులసంకేతపాలినీ
92. కులాంగనా
93. కులాంతస్థా
90. కులామృతైకరసికా
95. కులయోగినీ
895. కులరూపిణీ
439. కులేశ్వరీ
714. కులోత్తీర్ణా
436. కుశలా
894. కూటస్థా
43. కూర్మపృష్ఠజయిష్ణుప్రపదాన్వితా
374. కృతజ్ఞా
623. కేవలా
925. కేవలా
625. కైవల్యపదదాయినీ
721. కోమలాంగీ
437. కోమలాకారా
691. కోశనాథా
441. కౌలమార్గతత్పరసేవితా
94. కౌలినీ
924. కౌలినీ
169. క్రోధశమనీ
9. క్రోధాకారాంకుశోజ్జ్వలా

ఖ (1)

479. ఖట్వాంగాది ప్రహరణా

గ (24)

852. గంభీరా
853. గగనాంతఃస్థా
719. గణాంబా

636. గంధర్వసేవితా
854. గర్వితా
855. గానలోలుపా
420. గాయత్రీ
502. గుడాన్నప్రీతమానసా
605. గుణనిధిః
961. గుణాతీతా
604. గురుమూర్తిః
722. గురుప్రియా
713. గురుమండలరూపిణీ
607. గుహజన్మభూః
707. గుహాంబా
708. గుహ్యరూపిణీ
720. గుహ్యకారాధ్యా
624. గుహ్యా
42. గూఢగుల్ఫా
69. గేయచక్రరథారూఢ మంత్రిణీపరి సేవితా
266. గోప్త్రీ
606. గోమాతా
267. గోవిందరూపిణీ
635. గౌరీ

చ (29)

68. చక్రరాజరథారూఢసర్వాయుధ పరిష్కృతా
245. చక్రరాజనికేతనా
756. చండముండాసురనిషూదినీ
755. చండికా
692. చతురంగబలేశ్వరీ
506. చతుర్వక్త్రమనోహరా
235. చతుఃషష్ట్యుపచారాధ్యా
236. చతుఃషష్టికళామయీ
434. చందనద్రవదిగ్ధాంగీ
593. చంద్రనిభా
240. చంద్రమండలమధ్యగా
239. చంద్రవిద్యా
7. చతుర్బాహుసమన్వితా
13. చంపకాశోకపున్నాగసౌగంధిక లసత్కచా
244. చరాచరజగన్నాథా
435. చాంపేయకుసుమప్రియా
243. చారుచంద్రకళాధరా
241. చారురూపా
242. చారుహాసా
416. చిచ్ఛక్తిః
362. చితిః
728. చిత్కలా
4. చిదగ్నికుండసంభూతా
364. చిదేకరసరూపిణీ
57. చింతామణిగృహాంతఃస్థా
251. చిన్మయీ
417. చేతనారూపా
916. చైతన్యార్ఘ్యసమారాధ్యా
917. చైతన్యకుసుమప్రియా

ఛ (1)

842. ఛందస్సారా

జ (18)

325. జగతీకందా
935. జగద్ధాత్రీ

418. జడశక్తిః
419. జడాత్మికా
849. జన్మమృత్యుజరాతప్తజనవిశ్రాంతి దాయినీ
766. జపాపుష్పనిభాకృతిః
788. జయత్సేనా
377. జయా
745. జరాధ్వాంతరవిప్రభా
257. జాగరిణీ
378. జాలంధరస్థితా
71. జ్వాలామాలినికాక్షిప్తవహ్ని ప్రాకార మధ్యగా
664. జైత్రీ
981. జ్ఞానగమ్యా
643. జ్ఞానదా
644. జ్ఞానవిగ్రహా
980. జ్ఞానముద్రా
982. జ్ఞానజ్ఞేయస్వరూపిణీ

డ (2)

485. డాకినీశ్వరీ
499. డామర్యాదిభిరావృతా

త (46)

107. తటిల్లతాసమరుచిః
425. తత్
363. తత్పదలక్ష్యార్థా
906. తత్త్వమర్థస్వరూపిణీ
905. తత్త్వమయీ
904. తత్త్వాధికా
424. తత్త్వాసనా
360. తనుమధ్యా
361. తమోఽపహా
920. తరుణాదిత్యపాటలా
358. తరుణీ
845. తలోదరీ
22. తాటంకయుగళీభూతతప నోడుప మండలా
357. తాపత్రయాగ్నిసంతప్తసమా హ్లాదనచంద్రికా
359. తాపసారాధ్యా
560. తాంబూలపూరితముఖీ
20. తారాకాంతితిరస్కారినాసాభరణ భూషితా
270. తిరోధానకరీ
262. తుర్యా
443. తుష్టిః
452. తేజోవతీ
259. తైజసాత్మికా
870. త్రయీ
589. త్రికూటా
986. త్రికోణగా
598. త్రికోణాంతరదీపికా
984. త్రిఖండేశీ
763. త్రిగుణాత్మికా
985. త్రిగుణాంబా
627. త్రిజగద్వంద్యా
629. త్రిదశేశ్వరీ
453. త్రినయనా
873. త్రిపురమాలినీ
626. త్రిపురా
976. త్రిపురాంబికా

978. త్రిపురా
787. త్రిపురేశీ
628. త్రిమూర్తిః
478. త్రిలోచనా
760. త్రివర్గదాత్రీ
871. త్రివర్గనిలయా
872. త్రిస్థా
762. త్ర్యంబకా
630. త్ర్యక్షరీ
482. త్వక్స్థా
426. త్వమ్

ద (38)

489. దంష్ట్రోజ్జ్వలా
601. దక్షయజ్ఞవినాశినీ
921. దక్షిణా
922. దక్షిణారాధ్యా
725. దక్షిణామూర్తిరూపిణీ
609. దండనీతిస్థా
513. దధ్యన్నాసక్తహృదయా
582. దయామూర్తిః
603. దరహాసోజ్జ్వలన్ముఖీ
923. దరస్మేరముఖాంబుజా
602. దరాందోళితదీర్ఘాక్షీ
977. దశముద్రాసమారాధ్యా
610. దహరాకాశరూపిణీ
599. దాక్షాయణీ
561. దాడిమీకుసుమప్రభా
631. దివ్యగంధాఢ్యా
621. దివ్యవిగ్రహా
696. దీక్షితా
191. దుఃఖహంత్రీ
194. దురాచారశమనీ
771. దురారాధ్యా
772. దురాధర్షా
189. దుర్గమా
188. దుర్లభా
190. దుర్గా
193. దుష్టదూరా
650. దృశ్యరహితా
5. దేవకార్యసముద్యతా
64. దేవర్షిగణసంఘాతస్తూయ మానాత్మ వైభవా
608. దేవేశీ
702. దేశకాలాపరిచ్ఛిన్నా
697. దైత్యశమనీ
600. దైత్యహంత్రీ
195. దోషవర్జితా
744. దౌర్భాగ్యతూలవాతూలా
768. ద్యుతిధరా
423. ద్విజబృందనిషేవితా
669. ద్వైతవర్జితా

ధ (14)

884. ధనధాన్యవివర్ధినీ
883. ధనాధ్యక్షా
957. ధన్యా
956. ధరసుతా
955. ధరా
959. ధర్మవర్ధినీ
255. ధర్మాధర్మవివర్జితా

882. ధర్మాధారా
958. ధర్మిణీ
446. ధృతిః
641. ధ్యానగమ్యా
254. ధ్యానధ్యాతృధ్యేయరూపా
915. ధీరసమర్చితా
914. ధీరా

న (76)

44. నఖదీధితిసంఛన్నసమజ్జన తమోగుణా
734. నటేశ్వరీ
450. నందినీ
733. నందివిద్యా
19. నవచంపకపుష్పాభనాసా దండవిరాజితా
24. నవవిద్రుమబింబశ్రీన్యక్కారిరదనచ్ఛదా
461. నళినీ
899. నాదరూపిణీ
299. నాదరూపా
34. నాభ్యాలవాలరోమాళిలతా ఫలకుచద్వయీ
732. నామపారాయణప్రీతా
300. నామరూపవివర్జితా
298. నారాయణీ
570. నిఖిలేశ్వరీ
27. నిజసంల్లాపమాధుర్యవినిర్భర్త్సితకచ్ఛపీ
12. నిజారుణప్రభాపూరమజ్జద్బ్రహ్మాండమండలా
287. నిజాజ్ఞారూపనిగమా
388. నిత్యక్లిన్నా
567. నిత్యతృప్తా
815. నిత్యతృప్తా
149. నిత్యబుద్ధా
144. నిత్యముక్తా
430. నిత్యయౌవనా
148. నిత్యశుద్ధా
136. నిత్యా
73. నిత్యాపరాక్రమాటోపనిరీక్షణసముత్సుకా
391. నిత్యాషోడశికారూపా
569. నియంత్రీ
133. నిరంజనా
151. నిరంతరా
187. నిరత్యయా
186. నిరపాయా
150. నిరవద్యా
161. నిరహంకారా
137. నిరాకారా
138. నిరాకులా
132. నిరాధారా
177. నిరాబాధా
874. నిరామయా
875. నిరాలంబా
147. నిరాశ్రయా
155. నిరీశ్వరా
389. నిరుపమా
143. నిరుపప్లవా
154. నిరుపాధిః
139. నిర్గుణా
390. నిర్వాణసుఖదాయినీ
176. నిర్వికల్పా

145. నిర్వికారా
180. నిర్నాశా
174. నిర్భవా
178. నిర్భేదా
158. నిర్మదా
164. నిర్మమా
135. నిర్మలా
162. నిర్మోహా
134. నిర్లేపా
170. నిర్లోభా
668. నిర్ద్వైతా
160. నిశ్చింతా
153. నిష్కళంకా
140. నిష్కలా
182. నిష్క్రియా
183. నిష్పరిగ్రహా
146. నిష్ప్రపంచా
142. నిష్కామా
152. నిష్కారణా
168. నిష్క్రోధా
166. నిష్పాపా
172. నిస్సంశయా
429. నిస్సీమమహిమా
184. నిస్తులా
789. నిస్త్రైగుణ్యా
156. నీరాగా
185. నీలచికురా
898. నైష్కర్మ్యా

ప (82)

274. పంచకృత్యపరాయణా
428. పంచకోశాంతరస్థితా
11. పంచతన్మాత్రసాయకా
946. పంచయజ్ఞప్రియా
947. పంచప్రేతమంచాధిశాయినీ
249. పంచప్రేతాసనాసీనా
250. పంచబ్రహ్మస్వరూపిణీ
58. పంచబ్రహ్మాసనస్థితా
948. పంచమీ
949. పంచభూతేశీ
516. పంచవక్త్రా
950. పంచసంఖ్యోపచారిణీ
831. పంచాశత్పీఠరూపిణీ
45. పదద్వయప్రభాజాలపరా కృతసరోరుహా
247. పద్మనయనా
280. పద్మనాభసహోదరీ
23. పద్మరాగశిలాదర్శపరిభావికపోలభూః
248. పద్మరాగసమప్రభా
278. పద్మాసనా
369. పరదేవతా
812. పరమంత్రవిభేదినీ
252. పరమానందా
808. పరమాణుః
618. పరమా
396. పరమేశ్వరీ
939. పరమోదారా
806. పరంజ్యోతిః
807. పరంధామ
574. పరానిష్ఠా
573. పరాశక్తిః

366. పరా
782. పరాకాశా
809. పరాత్పరా
790. పరాపరా
940. పరామోదా
354. పశుపాశవిమోచనీ
483. పశులోకభయంకరీ
368. పశ్యంతీ
773. పాటలీకుసుమప్రియా
167. పాపనాశనీ
743. పాపారణ్యదవానలా
481. పాయసాన్నప్రియా
246. పార్వతీ
619. పావనాకృతిః
811. పాశహంత్రీ
810. పాశహస్తా
594. ఫాలాస్థా
508. పీతవర్ణా
543. పుణ్యకీర్తిః
544. పుణ్యలభ్యా
545. పుణ్యశ్రవణకీర్తనా
288. పుణ్యాపుణ్యఫలప్రదా
802. పురాతనా
291. పురుషార్థప్రదా
546. పులోమజాఽర్చితా
801. పుష్టా
444. పుష్టిః
804. పుష్కరా
805. పుష్కరేక్షణా
803. పూజ్యా
975. పూర్వజా
292. పూర్ణా
828. ప్రకటాకృతిః
938. ప్రగల్భా
826. ప్రచండాజ్ఞా
575. ప్రజ్ఞానఘనరూపిణీ
611. ప్రతివన్ముఖ్యరాకాంతతిధి మండలపూజితా
827. ప్రతిష్ఠా
367. ప్రత్యక్చితీరూపా
781. ప్రత్యగ్రూపా
393. ప్రభావతీ
394. ప్రభారూపా
825. ప్రసవిత్రీ
395. ప్రసిద్ధా
261. ప్రాజ్ఞాత్మికా
783. ప్రాణదా
830. ప్రాణధాత్రీ
784. ప్రాణరూపిణీ
829. ప్రాణేశ్వరీ
731. ప్రియంకరీ
770. ప్రియవ్రతా
730. ప్రేమరూపా

బ (24)

547. బంధమోచనీ
512. బందిన్యాదిసమన్వితా
964. బంధూకకుసుమప్రఖ్యా
548. బంధురాలకా
678. బలిప్రియా
869. బహిర్ముఖసుదుర్లభా
823. బహురూపా
965. బాలా
974. బిందుతర్పణసంతుష్టా
380. బిందుమండలవాసినీ
111. బిసతంతుతనీయసీ
824. బుధార్చితా
674. బృహతీ
680. బృహత్సేనా
903. బైందవాసనా
100. బ్రహ్మగ్రంథివిభేదినీ
265. బ్రహ్మరూపా
822. బ్రహ్మజనని
673. బ్రహ్మాత్మైక్యస్వరూపిణీ
677. బ్రహ్మానందా
821. బ్రహ్మాణీ
83. బ్రహ్మోపేంద్రమహేంద్రాది దేవసంస్తుతవైభవా
675. బ్రాహ్మణీ
676. బ్రాహ్మీ

భ (36)

747. భక్తచిత్తకేకిఘనాఘనా
568. భక్తనిధిః
372. భక్తమానసహంసికా
117. భక్తసౌభాగ్యదాయినీ
404. భక్తహార్దతమోభేదభానుమద్భాను సంతతిః
119. భక్తిగమ్యా
118. భక్తిప్రియా
353. భక్తిమత్కల్పలతికా
120. భక్తివశ్యా
277. భగమాలినీ
279. భగవతీ
715. భగారాధ్యా
74. భండపుత్రవధోద్యుక్తబాలా విక్రమనందితా
72. భండసైన్యవధోద్యుక్తశక్తివిక్ర మహర్షితా
65. భండాసురవధోద్యుక్తశక్తిసేనా సమన్వితా
79. భండాసురేంద్రనిర్ముక్తశస్త్ర ప్రత్యస్త్ర వర్షిణీ
115. భద్రప్రియా
116. భద్రమూర్తి
121. భయాపహా
841. భవచక్రప్రవర్తినీ
742. భవదావసుధావృష్టిః
175. భవనాశినీ
840. భవరోగఘ్నీ
112. భవానీ
114. భవారణ్యకుఠారికా
746. భాగ్యాబ్ధిచంద్రికా
275. భానుమండలమధ్యస్థా
839. భావజ్ఞా
113. భావనాగమ్యా
681. భావాభావవివర్జితా
679. భాషారూపా
294. భువనేశ్వరీ
667. భూమరూపా

179. భేదనాశినీ
276. భైరవీ
293. భోగినీ

మ (112)

933. మంగళాకృతిః
525. మజ్జాసంస్థా
445. మతిః
577. మత్తా
776. మందారకుసుమప్రియా
101. మణిపూరాంతరుదితా
496. మణిపూరాబ్జనిలయా
432. మదఘూర్ణితరక్తాక్షీ
159. మదనాశినీ
433. మదపాటలగండభూః
431. మదశాలినీ
511. మధుప్రీతా
717. మధుమతీ
370. మధ్యమా
930. మనస్వినీ
238. మనువిద్యా
207. మనోన్మనీ
941. మనోమయీ
10. మనోరూపేక్షుకోదండా
415. మనోవాచామగోచరా
844. మంత్రసారా
786. మంత్రిణీన్యస్తరాజ్యధూః
75. మంత్రిణ్యంబావిరచిత విషంగవధతోషితా
28. మందస్మితప్రభాపూరమజ్జత్కామేశమానసా
165. మమతాహంత్రీ
47. మరాళీమందగమనా
459. మలయాచలవాసినీ
774. మహతీ
581. మహనీయా
403. మహాకామేశనయనకుముదాహ్లాదకౌముదీ
233. మహాకామేశమహిషీ
751. మహాకాళీ
579. మహాకైలాసనిలయా
78. మహాగణేశనిర్భిన్న విఘ్నయంత్రప్రహర్షితా
752. మహాగ్రాసా
237. మహాచతుష్షష్టికోటియోగినీగణసేవితా
226. మహాతంత్రా
234. మహాత్రిపురసుందరీ
209. మహాదేవీ
59. మహాపద్మాటవీసంస్థా
81. మహాపాశుపతాస్త్రాగ్ని నిర్దగ్ధాసురసైనికా
214. మహాపాతకనాశినీ
213. మహాపూజ్యా
572. మహాప్రళయసాక్షిణీ
222. మహాబలా
223. మహాబుద్ధిః
231. మహాభైరవపూజితా
219. మహాభోగా
227. మహామంత్రా
215. మహామాయా

228. మహాయంత్రా
230. మహాయాగక్రమారాధ్యా
225. మహాయోగేశ్వరీశ్వరీ
218. మహారతిః
212. మహారూపా
210. మహాలక్ష్మీ
48. మహాలావణ్యశేవధిః
585. మహావిద్యా
494. మహావీరేంద్రవరదా
221. మహావీర్యా
217. మహాశక్తిః
753. మహాశనా
109. మహాసక్తిః
216. మహాసత్త్వా
229. మహాసనా
583. మహాసామ్రాజ్యశాలినీ
224. మహాసిద్ధిః
718. మహీ
220. మహైశ్వర్యా
932. మహేశీ
232. మహేశ్వరమహాకల్పమహాతాండవసాక్షిణీ
750. మహేశ్వరీ
501. మాంసనిష్ఠా
40. మాణిక్యమకుటాకారజానుద్వయవిరాజితా
458. మాతా
578. మాతృకావర్ణరూపిణీ
576. మాధ్వీపానాలసా
931. మానవతీ
716. మాయా
785. మార్తాండభైరవారాధ్యా
456. మాలినీ
208. మాహేశ్వరీ
566. మిత్రరూపిణీ
735. మిథ్యాజగదధిష్ఠానా
836. ముకుందా
736. ముక్తిదా
837. ముక్తినిలయా
737. ముక్తిరూపిణీ
16. ముఖచంద్రకళంకాభమృగనాభివిశేషకా
564. ముఖ్యా
866. ముగ్ధా
520. ముద్గౌదనాసక్తచిత్తా
816. మునిమానసహంసికా
813. మూర్తా
89. మూలకూటత్రయకళేబరా
397. మూలప్రకృతిః
88. మూలమంత్రాత్మికా
838. మూలవిగ్రహరూపిణీ
515. మూలాధారాంబుజారూఢా
99. మూలాధారైకనిలయా
562. మృగాక్షీ
211. మృడప్రియా
565. మృడానీ
580. మృణాళమృదుదోర్లతా
749. మృత్యుదారుకుఠారికా
181. మృత్యుమథనీ
510. మేదోనిష్ఠా

539. మేధా
775. మేరునిలయా
571. మైత్ర్యాదివాసనాలభ్యా
163. మోహనాశినీ
563. మోహినీ

య (13)

881. యజమానస్వరూపిణీ
880. యజ్ఞకర్త్రీ
879. యజ్ఞప్రియా
769. యజ్ఞరూపా
475. యశస్వినీ
535. యాకిన్యంబాస్వరూపిణీ
657. యుగంధరా
654. యోగదా
656. యోగానందా
653. యోగినీ
655. యోగ్యా
893. యోనినిలయా
983. యోనిముద్రా

ర (38)

309. రంజనీ
741. రంభాదివందితా
500. రక్తవర్ణా
312. రణత్కింకిణిమేఖలా
316. రతిప్రియా
315. రతిరూపా
38. రత్నకింకిణికారమ్యరశనా దామభూషితా
32. రత్నగ్రైవేయచింతాకలోల ముక్తాఫలాన్వితా
317. రక్షాకరీ
320. రమణలంపటా
310. రమణీ
313. రమా
307. రమ్యా
597. రవిప్రఖ్యా
799. రసజ్ఞా
800. రసశేవధిః
311. రస్యా
382. రహస్తర్పణతర్పితా
381. రహోయాగక్రమారాధ్యా
495. రాకిణ్యంబాస్వరూపిణీ
314. రాకేందువదనా
318. రాక్షసఘ్నీ
157. రాగమథనీ
8. రాగస్వరూపపాశాఢ్యా
688. రాజత్కృపా
689. రాజపీఠనివేశితనిజాశ్రిత
305. రాజరాజార్చితా
685. రాజరాజేశ్వరీ
308. రాజీవలోచనా
306. రాజ్ఞీ
686. రాజ్యదాయినీ
690. రాజ్యలక్ష్మీః
687. రాజ్యవల్లభా
319. రామా
104. రుద్రగ్రంథివిభేదినీ
269. రుద్రరూపా
491. రుధిరసంస్థితా
748. రోగపర్వతదంభోళిః

ల (14)

35. లక్ష్యరోమలతాధారతానము న్నేయమధ్యమా
740. లజ్జా
739. లయకరీ
1000. లలితాంబికా
504. లాకిన్యంబాస్వరూపిణీ
738. లాస్యప్రియా
648. లీలాక్లప్తబ్రహ్మాండ మండలా
863. లీలావిగ్రహధారిణీ
966. లీలావినోదినీ
665. లోకయాత్రావిధాయినీ
960. లోకాతీతా
647. లోపాముద్రాఽర్చితా
171. లోభనాశినీ
454. లోలాక్షీ

వ (79)

17. వదనస్మర మాంగల్య గృహతోరణ చిల్లికా
18. వక్త్రలక్ష్మీ పరీవాహచలన్మీ నాభలోచనా
498. వజ్రాదికాయుధోపేతా
944. వజ్రిణీ
469. వజ్రేశ్వరీ
497. వదనత్రయసంయుతా
488. వదనద్వయా
480. వదనైకసమన్వితా
349. వందారుజనవత్సలా
348. వంద్యా
471. వయోఽవస్థావివర్జితా
331. వరదా
519. వరదాదినిషేవితా
848. వర్ణరూపిణీ
286. వర్ణాశ్రమవిధాయినీ
671. వసుదా
352. వహ్నిమండలవాసినీ
989. వాంఛితార్థప్రదాయినీ
640. వాగధీశ్వరీ
350. వాగ్వాదినీ
351. వామకేశీ
945. వామకేశ్వరీ
470. వామదేవీ
332. వామనయనా
333. వారుణీమదవిహ్వలా
451. విఘ్ననాశినీ
346. విజయా
651. విజ్ఞాత్రీ
900. విజ్ఞానకలనా
253. విజ్ఞానఘనరూపిణీ
902. విదగ్ధా
550. విద్యా
402. విద్యాఽవిద్యాస్వరూపిణీ
889. విద్రుమాభా
337. విధాత్రీ
336. వింధ్యాచలనివాసినీ
885. విప్రప్రియా
886. విప్రరూపా
549. విమర్శరూపిణీ
347. విమలా
943. విమానస్థా

835. వియత్ప్రసూః
551. వియదాదిజగత్ప్రసూః
779. విరజాః
937. విరాగిణీ
778. విరాడ్రూపా
340. విలాసినీ
833. వివిక్తస్థా
401. వివిధాకారా
936. విశాలాక్షీ
76. విశుక్రప్రాణహరణ వారాహీ వీర్యనందితా
476. విశుద్ధిచక్రనిలయా
832. విశృంఖలా
637. విశ్వగర్భా
888. విశ్వగ్రాసా
780. విశ్వతోముఖీ
759. విశ్వధారిణీ
887. విశ్వభ్రమణకారిణీ
256. విశ్వరూపా
334. విశ్వాధికా
384. విశ్వసాక్షిణీ
934. విశ్వమాతా
102. విష్ణుగ్రంథివిభేదినీ
339. విష్ణుమాయా
891. విష్ణురూపిణీ
896. వీరగోష్ఠీప్రియా
834. వీరమాతా
897. వీరా
777. వీరారాధ్యా
672. వృద్ధా
338. వేదజననీ
335. వేదవేద్యా
652. వేద్యవర్జితా
371. వైఖరీరూపా
890. వైష్ణవీ
399. వ్యక్తావ్యక్తస్వరూపిణీ
400. వ్యాపినీ
421. వ్యాహృతిః
942. వ్యోమకేశీ

శ (62)

954. శంభుమోహినీ
87. శక్తికూటైకతాపన్న కట్యధో భాగధారిణీ
963. శమాత్మికా
129. శరచ్చంద్రనిభాననా
125. శర్మదాయినీ
953. శర్మదా
124. శర్వాణీ
122. శాంభవీ
126. శాంకరీ
130. శాతోదరీ
141. శాంతా
131. శాంతిమతీ
447. శాంతిః
851. శాంత్యతీతకళాత్మికా
46. శింజానమణి మంజీర మండిత శ్రీపదాంబుజా
123. శారదారాధ్యా
951. శాశ్వతీ
952. శాశ్వతైశ్వర్యా
706. శాస్త్రమయీ
843. శాస్త్రసారా
592. శిరఃస్థితా
408. శివంకరీ
52. శివకామేశ్వరాంకస్థా
727. శివజ్ఞానప్రదాయినీ
405. శివదూతీ
410. శివపరా
409. శివప్రియా
407. శివమూర్తిః
999. శివశక్త్యైక్యరూపిణీ
53. శివా
406. శివారాధ్యా
412. శిష్టపూజితా
411. శిష్టేష్టా
523. శుక్లవర్ణా
532. శుక్లసంస్థితా
973. శుద్ధమానసా
25. శుద్ధవిద్యాంకురాకారద్విజ పంక్తి ద్వయోజ్జ్వలా
765. శుద్ధా
683. శుభకరీ
761. శుభగా
507. శూలాద్యాయుధసంపన్నా
376. శృంగారరససంపూర్ణా
634. శైలేంద్రతనయా
684. శోభనాసులభాగతిః
463. శోభనా
487. శ్యామాభా
392. శ్రీకంఠార్ధశరీరిణీ
127. శ్రీకరీ
996. శ్రీచక్రరాజనిలయా
997. శ్రీమత్త్రిపురసుందరీ
3. శ్రీమత్సింహాసనేశ్వరీ
85. శ్రీమద్వాగ్భవకూటైక స్వరూప ముఖ పంకజా
56. శ్రీమన్నగరనాయికా
2. శ్రీమహారాజ్ఞీ
1. శ్రీమతా
979. శ్రీవశంకరీ
586. శ్రీవిద్యా
998. శ్రీశివా
588. శ్రీషోడశాక్షరీవిద్యా
540. శ్రుతిః
929. శ్రుతిసంస్తుతవైభవా
289. శ్రుతిసీమంతసిందూరీకృత పాదాబ్జధూళికా

ష (5)

386. షడంగదేవతాయుక్తా
991. షడధ్వాతీతరూపిణీ
524. షడాననా
108. షట్చక్రోపరిసంస్థితా
387. షాడ్గుణ్యపరిపూరితా

స (120)

422. సంధ్యా
66. సంపత్కరీసరూరాధ సింధుర వ్రజసేవితా
711. సంప్రదాయేశ్వరీ
173. సంశయఘ్నీ

878. సంసారపంక నిర్మగ్న ముద్ధరణ పండితా
355. సంహృతాశేషపాషండా
268. సంహారిణీ
290. సకలాగమసందోహశుక్తిసంపుటమౌక్తికా
615. సచామరరమావాణీసవ్య దక్షిణ సేవితా
701. సచ్చిదానందరూపిణీ
820. సతీ
791. సత్యజ్ఞానానందరూపా
818. సత్యరూపా
817. సత్యవ్రతా
694. సత్యసంధా
646. సత్యానందస్వరూపిణీ
661. సదసద్రూపధారిణీ
356. సదాచారప్రవర్తికా
710. సదాశివపతివ్రతా
909. సదాశివకుటుంబినీ
272. సదాశివా
919. సదాతుష్టా
918. సదోదితా
201. సద్గతిప్రదా
383. సద్యఃప్రసాదినీ
726. సనకాదిసమారాధ్యా
98. సమయాచారతత్పరా
97. సమయాంతస్థా
503. సమస్తభక్తసుఖదా
198. సమానాధికవర్జితా
705. సరస్వతీ

196. సర్వజ్ఞా
200. సర్వమంగళా
199. సర్వశక్తిమయీ
724. సర్వతంత్రేశీ
206. సర్వతంత్రరూపా
204. సర్వమంత్రస్వరూపిణీ
205. సర్వయంత్రాత్మికా
203. సర్వమయీ
202. సర్వేశ్వరీ
533. సర్వతోముఖీ
553. సర్వమృత్యునివారిణీ
530. సర్వవర్ణోపశోభితా
552. సర్వవ్యాధిప్రశమనీ
645. సర్వవేదాంతసంవేద్యా
698. సర్వలోకవశంకరీ
758. సర్వలోకేశీ
703. సర్వగా
704. సర్వమోహినీ
962. సర్వాతీతా
659. సర్వాధారా
995. సర్వానుల్లంఘ్యశాసనా
819. సర్వాంతర్యామిణీ
51. సర్వాభరణభూషితా
531. సర్వాయుధధరా
49. సర్వారుణా
263. సర్వావస్థావివర్జితా
699. సర్వార్థదాత్రీ
911. సర్వాపద్వినివారిణీ
709. సర్వోపాధివినిర్ముక్తా

850. సర్వోపనిషదుద్ఘుష్టా
534. సర్వౌదనప్రీతచిత్తా
910. సవ్యాపసవ్యమార్గస్థా
284. సహస్రపాత్
283. సహస్రాక్షీ
105. సహస్రారాంబుజారూఢా
282. సహస్రశీర్షవదనా
529. సహస్రదళపద్మస్థా
521. సాకిన్యంబాస్వరూపిణీ
385. సాక్షివర్జితా
695. సాగరమేఖలా
712. సాధ్వీ
128. సాధ్వీ
197. సాంద్రకరుణా
907. సామగానప్రియా
792. సామరస్యపరాయణా
693. సామ్రాజ్యదాయినీ
700. సావిత్రీ
632. సిందూరతిలకాంచితా
473. సిద్ధవిద్యా
474. సిద్ధమాతా
472. సిద్ధేశ్వరీ
192. సుఖప్రదా
968. సుఖకరీ
682. సుఖారాధ్యా
106. సుధాసారాభివర్షిణీ
61. సుధాసాగరమధ్యస్థా
877. సుధాసృతిః
660. సుప్రతిష్ఠా

260. సుప్తా
462. సుభ్రూః
967. సుమంగళీ
460. సుముఖీ
55. సుమేరుశృంగమధ్యస్థా
464. సురనాయికా
970. సువాసినీ
971. సువాసిన్యర్చనప్రీతా
969. సువేషాఢ్యా
468. సూక్ష్మరూపిణీ
264. సృష్టికర్త్రీ
908. సౌమ్యా (సోమ్యా)
36. స్తనభారదళన్మధ్యపట్టబంధవళిత్రయా
928. స్తుతిమతీ
927. స్తోత్రప్రియా
493. స్నిగ్ధౌదనప్రియా
541. స్మృతిః
723. స్వతంత్రా
537. స్వధా
258. స్వపంతీ
913. స్వభావమధురా
764. స్వర్గాపవర్గదా
638. స్వర్ణగర్భా
912. స్వస్థా
448. స్వస్తిమతీ
414. స్వప్రకాశా
365. స్వాత్మానందలవీభూత బ్రహ్మాద్యానంద సంతతిః

876. స్వాత్మారామా
505. స్వాధిష్ఠానాంబుజగతా
54. స్వాధీనవల్లభా
536. స్వాహా

హ (11)

457. హంసినీ
526. హంసవతీముఖ్యశక్తి సమన్వితా
84. హరనేత్రాగ్నిసందగ్ధకామసంజీవనౌషధిః
527. హరిద్రాన్నైకరసికా
297. హరిబ్రహ్మేంద్రసేవితా
528. హాకినీరూపధారిణీ
596. హృదయస్థా
303. హృద్యా
304. హేయోపాదేయవర్జితా
301. హ్రీంకారీ
302. హ్రీమతీ

క్ష (9)

865. క్షయవినిర్ముక్తా
344. క్షయవృద్ధివినిర్ముక్తా
757. క్షరాక్షరాత్మికా
867. క్షిప్రప్రసాదినీ
343. క్షేత్రక్షేత్రజ్ఞపాలినీ
345. క్షేత్రపాలసమర్చితా
341. క్షేత్రస్వరూపా
342. క్షేత్రేశీ
466. క్షోభిణీ

1.	అకారాది నామములు	39
2.	ఆకారాది నామములు	9
3.	ఇకారాది నామములు	3
4.	ఈకారాది నామములు	1
5.	ఉకారాది నామములు	5
6.	ఏకారాది నామములు	1
7.	ఓకారాది నామములు	2
8.	అంకారాది నామములు	3
9.	కకారాది నామములు	83
10.	ఖకారాది నామములు	1
11.	గకారాది నామములు	24
12.	చకారాది నామములు	29
13.	ఛకారాది నామములు	1
14.	జకారాది నామములు	18
15.	డకారాది నామములు	2
16.	తకారాది నామములు	46
17.	దకారాది నామములు	38
18.	ధకారాది నామములు	14
19.	నకారాది నామములు	76
20.	పకారాది నామములు	82
21.	బకారాది నామములు	24
22.	భకారాది నామములు	36
23.	మకారాది నామములు	112
24.	యకారాది నామములు	13
25.	రేఫాది నామములు	38
26.	లకారాది నామములు	14
27.	వకారాది నామములు	79
28.	శకారాది నామములు	62
29.	షకారాది నామములు	5
30.	సకారాది నామములు	120
31.	హకారాది నామములు	11
32.	క్షకారాది నామములు	9
	మొత్తము	1000